# ఆంధ్ర దేశ సంస్థానాలు - సంగీత వాఙ్మయం

సి. విజయలక్ష్మి

పర్యవేక్షణ

డా. ముదిగొండ వీరభద్రయ్య

పిహెచ్.డి పట్టం కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి

సమర్పించిన సిద్ధాంతవ్యాసం

జూలై - 1997

Vijayalakshmi, Challa.
Ph.D. Student
Department of Telugu
University of Hyderabad
Hyderabad.

Dated : 17-7-1997

*This is to certify that I, Vijayalakshmi, Challa. have carried out the research embodied in the present thesis for the full period prescribed under Ph.D. ordinances of the University. My topic of the Ph.D. programme is* **"ANDHRA DESA SAMSTHANALU - SANGEETA VANGMAYAM."**

*I declare to the best of my knowledge that no part of this thesis was earlier submitted for the award of research degree of any University.*

C. Vijayalakshmi
Vijayalakshmi, Challa.

Regd. No. 94 HT PH 01

I/c Head of the Department

Signature of the Supervisor

Dean of the School 17/7/97

DEAN
SCHOOL OF HUMANITIES.
University of Hyderabad.
Hyderabad-500 134.

# కృతజ్ఞతలు

"ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము" అనే పుస్తకం ప్రస్తుతం నేను తీసుకున్న ఆంధ్ర దేశ సంస్థానాలు - సంగీత వాఙ్మయం అన్న అంశానికి ప్రేరణ. మా నాన్న గారు కీ.శే. చల్లా కృష్ణమూర్తి శాస్త్రిగారు సంగీతం మీద నాకు కలిగించిన అభిమానం కారణం. నా యీ పరిశోధనకు మా హైదరాబాదు విశ్వవిద్యాలయం అవకాశం కలిగించింది. అధ్యక్షులు, డీన్, ఆచార్య కె.కె. రంగనాథాచార్యులుగారు. ఆచార్య రవ్వా శ్రీహరిగారు, తెలుగు విభాగం అధ్యాపకులు నాకీ పరిశోధనకు అవకాశాన్ని కలిగించారు. మా యింట అమ్మా అక్కా చెల్లెళ్ళు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చారు. ఎంతో ఆత్మీయతతో సరైన మార్గాన్ని నిర్దేశిస్తూ పర్యవేక్షించారు మా గురువుగారు డా. ముదిగొండ వీరభద్రయ్యగారు. మొదటి నుండి సిద్ధాంతవ్యాసం పూర్తయ్యే వరకూ అన్ని విధాలా తగిన సలహాలిస్తూ సహకరించిన ఆత్మీయులు ఎస్.వి. ప్రసాద్‌గారు. ఫలానా విద్వాంసుని దగ్గర ఈ సమాచారం ఉంటుంది వెళ్ళి ప్రయత్నం చెయ్యమ్మా అని, ఏదైనా సందేహం వస్తే ఎంతో ఓర్పుతో సమాధానం ఇస్తూ ముందుకు సాగిపొమ్మని ఆశీర్వదించి ప్రోత్సాహపరిచేవారు మా నాన్నగారి స్నేహితులు, మాకు ఆప్తులు కొక్కొండ సుబ్రహ్మణ్యశర్మగారు. ఎంతో ఓరిమితో కంపోజింగ్ చేసారు ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్‌వారు.

విషయ సేకరణ కోసం ఎన్నో ప్రాంతాలను, ఎందరినో వ్యక్తులను దర్శించాను. అక్కడి వారు నన్ను ఆదరించి, తగిన సమయాన్ని కేటాయించి, తమ దగ్గరున్న అమూల్యమైన సమాచారాన్ని నాకందించి ఈ పరిశోధనకు తోడ్పడ్డారు. వారి పేర్లు ఇక్కడ ఇస్తున్నాను.

శ్రీయుతులు వి.ఎ.కె. రంగారావు మద్రాసు, టి. ఎస్. పార్థసారథి మద్రాసు, పట్రాయని సంగీతరావు మద్రాసు, కుసుమకుమారి మద్రాసు, పప్పు వేణుగోపాలరావు మద్రాసు, మానాంబుచావడి శేషయ్య విజయ నగరం, ద్వారం దుర్గాప్రసాద్ విజయనగరం, మండా మాణిక్యం విజయనగరం, పత్రి జయలక్ష్మి విజయనగరం, ఆర్.వి. జి.కె. రంగారావు బొబ్బిలిరాజా, తాతా పార్వతీశ్వర శాస్త్రి బొబ్బిలి, పీసపాటి నరసింహం రాముడి వలస, కీ.శే. కాట్రావులపల్లి వీరభద్రరావు విశాఖపట్టణం, వంకాయల నరసింహం విశాఖపట్నం, పంతుల గోపాలరావు విశాఖపట్టణం, ద్వారం భావనారాయణరావు విశాఖపట్టణం, పట్రాయని నారాయణమూర్తి విశాఖపట్టణం, ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్ర ఉద్యోగులు, పి. యస్. భట్ విజయవాడ, బాలాంత్రపు రజనీకాంతరావు విజయవాడ, కోలంక వెంకటరాజు తుని, నాగభూషణం విజయవాడ, దుడ్డు దక్షిణామూర్తి శాస్త్రి బాపట్ల, జగన్మోహిని బాపట్ల, భావనారాయణస్వామి గ్రంథాలయాధికారి పొన్నూరు, శ్రీపాద పినాకపాణి కర్నూలు, చంద్రమౌళి కర్నూలు, అవంత్స సోమసుందర్ పిఠాపురం, రేగిళ్ళ సుబ్బారావుగారు కుటుంబం, పిఠాపురం, కందాళ సోదరులు పిఠాపురం, పిఠాపురం సూర్యరాయాంధ్రగ్రంథాలయాధికారి, తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య ప్రాంగణ గ్రంథాలయం రాజమహేంద్రవరం, తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయం హైదరాబాదు, గౌతమి గ్రంథాలయం రాజమండ్రి, సుందరయ్య విజ్ఞానకేంద్రం గ్రంథాలయం వారు హైదరాబాదు, ఉందేకోడు రత్నయ్య మహబూబ్‌నగర్, ఆర్. శేషాద్రి వైద్య గద్వాల, పాటల పండరీనాథ్ గద్వాల, శ్రీమతి కుముద్వతి గద్వాల, మల్దకల్ గ్రామం సర్పంచ్, హనుమద్భక్తులు మల్దకల్, బి.ఎస్. శాస్త్రి హైదరాబాదు, జి. కృష్ణ హైదరాబాదు, డా. దాసు అచ్యుతరావు హైదరాబాదు, పిరాట్ల మహదేవ శాస్త్రి సోదరులు హైదరాబాదు, పిరాట్ల శంకరశాస్త్రి హైదరాబాదు, దుడ్డు సీతారామయ్య హైదరాబాదు, డా. పి. ఎస్. గోపాలకృష్ణ హైదరాబాదు, వేటపాలెం గ్రంథాలయం వారు, సరస్వతమ్మ కాళహస్తి, కాళహస్తి సంస్థానపాలకుల బంధువులు, రామమూర్తి కాళహస్తి, జయచంద్ర శాస్త్రి కార్వేటి నగరం, ఎస్. త్రివిక్రమరాజు కార్వేటినగరం.

ఇంకా ఎందరో ప్రత్యక్షంగా, పరోక్షంగా నా యీ పరిశోధనకు తోడ్పడ్డారు. వాళ్ళందరికీ పేరుపేరునా నా కృతజ్ఞతలు.

# ఉపక్రమణిక

ప్రస్తుత పరిశోధనాంశం ఆంధ్ర దేశ సంస్థానాలు - సంగీత వాఙ్మయం. ఆంధ్ర దేశ సంస్థానాల మీద ఎంతో వివరణాత్మకంగా వచ్చిన గ్రంథం ఆచార్య తూమాటి దొణప్పగారిది. కాని అందులో సంగీతాన్ని గురించిన విషయం వారు తీసుకున్న పరిధిలో లేదు. చాలా కొద్దిగా మాత్రమే అందులో ప్రస్తావించారు. అది ప్రేరణగా ఈ అంశం మీద విషయసేకరణ చేసి విశ్లేషించాలని సంకల్పం కలిగింది. ఈ సంగీత వాఙ్మయం అంతా అచ్చయింది కాదు. అచ్చయిన వాఙ్మయం కూడా కొంత గ్రంథరూపంలోనూ మరి కొంత సంకలనాలలోనూ ఇంకొంత సంగీతసంచికలలోనూ కనిపిస్తున్నది. కొంతభాగం కళాకారుల ప్రదర్శనల్లో మాత్రమే నిలిచి వుంది. వీటన్నిటినీ సేకరిస్తే తప్ప ఈ నా పరిశోధనావ్యాసం సిద్ధం చేసుకోడం కష్టం. ఈ కష్టాన్ని అధిగమించి ముప్పది నాల్గు మంది వాగ్గేయకారులను, వారు రాసిన కృతులు, కీర్తనలు మొదలైన రచనలను సేకరించి ఈ గ్రంథంలో వివరించాను. తీసుకున్న అంశం ప్రధానంగా వాఙ్మయసేవే అయినప్పటికీ ఆ వాఙ్మయాన్ని ఎందరో కళాకారులు తమ కళా ప్రదర్శనల ద్వారా బోధనల ద్వారా కాపాడారు కాబట్టి ప్రతి అధ్యాయంలోనూ రెండో భాగంలో ఈ కళాకారులకు సంబంధించిన విషయాన్ని కూడా వివరించాను.

ఇది ఒక రకంగా సాహిత్య చరిత్రలాగా సంగీత వాఙ్మయ చరిత్ర లాంటిది కాబట్టి చరిత్ర నిర్మాణ పద్ధతులను కొన్నింటిని అనుసరించాను. అవి ఇవి.

1. ఇతః పూర్వమే గ్రంథాలలో లభించిన సమాచారం,
2. కళాకారులపై వచ్చిన ప్రత్యేక సంచికలు, సావనీర్లు,
3. జీవిత కళాకారుల నుంచి రాబట్టిన సమాచారం,
4. ఆయా వాగ్గేయకారుల కుటుంబ సభ్యులు, మిత్రులు ఇచ్చిన ప్రామాణికమైన సమాచారం.

పై నాల్గవ అంశం కోసం బహుపట్టణాలు, గ్రామాలు తిరిగి నేను ఆయా పెద్దల నుంచి ఇంటర్వ్యూల ద్వారా రాబట్టిన సమాచారంలో కొంత ఈ గ్రంథానికి దాదాపు 15 అనుబంధాలుగా చేర్చాను. ఆ ఇంటర్వ్యూలలోని అనవసర విషయాలను తొలగించాను.

నేను తీసుకున్న అంశం కేవలం ఆంధ్రదేశ సంస్థానాలకు మాత్రమే పరిమితం. ఇక్కడి సంగీత వాఙ్మయాన్ని సాధ్యమైనంత వివరంగానే చర్చించాను.

కార్వేటినగరం, వెంకటగిరి, గద్వాల మొదలైన కొన్ని సంస్థానాల్లో వచ్చిన వాఙ్మయమంతా జావళి, భజన, పద వాఙ్మయానికి సంబంధించింది. కర్ణాటక శాస్త్రీయసంగీత కచేరీలలో చివరి భాగాలలో తిల్లానా, జావళీ, పదాలు, భజనలు ఉండటం ఒక ఆనవాయితీగా స్థిర పడింది. అందుచేత ఈ ప్రక్రియలను కూడా ఆయా సంస్థానాల సందర్భాల్లో స్వీకరించి వివరించాను.

కొందరి వాఙ్మయాన్ని గురించిన విశేషాలు అధికంగానూ మరికొందరి వాఙ్మయం గురించిన విశేషాలు అత్యల్పంగానూ లభించాయి. అత్యల్పంగా లభించిన వారి వాఙ్మయం యొక్క మరిన్ని విశేషాల కోసం అనేక ప్రదేశాలు తిరిగి చాలా మందిని, గ్రంథాలయాలను దర్శించాను. కొందరి విషయంలో లభించాయి. మరి కొందరి విషయంలో లభించలేదు.

ప్రతి అధ్యాయంలోనూ ఏ సంస్థాన వాఙ్మయాన్ని గురించి రాస్తున్నప్పుడు మొదటగా ఆ సంస్థానాన్ని గురించిన వివరాలు కూడా ఇచ్చాను. కొన్ని సంస్థానాల గురించి మాత్రం చాలా స్వల్పంగా సమాచారం ఇచ్చాను. కొన్ని సంస్థానాల్లో వాగ్గేయ కారులున్నారు. కానీ కళాకారులు లేరు. అందువల్ల అలాంటి సంస్థానాల గురించి రాస్తున్నప్పుడు రెండవ భాగం (కళాకారుల గురించి) రాయలేదు.

ఈ కృషి సమగ్రమని చెప్పడానికి కుదరదు కానీ ఆంధ్రదేశ సంస్థానాల చరిత్రలో ఒక పాయ అయిన సంగీత వాఙ్మయాన్ని గురించిన వివేచనలో ఇది తొలి గ్రంథం అని చెప్పవచ్చు.

# విషయ సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | ఉపోద్ఘాతం | 1-8 |
| 2. | విజయనగర సంస్థానం | 9-64 |

సంస్థానం - సంగీతం
ఆనంద గజపతి

**మొదటిభాగం**

**విజయనగర సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం**

దూర్వాసుల సూర్యనారాయణసోమయాజులు
తచ్చూరి సింగరాచార్యులు - పెదసింగరాచార్యులు
గాయకలోచనం
స్వరమంజరి
సంగీత సర్వార్థసారసంగ్రహము
గాయక పారిజాతము
ఆదిభట్ల నారాయణదాసు
దశవిధరాగనవతికుసుమమంజరి
దువ్వూరి జగన్నాథశర్మ - స్వరరాగసుధాకరము
పలుకూరి వెంకటరమణ

**రెండవ భాగం**

**సంస్థానంలోని కళాకారులు**

వీణ పెదగురురాయాచార్యులు
వీణ వెంకటరమణదాసు
కలిగొట్ల కామరాజుపంతులు
పొడుగు రామమూర్తి
నిరాఘాటం కృష్ణయ్య
కర్రి పద్మనాభస్వామి
పప్పు వెంకన్న
కవిరాయని లక్ష్మీనారాయణ
ద్వివేదుల లక్ష్మణ శాస్త్రి
ఉస్తాద్ మహబ్బత్ ఖాన్
ద్వారం వెంకటస్వామినాయుడు
కోలంక వెంకటరాజు
పేరి రామమూర్తి
వాసాపెదకామయ్య
వాసా వెంకటరామయ్య
అధస్సూచికలు

3. పీఠికాపుర సంస్థానం 65-95

మొదటి భాగం

పిఠాపుర సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం

మద్దిరాల వెంకటరాయకవి

ఏకాంత సేవావిలాసము

తుమరాడ సంగమేశ్వరశాస్త్రి

దాసరి లక్ష్మణస్వామి

మహేంద్రవాడ బాపన్నశాస్త్రి

హరిహరకృతి మంజరి

రెండవ భాగం

సంస్థానంలోని కళాకారులు

రేగిళ్ళ వారి వంశం

ఆమర్తి వేమన దొర

సరస్వతీగాన సభ

అధస్సూచికలు

4. వెంకటగిరి సంస్థానం 96-107

వెలుగోటి సర్వజ్ఞయాచేంద్ర భూపాలుడు - సభారంజని

మొదటి భాగం

సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం

తిరుపతి విద్యలనారాయణస్వామినాయుడు

అధస్సూచికలు

5. సాలూరు సంస్థానం 108-116

మొదటి భాగం

సంస్థానంలోని వాగ్గేయ కారులు - వాఙ్మయం

పత్రాయని సీతారామశాస్త్రి

అధస్సూచికలు

6. శ్రీకాళహస్తి సంస్థానం 117-123

మొదటి భాగం

సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం

మునిపల్లి సుబ్రహ్మణ్యకవి

కాళహస్తి వీరయ్య

అధస్సూచికలు

7. కార్వేటి నగర సంస్థానం 124-140

మొదటి భాగం

సంస్థానంలో వాగ్గేయకారులు - వాఙ్మయం

సారంగపాణి

గోవిందసామయ్య

యీసం రామకృష్ణ

**రెండవ భాగం**

**సంస్థాన కళాకారులు**

చెలుకూరి కృష్ణయ్య

అధస్సూచికలు

8. **బొబ్బిలి సంస్థానం** 141-151

**మొదటి భాగం**

**సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం**

గుమ్మలూరి వెంకటశాస్త్రి

పల్లవోల్లాసిని

జోస్యుల నారాయణ శాస్త్రి

**రెండవ భాగం**

**సంస్థానంలోని కళాకారులు**

వాసా వారి కుటుంబం

బొబ్బిలి కేశవయ్య

నందిగానం వెంకన్న

ఆకొండి నారాయణ శాస్త్రి

అధస్సూచికలు

9. **ముక్త్యాల సంస్థానం** 152-155

**మొదటి భాగం**

**సంస్థానంలోని వాగ్గేయ కారులు - వాఙ్మయం**

పిరాట్ల శంకరశాస్త్రి

అధస్సూచికలు

10. **వల్లూరు సంస్థానం** 156-160

**సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం**

దాసు శ్రీరాములు

11. **చల్లపల్లి సంస్థానం** 161-166

**మొదటి భాగం**

**సంస్థానంలో వాగ్గేయకారులు వాఙ్మయం**

గరికిపర్తి కోటయదేవర

శ్రీహరి నాగభూషణం

**రెండవ భాగం**

**ఆస్థానంలోని కళాకారులు**

పారుపల్లి రామకృష్ణయ్య పంతులు

12. పోలవరం సంస్థానం 167-168
సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం
కొచ్చెర్ల కోట రామరాజు
అధస్సూచికలు
13. గద్వాల సంస్థానం 169-182
మొదటి భాగం
సంస్థానంలో వాగ్గేయకారులు - వాఙ్మయం
కామసముద్రం అప్పలాచార్యులు
హనుమద్దాసు
పాటల రామన్న
వేపూరు హనుమద్దాసు
కె.వి.యస్.శాస్త్రి
రెండవ భాగం
సంస్థానంలోని కళాకారులు
పురాణం కనకయ్యశాస్త్రి
రాయచూరు అనంతశాస్త్రి
మిడతూరి సుబ్బారాయుడు
వెంకటాచలమయ్య సోదరులు
అలంపురం శ్రీనివాసులు
అధస్సూచికలు
14. ఆత్మకూరు సంస్థానం 183-185
మొదటి భాగం
సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం
మనుసాని వెంకటలక్ష్మమ్మ
అధస్సూచికలు
15. నూజివీడు సంస్థానం 186-188
వారణాసి రామసుబ్బయ్య 189-190
దుడ్డు సీతారామయ్య 190-192
అధస్సూచికలు
అనుబంధాలు - అపూర్వ రచనలు 193-200
అనుబంధం - I
ఆనందగజపతి వర్ణం
అనుబంధం - II
గాయక లోచనంలోని కీర్తనలు
అనుబంధం - III
జోస్యుల సూర్యనారాయణ శాస్త్రి వర్ణం

**అనుబంధం - IV**

పిరాట్ల శంకర శాస్త్రిగారి రచనలు

**అనుబంధం - V**

దాసు శ్రీరాములుగారి రచనలు

**అనుబంధం - VI** 201-206

కోలంక వెంకటరాజుగారి ఇంటర్వ్యూ

**అనుబంధం - VII** 207-208

ద్వారం భావనారాయణరావుగారి ఇంటర్వ్యూ

**అనుబంధం - VIII** 209-216

పట్రాయని సంగీతరావుగారి ఇంటర్వ్యూ

**అనుబంధం - IX** 217

వాసా హైమవతిగారి ఇంటర్వ్యూ

**అనుబంధం - X** 218

చిలకమర్రి లక్ష్మీనరసమ్మగారి ఇంటర్వ్యూ

**అనుబంధం - XI** 219

నాళం కామేశ్వరరావు గారి ఇంటర్వ్యూ

**అనుబంధం - XII** 220-221

పట్రాయని నారాయణమూర్తి గారి ఇంటర్వ్యూ

**అనుబంధం - XIII** 222-223

పీసపాటి నరసింహం గారి ఇంటర్వ్యూ

**అనుబంధం - XIV** 224-227


వి.ఎ.కె. రంగారావుగారి ఇంటర్వ్యూ

**అనుబంధం - XV** 228

కాళహస్తి రామమూర్తి గారి ఇంటర్వ్యూ

**ఆధార గ్రంథాలు** 229-232

# ఆంధ్ర దేశంలో సంగీత కళను ఆదరించిన ముఖ్య సంస్థానాలు.




సంస్థానాల్లో వచ్చిన సంగీత రచనలు.

అ. లక్షణగ్రంథాలు

ఆ. సంప్రదాయ సంగీత రచనలు

ఇ. కచేరీ సంప్రదాయరచనలు

ఈ. వాద్య సంబంధి

ఉ. భజన సంప్రదాయ రచనలు

ఊ. జావళులు, పదాలు.

# I. ఉపోద్ఘాతం

ఆదినుంచి భారతదేశంలో రాజకీయ పరిస్థితి ఏవిధంగా ఉన్నా కళలకు ఆదరణ కొరవడలేదు. ఒకరికంటే ఒకరు గొప్ప గొప్ప విద్వాంసులను తమ కొలువులో నిల్పుకోవాలనే స్పర్థలతో ప్రభువులు విద్వాంసులను ప్రత్యేకంగా పిలిపించి ఆదరించేవారు.

అంతేకాదు స్వయంగా సంగీతాభ్యాసం చెయ్యడం, సంగీత రచనలు చెయ్యడం రాజులు అవలంబించారు. వేల సంవత్సరాలకు పూర్వం నుండి మొదలైన కళారాధన మొన్న మొన్నటి సంస్థానాధిపతులు దాకా నిరంతర నదీ ప్రవాహంలా సాగుతూనే ఉంది.

క్రీ. పూ. 184 క్రీ. శ. 320 శాతవాహన రాజులకాలంలో ఆంధ్రుల సంగీతజ్ఞతకు జగ్గయ్యపేట, అమరావతి, లేపాక్షి, అజంతా మొదలైన ప్రదేశాలలో ఉన్న శిల్ప మూర్తులే తార్కాణం.

ఏకతంత్రవీణ మొదలు శతతంత్ర వీణ వరకూ శాతవాహన రాజుల కాలంలో ప్రచారంలో ఉన్నాయి.

"దేవవీణ, మానవవీణ అని రెండు రకాల వీణలున్నట్లు నాగార్జున శిల్పాల్లో కనిపిస్తుంది[1]. క్రీ. శ. ఆరవ శతాబ్దానికి చెందిన పల్లవరాజు మహేంద్రవర్మ గొప్ప వైణికుడు.

అతడు ఆంధ్రప్రాంతాన్ని విడిచి వెళ్ళేటప్పుడు కొంతమంది ఆంధ్రగాయక విద్వాంసులను దక్షిణాదికి తీసుకొని వెళ్ళాడు. మహేంద్రవర్మ సంగీత గురువు గాయనాచార్య రుద్రాచార్యుడు. రుద్రాచార్యుడు సంకీర్ణ జాతి తాళ భేదాలను కనిపెట్టాడు. పుదుక్కోటలోని 'కుడిమియమలై'లో ఉన్న శిఖరనాథ స్వామి దేవాలయం కొండ చరియ మీద చతుష్ప్రహార స్వరరాగాన్ని చెక్కించాడు.

అలాగే నాణాల మీద వీణను చెక్కించిన గొప్ప వైణికుడు మౌర్యగుప్తుడు. క్రీ. శ. 600-610లో గాంధర్వ విద్యా ప్రవీణ బిరుదాంకితుడు చాళుక్యభీముడు. క్రీ. శ. 920లో ప్రతాపశైలపచాళుక్య భీముడు సంగీత చూడామణి అనే గ్రంథాన్ని రచించాడు.

క్రీ. శ. 945-70 ప్రాంతంలో కవిగాయక కల్పతరువనే బిరుదు ధరించిన రాజా ఇమ్మడి అమ్మరాజు.

ఇక మధ్య యుగంలో

కాకతీయ సామ్రాజ్యంలో కాకతి రుద్రదేవుని (1188) కాలంలో పాల్కురికి సోమనాథ పండితుడు రుద్రదేవుని ఆస్థానంలో ఉండేవాడు.

అతని రచన అయిన పండితారాధ్య చరిత్రలో వీణ భేదాలు, సుషిరవాద్య భేదాలు, అవనద్ధవాద్య భేదాలు - మృదంగం, డోలు, తప్పెట వంటి వాటి నన్నింటి గురించి వివరించాడు. ఆ కాలంలోనే వీణావాద్య ప్రవీణులైన తిమ్మన లక్కనలకు 'వీణ' గృహనామం సార్థకమయ్యింది.

1160 ప్రాంతంలో సోమనార్యుడు 'స్వరరాగ సుధాకరమ'నే సంగీత గ్రంథాన్ని రచించాడు.

1198 ప్రాంతాల్లో గణపతి దేవుని ఆస్థాన విద్వాంసులు ఇద్దరుండేవారు. వారు సంగీత సాహిత్య కళానిధులు రంగరాజు, కేశవరావులు.

1131లో సోమేశ్వర భూపాలుడు మానసోల్లాసమనే సంగీత సంబంధ గ్రంథాన్ని రచించాడు. 1200-47 ప్రాంతంలో దేవగిరిని పరిపాలించిన ఆంధ్రేతరుడు శార్ఙదేవుడు రాసిన సంగీత లక్షణ గ్రంథం సంగీత రత్నాకరాన్ని ఇప్పటికీ లక్షణ గ్రంథంగా సంగీత లోకం ఉపయోగించుకుంటోంది.

ఈ సంగీత రత్నాకరానికి ఏడు వ్యాఖ్యానాలు వెలిసాయి. 1400-1500 ప్రాంతంలో చతురకల్లినాథుడు రాసిన కళానిధి వ్యాఖ్య ప్రసిద్ధి పొందింది.

క్రీ.శ. 9వ శతాబ్దంలో మొగలు కాందిశీకులు అరబ్బీ పార్శీ, భారతీయ సంగీత సంప్రదాయాలను మేళవించి ఈ సమ్మేళనంలో గానసంప్రదాయాల్ని తెచ్చారు. ఈ సంప్రదాయాలు అనేక మంది కళావేత్తలను, లక్షణకారులను ప్రభావితం చేసాయి. అమీర్ ఖుస్రూ అనే సంగీత విద్వాంసుడు అల్లా ఉద్దీన్ దర్బారులో గాయకుడు. సితార్, తబలా వాద్యాలను సృష్టించిన మేధావి ఇతడే. అదే విధంగా ఎన్నో రాగాలను తాళాలను కూడా వ్యాప్తిలోకి తెచ్చారు. భారతీయ సంగీత సంప్రదాయం ఎంతో ఉత్తమమైందని అమీర్ ఖుస్రూ చాటి చెప్పాడు.

ఒకప్పుడు అల్లావుద్దీన్ దక్కనుపై దండయాత్ర చేసాడు. ఆ సమయంలో కళావంతులను కొంతమందిని బందీలుగా తీసుకొని వెళ్ళి వాళ్లను ఆదరించాడు. అటువంటి కళావంతులలో గోపాల్ నాయక్ ఒకడు. ఇతడు యాదవరాజు. అల్లావుద్దీన్ ఇతనిని ఆస్థాన విద్వాంసునిగా నియమించుకున్నాడు. విద్వాంసుడైన గోపాలనాయక్ తన వృషభరాజాలకు మెడలో రాగవాచకాలై శ్రుతి శుద్ధంగా ధ్వనించే గంటలను కట్టాడు. ఇతడు వైణికుడు, రాగ ప్రబంధగాన నిష్ణాతుడు కూడా. ఆ కాలంలో "నాయక" అనే బిరుదు ఉత్తమ గాయకునికి తప్పనిసరిగా ఉండేది. గోపాలనాయక్‌కు 'చతుర్దండి' అని కూడా బిరుదుండేది.

"వీణా వాదన కోవిదేన విలసుల్లాస ప్రశంస శ్రియా
సారస్యాస్పద గాన మానవిధినా
సౌజన్య మానాత్మనాం నిత్యైశ్వర్యవికాసినా
నిరుపమాకారేణ కాంతాజనేనాయా
కూన సంగభూపతిలక: క్రీడన్ సదామోదతే.

ఎప్పుడూ వీణావాదన రసాస్వాదనంతో, నాట్య గానాలతోనూ ఆనందంగా కాలం గడిపే తాండవ కృష్ణమాచార్యులు ముమ్మడి భూపతికి సమకాలికుడు. సింహగిరి నరహరి వచన రచన చేసిన సంగీతవేత్త, కాకతి ప్రతాప రుద్రుని దర్శించి, అతనిని మెప్పించి అగ్రహారాలు, పెక్కు గ్రామాలు పొంది కృష్ణమాచార్యులు వాటి మీద ఆధిపత్యం వహించాడు. అగ్రామాలు, అగ్రహారాల మీద వచ్చిన ధనాన్ని తాను రాసిన రచనలను రాగి రేకుల మీద చెక్కించడానికి వినియోగించేవాడు. ఆకారణం చేత రాజాగ్రహానికి గురయ్యాడనీ, భక్తితో దేవుని ధ్యానించి కనకవర్షాన్ని కురిపించి దానితో ఋణ విముక్తుడయ్యాడనీ కథనం.

1330లో ప్రతాప రుద్ర మహారాజు సభలో శృంగార శేఖరుడు ఉండేవాడు. ఇతను గొప్ప సంగీత వేత్త. అభినయ భూషణ గ్రంథాన్ని రాసాడు. శేఖరుడు ఈ గ్రంథంలో రాగ రాగిణీ వర్గీకరణ చేసాడు.

1362-80 ప్రాంతంలో కొండవీటిని పరిపాలించిన రాజు అన వేమారెడ్డి. ఇతడు గాంధర్వ విద్యను పోషించాడు. 1375-1428లో ఆంధ్రరాజు మదనపాలుడు ఆనంద సంజీవని అనే సంగీత గ్రంథాన్ని రాశాడు. 130 తాళాలు - వాటి పేర్లు రాగ ప్రశంస, ప్రబంధాలు వీటన్నిటి గురించి ఆనంద సంజీవనిలో విశదీకరించాడు.

1423-46లో విజయ నగరం సంగీత శ్రీని ముత్యాల మండపంతో కళ్యాణ వేదిక మీద నిలిపి కర్పూర నీరాజనాలిచ్చింది. విజయనగర సామ్రాజ్య స్థాపనకు కారణభూతుడైన విద్యారణ్యస్వామి గొప్ప సంగీత కోవిదుడు. సంగీతసారమనే గ్రంథాన్ని రాశాడు. ఇమ్మడి దేవరాయుల ఆస్థానంలో శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరానికి వ్యాఖ్యానం రాసిన కల్లినాథుడు, సంగీత ముక్తావళి రాసిన దేవన భట్టు ఆస్థాన విద్వాంసులుగా ఉన్నారు.

1474లో భూపేంద్ర తిప్పభూపాలుడు ములబగలుకి రాజప్రతినిధిగా ఉన్నప్పుడు తాళదీపికను రచించాడు.

15వ శతాబ్దిలో మహావైణికశిఖామణి శ్రీకృష్ణదేవరాయులు సంగీతకళకు పెద్ద పీటాన్నే వేసాడు. సప్తస్వరాల స్తంభాన్ని నాట్య మండపంలో నిర్మించాడు. శ్రీకృష్ణదేవరాయుల వైణిక గురువు రాఘవేంద్రాచార్యులు. కర్ణాటక రాగాలను విభజించి క్రమ పద్ధతిలో పెట్టిన బండారు లక్ష్మీనారాయణ కృష్ణదేవరాయుల ఆస్థాన విద్వాంసుడు. సంగీత సూర్యోదయమనే లక్షణ గ్రంథాన్ని రచించి, ఈయన రాయలచే ఘనంగా సన్మానితుడయ్యాడు.

1550-65 ప్రాంతంలో అళియ రాయరాయుల మంత్రి రామామాత్యుడు "స్వరమేళ కళానిధి" గ్రంథాన్ని రాసాడు.

"సంగీత విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు మొట్టమొదట మాయామాళవగౌళరాగాన్ని పరిచయం చెయ్యడం, ఆరాగంలోనే సరళీ స్వరాదికాన్ని నేర్పించడాన్ని సూచించిన ప్రథమ లక్షణ కర్త ఈ రామా మాత్యుడే."

క్రీ. శ. 1565లో జరిగిన తళ్ళికోట లేదా రాక్షసితంగడి యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం నేల మట్టమయింది. హంపీతీరంలో సంగీతకళకు కళే తప్పిపోయింది. విజయనగర సామ్రాజ్యం వదలి సదాశివరాయులు, తిరుమల రాయులు చంద్రగిరికి వెళ్ళిపోయారు.

అప్పటి వరకూ విజయనగర ప్రభువుల ఆధిపత్యంలో ప్రతినిధులుగా, దండనాథులుగా ఉన్న నాయంకరులు తాము పాలించు ప్రాంతాలకు తామే అధిపతులుగా స్వతంత్రులై ఏలడం మొదలు పెట్టారు. విజయనగర రాజులకు దాసోహమ్మనడం మానేసారు. అలాంటి వారిలో తంజావూరు, మధుర, చెంజి, మైసూరు పాలకులున్నారు. దక్షిణాన వెలసిన తంజావూరు మొదలైన నగరాధిపతులు నిశ్చింతగా పరిపాలిస్తూ, భోగభాగ్యాలతో సంగీతాది కళలను ఆదరిస్తూ శ్రీ కృష్ణ దేవరాయులకు వారసులై నిలిచారు.

1650లో తంజావూరు నాయకరాజు రఘునాథ నాయకుడు ప్రసిద్ధ సంగీత వేత్త, సంగీత సుధ, భరతసుధ అనే గ్రంథ ద్వయాన్ని రాసాడు.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం బహమనీ సుల్తానుల బాధలను భరించలేక విజయనగర ప్రభువును ఆశ్రయించుకొని ఉన్న విద్వాంసులందరూ అక్కడి నుండి తంజావూరు, మధుర, మైసూరు ప్రాంతాలకు తరలి వెళ్ళిపోయారు.

ఆకాలంలో భారతదేశంలో తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో ఇంచుమించుగా రాజకీయ సుస్థిరత్వం లేదు. కళాకారులంతా చెల్లాచెదురయ్యారు. రాజాశ్రయం కోసం కొంతమంది విద్వాంసులు ఆరాటపడితే, మరికొందరు కళాకారులు కళను కళగానే ఆరాధించి తద్వారా జీవన్ముక్తులయ్యారు. తంజావూరు

ప్రాంతాన్ని పరిపాలించే నాయకులు తెలుగువారు. సంగీతాది కళలకు పునరుజ్జీవనం కల్గించింది తంజావూరు నాయకరాజులే.

తంజావూరు నేలిన మొదటి నాయకరాజు చెవ్వప్ప సంగీత మహాలును కట్టించాడు. ఆ మహాలు సంగీత ప్రమాణాలు తెలిసిన వారు కట్టారు. అలా నిర్మించినందు వల్ల ఆ మహాలులో గాయకుడు ఎంత తక్కువ శ్రుతిలో ఎంత నెమ్మదిగా పాడినా వాద్యకారుడు ఎంత నెమ్మదిగా వాయించినా వేలమంది ప్రజలు స్పష్టంగా వినే వీలుండేదిట. ఈ ప్రభువే కూచిపూడి నుండి వలస వెళ్ళిన నాట్య కారులను ఆదరించి, అచ్యుతపురాన్ని వారికి బహూకరించాడు. అదే నేటి మేరట్టూరు భరత నాట్య కేంద్రం. నాల్గవ నాయక ప్రభువు విజయరాఘవుడు క్షేత్రయ్యను పోషించాడు. వెంకటమఖి అనే సంగీత కారుని చేత 'చతుర్దండి ప్రకాశిక' అనే లక్షణ గ్రంథాన్ని రచింపజేసాడు. నేటి కర్ణాటక సంగీతానికి ఆధారభూతమైన 72 మేళకర్తలను నిర్ణయించినదితడే. వెంకటమఖి గీత, ప్రబంధ, ఠాయ ఆలాపనలలో చతురుడు కాబట్టి అతనికి చతుర్దండి అని బిరుదు ఇవ్వబడింది.

రఘునాథనాయకుడు అసమాన వీణాదురంధురుడు. జయంతసేన రాగాన్ని, రామానంద తాళాన్నీ సృష్టించాడు. వీణకు సుస్థిరమైన మెట్లను అమర్చినది రఘునాథ నాయకుడే. గోవింద దీక్షితులు ఇతని ఆస్థాన విద్వాంసుడు.

1684-1710లో ఛత్రపతి శివాజీ మనమడు శహాజీ మహారాజు త్యాగరాజ స్వామి పితామహుడైన గిరిరాజ కవిని ఆస్థాన గాయకునిగా ఆదరించాడు. తెలుగులో పల్లకీ సేవా ప్రబంధం అనే నృత్య నాటకాన్ని గిరిరాజుకవిచేత రచింప చేసాడు. శహాజీ మహారాజు వంశస్థులే త్యాగరాజ స్వామి తండ్రి రామబ్రహ్మానికి భూమీ, ఇల్లు ఇచ్చి పౌరాణికునిగా గౌరవించారు. తుక్కాజీ మహారాజు వెయ్యి గీతాలు రాసిన పైడాల గురుమూర్తి శాస్త్రి గారిని పోషించి, పల్లకిని కూడా బహూకరించాడు. వర్ణరచనా ప్రథమ చక్రవర్తి పచ్చిమిరియం ఆది అప్పయ్యను ప్రతాపసింహుడు, తులజాజీ మహారాజులు పోషించారు. తులజాజీ మహారాజు సంగీత సారామృతమనే గ్రంథాన్ని రచించాడు.

శరభోజి మహారాజు ఆస్థాన విద్వాంసునిగ పల్లవి గోపాలయ్య పోషితుడు. శరభోజి మహారాజు ఆస్థానంలో పల్లవి గోపాలయ్యతోబాటూ ఇంకా 360 మంది గాయకులుండేవారు. మహారాజు ఒక్కొక్కరోజు ఒక్కొక్క గాయకునిచేత పాడించుకుని ఆనందించేవాడు. కృష్ణయ్య అనే విద్వాంసుడు మలయ మారుత రాగాన్ని పాడి మలయ మారుతాన్ని వీవింప చేసింది శరభోజి మహారాజాస్థానంలోనే. కృష్ణయ్యగారిని "చల్లగాలి కృష్ణయ్య"గా మహారాజు సన్మానించి గౌరవించాడు.

అలాగే బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీంఆదిల్‌షా ఆస్థానంలో 800 మంది గాయకులుండేవారు.

త్రివేంద్రం రాజు స్వాతి తిరునాళ్ గొప్ప నాయకుడే కాదు, కీర్తనలను రచించిన వాగ్గేయకారుడు కూడా. ఈయన వయొలిన్ వాద్య కారుడు వడివేలును పోషించాడు అంతేకాదు అతనికి బంగారు వయొలిన్‌ను బహుకరించాడు కూడా. వెన్నెల రాత్రులలో సముద్ర తీరాన వడివేలు వయొలిన్, మంత్రి సుబ్బారావు మృదంగం వాయిస్తూంటే స్వాతి తిరునాళ్ మహారాజు పాట పాడేవాడు.

బరోడా చక్రవర్తి ఎంతో మంది సంగీత విద్వాంసులను సన్మానించాడు. వీణశేషన్నను రాజవీధుల్లో పల్లకిలో ఊరేగించి సత్కరించేడు.

ఎట్టియా పురం ప్రభువు బాలస్వామి దీక్షితులనే విద్వాంసుణ్ణి పోషించాడు. కొత్త కోట సంస్థానంలో వీణ పెరుమాళ్ళయ్య ఒకే ఒకరాగాన్ని 21 రోజులు వీణ మీద వాయించగా ప్రభువు పదివేల రూపాయలిచ్చి సన్మానించేడు.

అలాగే మైసూరు మహారాజు పట్నం సుబ్రహ్మణ్యయ్యరుకు బంగారు తోడాలిచ్చి సత్కరించాడు. వయొలిన్ విద్వాంసుడు చౌడయ్య మైసూరు సంస్థానంలో ఆస్థాన విద్వాంసుడే. ప్రాంతీయ భేదం లేకుండా ఉత్తర, తూర్పు, దక్షిణాది విద్వాంసులందర్నీ ఆదరించి, సన్మానించి, కళాభిమానాన్ని నిరూపించుకున్నాడు మైసూరు మహారాజు.

ఈ విధంగా ప్రాచీన కాలంలో సామ్రాజ్యాధీశులు, ఆయా రాజ్యాలలోని సంగీత కారులు, లక్షణకారులు, వాగ్గేయ కారులు సంగీత కళను అభివృద్ధిలోకి తీసుకు వచ్చారు. సంగీతలక్ష్మి సర్వాలంకార భూషితగా విరాజిల్లింది.

## సంస్థానాల అవతరణ

ఆ తర్వాతి కాలంలో భారతదేశపు రాజకీయ పరిస్థితి అరాచకమైంది. ఒకవైపు ఓరుగల్లు సామ్రాజ్య పతనం, మరోదిక్కు విజయనగర సామ్రాజ్య పతనం, ఒకవైపు బహమనీసుల్తానుల సామ్రాజ్యాకాంక్ష ఆంధ్రదేశాన్ని రాజకీయ స్థిరత్వం లేని ప్రాంతంగా అస్తవ్యస్తస్థితిలో పడేశాయి.

తళ్ళికోట యుద్ధానంతరం విజయనగర సామ్రాజ్యం విచ్ఛిన్నమై పోయింది. ఆయుద్ధంలో విజయం పొందిన సుల్తానులు ఉత్తర ప్రాంతాన్ని భాగాలుగా విభజించి పంచుకున్నారు. అప్పట్లో గోల్కొండ సుల్తానుల అధీనంలో ఉన్న దక్కను ప్రాంతం మీద ఢిల్లీపాదుషా దృష్టిపడింది. ఔరంగజేబు 17వ శతాబ్దారంభంలో గోల్కొండను ముట్టడించాడు. అప్పుడు ఢిల్లీ పాదుషా సామ్రాజ్యంలో గోల్కొండ భాగమైపోయింది.

అప్పటికి ఆంధ్ర ప్రాంతం ఇంచుమించు అంతాకూడా గోల్కొండ, బీజాపూరు నవాబుల క్రింద వుండేది. ఢిల్లీ పాదుషా ప్రతినిధులుగా కొంతమంది గోలుకొండ విశాల సామ్రాజ్యాన్ని పాలించడం మొదలు పెట్టారు. ఆ తర్వాత మొగలు వంశం కుటుంబకలహాలతో కుటిల రాజనీతితో బలహీనమైంది.

దక్కను ప్రాంతాలలో ప్రతినిధులుగా ఉన్న సుబేదారులు సర్వస్వతంత్రులై పరిపాలించడం మొదలు పెట్టారు. వారు తమ అధీనంలో ఉన్న ప్రాంతాల మీద శిస్తు వసూలు చేసి ఇవ్వడానికి కొంతమందిని నియమించారు. వాళ్ళే ఇనాందార్లు, పాలెగాళ్ళు, జాగీర్లు.

ఈ చారిత్రక నేపథ్యంలో ఇనాందార్లు, పాలెగాళ్ళుగా ఉన్న వాళ్ళంతా భూమిశిస్తు రైతుల నుండి వసూలు చేసి, అవసరమైతే సైన్యాన్ని కూడా సహాయకంగా పంపిస్తూ నిజాం నవాబుకి విధేయులుగా మెలుగుతూ వారికి అణగిమణిగి ఉండేవారు.

ఆ విధంగా ఉన్న వారికి పెద్ద పెద్ద భూములను నిజాం ప్రభుత్వం ఇచ్చింది. ఆయినాందార్లు ఆయా భూముల మీద శిస్తు వసూలు చేసి తమ వాటా నిజాంకు చెల్లించి మిగిలినది తాముతీసుకునే విధంగా ఒక పద్ధతి ఉండేది. పన్ను వసూలు చేసి ఇవ్వడం తప్ప ఆ భూమ్మీద వారికి మరెటువంటి అధికారం, స్వతంత్రతా ఉండేవి కావు. ఒక్కొక్క ప్రాంతాన్ని మరికొన్ని భాగాలు చేసి వాటి మీద శిస్తు వసూలు చేసే పద్ధతిలో ఈ జాగీరుదార్లు మరికొంతమందికి ఇచ్చేవారు. అటువంటి వాళ్ళను మొఖాసాలుగా వ్యవహరించేవారు.

అలాగే విద్యావైజ్ఞానిక కళారంగాల్లో కృషి చేసిన వారికి ఆయా సంబంధ కార్య నిర్వహణార్థం కొన్ని భూములను బహుమానంగా ఇచ్చేవారు. అలాంటి గ్రహీతలను అగ్రహారీకులు అనేవారు. వీరంతా తర్వాత కొంతకాలానికి ఎవరికి వారే స్వతంత్రులై రాచరికపు వారసత్వంతో స్థానిక పాలకులుగా ప్రబలి, ఆయా సంస్థానాధిపతులుగా స్థిరపడ్డారు.

వారి పలుకుబడి, అజమాయిషీలను బట్టి తమ చుట్టు పట్ల ఉన్న వూళ్ళను సైతం తమ ఏలుబడిలోకి తెచ్చుకుని పెద్ద పెద్ద సంస్థానాలుగా మార్చి ప్రజలను పరిపాలించడం మొదలైంది.

ఆ సమయంలో వ్యాపార రీత్యా భారతదేశంలో అడుగు పెట్టిన బ్రిటిషువారు, అంతరంగిక కలహాలతో మగ్గిపోతున్న భారతదేశాన్ని పరిశీలించారు. తమ కుటిలరాజనీతితో దేశ పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని స్వదేశీ సంస్థానాల రాజకీయ వ్యవహారాల్లో జోక్యం కల్పించుకోడం మొదలు పెట్టారు. దేశీయ ప్రభువుల అంతః కలహాలు ఆంగ్లేయులకు ఎక్కువ సహాయ పడ్డాయి. తమ సేనలను ఒక పక్షానికి సహాయంగా పంపి, ఆపక్షం వారి చేత తమకు వలసిన కార్యాలను చేయించుకుంటూ సర్వం సహాధికారులుగా స్థిరపడటం మొదలు పెట్టారు ఆంగ్లేయులు. ముఖ్యంగా కోరమండల్ తీరంలోనూ ఉత్తర సర్కారు ప్రాంతంలోనూ ఈ ఆంగ్లేయుల దమననీతి ప్రభావం కనిపిస్తుంది. దీనికి దృష్టాంతం పద్మనాభ యుద్ధం.

నిజాం నవాబుకి, ఆంగ్లేయులకూ మధ్య ఆ విధంగా స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయి. అందువల్ల నిజాం ప్రభుత్వం సర్కారు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలను ఆంగ్లేయులకు కౌలుకిచ్చింది. ఇంగ్లీషు కుంఫిణీ తమ సన్నిహితులకు ఆ ప్రాంతాలను పంచి పెట్టారు. ఆయా ప్రాంతాలలో స్థాన బలం గల జమీందారులు, పాలకులు ఇంగ్లీషు వారి సంబంధీకులకు కప్పం కట్టి వారితో స్నేహంగా మెలిగేవారు. ఒక్కొక్కప్పుడు సంస్థానంలో జమీందారులు శిస్తు వసూలు చేయడంలో అసలు దానికంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేసేవారు. దాంతో పలుకుబడి స్వార్థ చింతనా ఇంకా ఎన్నో ఇతర అనర్థాలు ప్రజకూ పాలకులకు మధ్య చోటు చేసుకున్నాయి. ఆ సందర్భంలోనే జమీందారీ పద్ధతిని రద్దు చెయ్యాలనే ఉద్యమం తలెత్తింది.

జమీందారులు రైతులనుండి ఎక్కువ శిస్తు వసూలు చేస్తూ రైతు ధనాన్ని / ప్రజాధనాన్ని వాళ్ళకు ఖర్చు పెట్టకుండా దుర్వ్యయం చేయడం, పరాయి వానికి కట్ట బెట్టడం వీరికి పరిపాటయ్యింది.

'ఇంటికి జ్యేష్టాదేవి పొరుగుకు లక్ష్మీదేవి' అన్న సామెత నిజం చేసారు ఈ జమీందారులు సంస్థానాధీశులూను.

అటువంటి జమీందారీ విధానాల మీద ఆ విధానం గురించి స్వామీ సహజానంద ఇలా రాసారు. "జమీందారీ విధానం పాచి పీనుగు లాంటిది. దానిని దగ్ధం చేయనంత వరకూ దాని నుండి ఎడతెగకుండా దుర్వాసన వస్తూనే ఉంటుంది. వ్యాధులు వస్తూనే ఉంటాయి. కనుక మన ప్రథమ కర్తవ్యం దానిని తుద ముట్టించుటే. స్వరాజ్యం వస్తే వాటంతటవే సమసిపోతవనేవి మనకు కళ్ళల్లో తాల్చిన దుమ్ముకొట్టడమన్న మాట... స్వరాజ్యం వచ్చింతర్వాత కూడా జమీందార్లు, షాహుకార్లు, పెట్టుబడి దార్లు వుంటే స్వరాజ్యం బీదలకు ఒకదమ్మిడికి కూడా పనికి రాదు. జమీందార్లకే కాక వారి నౌకర్లకూ, చాకర్లకూ కూడా ధాన్యం, కూరగాయలు, కోళ్ళు, కొక్కిరాయులు, పెరుగు, నెయ్యి, గొర్రెలు, గుడ్లు, గోచీ ఇంకా చెప్పజాలనివి అన్నీ ఇచ్చుకోవాలి."[2] నేడు జమీందారీ విధానం అంతం చెయ్యాలంటే అర్థం రైతులకూ ప్రభుత్వానికి మధ్య, రైతులనుండి పన్ను వసూలు చేసి కొంత తాము మింగి కొంత ప్రభుత్వానికిచ్చే దళారులు పోవాలన్న మాట.

ఈ విధంగా ఆధునిక యుగంలో పాలకులకీ పాలితులకీ మధ్య సంబంధాలు ఇప్పటికీ అంటీ అంటనట్లే ఉన్నాయని స్పష్టంగా తెలుస్తోంది.

అయినా ఒకవైపు నుంచి మాత్రమే ఆలోచించిన తీరు వాస్తవంకాదుకదా! నాణానికి రెండువైపులున్నట్లు మంచి చెడులనేవి తరచి చూస్తే తప్పకుండా కనిపిస్తాయి. స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించుకుని పాలకులుగా స్థిరపడిన సంస్థానాధిపతులు కొన్ని మంచి పనులేచేశారు. వాటిలో కళాపోషణ ఒకటి.

మహమ్మదీయుల పరిపాలనా కాలంలో ఆంధ్ర దేశంలో కొంతకాలం సాంఘిక రాజకీయ పరిస్థితులు చిన్నాభిన్నం కావడంతో కళల గురించి పట్టించుకున్న వారు లేరు. ఏ క్షణంలో ఏ ఉపద్రవం వచ్చి పడుతుందోననే భయం తప్ప మరి కళా రసాస్వాదనకు ఆనాడు అవకాశమే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో తూర్పు ప్రాంతాల్లో ఉన్న కొంతమంది సంగీత విద్వాంసులు, కళాకారులు తంజావూరు ప్రాంతాలకు వెళ్ళి పోయారు.

కొన్ని సంవత్సరాల వరకూ దక్షిణాది ప్రాంతాలైన తంజావూరుమొదలైన చోట్ల నుంచి సంగీతంగాని, ఇతర కళలుగానీ తూర్పు ప్రాంతాలైన పిఠాపురం, విజయనగరం మొదలైన ప్రాంతాలకు రాలేదు. అలాగే ఇక్కడివిద్వాంసులకు కొన్ని రాగాలే తెలియని పరిస్థితి కూడా ఉండేది.

ఒకప్పుడు విజయనగరం దర్బారులో వీణ ధనమ్మాళ్ అనే ఒక దక్షిణ ప్రాంతం వైణికురాలు వీణ వాయించింది. ఆ సందర్భంలో ఆమె వాయించే కీర్తన ఏమిటో అని ప్రభువు అడిగితే ఆస్థానంలోని విద్వాంసులు దీనికి సమాధానం సరిగా ఇవ్వలేక పోయారు. చివరికి ఆమెనే అడిగారు ప్రభువు. ఆమె "హంసధ్వనిరాగం - వాతాపి గణపతింభజే" అని సమాధానం యిచ్చింది. ఆరాగం అప్పుడే దక్షిణాది నుండి వెలుగులోకి వస్తున్నది.

ఎప్పుడో వలసవెళ్ళిన తెలుగు ప్రాంతపు తెలుగు విద్వాంసులు దక్షిణాదిన వెలిగించినవెలుగు రాగపు కిరణం అప్పుడప్పుడే తిరిగి తెలుగు ప్రాంతాన్ని ప్రవేశిస్తున్న సమయం అది.

అయితే ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. కర్ణాటకసంగీతం వ్యాపింప చేయడానికి కారకులు దక్షిణాది వారే. "చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవు" అన్నట్లు మనవాళ్ళు రూపుదిద్దిన కర్ణాటక సంగీతాన్ని ప్రామాణికం చేశారువాళ్ళు.

"అప్పట్లో గాయకులే తక్కువ. సంగీత గురువులసలే తక్కువ. ఉన్నవారిలోనయినా మనసు విప్పి చెప్పేవారూ తక్కువే. అసలు సంగీత విద్య మన తెలుగు దేశంలో వ్యాపించక పోడానికి, దేశీయులకీ విద్య అంటే అభిరుచి కలగక పోడానికి బాధ్యత అంతా ముమ్మాటికి మన సంగీత విద్వాంసులదే.

కవి, సంపన్నులనూ పద స్థలనూ వెతుక్కుంటూ వెళ్ళి ప్రజ్ఞ కనబరిచి వారిలో రసికత కలిగించే వాడు. గాయకుడు తన బాధ్యత విస్మరించడమే కాదు పాడండి వింటాం. ఆనందిస్తాం అని ప్రజలంటే ఏమిస్తావ్ అనడగటం పెట్టుకున్నాడు."[3] అందువల్లనే సంగీతం ఆస్వాదించే సుగుణం ఆంధ్ర ప్రాంతంలో అంతగా లేక పోయింది. కర్ణాటక సంగీతం కొత్తపుంతలు తొక్కినా ఆ విలువలు గమనించే వారే లేక పోయారు. క్షేత్రయ్య నాయకరాజులను వెతుక్కుంటూ వెళ్ళడానికి ఇది ఒక కారణం. "కర్ణాటక సంగీతం రూపు దిద్దిన వారు ఆంధ్రులైనా పోషించి యిప్పటికి దాన్ని అనుభవిస్తున్న వారు అరవలై పోయారు. 'చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవు' అన్నట్లయింది."[4]

కొంతమంది విద్వాంసులు మాత్రం రాజాస్థానాన్ని దర్శించడానికి ఇష్టపడక కళను కళగానే భావించి భగవదర్పితం చేశారు. నిరంతర సాధనలో వారు కాలక్షేపం చేసి తరించారు. మరికొంతమంది మాత్రం రాజస్తుతిగా కళను ఉపయోగిస్తూ పబ్బం గడుపుకున్నారు. ఇటువంటి స్థితిలో ఆముసుగు సంకెళ్ళ నుండి స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటూ సమాజంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంతరింపజేసుకోడానికి కళకు చాలా కాలం పట్టింది.

ఈ కళలు ఒక్కొక్క ప్రాంతంలో అక్కడి ఆచార సంప్రదాయాలను బట్టి ప్రభావితం అవుతూ ఉనికిని వ్యాపింపజేసుకున్నాయి. ఆ విధంగా కళ వ్యాపించడానికి అప్పటి నుండి ప్రభువులూ ప్రజలూ కూడా కారకులయ్యారు.

నిజానికి కళాభ్యాసానికి పరిసరాలేకొంత అధికంగా తోడ్పడతాయి. ఏకళఅయినా పరిసరాల ప్రభావంతోనే వ్యాపిస్తుంది. మానవుడు ఆ కళల సాన్నిహిత్యంతో సహకారంతో తన సమాజ పరిసరాల్ని ప్రతిబింబింప చేసుకుంటాడు. అలాగే కళాభ్యాసానికీ, వ్యాపింప చేయడానికి కొంత వాతావరణాన్ని మనిషి తానుగా సృష్టించుకుంటాడు. కళ, ఆచారం, సంప్రదాయం ఇలాంటివన్నీ సమాజంలో ఈ విధంగానే వ్యాపించాయి.

ఇలా వ్యాపించిన అంశాలను తన తర్వాతి వారు అనుసరిస్తూ వారసత్వంగా పొందినవాటికి మరికొన్ని మెరుగులు దిద్దుతూ నూతన సృష్టికి అవసరమయ్యే శక్తిని సంపాదించుకునే వాళ్ళు కొంతమంది మాత్రమే ఉంటారు. అలా కాకుండా యథాతథంగా పూర్వీకుల మార్గాన్ని అనుసరించే వాళ్ళు మరికొందరు.

కాబట్టేఎంతో మంది సంగీతాభ్యాసకులు, విద్వాంసులు ఉన్నాగానీ అందులో కొంతమంది మాత్రమే నూతన సృష్టి చేసి వాగ్గేయకారులుగా రాణించగలిగేరు. పూర్వ కాలంలో ప్రజలకు రాజంటే గౌరవాభిమానాలు ఉండేది. శుభకార్యం ఏదైనా వస్తే ఆ సందర్భంలో రాజునూ సమీపంలో ఉండే జీవనదులను గురించి వీణమీద గానం చెయ్యమని ఆపస్తంబ మహర్షి నిర్ణయించాడు.

ఈ నేపథ్యంలో రాజుకు కళాభిమానం తప్పనిసరిగా ఉండేదని అర్థమవుతోంది. తమ పూర్వీకుల అభిమతాన్ననుసరించి కళావాఙ్మయాన్ని ఆదరించారు సంస్థానాధిపతులు. మరికొంత మంది అధిపతులు సంగీత గ్రంథరచన చేశారు.

ఏ కృతి రచనా చేయకపోయినా సంగీతం మీదుండే అభిమానం వల్ల సంగీత కళా కోవిదులను, విద్వాంసులను ఆహ్వానించి వారిని తమ ఆస్థానంలో విద్వన్మణులుగా గౌరవించారు మరికొంతమంది సంస్థానాధిపతులు. ఆ విధంగా సంగీత కళా వ్యాప్తికీ అస్తిత్వానికీ తమ వంతు కృషి చేశారు. ఆంధ్రదేశంలోని ఆనాటి సంస్థానాలను పరిశీలిస్తే కొన్ని సంస్థానాలలో వాఙ్మయసృష్టి జరగలేదు. కాని విద్వాంసుల పోషణ జరిగింది.

ప్రస్తుత పరిశోధనాంశం "ఆంధ్రదేశ సంస్థానాలు - సంగీత వాఙ్మయం"

సంగీతవాఙ్మయ సృష్టి చేసిన విద్వాంసులతో బాటూ ఆ విద్వాంసుల రచనలను విద్వత్సభలలో ప్రదర్శిస్తూ వాఙ్మయ పరిరక్షణ చేసి, ఆస్థానాలలో వెలిగిన విద్వాంసులను కూడా ఈ సిద్ధాంత వ్యాసంలో చేర్చితేగాని అంశం పరిపూర్ణత నొందదని భావిస్తున్నాను. అందువల్ల విద్వాంసుల గురించి ప్రతి అధ్యాయం యొక్క రెండవ భాగంలో రాశాను. సంస్థానాల చారిత్రక నేపథ్యం అంత ప్రాధాన్యం లేక పోవడం వల్ల ఇందులో సంక్షిప్తంగా ప్రస్తావించాను.

సంస్థానాల్లో ఆస్థానాల్లో ఉన్న వారినే కాకుండా పాలిత ప్రాంతాల్లో ఉన్న సంగీత సేవ చేసిన విద్వాంసులను కూడా ఈ సిద్ధాంతవ్యాసంలో చేర్చడమైనది.

## అధ సూచికలు


1. వేంకటనారాయణాచార్యులు, తిరుమల నల్లాన్ చక్రవర్తి, గాంధర్వ వేదామృతము, దేవనాగర, గుంటూరు - 1957, పుటలు - 81, 84.
2. వెంకట సుబ్బయ్య, గొట్టిపాటి. మనజమీందారీలు, దేశికవితా మండలి, ఘంటశాల - 1944. పుటలు - 78, 79.
3. సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీపాద. అనుభవాలూ జ్ఞాపకాలూను; (రెండవ భాగం) కళాభివర్ధిని పరిషత్తు, రాజమహేంద్రవరము - 1958, పుట - 33
4. " అదే " - పుట - 36

# 2. విజయనగరం సంస్థానం

చారిత్రకంగా గోదావరీ మహానదుల మధ్య ప్రాంతాన్ని కళింగదేశంగా పరిగణించారు. విజయనగరం జిల్లా కళింగప్రాంతంలో ఉంది. ఒకప్పుడు శాతవాహన బాదామి చాళుక్యుల, తూర్పుగాంగ, కాకతీయ, రెడ్డి మొదలైన సామంత రాజ్యాల్లో విజయనగరం జిల్లాలోని కొన్ని ప్రాంతాలు కలిసి ఉండేవి. తర్వాత గోల్కొండ నవాబు మొఘల్ ఫౌజిదారీల అధికారం ఈ ప్రాంతం మీద ఉండేది. ఈ ఫౌజిదారీల కాలంలోనే విజయనగరం, బొబ్బిలి సంస్థానాలుగా ఏర్పడ్డాయి. అంతకు ముందు జయపురం సంస్థానం కూడా ఈ విజయనగర ప్రాంతంలోనే విస్తరించి ఉండేది. సాలూరు,సంగమ వలస, పాచిపెంట, ఆంద్రవంటి చిన్న చిన్న సంస్థానాలను జయపురం సంస్థానం నిర్మించింది. మొదట్లో ఫ్రెంచి వర్తకుల ఆధిపత్యం ఈ ప్రాంతాల మీద ఉండేది. తర్వాత ఈస్టిండియా కంపెనీ ద్వారా ఆంగ్లేయులకు స్వాధీనమైంది.

ఉత్తర సర్కారు జిల్లాల్లో విజయనగర సంస్థానం ప్రముఖమైంది. 18వ శతాబ్దం వరకు అంటే 1757లో బొబ్బిలి యుద్ధం జరిగిన నాటి వరకూ విజయనగరం రాజకీయపు ఔన్నత్యం ఉన్నతంగా ఉండేది.

అప్పటివరకూ ఫ్రెంచివారు, ఆంగ్లేయులు, నిజాం ఎవరికి వారు ఉత్తరాన శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి మొదలైన ప్రాంతాలను ఆక్రమించుకుంటూ వ్యాపార స్థావరాలను, కోటలను ఏర్పరచుకుంటూ వచ్చారు. **1794** జూలై 10వ తేదీన ఈస్టిండియా కంపెనీ పై పూసపాటి చినవిజయ రామరాజు తిరుగుబాటు చేశాడు. ఆ యుద్ధమే పద్మనాభ యుద్ధం. ప్రభుభక్తి పరాయణులైన పూసపాటి విజయగోపాలరాజు, దాట్ల చినవెంకటపతిరాజు, భూపతిరాజు పద్మనాభరాజు, వత్సవాయి నరసరాజు మొదలైన చాలా మంది వీరులు ఆ యుద్ధంలో చినవిజయరామరాజుకు అండగా నిలిచారు. ఆ యుద్ధంలో నేలకొరిగిన చినవిజయరామరాజు భౌతికకాయం చుట్టూ వీరందరి మృతదేహాలతో ప్రహరీ కట్టారు.

విజయనగర సంస్థానాన్ని పూర్తిగా ఆక్రమించుకోవాలని తలంచిన కంపెనీ అప్పటికే ప్రజల్లో ఉన్న తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని అనుమానించింది. మద్రాసు బ్రిటీష్ గవర్నర్ సర్ చార్లెస్ వోక్లీ, లార్డ్ హోమ్‌బర్ట్లు చినవిజయరామరాజు కొడుకు 8 సంవత్సరాల నారాయణగజపతిని, సామరస్య పూర్వకంగా లేఖలు రాసి రప్పించి విజయనగరం కోటనుఅతనికి తిరిగి అప్పగించేశారు.

పూర్వం ఎంతో విశాలంగా ఉన్న ప్రాంతం, ముందున్న బలం అంతా యుద్ధంలో పోగొట్టుకున్న విజయనగర సంస్థానం రాజకీయ వ్యవహారాలలో తగు మాత్రంగా వ్యవహరిస్తూ అప్పటినుండి విద్యాకళారంగంగా వన్నెకెక్కింది. అంతవరకూ విజయనగర సంస్థానానికి లోబడివున్న సంస్థానాలన్నీ ప్రత్యేక సంస్థానాలుగా స్థిరపడ్డాయి. దరిమిలా విజయనగరం పూర్వపు రాజకీయపుఔన్నత్యం కోల్పోయింది. ఒక సామాన్య జమీందారీగా ఉండాల్సివచ్చింది. ఇలాంటి స్థితిని సరిపెట్టుకోలేక **1826 - 1879** ప్రాంతాల్లో పరిపాలనలోకి వచ్చిన నారాయణగజపతి తాను మరణించే వరకూ వారణాసిలోనే గడిపాడు.

అప్పటి ఇండియా గవర్నర్‌జనరల్ బెంటింక్‌ప్రభువు నారాయణగజపతిని ఎంతో ఆదరణతో చూసేవాడు. కాశీలో పుట్టిన నారాయణగజపతి కుమారుడు విజయరామగజపతి ఆర్ష సంస్కృతీ సంప్రదాయాలను జీర్ణం చేసుకున్నాడు. కవి, గాయకులతో సాంగత్యం ఏర్పరుచుకున్నాడు. ఆకారణంచేత **1854** నుండి సంస్థాన పరిపాలనా బాధ్యతలను స్వీకరించింది మొదలుగా విద్యా సాంస్కృతిక రంగాలలో ప్రోత్సాహాన్నిచ్చేడు విజయరామగజపతి.

## సంస్థానం - సంగీతం

ఆంధ్రదేశం ఉత్తర భాగం మరో విద్యల నగరంగా తయారు చేయడానికి విజయరామ గజపతి ఎంతో కృషి చేశాడు. ఆ కృషి ఆనందగజపతి హయాం (1879-1897)లో విజయనగర సంస్థానాన్ని కళల విషయంలో రాయల సామ్రాజ్యం లాంటి దాన్నిగా మార్చడానికి ప్రాతిపదిక అయ్యింది.

నారాయణ గజపతి కుమారుడు విజయరామ గజపతికి బాల్యంలో కాశీలోని కవి, గాయక, పండితుల సాన్నిహిత్యం లభించింది. విజయరామ గజపతిని బాలకృష్ణ భావే వంటి మహారాష్ట్ర సంగీత విద్వాంసులు గౌరవ పురస్కారకంగా సంభావించారు. విజయరామగజపతి గొప్ప వైణికుడు. "విజయరామగజపతి ఆస్థానంలోనే సంగీత, సాహిత్య అభినయాది కళల మర్మాలు తెలిసిన కిల్లంపూడిముత్యాలు అనే విద్వాంసుడు ఉండేవాడు."[1] తండ్రి అడుగు జాడల్లో నడిచి స్వముద్రతో ధీశాలి, కళాప్రియుడైన ఆనందగజపతిని ఆదిభట్ల నారాయణ దాసుగారు ఈ విధంగా అన్నారు.

"ఆనంద గజపతీంద్రుని
కేనరులున్ సాటి గాంచరీవిన్, శ్రీవిన్
గాన కవితా ప్రవీణత
ధీనయ బలరూప సంగతిన్ బిత్యభక్తిన్"[2]

నిజంగానే తండ్రిని మించిన తనయుడై విశ్వవిఖ్యాతి పొందాడు ఆనందగజపతి మహారాజా. ఆనంద గజపతి మహారాజాస్థానంలోని విద్వాంసుల గురించి, వారి విద్యావైదుష్యాల గురించి పుంభావ సరస్వతి ఆదిభట్ల నారాయణ దాసుగారు ఇలా రాశారు.

"ఆస్థాన విద్వాంసులలో నొకడు ఒక దినమంతయు మిగుల శ్రావ్యముగ సభాసదులౌరా యనునట్లు రాగము పాడగలడు. ఒకడు ఫిడేలు ప్రశస్తముగా వాయించును. మృదంగము సొగసుగ వాయించును. సభ్యులొనన మాటజాలును. ఒకడు ఫిడేలునందు, వీణయందు నిరుపమానముగా బల్లవి వాయించుచు జంత్రగాత్రముల కభేదముగా మిగుల రుచ్యముగా బాడును. మరియు నతనికి సంగీత సాహిత్యములు కరతలామలకములు. ఒకడు నిరుపమానముగా వీణ వాయించును. సొగసుగ కవిత్వము చెప్పును, గారడీ సాములో నేర్పరి, మంచి మాటకారి. ఒకడు పల్లవిలో జాతులు మార్చి స్వరము పాడుట యందు గొప్పవాడు, మరియు మృదంగ రాయుడు మరి యిద్దరు రుద్రవీణ వాద్యమున నిరుపమానులు. ఒకడు రుద్రవీణ యందు సమర్థుడు, ఇంకొకడు చితారునందును రుద్రవీణ యందును మిక్కిలి నిపుణుడు. గంధర్వుల మెప్పింప జాలు మహమ్మదీయుడు. నాటకములో పప్పు వెంకన్న వేయి కోయిలలు మోగునట్లొక మైలు వినబడునట్టి దివ్య శరీరముతో సభకామోదమొనర్చువాడు, అతడు వీణ కూడా కడురుచ్యముగా వాయించును. పెక్కేల విజయనగరమున సంగీత మెరుగని వారరుదు."[3]

ఒక్కొకరూ తాము నేర్చిన విద్యలో ప్రత్యేకత చూపే నేర్పుగలవారు. చతుష్షష్ఠికళలు లేకున్నా కళాకోవిదులు విజయనగరాస్థాన దర్బారులో వెలిగినట్లు నారాయణ దాసుగారు అభివర్ణించేరు. వారిలో కొంతమంది విద్వాంసుల గురించి, వారి ప్రతిభను గురించిన విశేషాలను ముందు ముందు వివరించడం జరుగుతుంది.

### ఆనందగజపతి

**(1850-97)** విజయనగర సంస్థానాన్ని ఏలిన ఆనందగజపతి సంగీత సాహిత్యవేత్తలకు ఆశ్రయమిచ్చి పోషించాడు. డ్యూక్ ఆఫ్ బకింగ్‌హామ్ వంటి పాశ్చాత్యుల చేత ప్రిన్స్ చార్మింగ్ (జగన్మోహనుని)గా పేరొందిన రాజా ఆనంద గజపతి.

గురజాడ అప్పారావుగారన్నట్లు "He is a great scholar he has attracted to his court literary stars of the first magnitude"[4] నిజంగా గొప్ప విద్యా కళావేత్త ఆనంద గజపతి మహారాజా. ఎంతో మంది విద్వాంసులు, కళాకారులు ఆకర్షితులయ్యారు. యత్రాకృతిః తత్రగుణాః అన్న వాక్యానికి ఆనంద గజపతి మహారాజే దృష్టాంతం. కళలకు కళలు రానానతి ఇచ్చేవాడు. అరవైనాలుగు కళలు వన్నెకెక్కేలా ప్రోత్సహించాడు. సంగీతం, సాహిత్యం ఇవేకాదు అశ్వారోహణ ఖేటాది కళల్లో ఆయన ప్రావీణ్యాన్ని సంపాదించాడు. ఆదరించాడు కూడా. సితార, వీణ వాయించే వాడు. కర్ణాటక హిందుస్థానీ సంగీతాల మేళవింపుగా ఆయా సంప్రదాయాలను మిళితం చేసి తన దర్బారులోని వీణ వెంకట రమణదాసు, దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులు మొదలైన విద్వాంసులను నేర్చుకోమని ప్రోత్సహించేడు. అంతేకాకుండా మహబత్‌ఖాన్, నిషావల్లీ అబీదుల్లా, మునవ్వర్ ఖానులను ఆస్థాన విద్వాంసులుగా ఆదరించాడు.

ఆనందగజపతి తెలుగులో ఎన్నో జావళీలు, స్వర జతులు, తానవర్ణాలు రాశారు. ధృపద్ ఖయాలు, తిల్లాన వంటి ఫణతుల్లో గొప్ప ప్రతిభ కలవాడు ఆనందగజపతి. పూనా, గాయక సమాజ్‌శాఖకు ఆయన ఆరువేల రూపాయలను బహుమానంగా ఇచ్చారు. ఆనందగజపతీంద్రుని పత్నీరత్నం వనకుమారీదేవి పేరున తచ్చూరి సింగరాచార్య సోదరులు రాసిన రచనలు రాజావారే ముద్రింపించారు. ఆనందగజపతి స్నేహశీలి. ఎంతో మంది ప్రజ్ఞాపాటవాలకు సానబెట్టే సానరాయి తానే అయి తానే తీర్పరిగా నిలబడిన మహామేధావి ఆనందగజపతి మహారాజా.

"పుస్తకాల నుండి రాబట్టిన జ్ఞానం వారిదైతే తనది లోకానుభవం నుండి సేకరించిన జీవనమధువు. అదలింపులు మందలింపులు ఏమీ లేకుండా స్నేహ సహకారాల్ని ఇచ్చేవారు. కాకపోతే ఆనంద గజపతికి కొంచెం అహంకారం కొసవెర్రిలాగా ఉండేది. అయితే అది రాజ్యాధిపత్యం వచ్చినందువల్లే కాక జన్మతః వచ్చింది కూడా."[5]

ఆనందగజపతికి లోకంలో అందరినీ ఆకర్షించే రూపం ఉంది. అలాగే పొంగి పోయేవాడు. కాని ఆ ఉబ్బడం దుర్గర్వంగా మారి పోలేదు. అందువల్లనే తన ఆస్థాన విద్వాంసుల జీవితాలు ఆయన జీవితం తోడి విడదీయలేని విధంగా ముడివేసుకుపోయాయి. అదే విధంగా ఆనందగజపతి మహారాజా వేశ్యల ఆత్మగౌరవాన్ని పెంచాలని భావించారు. దానికోసం కొంత కృషి కూడా చేశారు.

కేవలం కులవృత్తి మాత్రమే కాకుండా కుల విద్యలైన నాట్యం, సంగీతాలను కూడా బ్రతికిస్తూ కళావంతులుగా సంస్కృతిని పరి రక్షించే గురుతర బాధ్యత వహించారు ఈ వేశ్యలు. అయినా కులవృత్తికంటే కుల విద్యలో స్వతంత్రంగా జీవించ వచ్చనే విషయాన్ని కళావంతులు తెలుసుకోవాలి. కళాకారులుగా ఆత్మగౌరవాన్ని పెంపొందించుకోవాలి. అందుకోసం వారిని పెద్దలు ప్రోత్సహించాలి. ఒకప్పుడు దేవాలయంలో భగవంతునికి కైంకర్యంగా తాము నేర్చిన విద్యను ప్రదర్శించి ఎంతో గౌరవ ప్రదమైన స్థానాన్ని పొందారు ఈ దేవదాసీలు. అప్పటి సమాజం వారికా అవకాశాన్నిచ్చింది. రానురాను ఆ పరిస్థితులు విపరీత పరిణామాలకు దారితీయడంతో ఉన్నత విలువలను నిలబెట్టుకోలేని అవస్థ దేవదాసీలకు వచ్చింది. "అందుకోసమే ఆత్మగౌరవాన్ని కలిగించే లలిత కళలను నేర్చుకొమ్మని ఆనందగజపతి వేశ్యలను ప్రోత్సహించేరు"[6]

ఆనందగజపతి మహారాజా గురువు ఆస్థాన వైణికుడైన దూర్వాసులసూర్యనారాయణ సోమయాజులు మహారాజా సంగీత గోష్ఠులనుజరుపుతున్న సందర్భాల్లో సంగీత సంబంధమైన చిక్కు ప్రశ్నలు వేసేవారు."[7]

ఉదాహరణకు

సరిగమ పదనిస - సనిదపమగరిస ఆరోహణా అవరోహణలతో షట్కాలం చూపిస్తూ 35 తాళాలతో పూర్తి చేయమన్నారు. వీణవెంకటరమణదాసుగారు మాత్రమే ఆ ప్రయోగాన్ని చేసి చూపించారు.

"ఆ ప్రయోగాన్ని దూర్వాసుల శ్రీరామ శాస్త్రి, దక్షిణామూర్తిగార్ల ఎదుట తిరిగి ప్రదర్శించారు"[8] వీణ వెంకటరమణదాసుగారు.

ఆనంద గజపతి కాలంలో బహుళ ప్రోత్సాహం పొందిన సంగీత కళకు వారి వారసులు విజయరామ గజపతులు 1883 - 1922 ఒక సంస్థా రూపాన్ని కల్పించారు. ఆ రూపమే విజయనగరంలోని విజయరామ గాన పాఠశాల. అయితే ఈ కళాశాల నిర్మాణానికి వెనుక చిఱుచరిత్ర ఉంది.

విజయరామగజపతుల అంతరంగిక కార్యదర్శి చాగంటి జోగారావు పంతులుగారు ఒకాయన ఉండేవారు. వారి కుమారుడు గంగరాజు పుట్టుగుడ్డి. ఒక రోజు ఆ బాలుణ్ణి మహారాజు చూడటం తటస్థపడింది. ఆ చిన్నవాడు అంధత్వంతో ఎలా జీవనం సాగిస్తాడనే ఆలోచన ప్రభువును కలచి వేసింది. అతనికి ఒక ఆసరా కలిగించాలనే ఉద్దేశం ప్రప్రథమ సంగీత కల్పవృక్ష ప్రాదుర్భావానికి బీజారోపణ చేసింది. అదే విజయరామగాన పాఠశాల.

ఆస్థాన విద్వాంసులుగా ఎందరినో ఆదరించి సన్మానించిన విజయనగర సంస్థానాధిపతులు కళాశాలను నిర్మించి మరి కొంతమంది సంగీత విద్వాంసులను అధ్యాపకులుగా నియమించి వారసత్వ సంపదను కాపాడి ఖ్యాతి గాంచారు.

ఆనందగజపతి ఆస్థాన విద్వాంసులను ప్రోత్సాహపరచడమే కాకుండా తాను కూడా సంగీతకారుడై రచనలు చేశారు. ఎన్నో రచనల్లో కేవలం ఒకే ఒక తాన వర్ణం లభ్యమైంది. ధన్యాసిరాగం - ఖండజాతి అటతాళంలో ఈ వర్ణరచన చేశాడు. తచ్చూరి సింగరాచార్య సోదరులు రాసిన గాయక లోచనంలో దీన్ని ప్రచురించారు. ఈ వర్ణం సంస్కృత భాషలో రాయబడింది. అమ్మవారిని స్తుతించడం ఇందులోని వస్తువు. స్వరపరచిన దీన్ని యథాతథంగా అనుబంధంలో చేర్చడం జరుగుతుంది.(చూడు. అనుబంధం - I)

"దేవిత్వాం యదధిరనుపశ్యతి నాన్యత్పశ్యతి" అని మొదలయ్యే ఈ వర్ణంలో పల్లవి, అనుపల్లవులు పెద్ద పెద్ద పంక్తులు. చరణం మాత్రం "కైవల్యదాయినీ" అనే ఒక్క పదంతో ఉన్న ఏకపద వాక్యం.

తానవర్ణానికున్న లక్షణాన్ని బట్టి సాహిత్యానికి చాలా తక్కువ ప్రాధాన్యత ఉండి రాగ ప్రాధాన్యత ఎక్కువ ఉంటుంది. రాగాన్ని తానయుతంగాఆలపించడానికి ఎక్కువ వీలుంటుంది తానవర్ణ రచనలో. సంగీత ప్రపంచానికి ఇటువంటి తాన వర్ణాలు తలమానికాలే. తనసంస్థానాన్ని రెండవ భువన విజయంగా, కళల కాణాచిగా చేసిన ఆనంద గజపతి తాను మరో కృష్ణ దేవరాయులు అయ్యాడనడంలో సందేహం లేదు. బాల్యం నుండి కళల పట్ల, సంస్కృతిపట్ల అభిమానం ఆదరణ ఉన్న సంప్రదాయ బద్ధమైన వాతావరణంలో పెరిగాడు మహారాజు. అందువల్లనే ఇటువంటి రచనలు చేయడంలో ఎంతో సమర్థుడయ్యాడు.

# మొదటిభాగం
# విజయనగర సంస్థానంలోని
# వాగ్గేయకారులు - వాఙ్మయం

## దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులు (1842 - 1896)

72 మేళ కర్త రాగాల్లో విజయ నగర ప్రభువుల వీర చరిత్రను గేయ రూపంలో రచించిన 'రాజగురువు' దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులుగారు. ఈయన సాక్షాత్తు ఆనందగజపతికి వైణిక గురువు. చోడవరం మొఖాసాదార్ అయిన బ్రాహ్మణులు దూర్వాసుల వారి పూర్వీకులు. ఆనందగజపతికీ విజయ రామగజపతులకూ ఆస్థానంలో విద్వాంసుడు సూర్యనారాయణ సోమయాజీ. పెదగురురాయాచార్యుల వారికి ఇంచుమించుగా సమకాలికుడు. మహారాజులిద్దరూ దక్షిణాదిన చెన్న పట్టణం, ఉత్తరాదిన కాశీ, కలకత్తా మొదలైన ప్రాంతాలకు తమతోబాటుగా దూర్వాసుల సోమయాజులు గారిని, వీణ వెంకటరమణ దాసుగారిని తోడ్కొని వెళ్ళి, అక్కడి హిందూస్థానీ కర్ణాటక సంగీత పద్ధతులను తెలుసుకునేటట్లు చేసి ఆ సంప్రదాయాలకు మరింత వన్నె తెచ్చారు.

విజయరామగజపతికి వీణావాద్యం మీద అభిమానం ఉండటం వల్ల స్వతహాగా వైణికుడవడం మాత్రమే కాక తన కుమారులను వీణ నేర్చుకోమని సోమయాజులవారి దగ్గరకు పంపాడు. ఆనందగజపతికి సితారు వాద్యమంటే ఎక్కువ మక్కువ. ఆ కారణంచేత నిరాకరించారు. సితారు కంటే వీణ గొప్పదని, సితారు మీద వాయించే ప్రతి అంశాన్నీ వీణ మీద వాయించవచ్చని రాజు నచ్చచెప్పాడట. అయినా కుమారులు నిరాకరించారు. ఆ సందర్భంలో రాజు హిందుస్థానీ సంగీత విద్వాంసులైన మహబత్‌ఖాన్ అతని కుమారుడుమన్సూర్‌ఖాన్‌లను, సూర్యనారాయణ సోమయాజు గారిని పిలిపించి సితారు, వీణలనువాయించే పద్ధతిని పరీక్షించారు. సితారు మీద పలికించిన దంతయూ సామయాజులుగారు వీణ మీద వాయించి చూపించారు. వీణ మీద పలికించిన సంగతులను మహబ్బత్‌ఖాన్ సితార మీద వాయించలేకపోయాడు. అది చూసి, అప్పటి నుండి ఆనందగజపతి దూర్వాసుల సోమయాజుల వారి శిష్యుడై వీణ నభ్యసించాడు.

సోమయాజులుగారు పలు ప్రాంతాలను సందర్శించి వివిధ సంగీత సంప్రదాయాలను గ్రహించి వాటిని వీణపై పలికించి పాశ్చాత్య ప్రముఖుడైన ఎల్విన్ మెప్పు పొందారు. అలాంటిసదవకాశాన్ని కలిగించిన ప్రభువువిజయనగరం మహారాజే.

సోమయాజులుగారి సంగీత గురువులతని పితామహుడే. సోమయాజులుగారు "ఇటు చూడరా" ముఖారిరాగం; "ఎందుకీ తొందర - కాంభోజిరాగం", "నెరనమ్మినాను" - మోహనరాగాలలో ఆనంద గజపతి మీద స్వరజతులను రాసి అంకితమిచ్చేరు. కొంతకాలం దూర్వాసుల సోమయాజులుగారు, పెదగురు రాయాచార్యుల వద్ద కూడావీణ నేర్చుకున్నారు.

దూర్వాసులసూర్యనారాయణ సోమయాజులుగారి ప్రతిభకు మరో తార్కాణం - ఏడు సంస్థానాలకు సంబంధించిన సంగీత విద్వాంసుల సంగీత పోటీలో గెలుపొందడం, సన్మానించబడటం. "1891లో మద్రాసులో మైసూరు, పుదుక్కోట లాంటి సంస్థానాలు ఏడింటికి సంగీత పోటీ జరిగింది. పెద్ద పెద్ద సంస్థానాలైన మైసూరు వంటి సంస్థానాలను ముందు పెట్టి చిన్న సంస్థానంగా భావించి విజయనగర సంస్థానాన్ని చిట్ట చివర

పెట్టారు. దానికి ఆనందగజపతిమహారాజు చిన్న బుచ్చుకున్నారు. పోటీలో పాల్గొంటున్న దూర్వాసుల సోమయాజులుగారు మందహాసం చేస్తూ రాజుకి హామీ ఇచ్చారు.

ఆ పోటీలో కళ్యాణ, వసంతలతో ఇతర సంగీత సంప్రదాయాలన్నీ మేళవింప చేసి సోమయాజులు వాయించేరు. పోటీలో పాల్గొనే సమయం కేవలం 20 నిమిషాలే. కానీ సుమారు గంటన్నరకు పైగా వాయించారు సోమయాజులుగారు. ఆ ప్రదర్శనకు వచ్చిన దొరలు, దొరసానులు సోమయాజులు గారు వాయించే పాశ్చాత్య సంప్రదాయ రీతికి డ్యాన్స్ చెయ్యడం మొదలు పెట్టారు.[9]

ఆ పోటీలో సోమయాజులుగారు గెలుపొందినట్లుగా ప్రకటించి, వైస్రాయి ఎల్జిన్ ప్రభువు సర్టిఫికెట్ ఇచ్చారు. అది ఇప్పటికీ వారి మునిమనవరాలి ఇంట్లో ఉందని చెప్పారు "శొంఠి కాంతమ్మగారు."[10]

ఆ విధంగా తన ఆస్థాన విద్వాంసులను ఇతరప్రాంతాలకు పోటీలకు పంపించి ప్రోత్సహించే స్వభావం గలవాడు మహారాజు ఆనందగజపతి. మైసూరు దర్బారులో దూర్వాసుల సోమయాజులుగారు సన్మానాలు పొందారు. వారి వీణ గురించి, వారి గురించి దూర్వాసుల శ్రీరామశాస్త్రి గారు ఈ విధంగా చెప్పారు.

"వీణయుం, జేత బూని కడు విస్మయ ముప్పతిలంగ భైరవిన్

తానముమేళవించి యమృతంబును జిల్కెడు మిమ్ము జూచుచున్

గాణలు హూణులొక్క గతిగా నుతి జేసిరి గాని యంతలో

వీనుల పుణ్యమీ కరణి వీడెను గానము నస్తమించగా![11] అని సోమయాజులుగారు మరణించినప్పుడు చెప్పారు.

సోమయాజులు మూడు రోజులలో మరణిస్తారనగా ఆనందగజపతిమహారాజుఆయన దగ్గరకు వచ్చి ధైర్యం చెప్పి వెళ్ళారుట. ఇటువంటి ఆత్మీయతవారిద్దరిమధ్య ఉండేది. ఆనందగజపతి మహారాజు సోమయాజులుగారిని గురువుగా గొప్పవిద్వాంసునిగా మిత్రునిగా గౌరవించారు. సంగీతత్రయం రచనలు ఆంధ్రదేశంలో ప్రచారం కావడానికి సోమయాజులుగారు కారణభూతులు. వైణికుడైన సూర్యనారాయణ సోమయాజులుగారు చేసిన రచనలలో ఒకే ఒక్క రచన లభ్యమైంది. అది ఒక పదం. 72 మేళ కర్తరాగాలలో పూసపాటి వంశస్థుల దిగ్విజయాలను కృతులుగా రచించిన సోమయాజులు ఆనందగజపతిని ఉద్దేశించి ఆనందభైరవి రాగంలో మిశ్రచాపు తాళంలో ఈ పదం రాశారు. ఈ పదాన్ని బట్టి ఆనందగజపతి మహారాజు ఎంతో సరసుడుగా కనిపిస్తాడు.

పల్లవి : "ఎందుకీ తొందర - సుందరాకార నీ
పొందు గూడెద - తాళరా

అనుపల్లవి : సంధ్యవేళలో మావా - రందరు తెలివిగా
మందురిచ్చోటను - పొందు జరుగదు వేరే
మందిరంబునకే నేవచ్చెద - పందిరి కీల్ పట్టె మంచము
నందు రతి సుఖమొంద జేసెద - అందముగ కౌగిటను చేర్చి

1. చరణం : వెంటదిరుగకు రానీ - వెంటనే వచ్చెద
నంటే నమ్మవదేమిదా..."[12]

ఈ విధంగా ఉన్న శృంగార పదంలో మూడు చరణాలున్నాయి. పల్లవి కంటే అనుపల్లవి పెద్దది. ఈ

పదంలో శృంగార రసం తొణికిసలాడుతుంది. ఎందుకో తొందర పడుతున్నావు. సుందరుడా! కొంత తడవు ఓపికపట్టు. ఈ సంధ్య వేళప్పుడు మావాళ్ళందరూ తెలివితో మెలకువతో ఉంటారు. అయినా ఆ చోటున పొందు జరుగదు. వేరే మందిరానికి తప్పకుండా వస్తాను. పందిరి పట్టి మంచంలో ఆనందంతో అందంగా కౌగిట్లో చేరి సుఖాలనిస్తాను. అని అంటూ తానొకరి యిల్లాలినని తన వెంట పడే ప్రియుని వారిస్తూ అతనికి ఈ విధంగా నచ్చ చెబుతుంది. నా వెంటపడి తిరుగవద్దు. నా మాట నమ్ము! నీ వెనుక నేనే వస్తాను. నువ్వు రావడంతోనే చంటిపైన (పసిపాప పైన అని భావమేమో) చెయ్యివేసి సరసాలాడతావు. నా మెళ్ళో తాళికట్టిన నా మగడు చూస్తే లేనిపోని తంటాలు. కాబట్టి ఈ ఇంట్లో అటువంటి చిలిపి చేష్టలు మానుకో ! కోపం తెచ్చుకోకు అంటుంది. ఆ నాయకుడు అంతలో కోపం తెచ్చుకున్నట్లు ఆమె భావించి ఏమన్నానని అంతకోపం ఇదిగో ఘడియలో వచ్చి నీతో పడకటింట్లో కలుస్తాను అంటు ఆ కాంతామణి అతనిని వెళ్ళిపొమ్మంటుంది.

రెండో చరణంలో కొత్తగా పెళ్ళైన ఆడపిల్ల అత్తవారింట ఏ విధంగా ప్రవర్తిస్తే ఏమవుతుందో అనే విషయాన్ని వివరించిందా ముదిత. కొత్త కోడళ్ళు అత్తవారింట్లో మసలడమనేది కత్తులతో సాము చేసినట్లే. అందరి మనసుకూ హత్తుకొని ఉండాలి. ఒకవేళ ఏపాటి వెలితి వచ్చినా మగని దగ్గర చులకన అయిపోతుంది. అలా కాకుండా పూర్తిగా స్నేహ భావంతో సున్నితంగా మెలిగిందంటే ఆ పడతిని ఇంట్లో అందరూ "పెరికిది" అని జమకట్టేస్తారు. తిరుగుబోతులా తిరిగేదంటారు. ఆ రకంగా ఉన్నా ఆమెకు ఇంట్లో పెత్తనం దొరకదు. ఈ విషయాలు నాయిక తన ప్రియునితో చెప్తుంది.

మరి మూడో చరణంలో నాయకునికి పొందు అందించి ఇక వెడతానని, వెళ్ళలేక పోతున్నానని బాధాతప్తయై, మోహదాహతప్త అయిన ఆ వన్నెలాడి వ్యక్తం చేసిన మాటలు ఈ విధంగా ఉన్నాయి. రాజా! ఏ ఝామయిందోకదా! నేను వచ్చి. అయినా నిన్ను విడచి వెళ్ళలేను. నా మనసు బేజారయిపోయింది. అయినా భోజనం చేసే సమయం ఇది. ఇక వెళ్ళక తప్పదు. నాజతైన నా మగడు ఏమంటాడో ఏమో! ఆనందగజపతి మహారాజా! నిన్ను విడలేను. విద్యల భోజుడా! భోగభాగ్యశాలీ! పద రాజా! నిన్ను సంతోష పెడతాను ఓతేజో మూర్తీ! అని అంటుంది.

మోహనరూపుడైన ఆనందగజపతిని పేరుకు తగినట్లుగా ఉండే అతని నగుమోము చూస్తే ఏ కాంత ప్రేమించదూ! కామించదూ! అది మహారాజుకే చెల్లింది కాబట్టి సోమయాజులుగారు ఆ విధంగా ఆయనమీద పదం రాసి అంకితంగా ఇచ్చారు. ఈయన రాసిన రచనలలో ఇదొక్కపదమే పుస్తకగతమైంది.

## తచ్చూరి సింగరాచార్యులు - పెద సింగరాచార్యులు

కర్ణాటక సంగీతానికి భక్తిగానసంప్రదాయమనీ అభ్యాసగాన సంప్రదాయమనీ రెండు విభాగాలు. సంగీత త్రయం త్యాగయ్యగారు, దీక్షితులు, శ్యామశాస్త్రి వీరేకాక అన్నమాచార్య మొదలైన వారు భక్తితో తాముగా భగవంతుని స్తుతించడానికి మాత్రమే కీర్తనలు, కృతులూ చేశారు. శిష్యులకు బోధించడం తక్కువే. అయితే కీర్తనలు నేర్చుకోడానికి, నేర్చుకున్నది వల్లె వేసుకోడానికి కొంత సంగీత శాస్త్ర అభ్యాసం ఉండాలి. అందుకొక పద్ధతీ ఉండాలి. అలాంటి అభ్యాసగానానికి ప్రోది చేసిన వాగ్గేయకారుడు పురందరదాసు.

సరళీ స్వరాలు, జంటస్వరాలు, అలంకారాలు గీతాలు, స్వర పల్లవులు, స్వరజతులు, వర్ణాలు, కృతులు, కీర్తనలు ఈ విధమైన విభజనలో ఒక మెట్టు తర్వాత మరొక మెట్టు ఎక్కినట్లు ఒకదాని తర్వాత మరొకటి నేర్చుకోవాలి. ఆ పద్ధతిని మొట్టమొదట ప్రవేశపెట్టిన ఘనత పురందరదాసుకే దక్కుతుంది. ఆయన తర్వాత వచ్చిన వారిలో సంగీతాభ్యాసకులకు ఉపయోగపడే విధంగా శాస్త్ర లక్షణాలను క్రమబద్ధీకరించి పుస్తకరూపంలో మనకు అందించిన వారు ఉన్నారు. విజయనగర సంస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా

విరాజిల్లిన సోదరులు తచ్చూరి సింగరాచార్యులు, చిన సింగరాచార్యులు సంగీత లక్షణ గ్రంథాలను రాశారు. వీరు దక్షిణాది ప్రాంతాల నుండి ఆనందగజపతి మహారాజుచే ఆహ్వానితులు. ఆపస్తంబసూత్ర, కాశ్యపస గోత్రీకులు. వీరి తండ్రి నరసింహాచార్యులు. ఈ సోదరులు గాయకలోచనం, గాయక సిద్ధాంజనం, సంగీత సర్వార్థ సార సంగ్రహం, స్వర మంజరి మొదలైన గ్రంథాలు రాశారు. విజయనగర సంస్థానాధిపతుల సహకారం ప్రోత్సాహాలతో వీటిని ప్రచురించారు. వాటిలో లభ్యమైన లక్షణ లక్ష్యాత్మకంఅయిన గ్రంథాలను ఈ పరిశోధనలో విమర్శాపూర్వకంగా చేర్చడం జరిగింది.

## గాయకలోచనము

తచ్చూరి శింగరాచార్య సోదరకృతం "గాయకలోచనం" 1902లో సంగీత విద్యార్థులకు ఉపయోగపడటం కోసం వీరు రాశారు. విజయనగరం మహారాణిసాహేబుగారి సహాయంతో ప్రచురించారు. ఇది సంగీతాభ్యాసకులకు ఒక లక్షణ గ్రంథంగా వారందించారు. విజయనగర సంస్థానాధిపతి ఆనందగజపతి తన ఆస్థానంలో విద్వాంసులుగా వీరిరువురినీ నియమించుకున్నారు.

ఈ గాయకలోచన సంగీత గ్రంథంలో దేవతాస్తుతి మొట్ట మొదట చేశారు. శ్రీహరి, రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు. ఆ తర్వాత పురందరదాసు, నారాయణదాసు, క్షేత్రయ్య, జయదేవుడు, రామదాసు, బహువిధగీత ప్రబంధాలు రచించిన గురుమూర్తి శాస్త్రి, కామాక్షిని దర్శించిన ధన్యుడు శ్యామశాస్త్రి, అభినవ నారదుడైన త్యాగరాజులను విజయనగరాస్థాన విద్వాంసులగు వీణగురురాయువరుడు, చంద్రగిరి రంగగురువర్యుడు మొదలైన వారిని వినమ్రతతో సన్నుతి చేశారు.

ఆ తర్వాత "ఈ గ్రంథంలో ఉండే వివరాలను, విషయాలను నారదీయ, సోమనాథీయాలనుండి గ్రహించి కూర్చినట్లు చెప్పుకున్నారు."[13] గాయకలోచనం పూర్వభాగంలో సంగీతోత్పత్తి జరిగిందో సూచనగా వివరించారు. సంగీత ప్రకాశకులుగా పూర్వీకులను పేర్కొన్నారు.

"బ్రహ్మేశ నంది భరత దుర్గానారద కోహలా:
దశాస్యవాయురంభాద్యా స్సంగీతస్యప్రకాశకా:"[14]

అని వివరించారు. విష్ణు పురాణం, శివ సర్వస్వం వంటి పురాణాలలో సంగీత ప్రశంస ఏ విధంగా ఉన్నదీ చెప్పారు.

సంగీత శబ్దార్థం, సంగీత విభాగం, నాదప్రశంస నాదోత్పత్తి విభాగాలు ఇత్యాద్యంశాలు, శ్రుతి మొదలు స్వరాలు, మూర్ఛనలు,సప్తస్వర ధ్వనులు, జాతులు, ఏ అక్షరానికి ఏ జాతి వంశ అధిదేవత, ద్వీపం, వృక్షం, ఛందస్సులుంటాయో "పట్టిక రూపంలో శ్లోకాల రూపంలో"[15] అర్థమయ్యే విధంగా స్పష్టంగా వివరించారు. అంతేకాకుండా ఆయా స్వరాలకు భోజనం, వస్త్రం, విలేపనం, పుష్పం, అలంకారం, ఆయుధం, వాహనం, భార్య, దేహం మొదలైనవి ఏ స్వరానికి ఏమేముంటాయో వివరించారు.

ఉదాహరణకు

స్వరాక్షరం -స-జాతి-బ్రాహ్మణ వంశం - దేవ: అధిదేవత - అగ్ని:
ద్వీపం - జంబు: వృక్షం - మామిడి: ఛందస్సు - అనుష్టుప్

అంతకాకలీలు శూద్రజాతి

స్వరాక్షరం - ప - భోజనం - పెరుగన్నం: వస్త్రం - తెల్ల వస్త్రం: విలేపనం - కుంకుమ:
పుష్పం - జాజి: భూషణం - ముత్యం: ఆయుధం - కత్తి: వాహనం - హంస
భార్య - గంధర్వ స్త్రీ: దేహం - స్థూలం.

స్వరాక్షరాలకు ఇన్ని లక్షణాలుండాలనే నియమం భరతముని నాట్య శాస్త్రంలో కూడా పేర్కొన్నాడు. ఇవేగాక నియతశ్రుతులు వికృత స్వరాల పేర్లు వాటివిమర్శ, స్వర సంచార భేదాలు, స్వర ప్రస్తారక్రమం మొదలైన స్వరానికి సంబంధించిన అన్ని వివరాలు సంస్కృత శ్లోకం దాని క్రింద సులభగ్రాహ్యామైన సరళిలో తెలుగులోఅర్థం రాశారు. రాగ ప్రకరణంలో[16] రాగలక్షణం, విమర్శనం, రాగాలలో భేదాలు, వాటి అధిదేవతలు, కులం, వేదం, రసం, గుణం మొదలైన లక్షణాలు, శ్లోకాలుగా, పట్టీ రూపంలోనూ పేర్కొన్నారు.

ఉదాహరణకు

పురుషరాగాలు - భైరవి రాగానికి అధిదేవత - శివుడు, కులం - బ్రాహ్మణుడు, వేదం - సామవేదం, రసం - రౌద్రం, గుణం - రాజసం. అలాగే స్త్రీ రాగాలు దేవక్రియ,మేఘరంజి, కురంజి లాంటి కొన్ని రాగాలు అవి ఏయే రాగాలకు భార్యలో, అలాగే ఏయే రాగాలకు ఏయే రాగాలు దూతిరాగాలో, వాటికి ఏవి మిత్ర రాగాలవుతాయో ఏవి పుత్ర రాగాలో ఇటువంటి విషయం వివరణఅంతా "రాగ ప్రకరణంలో వివరించారు."[17] రాగాల ఛాయా స్వరాలు, రాగాలలో వచ్చే శ్రుతులూ పూర్తిగా రాశారు.

రాగరత్నాకరంలో 72 మేళ కర్త రాగాల జన్య జనక రాగాల ఆరోహణ, అవరోహణలు, మేళకర్తలుఅన్నీ ఇమిడి వుండే చక్రం, ఇవన్నీ స్పష్టపరిచారు. గాయకలోచనంలోని తాళ కల్పలతలో తాళ లక్షణాలు షోడశాంగాలకు పేర్లు, అంగ సంజ్ఞలు ఈవిధంగా ఉన్నాయి. నూటొక్క తాళాలు - వాటి సంజ్ఞలు, మాత్రతాళాలు మొత్తం చతుష్పంచాశత్తాళాలకు మాత్రా, సంజ్ఞ అన్నీ వివరణపూర్వకంగా ఇచ్చారు.

| | |
|---|---|
| మార్గ తాళాలైన చంచత్పుటానికి | 8813 |
| చాచపుటానికి | 8118 |
| షట్పితాపుత్రకానికి | 318813 |
| సంపద్వేష్టకానికి | 38883 |
| ఉద్ఘట్టం | 888 |
| ఆదితాళం | 1 |

ఈ విధమైన మార్గతాళాలతో సహా మాత్రలు సంజ్ఞలు పేర్కొన్నారు.

గాయక పారిజాతంలో ధ్రువాది సప్తతాళాలు, చతురశ్ర, మిశ్ర ఖండ సంకీర్ణాది జాతులతో 35 భేదాల్ని వాటి అంగ సంజ్ఞలు, మాత్రలతో సహా వివరించినందువల్ల ఆ వివరణలు ఈ పుస్తకంలో రాయలేదు.

ఆ తర్వాత చతురంగ ప్రస్తారం పథకం - ప్రస్తార క్రమంలో చతురస్ర, త్రిశ్ర, ఖండ జాతి ప్రస్తారక్రమ భేదాలు ఇంకా ఇతర భేదాలు పట్టికల్లో స్పష్టంగా వివరించారు. "గాన శాస్త్రంలో ఉన్న లక్షణసారమంతా పూర్వభాగంగా పేర్కొన్నారు."[18]

పూర్వ భాగంలో ఉన్న శాస్త్ర సంబంధ విషయాలు - గురుముఖతః కొంత నేర్చుకున్నపుడే అవి అవగతమౌతాయి. సంగీతకళ కొంతవరకూ సాధనచెయ్యాలన్నా ముమ్మందుగా గురువునుండి శాస్త్రగత విషయాన్ని తప్పనిసరిగా అధ్యయనం చెయ్యాలి. ప్రత్యేకించి సప్తస్వరాలు స్వరప్రస్తారం, గ్రహభేదాలు, రాగాలు, తాళప్రస్తారాలు ఇవన్నీ గురువు వద్దే అభ్యాసం చెయ్యాలి. స్వయంకృషితో నేర్చుకోదగినవి కొంతవరకూ అభ్యాసగాన పద్ధతిలో ఉన్న సరళీ స్వరాలు మొదలు కృతులు వరకూ సాధ్యం అవుతుంది.

తచ్చూరి వారు రాసిన గాయకలోచనంలోని ఉత్తరభాగంలో ప్రసిద్ధులు రాసిన రచనలు కనిపిస్తాయి.

ఉత్తర భాగంలో మొట్టమొదట విజయనగర సంస్థానాధిపతి ఆనందగజపతి మహారాజు రాసిన తానవర్ణంగా చెప్తున్న ధన్యాసిరాగంలోని తానవర్ణం స్వరసహితంగా ఉంది. ఖండజాతి అటతాళంలో సంస్కృత భాషలో రచించారు. ఈ వర్ణం గురించి ముందే వివరించడం జరిగింది."[19] తానవర్ణం అనేది సాధ్యం అవుతుంది.

తానవర్ణం అనేది ప్రధానంగా రాగాన్ని లయబద్ధమైన రీతిలో పాడటానికి ఎక్కువగా ఉపయోగపడే రీతిలో ఉంటుంది. రాగభావాన్ని విస్తృతంగా తెలుసుకునే వీలున్న రచన వర్ణం. అందువల్లనే సంగీతాభ్యాసకులు వర్ణాన్ని పదిమార్లు పాడితే స్వరకల్పన, రాగాలాపనా వస్తాయని గురువులు అంటారు. తానవర్ణాలు రచించిన వారు బహుకొద్దిమంది మాత్రమే.

ఆంధ్రదేశంలో కర్ణాటక సంగీతం ఈ విధంగా ఆరంభమైంది. గాత్రజ్ఞులు వీణ వాయిస్తూ పాడేవారు. సాధారణంగా సంగీత సంప్రదాయమంతా వైణిక సంప్రదాయంగానే పూర్వకాలంలోఉన్నట్లు కనిపిస్తుంది. త్యాగరాజ స్వామి వారి గురువుగారు శొంఠి వెంకటరమణయ్యగారు త్యాగరాజస్వామి మాతామహులు, వీణకాళహస్తయ్య, ముత్తు స్వామి దీక్షితులూ వారి తండ్రి రామస్వామి దీక్షితులు, ఇలా పేరు పొందిన విద్వాంసులంతా వీణ వాయిస్తూ పాట పాడిన విద్వాంసులే. "వీణ సాధకంలో గానీ నిశితమైన శ్రుతిజ్ఞానం కలగదని ప్రాచీనులు మతం"[20] ఆ విధంగా తంజావూరు, పరిసరప్రాంతాల నుంచి ఆ సంప్రదాయం విజయనగరం, బొబ్బిలి మొదలైన మన ప్రాంతాలకు వలసగావచ్చి స్థిరపడిపోయింది.తంబురా కంటే వీణలో శ్రుతి జ్ఞానం ఎక్కువ కలిగించే లక్షణం ఉంది. పూర్వం గాత్ర విద్వాంసులు కూడా పాడుతూవీణవాయించేవారు. ఈ విధమైన వీణా సంప్రదాయానికి మరికాస్త ప్రచారంవిస్తృతి కావాలని వీణకు సరిపడే స్వర సాహిత్య సమ్మేళనంతో రచనలు చేశారు వైణికులు. ఆ రచనలే తానం, స్వరజతులు మొదలైనవి. ఈ రచనల గురించి ఆయా సందర్భాల్లో వివరించడం జరుగుతుంది.

ఆ తర్వాత దీక్షితులు వారి కృతులు, నవగ్రహ కీర్తనలు, త్యాగరాజస్వామి వారి కృతులు కొన్ని. పంతువరాళి - అప్పరామ భక్తి యెంతో గొప్పరా -; ఆరగింపవే పాలారంగింపవే, తోడిరాగం; ఇందుకా యీతనువును బెంచిన - ముఖారి; ఇది సమయమురా ఇనకులతిలకా - ఛాయానాట; ఎవ్వరే రామయ్యా నీసరి - గాంగేయ భూషణి; కలిగి యుంటేకదా కల్గును కామిత ఫలదాయకా - వరుణ ప్రియ; రానిదిరాదు సురాసురులకైన -మణిరంగు; ఇలాగ 40 కృతులు కేవలం సాహిత్యమే రాశారు, స్వర సంయుతంగాలేవు - శేషయ్యంగారికృతులు 9 మాత్రమే రాశారు; మాతృభూతయ్యగారి కృతులు; విభయమున కవిదాతప్పలరీ జగతిలోన - కేదారగౌళ: ధర్మాత్ముల యొద్ద దుర్మార్గ జనములు తలలెత్తగా వలెనా: ఇంకా కాంభోజిరాగంలో రెండు కృతులు రాశారు. పల్లవి గోపాలయ్యగారికృతులు - కాంభోజి రాగం - రూపకం; హరిసర్వపరిపూర్ణసనకాది....', నాటకురంజి రాగం - ఆదితాళంలో నీదు మూర్తిని కనుగొని ...; తోడి రాగంలో అంబనాదు విన్నపము విని...; భైరవిరాగంలో రూపకం; మహాత్రిపుర సుందరి మనోన్మణీ; కళ్యాణి - ఆదితాళంలో నీదు చరణ పంకజములె గతియని; అలాగే కుప్పు సామయ్యగారి కృతులు మూడు,; దొరసామయ్యగారి కృతులు 3; వైకుంఠ శాస్త్రుల వారి కృతులు 3; కృష్ణశాస్త్రుల వారి కృతులు; తలగంబాడి పంచనదయ్యగారి కృతులు, మలయాళం కులశేఖర మహారాజుగారికృతులు; 12, వీణ కుప్పయ్యర్‌గారి కృతులు - 15 కంచి శేషయ్యగారి కృతి - 1 చేర్చారు.

ఈ గాయకలోచనంలో ఇంకా ఇతర వాగ్గేయకారుల రచనలతో బాటూ గ్రంథకర్త రచనలు శ్రీ వేంకటేశ పంచరత్న కృతులు కూడా ఉన్నాయి.

1. "శేషశైల వాసం భజేహం శ్రీనివాసమఖిల భక్తపోషం" – తోడి రాగం - ఆదితాళం।
2. "శేషాచల నాయకం భజేహం చింతిత ఫలదాయకం" – భైరవిరాగం - రూపకతాళం
3. శ్రీనివాసము ప్రభో మామవ శ్రీనివాస ప్రభో॥ – కాంభోజిరాగం - చాపు

4. శ్రీనివాస పాస్మహే కళ్యాణగుణ సేవధిం భజామహే" – శంకరాభరణ రాగం - త్రిపుట తాళం

5. శ్రీ వేంకటేశమనిశంభజేహం శ్రిత జాళీప్సదం సకలలోకేశం – కళ్యాణి - జంపె

ఇవి కాక బిలహరి, నాటకురంజి, సారంగ, ఆనందభైరవి మొదలైన ప్రసిద్ధ రాగాలలో భగవన్నుతులు, కృతులుగా రాసినవి ఉన్నాయి. పైన 5 కృతులను స్వరపరచలేదు. తరువాత కొన్నింటికి మాత్రమే చిట్ట స్వరాల్లా ఇచ్చారు. అన్ని కృతుల్లోనూ ముద్రగా 'శింగర హృదయ విహారం' శింగర పరిపాలం, శింగర వినుతం అని ఉపయోగించారు శింగరాచార్యసోదరులు. ఇక అజవంలోకృతులు కూడా ఉన్నాయి.

గ్రంథకర్త రాసిన జావళులు - దేవమనోహరి రాగం - చాపు తాళంలో

సామినెడ బాసినే నెట్లు సైరింతునే ॥ కోమలి శ్రీరాజగోపాలం"

మరుదురమున విరిశరములనేసెనే - సరసిజాక్షి

దే సమయము రమ్మనవే ॥

మరొక జావళి బ్యాగు రాగం - చాపుతాళంలో

వానిజోలి నాకేలే ఇందుముఖిరో - ఆ వనిత బోధనచే మైమఱచె॥ ఉన్నాయి.

ఇవికాక "శ్రీ రాజగోపాల' ముద్రతో 'శింగరినుతుడు' అనే ముద్రతో హిందుస్థానీ కాపీ, కమాసు, కేదారగౌళ, సురటి, హిందుస్థానీ భైరవి, జంఝూటి రాగాల్లో రాసినవి ఉన్నాయి. 36 జావళ్ళు తచ్చూరి వారు రాసినవి, ఇతరుల చేత రాయించబడిన జావళ్ళు 34, ఉత్సవ సంప్రదాయంబగు నామావళి, ధ్యాన శ్లోకాలు, నామావళి కీర్తనలు పూర్వోత్తర భాగాలుగా విభజించారు. ఉత్తర భాగంలో త్యాగరాజస్వామి కీర్తనలు ప్రకటించారు. ఇవన్నీ అప్పటి కాలంలో లోకవ్యవహారంలో కొంతవరకూ ప్రచారంలో ఉన్న కృతులుగా అనిపించేవిగా ఉన్నాయి.

ఈ గాయకలోచనం ప్రచురణ అయి ఇప్పటికి 95 సంవత్సరాలకు పైనే అయింది. బొబ్బిలి, విజయనగరంలో ఎక్కువగా ప్రచారంలో జావళ్ళు, జక్కిణ దరువులూ ఉన్నా మిగిలిన సంగీత రచనలను సంస్థానాల్లో ఉన్న విద్వాంసులు, మరి కొంత మంది, ఉన్న ఊరు వదలి బయటకువెళ్ళి ఎవరకి వారే సంగీతం నేర్చుకోవాలనే తపన ఉన్నవారుమాత్రమే నేర్చుకొని వచ్చిన కృతులుగా పేర్కొనవచ్చు. కవిత్వానికున్న ప్రచారం సంగీతానికి ఆరోజుల్లో అంతగా లేకపోవడం, సంస్థానాల్లో అందరికీ అవకాశం లేకపోవడం, సంగీతం అందరికీ నేర్పకపోవడం వంటి వాటికి కారణాలు అనేకం ఉన్నాయి. కర్ణాటక సంగీతం వ్యాపింపచేయడానికి కారకులు తమిళులు.

"చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవు అన్నట్లు, మన తెలుగు ప్రాంతం వాళ్ళు రూపుదిద్దిన కర్ణాటక సంగీతం ప్రామాణికం చేసినది తమిళులే. అప్పట్లో గాయకులే తక్కువ. సంగీత గురువులసలే తక్కువ. ఉన్న వాళ్ళలో అయినా మనసు విప్పి సంగీతం చెప్పేవారూ తక్కువే. "తెలుగు ప్రాంతంలో సంగీత విద్య వ్యాపించకపోవడానికీ దేశీయులకీ విద్య అంటే అభిరుచి కలగక పోవడానికీ, కారణం ముమ్మాటికీ బాధ్యతంతా మన సంగీత విద్వాంసులదే అంటారు. శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు"21 కవులు సంపన్నులనూ పదస్థులనూ వెతుక్కుంటూ వెళ్ళేవారు. వారెదురుగాప్రజ్ఞ కనబరిచి వారిలో రసికతకలిగించేవారు. గాయకుడు అలాకాదు. ఎవరైనావచ్చి తనను పాట పాడండి వింటాం, ఆనందిస్తాం అని ప్రజలు అడిగితే ఆ విద్వాంసుడు తన బాధ్యత విస్మరించి - ఏమిస్తావ్? అనడగడం మొదలెట్టాడు. ఆ విధంగా సంగీత కళకు విలువ దిగజారడం మొదలైంది. ఇక రాసిక్యం ఎక్కడుంటుంది! కర్ణాటక సంగీతాన్ని ఆదరించే ప్రభువులు అంతంత మాత్రంగా ఉండటంవల్ల ఆది కొత్త పుంతలు తొక్కినప్పుడు ఎవరూ ఆదరించలేదు. అందుకే క్షేత్రయ్య నాయకరాజుల దగ్గరకు వెళ్ళాడు.

కాబట్టి మన ఆంధ్రులు కర్ణాటక సంగీతానికి రూపు దిద్దిన వారైతే, యిప్పటికీ దాన్ని బాగా అనుభవిస్తున్న వారు తమిళులయ్యారు. ఏ బొబ్బిలి సంస్థానంలోనో విజయనగర సంస్థానంలోనో గాయకులు అప్పుడప్పుడు దేశంలో కచేరీలు జరిగే అలవాటు లేకో, తమ ప్రభువుల అనుమతి లేకో ఉన్న వూరువిడచేవారు కారు. అందువల్ల జనులకు సంగీతంలో కొత్త పోకడలు, సంగీతత్రయం రాసిన రచనలు ఏవి పఠన పాఠనాల్లోకి వస్తున్నాయో కూడా ఎవరికీ తెలిసేది కాదు. ఈ కారణాలు ఒకటి రెండు మాత్రమే కాదు ఎన్నో ఉన్నాయి. అందువల్లే అప్పుడు గాయకులచే ప్రకటితమైన అనేక స్వర పల్లవులు, వర్ణాలు, కృతులు కీర్తనలు జతి స్వరాలు, జక్కిణదరువులుఎన్నో రచనలు తగు మాత్రంగా అనోటా ఆనోటా ప్రచారం అయ్యాయి. మిగిలిన వాటి గురించైతే అవి సమస్య లేకుండా సమసి పోయాయి.

గాయకలోచనం వంటి పుస్తక రాజాల్లో ఉన్న కృతులు ఇప్పుడు విద్వాంసులకు పాఠంగా లేవు. మరికొద్ది రోజులైతే ఈ గ్రంథాలు ఉన్నాయని కూడా తెలియని విద్వాంసులు వస్తారు. తగు మాత్రంగా ఉన్న కృతులను యథాతథంగా అనుబంధంలోచేర్చాను. (చూడు : అనుబంధం-II)

## స్వరమంజరి

"మహారాజా విజయనగరాధిపతి ఆనందగజపతి ఆజ్ఞ ప్రకారంసంగీత విద్య అభ్యసించేవారికి ఉపయోగపడే సదుద్దేశంతో తచ్చూరి శింగరాచార్యులు, తచ్చూరు చిన్న శింగరాచార్యుల చేత ఏర్పరచబడినది 'స్వరమంజరి' అనే గ్రంథం.

ఇది మొట్ట మొదటి సంగీత గ్రంథం "The first Book in the Art of Music"[22] మాణిక్యవిలాసమనే ప్రచురణాలయం మద్రాసులో 13వ కూర్పుగా 1938లో తచ్చూరు నరసింహాచార్యుల చేతముద్రింపబడినది. గ్రంథ పీఠికలో స్వరమంజరి కూర్చడానికి కారణం స్పష్టపరిచారు రచయితలు. గాయక పారిజాతంలోని ఒకటిరెండు భాగాలు కొత్తగా సంగీతం నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు కఠినంగా ఉండడం వల్ల సాధారణంగా నేర్చుకునే రచనలు స్వరం నుండి గీతాలు మొదలైన వాటిని కూర్చారు. ఆదితాళం, ధ్రువం మొదలైన తాళాలకు ప్రత్యేకంగా సంజ్ఞలు ఏర్పరచి తాళ పథకంగా రూపొందించి ముద్రించిన ఈ పుస్తకానికి "స్వరమంజరి" అని పేరు పెట్టారు.

సంగీత విద్యాభ్యాసకులు తొలుతగా గురువును ధ్యానించి తర్వాత 'సరిగమ పదనిస సనిదపమగరిస' అనే ఈ స్వరాలను ఆరోహణావరోహణ గతిలో ఆదితాళంలో నాలుగు కాలాల్లో పాడాలి. ఆది తాళానికి సంజ్ఞలు ఒక లఘువు రెండు ద్రుతాలు, లఘువుకి గుర్తు 'I', ద్రుతానికి గుర్తు '0'. దీన్నే చతురశ్రజాతి త్రిపుట అని కూడా అంటారు. మాత్రలు రెట్టించడం వల్ల కాలాలు ఏర్పడతాయని వివరించారు. కాలపరిమితిలో "ఒక్కొక్క మాత్రను ఉచ్చరించడం చేత ప్రథమ కాలమని ఆ మాత్రనే ఉచ్చరించదగిన కాలంలో రెండు మాత్రలుపలికితే రెండవ కాలమని, నాలుగు మాత్రలు అదే కాలంలో పాడితే మూడవ కాలమని, ఎనిమిది మాత్రలు పలికితే నాల్గవ కాలమని స్పష్టంగా రాశారు."[23]

ప్రథమ కాలంలో ఆరోహణ అవరోహణలో రెండు ఆవృత్తాలు గలది మొదటి సరళీస్వరం. అదిరెండవ కాలంలో ఒక ఆ వృత్తమవుతుంది. మూడవ కాలంలో సగం ఆవృత్తమవుతుంది. కాబట్టి ఆవృత్తం పూర్తవడానికి మళ్ళీ మనం ఆ స్వరాన్ని పాడాలి. ఇదే విధంగా నాల్గవ కాలంలో నాలుగు సార్లు పాడితే ఆ ఆ వృత్తాలు పూర్తవుతాయి. ఈ విధంగా సప్త స్వరాల మొదటి సరళీ స్వరాన్ని నాలుగు కాలాలలో ఆదితాళంలో ఏ విధంగా నేర్చుకోవాలనే విషయాన్ని స్పష్టంగా వివరించారు. ఇలాంటి విషయం ఇంత విపులీకరణ ఏ ఇతర సంగీత శిక్షణా గ్రంథంలోనూ ఆ కాలంలో లేదనే చెప్పవచ్చు.

సప్త స్వరాలేమేమిటి - వాని సంజ్ఞలు

'షడ్జం' - 'స';గాంధారం - 'గ'; ఋషభం - 'రి'; మధ్యమం - 'మ' అనీ; అలాగే సప్త తాళాలకు వాటి సంజ్ఞలను ఇచ్చారు.

ధ్రువతాళానికి - l0 l l; మఠ్యతాళానికి - l0 l; రూపకానికి - 0 l; జంపెతాళానికి - lUl; త్రిపుటకు - l 0 0; అట తాళానికి - l l 0 0; ఏకతాళానికి - l - అని పేర్కొన్నారు.

తాళాంగాలు, పేర్లు, సంజ్ఞలు, అక్షర కాలాలు, తాళాలకు జాతులు ఇవన్నీ పట్టికలలో స్పష్టంగా తెలియచెప్పారు. "సంగీతాభ్యాసకులకు మొదట పరిచయం చేసే సప్త స్వరాలను సరళంగా చెప్పే పద్ధతిని వివరించారు. ఇక స్వరావళిని మాయామాళవగౌళ రాగంలో ప్రథమ కాలంలో ఎట్లా పాడాలనేది పట్టికలో వేశారు. రాసే పద్ధతి గమనిస్తే ఎలా పాడాలన్నది తెలుస్తుంది.

ఆరోహణ సా ,, రీ ,, గా ,, మా ,, పా ,, దా ,, నీ ,, సా

అవరోహణ సా ,, నీ ,, దా ,, పా ,, మా ,, గా ,, రీ ,, సా

అంటే క్రియకు నాలుగుఅక్షరాలు చేసి పాడాలి ప్రథమకాలంలో అలాగే రెండవ కాలంలో క్రియకు రెండక్షరాలు చేసి పాడాలి.

సరి గమ / పద నిస / సని దప / మగరిస /

అదే విధంగా మూడవ కాలంలో క్రియకు ఎనిమిది అక్షరాలు పాడాలి.

సరిగమపదనిస । సనిదప మగరిస

సరిగమపదనిస - సనిదపమగరిస

నాల్గవ కాలానికి క్రియకు 16 అక్షరాలు పాడాలి -

సరిగమపదనిస । సనిదపమగరిస । సరిగమపదనిస । సనిదపమగరిస

సరిగమపదనిస । సనిదపమగరిస । సరిగమపదనిస । సనిదపమగరిస

ఈ విధంగా పట్టీలు వేసి తక్కిన స్వరాలను కూడా ఇదే విధంగా పాడుకొమ్మని 12 సరళీ స్వరాలను రాసారు.

విద్యాభ్యాసంలో రెండో మెట్టు హెచ్చు స్థాయి స్వరాలు.

ఆరోహణ - సరిగమపదనిస వరకూ వచ్చి ఆ తర్వాత హెచ్చు స్థాయిలో 'సా' ని ఎనిమిది మారులు అన్న తర్వాత అవరోహణ భాగంలో దనిసరి ససరిస అని హెచ్చు స్థాయిలోనే రెండు మారులు పాడి అప్పుడు స్వరాన్ని అవరోహించాలి. ఇవి నాలుగు స్వరాలున్నాయి.

తర్వాతి మెట్టు జంట స్వరాలు -

సస రిరి గగ మమ । పప దద నిని సస ।

సస నిని దద పప । మమ గగ రిరి సస ।

అని స్వరాన్ని జంటగా అభ్యాసం చేయిస్తారు. సప్త స్వరాలను అవగాహన చేసుకొని ఆకళింపు చేసుకొనే ప్రయత్నంలోని భాగమే ఈ జంట స్వరాలు. తర్వాత అలంకారాలు. ఈ అలంకారాల ప్రత్యేకత. సప్త తాళాలకు లక్ష్యాలుగా స్వరాలను పేర్చడం వాటి వాటి అంగాలను సంజ్ఞలతో పట్టికలో తెలియచేశారు.

ఉదాహరణకు

అటతాళంలో సంజ్ఞలు - I I 0 0; లఘువుకి I అని; ద్రుతానికి 0 అనీ సంజ్ఞలు కాబట్టి అట తాళంలో రెండు లఘువులు రెండు ద్రుతాలు ఉంటాయి అని అర్థం. దెబ్బవేసి నాలుగు వేళ్ళు లెక్కపెట్టడం మళ్ళీ దెబ్బవేసి నాలుగు వేళ్ళు లెక్క పెట్టి, ఆపైన దెబ్బ, ఉసి, దెబ్బ ఉసి"గా తాళం వెయ్యాలి.

"సరీగా । సారిగా । మా మా ।

రిగామా । రీగమా । పా పా । ఈ విధంగా ఉంటుంది. ఇలా సప్త తాళాలకు అలంకారాలను ఇచ్చారు.

ఇక్కడి వరకు సప్త స్వరాలను విద్యార్థికి స్పష్టంగా అర్థమయ్యేటట్లు మాయామాళవగౌళ రాగంలో అలంకార రచనల వరకూ చెప్తారు. ఆ పిమ్మటి మెట్టు 'గీతాలు'.

స్వర జ్ఞానం, లయ జ్ఞానాలతో బాటూ సాహిత్య జ్ఞానాన్ని కలిగించడానికి ఇదే ఆరంభ రచన.

'స్వరమంజరి'లో పిళ్ళారీ గీతాలుగా చెప్పినవి - మలహరి రాగం - రూపకతాళంలో "శ్రీగణనాథ"

మలహరి రాగం - రూపకతాళం - 'కుందగౌర'; మలహరి రాగం - త్రిపుట తాళం "కెరయనీర"; మలహరి రాగం - త్రిపుట తాళం - 'పదుమనాభ'; శుద్ధ సావేరి రాగం - త్రిపుట తాళం - 'ఆనలేకర'; ఇవి భగవంతుని స్తుతులు.

తర్వాత గీతాలు : నాటరాగంలో ధ్రువ రూపకతాళంలో "అరేయానక దుంధుభి"; గౌళరాగంలో రూపకతాళంలో - "సకలసుర కిరీటి మణి"; ఆరభిరాగం - త్రిపుట తాళంలో "రేరే శ్రీ రామచంద్ర"; శ్రీరాగం - ధ్రువతాళంలో - "మీనాక్షీ జయ కామాక్షీ"; బౌళి రాగం - మఠ్యతాళం - "ధీరుతూ ఝురూసమరం"; ఆనందభైరవి - ధ్రువతాళంలో "పాహి శ్రీరామచంద్ర"; రీతిగౌళ - త్రిపుట తాళంలో - అరేవి; మోహన రాగం - రూపకతాళం - 'వరవీణామృదుపాణి'; బిలహరి - మఠ్యతాళం - "పాలయనాగేశ్వర"; తోడి రాగం - ధ్రువతాళం - "ఆరే దశరథరాజా"; శుద్ధ ధన్యాసి - ఏకతాళం - అతులితవైభవ"; కాంభోజిరాగం - ధ్రువతాళం - "భువనత్రయ మోహన వంశ"; సావేరి - రూపక తాళం - "జనకసుతా"; ఈ విధంగా మొత్తం 15 గీతాలను వివిధ రాగాలలో తాళాలలో పేర్కొన్నారు. గీతాలను ఎవరు రాశారనే విషయాన్ని ఎక్కడా తెలుపలేదు. ఇక ఈ గీతాల సాహిత్యంలోని వస్తువు రాముని గురించి, శ్రీహరిని గురించి, కృష్ణుని గురించి స్తుతి మాత్రమే, భక్తిరస ప్రధానంగా వుందీ సాహిత్యం.

'స్వరమంజరి'లో గీతాల తర్వాత 'స్వరజతులు'

మోహన, కాంభోజి, బిలహరి రాగాలలో స్వర సాహిత్యాలు గీతాల మాదిరిగానే ఇచ్చారు. స్వరజతిలోని సాహిత్యం శృంగార రసాత్మకంగా వుంది.

మోహనరాగం - ఆది తాళంలో "సామిదయ మీర చెలినేలు కోరా!

యీమోడి తగునేమరా చల మా ముమ్మాటికిని

భూమి వెలసిన శ్రీకరి వరదనేముమున నెరనమ్మిన దానను

ముదమొదవగ సరసకు బిలువర ...."[24] అని సాగుతుందీ రచన.

"ఇంతి చెలుల మేల్బంతి నడల చౌదంతి చనుల బంతుల

బిగువెంతని ॥ పంతగించి మంతుకెక్కు, కాంతుని చేతి దంతి

రాపరాకువలదుర ॥[25]

విరహంతో బాధననుభవిస్తూ, తనను మరుని కేళిలో తనివితీర కనికరము చూపుమని ఒకనాయిక తన నాయకుణ్ణి ప్రార్థించడం ఇందులోని భావం.

ఇక స్వరజతి లక్షణం ఈ విధంగా ఉంటుంది.

సంగీతాభ్యాసకులకు గీతాలతర్వాత నేర్పే మెట్టు స్వరజతి, స్వరజతిలో పల్లవి, అనుపల్లవి చరణం అనే మూడు భాగాలు అంగాలుగా ఉంటాయి. దైవస్తుతి, నాయికా నాయక భావాలు ఇందులోని వస్తువు. అభ్యాసగానానికి, నృత్యప్రదర్శనకు వీలుగా ఉండే స్వర జతులు ఉన్నాయి.

సాహిత్యం లేని స్వరాలుగా ఉన్న స్వరజతులు రెండు - కాంభోజిరాగం - రూపకతాళంలోను, బిలహరి రాగం - ఆదితాళంలోనూ స్వరమంజరిలో ఉన్నాయి. బిలహరి రాగంలో "రార వేణుగోపబాల" అనే సాహిత్యాక్షరాలకు కేవలం స్వరాలనే రాశారు. ఇటువంటి రచన మరెక్కడా లేదనే చెప్పాలి. స్వరమంజరిలో తర్వాతి మెట్టు "తానములు". నాట, గౌళ, ఆరభి, శ్రీరాగాలు, ఈ ఘనరాగాలలో తానాన్ని పరిచయం చేశారు ఈ తానం గురించిన నిర్వచనాలు ఈ విధంగా ఉన్నాయి.

"రాగాలాపనలోని రెండవ భాగమైన మధ్యమకాల గానమునకు పేరు";

స్వరముల విస్తరింపు లేక గుణించుట వలన యేర్పడు ఒక రకపు సంగీత విధానము[26]; "పునరుక్తి లేని స్వర సమూహానికి తానమని పేరు. ఏదేని రాగాన్ననుసరించి రక్తి కలిగేటట్లుగా పాడటాన్ని తానం అంటారు."[27] తాళంతో నిమిత్తం లేకపోయినా లయ మాత్రం వుంటుంది. సర్వేశ్వర నామోచ్చారణ అనంతానంతా అనే పదాల ఉచ్చారణ ఈ తానంలో కనిపిస్తుంది. తానం తత్తనం ఇటువంటి పదాలను సౌలభ్యం కోసం తానంలో ఉపయోగిస్తారు. ఇదీ ఒక లక్షణమే. స్వరమంజరి గ్రంథంలో రాసిన విధంగా ఘన రాగ తానాలను సాధన చేస్తే రాగం పూర్తిగా నోటబడుతుంది.

రాగ ప్రకరణంలో సప్తస్వరాలలో షడ్జపంచమాలుప్రకృతి స్వరాలని మిగిలినవి ప్రకృతి వికృతి స్వరాలుగా ఉంటాయిని ఆయా స్వరాలను వివరించారు.

ఉదాహరణలో

"రిషభం - శుద్ధం, చతుశ్రుతి; షట్శ్రుతి;గాంధారం - శుద్ధం, సాధారణం, అంతరం; మధ్యమం - శుద్ధం, ప్రతిమధ్యమం; ధైవతం - శుద్ధం, చతుశ్రృతి, షట్శ్రుతి;నిషాదం - శుద్ధం, కైశికి, కాకలి."[28] ఇవి మొత్తం 14 శ్రుతులు ఇచ్చారు. ప్రకృతి స్వరాలైన 'స' 'ప' లతో కలిసి మొత్తం 16 శ్రుతులను పేర్కొన్నారు.

ఇలా ప్రసారక్రమంలో 72 మేళ కర్త రాగాల భేదాలు ఏర్పడ్డాయి అందులో ఔడవషాడవ జన్య, జనక రాగాలు విభజన చేశారు. వాటి లక్షణాలు వివరించలేదు. "మేళకర్తరాగాలు అనేక రాగాలకు జనక రాగాలవడం వల్ల వాటిని మాత్రం పేర్కొని ఆయారాగాల స్వర స్థానాలను పట్టికలో వేశారు." అందులో హనుమత్తోడి, మాయామాళవగౌళ నఠభైరవి, ఖరహరప్రియ మొదలైన 8 రాగాలను జనకరాగాలుగా చెప్పారు. ఈ జనక రాగాలనుండి ఏయే రాగాలు వస్తాయో ఆజన్య రాగాలు వాటి ఆరోహణావరోహణలను పట్టికలో ఇచ్చారు.

ఇక అనుబంధంలో త్రిస్థాయులను గురించి ఎలా రాసుకోవాలో వివరించారు. అవిఎలా ఏర్పడుతాయో క్లుప్తంగా వివరించారు. తర్వాత తాళాలు గురించి వాటి అంగాలను సోదాహరించారు.

రాగ విషయంలో జన్య రాగాలకు 'అర్షప్రయోగాలుగా' పెద్దల చేత చెప్పబడుతున్న కొన్ని రాగాల లక్షణాలను ఎక్కడెక్కడ ఎలాస్వరాలు మారతాయో వివరించారు.

ఉదా : "భైరవిరాగంలో సరిగమపదనిస - సనిదపమగరిస అని సంపూర్ణంగా ఆరోహణ మందు అవరోహణంలో 'నిదమ' అన్నప్పుడు 'చ-ధ'తోనూవుంటుంది."29

'చ-ధ' అంటే చతుశ్రుతి ధైవతం అని అర్థం.

భైరవి రాగంలోని గీతంలో "పదనిని" "పదదనినిస - పదనిస" "నినిదమ - పదనిస" అనే చోట్ల - చతుశ్రుతి ధైవతం పలకాలి - మిగిలిన చోట్ల శుద్ధధైవతమే పాడాలి. రీతిగౌళ, ఆనందభైరవి, తోడి, బిలహరి మొదలైన రాగాలకు కూడా స్వరాల మార్పులు ఇచ్చారు. ఈ అనుబంధంతో 'స్వరమంజరి' పుస్తకం పూర్తి అవుతుంది - ఈ గ్రంథం 48 పుటలు కలది.

## సంగీత సర్వార్థ సార సంగ్రహము

విజయనగర సంస్థానంలో ఆస్థాన విద్వాంసులైన తచ్చూరి సింగరాచార్యులు, అళహ సింగరాచార్యులు కలసి తెలుగులో ప్రకటించిన30 మరో లక్ష్య లక్షణ సంగీత గ్రంథం సంగీత సర్వార్థసార సంగ్రహం. 'పాఠకుల క్రమం' అనే అంశంలో సంగీతాన్ని అభ్యసించే వారి లక్షణాలు పేర్కొన్నారు. సంస్కృత శ్లోకాలు దానికి తాత్పర్య రూపంలో ఇవి ఉన్నాయి. వాటి సారాంశం ఈ విధంగా వుంది.

"శిరఃకంపం లేనివాడు, అంగవైకల్యం లేనివాడు. సుస్వరంకలవాడు, రాగలయలు, స్థాయిలు తెలిసిన వాడై సభాకంపం లేనివాడు, ధైర్యశాలి అయి భగవద్భక్తి కలవాడై సంగీతాభ్యాసకుడు ఉండాలి. గానం, వాద్యం, తాళం ఇవి లేనివాళ్ళు అష్టకష్టాల పాలవుతారు. శ్రుతిమాత, పితగీతం, వాద్యం సఖుడు అవుతారు. తాళం సహోదరుల అవుతారు."31

తర్వాత ఈ గ్రంథంలోని ప్రథమ శిక్షాప్రకరణంలో రాగతాళ ధ్యానాలను శ్లోక రూపంలో రాశారు. మొట్టమొదట మాళవ రాగధ్యానం, ఆదితాళ ధ్యానం వరుసక్రమంలో ఉన్నాయి.

ఇక "లక్ష్యము" అన్న పేరుతో చతురశ్ర జాతి వరుసలు మాళవరాగంలో ఆదితాళంలో సప్త స్వరాలు, సంగీతాభ్యాసకులు మొదట ప్రారంభించే సరళీ స్వరాలు ఒక్కొక్కటిగా రాశారు. ఆవృత్తములు రెండని ఆరోహ అవరోహి అని రాసి, దాని క్రింద

॥ సా రీ గామా - పా ధా నీ సా॥

సాహిత్యములు శ్రీ రామేశా - రా మా పాహి॥

సానీ దాపా - మా గా రీ సా ॥

శ్రీ వత్సాంకా - కృష్ణ పాహి ॥

అదే విధంగా ద్రుత కాలంలో

"సరిగమ - పదనిస । సనిదప - మగరిస ॥

వనచర - పతిసఖ । వసుపతి -వరనుత ॥

తిరిగి విలంబంలో మరో స్వరం ఉంది.

సారీగామా -సారీగామా । సారీగామా - పాదా నీ సా॥

కారుణ్యార్ద్రే - సుగ్రీవాప్తా । గానాలోలే - రామాపాహి॥

సానీదాపా - సానీదాపా । సానీదాపా - మాగారీ సా ॥

కంసాధ్వంసా-కంజాతాక్షా । కాళీయారే । కృష్ణాపాహి॥32

ఇదే విధంగా ప్రతి సరళీ స్వరానికి స్వరాలతో బాటూ సాహిత్యాక్షరాలు కూడా రాశారు. సాహిత్యంలో రాముని, కృష్ణుని రక్షించమని ఈ వాక్యాలలో అర్థం. మొదటి మూడు, నాలుగు, సరళీ స్వరాలు ఇప్పటి కాలంలో విద్యార్థులునేర్చుకునేవిగానే ఉన్నాయి. ఆ తర్వాత నుండి కొద్ది మార్పుతో సరళీ స్వరాలు ఉన్నాయి.

సర్వసాధారణంగా సరళీస్వరాలలో

"సరిగమ - సరిసరి । సరిగమ పదనిస ।

సానిదప - సనిసని । సానిదప మగరిస" అని ఉంటుంది.

సర్వార్థ సార సంగ్రహంలో ఇదే స్వరాన్ని ఇలా రాశారు.

"సారీసారీ - సారీగామా - సా రీ గా మా -పాదానీ సా ॥

కోపాటోపే -క్రూరాదిత్యా - కోదండాఖ్యా - రామాపాహీ ॥

సానీ సానీ - సా నీ దాపా - సానీదాపా - మాగారీసా ॥

గోపాధ్యాక్షా- గోవిందాఖ్యా - కుబ్జానాథ - కృష్ణాపాహి ॥[33]

ప్రతి సరళీస్వరం సాహిత్యాక్షరాలతో చెప్పడానికి నిర్దేశించిన ప్రయోజనం - విద్యార్థులకు సంగీతంలోని రాగం, తాళం, స్వరజ్ఞానంతో బాటూ సాహిత్యం కూడా అలవాటు అవుతుందని బహుశః ఇది వరకు అదేవిధంగా చెప్పి వుంటారు, ఒక స్వరం విలంబకాలమైతే మరొక సరళీస్వరం ద్రుతకాలంలో రాశారు. అన్నింటిలోని రాముని గురించి గానీ కృష్ణుని గురించి గాని ఒకే విధంగా స్తుతులు లేవు. ద్రుతం, విలంబం ఈ వరుస క్రమంలో రెండో భాగం అవుతుంది. విలంబంలో చివర రామాపాహి అని లేదా కృష్ణాపాహి అని పూర్తి చేసారు.

ఉదాహరణకు : ద్రుతం

"సరిగస - రిగసరి । సరిగమ - పద ని స

సవిత్రుకు - లజవర । సవనభు - గభినుత

సనిదప - నిదసని । సనిదప - మగరిస

సలిలని - ధిసదన । సకలన - రఫలద ।[34]

విలంబం

"సారీ గా మా - పాసారీ గా । సా రీ గామా - పాదా నీ సా

కామ్యార్థానాం - ధాతారామో । కామారీడ్యో - భూత్యై భూయాత్

సానీదా పా - మాపా నీ దా । సా నీ దాపా -మాగా రీ సా ॥

కాలమ్లేచ్ఛా - దీనాంక్రూరః । కాలంః కృష్ణో - భూత్యై భూయాత్"[35]

ఈ విధంగా ద్రుతకాలంలో ఆరంభించి ఈ స్తుతిని విలంబకాలంలో పూర్తిచేశారు. అలాగే మిగిలిన స్వరాల్లోని సాహిత్యం కూడా ఇదే విధంగా రాశారు. ఇక చివరి స్వరంలో విలంబంలోనే స్వరం, సాహిత్యం ఇచ్చి, ఆ తర్వాత అవరోహణ స్వరాలలాగా తొమ్మిది స్వరాలను రాసి అందులో సాహిత్యాన్ని ఇమిడ్చి ఆరోహణను తిరిగి పాడే నియమాన్ని పాటించారు. మన పల్లవి, అను పల్లవులు ఒకదాని తర్వాత ఒకటి పాడినట్లే అన్నమాట.

విళంబము

1. సరిగమ - పాగమ - పాపా ॥ గమపద - నిదపమ - గమపగ - మగరిస ॥ ॥సరిగమ॥

వరిధర - ణీధవు - రే రే ॥ సర సిజ - భవనుత - సరసప - దకమల ॥ ॥వరధర॥

2. గమగమ - పమపద - మదపప - మగ రి ప

గి రిధర - శుభకర - సురుచిర - గుణమణి ॥ సరిగమ ॥

3. మపదప - ద నిద ప - మపదప - మగరిస ॥ సరిగమ ॥

గి రిధర - మురహార - పరమపు - రుష శ్రీ ॥ వరధర ॥

ఈ విధంగా మొత్తం తొమ్మిది స్వరాలు ఉంటాయి. మొదట వరధరణీధవు రేరే । సరసిజ భవనుత సరస పదకమల అని రెండు ఆవృత్తాలు పాడిన తర్వాత ఒక ఆవృత్తం ఉన్న ఈ చరణం లాంటి స్వరసాహిత్యాల్ని పాడాలి. ఈ విధంగా విద్యార్థులు పాడితే ఆరంభస్వరాలైన సరళీ స్వరాలు గళానికి పట్టితే సంగీతం బాగా వస్తుంది.

సరళీ స్వరాలు తర్వాత "చతురశ్రజాతి - దాటు వరుసలు" రాసారు. అది కూడా స్వరం దానికింద సాహిత్య సరళీ స్వరాలకు మల్లే రాసారు.

ఉదా : సరసగ । రిగమగ । సగ రిగ । సరిగమ । రిగరిమ

దశరథ । వరసుత । నిగమవి । నుతదశ - వదనద

గమపమ । రిమగమ । రిగమప ।

ళన రవి । కులజల । నిధి శశి ।

గమగప । మపదప । గపమప । గమపద ।

ధరక్షిత । సుతవర । ఖరదను । జహరణ ।

మపమద । పద నిద । మదపద । మపదని ।

ప్రవిమల । సుగుణని । ధివనని । ధిశరణ ।" [36]

ఈ విధంగా చాలా పెద్ద స్వరాలు ఇచ్చారు. ఈ దాటు స్వరాలు (5) ఐదు ఇచ్చారు.

దీని తర్వాతి విభాగం చతురశ్రజాతి జంట వరుసలు. జంట స్వరాలలో ప్రత్యేకత ఒక్కొక్క స్వరంలో అవతార వర్ణనలు చేసారు. మొదటి స్వరంలో మాత్రం శ్రీ వేంకటాచలపతిస్తోత్రం చేసారు. మిగిలిన స్వరాలలో మత్స్యావతారం, కూర్మావతారం, వరాహావతారం, నృసింహావతారం, వామనావతారం, పరశురామావతారం, రామావతారం, బలరామావతారం, బౌద్ధావతారం, కలికావతారం అనే పదకొండు అవతారాలను వర్ణించారు. మచ్చుకొక వుదాహరణ :

మత్స్యావతారం :

"ససరిరి । గ గ మమ । రి రిగ గ । మమప ప ।

విలయస । మయమున । తొలిపలు । కులహాయ ।

గగమమ । ప ప దద । మమపప । దదని ని ।

దళదను । జాడుగొని । జ లనిధి । వడిజొర ।

పపదద । నిని స స । స సనిని । ద ద పప ।

జలచర । పతియయి । యులదితి । సుతునని ।

నినిద ద । పపమమ । దద పప । మమగ గ ।

నలయక । వుతిగొని । నలువకు । శ్రుతిచయ ।

ప పమమ । గ గరిరి । మమగగ । రి రిస స ।

ములనొస । గినహరి । ద లచెద । న నిశము॥ [37]

విలయ సమయంలో తొలిపలుకుల (వేదాలను) దనుజుడు తీసుకొని సంద్రంలోకి పారిపోతే జలచరాలకు అధిపతి అయి దితి కుమారుడనని బ్రహ్మగారికి శ్రుతిచయాలను తిరిగి ఇచ్చిన ఆ శ్రీహరిని ఎప్పుడు తలుస్తాను అని దీని భావం.

కూర్మావతారము :

అరుదుగ దూర్వాసుని శాపమునను సురపురి లక్ష్మిజలనిధిఁ గలసి
చనిన సుపతి హరియనుమతి సురరిపుడగు బలి పద సరసిజ
ముల శరణనుచును సతతము గొలిచి తిరుగుచును నొకపరి
సురలను దితిసుతులను గొని దనుజ పుని తోడ పురుహూతుడు
తరిమలగొని శరనిధి నైచిన నది జలధిమునుగ హరిహరి
యని మొరలిడ కమఠమగుచు - గిరవరము ధరించిన హరిదలచెద.

వరాహావతారము :

శ్వేత వరాహము గావర రూపముగైకొని దారుణ భంగిని మీరిన
క్రూర నిశాచరు హేమ విలోచనుజంపిన సారసనేత్రుని గొల్చెద.

నృసింహావతారము :

కనక కశిపుడురు బలమున త్రిదివము గొని సురాధిపుల
నమరుల నాథుల వినుత మునివరుల - ఉరగుల
తపసుల - జనుల జంపుచును లయశమునునిగతి
వనజనయనుపై వదలని పగగొని తనవర సుతుగని
దనుజ విరోధిని ఘనమగు స్తంభము నందు జూపుమని
నడువగ నందున మనుజ సింహమున మునులు
నుతింపగ మునుకొని కడువడి దనుజుని జంపిన
మురహరి దలచెద ॥

వామనావతారము :

నాకము రాక్షస నాయకుడౌబలిచే కృశియించగ
శోకముతో సురనాథుడు క్షీరసముద్రము చెంతను
నిర్జరసంఘముతో మొరబెట్టగ - నాకమలాక్షుడు
వారిని బ్రోవగ ప్రాకటమైన కృపాగుణ మొప్పగ
పాక విరోధి సహోదరుడై వెస వామననామముతో
వటుడై జని - ఏకమనంబున నాబలి చేదివముంగొని
మించిన శ్రీశుని గొల్చెద.

పరశురామావతారము :

కట్టడి మతులగు హయ హయులొకపరి మట్టు మీరి
కపటమున భార్గవుని పట్టిని జంపిన పరశు రాముడు
నెట్టన విలయ సమయ శమనుని గతి నట్టి పరశుగొని
నాహయహయులను గొట్టి కలనమున ఘన బలున

అర్జును గిట్టగళము పలుతునియలు చేయుచు
దిట్ట తనంబున ధరణిని గలరా పట్టులనిరువది యొక
పరి జంపిన చుట్టు వాలుగల భార్గవు దలతును.

రామావతారము :

రావణ బాధను రాయడిచే సురలావనజాక్షునిచే
వరములు గొని వేగము భుమిలో వనచరులై
దేవజితబలులై పుట్టినచో పావనుడగు హరి
శ్రీవర దశరథ భూవరునకు సుతుడై వసుధ
వెలసి శ్రీవైదేహికినై వనచరులను చేవ మీరగొని
రావణు జంపియు ధరవరసుతతో పావనుడగు
ఆరాముని దలంతును పాయని భక్తిని ॥

బలరామావతారము :

ఉరగరాజపతి హరియను మతిగొని ధర వసుదే
వుని తరుణి రోహిణికి వరసుతుడగుచును
వసుధ బలుడన బరగి ధేను కాసురుల నణచి
సోదరుడగు కృష్ణుడు తనతోరాగా సరిగల
మధురా పురమున కటుజని కరి మూష్టికమా
మాగధ భూపతులను తరి మి రేవతిని సరస
పెండ్లియై నిరుపమలీలలనెరి సుఖించిన పరము
హలాయుధు బ్రస్తుతి జేసెద

బౌద్ధావతారము :

దనుజ రూపులైన రాజ ఖలులను మోయుటకు తనకెటు
బలము జాలక వనట తోడ ధరణి గోవుగతిజని
విరించిని గని మొరలిడగ నాతడు వనజనాభునకు సురారుల
తెరగు జెప్ప నాహరి వసుదేవునకు సుతుడనగ మీరి
శకటపూతనాదుల చిరుత తనమున మడించి పశువుల
గొనుచు కాన కరిగివత్సపంనగ వృషభహయ ముఖ
దనుజులను పురిగొని ఘనతనీంద్రు మదము వేగ నణచుదు
గోపసతులను ముద మొదవరతులను దనుక జేసి
రాముతోడ మధురాపురికి జని మాలాకరు బ్రోచుచు
ఘన పరాక్రమమున కంసు పాపుని ద్రుంచి బలయుతుడయి

పోయిరుక్మిణి ॥ వనజ నేత్రి గొని వివాహము అతులిత

ముగ జేసికొని శిశుపాలు చక్రమున కినుక జంపి

మునుల గొల్వ సుఖమున వెలయు కృష్ణమది నిడి

గొలుతుననిశము

కలికి అవతారము :

కలికి మూర్తియగు హరిదలచెద తిరునగరి వీణ

రామానుజ కవిచే వెలయు నీ జంట వరుసలకు

దశావతారముల సాహిత్య మొనర్చబడియె.

ఈ జంట స్వరాలకు సాహిత్యం తిరునగరి వీణ రామానుజ కవిచే వెలయింప చేయబడినవని పదకొండవ స్వర సాహిత్యంలో చెప్పుకున్నారు.

దీని తర్వాత సప్త తాళ నామములు

శ్లో - ధృవ మఠ్యా రూపకశ్చఝంపాత్రిపుట ఏవచ ।

అటతాళే కతాళేచ సప్త తాళ ప్రకీర్తితాః ॥[38]

ధ్రువతాళం, మఠ్యతాళం, రూపకతాళం, ఝంపెతాళం, త్రిపుటతాళం, ఆటతాళం, ఏకతాళం అనేవి ఏడు తాళాలని తాళవిభాగం చెప్పారు. ఆ తర్వాత ఒక్కొక్క తాళ లక్షణాన్ని, దాన్ని ధ్యానిస్తూ ఒక్కొక్క తాళానికి ఒక్కో అలంకారాన్ని స్వర, సాహిత్యాల సహితంగా రాసారు. "ఈ సప్తాలంకారాలకు వీణ విజయ వరదయ్య అనే ఆయన సాహిత్యాన్ని రాసారని ఈ అలంకారాలకు ముందు చెప్పారు."39

తాళ ధ్యానంలో ఆ తాళం ఏ వస్త్రధారణ చేస్తుందో, స్వభావం, వాహనం మొదలైన అంశాలను ఆ శ్లోకాలు వివరిస్తున్నాయి. ఇందులో శ్లోకాలకు కింద వాటి అర్థాలను తెలుగులో ఇవ్వలేదు. తాళాంగాలను మాత్రం తెలుగులో వివరించి ఆ జాతి తాళంతో అలంకారాలను ఇచ్చారు. ఈ తాళ శ్లోకాలను వాటి అర్థాలను వివరించాల్సి ఉన్నది. ఆధునిక సంగీత లక్షణ గ్రంథాలలో తాళానికి సంబంధించి ఈ గ్రంథంలో ఇచ్చిన అంశాలను ఎక్కడా కానలేము.

తాళదశ ప్రాణ ప్రదీపిక, రాగాతాళ చింతామణి అనే గ్రంథాలు 17వ శతాబ్దంలో పోలూరి గోవిందకవి తెలుగులో పద్యరూపంగా రాసిన గ్రంథాలు. అందులో తాళాలకు సంబంధించినంత వరకు సంస్కృతంలో శ్లోకాలు లభ్యం కాలేదు.

అయితే ఆధునిక కాలంలో "సంగీత మార్తాండము" అనే గ్రంథం పుచ్చా వెంకటసుబ్రహ్మణ్య శాస్త్రిగారు రాసినది లభ్యమైంది. అందులో తాళాధ్యాయం - సప్త తాళ ప్రకరణం ప్రత్యేకించి పుస్తకంలా వేసారు. అందులో ఈ పుస్తకం ఎప్పుడు ప్రచురించారనే విషయం లేదు. తాళాధ్యాయంలో సప్త తాళాల విభజన తల్లక్షణాలు, భేదాలు, అంగాలు, క్రియలు ఇచ్చారు. ఆయాతాళాలు ఎవరెవరి మతాన్ననుసరించి వచ్చాయో వివరించేరు. సప్త తాళాలు ఎలా ప్రభవించాయో, ఆ సప్త తాళాలకు ఋషులు, వారాలు, నక్షత్రాలు, రంగులు, వస్త్రాలు, నివాసం, అధిదేవతలు మొదలైన విషయాలు పట్టికలో ఇచ్చారు. ఈ పుస్తకంలో, సంగీత సర్వార్థసార సంగ్రహంలో ఇచ్చిన విధంగా శ్లోకరూప లక్షణాలు ఇవ్వలేదు. ఉన్న లక్షణాలు, అంగాల గతులు మాత్రమే ప్రకటించారు. సంగీత మార్తాండంలో ఇచ్చిన సప్త తాళాల వారాదులు ఇలా వున్నాయి

## సప్త తాళాలవారాదులు

| సంఖ్య | తాళములు | వారములు | నక్షత్రములు | ఋషి | వర్ణము | వస్త్రము | నివాసము | అధిదేవత |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | ధ్రువతాళం | ఆదివారము | పుష్యమి | కౌండిన్య/ శాండిల్య | పీత | శుభ్ర | జంబూ ద్వీపము | బ్రహ్మ |
| 2. | మఠ్య | సోమ | హస్త | భారద్వాజ / విశ్వామిత్ర | శ్యామ | రక్త | ప్లక్ష | కౌమారి |
| 3. | రూపక | మంగళ | మఖలేక మృగశీర్ష | వశిష్ఠ/ గౌతమ | రక్త | పీతాంబరం | కుశ | అంబిక శాల్మలి |
| 4. | ఝంపె | బుధ | పుష్యమి లేక పుబ్బ | జమదగ్ని | హారిద్ర | చిత్ర, వస్త్రం | కుశ/క్రౌంచ | మహేశ్వర |
| 5. | త్రిపుట | గురు | అశ్విని లేక ఆరుద్ర | కాశ్యప, భరద్వాజ | శ్వేత | పీత | క్రౌంచ శాల్మరి | ఈశ్వరి |
| 6. | అటతాళం | శుక్ర | హస్తలేక అశ్విని | అత్రేయ కశ్యప | హిరణ్య | పీతాంబరం | శాక | పార్వతి |
| 7. | ఏకతాళం | శని | జ్యేష్ఠలేక స్వాతి | దూర్వాస వశిష్ఠ | శ్యామ | పీతవస్త్రం | పుష్కర | సరస్వతి"[40] |

సంగీత సర్వార్థసార సంగ్రహంలోను, తాళధ్యానంలో తాళాలకు గల లక్షణాలు సమన్వయపరిస్తే ఈ విధంగా ఉన్నాయి. కొన్ని లక్షణాలు, ఒక గ్రంథంలో మరికొన్ని లక్షణాలు రెండో గ్రంథంలో పేర్కొన్నారు. అందువల్ల కొంత సమన్వయ పరచవలసి ఉంటుంది.

1. ధ్రువతాళానికి సర్వార్థ సారసంగ్రహంలో

ఒక స్త్రీ ఎడమవైపున స్త్రీని వక్షం మీద ధరించినది హంస వాహనం, రత్న కేయూరాలు, ముక్తాహారాలను ధరించినది, తెల్లని వస్త్రం ధరించినది శాంతరసం; శంఖ చక్ర గదలు ధరించినది ధ్రువతాళం.

సంగీత మార్తాండంలో

వారం - ఆదివారం, నక్షత్రం - పుష్యమి, ఋషి - కౌండిన్య, శాండిల్య, వర్ణం - పీత వర్ణం, వస్త్రం - శుభ్రమైనది, నివాసం - జంబూద్వీపం - అధిదేవత - బ్రహ్మ ఈ లక్షణాలున్నాయి.

2. మఠ్య తాళానికి : సర్వార్థ సార సంగ్రహంలో

వాహనం - మయూరం, వీణ, అక్షమాల ధరించినది, పదిమంది స్త్రీలు సేవిస్తున్నది, రత్న భూషణాలు అలంకరించుకున్నది, నాలుగు భుజాలు కలది బ్రాహ్మణ మాతృక అయిన భువనేశ్వరి (అధిదేవత కావచ్చు)

సంగీత మార్తాండంలో

సోమవారం, నక్షత్రం - హస్త, ఋషి - భారద్వాజ, విశ్వామిత్ర, వర్ణం - శ్యామ, వస్త్రం - రక్త వస్త్రం (అంటే ఎరుపు రంగు బట్టలు) నివాసం - ప్లక్ష అధిదేవత కౌమారి లక్షణాలుగా చెప్పారు.

3. రూపకతాళానికి

సంగీత సర్వార్థ సార సంగ్రహంలో గజవాహనం, ఆరుగురు స్త్రీలతో కూడి ఉంటుంది. రసం - వీరం, హరిద్రం వస్త్రం, రత్న. కేయూర హారాలు అలంకారాలు.

సంగీత మార్తాండంలో

మంగళవారం, మఖలేక మృగశిర నక్షత్రం, విశిష్ఠ గౌతమ మహర్షి, రక్తవర్ణం, పీతాంబర వస్త్రం, శాల్మలి, కుశ నివాసం, అంబిక అధిదేవత లక్షణాలున్నాయి.

4. ఝంపెతాళానికి - సంగీత సర్వార్థ సార సంగ్రహంలో

సింహాసనాన్ని ఎక్కినది, దుష్టస్త్రీలతో కూడుకున్నది పురుషుణ్ణి అంకంలో ఉన్నది, బంగారం, పగడం మణులతో అలంకారాలు కలది, రక్త అంబరం ధరించినది, వైశ్య మాతృక అయినది.

సంగీత మార్తాండంలో

బుధవారం, పుష్యమి లేదా పుబ్బ నక్షత్రం, ఋషి జమదగ్ని, హరిద్రవర్ణం, చిత్తవస్త్రం, కుశ/క్రౌంచ నివాసం, మహేశ్వర అధిపతి లక్షణాలు చెప్పారు.

5. త్రిపుటతాళానికి

సంగీత సర్వార్థ సార సంగ్రహంలో

సింహవాహనం, ఆనందం కలిగించేది, స్పటికం ఆకారం, ఖడ్గ, ఖేటం, బాణం, శరాసనాలతో కూడినది, అన్ని భూషణాలు ధరించేది, ఏడుగురు స్త్రీలతో పరివేష్టించినది.

సంగీత మార్తాండంలో

గురువారం అశ్విని లేదా ఆరుద్ర నక్షత్రం, కాశ్యప/భరద్వాజ మహర్షి, శ్వేతవర్ణం, పీతవస్త్రం (పట్టు) క్రౌంచ/శాల్మలి నివాసం, ఈశ్వరి అధిదేవతగా చెప్పారు.

6. అటతాళానికి

సంగీత సర్వార్థ సార సంగ్రహంలో

సతితో కూడినది, వృషాన్ని ఎక్కినది

సంగీత మార్తాండంలో

శుక్రవారం, హస్తలేక అశ్వనీ నక్షత్రం, అత్రేయ/కశ్యప మహర్షి, హిరణ్యవర్ణం, పీతాంబర వస్త్రం, శాక నివాసం, పార్వతి అధిదేవత.

7. ఏకతాళానికి

సంగీత సర్వార్థ సార సంగ్రహంలో

రథవాహనం శంక హస్తం, నలుగురు స్త్రీలతో కూడినది, గౌరవస్త్రం ధరించేది, జ్ఞానముద్ర, అభయకరం, బ్రహ్మవంశంలో ఉద్భవించినది.

సంగీత మార్తాండంలో

శనివారం, జ్యేష్ఠ లేక స్వాతీ నక్షత్రం, దుర్వాస/వశిష్ఠ మహర్షి, శ్యామవర్ణం, పీత వస్త్రం, పుష్కర నివాసం, సరస్వతి అధిదేవత.

సంగీత సర్వార్థ సారసంగ్రహ పుస్తకంలో తర్వాతి విభాగం గీతాలు - లక్షణ గ్రంథాలలో ఇచ్చే గీతాలు మలహరి రాగం - రూపక తాళంలో (1) "శ్రీగణనాథ", (2) "కుందగౌర గౌరీవర", త్రిపుట తాళంలో (1) "కెరయనీరను", (2) "పదుమనాభ", శుద్ధ సావేరి రాగం - త్రిపుట తాళంలో "ఆనలేకర" ఇచ్చారు. ధ్రువతాళంలో "ధవళంగజాందోళసురెరె", దేశాక్షిరాగం - త్రిపుటతాళంలో "భయసమయదేవ" నాటరాగంలో "శ్రీ శంభోహరేమాంపాహి" అనే గీతం ఆదితాళంలో రాసారు.

సర్వలఘు గీతం - నాటరాగం - త్రిపుట తాళంలో "రేబాల గోపాల నీల జలధర" మొదలైన గీతాలు కన్నడం, సంస్కృత భాషల్లో ఉన్నాయి. ఈ గీతాలతోబాటూ "శ్రీరంగ నాయకుల పంచరత్నాలు", "పార్థసారధి" పంచరత్నాలు, "యతిరాజు" గీతాష్టకం (ఎనిమిది గీతాలు) రాసారు. ఈ గీతాలన్నీ విజయ వరదయ్యగారు రాసినట్టుగా ఆయన పేరు ముద్రగా ఈ గీతాలలో కనిపిస్తోంది. ఈ గీతాలలోని భాష సంస్కృతం. ఈ గీతాలను నాట, వరాళి, రీతిగౌళ, శుద్ధ సావేరి, కాంభోజి, కళ్యాణి, కేదారగౌళ మొదలైన రాగాల్లో కూర్చారు.

గీతాలలోని మరో విభజన "లక్షణగీతాలు". ఈ లక్షణగీతాల లక్షణం శాస్త్ర ప్రకారం మామూలుగా గీత లక్షణాలున్నట్లు పల్లవి, చరణం ఇత్యాది భాగాలు ఉండవు. లయ ఒకే విధంగా ఉంటుంది. కష్టమైన రీతిలో పాడేట్లుగా ఉండదు. సులభమైన సాహిత్యం, భగవన్నుతులే వుంటాయి. అయితే లక్షణ గీతంలో సాహిత్య భాగంలో మాత్రం మార్పు ఉంటుంది. లక్షణ గీతం ఏరాగంలో రాసారో ఆరాగ లక్షణాలను తెలుపుతుంది. ఆ లక్షణాలలో ఏరాగజన్యం, దాని పేరు, జన్యరాగమైతే అది, మేళకర్తరాగం, దాని పేరు, ఉపాంగం, భాషాంగం, భాషాంగ స్వరం, వక్రమా, వర్జమా, న్యాసస్వరమా, జీవస్వరమేమిటి ఔడవమా, షాడవమా లేక సంపూర్ణమా ఈ విషయాలన్నీ ఆ రాగ గీతంలోని సాహిత్యంలో కనిపిస్తాయి.

సంగీత సర్వార్థ సారసంగ్రహంలో (1) గౌళరాగం - త్రిపుట తాళం, (2) సారంగనాటరాగం - ధ్రువ రూపకతాళం, (3) నూతన చంద్రికా రాగం - ధ్రువరూపకతాళం (4) నీలాంబరిరాగం - ధ్రువతాళం (5) సారంగ రాగం - ధ్రువతాళం; మొత్తం 5 గీతాలు లక్షణ గీతాలు ఇచ్చారు. గౌళరాగ లక్షణ గీతంలోని రాగ లక్షణాలు ఈ విధంగా ఉన్నాయి. శ్రుతి, గ్రామం, మూర్ఛన, న్యాసం, సన్యాసం మొదలైన త్రయోదశ లక్షణాలతో కూడుకొన్నది ఈ రాగం. గీతం, ప్రబంధం చూర్ణికలతో సహా ఈ రాగం కరుణ రసం, వీరరసాలను ద్యోతకం చేస్తుంది. నానావిధ తాళ జాతిగతి భేదాది రూపాలతో ఈ రాగాన్ని అనాది నుండి ఉపయోగిస్తున్నారు.

సంగీత సర్వార్థ సార సంగ్రహంలోని ఆ తర్వాత విభాగం గీత ప్రబంధాలు. నాట రాగంలో - రూపక తాళం; కాంభోజిరాగం - రూపకతాళం, శంకరాభరణం - రూపకతాళం; నాటరాగం - రూపకతాళంలో నాలుగు ప్రబంధాలను స్వరసహితంగా ఇచ్చారు. ఈ గీత ప్రబంధాల్లోని విశేషం తోంతోంగిణి ధత్తర్ధు దద్ధు - త్కత్క ధాంధిమికిట దాహాంధిమి..." ఇలాంటి అక్షరాల సమాహారంతో పాటూ దేవతా స్తుతి ఉంది. సుమారుగా గీతం వలే రాసారు.

గీత ప్రబంధాల తర్వాతి విభజనలు కైవార ప్రబంధాలు, రాగమాల గీతాలు.

కైవారప్రబంధంలో కూడా గీత ప్రబంధ లక్షణాలే కనిపిస్తున్నాయి. శార్ఙ్గ దేవుని సంగీత రత్నాకరంలో కైవార ప్రబంధ లక్షణాలు ఉన్నాయి. ఇది కూడా ఇంచుమించుగా దరువులాంటిదే.

ఇక రాగమాల గీతంలో ఆరాగం పేరుతో వచ్చే విధంగా వాక్య నిర్మాణం స్వర సహితంగా ఉంది. ఉదాహరణకి

"నాటరాగము

పప్ప మపమ్మమరి

క ర్ణ ఆటకొం కణ

గౌళి రాగము

స్పస్పరిరిమ్రరిస -

గౌళ దేవశ అలల -

వరాళి రాగము

దగరిరిగ - రిగ రిసని

ధిపవరల - అలలఅళి -"

అనిరాస్తూ చివరి రాగాలు

"సౌరాష్ట్ర రాగము

గమపధ నిద పమగరి

సౌడఉర అష్టఅలదిత -

నాటరాగము

రిగమ పదనిసననిప

రచిత గీఇతిఅమలల

చలనాటరాగము

సనిపమపమ మమరిప ॥

విజయవరద మఅమవ "[41]

అని ఆవృత్తం పూర్తి చేసారు. గీతమాలను విజయవరదకవి రాసినట్లు చివరి పాదంలో చెప్పారు.

కర్ణాట కొంకణగౌళ దేశాలకు అధిపుడైన మనోహర బిరుదాంకితుడూ శ్రీరాగరంజిత బహుళ కృతోత్సాహ సారంగ నటన నరనారాయణ శ్రీ, నిత్యకళ్యాణవర సఖాంబుధి శయన వరభూపతిలకచాతురీ తిలక వరశుద్ధ సత్వ గౌళనాటకురంజీ.... మధ్య మావతీ సౌరాష్ట్రాదిత రచిత గీతమాల విజయ వరద మామవ -

ఇందులో అన్ని రాగాల పేర్లనూ అర్థవంతంగా చేసారు. దీనికి రాగమాలగీతం అని పేరు పెట్టారు. ఈ గీతమాలకు స్వరం, సాహిత్యం దానిలో రాగం నిర్ధారించినా, తాళం నిర్దేశించలేదు.

కల్లినాథుడు "మహాప్రబంధమని, శార్ఙ్గదేవుడు రాగకదంబకం అని వ్యవహరించిన ప్రబంధరచనలాంటిది ఈ రాగమాలగీతం. కొన్ని రాగమాల గీతాలు నాయికా నాయక ముద్రతో భగవత్కీర్తనతో అందమైన రాగముద్రతో ఉంటాయి. ఈ రాగమాలికలో శ్రీ మహావిష్ణు స్తుతి వస్తువుగా ఉంది. భక్తిరస ప్రధానమైంది. ప్రాచీనులు ఇటువంటి రచనలు చేసారు.

'ఇంకొక రాగమాల గీతములు - ధ్రువతాళం' అని మరో రచన రాసారు. దీనికి తాళ నిర్దేశం చేసారు. పూర్వపు 'గీతమాల' వలే ఇందులో రాగాలను పేర్కొంటూ సాహిత్యాన్ని స్వరపరిచారు. అయితే ఇందులోని

సాహిత్యం రాగ నిర్దేశం వేరు వేరుగా వున్నాయి. ఒకే ఒక గీతంలా వున్న దీన్ని చిన్నవాక్యాలుగా చేసి వాటికి రాగాలను పేర్కొన్నారు. ఒక్కో రాగంలో ఒక్కొక్క వాక్యం వుంటుంది. గీతం మొత్తం అయ్యేసరికి చివర సాహిత్యం వాక్యంగా పూర్తవుతుంది. ఇందులోని వస్తువు రంగనాయకస్తుతి. ఇటువంటి రాగమాల గీతాలు అరుదైన రచనలు.

శ్రీరాగము

"సనిసగ రి - సరి సని - సనిపమ -

శ్రీరమణీఇ - కుచకుం - ౦౦కుమ -

నాటరాగము

రిగమపనిప - ససరిస - మమరిస

కీఇరితిసఅ - అఅఅఅ - అఅఅర -

గౌళరాగము

రి సరి పమరి - గమరిసరిస నిస -

హాఅర కెహాయు - ఉరకం౦౦౦ కణ -

వరాళిరాగము

నిసరిగరిని - దనిదమగగరిస

కిరిఇఇఇట - కుం౦౦౦ ౦౦డల - "42

ఈ విధంగా ఒక్కొక్క వాక్యం శ్రీరమణీ కుచకుంకుమ అన్నది శ్రీరాగంలోను "కీర్తిసారా" అనేది నాటరాగంలో "హారకేయూర" అనేది గౌళరాగంలో "కిరీట కుండల" అనేది వరాళి రాగంలో ఇలా మొత్తం 32 రాగాలలో వాక్య నిర్మాణం చేసారు. మొత్తం అంతా కలిపి పెద్ద గీతం అవుతుంది.

ఆదిభట్ల నారాయణ దాసుగారు రాసిన నవతికుసుమమంజరి ఈ విధంగానే కూర్చబడింది. ఇలాంటి సంగీత రచన చెయ్యాలంటే సంస్కృతం, తెలుగు భాషా పాటవమే కాక సంగీతంలో నిష్ణాతులయిన వారికి మాత్రమే సాధ్యమవుతుంది.

సంగీత సర్వార్థ సార సంగ్రహంలోని తర్వాతి అంశం తానాలు 20 రాగాల తానాలను ఇందులో స్వర పూర్వకంగా ప్రచురించారు.

రాగాలాపన చేసేటప్పుడు తానం, తానం, తత్తనోం, తననోం, తాననోం అంటూ అకార ఇకార యుతంగా, ఆకారాది గమకయుతంగా పాడటాన్ని తానం అంటాం. ఇది అంతర్లయ కలిగి ఉంటుంది. అటువంటి తానానికి ఆయారాగాల్లో స్వరాలను సమకూర్చారు. స్వర స్థానాలను బట్టి ఆకార క్రమంలో అభ్యాసకుడు పాడాలి. నాటరాగంలో - బజావళి, గౌళతానం, ఆరభితానం, శ్రీరాగతానం బౌళితానం - ఆయిత్తం నారాయణగౌళతానం - ఆయిత్తం ఈవిధంగా రాగ స్వరాలను ఏర్పాటు చేసారు. ఎక్కడెక్కడ ముక్తాయింపు ఇవ్వాలో నిర్దేశించారు. ఈ విధమైన రచనలు వీణకు వీలుగా వుంటాయి. గాయకునికి అలాకాదు. తానం పాడేటప్పుడు స్వతహాగా ఆ రాగ ఛాయలు తెలిసి ఉండాలి. అప్పుడే తానం అనేందుకు సులభమౌతుంది. సంగీతాభ్యాసకులకు తానం రావడం చాలాకాలం తర్వాత కాని జరగదు. చాలా వరకూ అభ్యాసం చేసిన తర్వాత బోధపడుతుంది. స్వరకల్పన, రాగాలాపన, తానం పాడటం చాలా కష్టమైనవి. రాసుకుని చూసి పాడేవికావు. రాగాలాపన తానాలకు తాళం ఉండదు, సాధన చెయ్యాలి. ఈతానాలు వీణను

దృష్టిలో పెట్టుకొని రాసినట్లుగా భావించవచ్చు. తన్నాకరంగా నాటరాగంలో స్వరం దాని కింద "తానం తానానా" అనే పదాల ఇముడ్పు ఉంది. ఇది ఆరుపేజీలు ఉంది. ఈ రకంగా సాధన చేస్తే ఆయారాగాలలో ప్రావీణ్యం పట్టు వస్తాయని ఆవిధంగా రచన చేసి ఉండవచ్చు.

గ్రంథంలో ఆ తర్వాత విభాగం చౌకవర్ణాలు.

మొదటి వర్ణాన్ని రేగుప్తి రాగంతో మొదలు పెట్టారు. రేగుప్తి రాగ ధ్యాన శ్లోకం ఇచ్చారు. ఆ పిమ్మట ఆదితాళంలో రేగుప్తి రాగ వర్ణం స్వరసహితంగా ఇచ్చారు. చౌకవర్ణాల్లో రేగుప్తి రాగానికి తానవర్ణాలలో మోహన రాగానికి మాత్రమే ధ్యాన శ్లోకాలను ఇచ్చారు.[43]

రేగుప్తి రాగంలో ఆదితాళంలో "సరిగా దానిపై నెనరుంచి నీ సరసకు రమ్మనరా సరసాగ్రేసర! అన్న ఈ వర్ణం గోవింద సామయ్య పదవర్ణం, గోవింద సామయ్య ఈ వర్ణాన్ని మోహనరాగంలో నిబద్ధీకరించాడు. మోహనరాగం హరికాంభోజరాగజన్యం ఇది ఔడవరాగం. "ఒకప్పుడు ఈ మోహనరాగాన్ని రేవగుప్తి లేక రేగుప్తి రాగంగా అర్థం చేసుకొనే వారు"[44] రేవగుప్తి లేక రేగుప్తి రాగం మాళవ గౌళజన్యం. కాబట్టి ఈ రెండూ ఒకటి కాదు. తచ్చూరి వారి పుస్తకంలో రేగుప్తి రాగమని ఉన్నా అది మోహనరాగంలో మాత్రమే అని గ్రహించాలి. ఈ వర్ణాన్ని నాట్యరూపంలో కూడా మోహనరాగంలోనే ప్రదర్శిస్తున్నారు. మోహనరాగం బహురస ప్రధానం, వర్ణనకు తగినది. ఈ రాగంలో స్వరాలు అన్నీ రాగాచ్ఛాయాస్వరాలే. సర్వకాలాల్లో పాడ తగిన ఈ రాగగోవిందసామయ్య పదవర్ణానికి ఎంతో చక్కగా అమరింది. శృంగార రసపూరితమైంది ఈ వర్ణం.

గోవింద సామయ్య రాసిన మరో వర్ణం - కేదార గౌళరాగంలో ఆదితాళంలో కూర్చినది.

"నీసరి మన్నాదొర లెవ్వరూ లేరా
నీమానే లతానిన్ను కోరియున్నదిరా" ఈ వర్ణం కూడా శృంగార రసపూరితమైంది.

చౌకవర్ణాల తర్వాత తాన వర్ణాలు నాట, గౌళ, ఆరభి, శంకరాభరణం, కాంభోజి, బిలహరి, ఆనందభైరవి, ధన్యాసి, శ్రీరాగం, తోడి రాగాలలో ఈ తాన వర్ణాలు ప్రాచీన వాగ్గేయకారులు రాసినవి ఇందులో చేర్చారు. ఈ వర్ణాలకు ఉన్న రాగాలలో మోహన రాగానికి రాగ ధ్యాన శ్లోకం ఉంది.

"సరిగళిత శిఖాగ్రాం ! పారిజాత ప్రసూనాం
స్రగవిరత భుజాంతం శ్యామలాం శ్వేత చేతాం।
చికుర విచకలాగ్ర వ్యాప్తి లీలాంసు లీలాం
ముకుర సహిత హస్తాం । మోహనాం చింతయామి"[45]
"నిన్నే కోరినదిర నీరజాక్షినేలుకోరా" అనే వర్ణాన్ని మోహన రాగంలో రాసారు.

తాన వర్ణాలలో తెలుగు ఛందో రీతులలో కూర్చిన వర్ణం ఒకటి ఈ సంగీత సర్వార్థ సారసంగ్రహంలో ఉంది. మత్తేభం, ద్విపద, గీతం, కందం, ఉత్పలమాల, చంపకమాల వీటితో కూడిన తానవర్ణం అది.

"వినరా - కోరిక - లూర నామనవి - హంవీరా - పరాకేలరా"

స, భ, ర, న, మ, య, వ అనే గణాలతో నాలుగు పాదాలు మత్తేభ వృత్తంలో ఉన్నాయి. ఆ తర్వాత ద్విపద ఛందంలో

"సరసవేనేమని - సన్నుతి జేతు

తరుణి సోయగము లెం। తని గారవింతు ॥ అని రెండు పంక్తులు గీతంలో

మగువకు - రులుకారు మొగుల - నదగుమోము

తొగలరేని దెగడు - సొగసుమోవి

చిగురు సొగరటంచు - జిగికల్వరేకుల

వగలమి - గులు కనులు - బగలు రేలు"

ఆ పిమ్మట కందంలో

మందగ - మనగళ - మందము

చందము - చందనమున నెసగు - చెలు - వందగమా

కందఫల రసము - తోవా

దందునురా - కలికి పలుకు - లరుదుగరతులను ॥

తర్వాత రెండు వృత్తాలు ఉత్పల మాల, చంపకమాలల్లో నాలుగేసి పాదాలు ఇందులో ఉన్నాయి. ఈ తానవర్ణంలో మొత్తం 22 పాదాలున్నాయి. ఇందులో మొదట మత్తేభ వృత్తం తర్వాత చిట్ట స్వరచరణం లాగా రాసారు. స్వరం, సాహిత్యం కూడా ఉంది. ఈ వర్ణం పేరు "మత్తేభ ద్విపద గీత కందోత్పల చంపక మాలికాక్షర తానవర్ణము" ఇది స్వర సహితంగా ఉంది. ఇటువంటి వర్ణాలు సంగీత ప్రపంచంలో చాలా అరుదుగా కనబడతాయి. పై వర్ణంలోని రసం శృంగారరసం. ఇటువంటి రచనలు మధ్యయుగంలో "శూళాది" పదం వంటివి. సంగీత ప్రబంధంలోని లక్షణాలు ఈ రచనలకు ఆధారాలు.

ఈ రచనలలో పల్లవి అనుపల్లవి అనేవి ఉండవు. ఖండికలుగా ఉంటాయి. ఇందులో నాయికా నాయక భావాలు లేదా దేవతాస్తుతి వస్తువుగా వుంటుంది. "శుళాది ప్రబంధం అన్నమయ్య కృతాలుగా వ్యవహారంలో వుంది. రాగిరేకుల్లో శూళాది కనిపిస్తోంది"[46] శ్రీపాదరాయ, విజయదాస, పురందరదాస మొదలైన వాగ్గేయ కారులు శూళాది రచన చేశారు.

సంగీత సర్వార్థ సారసంగ్రహంలోని వర్ణమాలికకు తాళనిర్దేశంగాని, రాగనిర్దేశంగాని లేదు వివిధ ఛందస్సులలో రచించినందువల్ల అదే తాళంగా భావించాలి. స్వరపరచి వున్నా రాగనిర్దేశం లేకపోవడం వల్ల ఏ రాగంలోనైనా దీన్ని పాడవచ్చు. సర్వ సాధారణంగా ఇటువంటి రచనలు గౌళ, వరాళి, నాట, శ్రీవంటి రాగాల్లో నిర్దేశిస్తారు. ఆయారాగాలలో పాడుకోవచ్చు. ఇక ఇందులోని వస్తువు ఈ విధంగా వుంది.

తన చెలి విరహభారాన్ని తగ్గించడం గురించి నాయకుని దగ్గర ఆమె గురించి చెప్పి రమ్మని సఖి వేడుకుంటుంది. తాను ఆ విధంగా వచ్చినందుకు అది నేరమని అందుకు మన్నించమని తన చెలి కందర్ప బాధ ఓర్వలేనిదిగా వుందని నిన్ను తీసుకొని రమ్మన్నదని చెప్తుంది. ఆమె సొగసు ఏమని వర్ణించగలను! కురులు కారు మొయిలు, మోవిసొగసు తొగలరేని తెగడు తుంది అంటూ అభివర్ణిస్తుంది. అటువంటి అందగత్తెమీద పరాకుమాని నీ అక్కున చేర్చుకొని మదనైక సంపదలను తనివి తీర ప్రసాదించరారా! అంటూ నాయిక కోరికను శృంగార రసబంధురంగా వ్యక్తం చేస్తుంది.

ప్రస్తుతం ఇటువంటి రచనలు వ్యవహారంలో లేవనే చెప్పాలి. సంగీతం, సాహిత్యం, ఛందస్సు ఇవి బాగా తెలిసిన దక్షులకు మాత్రమే ఇలాంటి రచనలు చేయడం సాధ్యపడుతుంది.

ఈ వర్ణం తర్వాత పదవర్ణాలు శంకరాభరణం, ఉసేని రాగాలలో ఉన్నాయి. తర్వాతి భాగం స్వరజతులు, మోహన, పున్నాగవరాళి రాగాలలో ఉన్నాయి. సంగీత సర్వార్థ సారసంగ్రహంలోని రచనలు ఇంతవరకూ ప్రతిరచనా స్వరపరచి ఉన్నాయి. ఆ తర్వాతి భాగంలో పదాలు, కీర్తనలు, తిరునామాలు అనాటి వ్యవహారంలో ఉన్న రచనలు కొన్ని చేర్చారు. వీటిలో క్షేత్రయ్య పదాలు ఆఱు, ఇనుకొండవారి పదం ఒకటి, శివరామపురం వారి పదాలు ఆఱు, యువరంగని పదాలు రెండు, మన్నారు రంగని పదాలు నాలుగు, కస్తూరి రంగని పదం ఒకటి, పరిమళ రంగని పదాలు ఇరవై, బొల్లవరపు వారి పదాలు రెండు, శోభనగిరివారి పదాలు రెండు, వీరభద్రయ్యగారి పదాలు ఆఱు, తాళ్ళపాకవారి పదాలు మూడు, మాతృభూతేశుల వారి పదాలు మూడు, జటపల్లి వారి పదం ఒకటి, ప్రతాప భూపాలేంద్రుని మీద పదాలు ఆఱు, ఘట్టుపల్లి వారి పదాలు నలభై నాలుగు, ఇంకా చాలామంది రాసిన పదాలు, గురుమూర్తి శాస్త్రులు, దీక్షితులు, శ్యామశాస్త్రి, కుప్పుస్వామి మొదలైనవారు రాసిన కీర్తనలు ఈ గ్రంథంలో ఉన్నాయి. అయితే వీటికి స్వర రచన చేయులేదు. కేవలం రాగ, తాళ నిర్దేశం చేసారు. ఇంతమంది వాగ్గేయకారుల రచనలను చేర్చి సంగీత లోకానికి అమూల్య కానుకగా అందచేయించిన విజయనగర సంస్థాన కృషి అపూర్వం.

## గాయక పారిజాతము

తచ్చూరి సోదరులు రాసిన కృతి రత్నాలలో గాయక పారిజాతం ఒకటి. ఈ గ్రంథంలోని అంశాలు రచనాకాలానికి 50 సంవత్సరాలకు ముందు నుండి వ్యవహారంలో ఉన్నాయి. సంగీతాభ్యాసకులకు ఉపయోగపడేవిధంగా సరళీస్వరావళి మొదలుకొని తాళ లక్షణం వరకు ఇందులో చేర్చి అందించారు. ఈ గ్రంథంలోని మొత్తం ప్రకరణాలు ఐదు.

సరళీ స్వరాలు మాయామాళవగౌళ రాగంలో ఆది, త్రిశ్రచతురశ్రజాతి, త్రిశ్ర ఖండ చతురశ్రజాతి, ఖండచతురశ్రజాతి, ఖండ త్రిశ్రచతురశ్రజాతి తాళాల్లో ఉన్నాయి. ఇప్పటి వ్యవహారంలో సంగీతాభ్యాసకులకు నేర్పే స్వరాలకు భిన్నంగా లేకపోయినా కొద్ది మార్పుతో ఈ స్వరాలు ఉన్నాయి.

'త్రిశ్ర చతురశ్రజాతి' స్వరం ఈవిధంగా ఉంది.

సరిగ - సరిగ - సరి - సరిగమ - పదనిస ।

సనిద - సనిద - సని - సనిదప - మగరిస ।

త్రిశ్రఖండ చతురశ్రజాతి స్వరం

సారి - గామగరి - సరిగమ - పదనిస ।

సాని - దాపదని - సనిదప - మగరిస ।

**ఖండ చతురశ్రజాతి**

సరిగమప - రిగమపద - గమపదనిస ।

సనిదపమ - నిదపమగ - ధపమగరిస ।

ఖండ త్రిశ్ర చతురశ్రజాతి స్వరం

సరిగమప - గమప - సరిగమ - పదనిస ।

సనిదపమ - దపమ - సనిదప - మగరిస ।

సరళీస్వరాల తర్వాతి విభాగం హెచ్చుస్థాయి స్వరాలు ఇవి నాల్గింటిని ఇచ్చారు. తర్వాత జంటస్వరాలు పది, దాటు వరుసలు రెండు, తరువాత అలంకారాలను ధ్రువతాళం చతురశ్రజాతి, త్రిశ్రం, మిశ్ర, ఖండం

సంకీర్ణజాతి తాళాల్లో ఇచ్చారు. అదేవిధంగా మఠ్యతాళంలో కూడా చతురశ్రజాతి మఠ్య తాళం, త్రిశ్రజాతి మఠ్యతాళం, మిశ్రజాతి మఠ్యతాళం, ఖండజాతి మఠ్యతాళం, సంకీర్ణజాతి మఠ్యతాళం ఈ ప్రకారంగా జంపె, త్రిపుట తాళాలకు కూడా అలంకారాలను రాసారు.

తర్వాత గీతాలు. ఇందులో ధ్రువతాళం, రూపక, జంపె మొదలైన తాళాల్లో నాట, గౌళ, ఆరభి, భైరవి, శంకరాభరణ, నీలాంబరి, శహన మొదలైన ప్రముఖ రాగాలలో మొత్తం 20 గీతాలను ఇచ్చారు. మూడవ ప్రకరణంలో వర్ణాలు ఆరభి, కాంభోజి మొదలైన రాగాల్లో 12 వర్ణాలు, అటతాళ వర్ణాలు కళ్యాణి, శంకరాభరణం, రీతిగౌళ, ఆనందభైరవి మొదలైన రాగాల్లో పదిహేను వరకూ ఇచ్చారు.

ఈ గ్రంథంలోని నాల్గవ ప్రకరణంలో కృతులు చాలమంది వాగ్గేయకారుల రచనలు ఇచ్చారు. ఈ ప్రకరణంలో ఉన్న ఏ రచనా స్వరపరచలేదు. కేవలం రాగ, తాళ నిర్దేశం చేసారు. ఇక ఈ గ్రంథంలోని చిట్ట చివరిది ఐదవ ప్రకరణం. ఇందులో రాగ చక్రాలు, తాళ లక్షణం, తాళ వివరాలు ఇచ్చారు.

## అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు

సంగీత పరిజ్ఞాన లేనిదే హరికథగానీ, యక్షగానం గానీ, పౌరాణిక నాటకాల్లో పద్యగానం గానీ చెయ్యలేమని సర్వజన విదితమే. హరికథ చెప్పడానికి నాలుగు కీర్తనలు, కథలు, పద్యాలు బట్టీయం వేస్తే సరిపోదు. కొంత సంగీత సాహిత్యాల పరిచయం ఉండాలి. హరికథ చెప్పడంలో ప్రథముడైన లయబ్రహ్మ ఆదిభట్ల నారాయణదాసు హరికథలు రాసారు. సంగీతానికి సంబంధించిన రచనలు కూడా చేసి వాగ్గేయకారుడయ్యాడు. మంచి గాయకుడు. అంతేకాదు, వీణ వాయించడంలో బాగా చెయ్యి తిరిగిన వాడు. పుంభావ సరస్వతిగా నారాయణదాసుగారు పేరుగాంచారు. 1864 ఆగష్టు 31వ తేదీన శ్రీకాకుళంజిల్లా అజ్జాడలో జన్మించారు నారాయణదాసు. తల్లి నర్సమ్మ, తండ్రి వెంకటచైనులు. నారాయణదాసుగారు సంగీతాభ్యాసానికి తానుగా గురువును వెదుక్కుంటూ వెళ్లనక్కర్లేకుండా అతన్ని వెతుక్కుంటూ గురువుగారే వచ్చారు. ఆ గురు శిష్య సంబంధం ఆదర్శవంతం ఏ అనుబంధానికి సరిపోల్చలేనటువంటి బంధం 1874 ప్రాంతంలో అసంఘటితంగా ఒక సంఘటన జరిగింది. అప్పుడు నారాయణదాసుగారికి 10 ఏళ్ళు. తల్లితో గలిసి నారాయణదాసు బొబ్బిలి ప్రాంతంలో ఉన్న 'వంతరాం' అనే గ్రామానికి తాత గారిని చూడ్డానికి వచ్చాడు.

వీధి అరుగుమీద కూర్చుని వచ్చేపోయే జనాన్ని చూస్తూ చూస్తూ భారత భాగవతాల్లోని పద్యాలు రాగ మాలికలాగా ఓరాగం నుండి ఇంకో రాగంలోకి మారుస్తూ పాడేస్తున్నాడు దాసుగారు. అలా పాడుతున్న నారాయణదాసును ఓ 26 ఏళ్ళ వయస్కుడు చూసాడు. ఆ పిల్లాణ్ణి మెచ్చుకుంటూ ముద్దాడి. అతని తల్లిని పిలిచి అమ్మా! ఇతణ్ణి నాతోపంపితే సంగీత విద్వాంసునిగా చేస్తాను. ఈ పిల్లవాడు మంచి గాయకుడవుతాడు. సామాన్యుడు కాడు అన్నాడు. అందుకు నారాయణ తల్లి అంగీకరించి ఆయనతో పంపించేసింది. ఆయన నారాయణదాసుని గొప్ప సంగీత విద్వాంసునిగా తయారు చేసాడు. దాసు హరికథా పితామహునిగా బిరుదులు పొంది, పేరొందాడు. పసితనంలో సంగీతం నేర్పిస్తానని పిల్లవాణ్ణి తీసుకెళ్ళిన ఆ పెద్దమనిషి బొబ్బిలి ఆస్థానవైణికులైన వాసా సాంబయ్యగారు. శిష్య వాత్సల్యాన్ని చూపిస్తూ నారాయణదాసుగారికి వీణ కూడా నేర్పి, అంతటి గొప్ప విద్వాంసునిగా చేసిన సాంబయ్యగారు నిజంగా ఆదర్శవంతులు.

సాంబయ్య ఎవర్నీ తన పనిని చెయ్యనిచ్చే వారు కాదు. చాలా నిరాడంబరుడు. ఎంత దూరమైనా తన వీణను తానే మోసుకెళ్ళేవాడు. ఆఖరికి శిష్యుల్ని కూడా వీణను పట్టుకోడానికి ఇష్టపడేవారు కాదు. వీణను సరస్వతీ దేవిగా భావించేవారు. అంతటి వ్యక్తిత్వ వికాసం గలవారు సాంబయ్యగారు. తరువాత ఆదిభట్ల వారి ఆర్థిక స్థితి సరిగా లేనందువల్ల వారి కుటుంబం అంతా బొబ్బిలి నుండి విజయనగరం వచ్చేసింది.

మహారాజాగారి పాఠకుడు - పాటకుడు నిరాఘాటం కృష్ణయ్యను సంగీతం నేర్పమని దాసుగారినప్పగించారు. దాసుగారికి అప్పటికి 12 సంవత్సరాలు.

ఆ పిమ్మట కట్టు సూర్యనారాయణగారి దగ్గరి చిన్న వీణను సంపాదించుకొని స్వయంగా సాధనచేసుకోడం మొదలుపెట్టాడు. సరళీస్వరాలు, జంట స్వరాలు, కొన్ని అలంకారాల వరకూ కట్టు సూర్యనారాయణగారి దగ్గర వీణ మీద అభ్యాసం చేసాడు. నేబరి చర్య చేసే దర్బారు విద్వాంసుడు కూడా వీణ మేళం చెయ్యడం, రెండు మూడు పిళ్ళారీ గీతాల్ని వాయించడం దాసుగారికి నేర్పాడు. ఆ విధంగా దాసుగారు వీణను వాయించడం నేర్చుకొని ప్రావీణ్యం సంపాదించారు.

అందం, అహంకారం, అందలం ఉన్న ఆనందగజపతి కళాకారులకు దాసోహమ్మని తలొంచేవారు. అలాగే తమను పోషిస్తున్నారు కదాని ప్రతీ రోజూ దర్బారుకెళ్ళి రాజదర్శనం చేసుకొని సలాంకొట్టేవారు కాదు ఆనాటి ఆస్థాన విద్వాంసులు. ఎవరి దర్పం, అభిమానం వారికుండేవి. ప్రిన్స్ చార్మింగ్ (జగన్మోహనుడని)గా పేరు పొందిన ఆనందగజపతిరాజు ఓరోజు పొద్దున్నే విహారానికి వెడుతూ ఆదిభట్ల వారిని ఫలానా రాగం పాడమని అడిగారట. దాసుగారెందుకో పాడలేదు. రాజాగారు దానికి కోపం తెచ్చుకోకుండా వెళ్ళిపోయారు.

ఆ తర్వాతెప్పుడో దాసుగారు వ్యాయామం చేస్తూ, ఇదివరకు గజపతి అడిగిన రాగాన్ని పాడటం మొదలు పెట్టారు. అప్పుడాయన శరీరం మీద గోచీ తప్ప మరేం లేదు. పరవశించిపోతూ ఏకధాటిగా మూడు నాలుగు గంటలు పాడారు. ఆ పాట వింటూ జనమంతా అలాగే నిలుచుండిపోయారు. ఆ తర్వాత కొంతసేపటికి తెలివి వచ్చేసరికి చుట్టూ ఉన్న జనాన్ని చూసి సిగ్గు పడ్డాడు ఆదిభట్ల దాసుగారు. ఆనాటి ఆయన పాట విన్నవారిలో ఆనంద గజపతి కూడా ఉన్నారు.

మంచి సఖ్యతగా మెలిగే ఆనందగజపతి, నారాయణదాసుగార్లు సాహిత్య సంగీత చర్చలు అప్పుడప్పుడు చేస్తూండేవారు. ఒకరోజు దాసుగారు గజపతి దగ్గర ఉల్లాసంగా పల్లవి పాడుతూ ఒక సంగతి వేసారు. రాజుగారు ఆనందపడిపోయి "ఏదీ ఇంకోసారి ఆ సంగతి రానీయండి" అన్నారుట.

దాసుగారు కొంచెం ఆగి, మందమలయానిలుడు ఒకసారి హాయిగా వీచడం గమనించి, మలయ సమీరుణ్ణి ఉద్దేశించి, "ఏదీ మరొక్కసారి" అని అన్నారు. ఆనందగజపతి సంగీత సారస్యాన్నెరిగినవారు, విశేషించి దాసుగారి పాట వల్లించి నేర్చిన పాట కాకుండా సహజంగా వచ్చిన సంగతి కావడం చేత ఎలాగైతే మలయ సమీరం ఒకసారి వచ్చిన తర్వాత రెండోసారి అదేవిధంగా రాదో అలాగే ఒకసారి వేసిన సంగతి మళ్ళీ వెయ్యడం సాధ్యం కాదన్న సంగతి తెలిసిన వారవడం వల్ల రాజావారు సంతసించి ఊరుకున్నారు.

నారాయణదాసుగారు విజయనగరం ప్రాంతంలో ఉన్నా ఆ సంస్థానంలో ఆస్థాన విద్వద్గౌరవాన్ని చాలా కాలం తర్వాతగానీ పొందలేదు. కారణాలనేకం. దాసుగారి ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించేందుకు రాజావారు ఎంతో దోహదపడేవారు.

నారాయణదాసుగారిని మైసూరు మహారాజా ఒకసారి తమ ఆస్థానానికి పిలిపించుకున్నారు. దాసుగారు మైసూరు రావడానికి ప్రయాణ ఖర్చులను రాజావారు ముందుగానే పంపించేసారు. దర్బారుకు ఎంతో గౌరవంగా ఆహ్వానించి హరికథను రెండు మార్లు చెప్పించుకున్నారు. రాజావారు దాంతో తృప్తిపడలేదు. వీణ వాయించమని దాసుగారిని కోరారు. దాసుగారు సరే అని ఒకరోజు నిండుకొలువులో వీణ మీద ముక్తాయింపులతో చాలా ఇంపుగా తనకున్న నైపుణ్యాన్నంతా ప్రదర్శించారు. మైసూరు మహారాజావారు ఎంతో ఆనందపడిపోయి బంగారు మురుగులు, రెండు జతల శాలువాలు, ఒక వీణ, ఒక తంబురా వెయ్యి నూట పదహార్లున్న సంచీని ఇచ్చి గౌరవించారు. ఇది రాజావారి దర్బారులో వాగ్గేయకారుడైన ఆదిభట్ల నారాయణదాసుగారికి లభించిన మొట్టమొదటి సన్మానం. ఆ కీర్తి విజయనగర భూపాలునికి దక్కుతుంది.

ఆంధ్రదేశంలో చల్లపల్లి సంస్థానం రాజావారు శ్రీరాజా అంకినీడు మల్లికార్జున ప్రసాదరావు దొరగారు ఒకసారి (క్రీ.శ. 1914లో) ఆదిభట్ల నారాయణదాసు గారిని పిలిపించుకొని కథాగానం చెయ్యమన్నారు. కథాగానంతో బాటూ వీణ కూడా వాయించడం విని రాజావారు ఆశ్చర్యపడ్డారు. వీణ వాయించడంలో కొత్తతరహాను ప్రదర్శించారు దాసుగారు. కుడి ఎడమ చేతుల సమ విషమ జాతుల వీణను వాయించారు. కుడి చేత్తో ఒక దరువు, ఎడం చేత్తో ఒక దరువు ఒకేసారి వేసేసరికి అద్భుతమనిపించింది. ఇది ఎవరికీ చేతనైన పనికాదని దాసుగారికి మాత్రమే సాధ్యమైందని మెచ్చుకున్నారు చల్లపల్లి రాజావారు. నారాయణదాసు ప్రసాదరావుగారి సమక్షంలో షణ్ముఖిరాగాన్ని వాయించి మెప్పు పొందారు. అందుకు కానుకగా చల్లపల్లి రాజావారు 24 నవరసుల (కారెట్స్) బంగారంతో గండపెండేరాన్ని చేయించి దాసుగారి కాలికి స్వయంగా తొడిగి తమ రసికతను ప్రకటించుకున్నారు. ఆ తర్వాత గజారోహణ ఉత్సవాన్ని దగ్గరుండి జరిపించారు.

హరికథా పితామహునిగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న ఆదిభట్ల నారాయణ దాసుగారు వీణ వాయించి ఎన్నో సంస్థానాల్లో సన్మానితులయ్యారు. బంగారు కంకణాలు దుశ్శాలువలు సన్మాన పత్రాలు పొందారు. గ్రామ్ ఫోన్ రికార్డింగ్ ఇంకా అంతగా ప్రచారం లేని రోజుల్లో మన దేశంలో దాసుగారి చేత ప్రత్యేకంగా కొన్ని పాటలు పాడించి ఫోనో గ్రాఫ్ రికార్డు చేసారు. కానీ వీటి తాలూకు సమాచారం ఏమీ మిగల లేదు.

నారాయణదాసుగారి ప్రతిభ గురించి ఇతర సంస్థానాధిపతుల సమక్షంలో తెలుసుకున్న విజయనగర ప్రభువు దాసుగారిని తమ ఆస్థాన విద్వాంసునిగా నియమించారు. పిమ్మట దాసుగారి ప్రోద్బలం వల్లనే విజయనగరంలో మహారాజా సంగీత కళాశాలను స్థాపించినట్లు విజ్ఞులు చెప్తారు. ప్రప్రథమ అధ్యక్షులు దాసుగారే. పుంభావ సరస్వతి అయిన నారాయణదాసుగారు ఎన్నో హరికథలే కాకుండా చాలా శాస్త్ర గ్రంథాల్ని కూడా రాసారు. యక్షగానాలు రాసారు. ఋగ్వేదంలో కొన్ని ఋక్కుల్ని తీసుకొని వీణకు అనుకూలంగా "ౠక్కుబడి" అనే పేరు మీద ఒక గ్రంథాన్ని రాసారు. జన్య జనక రాగాలనుపయోగించి దేశీయ రాగాలనుపయోగించి హరికథలు రాయడమే కాదు 'పంచముఖిరాగతాళ ప్రబంధ స్వరూపదర్శిని' (అపూర్వ రాగతాళ ప్రబంధం) "దశవిధరాగ నవతికుసుమ మంజరి" (సంగీత సాహిత్య ప్రబంధం) సంగీత తాళాలకు, సంగీత రాగాలకూ సంబంధించిన గ్రంథాలను రాసారు. సంగీతవేత్తలూ, వాగ్గేయకారులు వెంకటమఖి, దీక్షితులు రాసిన చతుర్దండి ప్రకాశిక, సంగీత సంప్రదాయ ప్రదర్శిని లాంటి గ్రంథాల్లో కనిపించే రాగాలు దాసుగారి గ్రంథంలో గోచరిస్తాయి.

ఆదిభట్ల నారాయణదాసుగారి దగ్గర ఆయన మనుమడైన కర్రా సూర్యనారాయణ ఈ పుస్తకాలు రాతప్రతిని ఒకసారి చూడటం తటస్థించింది. దాన్ని దాసుగారు సూర్యనారాయణగారి కిచ్చి చదివించారు. "తాతా! ఇది చాలా వింత గ్రంథం తయారు చేసావు" అని అన్నాడు సూర్యనారాయణ. దానికి సమాధానంగా దాసుగారిల్లా అన్నారు.

"ఈ గ్రంథం సంస్కృతాంధ్ర వాఙ్మయానికి, కర్ణాటక సంగీతానికి, విజ్ఞానానికీ తుది మెట్టురా! అని"[47] ఈ నవతి కుసుమ మంజరి కొరుకుడు పడని గ్రంథమని చాలామంది ఒప్పుకున్నారు. "ఈ గ్రంథానికి ఉపోద్ఘాతం రాయమని శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారికీ సంగీత శేఖరులు పారుపల్లి రామకృష్ణయ్యపంతులుగారికీ, కర్రా సూర్యనారాయణగారిచ్చారు. దానికి సమాధానంగా శ్రీ ద్వారం వారు "బాబూ! ఇట్టి గ్రంథానికి తొలి పలుకు రాయడానికి అర్హుడనుకాను అనీ, రామకృష్ణయ్య పంతులు గారు తాము అసమర్థులమని పుస్తకాన్ని తిరిగి ఇచ్చేశారని కర్రా సూర్యనారాయణగారు ముందు మాటలో రాసారు. ప్రొ. సాంబమూర్తిగారు కూడా సాధ్యపడలేదని సమాధానమిచ్చారు."[48] దశవిధ రాగనవతి కుసుమమంజరికి పీఠిక ఎవరు రాసారో వారి పేరు లేదు. వివరణ మాత్రం ఇలా ఉంది.

"ఇందు మేళకర్తరాగాలు, జన్యరాగాలు, మొదలైనవి ప్రతిగాయకుడు, ప్రతి జంత్రవాద్యకారుడు వారి

వారికి వీలైన పనితనం, శ్రుతుల్లో, పరిశుద్ధ తాళాలలో మంచి పని తనం ఏర్పడటానికి రాసారు. ప్రస్తుతం ఇలాంటి సంగీత రచనలు చేసేవారు గానీ వాటిని స్వరపరచి శబ్దాలను పొందు పరచి ఈ విధంగా రాసిన వారు గానీ లేరు. ఇవి పాడినందు వల్ల మంచి శ్రుతి విచక్షణ, మంచి తాళ విచక్షణ ధారాళంగా అలవడతాయి. "దాసుగారు 'పంచముఖి' దశవిధ రాగనవతి కుసుమ మంజరిని క్రీ.శ. 1914లో రాసి 1933లో సమగ్రమైన రూపకల్పన చేసి మహారాజా వారి కళాశాలలో ప్రదర్శించినట్లు తెలుస్తోంది".[49]

ఆదిభట్ల నారాయణదాసుగారు ముట్నూరి సంగన్నగారు ఇద్దరూ సమఉజ్జీలు. ఒకప్పుడు ముట్నూరివారి విషయంలో నారాయణదాసుగారికి మాటా మాటా పట్టింపు వచ్చింది. ఆ సందర్భంలో భంగపాటు పడిన ముట్నూరి సంగన్న గారికి నారాయణ దాసుగారిని ఎలాగైనా ఢీకొనాలనే తాపత్రయం పెరిగింది. సాధన చేస్తే సాధ్యం కానిదేదీ ఈ లోకంలో ఉండదనే లక్ష్యంతో సంగన్నగారు తనకుమారుడు సూర్యనారాయణను నారాయణదాసుగారికంటే గొప్పగా తయారు చేసాడు. ఆదిభట్ల నారాయణదాసుగారి సమక్షంలో పంచముఖిని ప్రదర్శించి ఆ మహామహుని దీవనలందుకున్నాడు సూర్యనారాయణ. డా. శ్రీపాద పినాకపాణిగారు పంచముఖిని ప్రదర్శించే పద్ధతిని ఇలా వివరించారు.

"ప్రదర్శకుడు ఒక కుర్చీ మీద కూర్చుండగా అతని తమ్ముడు నేలపై కూర్చుని హార్మోనియం మీద పాట వాయిస్తూండగా పంచముఖి ప్రదర్శకుడు, అదేపాట పాడుతూ ఎడమచేతితో - త్రిశ్రజాతి లఘువు, కుడిచేత్తో - చతురస్ర జాతి లఘువు, ఎడమ పాదంతో ఖండజాతి లఘువు, కుడి పాదంతో - మిశ్రజాతి లఘువు, రెండు చంకలతోనూ సంకీర్ణ జాతి లఘువు, ఈ విధంగా ఒకేసారి తాళం వేస్తూ వుంటారు. శ్రోతల్లో ఒక్కొక్క విద్వాంసుడు ఒక్కొక్క జాతి లఘువు తాను వేసుకుంటూ సరిగ్గా లఘువు నడుస్తున్నదీ లేనిదీ గమనిస్తూ వుంటాడు.

నా మట్టుకు నేను ఖండజాతి లఘువును పరీక్షించాను. పాట ముగిసే సరికి పంచముఖాలు అంటే 5 జాతుల లఘువులు అక్షరాలేవీ మిగలకుండా మించకుండా సరిగా పూర్తవుతాయి. పాట, తాళపు లఘువులు ఒకేసారి ముగింపుకు వస్తాయి. ఇదీ పంచముఖ ప్రదర్శనం. ఏపాటి తడుముకోకుండా, కంగారు పడకుండా సునాయాసంగా ముట్నూరి సూర్యనారాయణగారు ప్రదర్శించిన పంచముఖిని చూసిన ప్రేక్షకుల కరతాళ ధ్వనులు ఆనందంతో, మిన్నుముట్టాయి."[50]

అప్పుడు ఆదిభట్ల నారాయణదాసుగారికి గతం గుర్తుకొచ్చి తనపై ఈ విధంగా కోపాన్ని తీర్చుకున్నందుకు లోలోన ముట్నూరి సంగన్నగారిని మెచ్చుకుంటూ ప్రదర్శించిన సూర్యనారాయణను అభినందించి ఆశీర్వదించారు.

## దశవిధరాగ నవతికుసుమ మంజరి (సంగీత సాహిత్య ప్రబంధము)

సంగీతమనే వ్యవసాయ క్షేత్రంలో కఠోర వ్యవసాయం చేసి పండించిన పంటే ఈ దశవిధ రాగనవతికుసుమ మంజరి. దాసుగారు యాత్రలకు వెళ్ళినప్పుడు కన్యాకుమారిలో దేవీ దర్శనం చేసుకొని దేవీ స్తవరూపంలో ఈ మంజరిని రాసినట్లు ఎస్వీ జోగారావుగారు సంపాదకీయంలో రాసారు"[51] 1933లో నారాయణదాసుగారు దీనిని కళాశాలలో ప్రదర్శించారు.

గాంధర్వవేదాన్ని ఆకళింపు చేసుకొని పూర్వాచార్యులు, సంగీత లాక్షణికులు, వాగ్గేయకారులు మొదలైన వారి రచనలను పరిశీలించి, ఆ పరిశీలనా జ్ఞానంతో రాసిన రచన ఈ కుసుమ మంజరి. అక్కడక్కడా ప్రాచీనుల గ్రంథాలలో మంజరి లాంటి రచనలున్నాయి. ప్రస్తుతం ఆధునిక కాలంలో ఇలాంటి రచనలు చేసిన వారు లేరని చెప్పవచ్చు.

సర్వ తాళాత్మక పంచజాత్యేకతాళంగా కూర్చిన నవతి కుసుమ మంజరి అనే సంగీత సాహిత్య ప్రబంధంలో ఆదిభట్ల నారాయణదాసుగారు తొంభైరాగాలను సంగీతలోకానికి పరిచయం చేసారు. అవి సర్వ సంపూర్ణరాగాలు, సంపూర్ణ ఔడవ, షాడవ సంపూర్ణ, ఔడవ షాడవ, శుద్ధ ఔడవ, శుద్ధ షాడవ రాగాలుగా మొత్తం పదిరకాల విభజన చేసారు. మళ్ళీ అందులో ఒక్కొక్క విభజన క్రింద తొమ్మిది రాగాలను ఆయా సంబంధి రాగాలను పేర్కొంటూ కుసుమాలహారం చేసారు. ఆయా విభజనల క్రింద రాగాలతో సహా మొత్తం తొంభై రాగాలయ్యాయి. ఆ విభజన ఈ క్రింది విధంగా ఉంది.

ఎ) సర్వ సంపూర్ణరాగాలు - 9

ఆరోహణ, అవరోహణలలో సప్తస్వరాలు ఉంటే అవి సర్వసంపూర్ణ రాగాలవుతాయి.

ధీర శంకరాభరణం - 72 మేళకర్తరాగాలలో 29వ మేళకర్తరాగం ఇది; నటభైరవి - 72 మేళకర్తరాగాలలో 20వ మేళకర్త రాగం; శ్యామలాంగి - 55వ మేళకర్తరాగం; సరసాంగి - 27వ మేళకర్తరాగం; కీరవాణి - 21వ మేళకర్తరాగం, పావని - 41వ మేళకర్తరాగం; రూపవతి - 12వ మేళకర్తరాగం; గాయకప్రియ - 13వ మేళకర్తరాగం; జ్యోతి స్వరూపిణి - 68వ మేళకర్తరాగం; ఈ క్రమంలో వచ్చిన రాగాలన్నీ జనకరాగాలు. అవే మేళకర్త రాగాలు, 9 మేళకర్తరాగాల పేర్లు మొదటిగా పరిచయం చేసారు.

బి) సంపూర్ణ షాడవములు - 9

షాడవం అంటే ఆరు. ఆరోహణలో సప్త స్వరాలు ఉండి అవరోహణలో మాత్రం ఆరు స్వరాలున్న రాగాలు సంపూర్ణ షాడవరాగాలవుతాయి.

జీవరంజని - 2వ మేళకర్త రత్నాంగి రాగ జన్యం ఇది; తిలక ప్రకాశిని - 6వ మేళకర్త తానరూపి రాగ జన్యం; గీత ప్రియ - 13వ మేళకర్త గాయక ప్రియ జన్యం; పద్మరాగం - 27వ మేళకర్త సరసాంగి జన్యం; కుసుమప్రియ - 27వ మేళకర్త సరసాంగి జన్యం; గీతమూర్తి - 33వ మేళకర్త గాంగేయ భూషణ రాగ జన్యం; దుందుభిప్రియ - 48వ మేళకర్త దివ్యమణి రాగజన్యం.

సి) షాడవ సంపూర్ణ రాగములు - 9

ఆరోహణలో ఆరు స్వరాలుండి అవరోహణలో సప్తస్వరాలున్నట్లైతే ఆరాగాలు షాడవ సంపూర్ణ రాగాలవుతాయి.

నవరత్న భూషణ - 63వ మేళకర్త 'లతాంగి' జన్యం; సింహవాహిని - 27వ మేళకర్త 'సరసాంగి' జన్యం; కాంభోజి - 28వ మేళకర్త హరి కాంభోజి జన్యం; జయనారాయణ - 22వ మేళకర్త ఖరహర ప్రియజన్యం; వీణాధరి - 16వ మేళ కర్త చక్రవాక జన్యం; కౌమారి - 11వ మేళకర్త - కోకిలప్రియ జన్యం; నిరంజని - 10వ మేళకర్త నాటక ప్రియ రాగ జన్యం; మనోరంజని - 5వ మేళకర్త మానవతి జన్యం.

డి) సంపూర్ణౌడవములు - 9

ఔడవం అంటే ఐదు అని అర్థం. సప్త స్వరాలు ఆరోహణగాను ఐదు స్వరాలు మాత్రమే అవరోహణగానూ ఉంటే ఆ రాగం సంపూర్ణౌడవం అవుతుంది.

లలితగౌరి - 15 మాయామాళవగౌళ జన్యం; రమ్య పంచమం - 25 - మార రంజని జన్యం; గరుడధ్వని - 29 - ధీరశంకరా భరణ జన్యం; లలిత గంధర్వ - 30 - నాగానందిని జన్యం; నాట - 36వ మేళకర్త - చలనాట

జన్యం; హేమాంబరి - 58 - హేమావతి జన్యం; సీమంతిని - 57 - సింహేంద్ర మధ్యమ జన్యం; రసమంజరి - 72 - రసికప్రియ జన్యం; సారమతి - 20 - నఠభైరవిజన్యం.

ఇ) ఔడవ సంపూర్ణములు - 9

ఆరోహణలో 5 స్వరాలుండి అవరోహణలో సప్త స్వరాలుంటే అవి ఔడవ సంపూర్ణ రాగాలవుతాయి.

సునాదప్రియ - 57 - సింహేంద్ర మధ్యమజన్యం; కంకణాలంకారి - 52 - రామప్రియ జన్యం; బిలహరి - 29 ధీర శంకరాభరణ జన్యం; ఆరభి - 29 ధీర శంకరాభరణ జన్యం; కేదార గౌళ - 28 హరికాంభోజి జన్యం; గౌరి - 15వ మేళకర్త మాయామాళవగౌళరాగ జన్యం; ధన్యాసి - 8 హనుమత్తోడి - జన్యం, శృంగారిణి - 6 - తానరూపిజన్యం; ఘనశ్యామల - 5 - మానవతి జన్యం.

ఎఫ్) శుద్ధ షాడవములు

ఆరోహణ అవరోహణల రెండింటిలోనూ ఒకే రకానికి చెందిన ఒక స్వరం వర్జింపబడితే ఆరాగానికి శుద్ధ షాడవమని పేరు.

తోడి - 8వ మేళకర్త, హనుమత్తోడి రాగ జన్యం; ఇది ఒకప్పుడు షాడవరాగం. కానీ ప్రస్తుత కాలంలో పంచమాన్ని చేర్చి సంపూర్ణ రాగంగా పాడుతున్నారు. వాగీశ్వరి - 1వ మేళకర్తలలో కనకాంగి రాగ జన్యం; వాగీశ్వరి - ఇది 6వ 'ఋతు' చక్రంలో 4వ మేళము; గురుప్రియ - 64వ మేళకర్త వాచస్పతిరాగ జన్యం; కలకంఠి - 13వ మేళకర్త గాయక ప్రియ రాగజన్యం; లలిత - 15వ మేళకర్త మాయామాళవగౌళరాగ జన్యం; మలయమారుతం - 16వ మేళకర్త చక్రవాకరాగ జన్యం; శ్రీరంజని - 22వ మేళకర్త ఖరహరప్రియ జన్యం; హంసానంది - 53వ మేళకర్త గమనశ్రమరాగజన్యం; రవి స్వరూపి - 63వ మేళకర్త లతాంగిరాగజన్యం.

జి) షాడవౌడబములు

ఆరోహణలో ఆరు స్వరాలు, అవరోహణలో ఐదు స్వరాలు గల రాగాలు షాడవౌడవ రాగాలే.

ఉత్తరిరాగం - 64వ మేళకర్త వాచస్పతి రాగ జన్యం; విజయరత్నాకరి - 60వ మేళకర్త నీతిమతి రాగజన్యం; నవరసచంద్రిక - 49వ మేళకర్త ధవళాంబరి రాగజన్యం; స్వరాభరణం - 49వ మేళకర్త ధవళాంబరి జన్యం; కోకిలస్వరావళి - 41వ మేళకర్త పావని రాగజన్యం; నాగభూషణ - 29వ మేళకర్త ధీరశంకరాభరణ రాగ జన్యం; నాటకురంజి - 28వ మేళకర్త హరి కాంభోజి జన్యం; చంద్రికాగౌళ - 8వ మేళకర్త హనుమత్తోడి రాగజన్యం; నవరస - 15వ మేళకర్త మాయామాళవగౌళరాగ జన్యం.

హెచ్) ఔడవ షాడవములు

ఆరోహణలో ఐదు స్వరాలు, అవరోహణంలో ఆరు స్వరాలు ఉన్న రాగాలు ఔడవ షాడవ రాగాలు.

సుగాత్రి - 4వ మేళకర్త వనస్పతి రాగ జన్యం, మలహరి - 15వ మాయామాళవగౌళ జన్యం; జగన్మోహిని - 15వ మేళకర్త మాయామాళవ గౌళరాగ జన్యం; వసంత - 15వ మేళకర్త మాయామాళవగౌళ జన్యం; రుద్రప్రియ - 22వ మేళకర్త ఖరహర ప్రియ రాగ జన్యం; నారాయణి - 28వ మేళకర్త హరి కాంభోజి రాగ జన్యం; సామ - 28వ మేళకర్త హరి కాంభోజి రాగ జన్యం; తపస్విని - 52వ మేళకర్త రామప్రియ రాగ జన్యం; సరస్వతి - 64వ మేళకర్త వాచస్పతి రాగ జన్యం.

ఐ) శుద్ధౌడవములు

ఆరోహణ, అవరోహణలలో రెండింటిలోనూ రెండు స్వరాలు వర్జింపబడితే అది శుద్ధౌడవ రాగమవుతుంది. ఒకే రకానికి చెంది అవి ఒకే స్వరాలయి ఉండాలి.

సునాదవినోదిని - 65వ మేళకర్త మేచ కళ్యాణి రాగ జన్యం; హంసధ్వని - 29వ మేళకర్త ధీర శంకరాభరణ రాగ జన్యం; నాగస్వరావళి - 28వ మేళకర్త హరి కాంభోజి రాగ జన్యం; మేఘ రంజి - 15వ మేళకర్త మాయామాళవగౌళ జన్యం; మోహన - 28వ హరికాంభోజి జన్యం; పున్నాగ - 8వ మేళకర్త హనుమత్తోడి జన్యం; సురవరాళి - 13వ మేళకర్త గాయక ప్రియ జన్యం; మధ్యమావతి - 22వ మేళకర్త ఖరహర ప్రియ రాగ జన్యం.

జె) వక్రరాగములు

పున్నాగ వరాళి - 8వ మేళకర్త హనుమత్తోడి జన్యరాగం; ఆనందభైరవి - 20వ మేళకర్త నఠభైరవి రాగజన్యం, ముఖారి - 22వ మేళకర్త - ఖరహరప్రియ రాగ జన్యం; నీలాంబరి - 29వ మేళకర్త - ధీరశంకరాభరణ రాగ జన్యం; భవాని రాగం - 44వ మేళకర్త భవప్రియ రాగ జన్యం; జనరంజని - 28వ మేళకర్త - ధీరశంకరాభరణరాగ జన్యం; చాముండి - 63వ మేళకర్త లతాంగి రాగజన్యం; ఫలదాయకి - 64వ మేళకర్త వాచస్పతి రాగజన్యం; మంజరి - 22వ మేళకర్త ఖరహరప్రియ రాగ జన్యం. ఈ రాగాలలో ఎన్నో అపురూప రాగాలు, వెలుగు జూడని రాగాలున్నాయి. ఈ రాగమాలికా ప్రబంధాన్ని ఇన్ని రాగాలతో కూర్చడంవల్ల సంగీత విద్వాంసులు దీన్ని సాధన చేస్తే వారికి సంగీతంలో అసాధ్యమైన అంశం ఏదీ ఉండదు. రాగమాలికవల్ల ప్రయోజనం అంతకన్నా ఇంకేముంటుంది?

ఈ రాగ విభజనలో ఏయే రాగాలు ఏయే మేళకర్త రాగజన్యాలో ఎన్నవ మేళకర్తరాగ జన్యమో ఇవన్నీ ప్రక్కనే సూచించారు. ఇప్పటి వరకూ రాసిన రాగాలతో కూర్చిన వాక్యాలు అమ్మవారిని స్తుతిస్తూ రాసినవి. స్తుతులు రాగాల పేర్లతోనే రాసారు. రాగ నిర్దేశమే కాకుండా ఏరాగంలో ఏయే స్వరాలొస్తాయో కూడా ఆ వాక్యాల మీదనే ఆ స్వరాక్షరాల పైన సూచించారు. స్తుతి పూర్ణమైన కుసుమ మంజరిని మరొక భాగంలో "పై నుండి క్రిందికి" అంటే 90 నుండి 89, 88, 87 వచ్చే విధంగా వాక్యాలను మార్చి రాసారు. ఈ వాక్యాలు సాహిత్యాత్మకంగా ఉన్నాయి.

రాగాత్మకంగా చేసిన స్తుతిలో చివరి వాక్యం "దశవిధరాగ కుసుమ మంజరి" అనే వాక్యానికి కలుపుతూ 90" అని నినువినయముగ వినుతి సలిపెదనంబిక దయ జూడుమమ్మ! అనీ.

89 జగంబుల గన్న జననివి త్వదీయ చరణ సరోజము నమ్మితి;

88 ద్వరగా భవాబ్ధి దరించి సుఖింతు, దయతో దర్శనమిడుమా...52 ఈ విధంగా సాగుతుంది సాహిత్యాత్మక స్తుతి. స్వర నిర్దేశం ఈ వాక్యాలకు ఉన్నది కాని రాగ నిర్దేశం చెయ్యలేదు. స్వరాలకు పైన అవి ఏయే స్వర స్థానాలో రాసారు. మిగిలిన సాహిత్య భాగంలోని భావం "అమ్మా! నిన్ను దయగల దానవని నమ్మాను. ఈ జన్మకు విముక్తి ప్రసాదించు తల్లివి నీవే. ఇందులో నుండి విముక్తి పొందాలనే మానవప్రయత్నమంతా విఫలమే. నీదయ వుంటేనే అది సాధ్యమౌతుంది. దయాహీనుడనై, అజ్ఞానంతో దుర్మార్గంగా అవినీతిపరుడనై గర్వితుడనై, లుబ్ధుడనై సంచరిస్తున్నాను. నా దురితాలను రూపుమాపే జ్యోతివి నీవు - కొరమాలిన విషయాసక్తుడనై భోగరతులతో ఉన్నాను. ముదుసలినైనప్పటికి లేజవ్వనులను చూసి మోహితుడనై ఛీఛీ అని అనిపించుకొన్నాను. దంభం కోసం స్వార్థపరుడనై శాస్త్ర సారాన్ని గ్రహించి దుర్వినియోగ పరిచాను. నిజానికి బ్రతుకు, ధనము, చదువు, కీర్తి ఇవన్నీ కూడా బుద్బుదప్రాయాలని తెలిసి కూడా జనన మరణ ప్రవాహంలో కొట్టుకుంటూ పోతున్నాను..." ఈ విధంగా అశాశ్వతమైన ఐహిక విషయ వాంఛాలోలుడైన వ్యక్తికి జ్ఞానోదయాన్ని కలిగించే విధంగా సాహిత్యం రాసారు.

అపూర్వ రాగాలతో కూడిన సాహిత్యాత్మక ప్రబంధం ఈ కుసుమ మంజరి తౌంబైరాగాలతో పంచజాతుల తాళాలతో - సర్వతాళాలతో కూర్చిన ప్రక్షిప్తమైన ప్రబంధం కాబట్టి సంగీత సాహిత్యాత్మక ప్రబంధమే ఇది. దీనిని లక్ష్యలక్షణ గ్రంథం అనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఆదిభట్ల నారాయణదాసుగారి మరో సంగీత రచన స్వరజతులు. ఈ స్వరజతులు ఎక్కడా ప్రచురించినట్లు లేదు. నాకు లభ్యమైంది నకలు ప్రతి"[53] ఇందులో ఒకటి శంకరాభరణ రాగం - మిశ్రచాపు తాళంలోను, రెండోది అఠాణ రాగం - చతురస్రజాతి రూపక తాళంలోనూ ఉన్నాయి. రెండింటిలోని వస్తువు మహారాజునుద్దేశించి రాసినట్లు గమనించవచ్చు.

స్వరజతులకు సర్వ సాధారణంగా పల్లవి, అనుపల్లవి, చరణం భాగాలుగా ఉంటాయి. చరణాలలో వేరు వేరు ధాతువులుంటాయి. కొన్ని స్వర జతులు అనుపల్లవి లేకుండా ఉంటాయి. ఇందులో వస్తువు భగవంతునికి గాని ప్రసిద్ధ రాజన్యులకు సంబంధించినది గానీ భక్తి లేక శృంగార రస స్ఫూర్తితో కూడి ఉంటుంది.

ఆదిభట్ల నారాయణ దాసుగారు రాసిన స్వర జతులు రెండూ ఆనంద గజపతి కుమారుడైన విజయరామ గజపతిని కొనియాడుతూ రాసినవి. రెండు స్వర జతులూ కూడా స్వరపరచినవే.

ఆదిభట్ల నారాయణదాసుగారి రచన శంకరాభరణం రాగం మిశ్ర చాపుతాళం - స్వరజతి

పల్లవి : "రామ చంద్రునిన్ సరిగాన్సేవింపగా వలెన్
సదా మదిన్ సమస్త జనులున్ సీతా"

ఆ విధంగా అటు రామచంద్రుని ఇటు విజయరామచంద్రుని ఉద్దేశించి రాసారు. ఇందులో పల్లవి, చరణాలూ మూడు ఉన్నాయి. నిరుపమానమైన విజయరామరాజు సంగీత పాఠశాలను నిర్మించిన ఉత్తముడుగా ఆయన్ని ఆదిభట్ల వారు కీర్తించారు. చరణాలలోని సాహిత్యం అదే విధంగా వుంది.

ఇక రెండవ స్వరజతి అఠాణ రాగంలో చతురశ్రజాతి రూపకతాళంలో

"శ్రీరమణీశ దయనేలరా ఆనందా శుభకర" అంటూ మరాళి దొరనని పరాకు చేయవద్దు. అన్ని విషయాలలోనూ ఆదుకుంటున్న నీవు భగవంతునివని నమ్ముకున్నానని ఆనంద గజపతి కుమారుని కీర్తించారు. రెండవ చరణం చివరి పాదం లోపించడం వల్ల కొంత భాగం లేదు. మిగిలిన దానిలో పల్లవి, ఆ తర్వాత మూడు చరణాలు ఉన్నాయి. అనుపల్లవి లేదు. ఇవి ఆనాటి కాలంలో బాగా ప్రచారంలో ఉన్నాయి. హరికథలెన్నో రాసినా సంగీతానికి సంబంధించిన రచనలు కూడా చేసి వాగ్గేయకారునిగా ప్రసిద్ధికెక్కారు ఆదిభట్ల వారు.

## దువ్వూరి జగన్నాథశర్మ
## స్వరరాగ సుధాకరము

సంగీత శాస్త్ర సంబంధ గ్రంథాలు విజయనగరం సంస్థానంలోని ఆస్థాన విద్వాంసులు కొన్నింటిని రాసారు. అలాంటి గ్రంథాలలో "స్వరరాగసుధాకరం" ఒక లక్షణ గ్రంథం. ఈ గ్రంథాన్ని రచించిన విద్వాంసుడు దువ్వూరి జగన్నాథశర్మ. ఈయన విజయరామగజపతి సంస్థాన గతమైన సంగీత కళాశాలలో భరతనాట్యాచార్యునిగా పని చేసాడు.

స్వరరాగసుధాకరం గ్రంథం మొత్తం లభ్యం కాలేదు. లభించిన మేరకు 'రాగమేళ ప్రశంస' అధ్యాయం వుంది.[54]

స్వరరాగ సుధాకరంలో గ్రంథకర్త తన వివరాలు ఇలా చెప్పుకున్నాడు.

"శ్రీ విజయ రామగజపతి
సంస్థ స్సంగీత కళాశాలాయాం
భరతా చార్యేణ తు - దు
వ్వూరి జగన్నాథ శర్మణారచితమ్"55

లభ్యమైన అధ్యాయంలో రాగలక్షణ సమన్వయం గురించి వివరించాడు. పూర్వ సంగీత లక్షణకారులు చెప్పిన లక్షణాలను చెప్తూ సమన్వయం చేసి తెలుగులో ఆయారాగ లక్షణాలు రాసాడు. పూర్వీకులు చెప్పిన సంస్కృతంలోని లక్షణాలు యథాతథంగా తీసుకున్నాడు. స్వరరాగ సుధాకర గ్రంథ ప్రతిజ్ఞలో నాదాత్మకుడైన, నటరాజ స్వరూపుడైన ఈశ్వరుని ప్రార్థిస్తాడు రచయిత.

సంగీతకాచార్యులు భరత, దత్తిల, కంబళాశ్వతర, మతంగ, నారద హనుమద్వాష్టిక, విశ్వావసు, విశాఖిల, త్రిలోచన, సోమేశ్వర, నాన్యదేవ, శార్ఙ్గదేవ, పార్శ్వదేవ, లోచన, సర్వజ్ఞసింహ, కల్లినాథ, విఠల, తానభట్ట, భావభట్ట, హృదయనారాయణ మొదలైన ద్వావింశతి సంగీతకాచార్యులను స్మరిస్తాడు.

ఆ తర్వాత "మదీయాను పూర్వశ మండ్రంగి నామాగ్రహార నిర్మాతరం రాగ విబోధ కర్తారం సోమనాథం ప్రాంజలి పురస్సరం అనతోస్మి."56

రామామాత్యులు, సోమనాథుడు, వేంకటేశ్వర దీక్షితులు, తులజేంద్రాదులు ప్రతిపాదించిన స్వరమేళ కళ, రాగవిబోధ, సంగీత సుధ, చతుర్దండిక, సంగీత సారామృతం మొదలైన గ్రంథాలలో వున్న తౌర్యత్రిక, ఉపరంజిక, శుద్ధ - ఘన - నయ దేశ్య లక్షణ లక్షితాలైన అనేక రాగాలను, తొంభైఎనిమిది మేళాలను పండితులు, గ్రామ్య జనులు వుపయోగించే ప్రయోగాలు, వాటి వాటి ప్రాచీనత, భిన్న దేశ వ్యవహారం వీటన్నింటినీ తెలుసుకున్నాను. ఈ ప్రకారంగా స్వర రాగ సుధాకరంలో సప్త వింశతి రాగాలను శ్రుతిస్వర పథకాలను స్పష్టంగా వివరిస్తున్నానని "ప్రతిజ్ఞ"57 లో చెప్పుకున్నాడు గ్రంథకర్త.

శుద్ధ నాటి

శ్లో - దాద - నీని - మ - పా - రీరి
గాగ - నట్యోఽస్తు శోభదా
నాటసా మంత విఖ్యాతౌ
చల - శుద్ధాఖ్య - నాటకౌ

క - ధా - రీ - షట్శ్రుతి
మప - శుచి
గాంధారంబంతర సమాఖ్య దనరంగ
నిషాదారావంబది - కాకలి
యైరహివహియించె నాట యంత్రమగుచున్

ఇది శుద్ధ నాటికి జగన్నాథశర్మ చెప్పిన లక్షణం. దీనికి తార్కాణంగా రామామాత్యుడు స్వరమేళ కళానిధిలో, సోమనాథుడు రాగవిబోధలో; రఘునాథ భూపాలుడు సంగీత సుధలో, వేంకటేశ్వర దీక్షితులు చతుర్దండి ప్రకాశికలో, తులజేంద్రుడు సంగీత సారామృతంలో మేళ లక్షణాన్ని ఏవిధంగా వివరించారో ఆ నిర్వచనాలన్నీ పేర్కొన్నాడు. ఈ నిర్వచనాలన్నీ సంస్కృతంలో ఉన్నాయి. ఈ నిర్వచనాలన్నిటి సమన్వయమే జగన్నాథశర్మ తన గ్రంథంలో చేసాడు. దేశాక్షికి లక్షణం ఈ విధంగా చెప్పాడు.

శ్లో "రీరి - గాగ - ప - ధా - నీని
స - మ - శూలిని మేళకః
నేత్ర మేశ్రో ఒయమస్మాక
మథాద్దేశాక్షి నామకః -

గీ శుద్ధములు స - మ - పా - లు
షట్ శ్రుతి రిషభము
పంచ - ధా
యంతరిక - గా సమంచితముగ (
గాకలి - ని - గూడ
దేశాక్షిఘనత గాంచె
నంధ్రజంబయి యెల్లెడ నసము వడసె"58

వచనంగా రామామాత్యాది ఆచార్య పంచకం దేశాక్షి మేళ లక్షణాలు ఏ విధంగా ఇచ్చారో ఆ లక్షణాలనే ఆయా గ్రంథాల నుండి తీసి రాసారు. అయితే అన్ని మేళాలకూ ప్రతి లాక్షణికుడూ లక్షణం చెప్పలేదు. కాని చెప్పిన ప్రతి మేళానికీ అందరూ ఇంచుమించుగా ఒకే లక్షణాన్ని చెప్పారు. అక్కడక్కడ పేరు మాత్రమో లేదా మరొకటో కించిన్మాత్రం భేదం కనిపిస్తుంది. ఇచ్చిన లక్షణాలు సంస్కృతంలో ఉన్నాయి. వాటిని జగన్నాథశర్మ సంస్కృత శ్లోకంలో, తెలుగులో కందం, గీతం, వచనం, ఆట వెలది మొదలైన పద్యాలలో చెప్పాడు. నాకు లభ్యమైన గ్రంథంలో ఇంకా కర్ణాటగౌళ, చౌళసామంత, సారంగ, చౌళకళ్యాణి, ఆంధ్రకాంభోజి (చౌళకాంభోది సగం మాత్రమే వుంది) తర్వాత సామవరాళి, ముఖారి రాగలక్షణాలు ఉన్నాయి.

"కర్ణాటగౌళకు శుద్ధ - స - మపాలు దనరి
షట్ శ్రుతి రిషభము
కైశికి నిషాదము +
అంతరగాఁజెలంగి"59 ఆంధ్ర భాగంలో కర్ణాటగౌళ ముందు ఏర్పడింది - దీనికి స్వరమేళ కళానిధి, రాగవిబోధ, తులజేంద్ర ఈ మూడింటిలోనే దీని లక్షణం ఉంది -

అలాగే చౌళ సామంతం రాగంలో

శ్లో : దాద - నీని - స - రీ - గాగ
మ - పా - సామన్త చౌళకః
నాగనందిని సైవ స్యాత్
4 చతుర్థో మేళ పంక్తి షు

గీ శుద్ధములు స - మ - పా - లు
షట్ శ్రుతి - ధ - గలిసి
కాకళి షాదక +
అంతరగా - ల మీద
పంచరీ - సమవాదక పక్కి
రతిగౌలుప సామంత
వెలసెను దెలుగు నాట -"60

ఈ విధంగా ఆయా మేళకర్తరాగాలలో వచ్చే స్వరాలను శ్లోకం, పద్యరూపాలలో లక్షణాల్ని వివరిస్తూ ఇతర సంగీత లాక్షణికులు చెప్పిన లక్షణాలను కూడా సమన్వయం కోసం తార్కాణంగా గ్రంథంలో ప్రకటించాడు గ్రంథకర్త. రాగాలలో మిగిలినవి కూడా ఇదే విధంగా వివరించాడు. మిగిలిన పుస్తకభాగం లభ్యం కాలేదు.

ఈ లాక్షణిక గ్రంథం ఆధునిక కాల పరిమితిలో ఉన్నా ప్రాచీన పద్ధతిని ఇందులో అనుసరించి రాసినట్లు స్పష్టమవుతోంది.

హిందుస్థానీ సంప్రదాయబాణీని కర్ణాటకంలో ప్రవేశపెట్టి ఎన్నో రచనలను వెలుగులోకి తెచ్చి సంగీత వాఙ్మయ నదీఝరిని విస్తృతం చేసిన కీర్తి విజయనగర సంస్థానానిదే.

## పలుకూరి వేంకటరమణ

ఒక వంక సంప్రదాయబద్ధమైన రచనలు కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో వచ్చినట్లు మరొక వంక సంగీతాన్నభ్యసించి భక్తితో గానం చేసేందుకు, అది అందరికీ చేరువగా ఉండే పద్ధతిలో భజన సంప్రదాయంలో కొన్ని రచనలు వచ్చాయి. అలాంటి రచనలు ఆంధ్రదేశంలో ఇంచుమించు అన్ని ప్రాంతాల నుండి వెలువడ్డాయి.

అలాంటి రచనలలో వెంకటరమణ కృతులు ఒకటి. పలుకూరి వెంకటరమణ ఈ కృతుల రచయిత. ఈ కృతి కర్త పుట్టిన కాలం గురించి వివరాలు ఈ గ్రంథంలో లేవు. విజయనగర సంస్థాన ప్రాంతానికి చెందినవాడు. తల్లి మంగమాంబ, తండ్రి వేంకటరామార్యులు. ఆర్వేల కులంవారు. భరద్వాజ సగోత్రీకులు. 1924 నుండి ప్రయత్నం చేసి సంగీత సాహిత్యాలలో కౌశలత ఇంచుకైనా లేని ఈయన "ఆంగీరసవైశాఖ శుక్ల ఏకాదశి మొదలు ఏతత్కాల పర్యంతము వెలువడిన కొన్ని కీర్తనలు భజన గావించుకొనుటకు అనుకూలంగా రాయడం సంభవించినదని" రచయిత ముందుగానే చెప్పుకున్నాడు.

1924 ప్రాంతంలో సంస్థానాలు ప్రభుత్వ విలీనం కాలేదు. ఈయన విజయనగరం సంస్థానంలోని రచయిత కావడం వల్ల భజన కీర్తనలను నా పరిశోధనలో చేర్చాను.

ఈ కృతులు రాసేటప్పుడు రచయితకు ఆదిభట్ల నారాయణదాసుగారు, బొట్టు విశ్వనాథశాస్త్రిగారు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చినట్లు తొలిపలుకులో విన్నవించుకున్నాడు రచయిత.

ఈ కృతులు విషయం : ఈ కృతులు భజన సంప్రదాయానికి చెందినవి. పైగా కేవలం భజన చేసే భక్తులకు ఉచితంగా పంచిపెట్టే నిమిత్తం రాసినవి.

ఇందులో ఉన్న కృతులకు రాగ, తాళ నిర్దేశాలను చేసి ఎంతో ప్రోత్సాహపరిచారు ఆదిభట్ల నారాయణదాసుగారు. ఇవి ఇంచుమించుగా నారాయణదాసుగారి ఆధ్వర్యంలో జరిగిన రచనలు. ఈ కీర్తనల సంఖ్య మొత్తం ముప్పదిమూడు. అన్నింటికీ రాగ తాళ నిర్దేశం వుంది.

నవరోజు, యదుకుల కాంభోజి, జెంజూటి, తోడి, ధన్యాసి, కేదార గౌళ, శంకరాభరణ, మోహన, యమునా కళ్యాణి, బేహాగ్ మొదలైన ఆనాడు వ్యవహారంలో ప్రసిద్ధమైన రాగాలను గ్రహించారు. చతురశ్రగతి, త్రిపుట, రూపక మొదలైన తాళాలలో ఈ రచనలున్నాయి.

వెంకటేశ్వరస్వామిని భక్తి పూర్వకంగా ధ్యానించడం ఇందులోని వస్తువు. ఈ కీర్తనలు వేటిసీ

స్వరపరచలేదు. కొన్ని కృతులు పల్లవి, అనుపల్లవితో బాటూ ఏడు వరకూ చరణాలు కలిగి ఉన్నాయి. కొన్ని కృతులలో అనుపల్లవి అనే విభాగం లేదు. మరి కొన్నిటిలో పల్లవి అని కూడా లేదు. ఇటువంటి కృతులు మొత్తం అన్నీ ఒకే విధంగా పాడతారు.

"కాని పనులు చేయబోవనొల్లక - కామ క్రోధాది రిపుల
గట్టి పెట్టుచుఁ - గరము మోడ్చి మొక్కెదవు గనరా"
"బృందావన గోవిందాయుని నిన్
ప్రస్తుతిచేయుచు (బ్రోవ బాడెదను
సందడి నొసగెడిగో - విందు భజనల
సద్భక్తితో - సల్పుచు నిల్పుచు
డెందంబు నగల ద్వంద్వరిపులెల్ల
బందలై - పరువు లెత్తుచు నుండగ
గోవింద గోవింద గోవింద యనివిన్నా
నందాబ్ధి ననయము దేల్చెద."    28వ కీర్తన - పుట - 28

ఏడేడు లోకాలకు నువ్వే అధిపతివి - నీ విందు మేము 'గోవిందా' అని అనడమే. మూడు లోకాలకూ సూత్రధారివి నువ్వే. మమ్మాదరింప సమర్థుడవు. ఏడుకొండలవాడా! నీ శరణు కోరి వచ్చిన మమ్మాదరించి మా పాపాలను పోగొట్టి ఇహలోకం నుండి విముక్తిని ప్రసాదించవయ్యా! గోవిందా! అని మొర పెట్టుకుంటాడు. అన్ని కృతులలోనూ ఇటువంటి భావమే వ్యక్తం చేసాడు రచయిత.

ఈ విధంగా సంస్థానాలలో సంగీత వాఙ్మయం వెలసింది. ఈ వాఙ్మయాన్ని ఇతర సంస్థానాలలో కూడా ప్రదర్శించి ఆయా రచనలు అక్కడే ఉండి పోకుండా అవి నసిపోకుండా వాటిని పరిరక్షిస్తూ పెక్కు చోట్లకు వాటిని వ్యాప్తి చేస్తూ సంగీత విద్వాంసులు ఎంతో కృషి చేసారు. సంగీత వాఙ్మయాన్ని పరి రక్షించి సేవ చేసారు. అందువల్ల ఆయాసంస్థానాలలో ఉన్న కళాసేవ చేసిన కళాకారులను కూడా ఇందులో చేర్చాను.

# రెండవ భాగం
# సంస్థానంలోని కళాకారులు

## వీణ పెదగురురాయాచార్యులు (1794 - 1822)

నారాయణ గజపతి ఆస్థాన విద్వాంసులు గురురాయాచార్యులుగారు. తంజావూరు ప్రాంతం నుండి విజయనగరాధీశునిచే ఆహూతుడై ఆస్థాన విద్వన్ముఖ్యుడుగా పేరొందారు. వీణ అనేది ఆయన ఇంటి పేరు కాదు. వైణికుడు కావడం వల్ల వీణావారని వ్యవహారంలో ఉంది. పెదగురురాయాచార్యులకు విజయనగరాధిపతి అనేక స్థిర చరాస్థులను ఇచ్చి గౌరవించేడు. వీణ పెదగురురాయాచార్యులు నివసించిన అప్పటి ఇల్లు, ఆ ఇల్లున్న వీధికి గురురాయాచార్యుల వీధి అన్న పేరూ ఇంకా స్థిరంగా ఇప్పటికీ ఉన్నాయి.

గురురాయాచార్యులు బొబ్బిలి కేశవయ్యకు, త్యాగరాజ స్వామికీ సమకాలికులని చరిత్ర చెబుతోంది. వీణ గురురాయాచార్యులుగారు గీతాలు, తాన వర్ణాలు, తిల్లానాలు, స్వర పల్లవులు, శృంగార పదాలు, కొణుగు శబ్దాలు, జక్కిణ దరువులు, సలాందర్వులు ఇంకా అనేక కీర్తనలు రాసారు.

కొన్ని కీర్తనలకు మట్లు తయారు చేసి నారాయణ గజపతి మహారాజుకు అంకితమిచ్చినట్లు చరిత్ర - ఇప్పుడవి అలభ్యం. ఆ కాలంలో త్యాగరాజస్వామి కృతులు గురురాయాచార్యుల వల్లే విజయనగర ప్రాంతంలో వ్యాపించినట్లు చెప్తారు. అప్పటి వరకూ పెదగురురాయాచార్యులు, వాసా సాంబయ్య గారు, శిష్టు సర్వశాస్త్రిగారు రాసిన రచనలే ఈ ప్రాంతంలో ప్రచారంలో ఉండేవి. వీణ పెదగురురాయాచార్యులుగారు ఎన్నో రచనలు చేసి, కొన్ని మాడుగుల సంస్థానాధిపతి కృష్ణభూపతి దేవుగారికి, కొన్ని తిరువాన్కూరు మహారాజుకి అంకితమిచ్చి, అనేక స్థిర చర రూప సన్మానాలు పొందారు. వీరి రచనలు అముద్రితాలు. ఛత్ర చామరాలిచ్చినారాయణ గజపతి ఈయన్ను సన్మానించాడు.[61]

## వీణ వెంకటరమణదాసు (1864 - 1948)

వెంకటరమణదాసు 1864 మాఘ బహుళ అష్టమినాడు విజయనగరంలో జన్మించారు. సుప్రసిద్ధ వైణికులు వీణ పెదగురురాయాచార్యులుగారి దత్తపుత్రుడు సీతారామప్పగారి కుమారులు చినగురాచార్యులు. ఈతని కుమారుడే వెంకటరమణదాసు. వెంకటరమణదాసు సహస్రమాసజీవి.

అనువంశికంగా వచ్చే సలక్షణాల్లో కళాభినివేశం కూడా ఒక లక్షణం. అలాంటి సలక్షణమే వెంకటరమణదాసుగారికి వచ్చింది. తాత, తండ్రులు, ఆ తాత తండ్రులు మొత్తం ఏడు తరాల నుండి సంగీతం వారియింట ఉన్నది. మధ్వ బ్రాహ్మణుడైన వెంకటరమణ దాసుగారి తాతగారు, వీణ శేషన్నగారి తాతగారూ సోదరులు. వెంకటరమణదాసు విజయనగర సంస్థానంలో ఆస్థాన వైణికుడు. అంతేకాదు ఆనందగజపతి మహారాజుకు అతి సన్నిహితుడుగా మెలిగాడు వెంకటరమణదాసు. ఆనందగజపతి మహారాజా వెంకటరమణదాసుకి సంగీత గురువు అంటారు. శారీరక సౌందర్యం, బుద్ధి బలం ఆర్థిక, హార్దిక వికాసం, అరి వీర భయంకర శారీరక దారుఢ్యం కలిగిన ఆనందగజపతి పండితుల, విద్వాంసుల పట్ల ప్రవర్తించే తీరు ముదావహం. శ్రీకృష్ణదేవరాయల దర్బారును పోలిన దర్బారు, వారిని తలపింప చేసే ఆనందగజపతి మహారాజా రాజకీయ, ఇతర వ్యవహారాల్లో ఊపిరి ఆడనట్లుగా మునిగి ఉన్నా విద్వాంసులకు ఎంతో విలువైన సమయాన్ని కేటాయించేవారు.

ఇతర దేశ ప్రముఖులతోనూ సంస్థానాధిపతులతోనూ సుహృద్భావంతో గౌరవంగా వ్యవహరించే ఆనందగజపతి ఇతరులతో సాన్నిహిత్యంగా మెలగడం వల్ల ఆయా ప్రాంతీయ సంగీత కళ మన ప్రాంతానికి వచ్చే అవకాశం కలిగింది.

ఉత్తర హిందూస్థానంలో హిందూస్థానీ సంగీతం, ఇటు కర్ణాటక సంగీతంలో కూడా ఆనందగజపతి నైపుణ్యాన్ని సంపాదించుకున్నారు. అలాగే అక్కడి విద్వాంసులను తన ఆస్థానంలో విద్వాంసులుగా నియమించుకున్నారు. అంతేకాదు ఇక్కడి విద్వాంసులను ఆ ప్రాంతాలలో సంగీత సంప్రదాయాన్ని తెలుసుకోడం గురించి ఆనందగజపతి మహారాజే స్వయంగా అక్కడికి తీసుకొని వెళ్ళేవారు. అలాంటి మహారాజా దగ్గర ఆస్థానవైణికుడైన వెంకటరమణదాసు ప్రతీ రోజూ పది గంటల పాటు త్రిస్థాయులను నాలుగు కాలాల్లో సాధకం చేసేవారు. అలా వీణ వాయించేటప్పుడు ఆనందగజపతి దగ్గరుండి తాళం వేసి సాధకం చేయించేవారు. ఏకాగ్రతతో సాధన చెయ్యడానికి ఎన్నో విధాలుగా దాసుగారికి రాజుగారు సహాయపడ్డారు.

మంచి మిత్రునిగా గౌరవించి తన సింహాసనం ప్రక్కన స్థానం కల్పించి, దాని మీద వెంకటరమణదాసుని కూర్చుండబెట్టిన మనిషి ఆనందగజపతి. ఆనందగజపతి కూడా దాసుగారితో పాటూ వీణ సాధకం చేసేవారు. వీణా వారిని తనతో బాటూ రెండుగుఱ్ఱాల బగ్గీమీద కూర్చోబెట్టుకుని, తాను ఎక్కడకు వెళ్ళినా తీసుకు వెళ్ళేవారు. వారితోబాటు రమణదాసుకు కూడా అలాంటి దుస్తుల్నే ధరింపజేసేవారు. అలా వెడుతూ సంగీత విషయ చర్చలు చేస్తూండేవారు. ఆ విధంగా ఎంతో మంది విద్వాంసులను తీసుకు వెళ్ళే వాడు. అయినా వెంకటరమణదాసుగారికిచ్చినంత ఆత్మీయతా స్నేహాలు మిగిలినవాళ్ళ మీద చూపించలేదు. వెంకటరమణదాసు రుద్రవీణ కూడా వాయించగలరు. అది కూడా ఆనంద గజపతి రాజావారి చలవ వల్లే సాధ్యమయింది. 1. అతి అతి చౌకకాలం 2. అతి చౌక కాలం 3. చౌకం 4. మధ్యమ కాలం 5. ధృతకాలం 6. అతి ధృతకాలం వాయించడంలో ఈయనకు ఈయనే సాటి. వీటినే షట్కాలాలు అంటారు.

అందునా వీణను నిలబెట్టి వాయించే ప్రక్రియ చక్రతానం బాగా తెలిసినవారు. అంత అవలీలగా వాయించగలరు కాబట్టే దాసుగారిని అసురసాధకులు అనేవారు. "ప్రసిద్ధ వైణికురాలు వీణ ధనమ్మాళ్ కూడా వెంకటరమణదాసుగారిని 'రాక్షససాధన' చేసేవారు అనేదట." దాసుగారు. అభేద్యమైనటువంటి తానం వాయించేవారు. అంత వేగంగా "తానం వాయించే వాళ్ళు వెంకటరమణదాసుగారు తప్ప మరొకరు ఆ కాలంలో లేరు"[62]

ఒకప్పుడు మద్రాసులో వెంకటరమణదాసుగారి వీణాగాన సభ ఏర్పాటు చేసారు. ఆ సమయానికి పెద్ద పెద్ద ఉరుములతో మెరుపులతో కుంభవృష్టి కురవడం మొదలైంది. ఆధ్వనికి దాసుగారి వీణానాదం వినబడదనే ఉద్దేశంతో సభాభవనం తలుపులు వెయ్యబోయే నిర్వాహకులను వారిస్తూ "మరేం ఫరవాలేదు. తలుపులన్నీ తెరిచే వుంచండి. నావాద్యం తప్పకుండా అందరికీ వినబడుతుంది"[65] అన్నారుట దాసుగారు.

ఘనరాగ పంచకంలో తానాన్ని వాయించే సరికి వర్షఘోషను మించిన ధ్వని ఆ భవనమంతా వ్యాపించిందట "ఈ విషయాన్ని ప్రొఫెసర్ సాంబమూర్తిగారు ఒక వ్యాసంలో రాశారు."[63] "ఇంతకీ వీణకు వర్షఘోషను అధిగమించే ఆధ్వని ఎలా వచ్చిందని ప్రశ్నిస్తే వీణ తుంబల్లో గడియారం స్ప్రింగుల్లాంటి స్ప్రింగులు బిగించారు. ఆ స్ప్రింగులు కుడి తుంబలో ఉండేవి. ఆ తుంబను కొట్టి దాసుగారు వీణకు శ్రుతి పెట్టేవారని కాట్రావులపల్లి వీరభద్రరావుగారు చెప్పారు.

వీణతుంబల్లో ఆ స్ప్రింగులు బిగించడం వల్ల సముద్ర గంభీర ధ్వనిలాగా భీకర ధ్వని ప్రకంపనల్లో

ఇతర శబ్దాలకు అవకాశమివ్వకుండా వీణ ధ్వనే వినిపిస్తుంది. "వీణవెంకటరమణ దాసుగారికి ఇలా తయారు చేసిన వీణను మైసూరు మహారాజావారు బహూకరించేరని పి. సాంబమూర్తిగారు రాసారు."[64] అలాగే తంజావూరులో ఒకసభలో ఒకే స్వర స్థానంలో 5 లేక 6 స్వరాలు వీణలో పలికించి ఒకరాగాన్ని వాయిస్తూ మరో రాగాన్ని పాడే ఆ నేర్పును చూసి సభలో ఉన్న "అబ్రహీం పండితార్ అనే రసికుడు వెంకటరమణదాసు గారి వీణ మీద వెండి సరస్వతీ పతకాన్ని చేయించి పెట్టారు."[65] ఇంతటి గొప్ప వైణికునకు అనేక సంస్థానాలు ఎన్నో సన్మానాలు చేసాయి.

కర్జన్ ప్రభువు నవరత్న ఖచిత సింహతలాట కంకణాన్ని బహూకరించారు. మృదంగం, వయోలిన్ మొదలైన వాద్య సహకారం లేకుండా వాయించ గలిగే నేర్పుగల వెంకటరమణదాసును ఆనందగజపతి ఆత్మీయునిగా భావించాడంటే అందులో వింతేమీ లేదు.

"వీణా రహస్య ప్రకాశిక" అనే వీణ సంబంధ గ్రంథాన్ని దాసుగారు రచించారు. ఇందులో బంధతానాన్ని గురించి వివరించారు. ఇప్పుడాగ్రంథం అలభ్యం. వెంకటరమణదాసు గారి వీణలు రెండింటివి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ హైదరాబాదులో ప్రదర్శనార్థం భద్రపరిచారు.

## కలిగొట్ల కామరాజు పంతులు (వివరం లేదు - 1885)

వీణ, వయోలిన్, గాత్రం ఈ మూడు వీరికి స్వాధీనం. దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులుగారు వీరికి సహపాఠి. వాసా సాంబయ్య గారికి శిష్యులు. విశాఖజిల్లా చోడవరం నివాసి. వాద్యాలతో గాత్రం కలిపి పాడినప్పుడు ఏది వాద్యమో ఏది గాత్రమో తెలిసేది కాదు. అంతటి గొప్ప కంఠం కలవారు పంతులుగారు. విజయనగర దర్బారు విద్వాంసులు. వీరుకూడా సంగీత రచనలు చేసిన వాగ్గేయ కారులు. "ఓ రంగశాయి" అనే కాంభోజి రాగంలో కృతి ఈయన రాసినదేనని ప్రచారంలో ఉంది. నవరోజు రాగంలో స్వర పల్లవి రాసారు. ఇప్పుడవి అలభ్యం.

కామరాజు పంతులుగారికి ఒక రోజు తన గానాన్ని ఆనందగజపతి గారికి వినిపించాలనే కోరిక కలిగింది. వెంటనే దర్బారుకు కబురు చేసారు. రాజు రసికుడవడం వల్ల వెంటనే అంగీకరించి పూజామందిరానికి ఉదయాన 8 గంటలకే వచ్చారు. కామరాజు పంతులుగారు శంకరాభరణ రాగాలాపన, పల్లవులను ఉదయం 8 గంటలకు పాడటం మొదలు పెట్టారు. అలా ఆరంభించిన పంతులు గారి పాట ఏకబిగిన సాయంత్రం నాల్గు గంటలదాకా సాగింది. విసుగూ విరామం లేకుండా రాజావారు సుదీర్ఘ కాలం పాటవింటూ ఉండిపోయారు. అలాంటి విద్వత్తున్న కామరాజు పంతులుగారు తన ఆస్థాన విద్వాంసుడైనందుకు ఎంతో ఆనందించారు ప్రభువు.

మనిషి పుట్టిం తర్వాత వివేకవంతుడై తన చుట్టూ ఉండే ప్రాంతానికి ఎంతో కొంత మేలు చెయ్యడం సమాజంలో ఉండేదే. కామరాజు పంతులుగారు విజయనగర సంస్థానంలో ఉంటూ, కాళహస్తి వెళ్ళి అక్కడ అధ్యాత్మ రామాయణ కీర్తనలు నేర్చుకుని వచ్చి, విజయనగరంలో ఆ సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టారు.

ఈయన వయోలిన్ వాయించడంలో తిరు కృష్ణయ్య కోవలు నోకోడితో సమానమైన ప్రతిభ కలవారు. 1885 ప్రాంతంలో మరణించిన కలిగొట్ల కామరాజు పంతులుగారి గురించి మరెక్కడా జీవిత వివరాలు లభ్యం కాలేదు.

# పాడుగు రామమూర్తి (1871 - 1942)

కళాకారులు ప్రత్యక్షంగానో పరోక్షంగానో గురుముఖతః విద్యల నేర్చి ఆపైన వారి పాండిత్యాన్ని ప్రదర్శించుకుంటారు. విద్య నేర్పిన గురువులు ప్రసిద్ధ సంస్థానాల్లో ఆస్థాన విద్వాంసులైనప్పటికీ ఏకారణం చేతనో బైటికి రారు.

విద్యలకు నిలయమైన విజయనగర సంస్థాన విద్వాంసులయిన సాలగ్రామం గోపాలంగారి శిష్యులు పాడుగు రామ్మూర్తి. ఈయన కట్టు సూరన్న గారి సమకాలికులు. సాలగ్రామం గోపాలం కట్టు సూరన్నగారు కూడా విజయ నగర సంస్థాన విద్వాంసులే. ఈయన గారి దగ్గర కూడా సంగీతాభ్యాసం చేశారు మూర్తిగారు. పాడుగు రామ్మూర్తిగారు విజయనగరంలో 1871లో జన్మించారు.

పదవ ఏటనుండి దాదాపు 12 సం॥లు వీణాభ్యాసం చేసి విద్వాంసునిగా గుర్తింపు పొంది దక్షిణాది యాత్రకు బయల్దేరారు. మద్రాసులో తచ్చూరి సింగరాచార్య సోదరులతో కొంతకాలం గడిపి వారి బాణీని అలవరచుకున్నారు. ఒకసారి గోఖలేహాలులో చినసింగరాచార్యుని పక్క వాద్యంతో కచేరీ చేశారు. బెంగుళూరు నాగరత్నమ్మ, తిరువత్తూర్ త్యాగయ్య, సుమతి కృష్ణారావు మొదలైన సంగీత వేత్తల సమక్షంలో ఆసభ జరిగింది. వారందరూ రామ్మూర్తిగారిని ఎంతో శ్లాఘించారు.

విజయనగర సంస్థాన ప్రభువు విజయరామ గజపతి కాలంలో ఆస్థాన విద్వాంసునిగా నియమితులై రాజావారితో మైసూర్, నిజాం, తిరువాన్కూర్, సింధియా మొదలైన సంస్థానాలకు వెళ్ళి తన వీణాగాన ప్రతిభ ప్రదర్శించి, మెప్పించి గొప్పసన్మానాలు పొందారు.

స్వేచ్ఛా వాయువులు పీల్చే మనసున్న రామమూర్తిగారికి కళాసేవ చేసి తరించాలనే ఉద్దేశం మొదటి నుండి ఉన్నదే. అందుకే విజయ నగర ఆస్థాన విద్వాంస పదవికి స్వస్తి చెప్పి, శ్రీకాకుళం జిల్లా నర్సన్న పేట గ్రామంలో ఉండడం మొదలు పెట్టారు. నర్సన్న పేటలో గురు కులాన్ని స్థాపించారు. ఆ గురుకులంలో ఉచిత భోజన వసతుల్ని కల్పించి, సంగీతాన్ని బోధించేవారు. గురుకుల నిర్వహణ కోసం రామమూర్తిగారు చుట్టు ప్రక్కలున్న టెక్కలి, పర్లాకిమిడి, మందసా, చీకటికోట, సురంగి మొదలైన జమీందారుల దగ్గరకెళ్ళి వార్షికంగా ధనాన్ని తెచ్చేవారు. ఆ ధనంతో విద్యార్థులకు ఉచితంగా సంగీతం నేర్పేవారు. వీరు చేసే సంగీత విద్యా ప్రచారం వల్ల చుట్టు పక్కల గ్రామాల వారు సంగీత సభల్ని చేయాలనే తాపత్రయంతో ఉత్సవాలు జరిపేవారు.

ఉర్లాం, పోలాకి, నర్సన్నపేట, శ్రీకాకుళం, బరంపురాలలో సంగీతోత్సవాలు జరగడానికి కారకులు, ఒకవిధంగా ప్రోత్సాహకులు పాడుగు రామమూర్తిగారే. వారి విద్యాభిరుచికీ, నైపుణ్యానికి మెచ్చి ఉర్లాం జమీందారిణి శ్రీమహాలక్ష్మమ్మగారు ఒకసారి ఆదిభట్ల నారాయణదాసుగారి అధ్యక్షతన బంగారు కంకణాలను తొడిగారు. 1911లో దివాన్ బహద్దూర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి గారు రామ్మూర్తిగారిని కాకినాడకు రప్పించి అతిథిగా గౌరవించి, వారి ఇంట నాల్గయిదు సంవత్సరాలు ఉంచుకున్నారు.

1912లో కాకినాడ సరస్వతీ గానసభల్లో పాడుగు రామ్మూర్తి గారి వీణా గానం బందరు రామమూర్తి మృదంగ సహకారంతో సభ జరిగింది. ఆ సభకు ఆహూతులు హరినాగభూషణం, మహారాజపురంవిశ్వనాథ అయ్యర్, గోవిందస్వామి పిళ్ళే మొదలైనవారు.

ఆ సందర్భంగా సూర్యనారాయణ మూర్తి నాయుడుగారు రామమూర్తి గారికి "వైణిక సార్వభౌమ" బిరుదు బంగారు పతకం మీద చెక్కించి వారికి బహుమానంగా ఇచ్చారు.[**]

రామ్మూర్తిగారు మఖాసాదారులైన నాళంవారి ఇంట రాజమహేంద్రిలో కొంతకాలం ఉండి వారికి సంగీతం చెప్పారు.

## నిరాఘాటం కృష్ణయ్య (1845 - 1890)

మహారాజా ఆనందగజపతి ఆస్థాన గాయకులు నిరాఘాటం కృష్ణయ్య. గాన విద్యా ప్రదర్శనలివ్వడం మాత్రమేకాదుఎంతో మంది విద్యార్థులకు సంగీత విద్యాబోధన చేస్తూండేవారు. మహారాజా వారి సంగీత పాఠకునిగా పేరు సంపాదించుకున్నారు. గుంటూరు జిల్లా అనంతారప్పాడులో జన్మించిన నిరాఘాటం కృష్ణయ్య విజయనగరంలో ఆస్థాన విద్వాంసునిగా నియుక్తులవ్వడం ఆశ్చర్యపరిచే విషయమే. అయినా ఎక్కడెక్కడో వున్న విద్వాంసుల్ని తీసుకొచ్చి తన ఆస్థానంలో నియమించుకోడం రాజావారికి మామూలే. కృష్ణయ్యగారికి తండ్రిగారే సంగీత గురువు. ఒక్కొక్క రాగాన్ని ఎన్నిగంటలైనా ఆలపించగల సమర్థులు. అందులోనూ తోడి రాగాన్ని ఎంతో ఇష్టంగా పాడతారు. కృష్ణయ్యగారు ఒకమారు రాజదర్బారులోతోడి రాగాన్ని సుమారు నాలుగుగంటలు పాడారు. ఆ గాయకునిఆలాపనకు విజయనగరప్రభువు ఆనందంతో ఆలింగనం చేసుకుని, అప్పటి నుండి కృష్ణయ్యను తోడి కృష్ణయ్య అని ప్రేమతో పిలవడం మొదలుపెట్టారు. సంస్థానంలో ప్రధానవిద్వాంసులైన కృష్ణయ్యగారి దగ్గర ఆదిభట్ల నారాయణదాసుగారు ఒకప్పుడు సంగీతంనేర్చుకోవాలని అనుకున్నారుట. కృష్ణయ్యగారు తన నలభై ఐదవ ఏట పరమపదించారు.

## కర్రి పద్మనాభస్వామి (1864 - 1900)

ఆనంద గజపతి మహారాజావారి ఆస్థానంలో కర్రి పద్మనాభస్వామి వైణికుడు. వీణ వెంకటరమణదాసు గారి సమకాలికుడు. వెంకట రమణదాసుగారిలాగే పద్మనాభస్వామిని మిత్రునిగా ఆనందగజపతి గౌరవించేవారు. వీణ సాధన చేయించేవారు. "ఒక్క ద్రుతకాలంలో వాయించడంలో వీణ వెంకటరమణదాసుగారి కంటే స్వామిగొప్పవాడని ఆనాటి విద్వల్లోకంలో ఒక అభిప్రాయం"[67] ఉండేది. కానీ వెంకటరమణదాసు గారికిచ్చినంత ప్రాధాన్యత రాజావారు ఈయనకు ఏ కారణం చేతనో ఇవ్వలేదు. "పద్మనాభస్వామి గారి వీణను పట్రాయని రమణమూర్తిగారు కొనుగోలు చేశారు".[68]

## పప్పు వెంకన్న

18వ శతాబ్దపు విజయనగరాస్థాన విద్వాంసులలో పప్పు వెంకన్నగారొకరు. ఆనందగజపతి ఆస్థాన వైణికులు, గాయకులు, ఇతర వాద్యకారులు, కొన్ని ప్రత్యేకతలు గలిగి ఉన్నారు. కాబట్టే మహారాజా వారి దగ్గర ఉండేందుకు అర్హత పొందారు.[69] త్రిస్థాయి పలికే తీయని మధురాలాపనతో గుండెనిండా ఆనందాన్ని నింపే పప్పువెంకన్న గొంతును పెద్దవారే మెచ్చుకున్నారు.

పప్పు వెంకన్న పాట నిబ్బరి వెన్న
ముద్ద వేసిన యట్టు లేవ్వొర్లుకరణ
జున్ను దిన్నట్లు పువ్వుల సోన మాడ్కి
నీటిపై జిల్ల పెంకులు - దాటుపోల్కి
ఒకమారు పారువ మొదిగి వచ్చినయట్లు
వానమొయిల పెట్ట వరికి నట్టు
లొకమరు మేల్పటా నొడసి త్రిప్పినయట్లు
నెత్తావి పొదరింట నిలచినట్టు
లొకమారు వెన్నెల లొలికి గాచిన యట్లు

కొలనందు జలకేళి సలిపినట్లు
లోకపరి నును ముద్దు లూరినయట్టులు
చేడెతో బాలను చేడినట్టు
చిన్ని నాయన్న నీపాట వెన్న ముద్ద
లేసినట్టులు జువ్వల నెగచినట్లు
సన్న చెంబేలిజాజులు జల్లినట్లు
చిన్ని పూదెనెపై బయిజిందినట్లు

అంటూ ఆదిభట్ల నారాయణదాసుగారు పప్పు వెంకన్నగారి శ్రావ్యమైన గొంతును అభివర్ణించారు.

"పప్పు వెంకన్న వేయి కోయిలలు మ్రోగునట్లొక మైలు వినబడునట్టి దివ్య శరీరముతో సభకామోద మొనర్చువాడు. అతడు వీణ కూడా కడు రుచ్యముగా వాయించు" అని వారే మెచ్చుకున్నారు.

మెఱుపులాంటి సంగతులు వేసి శ్రోతలకు ఆనందం, హాయి కూర్చేవారు పప్పు వెంకన్నగారు.

విద్వాంసులను పోషించడం అంటే ఆయా శాస్త్రాల్లో మరికాస్త ప్రావీణ్యాన్ని సంపాదించుకోడానికి తగిన వసతులు కల్పించడం కూడాఉండేది. విజయనగరాస్థాన విద్వాంసులు స్వేచ్ఛా విహంగాలు. ఒకసారి మదరాసులో ఆంధ్ర మహాసభహాలులో గానసభ ఏర్పాటయింది. ఆ సభలో పాడవలసిన గాయకుడు ఆరంభ సమయం దాటి అరగంటయినా రాలేదు. సభాధికారులకు ఏం చెయ్యాలో తోచని సమయంలో వెంకన్నగారు తాముపాడతామని ముందుకు వచ్చి చెప్పారు.

రక్తిగా సాగుతున్న ఆ సభకు ఆనందగజపతి, మైసూరు మహారాజు శ్యాం భూపతి వేంచేశారు. వెంకన్నగారి గానం విని తెలిసి కూడా తెలియనట్లు ఆనందగజపతి మాట్లాడలేదు. సభ జయప్రదంగా ముగిసిం తర్వాత శ్యాం భూపాలుడు ఏవరీ గాయకుడు? చాలా బాగా పాడారు? ఇది వరకెన్నడూ వీరి గురించి వినలేదని ఆనందగజపతి గారితో అన్నాడు.

సభకు విచ్చేసిన ఆనందగజపతిని చూపి అదిరి బెదరి తమ అనుమతి లేకుండా గానం చేసినందుకు క్షమించమనివెంకన్న వేడుకున్నారు. అప్పుడు ఆనందగజపతి వెంకన్నను ఆలింగనం చేసుకుని తప్పు మాదే మీది కాదు. మీ గానసభ ఏర్పాటు చేసి ఉండవలసింది అన్నారు. ఆనందపడిన ప్రభువు వెంకన్నను గొప్పగా సన్మానించేరు.

ఒక సంస్థానంలో ఆస్థాన విద్వాంసునిగా ఉన్న విద్వాంసుడు ఆ సంస్థానాధిపతి అనుమతి లేకుండా మరో సంస్థానానికి వెళ్ళకూడదనే నియమం కొన్ని సంస్థానాల్లో ఉంది. కాని ఆనందగజపతి అలాంటి ఆంక్షలేవీ తన విద్వాంసులకు విధించలేదని స్పష్టమవుతోంది. రాజా, రాజదర్బారులో ఉన్నవారూ స్వేచ్ఛా పరాయణులే. వెంకన్నగారి సోదరులు అప్పయ్యగారు కూడా గాయకులే. కాని ఆస్థాన విద్వాంసులు కాదు. సంగీత వ్యాప్తికి కృషి చేసినవారు. నాట్యకత్తెలకు కూడా సంగీతం చెప్పారు.

## కవిరాయుని లక్ష్మీనారాయణ (కాలం వివరాలు తెలియవు)

విద్వాంసులు గానీ కవులుగానీ, పండితులు గానీ, స్వేచ్ఛా పరాయణులు. అయినా కవుల కంటే గాయకులే అదృష్టవంతులని ఒకచోట చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు అంటారు.

"నవిటా నవిటా నగాయకా:
నచ సభ్యేతర వాద చుంచవ:
నృపమీక్షుతు మత్ర కేవయం
స్తనభారా నమితా నయోషిత:"[70]

అలాగే రాజావార్ల కుటుంబాల్లో ఎలాంటి భోగాలుంటాయో అలాంటివే, విద్వాంసుల ఇళ్ళలో కూడా వుండేవనడానికి లక్ష్మీనారాయణగారి కుటుంబం ఒక తార్కాణం. 18వ శతాబ్దంలో ఆనందగజపతి ఆస్థాన వైణికుల్లో కవిరాయుని లక్ష్మీనారాయణగారొకరు. ఈయన ఆనంద గజపతి మహారాజుకి మంచి ఆత్మీయులుగా ఉండేవారు.

ఈయన్ను ఆనంద గజపతి ఉత్తర హిందూస్థానానికి పంపించి బెనారస్‌లో రుద్ర వీణను ధృపద్ రీతిలో నేర్పించారు. అందువల్ల ఇటు కర్ణాటక, అటు హిందూస్థానీ శాస్త్రీయ సంగీత సంప్రదాయాలను తెలిసిన ఉద్దండులయ్యారు నారాయణగారు. రుద్రవీణ వాయించడంలో లక్ష్మీనారాయణగారు ప్రత్యేకత చూపించేవారు.

వీరిని గురించి నారాయణదాసుగారు -
"దక్షిణోత్తర సంగీత - లక్షణ విజ్ఞం
ఉభయ వీణా విశారదుం - దుర్దిలేని పండితుడు.. అన్నారు.

లక్ష్మీనారాయణగారి కుమారుడు కవిరాయుని జోగారావుగారు విజయ రామగాన పాఠశాల విజయ నగరం మహారాజావారి కళాశాలలో వీణ అధ్యాపకులుగా పని చేసారు.

## ద్వివేదుల లక్ష్మణ శాస్త్రి (కాలం వివరాలు తెలియవు)

ఈయన 1930 ప్రాంతంలో బొబ్బిలి, విజయ నగరాల్లో కొంత కాలం ఉన్న విద్వాంసుడు. ఆ రోజుల్లో చాలా ప్రసిద్ధి పొందిన విద్వాంసుడు. భాగవతుల లక్ష్మీనరసింహశాస్త్రి, విశ్వపతి శాస్త్రి వీరంతా మధురా పంతుల పేరయ్య శాస్త్రి గారి శిష్యులు. త్యాగరాజస్వామి కృతులు మన ప్రాంతాల్లో అంతగా ప్రచారంలో లేకపోవడం వల్ల దక్షిణాది ప్రాంతానికి వెళ్ళి త్యాగరాజ కృతులు నేర్చుకుని రావడం ఆ రోజుల్లో ఒక పద్ధతిగా ఉండేది. అలా లక్ష్మణ శాస్త్రి గారు కూడా దక్షిణ ప్రాంతానికి వెళ్ళి త్యాగరాజకృతులు పాఠం చేసుకుని వచ్చారు. ఈ ప్రాంతాల్లో కొంత వరకూ ఆ కృతులు వ్యాప్తి అవడానికి కృషి చేసిన వాళ్ళలో లక్ష్మణ శాస్త్రిగారు ఒకరు.

## ఉస్తాద్ మహబ్బల్ ఖాన్ (కాలం వివరాలు తెలియవు)

విజయనగరాన్ని అపర విద్యానగరంగా తీర్చి దిద్దాలనుకున్న ఆనందగజపతి మహారాజు ఎందరెందరో ఇతర భాషా సంగీత విద్వాంసులను ప్రత్యేకంగా ఆహ్వానించి తన సంస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా నియమించుకున్నాడు. కాశీలోని పండిత విద్వాంసుల సాహచర్యంతో కళాత్మక దృష్టి కలిగిన ఆనంద గజపతి కర్ణాటక సంగీతాన్నే కాదు, హిందుస్థానీ సంగీతాన్ని కూడా ఆదరించాడు. అలాగే తద్దేశ ప్రభువులతో కూడా స్నేహ బాంధవ్యాలను పెంచుకున్నారు. అందులకే వారణాసిలో విద్వాంసుడైన ఉస్తాద్ మహబ్బల్ ఖాన్ అనే సితారు వాద్యకారుని తన ఆస్థాన విద్వాంసునిగా ఆహ్వానించాడు. సితార్ వాయించడం మాత్రమే కాదు. గొప్పగాయకుడూను మహబ్బల్‌ఖాన్. రుద్రవీణ కూడా తన ప్రత్యేకమైన ఒరవడితో వాయించేవారు. ఆనంద గజపతుల దర్బారులో ఉన్న కర్ణాటక వైణిక విద్వాంసులకు హిందుస్థానీ సంగీతపు కొన్ని ప్రత్యేకతలు, మెలకువలు చెప్పి వారి చేత వారి వాయిద్యాలపై పలికింప చేసే వారు మహబ్బల్ ఖాన్. అలాగే కర్ణాటక

సంగీతంలో "తడమీటు" లాంటి మీటులను తాన పద్ధతిలో ప్రవేశ పెట్టి ఆస్థాన వైణికుల చేత సాధన చేయించేవారు.

మహబ్బత్ ఖాన్ చేతి వేళ్ళు ఎంతో అందంగా ఉండేవి. సున్నితంగా అద్భుతమైన రీతిలో మహబ్బత్ ఖాన్ సితార వాయిస్తుంటే ఆయన వేళ్ళ పోకడకు ముగ్ధులయ్యే వాడు ఆనంద గజపతి. అతని వేళ్ళు భగవంతుడు తమకిస్తే ఎంత బాగుండును అని వాపోయేవాడు రాజా.

## ద్వారం వెంకటస్వామి నాయుడు (1893-1964)

"లాల్‌గుడి జయరామన్ వయోలిన్ వాయిస్తే నాదస్వరం వినబడుతుంది. ఎం.ఎస్.గోపాలకృష్ణ వాయిద్యంలో కర్ణాటకం వాయించినా హిందూస్థానీ పోకడలు వినిపిస్తాయి. లాల్‌గుడి వాయిస్తే కర్ణాటక సంగీతానికి ముఖ్యమైన జాలువారుతనం, పట్టు స్పష్టంగా వినబడతాయి. ఆంధ్రదేశంలో ద్వారంవెంకటస్వామినాయుడుగారు ఫిడేలు వాయిస్తే పంచదశగమకాలూ వినిపిస్తూనే వుంటాయి."[71]

"1914 సంవత్సర ప్రాంతంలో విశాఖపట్నంలో 'మైత్రేండ్' అనే సంఘంలో ఓ కుర్రవాడు అద్భుతంగా ఫిడేలు వాయిస్తే అది మెచ్చుకుని మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు ఒక బంగారు ఉంగరం వేలికి తొడుగుతూ ఫిడేలు నాయుడు అని పేరు పెట్టారు."[72] అప్పటి నుండి వెంకటస్వామి నాయుడు గారి పేరు ఫిడేలు నాయుడుగా స్థిరపడిపోయింది. పసితనంలో బడిలో తరగతిలో చివర వరుసలో కూర్చున్న వెంకటస్వామినాయుడు గారు బోర్డు మీద రాసిన లెక్కలు చూసి చదవ లేకపోయాడు. కళ్ళు సరిగా ఆనలేదు. కావాలనే చదవలేదని టీచరతన్ని తిట్టి శిక్షించారు. బాధతో విలవిల్లాడిన వెంకటస్వామిని అన్నగారు వెంకట కృష్ణయ్య ఆ చదువు మానిపించి సంగీతం నేర్పించడం మొదలు పెట్టారు. పూర్వీకులంతా కత్తిపట్టిన సైనికోద్యోగులు. అన్నగారు టెలిగ్రాఫ్ ఉద్యోగి. అయినా కమాను పట్టి వెంకట కృష్ణయ్య సంగీతం నేర్చుకున్నారు. భజన పాటలు పాడుతూ చిన్నప్పటి నుండి అలాంటి వాతావరణం కలిగి ఉండడం వల్ల సంగీతాభిమానం వెంకటస్వామినాయుడు గారికి మరింత పెరిగింది. వెంకటకృష్ణయ్యగారు తుమరాడ సంగమేశ్వర శాస్త్రి గారి దగ్గర సంగీతం నేర్చుకునేవారు. తాను నేర్చుకున్నదంతా తన తమ్ముడు వెంకటస్వామి నాయుడికి చెప్పేవారు. సాధన చేస్తూ చేస్తూ నాయుడుగారు కొంత పాఠం చేసారు.

పెద్ద పెద్ద విద్వాంసుల గాన వాద్య సభలు వినడానికి వెంకటకృష్ణయ్యగారు నాయుడుగారిని తీసుకెళ్ళేవారు. ఆ రకంగా నాయుడు గారి ప్రజ్ఞకు వెంకట కృష్ణయ్యగారు సదా మెరుగుల దిద్దుకునే అవకాశం కల్గించే వారు. "తన 13వ ఏట నందిగానం వెంకన్న గారికి వాద్య సహకారాన్నిచ్చేరు."

పుట్టింది బెంగుళూరు, అక్షరాభ్యాసం చేసింది కశింకోటలో. పెరిగిందీ ప్రతిభకు సానపెట్టిందీ విశాఖ పట్టణంలో. అలాంటి నాయుడు గారికి అన్నగారి సాహచర్యంలో ఇంతింతై వటుడింతై అన్నట్లు అదృష్టదేవత అంచెలంచెలుగా నాయుడు గారిని అందలా లెక్కించింది. ఒకసారి విజయరామగజపతి కోరుకొండ పేలెస్‌లో తమ మిత్రులకు వెన్నెల విందు ఏర్పాటు చేశారు. వారందరి అభీష్టం మేరకు రాజాగారి సన్నిహితులైన శ్రీ రంగం వెంకట నారాయణగారు రాజావారిని ఒప్పించి ఒక యువకుని వయోలిన్ కచేరీని ఏర్పాటు చేసేరు. ఆ యువకుని అపూర్వ కళాకౌశలానికి ఆ విందులో పాల్గొన్న విదేశీ మిత్రులు కూడా ఎంతో తన్మయత్వాన్ని పొందారు. నాయుడు గారిని విజయనగరానికి రమ్మని విజయ రామగజపతి ఆహ్వానించారు.

ఒక విద్యార్థిగా తన వాద్యంలో మెరుగులు దిద్దుకోడానికి విజయనగరంలోని సంగీత పాఠశాలకు వెడదామనుకున్న వెంకటస్వామి నాయుడుగారికి వయోలిన్ ఉపన్యాసకునిగా అవకాశం లభించింది.

ఆనాటి వెంకట స్వామి నాయుడు గారి జీతం 50 రూపాయలు 1919లో ప్రారంభమైన విజయరామగాన పాఠశాలలో ప్రప్రథమ అధ్యక్షులు (ప్రిన్సిపాల్) శ్రీ ఆదిభట్ల నారాయణ దాసుగారు. ఆయన తదనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌గా ద్వారం వెంకటస్వామి నాయుడుగారు నియమితులయ్యారు.

నాయుడుగారు కళాశాలలో ఎన్నో అభివృద్ధి కారకాలైన మార్పులు చేశారు.

మొన్న మొన్నటి సంఘటనలా అనిపిస్తుంది. కాని దాదాపు '70, 80 సంవత్సరాల క్రితం జరిగిన వాస్తవమిది. "ద్వారం వెంకటస్వామి నాయుడు గారి ఫిడేలు వాద్యకచేరీ ఏర్పాటు చేసి ఆయనకు సన్మానం చేయాలని మైసూరు మహారాజా అనుకున్నారు.

అలాగే ఆయనకు సన్మానం చేసి "సంగీత రత్నాకర" అని బిరుదిచ్చి జోడు శాలువాలు అర్పించి గౌరవించారు. సంగీత శాస్త్ర గ్రంథమైన సంగీత రత్నాకరంలో ఏ సమాచారం ఉంటుందో అటువంటి విజ్ఞాన ఖనిగా భావించి "సంగీత రత్నాకర" అనే బిరుదునిచ్చారు. రాజావారు మైసూరు సంస్థానానికి చిహ్నాలైన గండభేరుండ పక్షులున్న బంగారు తోడుగుతో కెంపులు, వజ్రాలూ పొదిగిన పతకాన్ని బంగారు గొలుసుతో సహా ద్వారం వెంకటస్వామి నాయుడు గారి మెడలో వేసారు. ఇలాంటి సన్మానం మరే విద్వాంసునికీ జరగలేదు.

"అలా మైసూరు మహారాజు ఆ గొలుసును ద్వారం వారి మెడలో వేసి వారిని ఒక కోరిక కోరారుట" ఆర్యా! ఈ పతకం మీరు మెడలో ధరించినప్పుడు ఇతరుల కెవ్వరికీ నమస్కారం చెయ్యకూడదు. ఎందుకంటే మీరా పతకం వేసుకొని నమస్కారం చేసినట్లయితే మమ్మల్ని అవమాన పరచినట్లవుతుందని మాకు తోస్తోంది. అది మంచి పనికాదని మాకు అనిపిస్తోంది. మీకు ఇష్టం వుంటే పతకం తీసి" అప్పుడు దండం పెట్టండి అని ప్రభువు కోరారు.[73] సంస్థాన ప్రభువుల గౌరవానికీ విద్వాంసుని ప్రతిభకూ పట్టం కట్టి మైసూరు మహారాజు ఆ విధమైన కోరిక కోరడం సమంజసమే.

సంగీత లోకంలో ఏ విద్వాంసుడూ పొందనన్ని సన్మానాలూ, బిరుదులూ వాయులీన విద్వాంసునిగా ఒక్క నాయుడుగారు మాత్రమే పొందారు. 1924లో విజయనగరం మహారాజావారు "గాంధర్వ విద్యాభూషణ" బిరుదు ఇచ్చారు. 1929లో ఆంధ్ర సారస్వత పరిషత్తువారు "గాన కళాభిశారద అని కీర్తించారు. ఇన్ని సన్మానాలు పొందిన నాయుడుగారు ఎప్పుడూ తాను విద్యార్థిదశలో ఉన్నట్లే భావించేవారు. నిరంతర సాధన చేస్తుండేవారు. కరాలేకన్నులుగా చేసుకున్న నాయుడు గారు తనకు తల్లీ తండ్రీ గురువూ దైవం తోడూ నీడా అన్నీ వయోలిన్ అని భావించేవారు. దాన్నే చివరి వరకూ వెంట పెట్టుకుని ఉండేవారు.

ఒక్కొక్క విద్వాంసుడు ఒక్కో రాగం ఒక్కొక్క కీర్తన తమ సొంత బాణీతో వాయించడం, గానం చెయ్యడం వల్ల ఆ పాటలు విన్నప్పుడు ఫలానా వారి గొంతని ఫలానావారి వాద్యమని గుర్తుంచుకునేలా ఉండిపోతాయి. కదన కుతూహల రాగంలో "రఘువంశసుధాంబుధి చంద్రమా" అన్న కీర్తన సొంతం తన సొంతమే అన్నట్లుగా ప్రత్యేక శైలితో వాయించి విద్వజ్జుల, సామాన్య జన హృదిలో స్థిరత్వమేర్పరుచుకున్నారు నాయుడు గారు. అలాంటి సంగీత విశ్వపు ధృవతార నాయుడు గారు ఎంతో మంది విద్వాంసులను తయారు చేసారు.

## కోలంక వెంకటరాజు (1905 - సజీవులు)

"నేను విజయనగరం మహారాజావారి సంగీత కళాశాలలో పనిచేసేవాణ్ణి! అక్కడి నుండి తుని రాజావారి దగ్గరకు వెళ్ళేవాణ్ణి. ఒకనాడు తుని రాజావారి పక్కన ఒకాయన ఉండి, ఆస్థాన విద్వాంసునిగా ఈయన్ని మీరు పెట్టుకో కూడదా! అని రాజావారికి సలహా ఇచ్చాడు. అదేమిటయ్యా! ఆయన "గజపతుల" దగ్గర

జాబు చేస్తున్నాడయ్యా! మేమెంత! మామూలు "జగపతులం" అని తేలిగ్గా నవ్వేస్తూ అనేవాడు రాజావారు."[74] ఆదరించినవారు జగపతులయినా, గజపతులయినా విద్వాంసుడనే వాడు గుర్తింపు పొందినట్లుగా ఎక్కడో ఒకచోట ఉన్నాడనుకునే మనస్తత్వం కాబోలు తుని రాజావారిది. అందుకనే కోపం రాలేదు.

కోలంక వెంకటరాజుగారు తుని సంస్థానంలో 1910లో పుట్టారు. పుట్టిన 5వ ఏట నుండే వెంకటరాజుగారు మృదంగం వాయించడం నేర్చుకోడం మొదలు పెట్టారు. వెంకటరాజుగారి తాత వెంకయ్యగారు గొప్ప మార్దంగికులు. తండ్రి పెదరామస్వామి తల్లి చిన్నమ్మ, పినతండ్రిగారు చిన రామస్వామి. తాత తండ్రులంతా మృదంగం వాయించేవారు. అందువల్ల వెంకటరాజుగారికి మృదంగ విద్య వారసత్వ సంపదగా వచ్చింది.

మన చుట్టూ ఉండే ఏ వాతావరణంలోనైనా కొన్ని లక్షణాలు మనకు వాటంతటవే వస్తూ వుంటాయి. కొన్నైతే మనల్ని ఆకర్షిస్తాయి. తదనుగుణంగా మనం వాటిని అవలంబిస్తాం. పూర్వీకుల నుండి సంక్రమించిన వారసత్వపు మృదంగ విద్యకు వాతావరణ పరిస్థితులు తోడవడం, స్వతహాగా మృదంగ వాద్యం మీద ఆసక్తి ఉండినందువల్ల వెంకట రాజుగారికి పసితనం నుండే మృదంగం వాయించడం మొదలైంది. తన 8వ ఏట కసింకోటలో మృదంగం వాయించి అందరి మన్ననలు పొందారు. 1918లో హకీం మహమ్మద్ మొహినుద్దీన్ అనే ఆయన వెంకటరాజుగారిని చేరదీసి తునినించి కాకినాడకు తీసుకు వెళ్ళి, అక్కడ ప్రముఖ మార్దంగికులు మురమళ్ళ గోపాల స్వామి గారి దగ్గర శిష్యుడిగా చేర్చారు. హకీం మహ్మద్ మొహినుద్దీన్ సాహెబ్ ఒక వైద్యుడు. అతనికి వెంకటరాజంటే ఎంతో ఇష్టం అందువల్ల అతనితో బాటూ కాకినాడలోనే ఉండి ఆలనాపాలనా చూసుకునేవారు.

ఆ తర్వాత పిఠాపురంలో ఆస్థాన విద్వాంసులైన తుమరాడ సంగమేశ్వర శాస్త్రి గారి దగ్గర వదిలి పెట్టారు. తుమరాడ సంగమేశ్వర శాస్త్రి గారి దగ్గర నుండి వెంకటరాజుగారు ఎన్నో విషయాలు తెలుసుకునేవారు. అప్పుడి నుండి సంగమేశ్వర శాస్త్రిగారితో ఆయన పాల్గొనే ప్రతీగానసభలోనూ వెంకట రాజుగారు మృదంగం వాయించేవారు.

12, 13 సంవత్సరాలు వచ్చిన తర్వాత ద్వారం వెంకట స్వామి నాయుడి గారి దగ్గర శిష్యునిగా చేరారు. వీణతో ప్రక్కవాద్యంగా మృదంగాన్ని ఎలా వాయించాలో నేర్చుకున్న వెంకటరాజుగారు విజయ నగరంలో నాయుడు గారి దగ్గర జావళీలు, పదాలు, పల్లవులూ మొదలైన రక రకాలైన రచనలకు ఏ విధంగా మృదంగాన్ని వాయించాలో విశేషాలన్నీ నేర్చుకున్నారు. "ఎందరో మహా విద్వాంసులకు మృదంగ సహకారాన్నందించినా నాయుడు గారిని కోలంక వెంకటరాజుగారే చివరిదాకా వెంటనంటి ఉన్నారు. నాయుడుగారి ఫిడేలు ఎక్కడ వుంటే కోలంక వారి మృదంగం ఆపక్కనే ఉండేది.

"సొగసుగా మృదంగ తాళములను జతచేసి" వాయిస్తే గాని వాద్యానికి గాని, గాత్రానికిగానీ అందం రాదని త్యాగరాజస్వామి మృదంగ ప్రాముఖ్యతను పేర్కొన్నారు. 'లయులేని పాట మతిలేని మాట' అన్నట్లుగా మృదంగ వాద్యానికి ప్రాధాన్యత గాన సభల్లో అంతటిది వెంకటరాజుగారు మృదంగ వాద్యానికి స్వతంత్ర ప్రతిపత్తి కలిగించాలని తపన పడ్డారు.

సోలో మృదంగం వాయించి శ్రావ్యంగా ఉండేలా ప్రయత్నం చేసారు. కేవలం ప్రక్క వాద్యంగానే కాక ప్రత్యేక వాద్యంగా కూడా ఉండేటట్లు రూపొందించారు. సంగమేశ్వర శాస్త్రిగారితో ద్వారం వెంకట స్వామి నాయుడుగారితో దేశం నలుమూలలా తిరుగుతూ గాన సభల్లో పాల్గొనే వారు.

ఇతర సంస్థానాల్లో వారిద్దరికే కాకుండా అరియక్కుడి రామానుజయ్యర్, చెంబై వైద్యనాథ భాగవతారు చిత్తూరు సుబ్రహ్మణ్యపిళ్ళై, ఈమని శంకరశాస్త్రి, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వంటి చాలామంది

విద్వాంసులకు తన మృదంగ సహకారాన్ని ఇచ్చారు. వెంకటరాజుగారి సహకారం అందని సంగీత విద్వాంసులు లేరనే చెప్పాలి.

ద్వారం వెంకటస్వామి నాయుడుగారి కాలంలో ద్వారం నరసింగరావుగారి సమయంలో కూడా విజయనగరం సంగీత కళాశాలలో మృదంగం ప్రొఫెసర్‌గా 11 సంవత్సరాలు పని చేశారు. ఆంధ్ర దేశంలోనే కాక మైసూరు, జయపూర్ మొదలైన సంస్థానాల్లో సన్మానితులు వెంకటరాజుగారు.

తానుగా ఏ సన్మానాలూ కోరుకోకపోయినా విద్వాంసులు పొందవలసిన జనాదరణా పదవులూ సన్మానాలు వెంకట రాజుగారికి లభించాయి.

## పేరి రామ్మూర్తి

పేరి రామమూర్తిగారిని పేరిబాబు అని పిలిచేవారు. ఈయన వీణ వాయించే వారు, గాయకులు కూడా. ఆ రోజుల్లో భజన చెయ్యడం అంటే గొప్ప విషయం. ఆ భజనల్లో కీర్తనలూ కృతులు పాడేవారు. వీణ, వయొలిన్, మృదంగం ఇవి తప్పని సరిగా వాయిస్తూండేవారు. అలాంటి భజనల్లో రామమూర్తి గారు పాడుతూ వీణ వాయిస్తూ ఉండేవారు. అందరికంటే కొంచెం భారీగా లావుగా పొడుగ్గా ఉండేవారు. అందువల్ల సభలో మధ్యగా కాకుండా ఒక మూలగా ఎక్కడో ఒకచోట కూర్చునేవారు.

"ఏదైనా ముక్తాయింపు వచ్చినా "ధకి ధకి ధకి" అని అనేవారు. అంటే ముక్తాయింపు. అది అర్థం చేసుకోవాలి. "పచి, పపచి" అని అంటూ ఎంతటి క్లిష్టమైన రాగాన్నైనా సరిపడేటట్లుగా అని శ్రోతలకు ఆనందం కలుగ జేసేవారు.[75] "ఆదిభట్ల నారాయణదాసుగారి వెనుక వీణ వాయించేవారు". తెల్లవార్లూ భజన చేస్తూ పాటలు పాడుతూండటమంటే రామమూర్తి గారికి ఎంతో సంబరంగా ఉండేది. ఆయనస్వర రచనలు చేశారు. రెండు వర్ణాలు, కృతులూ కూడా రాసారు. ఇవి అలభ్యం. విజయరామగజపతి మీద రాసిన తిల్లాన ఒకటి ఉంది.

"తోంధిత్తిల్లాన తొంధిత్తిల్లాన"

"విజయనగరపురమున వెలసిన శ్రీ విజయరామనృపతిని బ్రోవురామ" ... అంటూ చరణంలో "పేరి రామగురువరుని తపోవర" ... అని రామమూర్తి గారు తన పేరును కూడా తిల్లానాలో ముద్రగా ఉంచారు. ఈ తిల్లాన వ్యవహారంలో ఉంది.

## వాసా పెదకామయ్య (కాలం వివరాలు తెలియవు)

వాసావారి కుటుంబంలో చాలా మంది బొబ్బిలిలో ఆస్థాన విద్వాంసులుగా - గాత్ర విద్వాంసులు, వైణికులుగా ఉండేవారు. వాసా పెదకామయ్య గారు వైణికులు. ఈయన రచనలు కూడా చేశారు. విజయనగర ఆస్థాన విద్వాంసులుగా ఉండేవారు. "జక్కిణ దరువులు" అనే సంగీత రచనలు చేశారు. ఈయనలో ఉండే ప్రత్యేకత నెత్తి మీద నిమ్మ పండు ఒకటి పెట్టుకుని అది కిందకు జారకుండా వీణ మీద ఘనరాగ పంచకం వాయించేవారు. ఒక్కొక్క రాగాన్ని తెల్లవార్లూ వాయిస్తూంటే విజయనగరం మహారాజావారు ఆసక్తిగా తన్మయులై వినేవారు. "ఒక రోజు నిమ్మపండు నెత్తి మీద పెట్టుకుని కింద పడకుండా నాలుగు గంటల పాటు ఘనరాగ పంచకాన్ని వాయించి నందుకు రాజావారాయనకు బండెడు నిమ్మపండ్లు ఇంటికి పంపారు"[76] బొబ్బిలిలోనే పేరి జననం.

## వాసా వెంకటరావు (1883-1944):

బొబ్బిలి జన్మస్థలమైనా వాసావారి కుటుంబంలో వాసా వెంకటరావుగారు మొదలుకొని తర్వాతి వారంతా విజయనగరం, విశాఖపట్టణం వలస వెళ్ళిపోయారు. వాసా వెంకటరావుగారు కొంతకాలం బొబ్బిలి సంస్థానంలో ఆస్థాన వైణికుడిగా ఉన్నారు. ఆ తర్వాత విజయనగరం మహారాజా ఆహ్వానం మేరకు విజయనగరం వచ్చారు. మహారాజావారి కుమార్తెలకు, పి.వి.జి. రాజు అక్కయ్య గార్లకు వీణ నేర్పించారు. కళాశాలలో 1942 వరకూ వీణాధ్యాపకులుగా పని చేశారు.

అప్పటి "వారి జీతం నెలకు 50 రూపాయలు" వీణ మీద రాగం, తానం ఏది వాయించినా మనోజ్ఞంగా ఉండేది.

"ఆకాలంలో వెంకటరావుగారు" శ్రీకంచి కామాక్షి కరుణించవమ్మా" అని వాయిస్తూంటే సరస్వతీ దేవి ప్రత్యక్షమయినట్లుగా ఉండేదని భావించేవారు".[77] ఎంతో మందికి తన పాండిత్య గరిమను దాచుకోకుండా సంగీత బోధన చేశారు.

అయ్యగారి సోమేశ్వర రావు, అప్పలాచార్యులు, రామవరపు సుబ్బారావు, చేబోలు వెంకట శాస్త్రి వీళ్ళంతా ఆయన శిష్యులే. వైణికునిగా పేరు తెచ్చుకున్న ఇటీవలి కృష్ణ మూర్తిగారు వెంకటరావుగారి కుమారుడే.

చెంబోలు వెంకటశాస్త్రి, ముక్కామల విశ్వంభరుడు, కుప్పిలి అప్పలాచార్యులు, మునిస్వామి (సన్నాయి అధ్యాపకుడు) మద్దెల అప్పన్న (మృదంగ అధ్యాపకులు) వీరన్న (డోలు అధ్యాపకులుగా మధురాపంతుల పేరయ్య శాస్త్రి (గాత్రజ్ఞులు) విజయనగరం కళాశాలలో ఉండేవారు. భుగతగోపన్న, విశ్వపతిశాస్త్రి, కన్నడ శాస్త్రి వీరంతా ఆస్థాన విద్వాంసులు కాకపోయినా రాజ సన్మానితులు. మధురాపంతుల పేరయ్య శాస్త్రి గారు సంగీతం నేర్చుకోడానికి విజయనగరం రాజావారి అనుగ్రహంతో తంజావూరు వెళ్ళి వచ్చారు. అలనాటి విజయనగర సామ్రాజ్య కళా వైభవాన్ని, గుర్తు చేసే విధంగా ఈ విజయనగర సంస్థానం సంగీత కళా నిలయమై ఎంతో మంది విద్వాంసులను ఆదరించింది.

### అధస్సూచికలు


1. దత్తాత్రేయ శర్మ, ఆణివిళ్ళ "విజయనగరం జిల్లా చరిత్ర - సంస్కృతి" మాన్సాస్ ప్రచురణ, విజయనగరం, పుట - 85
2. " అదే " పుట - 66
3. జోగారావు, ఎస్.వి. (సం) "నాయెటుక" వెల్‌కంప్రెస్, గుంటూరు, 1976. పుటలు - 31, 32.
4. రమణారెడ్డి, కె.వి. మహోదయం, విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, 1969, పుట - 115.
5. " అదే " పుట - 115, 118
6. " అదే " పుట - 118
7. అప్పారావు, విస్సా (సం) "శ్రీ త్యాగరాజస్వామి శత వార్షికోత్సవ సంచిక" ఆంధ్రగాన కళాపరిషత్తు, రాజహేంద్రవరము, 1947. పుట - 68
8. " అదే "పుట - 68

9. "విజయనగర కళా వైభవం" - రూపకం, ఆకాశవాణి విశాఖపట్టణ కేంద్రం సమర్పణ : 21.3.84

10. " అదే "

11. అప్పారావు, విస్సా (సం) "శ్రీ త్యాగరాజస్వామి శతవార్షికోత్సవ సంచిక" ఆంధ్ర గాన కళాపరిషత్తు, రాజమహేంద్రవరము, 1947. పుట - 69

12. వెంకటనారాయణాచార్యులు, తిరుమల నల్లాన్ చక్రవర్తి, "గాంధర్వ వేదామృతము" దేవనాగరి పవర్ ప్రెస్, గుంటూరు, 1957, పుట - 34

13. శింగరాచార్యులు, తచ్చూరు. చినసింగరాచార్యులు తచ్చూరు "గాయకలోచనము" (రెండవ కూర్పు) కళారత్నాకర ముద్రాక్షరశాల, చెన్నపురి, 1902, పుటలు - 3, 4.

14. " అదే " పుట - 5

15. " అదే " పుటలు - 20, 21, 22

16. " అదే " పుట - 39

17. " అదే " పుటలు - 40, 41

18. " అదే " పుట - 144

19. చూడు ఈ సిద్ధాంత గ్రంథంలోని పుట - 12.

20. అప్పారావు, విస్సా, "విజయనగర సంగీత సంప్రదాయము, భారతి, మార్చి 1953

21. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీపాద "అనుభవాలూ జ్ఞాపకాలూను" ద్వితీయ భాగం కళాభివర్ధిని పరిషత్తు, రాజమహేంద్రవరము 1958. పుట - 6.

22. శింగరాచార్యులు తచ్చూరు "స్వరమంజరి (13 వ ముద్రణ) మానిక విలాస ముద్రాక్షరశాల, చెన్నపురి - 1938. పుట - 1

23. " అదే " పుట - 7

24. " అదే " పుట - 33

25. " అదే " పుట - 34

26. సత్యనారాయణ మూర్తి, అరిపిరాల "సంగీత శబ్దార్థ చంద్రిక" ములుకోల ప్రెస్, విజయవాడ, 1954. పుట - 173

27. వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, పుచ్చా, సంగీత శాస్త్ర వాచకములు (మొదటి వాచకము) వెల్‌కంప్రెస్, గుంటూరు, 1955

28. సింగరాచార్యులు, తచ్చూరు, స్వరమంజరి - మానిక విలాస ముద్రాక్షరశాల, చెన్నపురి, 1938, పుట - 39

29. " అదే " పుట - 46

30. సత్యనారాయణమూర్తి, అరిపిరాల సంగీత శబ్దార్థ చంద్రికములు కోల ప్రింటింగ్ ప్రెస్ విజయవాడ - 1954 పుట- 456

31. సింగరాచార్యులు, తచ్చూరు, అళహసింగరాచార్యులు, "సంగీత సర్వార్థసారసంగ్రహము" - చెన్నపురి. పుట - 24

32. " అదే " పుట - 25
33. " అదే " పుట - 26
34. " అదే " పుట - 28
35. " అదే " పుట - 31
36. " అదే " పుట - 32
37. " అదే " పుట -34
38. " అదే " పుట - 39
39. " అదే " పుట - 39
40. వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, పుచ్చా, తాళమార్తాండము. పుట - 20
41. సింగరాచార్యులు, తచ్చూరు, అళహసింగరాచార్యులు "సంగీత సర్వార్థ సారసంగ్రహము" - చెన్నపురి - పుట - 77
42. " అదే " పుట - 79
43. " అదే " పుట - 97
44. జానకీరామన్, ఎస్.ఆర్. "సంగీత శాస్త్ర సారము" - రెండవ భాగము, శ్రీరామాప్రింటర్స్, తిరుపతి, 1989, పుట - 149
45. సింగరాచార్యులు, తచ్చూరు, అళహసింగరాచార్యులు "సంగీత సర్వార్థ సారసంగ్రహము" - చెన్నపురి - పుట - 122
46. జానకీరామన్, ఎస్.ఆర్. "సంగీత శాస్త్ర సారము" మొదటి భాగము, శ్రీరామాప్రింటర్స్ తిరుపతి, 1986. పుట - 203
47. నారాయణదాసు, ఆదిభట్ల "దశవిధరాగనవతి కుసుమమంజరి " వెల్ కంప్రెస్, గుంటూరు, "ఒకమాట" - పుట - 1
48. " అదే "
49. " అదే " పీఠిక
50. పినాకపాణి, శ్రీపాద - "నాసంగీత యాత్ర" ఆంధ్ర ప్రభ - 22.11.94 పుట 48
51. నారాయణదాసు, ఆదిభట్ల "దశవిధరాగనవతి కుసుమ మంజరి" సంగీత సాహిత్య ప్రబంధం, వెల్‌కంప్రెస్, గుంటూరు. పుట - 8
52. " అదే " పుట - 12
53. విజయనగరం సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీద్వారందుర్గాప్రసాద్ ఇచ్చారు.
54. " అదే "
55. జగన్నాథశర్మ, దువ్వూరి. "స్వరరాగసుధాకరము", విజయనగరం. పుట 80
56. " అదే " పుట 27
57. " అదే " పుట 27

58. " అదే " పుట 31

59. " అదే " పుట 34

60. " అదే " పుట 35

61. 1) అప్పారావు. విస్సా (సం) శ్రీత్యాగరాజస్వామి శతవార్షికోత్సవ సంచిక" ఆంధ్ర గాన కళాపరిషత్తు, 1947, పుట - 67

2) విజ్ఞాన సర్వస్వము - రెండవ సంపుటము - తెలుగు విశ్వ విద్యాలయ ప్రచురణ - హైదరాబాదు 1988. పుటలు 379, 380.

62. చూడు : అనుబంధం - VII

63. విజ్ఞాన సర్వస్వము - రెండవ సంపుటము - తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాదు. 1988 పుట - 652

64. " అదే "

65. "విజయనగర కళావైభవం" - రూపకం, ఆకాశవాణి విశాఖ పట్టణ కేంద్రం సమర్పణ. 21-3-84

66. రాజారావు, బెహతా, సైనికుడు రామమూర్తి" - గానకళ - జూన్ 1964. పుట - 24

67. చూడు : అనుబంధం - VII

68. " అదే "

69. భావనారాయణరావు, ద్వారం. "విజయనగరంలో సంగీత, నృత్య విద్వాంసులు" నాట్యకళ - జూలై 1973 - పుట 47.

70. వెంకటశాస్త్రి, చెళ్లపిళ్ళ. "కథలు - గాథలు". ప్రథమభాగము వేంకటేశ్వర ప్రింటింగ్ ప్రెస్, ఆలమూరు, 1958 - పుట 324.

71. ఆరుద్ర - ఫిడేలు నాయుడుగారు' ద్వారం వెంకటస్వామి నాయుడు గారి శతజయంతి ఉత్సవ ప్రత్యేక సంచిక - హైదరాబాద్, 1983. పుట - 37

72. " అదే " పుట - 36

73. చూడు : అనుబంధం - I

74. చూడు : " అదే "

75. చూడు : అనుబంధం - III

76. చూడు : అనుబంధం - IV

77. దత్తాత్రేయ శర్మ ఆణివిళ్ల "విజయనగరం జిల్లా చరిత్ర - సంస్కృతి" మాన్సాస్ ప్రచురణ విజయనగరం, పుట - 142

# 3. పీఠికాపుర సంస్థానం

రెడ్డి రాజుల పరిపాలన తర్వాత తూర్పు తీర ప్రాంతం అంతా గజపతుల హస్త గతమైంది. పిఠాపురదుర్గం కూడా గజపతుల స్వాధీనమైంది. విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీ కృష్ణదేవరాయలు తన సామ్రాజ్యాన్ని విస్తరించే కాంక్షతో విజృంభించాడు. అటు పిమ్మట తర్భికోట యుద్ధం జరిగింది. అనంతర కాలంలో ఆంధ్ర ప్రాంతమంతా గోల్కొండ నవాబుల పాలనలోకి వచ్చింది. ఢిల్లీ మొగలాయిచక్రవర్తుల ప్రతినిధిగా ఆంధ్ర ప్రాంతాన్ని నిజాముల్ ముల్క్ పాలించాడు. ఆ గోల్కొండ నవాబులకు సేనానులుగా సామంతులుగా ఉన్న వెలమ కులస్థులైన రావు వంశీయులకు పిఠాపుర ప్రాంతం సంక్రమించింది. తెలుగు రాచవీరుని స్వామికార్యపరతంత్రతకు మెచ్చి, నవాబు రాజమండ్రి సర్కారు ప్రాంతానికి అతనిని మొదట సర్దారుగా నియమించి, తర్వాత అనపర్తి, పిఠాపురం, పెలపాక మొదలైన ప్రోలునాటి గ్రామాలు జాగీరుగా ఇచ్చారు.

1769లో కోస్తా ప్రాంతాన్ని ఆంగ్లేయులు ఆక్రమించుకున్నారు. అప్పుడు ఈ జాగీరుదార్లను జమీందారులుగా చేశారు. పిఠాపుర సంస్థానాన్ని పూర్వం నుంచి పద్మనాయకులనేవారు పరిపాలించారు. వారు వెలమలు, క్షత్రియ వీరులు. మహాపద్మనందుడనే క్షత్రియ చక్రవర్తికి శూద్రస్త్రీ వల్ల జన్మించినందువల్ల పద్మనందులనే పేరు వచ్చింది. పరశురాముడు క్షత్రియ సంహారం చేసేటప్పుడు వీరు భయపడి, జంధ్యాలు తెంపుకుని క్షత్రియత్వం వదులుకొని పారిపోయి శూద్రులయ్యారనీ వారిని అనుపనీత క్షత్రియులనీ అన్నారు. పరశురామునికి భయపడి కొందరు క్షత్రియులు ఒక ద్వీపంలో దాక్కున్నారని, మరికొందరు అక్కడ నుండి వెలుపలికి వచ్చారని, ఆ వెలుపలికి వచ్చిన వారు వెల్లమ అనే స్త్రీ దయకు పాత్రులై ఐశ్వర్యం, బలపరాక్రమాలు కలిగి వెలమవారయ్యారని అంటారు![1]

వీరి మూల పురుషుడు రేచర్ల బేతాళనాయకుడు కాకతి గణపతి దేవునికి సాయపడుతూ ఓరుగల్లు కోట శత్రువులకు అందకుండా కోటకు 77 బురుజులు నిర్మించి ఒక్కొక్క బురుజు మీద ఒక్కొక్క వెలమ వీరుణ్ణి ప్రతిష్ఠాపన చేసి, కోటను పటిష్టం చేశాడు. ఈ డెబ్బై ఏడు మంది వెలమ వంశజులే పిఠాపురం, బొబ్బిలి, వెంకటగిరి, జటప్రోలు మొదలైన సంస్థానాల పాలకులు.

"క్రీ.శ. 1757లో జరిగిన బొబ్బిలి యుద్ధపు కాలంలో పెదమహీపతి తరపున అతని పెద తాతకుమారుడు నీలాద్రి రాయుడు ప్రతినిధిగా సంస్థానాన్ని పరిపాలించాడు. కానీ కారణాంతరాల చేత అతడు సామర్లకోటను ఆంగ్లేయుల స్వాధీనం చేశాడు. ఫ్రెంచి వారిని దేశం నుండి పంపినందుకు నవాబులు ఉత్తర సర్కార్ ప్రాంతాలను ఆంగ్లేయులకు 1762 ప్రాంతంలో ఇచ్చారు. అప్పటి నుండి పిఠాపురం వారికి లోబడి ఉంది.

పెదమహీపతి రాయునికి సంతు లేనందువల్ల నీలాద్రిరావు సంతతివారే సంస్థాన పాలకులయ్యారు. 1844 నుండి 1850 వరకు వెంకట సూర్యారావు పరిపాలించేడు. తర్వాత 1890 వరకు రాజా వెంకట మహీపతి గంగాధర రామారావు పిఠాపురాన్ని పాలించాడు. 1885లో గంగాధర రామారావుకి తనయుడు జన్మించాడు. అతడు 1907లో పట్టాభిషిక్తుడయ్యాడు. ఈతడే పిఠాపుర సంస్థాన పాలకులలో కడపటి అధిపతి"[2]

అఖండ ఖ్యాతి పొందిన రాచకొండరేడు సర్వజ్ఞ సింగభూపాలుడు కవి, పండితుడూ సంగీత విద్వాంసుడూను సంగీత సుధాకరం. రసార్ణవ సుధాకరమనే గ్రంథాలకు కర్త ఈతని వంశజులే పీఠికాపురాధీశులు.

పిఠాపురసంస్థానాధీశులలో రావు గంగాధర రామారావు (1862-1890) గారికి కళలయందాసక్తి ఎక్కువ. ఆయన సిద్ధేంద్రయోగి కృత పారిజాతాపహరణ నాట్యాన్ని కోనె వెంకట రత్నం అనే ఆమె అభ్యసించేందుకు ఏర్పాట్లు చేశారు. పెండ్యాల సత్యభామ అనే నాట్యకత్తెకు మాన్యాలిచ్చారు గంగాధర రామారావుగారు.

"డా. శ్రీ రావువేంకటకుమార మహీపతి సూర్యారావు (1885-1964) కూడా కళాభిమానులే. ఈయన క్షేత్రయ్య పదాలకు పీఠిక రాశారు.

సూర్యారావుగారి ధర్మ పత్ని (నూజివీటి ప్రభువు రంగయ్యప్పారావుగారి కుమార్తె) మహారాణి చిన్న మాంబాదేవికి సంగీతం అంటే ఎంతో ఇష్టం. ఆమె వీణ అభ్యసించింది. తన కుమార్తెలకు కూడా వీణ నేర్పించింది."[3]

సంగీత కళాభిమానులైన రాజావారి ఆస్థానానికి అనేక మంది సంగీత విద్వాంసులు రావడం, సన్మానితులు కావడం ఎప్పుడూ ఉండేది. పీఠికాపుర సంస్థానంలో దసరా నవరాత్ర్యుత్సవాలు ఘనంగా జరిపేవారు. దేశం నలుమూలలా ఉన్న విద్వాంసులు ఇక్కడికి వచ్చేవారు. పిఠాపుర ఆస్థాన విద్వాంసులే వీరందరికి పరీక్షాధికారులుగా ఉండేవారు. ప్రతీ సాయంత్రం దర్బారులో ఒక్కొక్క రోజు వీణాగానమో, వేణుగానమో, గాత్ర సంగీత సభో జరిగేది. వారి ప్రతిభకు తగినట్లుగా సన్మానం జరిపేవారు.

దసరా ఉత్సవాల్లోనే దివాన్ బహద్దూర్ కొమ్మిరెడ్డి నారాయణ మూర్తినాయుడుగారు పిఠాపురానికి వచ్చిన విద్వాంసులందరినీ కాకినాడ సరస్వతీ గాన సభకు రప్పించి తమ అధ్వర్యంలో సంగీత కార్యక్రమం ఏర్పాటు చేసేవారు. వాళ్ళలో మహామహులైన గాయకులు పుష్పవన అయ్యర్, నైనాపిళ్ళే, వయోలిన్ ద్వారం వెంకటస్వామి నాయుడు, రామానుజయ్యంగార్, ఫ్లూటు విద్వాంసులు పల్లడం సంజీవరావు, మార్దంగికులు కోలంక వెంకటరాజు, దక్షిణామూర్తి పిళ్ళే, రామమూర్తి, వీర రాఘవయ్య చౌదరి ఇంకా చాలా మంది విద్వాంసులు పిఠాపురం దర్బారులో తమ ప్రతిభను ప్రదర్శించి బహుమానాలందుకున్నవారే. ఆ సందర్భంలో దివాన్‌గారు ఆస్థాన విద్వాంసులనూ పండితులనూ పేరుపేరునా ఆహ్వానిస్తే, రాజావారు వారికి కాశ్మీరు శాలువా కప్పి వెయ్యిన్నూటపదహార్లు బహూకరించేవారు.

# మొదటి భాగం
# పిఠాపుర సంస్థానంలోని
# వాగ్గేయకారులు - వాఙ్మయం

## మద్దిరాల వేంకటరాయకవి (కాలం వివరాలు తెలియవు)

"సంగీతంకానీ, కవిత్వంకానీ, జీవితానికి స్వాతంత్ర్యాన్ని కలిగించడంలో అందెవేసినవేగానీ, వాటి వెంట దారిద్ర్యం దీపానికి నీడలాగా ఆశ్రయించడం అనుభూతం. దానికి తోడు అనారోగ్యం కూడా ఏర్పడుతుంది."[4] చెళ్ళపిళ్ళ వారన్న ఈ మాటలు మహావాగ్గేయకారుడైన మద్దిరాల వేంకట రాయకవికి అక్షరసత్యాలయ్యాయి.

200 సంవత్సరాల క్రితం పిఠికాపుర సంస్థానంలో మద్దిరాల కవి అనే వాగ్గేయకార భక్తుడుండేవాడు. త్యాగరాజస్వామి సమకాలికుడని విద్వాంసుల అభిప్రాయం" 270 సంవత్సరాల పూర్వీకుడు అని "మా పిఠాపురం" గ్రంథకర్త అభిప్రాయం."[5]

మద్దిరాల వేంకటరాయకవి కృత ఏకాంత సేవావిలాసం కావ్యానికి పీఠిక రాసిన విమర్శదర్శక "నడుకుదుటి వీరరాజు" కవిని త్యాగరాజు సమకాలికులుగా రాశారు. "బాలాంత్రపు రజనీకాంతారావు గారు తన వాగ్గేయకార చరిత్రలో కూడా ఈ విషయాన్నే రాశారు"[6] మద్దిరాల కవి జీవించి ఉండగా అతని గురించి తెలిసిన విమర్శకుడు వీరరాజుగారి పీఠికలో ఇలా ఉంది.

"మద్దిరాల వేంకట రాయ కవి గారిని నేను కొంచెంగా ఎఱుగుదును. ఆయన మరణించే నాటికి నాకు ఏడెనిమిదేళ్ళు. వడ్డాది వెంకట రాయుడు గారు, కవిగారు, తోడల్లుళ్ళు. ఆయన సోదరీమణులలో ఒకామె మల్లాము గ్రామకరణంగా ఉన్న మల్యాల సుబ్బారాయుడు గారి తల్లి, వెలివెలసోమకవి, తటవర్తి వెంకటరాయుడు, వీరంతా మన వెంకటరాయకవికి దౌహిత్రులు"[7]

ఇప్పటికీ పీఠికాపుర వాసులు, (పీఠికా రచయిత కాలానికన్న మాట) ఎనభై ఏళ్ళ వారయిన బ్రహ్మశ్రీ జరుగుమిల్లి వేంకటాచలం, వక్కలంక వీరభద్రకవి గారి వంశం వారైన భవానీ శంకర కవిగారికి మద్దిరాల కవి మేనల్లుడని చెప్తారు."[8] పైన చెప్పిన వడ్డాది, మల్యాల, తటవర్తి మొదలైన కుటుంబాలు ఆర్వేల నియోగ బ్రాహ్మణులు. వారి బంధువైన వెంకట రాయకవిని కూడా ఆర్వేల నియోగిగా భావిస్తున్నారు.

ఈ కవి భారద్వాజసగోత్రీకుడు, తల్లి వెంకట లక్ష్మి, తండ్రి నాగన్న, గురువు కంచిభట్ల లక్ష్మీనారాయణ (లక్ష్మన్న) శాస్త్రి.

"ఏకాంత సేవావిలాసమనే పేరుతో రాజరాజేశ్వరీ, కుక్కుటేశ్వర స్వాముల శృంగార కలాపాన్ని కీర్తనాత్మకంగా వర్ణించాడు."[9] రాజాదరణకు పాత్రుడై కూడా ఈ మహా విద్వాంసుడు మిగుల దారిద్ర్యం అనుభవించాడు. దానికి కారణం పసితనంలో తన గురువు కిచ్చిన మాట భగవంతుని స్తుతిగా రాసిన పాటగానీ, కావ్యం గానీ నరులకు అంకితమివ్వనని అగ్నిసాక్షిగా వెంకట కవి తన గురువు గారికి మాట ఇచ్చాడు.

ఆ విషయం తెలిసి, ఆగ్రహించిన రాజు ఇతః పూర్వం కవిగారికి తానిచ్చిన సంపదంతా వెనక్కు తీసుకున్నాడు. అప్పటి నుండి ఈతిబాధలకు గురయ్యేడని ఐతిహ్యం".

రాజావారి దర్శనం చేసుకుని తమ కష్టం విన్నవించుకుంటే తగిన సహాయం చేస్తారని ఆశతో వెంకటరాయకవి కోటకు వెడితే, ద్వారపాలకుల కఠిన చర్యలను ఎదుర్కోలేక రాజదర్శనాన్ని పొందలేకపోయాడని మరో ఐతిహ్యం.

చివరకు తండ్రి ఆబ్దీకం పెట్టడానికి చేతిలో కాణీ కూడా లేకపోయింది. తన జపమాల స్ఫటిక తావళాన్ని పిఠాపురం సంస్థానంలో వణిక్ప్రముఖుడైన కంచెర్ల కృష్ణయ్య అనే వైశ్యుని దగ్గర తాకట్టు పెట్టి, రెండు రూపాయలు తీసుకుని, ఆ డబ్బుతో పితృశ్రాద్ధాన్ని నిర్వర్తించాడు. తావళం చేతిలో లేనందువల్ల నిర్విణ్ణుడై ఉండలేక, ఇక అడవులకు పోయి ఆ స్వామిని ధ్యానిస్తూ ఆకులలములు తింటూ జీవించాలని భార్యాసహితుడై బయల్దేరాడు వెంకటరాయకవి.[10]

ఆదంపతులు పిఠాపురం నుండి ఉత్తర దిక్కుగా ఊరిపొలిమేరకు చేరుకున్నారు. తీవ్రతాపం వల్ల అక్కడ నిస్సత్తువతో స్పృహ కోల్పోయి ఇద్దరూ పడిపోయారు. అప్పుడామహానుభావునికి స్వామి కుక్కుటేశ్వరుడు ప్రత్యక్షమైనట్లు, "ఏదీ! ఆకుముడుపులు పంపెరా" అనే దరువు పాడమని పలికినట్లు కవికి లీలగా తోచిందట. అప్పుడు వెంకటరాయకవి స్వామితో "స్వామీ! జపమాలిక కుదువ బెట్టిన నాకు ఆనంద మెక్కడిది" అని సమాధానమిచ్చాడట. దానికి తగిన ఏర్పాట్లు చేసితినని" స్వామి చెప్పాడు. వెంటనే వెంకట రాయకవికి మెలకువ వచ్చింది. ఆనందంతో

"ఆకు ముడ్పులు పంపెరా యివె యందు కొమ్మిటు చూడు నీ
రాకకే యెదురౌచునున్నది! రాజసంబున బ్రోవరా!
శ్రీకరంబగు నింటికిన్ దయఁ సేయరా తడ వాయెరా
ప్రాకటంబుగఁ గుక్కుటేశ్వర! భావ నిన్పిలిచిందిరా" [11]

అంటూ గట్టిగా పాడారు. ఆ పాటకు భార్య కూడా నిద్ర లేచింది. అంతలో భేరీకాహళ వాద్యాలతో పెద్ద కోలాహలంగా ఊరేగింపుతో వచ్చే వారిని చూసి, భార్య భర్తను భుజంతట్టింది. ఆ ఊరేగింపు కవి దంపతుల దగ్గరకు వచ్చింది. జపమాల తీసుకున్న కంచెర్ల కృష్ణయ్య సాదరంగా కవిగారిని ఊరిలోనికి తీసుకుని వచ్చి, నూతన గృహ ప్రవేశం చేయించి, కవిగారి జపతావళంతో బాటు, బంగారు నగలు, పట్టు వస్త్రాలు అవీ ఇచ్చి నమస్కరించాడు. ఆ విధంగా ఆనాటి నుండి కవిగారి దారిద్ర్యం తీరిపోయింది.

ఆ తర్వాత కొన్నాళ్ళకు పిఠాపురం రాజావారు తీవ్ర రోగగ్రస్తులయ్యారు. శరీరం నిండా బొబ్బలతో నానాబీభత్సంగా రసికారుతూ బాధపడ్డారు. ఏకారణమో తెలీదు కానీ వెంకటరాయకవిని నిర్లక్ష్యం చేసినందుకే తనకీ శిక్ష పడిందన్న అభిప్రాయం రాజావారికి కలిగింది. వెంటనే కవిని కలుసుకుందామని నలుగురు మనుష్యుల సాయంతో మేనాలో కూర్చుని బయలు దేరారు. వెంకటరాయకవి ఇంటి వరకూ వచ్చేసరికి రాజావారు పూర్తిగా కోలుకున్నారు. మహారాజు కవిగారిని క్షమించమని వేడుకున్నారు. పశ్చాత్తాప పడ్డారు. వెంకటరాయకవి "అంతా ఆ కుక్కుటేశ్వరస్వామిదయ" అన్నారు. రాజావారి పశ్చాత్తాపానికి శరీరం మీదున్న పుండ్లు మాయమై పోయాయి.

"ఒక మహా విద్వాంసుని నిర్లక్ష్యం చేసినందుకే తనకీ శిక్ష పడిందని ఎంతో బాధపడి, కవిగారిని ఆస్థానాన్ని అలంకరించమని రాజావారు ప్రార్థించారు. ఆ విద్వాంసుడు కొంతకాలం రాజావారి ఆ స్థానంలో ఉన్నట్లు ఒక అభిప్రాయం"[12]

అతడు భక్తుడై ఐహిక వాంఛలకు లొంగక కుక్కుటేశ్వర సన్నిధిలో కాలక్షేపం చేశాడని మరో

అభిప్రాయం. వెంకటరాయకవిగారిని ఒకప్పుడు ఆనాటి పిఠాపుర సంస్థానాధిపతి నీలాద్రిరాయడు పిలిపించి "కవీంద్రా! ఎప్పుడు కుక్కుటేశ్వర స్వామినే కానీ మాధవ స్వామిని స్తుతింపరా" యేమని ప్రశ్నించారు. అప్పుడు కవిగారు

"హరియనగ హరుడనగ నరయభేదమె లేదు

పరమ తేజంబిటుల ప్రసరించె మనసా!

అంటూ గీతాల్ని పాడాడు. అమ్మహారాజు సంతోషించి విశేషించి సన్మానించేడు.

## ఏకాంత సేవా విలాసము

ఈయన ఏకాంత సేవా విలాస ప్రబంధంలోని కీర్తనావళి ధూప సేవా కీర్తనలు, ఏకాంత సేవ, భజన కీర్తనలు అని మూడు భాగాలుగా ఉంది.

ఈ గ్రంథంలో ఏకాంత సేవా భాగంలో పరమేశ్వరీ మహేశ్వరులను చక్రవర్తినీ, చక్రవర్తులుగా చేసి, వారిలో పరమేశ్వరుని వాహ్యాళికి పంపుతాడు కవి.

అప్పుడు పార్వతి భర్త వియోగ భారం సహించలేక యా దేవుని తీసుకురమ్మని చెలికత్తెను పంపుతుంది. పరమేశ్వరుని స్తుతించి ఆమె గౌరీదేవి రాయబారం మహేశ్వరునికి ఒక ఉపన్యాసం లాగ వివరించి అతనిని ఇంటికి తీసుకువస్తుంది. శంకరుడు ఇంటికి చేరుకోగానే భవానీ దేవి ఆజ్ఞతో గుమ్మం దగ్గర చెలులు ఆయనకు మంగళ హారతులిచ్చి, హెచ్చరికలు పాడి లోపలికి తెస్తారు. గౌరి కోపగించుకోవడం, ద్వారం బంధించి అద్భుతమైన సంవాదం చెయ్యడం, ఇద్దరి మధ్యా చివరికి రాజీ కుదిరి ఒక్కటవడం జరుగుతుంది. అంతసేపు వారి వాదన విన్న గంగ కోపంతో శివుని నెత్తి మీద నుండి కిందకి దిగి, సవతితో వాదులాడుతుంది. తుదకు నీరక్షీరన్యాయంగా రాజీ పడతారు. అంతట దేవకాంతలు హుంకారిణీ కుక్కుటేశ్వరులకు జోలపాటలు, లాలి పాటలు పాడి, వారిని శయనింపచేసి, శోభనపు పాటలు పాడతారు. ఆ తర్వాత భక్తి ప్రమోదాలతో సదాశివుని మహిమలు పొగుడుతూ అమ్మవారి గురించి స్తుతిస్తూ గానం చేస్తారు. భక్తి శృంగార రసాలతో మేళవించిన ఈ గేయ ప్రబంధం ఏకాంత సేవా విలాసంగా సార్థక్యం చెందింది. సరస్వతీ దేవి వీణ వాయిస్తూ పాడుతుంటే లక్ష్మీదేవి స్వరకల్పన చేస్తూంటే, బ్రహ్మదేవుడు తాళాలు మ్రోగిస్తూ ఉంటే, విష్ణు మూర్తి మృదంగం వాయిస్తూ ఉంటే, ఇంద్రుడు వేణువు, సూర్య చంద్రులు సన్నాయి వాయిస్తూంటే, ప్రమథులు ఇతర వాద్యాలు వాయిస్తూ ఉంటే ఆదిశేషువు తల్లడిల్లేలాగా, కూర్మ రాజు వీపు వంగిపోయేలా బ్రహ్మాండమంతా జయ జయ ధ్వనాలతో నిండిపోయేలాగా రోజా ప్రదూషకాలాల్లో నటరాజు తాండవ మాడుతూంటే పార్వతీ దేవి ఆనందంతో కరిగిపోయేది. ఎంతో సుందరంగా తాండవ నృత్యాన్ని కవి వర్ణించాడు. పర్వదినాలలో కుక్కుటేశ్వర స్వామికి ఆపాటలే ఉత్సవాల్లో పాడతారు.

ఈ కీర్తనలను ముద్రించక ముందు మల్లిరాల వెంకటరాయ కవి శిష్యులు ప్రశిష్యులు వీటిని దేవాలయంలో ఆయా సందర్భాలలో పాడుతుండేవారు. ఆ ప్రశిష్యుల శిష్యుల శిష్యుల్లో కందాళ వారు ఒకరు. వారి పితామహులు కూడా దేవాలయ ఉత్సవాల్లో కీర్తనలు పాడుతుండేవారు. ఆ సంప్రదాయం మా వరకూ వచ్చిందని కందాళ పేరేశ్వర శర్మ సోదరులు గారు చెప్పారు.

పుస్తకంలో ఉన్న క్రమంలో కాక పాడే పద్ధతి వేరే క్రమంలో ఉంటుంది. అది కూడా ఒక పద్ధతిగా రాసుకున్న పట్టిక నాకు కందాళ వారిచ్చారు. ఇది 14.11.60 ప్రాంతాల్లో రాసుకున్న పట్టి.

## ఏకాంత సేవా ప్రారంభం

చూర్ణిక: మంగళహారతి: హెచ్చరికలు: సంవాదాలు 1, 2, 3 అర్ధ చంద్రికలు: హారతి; లాలి - ఈ విధంగా పాటలను ఒక క్రమంలో ఏర్పరుచుకుని పాడతారు.

ఇంతటి గొప్ప గేయ ప్రబంధ రూపంలో భగవంతుని శృంగార లీలను వర్ణించిన మద్దిరాల వెంకట రాయకవి వలన పిఠాపుర సంస్థానం ధన్యమైంది.

కవి కాలానికి 40 సంవత్సరాల తర్వాత ఏకాంత సేవా విలాసమనే ఈ గేయ ప్రబంధం మొట్ట మొదట సుమారు 1890 ప్రాంతాల్లో చెన్నపురిలో గుజరీ పుస్తకంగా ప్రచురితమైంది. ఒంటెద్దు శ్రీగిరి, చిన శ్రీగిరి (పర్వతాలు) అనేవారు భక్తి ప్రపత్తులు కలవారవడం చేత రైలులేని ఆకాలంలో ధూమనౌక మీద చెన్నపురి వెళ్ళి ఈ గ్రంథాన్ని అచ్చు వేయించారు. అందులో అచ్చు తప్పులు చాలా వున్నాయి. ఆ తర్వాత చాలా సంవత్సరాలకు పీఠికాపురవాసులు ఈ గ్రంథం మీద గల అభిమానం వల్ల పునర్ముద్రణ చేయించాలనే ప్రయత్నంలో చాలాకాలానికి విమర్శాదర్శక నడకుదుటి వీరరాజు అనే మహానుభావుని సహాయంతో తప్పులను కొంత సవరించి, గుజరీ పుస్తకాన్ని పరిష్కరించడంలో కొంత శ్రమపడి పునః ముద్రించారు.

"ఓలేటి కోటేశ్వరరావు గారిచేత ఆయన తల్లిగారైన కామేశ్వరమ్మ గారి జ్ఞాపకార్థంగా భక్తులకు ఆ పుస్తకాన్ని ఉచితంగా ఇవ్వడానికి ముద్రించారు."[13] తొలిపలుకులో ఏకాంత సేవా విలాస గ్రంథ రచయిత గురించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

"కవివర్యులు తమ బహుముఖ ప్రజ్ఞా పాటవ సూచకములను భక్తి పారవశ్యమునకు నిదర్శనములను, భక్తజన మనోరంజకములునగు నీ కీర్తనలను రచించి గానము చేయుచు, చేయించుచు పాషండుల సైతము భక్తులుగా గొనర్చిన మనీషి ఆర్వేల నియోగి బ్రాహ్మణుడు. తల్లి వెంకట లక్ష్మి తండ్రి నాగనార్యులు. 1800-1880 ప్రాంతంలో వెంకటరాయకవి జీవించాడు. ఈతని గురువు కంచిభట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి".

ఈ గేయ ప్రబంధానికి పీఠిక రాసిన నడకుదుటి వీర్రాజు, మద్దిరాల వెంకటరాయ కవిని సజీవులైయుండగా చూశారు. కవిగారు మరణించే కాలానికి వీర్రాజుగారికి ఏడెనిమిదేళ్ళు ఉంటాయి. ఆ విధంగా ఆ కవి గురించి కొంత తెలిసింది. కవిగారు ఆర్జించిన ఒకపాటి పెరడు వీర్రాజుగారి తండ్రి కీ.శే. వెంకటాద్రిభట్టు గారికి వెల వెల సోమకవిగారు దానం చేశారు. ఆ పత్రంలో "మామాతామహార్జితమైన అనగా మద్దిరాల వెంకటరాయుడుగారి దిబ్బ" అను పేరుగల నివేశనపు పాటి దొడ్డి" అని రాయబడి ఉంది.[14]

ఈ ఏకాంత సేవా విలాసగేయ ప్రబంధంలో ఉన్న రచనలు ఏవీ స్వరపరచినవి కావు. కొన్ని కీర్తనలకు, కృతులకు రాగ నిర్దేశం, కొన్నింటికి తాళ నిర్దేశంకూడా చెయ్యలేదు. ఈ గ్రంథంలోని కీర్తనలను దేవాలయాల్లో ఇప్పటికీ పాడుతున్నారు. ఈ గ్రంథం నాకు ఇచ్చిన కందాళ శేషయ్యగారు వాళ్ళ ముత్తాత గారి దగ్గర నుండి ఈ పాటలు నేర్చుకుంటూ "మా ఇంట్లో అందరూ ఆ సంప్రదాయాన్ని రక్షించుకుంటూ వస్తున్నా"మని చెప్పారు. పిఠాపురంలో మద్దిరాల వెంకట రాయకవి గారి కీర్తనలు దేవాలయంలో పాడటం సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ననుసరిస్తూ వచ్చిన కుటుంబాలలో కందాళ వారి కుటుంబం ఒకటి. కందాళ శేషయ్యగారు ఈ పాటలు పాడి వినిపించారు. "ఆ విధంగా పాడేవారు పిఠాపురంలో వీరు తప్ప మరెవరూ లేరని, ఏ విద్వాంసునికి రావని కందాళ వారే సెలవిచ్చారు."

ఏకాంత సేవా విలాసంలోని రచనా విధానం కొంత ద్విపద, కొంత కీర్తన, కొంత శ్లోకం, మరికొంత పద్యం, అర్ధ చంద్రికలు, దర్వు ఈ విధంగా మిళితమై ఉంది. భక్తి, ఆత్మీయత, మమకారం, ఆగ్రహాలను ప్రాచీన కవులు, సంగీతకారులు వ్యక్తం చేసిన పద్ధతినే ఈయన కూడా అవలంబించాడు.

పార్వతీ పరమేశ్వరులను నాయికా నాయకులుగా తల్లిదండ్రులుగా భావించి చేసుకున్న విన్నపాలు, పంచుకున్న అభిమానాలు, అదలించిన అదలింపులు ఈ రచనల్లో కనిపిస్తాయి.

కుక్కుటేశ్వర స్వామివారి ధూప సేవా కీర్తనలు ఏకాంత సేవా విలాసంలోని మొదటి విభాగం : ఇందులో మొదటిది ద్విపద :

"శ్రీ కరమ్మగునట్టి చిత్తంబునందు, ప్రాకటంబుగ నిత్య భక్తి గీల్కొలిపి
ముందుగా శ్రీగురు మునినాధుపాద, వందనం బొనరించి వాణికి, మ్రొక్కి
గణనాథు పూజించి కమలజా నెంచి ఫణిశాయి గీర్తించి పద్మనర్చించి
.....
అంటూ ముందుగా దేవతా వందనం చెప్పుకున్నాడు.
ఇదే ద్విపదలో గురువు, తల్లిదండ్రుల్ని స్మరిస్తూ వందనం చేస్తాడు.
"రహిగోత్రకర్త భరద్వాజమునికి, బహునుతులొనరించి - భక్తిని బెంచి
మద్దిరాలాన్వయ మహిత సుధాబ్ధి - సద్దేవుడై యున్న చతురు నాగన్న
ననుగన్న తండ్రికి నతులొనరించి, తనరువధూటి తల్లి మా తల్లి
వేంకటలక్ష్మికి వినతులమర్చివేంకట రాయాఖ్య వెలసినవాడ
శివపాద పద్మ సంశ్రితులనుతించి భవము రాకుండ నభవుని సేవా ప్ర
కారంబు రచియింపగా నెంచు చుండ, హారి పీఠపురీ విహారుడై నట్టి
శ్రీ కుక్కుటేశుండు కృతి మాకు నిమ్ము, మాకు భక్తుడవు ప్రేమయు గల్గు చాల"
"శంకయేటికి నీకు శంకరదాస, వేంకటరాయ నీవే నమ్మితనిన
కరుణకు నాశ్చర్యగరిమ చేనపుడు, చిరతరశివకృపాసిద్ది గల్గుటను
వరదుని మీద సేవా ప్రకారంబు, సరస కవిత్వ వాక్చాతురి మెఱయ
జెప్పితిగవులార! శివభక్తులార! తప్పులు గల్గిన దయనాదరించి
యొప్పులు సేయుడీ యోబుధులార, చప్పనయనమాట చప్పదనంబె
బో! బళా! యను మాటయమృత సారంబె, కాబట్టి యీ సేవక క్రమమెట్టిదనిన"[15]

తన తల్లిదండ్రులను, గోత్రాన్ని, వంశాన్ని, గోత్రకర్తను అన్నింటినీ ఈ ద్విపదలో విన్నవించుకున్నాడు. పిఠాపురాధిదేవత కుక్కుటేశ్వర స్వామే తనను కృతి రాయమని అడిగినట్లు చెప్పుకున్నాడు.

వెంకటరాయకవి పునర్జన్మ రాకుండా ఉండేందుకు అభవుడైన శివుని గురించి ఆయన సేవాద్రిక్రమాన్ని పుస్తకంగా రాయాలని మనసులో అనుకుంటూండగా ఈశ్వరుడే కృతి రాసి అంకితమివ్వమని అత్యంత ప్రియతముడైన భక్తుడవు నీవు మాకని అడిగినట్లుగా ద్విపదలో చెప్పాడు. సరసమైన పదజాలంతో మాధుర్య చతురతతో మెఱసేటట్లు ఈశ్వర సేవా ప్రకారాన్ని హృదయంగమంగా చెప్పాడు.

ఓ పండితోత్తములారా! ఈ రాసిన గేయ ప్రబంధంలో తప్పులు ఉంటే దయతో ఆదరించి ఒప్పుగా చేయుండి అని కవి విన్నవించుకున్నాడు. ఈ ద్విపద తర్వాత ఈశ్వరుని స్తుతిని వర్ణనాత్మకంగా "చూర్ణిక" లో రాశారు. అంతా కూడా సంస్కృత భాషా పద జాలంతో ఉంది.

సామవేదం నుండి ఉద్భవించిన గద్య ప్రబంధాల భేదాలలో చూర్ణిక ఒకటి. దీని లక్షణం సంగీత రత్నాకరంలో ఇలా ఉంది.

"గౌడీయ రీతి రుచిరా వృత్తి మారభటీశ్రితా

చూర్ణం శాంతే రసే పీతంగాతవ్యం బ్రహ్మదైవతమ్"[16]

అధ్యాత్మరామాయణంలో మునిపల్లె సుబ్రహ్మణ్యకవి జటాయువు మరణించే ముందు చేసిన రామస్తుతి, చూర్ణిక అటువంటి చూర్ణికే ఇది - ఈశ్వరుని స్తుతి.

"శ్రీమత్సర్వమంగళ గుణ గణ కలిత సర్వ మంగళా

కుచకలశవిలసిత హారిద్ర, ముద్రితోరః ప్రభావాభిరామా!

రామాజనవీణానందకరశతకోటి సుమశరలావణ్య విగ్రహా!

.........

............

వేదాంత వేద్య పురాణ పురుషోత్తమోత్తమ!

హుంకారిణీ మనోహర! పీఠపురీశ్వర! కుక్కుటేశ్వర

స్వామి న్నామ కీర్తన ప్రియ నామకీర్తన మవధారయ"

దీనికి రాగ నిర్దేశం చెయ్యలేదు.

మొదట కుక్కుటేశ్వరుని శరణుకోరి ఆ పిమ్మట హుంకారిణీ అమ్మవారిని అనుగ్రహింపమని ఆ పిమ్మట విఘ్నేశస్తుతి చేసారు.

తోడి రాగం అట తాళంలో

"శరణయ్య విఘ్నేశ - శరణయ్య విఘ్నేశ

శరణయ్య శ్రీ పీఠాపుర విఘ్నేశ [17]

ఇలా సాగే ఈ కృతిలో చాలా వరకు సంస్కృత పదాలు ఉన్నాయి.

ధూప సేవలో శ్లోకం

ధూప మాఘ్రాపయామీశ, కుక్కుటేశ మహేశ్వర!

పీఠాపురీ మహారత్న! పీఠ సంస్థిత - శంకర!

ఆ తర్వాత కీర్తన

కుక్కుటేశ తేశివ శరణం కుధరవేశ్మతే శివశరణం"[18] ఈ కీర్తన మొత్తం సంస్కృతంలో రాశారు.

అమ్మవారిని కొంత, అయ్యవారిని కొంత అన్నట్లుగా శివపార్వతులను విడివిడిగా కీర్తనల్లో కీర్తించారు.

నామగోపకీర్తన, నామావళి, వర్ణక్రమ కీర్తన అన్నమూడింటిలో కుక్కుటేశ్వర స్వామిని

1. నామావళి అటతాళం 2. నామావళి ఆదితాళంలోనూ రాశారు.

"కుక్కుట మహలింగ మహదేవ దేవ కోటిదసంగ మహాదేవ

అంబరాంబర అంబరకేశ! అంబికానాథ మహాదేవ"[19]

ఈ విధంగా మొదటి నామావళి ఉంది.

నామగోపన కీర్తనలో చివర వేంకటరాయకవి తాను దేవుని కొక విన్నపం చేసుకున్నాడని, ఆ పాటలోని ప్రతి పంక్తి మొదటి అక్షరాలు వరుసగా కలిపితే "బాహుబలేంద్రుల సీతారామయ్యగారు మాతమ్మలకు వివాహము సేయ వలయును అని యేర్పడును."[20] అని నామగోపనమంటే ఇదే అని విమర్శకులు భావించారు.

"నామ గోపన కీర్తన

ప॥ సాంబ పరాక శర్వ పరాక - శంకర హర శివ॥ శంభో పరాకా॥

**బా**దరాయణాది - బహుమౌని సన్నుత - పదపద్మశ్రీ వీరభద్ర పరాకా॥

**హుం**కారమున దక్షుపొంక మణంచిన - పంకజాక్ష వీరభ॥

**బ**హుతరబ్రహ్మాండ - భాండసంరక్షణ॥ పరమేశ శ్రీవీరభ॥

**లేఁ**త జింకఁ దాల్చి - లీలతో నటియుంచు॥ పాతకహర వీరభ॥

**ధృ**క్కర్ణ భూషణ - దీన సంరక్షణ - వాక్కాంతానుత వీరభ॥

**ల**క్ష్మీరమణబాణ- రాజిత శ్రీరాజ్యలక్ష్మీపవీర లలామ పరాకా॥

**సీ**తాచలేంద్ర సుతా త న్వాశ్రిత॥ పాతక హర వీరభ॥

**తా**పసహృత్కంజ - దీపమ వగుమీ ప్రాపు జేరితి వీరభ

**రా**జితశైల సద్రాజితి గౌహవి॥ భ్రాజిత శ్రీవీరభ॥

**మ**హనీయ గుణరాశి - మముఁబ్రోవ నిదెవేళ॥ బహునతనుత వీరభ॥

**య**జ్ఞ సంరక్షణ - యజ్ఞేశ యజ్ఞాంగ॥ ప్రజ్ఞాతిశయ వీరభ॥"[21]

"**గాం**గజలోధార - కవిత జటాజూట॥ భంగ రహిత వీరభ॥

**రూ**ఢముగా నమ్మి - గూఢముగా నుంటి॥ ప్రౌఢిఁజూపు వీరభ॥

**మా**వంటి దీనుల - బ్రోవ నీవె కాదె పావన శ్రీ వీరభ॥

**త**మ్ముల వంటి పద్మమ్ములకును విన్నపమ్ము జేసితి వీరభ॥

**ము**ను లెల్ల మీ పాద - ములు గోరు చుందురు॥ పని వడి శ్రీ వీరభ॥

**ల**లిత కటాక్షాంచలముల దయఁజూడు పలుమాఱు శ్రీ వీరభ॥

**కుం**డలి కుండల - గండ స్థలాంచిత॥ పండితనుత వీరభ॥

**వి**తత దానధుర్య - వేదాంతనుతచర్య పతితదూర వీరభ॥

**వా**రధి తూణీర పాలిత భవ భక్త॥ పారిజాత వీరభ॥

**హా**రిహయముఖ సర్వసుర మౌళి రత్న సంభరిత శ్రీపద పీరభ॥

**ము**దితుడనౌదునా - ముద్దు చెల్లింపుమీ॥ పదవడి శ్రీ పీరభ

**అ**బ్బుల జేరక - రూఢి - మిము నమ్మితబ్బరకంఠ పీరాంక భద్ర॥

**సే**వింత మిము జాల దీవింతు మదిలోన॥ భావింతు శ్రీ పీరభ॥

**య**మనియమాద్య - ష్టాంగ యోగ పద్మ॥ భ్రమరరూప పీరభ॥

**వ**రదుడవై మమ్ము॥ - గరుణింపు సిరులిచ్చి॥ పరమాత్మ శ్రీ పీరభ॥

**ల**క్షలడుగ లేదు - రక్షింపు మంటిని॥ పక్షముంచి పీరభ॥

**యు**ద్ధ భీముజగ - దుద్దార యాజ్ఞకు॥ బద్ధుడ శ్రీపీరభ॥

**సూ**ఱుయాగంబులు - పేరు వహింపుమీ॥ పౌరుషము పీరభ॥

వల్లి సమాధాన మెట్టు సమ్మతింతు॥ పల్లి స శ్రీ పీరభ॥

కరుణింపు శ్రీ పీఠాపుర కుక్కుటేశ్వర॥ వరరూప శ్రీ పీరభ॥

లాలితశ్రీ మద్దిరాల వేంకట రాయడీలాగువేడ

పీరేశ పరాక ॥ సాంబ పరాక॥[22]

కవికి బాహుబలేంద్రుల సీతారామయ్యగారు ఒక ధనికుడైన మిత్రుడు. మద్దిరాల వెంకటరాయకవి ప్రభువులను వేడుకొని సహాయాన్ని పొందడం ఇష్టం లేక మిత్రుణ్ణి తమ్ముల వివాహార్థం ధన సహాయం చెయ్యమని కోరాడు. ఇది సత్యదూరం కాదని భావించవచ్చు.

ఈ గేయ ప్రబంధంలోని వర్ణక్రమ కీర్తనలో విశేషం నామగోపనంలో వేంకటరాయకవి గారి మిత్రుణ్ణి అతని పేరును ప్రతి వాక్యం మొదటి అక్షరంగా చేరుస్తూ ధనసహాయం అడిగినట్లు అర్థం వస్తుంది. ఈ వర్ణక్రమ కీర్తనలో ప్రతి వాక్యం మొదటి అక్షరాలు వర్ణ సమామ్నాయంలో ఉన్న విధంగా అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ అనే వరుసలో ఉంటాయి.

అ మొదలు క్ష వరకు ఉన్న మొత్తం అక్షరాలను ఆ పంక్తులలో మొదటి అక్షరంగా రాశారు.

"సాంబ సదా శివ - శంకర హరజగ, దంబరమణపాహి లింగప్రభో॥

అద్రీంద్ర కన్యాను - హ్యాద్రాజితా కార చిద్రూపద్రౌరేయ లింగప్రభో॥

ఆద్యంత శూన్యాత్మ - విద్యాను మేయాభి, వాద్యోరుచారిత్ర లింగ॥

ఇంద్రాది వంద్యార్క - చంద్రాగ్ని నేత్రాచ: లేంద్ర సురాధీశలింగ॥"[23]

ఈ విధంగా అకారాది మొదలు అక్షరాలు పేర్చినట్లు పెట్టారు కవి. అంతాస్తుతే. దీనికి కూడా తాళనిర్దేశం రాగ నిర్దేశం లేదు. భక్త సులభుడని ఈశ్వరునికి బిరుదు ఉంది. ఆ బిరుదు నియమం తప్పకుండా పాటిస్తూ తన భక్తులను బ్రోవడానికి ఎక్కడున్నా వస్తాడీశుడు, అనే విషయాన్నే ఒక కీర్తనలో వెంకటరాయకవి స్పష్టం చేశాడు.

"భర్గ! నీకేతగుర - భళిర కుక్కుట లింగ భాలాక్షభవ విభంగ శుభాంగా॥

స్వర్గాపవర్గములు, సద్భక్తులకు నిచ్చి - శరణన్నబ్రోచు బిరుదు అరుదు॥

కాంచన ప్రాకార - ఘనకుటీరములు భక్త సమూహములకు నిచ్చి మెచ్చు॥

పంచాస్య భవనీవు - పర్వతములందుండి భక్తులను బ్రోచు బిరుదు॥ అరుదు

కొఱత లేకుండవి - స్ఫుర దంబరములు భక్తులకు నతివేడ్కనిచ్చి ॥ మెచ్చి
పరమేశ శివనీవు కరటి చర్మముగటి భక్తులను బ్రోచు బిరుదు ॥ అరుదు॥
తన్ను మాలిన ధర్మ - మెన్నగా నీయందే, దైవ వేశ్యాభుజంగా శుభాంగా॥
చారు పీఠాపుర విశాల సౌధ విహార, చండికా చిత్త చోర॥ సుధీర॥
కారుణ్య హృదయ వెంకటరాయపోషణ సదా రంజింత వినాద॥ సుమోదా॥ భర్గ''[24]

వేదాంతపరమైన భావన ఈ కవిలో పుష్కలంగా కనిపిస్తుంది. తల్లి గర్భంలో ఉండి శిశువు భూమ్మీద పడి కౌమార, యౌవన, వృద్ధాప్య దశ వరకూ ఏ విధంగా భ్రమిస్తాడో ఆ విషయాల్ని ఒక కీర్తనలో వర్ణించాడు. ఈ కీర్తనకు కూడా రాగ, తాళాలను నిర్దేశించలేదు.

''అరుణ శుక్ల సంయుతం అవుతూన్న పిండం కొంత కాలానికి కాళ్ళు, చేతులు, నుదురు, చెవులు, కళ్ళూ ఏర్పడి ఆకారంగా రూపుదిద్దుకుని మాతృగర్భమనే నరకంలో మరలి తెరలి పొర్లుతుంది. అలాంటి నరకాన మార్గం లేకుండా ఉండటం ఎందుకు? హరుని నమ్ముకొని జన్మ విముక్తి పొందవచ్చు కదా! మనసా!

నల్లి, చీమ, దోమ కుడితే ఏడుస్తూ కళ్ళనిండా నీళ్ళు నింపుకుని, చిన్నచేతులతో గోక్కోడానికి కూడా చేతకాని స్థితి పసితనానిది. ఆకలితో అలమటిస్తూ ఎవరినీ నోరెత్తి, చేయెత్తి అడగడానికి రాక అవస్థలు పడుతుంది ఆ ఆకారం. అలా అవస్థలు పడేకంటే దేవుని ధ్యానించి మోక్షం పొందవచ్చు కదా!

ఇక యౌవన దశ వచ్చే సరికి గర్వంతో ప్రవర్తిస్తూ అన్యకాంతలను కోరుతూ వారికోసం నానా అగచాట్లూ పడి, కోరికలు తీర్చుకుంటూంటాడు. కయ్యానికి కాలుదువ్వుతూ, నలుగురు నవ్వితే సిగ్గు లేకుండా తాను నవ్వుతూ తిరగటం కంటే హీనమైన స్థితి మరొకటి లేదు మనసా!

వృద్ధాప్య దశలో అవయవాలన్నీ కదపడానికి చేతకాక విసుక్కుంటూ, యమబాధలు ఎక్కువవుతూంటే అశక్తుడై ఉండడం ఎందుకు? పార్వతీశుని పాదసేవ చేసి సుబుద్ధివై ముక్తి కోరవే! మనసా!

నిరంతరం పీఠికాపురాధి దేవతైన కుక్కుటేశ్వరుని పూజ చేసి హర హరా! మహాదేవా! అని స్మరణ చేసి భవ బంధ విముక్తిని పొందవే మనసా!'' అంటూ ఈ కీర్తనలో వేదాంతపరమైన హితబోధ చేసారు. ఇటువంటి తత్త్వ ప్రబోధక కీర్తనలు ఈ గ్రంథంలో చాలా కొద్ది సంఖ్యలో ఉన్నాయి.

ధూపసేవా కీర్తనల తర్వాతి విభాగం ఏకాంత సేవాకీర్తనలు. ఈ భాగంలో చూర్ణిక, శార్దూలం, దర్వు, కందం, గీతం, ఉత్పలమాల మొదలైన ఛందస్సంబంధమైన పద్యాలు ఉన్నాయి. "సంవాదాలు'' మత్తకోకిల ఛందోరీతిలో త్రిపుట తాళ నిర్దేశం ఒక దానిలో, రెండవ సంవాదంలో శార్దూల మత్తేభ వృత్తాలు ఉన్నాయి. మూడవ సంవాదంలో ఛందో నియమాన్ని ప్రకటించలేదు.

ఈ సంవాదాలలో శృంగారం హాస్య రసాలతో నాయికా నాయకులు, నాయిక చెలికత్తెలు, గంగా గౌరులు వీరు పాత్రధారులు. వీరి చుట్టూ కథ తిరుగుతుంది. గౌరీదేవి పరమేశ్వరుని దగ్గరకు ఒక చెలికత్తెను కుక్కుటేశునికి "నిను విడిచి క్షణ కాలం ఒక కల్పంగా భరించలేని భారమైంది. నిద్రరాదు. కొత్త పూవులను బాణాలుగా చేసి మదిలో నాటుతున్నాడా మదనుడు! ఎందుకు భవా! జాగు చేస్తావు! సార సాహిత ఖండధారణ! సజ్జనావన కారణా! భూరి మేరు శరాన మన్మథ భూతిలేపన విగ్రహా! నిన్ను కావాలని ఆ కొమ్మ పిలిచిందిరా!

కీర రవం పోరుగాను, పిక కుహూరవాలు భేదాన్ని కలిగించేవిగా, చంద్రుడు వెన్నెలను చాలా కోపంగా కురిపిస్తూ నన్ను బాధలు పెడుతున్నారు. నా మేలు కోరరా! ఎందుకు నా మీద ఇంత కోపం, బాలను నన్ను వీడి పోవలదు, దయ చూడు, జాలి లేదా! అంటూ భామ నిన్ను పిలచిందిరా! మెటిసే బంగారు మెడలో నున్నని మెత్తని తల్పం మీద నవ్వులు కురిపించే మోముతో నీ ముఖం చేర్చి మనసు ఉప్పొంగేటట్లు సుమనః కోదండ యుద్ధంలో మనసు హత్తుకునేటట్లు వేడుక చెయ్యరా!

నీ కోసం ఆయమ ఆకుమడ్పులు పంపెరా! ఇవిగో అందుకో! ఇటు చూడు నీరాకకై ఎదురు చూస్తున్నది - రాజసంతో బ్రోవమని! ఆయింటికి దయచేసి ఆలస్యం చేయకుండా వెంటనే రా! అని భామ నిన్ను పిలచింది రా కుక్కుటేశ!'' ఈ విధంగా చెలికత్తె గౌరి చెప్పిన మాటలు ఈశునికి విన్నవించుకుంటుంది.

ఇందులో ఈ క్రింది దర్వు గురించి వెంకటరాయకవి జీవిత సంఘటన ముడిపడి వుంది.

దర్వు " ఆకు మడ్పులు పంపెరా యివె! యందుకొమ్మిటు చూడునీ

రాకకేయెదు రొచు నున్నది! రాజసంబున బ్రోవరా

శ్రీకరంబగునింటికిన్ దయ సేయురా తడవాయెరా

ప్రాకటంబుగఁ గుక్కుటేశ్వర! భామనిన్పిలిచిందిరా''[25]

తండ్రి ఆబ్దికం నిర్వహించి ఊరు నుండి బయల్వెడలుతున్న వెంకటరాయకవి ఎండ వేడిమికి తాళలేక వృక్షం నీడలో స్పృహకోల్పోయినప్పుడు స్వప్నంలో అతనికి ఈశ్వరుని దర్శనం అయింది. స్వప్నంలో ఈశ్వరుడు ఏదీ! "ఆకుమడ్పులు పంపెరా!" ఆ దరువు పాడమని అడిగినట్లు, కవి దానికి "జపమాలికను కుదువ బెట్టిన నాకు ఆ ఆనంద మెక్కడిదని జవాబు చెప్పినట్లూ దానికి తగిన ఏర్పాట్లు చేశానని ఈశ్వరుడతని చేత పాడించినట్లు, ఆ తర్వాత కంచెర్ల కృష్ణయ్య జపమాలతో బాటు కవిగారికి మరింత ధనం, ఆభరణాలను ఇచ్చి నూతన గృహ ప్రవేశం చేయించినట్లు, ఐతిహ్యం.

నీ కౌగిట చేర్చి మక్కువతీర్చమని అడిగినట్లు ఆ చెలికత్తె మాటలు విని కుక్కుట లింగ మూర్తి నమ్మి, నంది వాహన మెక్కి, గౌరి మందిరానికి బయలు దేరాడు. అలా వచ్చిన అతనికి చెలులు మంగళహారతులు పాడి స్తుతిస్తూ హారతిస్తారు. ఈ హారతి పాటలకు కవిగారు తాళంగానీ, రాగం గాని పేర్కొన లేదు.

ఆ తర్వాత హెచ్చరికలు చేస్తారు. పాటలో ప్రతి పాదం చివరా "హెచ్చరిక'' అనే పదం ఉంటుంది.

శేషాహిని భూషామృత - భాషా హృతదోషా తోషాంచిత శ్రీ కుక్కుట - వేషా హెచ్చరిక॥
కాళీ హృల్లోలాజిన - చేలా మునిపాలా శూలాయుధ శ్రీ కుక్కుట - లీలా హెచ్చరిక॥''[26]

రెండవ పాటలో కలితంపు మేడలో లలిత తపంలో కులుకుచూ గౌరితో కలియ హెచ్చరిక. రాకాచంద్రుని రాకకిది వేళ కాబట్టి ఆలస్యం చెయ్యకుండా బరువైన రతుల గౌరితో కలవమని హెచ్చరిక చేసి ఆ యిందుముఖులు వెళ్ళిపోగా లోపలికి రాబోతున్న ఈశుని చూసి నగేంద్ర కన్య తలుపు మూయమని ఒక చెలిని పంపుతుంది. అప్పుడు ఈశ్వరుడు మానిని పార్వతీ దేవితో వాదులాడతాడు.

"బత్తులంగన నేఁజనన్శివ - భర్తరమ్మని నీదు చెల్ కత్తెలం దగఁ బంచి మూసితె - కత్తెరంపుఁగవాటమున్

దత్తరంబున బల్క వచ్చితి - తత్తదంబుజనేత్రలన్ గుత్తగొంటివి కుక్కుటేశ్వర - గుప్తమేటికి మాటికిన్

కుందు మానఁగఁ దల్పు దీయవె - కుందమా నరదావళీ నందమొందగ వేగమే వరనంద నందన సోదరీ -

చందమామకుఁగుంకుమంటిన - చందమానతి యియ్యరా యిందు శేఖర కుక్కుటేశ్వర యిందు వచ్చితి వెందుకో॥''[27]

ఈశ్వరీ ఈశ్వర సంవాదం మత్తకోకిల ఛందంలో రాశారు. త్రిపుట తాళంలో పాట నడక ఉంటుంది. తాళ నిర్దేశం చేశారు.

ఈశ్వరి ఈశ్వరుని "వారణంబులు తప్పులున్ మగవారికిం బని లేపురా! చారు భాస్వర కుక్కుటేశ - వి - చారమెందుకు పొందుకున్" అనుకుంటూ ముద్దు చేస్తే మన్మథ తాపం పోగొట్టమని శివుడామెను తలుపు తియ్యమని కోరుతాడు. ఆమె చివరకు తలుపులు తీస్తుంది. ప్రేమతో శివుడు ఆమెను కౌగిలించుకుంటాడు. ఏకాంత సేవా కీర్తనల విభజనలో ఇది మొదటి సంవాదంలోని వస్తువు.

ఇక రెండో సంవాదంలో ఈశ్వరుడు తలుపులు ఎందుకు మూసావని శివానిని అడుగుతాడు. దీన్ని మొత్తం శార్దూల మత్తేభ వృత్తాలలో రాశారు. ఆరంభించడం "ఏమే ముద్దులగుమ్మ ఏమె గిరిజా! యేమేసరోజాననా యేమే నన్గని తల్పు మూయుదగునా యీరేయి హుంకారిణీ...

స్వామీ యేమని యామినెందు చనితో - వాహ్యాళి బాహ్యాళికై శ్రీమంతుడవు గాన చెల్లె కదరా శ్రీ కుక్కుటేశా భవా"[28]

సంప్రదాయ కుటుంబాలలో తూర్పు పశ్చిమ గోదారి జిల్లాల్లో ఉపయోగించే పదజాలంలో "యేమే" అనేది ఒకటి. అది ఆ ప్రాంతాల్లో ఆత్మీయతను సూచిస్తుంది.

తలుపు చాటున సంవాదాలు ఇళ్ళలో జరిగే సంభాషణలను గుర్తుకు తెస్తాయి. హృదయంగమంగా మద్దిరాల కవిగారు వర్ణించేరు. మూడో సంవాదం కూడా తలుపుల దగ్గరే. మగువ ఈశ్వరుణ్ణి అనేక విధాలుగా అనుమానపు ప్రశ్నలు వేస్తే వాటికన్నిటికీ ఓపికతో సమాధానమిస్తాడు. చివరికి ఇన్ని విధాలుగా వేసిన ప్రశ్నలకు సరిపడేటట్లుగా సమాధానం చెప్పాను కదా! మనిద్దరం ఏకమై లోకాలను బ్రోచుదము - గౌరీ! రా! అంటూ పిలవగా ఆమె తలుపులు తీసింది. ఆ సతీపతులిద్దరూ ఏకమౌతారప్పుడు.

ఈ సంగతి తెలిసిన గంగాదేవికి కోపం వస్తుంది. అప్పుడు గంగా గౌరి సంవాదం జరుగుతుంది. ఈ సంవాదం కందార్థం (అర్థచంద్రికలు)లో దరువులతో ఛందోబద్ధంగా రాశారు. సవతులైన గంగా గౌరుల సంవాదంలో ఇంట అప్పా చెల్లెళ్ళు వాదించుకున్నట్లే భావన కలుగుతుంది. చివరికి మనలో మనకు పోరెందుకు ఇద్దరం కలిసి ఆతనిని కొలుద్దామని సఖ్యత కలుపుకుంటారు. వాదందరిని చూసిన ఒక ముగ్ధాంగన కీర్తన పాడుతుంది. ఆ తర్వాత మంగళ హారతులు, పూజా క్రమం, కీర్తన, ప్రణయ కలహాలతో కూడిన పద్యాలు, సవతుల కయ్యాలు, ఆ పిమ్మట భజన కీర్తనలు ఏకాంత సేవావిలాస గేయ ప్రబంధంలో వరుసక్రమంలో ఉన్నాయి.

చివరి విభాగమైన భజన కీర్తనలు రాగతాళ నిర్దేశంతో రాశారు. ముఖారి, సావేరి, సౌరాష్ట్ర, కేదారగౌళ, శకంరాభరణం, ఆనందభైరవి మొదలైన ప్రసిద్ధ రాగాలలో రాశారు. కొన్ని కీర్తనలకు ఆదితాళం నిర్దేశించారు. మిగిలిన కీర్తనలకు తాళ నిర్దేశం లేదు.

కొన్ని కీర్తనలు భగవంతుని లీలలను ప్రకటిస్తే, మరి కొన్ని కీర్తనలు తత్త్వాన్ని బోధిస్తాయి. సర్వం శివమయమనే సూక్తిని ఈ కీర్తనలు నిరూపిస్తాయి. శివునికి కులతత్త్వ భేదంలేదు. అందరూ ఎక్కడ నుండి వస్తారో అక్కడికే చేరుకుంటారు. పుట్టడం గిట్టడం ఈ దేహానికి ఉంటాయి. ఆత్మకు మరణం లేదు. కాబట్టి ఆ శివుని పూజ చేయగ రాదా! అని శివుని గురించి భజన పరంగా కొన్ని కీర్తనలు వెంకటరాయకవి తన పేరునే ముద్రగా చేసి రాశారు. భక్త కోటికి ఈ కీర్తనలు ఎంతో ఆనందాన్ని కలిగించేవిగా మనకు కనిపిస్తాయి. ఏకాంతసేవా విలాసంలో మద్దిరాల వేంకటరాయకవి రాసిన పద్ధతి ప్రకారంగా కాకుండా కొన్ని మార్పులతో ఒక వరుసను ఏర్పరుచుకొని ఆ పద్ధతిలో ఒక రచన తర్వాత మరొకటి పాడటం వెంకటరాయకవి గారి తర్వాతి

కాలం నుండి సంప్రదాయంగా వస్తూంది.(చూడు అనుబంధం - ) ఆ పరంపరలో పిఠాపుర సంస్థానంలోని కొన్ని కుటుంబాలవారు శివుని దేవాలయంలో ఇప్పటికీ పాడుతున్నారు.

మద్దిరాల వెంకటరాయకవి పీఠికాపుర సంస్థానంలో కుక్కుటేశ్వరస్వామి, హుంకారిణీ దేవి, కుంతీ మాధవ స్వాములను అర్చించడానికి పాటలనే ఎన్నటికీ వాడిపోని కుసుమాలను తానుగా అర్పించి, అవే సుమాలను ప్రతి పండుగకూ పాడే విధంగా అందించారు.

భక్తి, పాండిత్యం, రసస్ఫూర్తి ఉన్న ఇటువంటి వాఙ్మయాన్ని అందించి పిఠాపుర సంస్థానానికే విలువైన మకుటంలా ప్రకాశించాడు వేంకటరాయకవి. ఈ విధమైన పద్ధతులున్న రచనలు మరెక్కడా కాన రాలేదు.

## తుమరాడ సంగమేశ్వర శాస్త్రి (1875-1932)

"నేను దేశమంతా తిరిగి వచ్చి అనేక మంది విద్వాంసుల సంగీతం విన్నాను. నాకు సంగీతం అంటే వెఱ్ఱి అని మీకు తెలుసుకదా! వారందరూ మహా విద్వాంసులే, సందేహం లేదు. ఒక్కొక్కరిలో ఒక్కొక్క విశేషమైన ప్రతిభ వుంది తప్పకుండా. కానీ, వారెవరూ నా హృదయాన్ని కరిగించలేకపోయారు వీరిలా. వీరి వాద్యాన్ని వినడంతోనే వీరిని నా గురువుగా గుర్తించాను."[29]

అని విశ్వవిఖ్యాతి పొందిన మహాకవి రవీంద్రనాథ ఠాగూర్‌చే సంభావితులైనవారు వైణికాచార్యులు తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారు.

ఒకప్పుడు రవీంద్రనాథ ఠాగూర్ పిఠాపురం రాజావారి ఆహ్వానం మీద పిఠాపురం వచ్చారు. ఆ సందర్భంలో తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారి వీణాగాన సభ ఏర్పాటయింది. రాజదర్బారులో సంగమేశ్వర శాస్త్రిగారితో బాటు సుసర్ల గంగాధర శాస్త్రి గారిని వేణువుకూ, గాత్రానికి మరొకరినీ ప్రక్కవాద్యాలుగా ఏర్పాటు చేశారు. శాస్త్రి గారానాడు హంసధ్వని, కాంభోజి, కమాస్ రాగాలలో వీణ వాయించారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ ఆనందపరవశులై అలాంటి విద్వాంసుని ఇది వరలో చూడలేదని మెచ్చుకున్నారు.

ఆ రోజుల్లో రాజావారి ఆస్థాన విద్వాంసుని దగ్గర నుండి అరుగులలికేవాని దాకా రాజానుమతి లేనిదే అరంగుళం కూడా కాలుకదపడానికి వీలుండేది కాదు. అందువల్ల పిఠాపురం రాజావారి అనుమతి తీసుకుని ఠాగూర్‌గారు తనతోబాటు శాస్త్రిగారిని శాంతినికేతన్ తీసుకుని వెళ్ళారు. అక్కడ కొన్ని నెలలు అతిథిగా, మంచి స్నేహితునిగా శాస్త్రిగారిని ఆదరించారు. అంతేకాకుండా ఇద్దరు గాయకులను సంగమేశ్వర శాస్త్రిగారికి విద్యార్థులుగా కూడా పిఠాపురానికి పంపారు.

ఉత్తమ వైణికులు సంగీత లోకంలో ప్రసిద్ధి పొందిన సంగమేశ్వర శాస్త్రిగారు 1873 అక్టోబరులో బొబ్బిలి సమీపంలో పాలకొండ తాలూకా చిటివాడ అగ్రహారంలో జన్మించారు. గున్నమ్మ, సోమయాజులు శాస్త్రిగారి తల్లిదండ్రులు. వీరు వెలనాటి తెలుగు బ్రాహ్మణులు. శాస్త్రిగారు తన ఎనిమిదవ ఏట సంగీతాభ్యాసానికై బొబ్బిలి వెళ్ళారు. శాస్త్రిగారి అక్కయ్య భర్త నందిగానం వెంకన్నగారు శాస్త్రిగారికి సంగీత గురువు. మొదట నాలుగు సంవత్సరాలు గాత్రం, ఆ పిమ్మట వీణ సాధన చేశారు.

గురుశిష్యుల సంబంధం కేవలం గౌరవం, వాత్సల్యం చూపించి దానితో సరిపెట్టుకుంటే కుదరదు. ఆ గురువు తనంతటి వాళ్ళేగా తన శిష్యుల్నే తయారు చెయ్యాలి. అలాగే గురువును మించిన శిష్యుడవ్వాలి ఆ శిష్యుడు కూడా. అలాంటి సందర్భం వీణా చార్య సంగమేశ్వర శాస్త్రికి గురువైన నందిగానం వెంకన్నగారికీ మధ్య ఉంది. సంగన్నగారు గురువుని మించిన శిష్యుడు అయ్యాడు కూడా. సనాతన సంప్రదాయానువర్తి

నందిగానం వెంకన్నగారు. తెల్లవారకుండా లేచి అనుష్ఠానం చేసి సహస్ర గాయత్రీ చేసి వీణ మీద వెయ్యిసార్లు లెక్క తప్పకుండా త్రిస్థాయి సాధకం చేసేవారు. అలాగే తన శిష్యుణ్ణి కూడ సాధకం చెయ్యమనేవారు. తెల్లవారగట్ల కళ్ళుమూతలు పడుతుంటే సంగమేశ్వర శాస్త్రిగారు సాధకం చెయ్యలేక పోయేవారు. దానికి ఉపాయం కనిపెట్టి "రోజా పది చెగోడీలు వంద లెక్క చొప్పున వాయించి ఒక్కొక్క చెగోడీ తిను నీకు నిద్ర రాదు అని సలహా ఇచ్చారు. ఆ పైన సాధన సాగుతూండేది. ఒక రోజు వెంకన్నగారికి ఆరోగ్యం బాగోలేక శిష్యుణ్ణి సాధకం చెయ్యమని వింటూ ఆ ప్రక్కనేక శయనించారు. సంగన్నగారికి కొద్ది సేపటికే విసుగొచ్చి పది చేగోడీలు పావుగంటలో తినేసేసి ముగించేశారు. గురువుగారు లేచి ఏమిరావెయ్యి అయ్యాయా అనడిగారు - అయిందన్నాడు శిష్యుడు. అరగంట కాకుండా అవ్వడం ఏమిటని అనుమానం వచ్చి, ఏదీ! మళ్ళీ వాయించు నేను లెక్క పెడతాను అన్నారు గురువుగారు. వెంటనే సంగన్నగారు గురువుగారు లెక్క పెట్టలేనంత వేగంగా వెయ్యి మారులు త్రిస్థాయి వాయించేశారు. గురువు వెంకన్నగారు ఆశ్చర్యపోడం తప్ప మరేం చెయ్యలేకపోయారు. అంటే వారి అనుబంధం సాధన చెయ్యడంలో కూడా సమిష్టిగా ఉండేది. సంగన్నగారి సాధనాదీక్ష గురువునే మెప్పించిన దీక్ష.

"సరిగమ పదనిస-సనిదప మగరిస" అనే మొదటి స్వరాన్ని మంద్ర మధ్య తారాస్థాయిల్లో దురిత కాలంలో వాయించేవారు. వెయ్యి మారులు వాయించడానికి గంటన్నర కాలం పడుతుంది. ఆ విధంగా వెయ్యి పర్యాయాలు వాయించడం అంటే అందరికీ సాధ్యం కాదు.

అలాంటి వైణికుడి వీణాగానాన్ని విని "పండిత పరవస్తు రంగయ్య గారు ఆనందించి, విశాఖ పట్టణంలోని గోడేవారి సంస్థానంలో సంగీతసభ ఏర్పాటు చేశారు."[30]

గోడేవారి సంస్థానంలో శాస్త్రి గారికి గొప్ప గౌరవం లభించింది. అనేక బహుమతులు కూడా పొందారు. తర్వాత 1899లో కశింకోట జమీందారులు తమ ఆస్థాన వైణికునిగా శాస్త్రిగారిని నియమించుకున్నారు.

కశింకోట జమీందారులతో కలిసి తరుచుగా శాస్త్రిగారు మద్రాసు వెళుతూండేవారు. అందువల్ల అక్కడ అనేక మంది విద్వాంసులతో పరిచయం కలిగింది. తచ్చూరి సింగరాచార్యులు, తంజావూరి కృష్ణభాగవతార్ మొదలైన విద్వాంసుల సమక్షంలో వీణ వాయించి, తన్మయులను చేసి "తోడా"ను (ముంజేతి కంకణం) బహుమతిగా పొందారు.

ఆ విధంగా దక్షిణాపథమంతా సంగమేశ్వర శాస్త్రిగారి ప్రతిభ వ్యాపించింది. తర్వాత దివాన్ మొక్కపాటి సుబ్బారాయుడుగారు శాస్త్రిగారిని పిఠాపురానికి ఆహ్వానించారు. ఆయన్ని పీఠికాపురాస్థాన వైణికునిగా నియమించారు. "తెల్లని మల్లు పంచె, పక్క జేబు లాల్చి అరచేతి వెడల్పు జరీ కండువా, పాదుషాలు ధరించే పాదరక్షలు, వెండి తొడిగల పొన్నుకర్ర, ముఖం మీద గంధం ధరించి గంభీరంగా నిండుగా ఉండే శాస్త్రిగారు నిగర్వి. వీరంటే పీఠికాపుర జనులకు గౌరవం, భక్తి ఉండేవి. నిరంకుశ ప్రవృత్తిగలవారు, రసికులైన వారు వచ్చి సత్కరించాలేగాని తనకు తానుగా సంగమేశ్వర శాస్త్రి గారు ఎక్కడికీ పోలేదు. ఎందరో భాగ్యవంతులు శాస్త్రిగారింటికే పోయి, వారి వీణాగానాన్ని విని వారికి సత్కారం చేసేవారు.

సంగమేశ్వర శాస్త్రిగారికి అనేక సభల్లో బరోడా, దర్భాంగ మహారాజుల నుంచి పొందిన సన్మానాలు, బహుమతులు ఎన్నో ఉన్నాయి. నిరాడంబరులు, నిరంకుశులూ అయిన శాస్త్రిగారి మీద ఈ ఆభరణాలు, సన్మానాలు ఎటువంటి ప్రభావాన్ని చూపలేక పోయాయి. రాజులిచ్చిన కాశ్మీరు శాలువలు, ఆభరణాలు అనేకం సూర్యరశ్మిని కూడా చూడలేదు. "మహారాజులిచ్చిన వాటిని తమరు సభలకు వేళ్ళేటప్పుడు ఎందుకు ధరించరు" అని ఆకొండి రాజారావుగారు శాస్త్రిగారిని ప్రశ్నించినప్పుడు దానికి బదులు ఇలా చెప్పారు.

"బాబూ! అవన్నీ తిరుపతి వేంకటేశ్వరుని సొమ్ములు. నేను ఉపయోగించరాదు. మొక్కుబడి సొమ్ములు వాడుకోవచ్చునా! అని మందహాసం చేసేవారు. శాస్త్రిగారు సంగీత ప్రపంచంలో కీర్తి ధనాన్నే ఆర్జించారు కానీ ధన సంపద ఆశించలేదు. త్యాగరాజాదుల వలే సరస్వతీ ఉపాసనతో జీవన్ముక్తులైన మహా వైణికుడు.

రవీంద్రనాథ్ ఠాగూర్ గారితో శాంతి నికేతన్ వెళ్ళి వచ్చిన తర్వాత శాస్త్రిగారి సన్నిహితులు ఆ కొండి రాజారావుగారు అక్కడి విశేషాలు చెప్పమని అడిగినప్పుడు శాస్త్రిగారు ఎంతో ఆనందపడి ఇలా చెప్పారు.

"నా కృషి ఫలితం విశ్వ విఖ్యాత కవీంద్రుడు విని ఆనందించె కదా! నేను వీణ వాయిస్తున్నప్పుడానందాశ్రుధారలు ప్రవహించేనే, నాకంతకు మించి సన్మానమేమి కావలయును" అంటూ "వీణాచార్య" అనే అక్షర లిఖితమైన మూడు తులాల విలువ గలది విశ్వకవి సంతకంతో నున్న స్వర్ణ ఫలకాన్ని చూపించారు.[31]

పిఠాపురం రాజావారికి సంగీత కళాభిమానం ఉన్నది కానీ ప్రవేశం, అందునా వీణలో అంతంత మాత్రమే అవడం చేత మహా వైణికుడు తన సంస్థానంలో ఉన్నట్లు ఎన్నడూ ఆలోచించలేదు. అదీగాక రాజులు ఒకరికన్న ఒకరు గొప్ప విద్వాంసులను ప్రత్యేకంగా పిలిపించి గౌరవించి సన్మానించేవారు.

ఆ నేపథ్యంలో మైసూరు రాజాస్థాన వైణికులు వీణ శేషన్న ఒకసారి పిఠాపురానికి రాజావారి ఆహ్వానం మేరకు వచ్చారు.

వీణ శేషన్నగారిని వీణ వాయించమని రాజావారు అడిగారు. దానికి శేషన్నగారు సంగమేశ్వర శాస్త్రి గారిని చూసి "మీ దగ్గర ఇటువంటి వైణికులుండగా మేము వచ్చి ఇక్కడ వీణ వాయించడం సాహసమే అవుతుంది" అని అన్నారు. గొప్ప గొప్ప విద్వాంసుల పొగడ్త లందిన వీణాచార్యులు శాస్త్రిగారిని 1926వ సంవత్సరంలో బర్ద్వాన్ రాణిగారు బంగారు హారాన్నిచ్చి సన్మానించారు.

తుమరాడ వారు లలితా దేవి ఉపాసకులు. ప్రతి శుక్రవారం పూజ చేసి పీనుల విందుగా వీణ వాయించేవారు. మరణ కాలమాసన్నమవుతోందని ముందే గ్రహించిన శాస్త్రిగారు ఓపిక తెచ్చుకుని, వీణను తీసి కొనఊపిరి ఉన్నంత వరకూ ఆనందభైరవి రాగాన్ని వాయించేరు. వీణను 'అమ్మా' అని సంబోధించేవారు.

సంగమేశ్వర శాస్త్రిగారి వీణా వాద్యం విన్న పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు.

"స్వజనులనే రీతి పరిపాలన మొనర్తు
నాసింతు నెవ్వాని నాచరింతు
నాదాయమున నెంత యర్థులకి చ్చెద
వెదెటు చేసిన భృత్యు నెదగణింతు
నవని పాలననేది యార్జించి నాడవు
కవిత గానంబు నేకరణి విందు
వెట్లుగా పృథుసౌఖ్య మీక్షింపగామంటి
వాత్మ సంస్తుతులకే మందునయ్యా
సరిగదని సగమ పనిని సరిగ గరిమ
మరిమరిగ పాపని విగని సరి సరియను
వీణకాని 'మా' వెన్క 'నీ' వీణ వరుస
మీద 'నీ' వెన్క 'మా' సూర్యమేదినీశ!

పై సీస పద్యంలోని ఎనిమిది ప్రశ్నలకు ఎత్తు గీతలో వీణ స్వర విన్యాసంతో సమాధానాలు చెప్పారు.

ఓ మహారాజా! ఈ వీణ వరుస మీద ఆరోహణావరోహణ క్రమంలో 'మా వెన్క నీ' అంటోంది. కానీ నీవెన్క మా (మా అంటే లక్ష్మీ) నీవెన్క లక్ష్మిగాని, లక్ష్మివెన్క నీవుకావనుట - పద్యార్థం"

"అడవి బాపిరాజుగారు ఒకసారి పిఠాపురంలో సంగమేశ్వర శాస్త్రి వీణా గానాన్ని విన్నారు. విన్న రాజుగారు వాద్య విధానం మీద ఈ విధంగా ఒక గీతక రాసారు.

పలికిస్తి వయ్యా నీ బంగారు వీణా
మీటిస్తివా వెలుగు మేళవించిన తంత్రి!
పండు పరువపు పనస పరమ పరిమళ మూర్తి
లలితాచ్చరదన శిల్ప ప్రసాదిత రూపి - పలికిస్తి ॥
ఓంకార కలశమ్ము ఝంకార కకుభమ్ము
సామ గీతా పూర్ణ శాంత కుంభీఫలము
ఉపనిషద్రాగతా నోపేత తతపంక్తి - పలికిస్తి" 32

స్వర్గీయ పానుగంటి లక్ష్మీ నరసింహంగారు ఆంధ్ర సాహిత్య పరిషత్ 11వ వార్షికోత్సవ అధ్యక్షోపన్యాసంలో పిఠాపుర రాజ దర్బారును వర్ణిస్తూ

"స్తంభోపరివిటంకముల నుండి "రామా" యనుటకు బదులు "రీమా" యనినదీసభయందే అని శాస్త్రిగారి గురించి చెప్పారు.

"గానరసాంబుధి లోబడి మానుగ నీవంగలేక మగ్నుడవగు చో వీణయను నావచేకొని, పూని తరించితి గదన్న బుధసంగన్నా!" యని సంగమేశ్వరుని సత్యవోలు సుందరకవి స్తుతించారు.

ఇంతటి ప్రజ్ఞావంతులైన సంగమేశ్వరునికి సంగీత నేర్చుకోడం గురించి, వాద్యాల గురించి ప్రత్యేకమైన అభిప్రాయాలున్నాయి.

ఒకానొక సందర్భంలో సంగమేశ్వరునితో ఆకొండి రాజారావుగారు ఇష్టాగోష్ఠి జరిపారు. ఆ సంభాషణ ఇక్కడ యథాతథంగా గ్రహించడం జరిగింది.

ప్రశ్న : ఆర్యా! మీరు వాయులీనం, వీణ రెండు జంత్ర వాద్యాలను స్వాధీనం చేసుకొని అద్భుతంగా వాయిస్తారు కదా! ఏది విశిష్టమైనది? ఏది వాయించడంలో సులభమైంది.

జవాబు : నాయనా! కర్ణాటక సంగీతమనే కాదు ఏ సంగీతమునకైననూ వీణ సంపూర్ణము - జీవనాదముగల జంత్రము. గాత్రమును అనుసరించగల ఉత్తమ సాధనము. కృతులలోని సాహిత్యమును అక్షరశః పలికించగల అవకాశము ఉండుటేగాక దశవిధగమకములు రమ్యముగా శ్రుతి పక్వముగా నాదపూరితముగా, సుమధురముగా నుండు రీతి వీణకే చెల్లినది.

ప్రశ్న : అయితే వాయులీనాన్ని గురించి మీ అభిప్రాయాన్ని వినగోరుతున్నాను. వయోలిన నాదం పెద్దది కదా!

జవాబు : వయోలిన్ నాదము పెద్దది అనుట వాస్తవమే. వీణా నాదములోని రుచి అందము వేరు,

నాదము వేరు, ధ్వని వేరు అనే సంగతి నీకు తెలియునుకదా! తిరుక్కోడి కావరీకృష్ణయ్యర్, గోవిందస్వామి పిళ్ళై వంటి సమర్థులు వాయులీనమును ఆదర్శవంతముగా వాయించుచున్నారు. వాయులీనమును చేపట్టిన వారి సంఖ్య వైణికులు సంఖ్య కంటే ఎక్కువే! అయితే వీణను సాధించుట సులభతరము కాదు. మెట్లున్నవి కదా వాదన సులభమని అనుకొనరాదు. వీణ గోముఖ వ్యాఘ్రము వంటిది. ప్రవేశము సులభమేకాని పోను పోను అందములు పట్టించుటలో కష్టములు గోచరించుచుండును. వాయులీనమునకు ప్రవేశము కష్టమనిపించును. సాధనలో పోగా పోగా సులభమగును. వీణావాదన కత్తి మీద సాములాంటిది. కాయ కష్టము కూడా ఎక్కువ. డంబుల్స్ కసరత్తు వంటిది"[33] అన్నారు.

ఇక సంగీతం నేర్చుకోడం విషయంలో సంగీత విద్య పూర్వజన్మ సుకృతం ఉన్న వారికి వింటేనే వస్తుంది. అలా రాని నాడు చెప్పి ప్రయోజనం లేదు అంటారు. అందుకోసమే తన కుమారునికి ఏ సంగీతమూ చెప్పలేదంటారు.

ఉత్తర దక్షిణా పథమంతా మహా వీణాచార్యునిగా పేరొందిన శాస్త్రిగారికి తనంతటి శిష్యులుగానీ వారసులుగాని ప్రత్యక్షంగా లేరని చెప్పవచ్చు. అయితే మండా సోదరులు కృష్ణమూర్తి, ప్రకాశంగార్లు, మాత్రం ఏదో కొలదిగా నేర్చుకొని తర్వాత స్వయంకృషితో పాఠాలు చెప్పుకునేవారు. సంగమేశ్వర శాస్త్రిగారు కశింకోటలో ఉన్నప్పుడు ద్వారం వెంకటస్వామి నాయుడుగారి అన్నగారు వెంకట కృష్ణయ్యగారు, శాస్త్రిగారి దగ్గరకు వచ్చి కొన్ని సంగీత విషయాలు తెలుసుకొనేవారు. తర్వాత పిఠాపురంలో శాస్త్రిగారు స్థిరపడినప్పుడు వెంకట కృష్ణయ్య, నాయుడు గార్లు ఆయన దగ్గరకు వస్తూండేవారు. వచ్చినప్పుడు మాత్రం ఎక్కువ కాలం సంగమేశ్వరుని దగ్గర గడిపేవారు.

తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారి వీణా గానంలోని విశేషం వీణ మీటుతున్నప్పుడు మీటు శబ్దమే వినబడేది కాదు. నాదం మాత్రం ఎంతో సేపు సాగేది. తానం వాయిస్తే ఎంత కోలాహలమో! గమకం ఆయన ప్రత్యేకత. నాదానికి జీవం పోసేవారు. ఒకేసారి రెండు తీగల మీద, మూడు తీగల మీదా వాయిస్తూ ఇంగ్లీషు ట్యూన్లూ బ్యాండు మట్లూ జానపద గేయాలూ ఎంతో సున్నితంగా వాయించేవారు. నాగబంధస్వర సంచారమనే ఒక విచిత్ర వీణా వాదనా సంప్రదాయాన్ని సంగమేశ్వర శాస్త్రిగారు వాయించేవారు. ఆ తర్వాత ఈ సంప్రదాయ పద్ధతి ఎవరికీ తెలియరాలేదు. హిందూ స్థానీ రాగాలు వీణ మీద వాయించినప్పుడు గవయాలు ఎంతో మెచ్చుకునేవారు. శాస్త్రిగారు వీణలో పలికించని భావం, రసం మరోచోట లేదు. వీణ, గాత్రం రెండూ సమానంగా ప్రదర్శించగలిగే సామర్థ్యం గలవారు.

"వీణ శరీరంగానూ వీణా తంత్రులు హృదయ తంత్రులుగానూ వీణా వాద్యం హృతయగానంగానూ, వాద్యకారుడు భగవంతుడుగానూ భావించిన రవీంద్రనాథ్‌కి ఈ లక్షణాలన్నీ సంగమేశ్వర శాస్త్రిగారిలో స్పష్టపడ్డాయి."[34]

"శాంతినికేతన్ సంగీత శిక్షణలో మన వీణను - సరస్వతీ వీణను మొట్ట మొదటి సారిగా ప్రవేశపెట్టి సరైన పద్ధతిలో వీణ నేర్పిన గురువు శాస్త్రిగారే. ఈ వీణేసింహాతలకు బదులు హంసతల అమర్చబడి మరొక పేరుతో ఈనాటికీ వ్యాప్తిలో ఉంది."[53]

సంగమేశ్వర శాస్త్రిగారు ధన్యాసిరాగంలో ఆదితాళంలో తానవర్ణం ఘనరాగ పంచకంలో తాన చిట్టలూ మోహన మొదలైన రక్తి రాగాల్లో స్వరపల్లవులూ రాసి, వారే వాయిస్తూండగా విన్న ఆకొండి రాజారావుగారు తెలియచేసారు.

కళ్యాణిరాగంలో ఆదితాళంలో "గణనాయకం' కీర్తన కూడా రాసారు. ఆ కీర్తన మాత్రమే లభ్యమైంది.

"గణనాయకం - శుభదాయకం
గౌరీ కుమారం - భజేహం
గజవరాననం - శుభలాంఛనం
అజాది సురనుతం - భజేహం

చరణం: దాసమాన సరసవేషం - పరమేశ్వరం పావనకరం
పరమ సుఖం - మమదేహి వరమితి
దాసరామ హృదయ సంగమేశ్వరం
దయామయమనవరత మాదరం".

"దాసు శ్రీరాములు గారు రాసిన సంగీత రచనలలో కొన్నిటికి శాస్త్రిగారు సహగేయకారులై స్వరవరుసలను కూర్చుతూండినట్లు ద్వారం వెంకటస్వామి నాయుడు గారు చెప్పారు.

## దాసరి లక్ష్మణ స్వామి (కాలం వివరాలు తెలియవు)

పిఠాపురంలో సాహిత్య చక్రవర్తి డాక్టర్ రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు (1885 - 1964) గారి కాలంలో దాసరి లక్ష్మణ స్వామిగారు శునక పర్యవేక్షకులుగా ఉండేవారు. "అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ" అన్నట్లు పీఠికాపుర ఆస్థాన కవి అయ్యారు. ఈయన "భక్తజన మనోరంజనం" అనే కీర్తనల సంపుటిని రాసారు. 1919లో పిఠాపురం విద్వజ్జన మనోరంజన ముద్రాక్షరశాలలో ఈ సంపుటిని ప్రచురించారు.

రాజా గంగాధర రామారావుగారి ఐదవ రాణి శ్రీమతి రాణీ భావయాంబగారికి ఈ గ్రంథాన్ని అంకితమిచ్చారు. తుమరాడసంగమేశ్వరశాస్త్రిగారు భక్తజనమనోరంజనంలో ఉన్న భగవత్కీర్తనలకు రాగతాళాలను నిర్దేశించారు. బిలహరి, బేహాగ్, జింఝ్లా, హిందూస్థానీ భైరవి, పిల్వా శ్రీరాగం, మాండు హిందూస్థానీ కాపీరాగాలను ఈ కీర్తనలకు నిర్ణయించారు.

ప్రతి కీర్తన లలితమైన కవి హృదయాన్ని స్పష్టపరుస్తూ ఆర్తిని తెలుపుతుంది. ఇందులో మొత్తం 40 కీర్తనలున్నాయి. కొన్ని స్వరపరచినట్లు ప్రచురించారు. ఈ రచనలు అలభ్యం.

## మహేంద్రవాడ బాపన్న శాస్త్రి (1904- వివరం తెలియదు)

తూర్పు గోదావరి జిల్లా యింజరం గ్రామంలో 1904లో జన్మించిన బాపన్న శాస్త్రి తల్లిదండ్రులు - సూర్యమాంబ, కామయార్యులు. కామయార్యుడు సంగీతంలో ప్రవేశం ఉన్న వారు. అధ్యాత్మ రామాయణ కీర్తనలు పాడుతుండేవారు. శాస్త్రికి పసితనం నుండి సంగీతం అంటే ఎంతో అభిమానం ఉండేది. ఆసక్తితో పిఠాపుర ఆ స్థాన సంగీత విద్వాంసులైన బ్రహ్మశ్రీ రేగిళ్ళ జగన్నాథ శాస్త్రి గారిని ఆశ్రయించి కొంత కాలం సంగీతాభ్యాసం చేసాడు. కొంతకాలం దుడ్డు సీతారామయ్య శాస్త్రిగారి దగ్గర శిష్యరికం చేసి, వారి శిష్యుల్లో ముఖ్యుడయ్యాడు.

ఆ తర్వాత శ్రీమాన్ శృంగారం అలహ సింగరాచార్యుల దగ్గర సంగీతం నేర్చుకున్నారు. నిరంతర దీక్షతో సాధన చేస్తూ ఆంధ్రదేశంలో కూడా సంగీత సభల్లో ఎన్నో బహుమానాలను పొందారు. దక్షిణదేశంలో కూడా సంగీత సభల్లో పాడుతూ అందరి ఆదరాభిమానాలను పొందాడు. "1934లో కొలంబియా వారు బాపన్న శాస్త్రి పాటలను కొన్ని రికార్డు చేసారు."[35] 1936లో ఆకాశవాణి, మద్రాసు కేంద్రంలో పాడటానికి

అవకాశం లభించింది. ఆ తర్వాత విజయవాడ కేంద్రంలో బాపన్న శాస్త్రి పాటలు రికార్డు చేసారు." సంగీత సభల్లో పాడటం ఆరంభించిన మహేంద్రవాడ బాపన్న శాస్త్రి 1943వ సంవత్సరం నుండి యింజరలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తూ సంగీత కళామతల్లికి సేవలు చెయ్యడం ప్రారంభించాడు. సంగీత శాస్త్ర సంప్రదాయ రీతులన్నీ ఇనుమడింపజేసుకున్న బాపన్న శాస్త్రి హరిహరులను దృష్టిలో పెట్టుకుని ఈశ్వరుని మీద, రాముని మీద, గోపాలుని మీద, రచనలు చేసాడు. బాపన్న శాస్త్రి శైలిలో వీణ కుప్పయ్యర్, పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ మొదలైనవారిని అనుసరించినట్లు కనబడుతుంది.

ఈయన కృతులు, తానవర్ణాలు, జావళులు రాసి, స్వయంగా పాడి సరస్వతిని అలంకరించిన ధన్యుడు.

పీఠికాపుర సంస్థానంలో ఆస్థాన విద్వాంసుని శిష్యుడైన బాపన్న శాస్త్రి 1936 ప్రాంతంలోనే రచనలు చేసారు. ఆరచనలు అచ్చు వేయడం మాత్రం 1964లో జరిగింది. 1936 ప్రాంతంలో సంస్థానాలు ప్రభుత్వ విలీనం కాలేదు. ఈ రచయిత పిఠాపుర సంస్థాన ప్రాంతీయుడు. అందువల్ల ఈయన రాసిన హరిహర కృతిమంజరిని నా పరిశోధనలో చేర్చాను.

## హరిహరకృతమంజరి

బాపన్న శాస్త్రి రాసిన కృతులు కొన్నిటిని మాత్రమే "హరిహరకృతిమంజరి" అన్న పేరుతో మొదటి భాగంగా ముద్రించారు. ఈ ముద్రణకు "యానం గ్రామంలో అడ్మినిస్ట్రేటర్ అండ్ జడ్జి, గాన కళా రసిక శేఖరులు, లలితకళాపోషణనిరతులు అయిన శ్రీ రామలింగము (Bar-At-law) ఆర్థిక సహాయం చేశారు.[36]

బాపన్నశాస్త్రిగారు మొత్తంనూట యాభైకృతులు రాసారు. అందులో 50 కృతులు, 10 వర్ణాలు, 10 జావళులు మాత్రమే ఈ గ్రంథంలో ఉన్నాయి. అవి ఏయే రాగాలలో రాసారో ఆయా రాగాల స్వరూపాలను తెలియజేయడానికి 30 తాన వర్ణాలను రాసారు. 'హరిహరకృతిమంజరి' కృతికి ఉపోద్ఘాతం రాసిన కళాసేవకుడు యల్లాప్రగడ వేంకటనారాయణ శర్మగారు ఈ గ్రంథంలోని తత్వాన్ని, లక్షణాల్ని పరిశీలించి వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇవి.

"పూర్వకాలపు అపూరూప రాగాల్లో కాకుండ ప్రస్తుతకాలంలో జనవ్యవహారంలో ఉండే రాగాలు ప్రసిద్ధిపొందినవి, రక్తి రాగాలు, నయరాగాలు, రాగాం గోపాంగ భాషాంగ, క్రియాంగ రాగాలలో ఈ గ్రంథంలోని కృతులను కూర్చాను. అదేవిధంగా అది, రూపక, చాపు, జంపె, ఖండగతి మొదలైన తాళాలలో సమ, విషమ, అతీత, అనాగత విశేషాలతో గూడి తాళగ్రహ రీతుల్ని ఈ గ్రంథంలో ప్రదర్శించారు".[37] ఈ రచనలు చేసే ముందు రచయిత తీవ్ర మానసిక, శారీరక అస్వస్థతకు గురయ్యారు. వ్యాధులేర్పడటం వల్ల వాటిని నివారించుకోడానికి ప్రయత్నించారు. ఆయా రాగ సంచార రూపాలను ప్రదర్శించారు. ఆర్తి, భక్తి, తత్వం వీరి రచనల్లో కనిపిస్తుంది. హరిహరులను దృష్టిలో పెట్టుకొని ఈశ్వరునిమీద, రామునిమీద, గోపాలునిమీద రచనలు చేసారు. హరిహరకృతిమంజరిలో రచయిత స్వయంగా కృతులను స్వరపరచి, స్వర సహితంగా ముద్రించారు. జావళులను మాత్రం స్వరపరచలేదు. కేవలం రాగ, తాళాలను నిర్దేశించారు.

ఈ పుస్తకంలోని మొట్టమొదటి కృతి ఉదయరవిచంద్రిక రాగం - ఆదితాళంలో వినాయకస్తుతి.

రాగం ఎన్నవ మేళకర్త రాగజన్యమో, దాని ఆరోహణ అవరోహణలు కూడా కృతికి ముందుగానే రాసారు. ఉదయరవిచంద్రిక రాగం 22వ మేళకర్త ఖరహరప్రియరాగ జన్యం.

పల్లవి : గణపతి నిను సేవించదలచితి, సద్గుణములిచ్చు సద్గురుడ నీవె గావా!

అనుపల్లవి : ఫణిహారధరా హరసతీ తనయా గణనాయక నావందన మందుకో.

చరణం : కరిశిరధరుడా, ధరనర పాలుడ

కరమున మోదకములు గలవాడా

గిరిరాజ సుతా, తనయ నమోనమో

పరిపాలక బాపనకవి సన్నుతా!

ఇందులో హరసతీ తనయా, కరిశిర ధరుడు ఇటువంటి పదాలను ఎవరూ సంగీత రచనలలో అంతగా ఉపయోగింపలేదు. కొత్తగా అనిపించినా సుకుమారంగా ఉన్నాయి. ఇందులో "బాపనకవి" అనేది రచయిత ముద్ర. ఆ తర్వాతి రచన మాయామాళవగౌళరాగం - ఆదితాళంలో సరస్వతీ స్తుతి -

బాపన కవిని పోషిస్తున్న ఓ వీణా ధారిణీ నాద రూపిణీ ధాతరాణీ! ఆటపాటలతో సాటితి నిను నేచాటునేల నీ బాట జూపించు నీతో సమానమైన వారు ఈ జగాన ఎవరూ లేరు అని సరస్వతిని స్తుతిస్తారు.

ఇక హరిహర కృతి మంజరిలోని మూడవ కృతి కళ్యాణి రాగం ఖండగతిలో ఉంది. బాలత్రిపుర సుందరి మీద రాసిన రచన

పల్లవి : "అమ్మ పరదేశమ్మ నిన్నె నమ్మితి నమ్మ

ఇమ్మహిలో నీవమ్మ, నన్ను బ్రోవవమ్మ - అమ్మ

అనుపల్లవి : శ్యామలాంబా నీ సేవ జేసితి నమ్మ. సోమ శేఖరుని రాణి - పరమ పావని అమ్మ ॥ అమ్మ

చరణం : ఆదిశక్తివి నీవె పాతకములను బాపు నీదు మహిమే జగము ఓ త్రిపుర సుందరి

మోద హృదయ రాకేందు వదన అంబవందనమే నీకు బాపన కవినుత ॥[38]

మొదటి రెండు మూడు కృతులు వినాయకుడు సరస్వతి త్రిపుర సుందరుల మీద రాసినవి. ఇందులో స్తుతించడం వస్తువు. సులభమైన రచనలు. ఆ తర్వాత ఆటపాటల మేటి, అధిదేవత అయిన సరస్వతీ దేవిని సరస్వతీ రాగంలో (27వ కృతి) స్తుతిస్తాడు.

పల్లవి : సరస్వతీ నమో నమో అంబ, స్మరించితినిను సదయ హృదయ

అనుపల్లవి : సరగున నా హృదయారవిందములు విరియ జేసి పాలింపుము తల్లీ!

చరణము : ఆట పాటలకు ఆది దేవతవు సాటిలేరు నీ తోటి భువిలోన

బాట జూపవా ఏటి సందియము చాటు చుంటి నిను బాపన కవి నుత ॥[39]

నమో నమో! అంబా! అని నిన్నెప్పుడు స్మరిస్తూంటాను. నా క్లిష్టమైన సంగీతానికి నాట్యానికీ ఆది దైవానివి నువ్వు! నీతోసమానమైన దేవతలు జగాన లేరు. ఎందుకమ్మా సందేహిస్తావు. నీగురించి నేనెప్పుడు సాధన చేస్తూ ప్రచారం చేస్తూంటాను. అజ్ఞానం అనే చీకటితో కప్పబడి మూసుకుపోయి ఉన్న నా హృదయార విందాలను నీ దయ అనే వెలుగుతో తెరిపించి వెలుగు నింపవమ్మా! జ్ఞానం ప్రసాదించు తల్లీ! అని వేడుకొంటాడు.

ఇక మిగిలినవి రాముని పరంగా, గోపాలుని పరంగా రాసినవి. తాను జీవితంలో అనుభవించిన పరిస్థితి ఒక కృతిలో వెలిబుచ్చారు రచయిత.

6వ కృతి - హంసధ్వని రాగం - ఆది తాళంలో రాముని ధ్యానం చేస్తూ లోకాధార పరాత్పరా! నీకేల దయరాదురా నాపై - భవరోగములకు గురినైతిని నే బ్రోవరావా ఓ దేవ గావవా!" అంటూ దేవతలకు అసురుల వల్ల కష్టాలు, బాధలు, కలిగితే వారిందరినీ రక్షించావు. అహల్య "రామ రామ!" అని వేడుకుంటే రూపాన్నిచ్చావు. అమరులను దయ జూచిన నువ్వు నన్ను రక్షింప లేవా రామా! రామ భజన కన్న కలద భువిలో పామరులకు భవబాధలబాపగ" అంటూ తన బాధ నివారించమని వేడుకుంటారు.

రచయిత ఒకప్పుడు బాగా బ్రతికి చెడిపోయిన వాడుగా ఈ కృతిలో రాముణ్ణి ప్రార్థిస్తూ విన్నవించుకుంటారు.

9వ కృతి : సురటి రాగం - రూపక తాళంలో

పల్లవి : బలము కులము కలిగి యిలలో
బ్రతికి నిన్ను మరచితి రామా!

అనుపల్లవి : కలుగు భాగ్యములలో కడుపు
గడుపుటాయె నను బ్రోవరా!

చరణం : వలపుతోను పొలతులపై,
నిలిపి మనసు నిను విడచితి
తెలపుమిక నాగతికి బ్రోవ
అలుగకు బాపన కవినుత

మంచి కులం భాగ్యం కలిగి బ్రతికి చేయరాని పని చేసినట్లు రచయిత చెప్పుకున్నారు ఈ కృతిలో.

16వ కృతిలో ఆర్తిగా పిలుస్తారు. శుభపంతు వరాళిలో

"నీ పాదములే నిజంగా నమ్మాను కాపాడరా వేణు గోపాలా! అపదలన్నీ పోగొట్టి ఆదరించవయ్యా: కలిమాయ కనుక్కోలేక చల చిత్తుడనయ్యాను; వలదు నాపై అలుక చలము సేయక నన్ను బాపవయ్య దేవా!" అని వేడు కుంటారు.

ఈశుభ పంతువరావళికి ఏమేమి స్వరాలు వస్తాయో రచయిత స్పష్టంగా రాసారు. మిగిలిన ఏ రాగానికీ ఈ విధంగా ఇవ్వలేదు. షడ్జపంచమాలు కాక శుద్ధరిషభం, సాధారణ గాంధారం, ప్రతిమధ్యమం, శుద్ధ దైవతం, కాకలినిషాదం ఇవి శుభ పంతువరాళి రాగంలో వచ్చే స్వరాలు. ఇది సంపూర్ణ రాగం, 45వ మేళకర్త జన్యం.

ఈశుని మీద మూడు కృతులు రాసారు. శుభవంతు వరాళి, ఉదయ రవిచంద్రిక, సింధురామ క్రియారాగాలలో ఈ కృతులున్నాయి. సింధురామ క్రియరాగం గౌళవరాగ జన్యం - ఈ మూడు రాగాలు దీనంగా ఆర్తిగా బాధగా నివేదించు కొనేందుకు సరైన రాగాలు. ఆర్తిని ఈ రాగాలలో ప్రకటించడానికి వీలు ఎక్కువగా ఉంటుంది.

ఇక ఆధ్యాత్మిక చింతనతో రాసిన కృతులు మనోహరమైన భావాన్ని వ్యక్తీకరిస్తున్నాయి. రచయిత భావాలను వ్యక్తీకరించేటప్పుడు ఏరాగం ఏ భావానికి సరిపోతుందో తగు జాగ్రత్త తీసుకున్నట్లుగా ఈ కృతులలో స్పష్ట పడుతుంది". 22వ కృతి శ్రీరంజని రాగం రూపకతాళంలో

పల్లవి : తనువు గడుపు సాధనము తన దేయనబోకే మనస

అనుపల్లవి : తనవాడని దలచి హరిని యనవే వేమారు మనస

1. చరణము :స్థిరము లేని యీకాయము, పెరుగునా సిరులున్నవనిన
కరము లొగ్గి శ్రీరాముని - కరుణ గోరవే మనసా

2. చరణము :రూపవంతుడైన యా - శ్రీపతి చరణంబు పట్టి
నా పాపము బాప మనవె - బాపవ కవి నుతుని మనస ॥ 40

"జీవనం చెయ్యడానికి ఈ శరీరం ఒక సాధనంగా మాత్రమే ఉపయోగపడుతుంది. కానీ ఇదే శాశ్వతం అనుకుంటున్నావా మనసా! అస్థిరమైన ఈ శరీరం ఎన్ని సంపదలు భోగభాగ్యాలున్నా పెరుగుతుందని ఆశించకు. చేతులు మోడ్చి శ్రీరాముని కరుణ అడగవే - అందమైన రూపం కలవాడైన ఆ శ్రీమహావిష్ణువుని "నే చేసిన పాపాలన్నీ పోగొట్టు స్వామీ" అని వేడుకోవే ఓమనసా!" అంటూ భక్తితో, జ్ఞానంతో అర్థిస్తాడు.

మరో కృతి 29వది
భూపాల రాగం - ఆదితాళంలో
"సంసారమనెడి సాగరము దాటు
సందేహము దీర్చవయ్యు రామా!41

ఈ కీర్తనలో "రోజులు గడవడానికి భార్యాపిల్లలతో ధనవంతుల ఇళ్ళు చేరి శరీరాన్ని నడిపిస్తున్నాను. చేయకూడని పనులు చేసి కడుపు నింపుకున్నాను. ఇంక నన్ను హింస పెట్టకయ్యా ఓరామా! కొంచెం కూడా నాపైన జాలి జూపరావా! ఈ సంసారమనే సంద్రాన్ని దాటించే ఉపాయం సెలవియ్యవయ్యా!" అంటూ పశ్చాత్తప్తుడై ఆర్తిగా భగవంతుణ్ణి వేడుకొంటారు రచయిత.

30వ కృతిలో "సీతాపతి దయ లేకుండా ఎలా బ్రతుకుతాము?

సతీ సుతులెందుకు, కాంతల యొక్క తళుకు బెళుకులెందుకూ, శ్రీహరి పాదాలే గతి అంటున్నాను - ఆడినా పాడినా పూజలు చేసినా నావాడవనిన్నీ నన్ను కరుణిస్తావనీ నీ దగ్గర చేరి నిన్ను వేడుకొంటున్నాను రామా! నాకు నీవేగతి!" అంటారు.

పుట్టాను, పుట్టినందుకు పొట్టకోసం తిప్పలు పడి తిరిగాను. ఆ తర్వాత జ్ఞానమెరిగి నీ పాదాలు పట్టుకున్నాను. ఎప్పుడూ నీ కథలనే పాడేవాణ్ణి, వినేవాణ్ణి, కష్ట కాలంలో వున్నాను. వెంటనే వచ్చి నన్ను కాపాడరా! విజయగోపాలా! అంటూ (33వ కృతిలో) ప్రార్థిస్తారు.

హరిని చూడని ఈ కళ్ళు కళ్ళుకాదు. తను కుడ్య రంధ్రాలని హరిని పూజించని తనువు తోలు సంచి అని భాగవతంలో పోతన ప్రహ్లాద కుమారుని చేత చెప్పించిన రీతిలో

"చర్మగతమైన నరజన్మగతి కిల నీవె
సన్మార్గము చూపుతావు - అంటారు (34వ కృతిలో)
"గీతిగానేన యోగస్యాత్ యోగాదేవ శివైక్యతా
గీతిజ్ఞోయది యోగేన సయాతి పరమేశ్వరం (సూత సంహిత)
గీతం వాద్యం తథానృత్యం త్రయం సంగీతముచ్యతే (సంగీత రత్నాకరం)
గీత వాద్యోభయం యత్ర సంగీత మితికేచన
రాగస్వరశ్చ, తాళశ్చత్రిభి సంగీత ముచ్యతే"42

భక్తితో చేయబడే గానం యోగం అవుతుంది. ఆయోగంవల్ల మానవుడు పరమాత్మైక్యాన్ని పొందుతున్నాడు. గీతం, వాద్యం, నృత్యం అనే ఈ మూడింటి కలయికే సంగీతం అవుతుంది.

గీతం, వాద్యం కలిపి సంగీతం అనే వారు కొందరున్నారు. రాగం, స్వరం, తాళం ఈ మూడింటి కలయిక సంగీతం అని మరి కొంతమంది అంటారు. ఈ రెండింటి సమన్వయం వల్ల గీతం, వాద్యం, నృత్యంతో బాటు నాదం, దానివల్ల శ్రుతులు ఈ విధంగా సంగీతమంటే ఎన్నో భాగాలున్నాయి. ఇవన్నీ కలిసినప్పుడే సంగీతం అనబడుతుంది. అలాంటి సంగీతాన్ని పాడితే దానివల్ల ఫలితం మోక్షసిద్ధి కలగడం

ఈ పై విషయాలన్నీ దృష్టిలో పెట్టకొని బాపన్నశాస్త్రిగారు ఒక కృతిలో భగవంతుణ్ణి ముక్తి నివ్వమని కోరతారు.

25వ కృతిలో "ఆనందభైరవి రాగం - ఖండగతి

పల్లవి : గతి నేవేయనుచు నిను సతతంబునిని దలతు
హితవుతో నన్నేలు పతిత పావనరామ"

అనుపల్లవి : శ్రుతిలయ తాళ గతులను గూర్చి బాడితిని
వ్రత ఫలంబొసగు మిక శ్రిత జనరక్షక

1. చరణం : కలినరులను వేడ కుల మతములను వీడ
ఇల భాగ్యములగూడనను బ్రోవు నీవాడ
దెలుపవా నీ జాడ సాకేత పుర వాడ
కలికి రూపుడ బాపన కవి సన్నుతుడా ॥ 43

"పాడినందుకు ఫలం నీ సాయుజ్యాన్ని నాకు ప్రసాదించు. ఈ మానవులను వేడుకోను, కులమతాలను వీడిపోయాను. భాగ్యాలను కూడా వదిలేస్తున్నాను. నీ జాడ తెలుపవయ్యా కలికి అవతారం ధరించిన ఓ రామా!"

"సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా!
ఆ పతకమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా"

అని భద్రచల రామదాసు తాను రామునికి, సీతాదేవి తల్లికీ అదీ ఇదీ చేసానని చెప్పి పాడుపులాడినట్లే బాపన్న శాస్త్రిగారు కూడా అదే పంథాన నడిచారు.

"భైరవిరాగం - ఆదితాళం (42వ కృతి)లో

పల్లవి : రామా నినునే నెరనమ్మితి - వేమారు నిను వేడగలేదా ॥

అనుపల్లవి : నీమాయయోనీమహిమా దెలియ కామాదులనే గాన నైతిరా ॥

చరణం : ముని మనసు నెరిగి వనము నకేగి ధనువుచే అసురుల వధను జేసితివి
జనకుడు పల్కిన పల్కులు విని యా మునిని గూడి విల్లు విరిచి నిలిచిన ॥ రామా ॥
రామరామయని పొగడిన భక్తుల ప్రేమతో భువిలో నేలిన రామ
వామన రూపుడవేడెద రానిను - పామరుడనునే - బాపన కవి నుత ॥
నిన్ను నమ్ముకుని ఎన్నెన్ని మారలు వేడుకోలేదూ?
నీమాయ ఏమిటో నాకు తెలియడం లేదూ!
నన్ను అనుగ్రహించడానికి నీకు సాధ్యం కాదా?

విశ్వామిత్రుని మాటతో ఆయన వెంటవెళ్ళి ఆయన మనసులోని మాట తెలుసుకొని యాగాలను ధ్వంసం చేసే రాక్షసులను సంహరించావు. జనకుని మాట లాలించి మునితో వెళ్ళి, శివధనస్సును విరిచావు. రామా! అని పిలిచే భక్తులందరికీ ఆత్మరక్షణ చేసావు. ఇన్ని చేసావు. వారందరూ అడగ్గానే ఆదుకున్నావు. నేను పిలిస్తే నన్ను ఎందుకు ఆదుకోవు? అని రాముణ్ణి నిలదీసి ప్రశ్నిస్తున్న వైనం ఇందులో కనిపిస్తుంది.

మరొక కృతిలో సంగీత విద్వాంసులకు హెచ్చరికగా అన్నట్లు సూచన చేసారు శాస్త్రిగారు.

(45వ కృతి) ఉమాభరణ రాగం ఆదితాళంలో

"పాడరే పరమాత్ముని పదములను అంటూ శ్రుతిలయతో గతి తప్పక పాడుతూ క్షితిలోన చింత దీర్చమని పాడరే" అంటాడు.

చివరి కృతి 50వ రచన మంగళం, సురట రాగం - ఆది తాళంలో కూర్చారు. ఇలలో భక్తుల పాలించే గోపాలునికి మంగళం, బాలుడైన ప్రహ్లాదుని బ్రోచిన పావన మూర్తికి మంగళం" అంటూ కృతులను ముగించారు.బాపన్న శాస్త్రిగారి రచనలలో తదుపరి విభాగం తానవర్ణం. ఈయన పది తానవర్ణాలు రాసారు. పల్లవి, అనుపల్లవి, ముక్తాయి స్వరం, చరణం, చరణ స్వరాలతో ఉన్న ఈ తానవర్ణాలు వింజపురి నివాసుడైన గోపాలుని మీద రాసినవి.

సరసిజాక్షిరో మారుని బారి కోర్వలేను గోపాలుని

తోడితేవేవే వింజారపురమున వెలసిన వేణు గోపాలుని

చరణం : నిలుప రానీ మోహమాయె!

మాయామాళవగౌళరాగంలో ఇది రాసారు. హిందోళ, ఖరహరప్రియ, ఉదయ రవిచంద్రిక, శ్రీరంజని, కామ వర్ధిని, హంసానందిని, విజయ నాగరి, సింహేంద్రమధ్యమం, ధన్యాసి మొదలైన రాగాలలో రాసిన తాన వర్ణాలు ఇంచు మించుగా శృంగార రసభావంతో యింజపుర వేణుగోపాల స్వామి పేరున వెలయించారు.

మహేంద్రవాడ బాపన్న శాస్త్రిగారు రాసిన జావళులు పదింటిని మాత్రమే 'హరిహర కృతిమంజరి'లో ప్రచురించారు.

"ఒక సొగసులాడి తాను చిన్న దానను కానని అన్నిటిలో ప్రౌఢనని తనువు సొగసులు అన్నీ వేణుగోపాలుని కంకితమని త్వరగా రమ్మని, భానుడు అస్తమించే వేళ అయి భోగించాలనే భావనలు మేనిలో పెరిగిపోతున్నాయని ఇమ్మానవతిని త్వరగా పూలపాన్పు మీద కలుసుకోడానికి రమ్మని చెలికత్తెతో కబురు పెడుతుంది, తన ప్రియునికి" ఇది ఒక జావళిలోని భావం - (తోడి రాగం - ఆది తాళం) ఇది నాలుగు చరణాలున్న జావళి.

మరపురాని సమయాన్నంతా పరకాంత ఇంట్లో గడిపి వచ్చి, శీలమంతా పోగొట్టుకొని తనదరికి వచ్చిన నాయకుణ్ణి నిందిస్తుంది ఒక జావళిలో -

"నిన్న రాత్రి నా దగ్గర కొచ్చి నాతో ఉండి ఎన్నో వన్నె చిన్నెలు చూపిస్తానని మాట యిచ్చి ఆవెంటనే నన్ను మరచిపోయి ఆ వన్నెలాడితో వెళ్ళి పోయావు. ఎలా వచ్చేవు. నీ సంగతంతా సకియ చెప్పింది లెమ్మని" తిరస్కరణ ఇందులోని వస్తువు. ఇది కేవలం ఒక్క చరణం మాత్రమే ఉన్న జావళి.

బిలహరి రాగం - ఖండగతిలోని మరో జావళిలోని విషయం. "ఒకన్నెకి ప్రియుని కూడి రమించాలనే కోరిక మనసులో ఉంటుంది. కానీ తన పరిస్థితి పరుల భార్య, ఒకరింటి కోడలు అయినందువల్ల రాలేని పరిస్థితి ఉన్నా వీలు సాలూ చూసుకుని ఏమాత్రం అవకాశం దొరికినా తప్పకుండా వస్తానని అతనితో చెప్పడం" ఈ జావళిలోని వస్తువు.

"ఇంటి కోడల్ని - నేను ఒంటరిగా లేను. నన్నుముట్టుకోకు అనవసరంగా వాదులాట లెందుకు బలవంతం చేయకు ఉన్న నిజాన్ని నీకు చెప్పాను కదా! సామి! నా మగడు వచ్చే వేళయింది. నగరంలో అందరి ముందు నవ్వుల పాలవుతాను. నన్ను అసహ్యించుకుంటారు. మనకు కలుసుకోడానికి తగిన రహస్యపు చోటే లేదిక్కడ. నిన్ను పొందాలని, నీతో రమించాలనే కోరికా నా మనసులో ఉంది. నీ పొందు కావాలనే మన కోరిక తీరడానికి వీలు లేకుండా ఆ సూర్యభగవానుడు అడ్డం వచ్చాడు. సమయం చూసి తప్పకుండా వస్తానురా సామి!" అంటుంది.

సారంగపాణి పదాలలో కూడా భక్తి శృంగార పదాలున్నట్లే, ఈ గ్రంథంలో కూడా వున్నాయి. ఆనాటి సాంఘిక స్థితిని వివరిస్తూ సారంగపాణి పదాలు రాసాడు. అలాగే బాపన్న శాస్త్రిగారు కూడా జావళుల రూపంలో వివరించాడు.

మరొక జావళి (సింహేంద్ర మధ్యమరాగం - ఆదితాళం)లో కాంతామణి దగ్గరకు వచ్చిన ఆ నాయకుని తిరస్కరించి అతడు వెడలిపోయిన పిదప తిరస్కరించానని బాధపడుతూ తన చెలికత్తెతో చెప్పుకుని ఆ కాంతామణి రోదిస్తుంది.

సొమ్మొలిమ్మని ఇప్పుడే నా మనోహరుణ్ణి పొమ్మన్నాను. రమ్మని ఎంతో అనురాగంతో పిలిస్తే నమ్మనని అతనిని అల్లరి చేసాను. తన ఇల్లు వదలి నా దగ్గరకు వచ్చి నన్ను దగ్గరకు తీసుకుంటే కోపంతో అతణ్ణి తిరస్కరించాను. ఏ పాపం చేసానో నా బ్రతుకిట్లా అయింది. "కోరికకూడా తీర్చావా" అని మృదువుగా అడిగిన నా స్వామిని క్రౌర్యంతో తిట్టి వెళ్ళ గొట్టాను. కారు మబ్బులో చంద్రుని లాగ కనబడకుండా వెళ్ళి పోయాడు - నా వింజరపుర గోపాలుడు. అయో! అని విలపిస్తుంది.

వనమాలి శయ్య మీద పవళించడం ఏ తరుణికైన ఉబలాటంగానే ఉంటుంది. యౌవనవంతులైన యువతులు ఎవరైనా గాని ఆ విభుని మరిచిపోగలరా? ఈడుజోడు కలిగిన ఆడదానికప్పుడు ఎంతటి క్రూరుడైనా గానీ వానిని విడిచి పెట్టడానికి మనసంగీకరించదే - మనసు నిలుపుకోవడం ఎవరికీ సాధ్యంకాదు అంటూ వింజరపుర విజయ గోపాలుని (ముఖారి రాగం - ఆదితాళం)లో మోహావేశ అయిన తరుణి వలపు పిలుపును వర్ణించాడు.

తన మనసు నిండా కోరిక నింపుకుని కాముక అయి వచ్చి ఒక తన్వి వేణుగోపాలుని మోహావేశం చల్లార్చమని (ముఖారి రాగం - ఆదితాళం)లో వేడుకుంటుంది. ఈ విరహాన్ని భరించలేనని, నన్ను కాదనవొద్దు, కులం, గుణం ఉన్న దాననట్లు చేయడం తగదు అంటూ వేడుకుంటుంది.

"పల్లవి : పిలిచిన పలుకవురా! గోపాల! వలచి వచ్చితిని అలుకయేలరా

అనుపల్లవి : కులము కలదాన కలయ గోరితిర, కలిగె నీదుపై వలపు నాసామి

చరణం 1 : మరుశరములకు నే గురినైతినిరా! పరితాపమార్చు ప్రభువు నీవెగాద;
విరహమాపజాల - కరుగదా నీ మనసు పెరిగి యౌవనము మరువ జాలనిను

చరణం 2 : చుక్కల రాయుడు పక్కన నవ్వెర చొక్కి యున్న నా మక్కువ జూచి
మొక్కెదనిక నా అక్కర దీర్పర చక్క దనము బోవు నిక్క మిక నమ్ము ॥

చరణం 3 : ఇల్లు జేరు నాయిల్లము దెల్పెద వల్ల గాదనక నాసామి గోపాల
తెల్లవారె జాడు గూసె తొలికోడి నల్లవాడ వింజరపుర పాలుడ ॥[44]

పిఠాపుర సంస్థాన ప్రాంతంలో ఉంటూ సంస్థానం నుండి సంగీత రచనలను గ్రంథ రూపంగా సంగీత ప్రపంచానికి అందించిన గొప్ప విద్వాంసుడు బాపన్న శాస్త్రి. గురువు నేర్పిన విద్యకు సార్ధక్యాన్ని తెచ్చి బాపన్న శాస్త్రి స్థిర కీర్తులయ్యారు.

# రెండవ భాగం
# సంస్థానంలోని కళాకారులు

## రేగిళ్ళ వారి వంశం (కాలం వివరాలు తెలియవు)

రేగిళ్ళ వారు మొదట కరీంనగర్ జిల్లాలో ఆ తర్వాత పశ్చిమ గోదావరి జిల్లాలో నివాసం ఉన్నారు. పిఠాపురం రాజావారి ఆదరణతో ఆ సంస్థానంలో ఆస్థాన సంగీత విద్వాంసులుగా స్థిరపడ్డారు.

రేగిళ్ళ వంశంలో ధుండీశ్వరులు పిఠాపుర సంస్థానంలో మొట్ట మొదటి ఆస్థాన విద్వాంసుడు. ధుండీశ్వరులు ఆస్థాన విద్వాంసులుగా నెలకొనడానికి చాలా చిత్రమైన నేపథ్యం ఉంది. అప్పటి భారతదేశం బ్రిటీష్ వారి పరిపాలనలో వుంది. వైస్రాయి ఒకసారి మద్రాసులో సామంతులైన సంస్థానాధిపతులను గౌరవించడానికి సమావేశమయ్యారు. అప్పటి పిఠాపుర సంస్థానాధిపతి శ్రీ రాజారావు వెంకట మహీపతి గంగాధర రామారావుగారు (1862-1890) మద్రాసులో వైస్రాయిని వెండి నాణాలు పోసి కర్పూర హారతిచ్చి నాణాలతో దిగ దుడిపించారు. ఆ సందర్భంలో ధుండీశుల గాన సభ ఏర్పాటయింది. దాదాపు అరగంట సేపు గానసభ జరిగింది. భావయుక్తంగా త్రిస్థాయి సంచారాలతో గానం చేసిన ధుండీశ్వరులు గారిని "అయ్యా! మీరెక్కడివారు? మీ గ్రామ మేది" అని సభలో శ్రోతలు అడిగారు. "మాది పిఠాపురం నేను పిఠాపుర సంస్థాన గాయకుణ్ణి"[45] అని ధుండీశ్వరులు సమాధానమిచ్చారు.

ఆ సమాధానం విన్న పిఠాపురం మహారాజా రామారావుగారు ఆశ్చర్యపడ్డారు. పిఠాపురానికి వచ్చిన వెంటనే ధుండీశ్వరులను పిలిపించి "అయ్యా! మీ వలన మా సంస్థానానికి గొప్ప గౌరవం ప్రాప్తించింది. మీరెవరో ఇప్పటి వరకూ నాకు తెలీదు. ఈనాటి నుండీ మా ఆస్థానంలో మీరు విద్వాంసులు. మీరానాడు మద్రాసులో అన్నమాటను సార్థకం చేస్తున్నాను స్వీకరింతురుగాక" అని చెప్పి 18 ఎకరాల భూమిని కూడా ఇచ్చారు. ఆ భూమిలో ఆరు ఎకరాలు ఈనాటికీ ధుండీశ్వరుల రెండవ కుమారుడు జగన్నాథశాస్త్రిగారి కుమార్తె ఆధీనంలో ఉంది. తమ్ముళ్ళు కొంత భూమిని అమ్మేశారు. ధుండీశ్వరులకు ఇద్దరు కుమారులు, సుబ్బారావు, జగన్నాథశాస్త్రి. వీరిద్దరూ కూడా పీఠికాపురాస్థాన విద్వాంసులే. "గంగాధర రామారావు రాజావారి అనంతరం ఆయన కుమారుడు శ్రీ రాజారావు వెంకట కుమార మహీపతి సూర్యారావుగారు (1885-1964) సంస్థానాధిపతి అయ్యారు. సూర్యారావుగారు, వీరి దివాన్ మొక్కపాటి సుబ్బారాయుడు గారి సలహా మేరకు రేగిళ్ళ సుబ్బారావు, జగన్నాథశాస్త్రి సోదరద్వయాన్ని తన ఆస్థాన విద్వాంసులుగా నియమించుకున్నారు. అప్పటి కాలంలో ఆస్థాన విద్వాంసులకు నెలకు జీతం 30 రూపాలయలిచ్చేవారు. ఆమరణాంతం వారి జీతం రాజావారి నుండి వచ్చేది.

"రాజా కుమార మహీపతి సూర్యారావుగారి కాలంలో తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారి వలన రేగిళ్ళ సోదరులు వీణను కూడా అభ్యసించి ఆరు నెలలో వైణికులుగా సిద్ధహస్తులయ్యారని" జగన్నథశాస్త్రిగారి ప్రాణమిత్రులు శ్రీరామ మడుగుల సోమన్నగారు చెప్పారు. వీరు వీణ నేర్చుకోడానికి ఒక కారణం వుంది.

అప్పటికింకా సంగమేశ్వర శాస్త్రిగారు పిఠాపురానికి రాలేదు. కశింకోట విశాఖ జిల్లాలో సంస్థాన విద్వాంసులుగా ఉన్నారు. అప్పుడొకసారి "శాస్త్రిగారి వీణా వాద్య సభ పిఠాపురం దర్బారులో ఏర్పాటయింది. సరస్వతీ అవతారమైన శాస్త్రిగారి వీణా గానం విని తన్మయులై పిఠాపురం రాజావారు శాస్త్రిగారిని ఆస్థాన వైణికుడునిగా నియమించారు."[46]

శాస్త్రిగారు రాజాగారితో "రేగిళ్ళ సోదరులు గాయకులేగాని వైణికులు కాదు. వైణికులకే సంపూర్ణ విద్వత్తుండునని" చెప్పగా రేగిళ్ళ సోదరులను రాజావారు పిలిచి ఈ విషయాన్ని తెలియచేసారు. రేగిళ్ళ సోదరులు ఆరు నెలల గడువు ఇమ్మని రాజావారిని కోరి, ఆరు నెలలో వైణికులై రాజావారిని మెప్పించి శాశ్వత సంస్థాన విద్వాంసులుగా గౌరవాన్ని పొందారు. వీరు వీణ సాధన చేసిన స్థలం కాజులూరు - రామలింగేశ్వరాలయు దక్షిణాన ఉన్న ముత్యాలమ్మ దిబ్బ.

జగన్నాథ శాస్త్రిగారికి చాలా మంది శిష్యులున్నారు. పై వూళ్ళ నుండి పిఠాపురం వచ్చి సంగీతాభ్యాసం చేసేవారు. శ్రీమాన్ శృంగారం అళహాసింగరాచార్యులు, దంతుర్తి సంగీత తాతరాజు (కోలంక) శరభలింగం (కాజులూరు) మురుకుట్ల జగన్నాథం (కాజులూరు) పెండ్యాల ఉప్మాకయ్య (ఎండపల్లి) ఆమర్తి వెంకన్న దొర (ఎండల్లి) ఇంకా చాలా మంది విద్వాంసులున్నారు.

"రేగిళ్ళ వంశజులు సుబ్బారావుగారు ఇంకా సజీవులైన వృద్ధులు. వీరు కూడా సంగీత విద్వాంసులే. ఆమర్తి వేమన్న దొర, వింజమూరి సూర్యారావు, పెండ్యాల ఉప్మాకయ్య, శృంగారం అళహాసింగరాచార్యులుగార్ల వద్ద షట్కాల పద్ధతిలో సుబ్బారావుగారు వర్ణాలను నేర్చుకున్నారు. సుబ్బారావు గారు హిందుస్తానీ సంగీతాన్ని కూడా అభ్యసించారు. ఈయన ఆస్థాన విద్వాంసులుగా ఉన్నట్లు ప్రకటించలేదు. అన్నవరం, తుని, రామచంద్రపురం, కాకినాడ, జంషెడ్‌పూర్, ఖరగ్‌పూర్ మొదలైన చోట్ల సంగీత సభలు చేసారు. అనేక స్వర్ణ పతకాలను సాధించారు."[47]

## ఆమర్తి వేమన దొర (కాలం వివరాలు తెలియవు)

శ్రావ్యమైన గొంతుతో దొర అయిన దొరగారు ఆమర్తి వేమన దొర. పిఠాపురం సంస్థానంలో గొప్ప ఆస్తిపరులు. ఎంత మధురంగా పాడేవారో అంత మధురంగానూ వయోలిన్ వాయించేవారు ఆమర్తివారు. ఎక్కడైనా ఎవరైనా పాడుతున్నప్పుడు మధ్యలో కించిత్ అపశ్రుతి వచ్చినా భరించలేక కళ్ళూ, చెవులూ మూసుకునే వారు.

వేమన దొరగారి కచేరీ ఉందంటే పిఠాపురంలో సంగీత ప్రియులంతా తప్పకుండా వెళ్ళి విని ఆనందించేవారు.

డాక్టర్ తణికెళ్ళ సత్యనారాయణ, డాక్టర్ కోకా రంగ ప్రసాదరావు, డాక్టర్ పులుగుర్తి సుబ్బారావు - ఈ ముగ్గురూ పిఠాపురంలో మంచి సంగీత రసపిపాసకులు. తరచుగా ఆమర్తి వేమన దొరగారు వీరి ఇళ్ళల్లోనే సంగీత సభ చేసేవారు.

అలాగే చీమలకొండ అద్వైత పరబ్రహ్మ శాస్త్రిగారు కూడా సంగీతాభిమానులే. రోజూ సంగన్న గారి ఇంటికో వేమన దొర వారింటికో వెళ్ళి వారి పాట వింటే గాని నిద్ర పట్టేది కాదు ఆయనకు.

ఆదిలో వేమన దొరగారి దగ్గర, తర్వాత ఉప్మాకయ్యగారి దగ్గరా సంగీతం నేర్చుకుని తదనంతరం ద్వారం నరసింగరావు దగ్గర మెరుగులు దిద్దుకున్న డా॥ శ్రీపాద పినాక పాణిగారూ ప్రముఖ విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తిగారు పిఠాపురంలోని వారే.

విజయనగరం సంస్థానం కళలకు నిలయమైతే పిఠాపురం మూర్తీభవించిన కళారూపమేమో! ప్రసిద్ధ విద్వాంసులుగా, కచేరీలు చేయకపోయినా అంతటి ప్రతిభా పాండిత్యాలున్న సంగీత విద్వాంసులు పిఠాపురంలో అడుగడుగునా ఉన్నారు. కేవలం తమ ఆనందం కోసం ఆ ప్రాంతంలో వీణ నేర్చుకొని, గాత్రం నేర్చుకొని విద్వాంసులయ్యారు.

"పిఠాపురం ఎస్టేట్‌లో ఉద్యోగి ద్రోణం రాజు రామమూర్తి గారు, కోలంక ఎస్టేట్‌లో ఉద్యోగస్థుడు ఆకుండి వెంకటరత్నం గారూ ద్రోణంరాజు కుమారులు బాపిరాజుగారు వైణికులు"[48]

సంగమేశ్వర శాస్త్రిగారబ్బాయి సత్యనారాయణ శాస్త్రి తండ్రి లాగే వీణ సొగసుగా వాయించేవాడు. "అయితే తండ్రి అంత కాదు. కొంచెం పిచ్చి పిచ్చిగా అమాయకుడిలా ఉండేవాడు. గొప్ప తెలివీ వుంది. దానికి కారణం కళకు అంకితమై తన కుటుంబ వ్యవహారాలను అంతగా పట్టించుకోకపోవడమే" అనంటారు కోలంక వెంకటరాజుగారు.[49] రసికులను తన వీణావాద్యంతో మెప్పించిన చిట్టిబాబు కూడా పిఠాపురంలోనే వీణాభ్యాసం చేసారు. "శ్రీమతి తోట చెల్లాయమ్మ అని గొప్ప వైణికురాలు ఉండేవారు. పిఠాపురంలో ఉన్న కళాభిమానులంతా ఆమె వీణానాదాన్ని వినడానికి వారింటికి వెళ్ళే వాళ్ళు. గంటల తరబడి ఆమె వాయించే వారు. అలాగే వింటూండే వాళ్ళు. చెల్లాయమ్మగారు వీణ వాయిస్తుంటే సంగమేశ్వర శాస్త్రిగారి వీణ జ్ఞప్తికి తెచ్చేదిగా ఉండేదని, ఆ వీణా నాదాన్ని విన్న ప్రతీవారూ ఆమె సరస్వతి రూపమే అని పొగిడేవారు."

వక్కలంక భవానీ శంకరకవి కవి అయినప్పటికీ లాలి పాటలూ, ఆరగింపు పాటలూ, పవళింపు పాటలు, పుష్పయాగం రాసారు. వాటిని మాధవ స్వామి తిరునాళ్ళలో పాడతారు. ఇప్పుడవి అలభ్యం.

వృద్ధులై నోట పండ్లు ఊడిపోయినా గంటల తరబడి మృదుమధురంగా పాడగలిగి ఎంత దూరమైనా తనగొంతు వినిపించే సామర్థ్యం గలిగిన నందిగానం వెంకన్నగారు జీవనోపాధికోసం బొబ్బిలి నుండి పిఠాపురం వచ్చి ఆమరణాంతం ఇక్కడే ఉండి పోయారు. సావేరి రాగం పాడటంలో పై చెయ్యి కావడం వల్ల సావేరి వెంకయ్యగారని పిలిచేవారు.

ఆయన వీణ వాయించే నేర్పు సంగమేశ్వర శాస్త్రిగారికి వచ్చింది. వెంకన్నగారు కుమారస్వామి చెఱువు గట్టున పాంథులకు ఒక మంచి నీళ్ళ బావిని తవ్వించారు.

"నందిగానం వెంకయ్య ధర్మం అని నూతిగోడ మీద చెక్కి వుంది. వెంకన్నగారి శిష్యులు వారింట్లోనే భోజనం చేసేవారు."

## సరస్వతీ గాన సభ

చదువది యెంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణ సంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్

అని భాస్కర శతక కర్త అన్నట్లు ఏకళైనా రసజ్ఞత లేకపోతే ఉప్పులేని కూరలా చప్ప చప్పగా అయిపోతుంది. రసజ్ఞులు, ఆదరించే వారూ లేకపోతే కళాకారులు మెరుగులేని మణుల్లా మరుగున ఉండిపోతారు. ఎంత పేరు పొందిన కళాకారులైనా ఎంత విద్వత్తూ పాండిత్య ప్రకర్షలున్నా రసజ్ఞుల మెప్పు పొందాల్సిందే. అలాంటి రసపిపాసకులు సంగీతసేవ చేస్తూ ఎంతో మంది కళాకారులను, విద్వాంసులను వెలుగులోకి తెచ్చారు. అలాంటి రసపిపాసకులలో జమీందార్లు కూడా భాగస్వాములే.

తమ ఆస్తినంతా కేవలం కళాపోషణకే వినియోగించిన పిపాసులు కొంతమందయితే, మరి కొంతమంది చందారూపంలో ధనాన్ని పోగు చేసి, తనకు లభించిన సన్మానాల తాలూకు ధనాన్ని వెచ్చించి సంగీత కళావ్యాప్తికి ఎంతో తోడ్పడ్డారు.

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను ఏర్పాటు చేసి ఆ సందర్భంలో సంగీత విద్వాంసుల గాన వాద్య సభలు నిర్వహించి, సన్మానం చెయ్యడం వంటివి ఇందులో భాగాలు.

దివాన్ బహద్దూర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణ మూర్తి నాయుడు (1873-1953) సరస్వతీ గాన సభను నిర్వహించారు. అంతకంటే ముందు పోలవరంజమీందారు ఆర్.వి.కె. రంగారావుగారు, దేవరకొండ సుబ్రహ్మణ్యంగారు, సూర్యనారాయణమూర్తి నాయుడుగారు మొదలైన వారు నిర్వహించేవారు. 1894లో సరస్వతీ గానసభ కాకినాడ స్థాపన జరిగింది.

ఆంధ్రదేశంలో మొట్టమొదటి గాన సభ ఇదే అంటారు. పిఠాపురం, బొబ్బిలి, కిర్లంపూడి ప్రభువులు ఈ గాన సభ నిర్వహణార్థం ఆర్థిక సహాయాన్నందించేవారు. శారదనవరాత్రులు నిర్వహిస్తూ ఆ సందర్భంలో పుష్పవనం అయ్యర్, రామ్నాడ్ శ్రీనివాసయ్యంగారు మొదలైన దాక్షిణాత్య విద్వాంసుల మొదలుకొని ద్వారం వెంకటస్వామినాయుడు, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు మొదలైన ఎంతో మంది ఆంధ్ర ప్రాంత గాయక ముఖ్యులను ఆహ్వానించి, గాన సభలు ఏర్పాటు చేసి, వారిని సత్కరిస్తూ ఉండేవారు. 1930 సంవత్సరంలో రజతోత్సవ సందర్భంలో సరస్వతీగానసభలో గోవిందస్వామిపిళ్ళైకు సువర్ణ ఘంటాకంకణాన్ని సూర్యనారాయణమూర్తి నాయుడుగారు బహుకరించారు. ఆ విధంగా ప్రతీ ఏటా ఒక విద్వాంసునికి ఈ బహుమానం ఇచ్చేవారు. ఎంతో మంది విద్వాంసుల కది ప్రోత్సాహకరంగా ఉండేది. సంగీత కళాపోషణ కోసం తన జీవితాన్నే అంకితం చేసిన వ్యాపారదక్షుడు, కళాపిపాసి సూర్యనారాయణమూర్తి నాయుడుగారు.

## అధస్సూచికలు

1. 1) వెంకటరావు, కురుమెళ్ళ."మా పిఠాపురం" జగపతి ప్రింటర్స్, పిఠాపురం 1978, పుట - 61.

   2) వెంకటనరసింహసత్యనారాయణరావు, కోటగిరి. అప్పారాయగ్రంథమాల, నూజివీడు 1981, పుటలు 21, 23, 24.
2. విజ్ఞాన సర్వస్వము - 2వ సంపుటి. తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు, హైదరాబాదు 1988, పుటలు 371, 372.
3. కమలా అనార్కలి, సి. "పిఠాపుర సంస్థానము - కవిపండితపోషణ" వసంత ప్రింటర్స్, కాకినాడ 1973, పుట - 320
4. వెంకటశాస్త్రి చెళ్ళపిళ్ళ. "కథలు - గాథలు" ద్వితీయ భాగము. వేంకటేశ్వర ప్రింటింగ్ ప్రెస్, ఆలమూరు 1959. పుట 689.
5. వెంకట్రావు, కురుమెళ్ళ."మా పిఠాపురం", జగపతి ప్రింటర్స్, పిఠాపురం - 1978. పుట 27.
6. రజనీకాంతరావు, బాలాంత్రపు."ఆంధ్ర వాగ్గేయకారచరిత్రము" విశాలాంధ్ర ప్రచురణ 1958. పుట 432.
7. వెంకటరాయకవి మద్దిరాల."ఏకాంతసేవా విలాసము, పిఠాపురం - 1933, వి.తె. పుటలు - 6, 7, 8, 9, 10
8. " అదే " పుటలు - 6, 7, 8, 9, 10
9. పిఠాపురంలో ఈ కీర్తనలు పాడే ఒకే ఒక కుటుంబం కందాళ పేరేశ్వరరావు సోదరులు. వారు చెప్పిన విషయం ఇది; 10. " అదే "
11. వెంకటరాయకవి మద్దిరాల."ఏకాంతసేవా విలాసము" పిఠాపురం 1933. పుట 34.
12. ఉమాదేవి,మండపాక."మద్దిరాల వెంకటరాయకవి" గానకళ, కాకినాడ - 1989 సెప్టెంబరు. పుట 25.
13. వెంకటరాయకవి, మద్దిరాల."ఏకాంతసేవా విలాసము" పిఠాపురం 1933. ఉపోద్ఘాతం పుట 2.

14. " అదే " పుట 2; 15. " అదే "

16. శార్ఙ్గ దేవుడు, సంగీత రత్నాకరః కల్లినాథ వ్యాఖ్య అడయార్ ప్రచురణ - 1955, పుట 271

17. వెంకటరాయకవి,మద్దిరాల."ఏకాంతసేవా విలాసము" పిఠాపురం - 1933. పుట 4.

18. " అదే " పుట 4 ; 19. " అదే " పుట 5; 20. " అదే " పుట 9.

21. " అదే " పుటలు 7, 8; 22. " అదే " పుటలు 7, 8, 9; 23. " అదే " పుట 9.

24. " అదే " పుటలు 19, 20; 25. " అదే " పుట 34; 26. " అదే " పుట 38.

27. " అదే " పుట 41; 28. " అదే " పుట 42.

29. రాజేశ్వరశాస్త్రి,మండపాక. "చిరస్మరణీయమైన సమావేశము" శ్రీరవీంద్ర శతవార్షికోత్సవ విశేష సంచిక. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1961. పుట 16.

30. విజ్ఞాన సర్వస్వం, 2వ సంపుటము - తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ - పుట 753.

31. రాజారావు,ఆకొండి."సంగమేశ్వర శాస్త్రిగారి సంస్మరణము" గానకళ, కాకినాడ, జనవరి, ఫిబ్రవరి 1965. పుటలు 17,18; 32. " అదే " పుటలు 26, 27.

33. రాజారావు,ఆకొండి."గాంధర్వ మంటే సంగమేశ్వరునదే" గానకళ, కాకినాడ - 1981. జనవరి పుటలు 3, 4.

34. రాజేశ్వరశాస్త్రి,మండపాక. "చిరస్మరణీయమైన సమావేశము" శ్రీరవీంద్ర వతవార్షికోత్సవ విశేష సంచిక. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ 1961. పుట 18

35. బాపన్న శాస్త్రి, మహేంద్రవాడ. శ్రీహరిహరకృతి మంజరి, రిపబ్లిక్ పవర్ ప్రెస్, కాకినాడ 1964. పుట I

36. " అదే " పుట III; 37. " అదే " పుట XI

38. " అదే " పుట 4 39. " అదే " పుట 40

40. " అదే " పుట 32 41. " అదే " పుట 42

42. సత్యనారాయణమూర్తి, అరిపిరాల, సంగీత లక్షణ సంగ్రహము, మద్రాసు 1940. పుట 1

43. బాపన్న శాస్త్రి, మహేంద్రవాడ. శ్రీహరిహరకృతి మంజరి, రిపబ్లిక్ పవర్ ప్రెస్, కాకినాడ 1964. పుట 31

44. " అదే " పుట 95

45. సుబ్బారావు,రేగిళ్ళ."సంప్రదాయ సంగీతం - రేగిళ్ళ వంశం సేవ" సుబ్బారావుగారు ఇచ్చిన వ్యాసం - పుట. 2; 46. " అదే " పుట 3; 47. " అదే " పుట 4.

48. (1) చూడు : అనుబంధం - I ; 49. వెంకట్రావు కురుమెళ్ళ, మా పిఠాపురం, జగపతి ప్రింటర్స్, పిఠాపురం. పుట - 103.

# 4. వెంకటగిరి సంస్థానం

బొబ్బిలి, పిఠాపురం, నూజివీడు మొదలైన సంస్థానాల మూలపురుషుడు ఒకడే. వీరు పద్మనాయక వంశజులు. వెంకటగిరి సంస్థానం వారు వెలుగోటి వారు. వీరు మొదట 15వ శతాబ్దంలో విజయనగర చక్రవర్తుల సామంతులలో ముఖ్యులుగా ఉన్నారు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం కొంతకాలం మహమ్మదీయులకు సామంతులై, ఆ పిమ్మట బ్రిటిషు వారితో స్నేహంతోనూ మెలిగారు.

కాకతి రుద్రగణపతి చక్రవర్తినేలిన డెబ్బది ఏడు గోత్రాల వెలమ దొరల్లో వెంకటగిరి వెలుగోటి వారిది రేచర్ల గోత్రం. వెలుగోటి వారు మొదట వెంకటగిరిని రాజధానిగా చేసుకుని పరిపాలించారు. ఈ వంశంలో ఇరువదవ తరం వారైన యాచశూరుని నుండి వెంకటగిరి పాలకులకు యాచేంద్రులని వంశపరంపరగా ఆపేరు స్థిరమైంది.

యాచశూరునికి ముగ్గురు భార్యలు - ఎనిమిది మంది సంతానం. అందులో కుమార యాచమనీడు కొడుకు బంగారం యాచమనీడు. ఢిల్లీ పాదుషాల వజీరు, అసఫ్ఖాన్ కుమారుడు జుల్‌కాఫర్‌ఖాన్‌ను "ఆర్కాటుసుబా"కు అజమాయిషీ కోసం పంపించారు. జుల్ కాఫర్ ఖాన్ దురుద్దేశంతో కుట్రపన్ని బంగారు యాచమనాయని తన డేరాకు రప్పించి, తాను డేరా నుండి బయటకు వచ్చి, డేరా తాళ్ళు కోయించి, డేరా క్రింద పడవేయించి యాచమనాయణ్ణి చంపించేడు.

బంగారు యాచమనేడుకు భార్యలు ముగ్గురు. అందులో పెద్దభార్య కొడుకు సర్వజ్ఞ కుమార యాచేంద్రుడు. మూడవ భార్య కొడుకు కుమార నాయుడు. వీరిద్దరినీ ఒకదాసిదాని చేతికిచ్చి ధనమిచ్చి బయటకు పంపి, రాణులు 1693లో ఆత్మహత్య చేసుకున్నారు. సర్వజ్ఞ కుమారుడు, కుమారనాయుడు సోదరులు తమ మేనమామలైన సైదాపుర పాలకులను ఆశ్రయించి వారి కృషివల్ల పాదుషానుండి సర్వేపల్లి, నెల్లూరు, వెంకటగిరి, కాళహస్తి, గూడూరు, తిరుపతి, విష్ణుకంచి, పూనమెల్లి జాగీరులు, జులుసీసనద్ 37గల సన్నదును పొందారు. 1695లో సర్వజ్ఞ కుమార యాచమనాయుడు వెంకటగిరి సంస్థానంలో పట్టాభిషిక్తుడయ్యాడు. సోదరుడైన కుమార నాయనికి దూపాడు. ఉదయగిరి, అద్దంకి, పొదిరి, కొచ్చర్ల కోట మొదలైన తొమ్మిది పరగణాలను జులుసేన్ 43 గల సన్నదును ఆర్కాటు నవాబు ఇప్పించేడు. కుమార నాయనికి సంతతి లేకపోడం కారణంగా ఈ పరగణాలు కూడా సర్వజ్ఞ కుమార యాచేంద్రునికే దక్కాయి. ఈ సర్వజ్ఞకుమారుడు విద్వత్కుమార యాచేంద్రునిగా పేరు తెచ్చుకున్నాడు.

వెంకటగిరి సంస్థానాధీశులలో 28వ తరం వారైన రాజా సర్వజ్ఞ కుమార యాచేంద్ర బహద్దర్ సి.యస్.ఐ. వారి రెండవ కుమారుడు రామకృష్ణయాచేంద్రులు పిఠాపురం సంస్థానానికి దత్తులయ్యారు. కుమార యాచేంద్రుని మూడవ కుమారుడు రంగమన్నారు కృష్ణయాచేంద్రులను బొబ్బిలి సంస్థానానికి 1871లో దత్తత నిచ్చారు. వీరే మహారాజా సర్ రావు వేంకటశ్వేతాచలపతి రంగారావు బహద్దర్. కుమార యాచేంద్రుని నాల్గవ కుమారులు నవనీత కృష్ణ యాచేంద్రులను 1877లో జటప్రోలు సంస్థానానికి దత్తుగా పంపారు. వీరే రాజా సురభి వెంకట లక్ష్మారాయబహద్దూర్.

రసార్ణవ సుధాకర కర్త సర్వజ్ఞ సింగభూపాలుని లాగే వెంకటగిరి పాలకులు కూడా కళాపోషకులు 1695లో వెంకటగిరి నేలిన 23వ తరం వారైన. సర్వజ్ఞ కుమార యాచేంద్రుడు కాళహస్తి జ్ఞాన ప్రసూనాంబ మీద ఒక అష్టకం, ఒక చూర్ణిక రచించాడు. 1832-92లో వెంకటగిరి నేలిన 27వతరంవారైన సర్వజ్ఞకుమార

యాచేంద్రుడు విద్వజ్జన పోషణలో మేటి. ఇతడు గీతార్థసార సంగ్రహం, సభారంజని, నాస్తికధ్వాంత భాస్కరం, రత్నషట్కాంగుళీయకం, సర్వమత సార సంగ్రహం మొదలైన కావ్యాలను రాసిన గొప్పపండితుడు. వీటిలోని సభారంజని గ్రంథం సంగీత సంబంధిగ్రంథం.

నాయికా, నాయక, రస, సంగీత, తాళ, హిందూస్థానీ రాగ, తాళ, నాట్యాభినయ, శబ్ద, వాద్య, పండిత రహస్యాలనే మొత్తం ఎనిమిది ప్రకరణాలు గల గ్రంథం ఇది. దీనిని లక్షణ గ్రంథంగా పేర్కొనవచ్చు. వాగ్గేయ కారరత్న శ్రీహరి నాగభూషణంగారు మెచ్చిన గ్రంథం. 31వ తరానికి చెందిన శ్రీ వేంకటశేష వరద రాజగోపాల కృష్ణయాచేంద్ర (1924) తమపూర్వీకులను అనుసరించారు. కవిపండితగాయక ప్రముఖులను సంస్థానానికి ఆహ్వానించి, సభలను నిర్వహించి, వారిని సత్కరించి తరతరాల నుండి విద్యల కాట పట్టయిన వెంకటగిరి కీర్తిని నిలబెట్టారు.

రాజగోపాలకృష్ణయాచేంద్ర భూపతి (28వ తరానికి చెందినవారు) తమ్ముడుముద్దు కృష్ణయాచేంద్రుడు తమ వంశీయుడైన సర్వజ్ఞ సింగభూపాలుని రసార్ణవ సుధాకర మనే నాట్యాలంకార శాస్త్రాన్ని పండిత పరిష్కృతంగా ముద్రించాడు. దక్షిణ భారతంలో ఉన్న కర్ణాటక సంగీత విద్వాంసులు వెంకటగిరిలో సత్కారం పొందని వారు లేరనిచెప్పవచ్చు. వేణుగోపాల యాచేంద్రుల వారు (28) కాళహస్తిలో శివరాత్ర్యుత్సవాల సందర్భంలో కళాకారులను సన్మానించి, దానికి అయ్యే వ్యయమంతా భరించేవారు. యాచేంద్ర వంశంవారు నాట్య కళా ప్రదర్శిని అనే గ్రంథాన్ని కూడారాశారు.

వేంకటశేష వరద యాచేంద్రులు సంగీతంలో అవధాన ప్రక్రియను నిర్వహిస్తారు. అలవోకగా ఏరాగంలో ఏ వర్ణన ఏ తాళంలో చెయ్యమన్నా చేయడంలో సిద్ధహస్తులు. వెంకటగిరి సంస్థానంలో సరస్వతిశేషశాస్త్రి, సరస్వతి సూర్యనారాయణ శాస్త్రి, ఇద్దరూ సంగీత సాహిత్యాలలో సమాన ప్రతిభగల ఆస్థాన విద్వాంసులు. తిరుపతి విద్యలనారాయణస్వామినాయుడు, షట్కాల నరసయ్య ఆస్థాన సంగీత విద్వాంసులు.

ఈ సంస్థానంలో రామలక్ష్మణగారు, బెంగుళూరు నాగరత్నమ్మగారు, సరస్వతీ బాయి, మహావైద్య నాథయ్యర్, చెంగల్వరాయశాస్త్రి మొదలైన వాగ్గేయ కారులు, విద్వాంసులు ఘనంగా వార్షికంగా సన్మానితులు.

## వెలుగోటి సర్వజ్ఞ యాచేంద్ర భూపాలుడు

### సభారంజని

ఇమ్మహానుభావుడు రాసిన కావ్యాలలో సభారంజని అన్న రచన సంగీత సంబంధి గ్రంథం లభ్యమైంది.[1]

ఇది శారదాంబా విలాస ముద్రాక్షరశాలచెన్నపురి, తండ్యాలపేటలో 1890వ సంవత్సరంలో ముద్రితమైంది. ఈ గ్రంథాన్ని తిరుమలశెట్టిజగన్నాథం అనే మన సాక్ష్యకూటం మొదటి మెంబరుకి కాపీరైట్‌తో సహా ఇచ్చేసినట్లు, మరెవ్వరూ దీన్ని ప్రచురించకూడదని 1890 సంవత్సరం మార్చి 24వ తేదీన గ్రంథకర్త శ్రీ వెలుగోటి కుమార యాచమనాయుడు గారు - సి. యస్.ఐ. వెంకటగిరి పెద్ద రాజాగారు గ్రంథం మొదటి పుటలలో రాశారు.

ఈ గ్రంథంలో ఉన్న విషయాన్ని సూచికలో పుటలతో సహా 'విషయసూచిక' అన్న పేరుతో ఇచ్చారు. ఉపోద్ఘాతంలో సభారంజని అనే ఈ గ్రంథాన్ని ఏవిధంగా రాశారు అనేది స్పష్టంగా రచయిత చెప్పారు. అందులోని సారాంశం ఇది.

"చదువుకున్న రసజ్ఞులు, మంచి విషయాలను తెలుసుకోవాలనుకునేవారు రాజావారినిమీరు తిరిగిన, చూసిన, నేర్చిన, విన్నవిషయాలన్నీ ప్రోది చేసి సభల్లో యోగ్యమైన విద్యావిషయాలను వ్యావహారికశైలిలో అందరికీ అర్థమయ్యేవిధంగా రాయమని ప్రార్థించారు. అందుమూలంగా ఈ గ్రంథాన్ని రాసానని చెప్పారు.

ఇక అవతారికలో ప్రకరణాలలో ఉన్న విషయాన్ని రెండు మూడు వాక్యాలలో స్పష్టపరిచారు. విషయాన్ని ఆ విధంగా రెండు మూడు వాక్యాలలో రాయడానికి కారణం గ్రంథం పెద్దదవ్వడం వల్ల ప్రతి పుట తిరగేసి చదవడానికి ఓపిక చాలమందికి "ఇప్పటి వారికి ఉండదని (గ్రంథకర్త అభిప్రాయం) అందుకే అలారాసినట్లు ప్రకటించారు.

"సభారంజని" గ్రంథంలో మొత్తం ప్రకరణాలు ఎనిమిది.

1. నాయికా నాయక ప్రకరణం.

ఇందులో ప్రసిద్ధ శృంగార నాయికల, నాయకుల భేదాలను, వారి వారి సహాయులు, నర్మసచివులు వీరందరినీలక్షణయుతంగా వివరించారు. ముందుగా నాయికా భేదాలు.

ప్రసిద్ధ నాయిక స్వీయ, పరకీయ, సామాన్య అని ముప్విధాలు. అందులో స్వీయ భేదాలు - అవస్థాభేదాలు - 18. ముగ్ధ, మధ్య, ప్రగల్భ అని స్వీయను ముప్విధాలుగా విభజించారు. అందులో ముగ్ధ - అజ్ఞాత యౌవన, జ్ఞాతయౌవన, నవోఢ, విస్రబ్ధనవోఢ అని నాలుగు భేదాలు.

మధ్య : మధ్య ధీర, మధ్యాధీర, మధ్య ధీరాధీర మొదలైనవి ఆరుభేదాలు.

అదేవిధంగా ప్రగల్భ : ప్రగల్భధీర, ప్రగల్భాధీర ప్రగల్భధీరాధీర అని మొత్తం ఎనిమిది భేదాలు పేర్కొని, ఆనాయికల లక్షణాలను సులభమైన భాషాశైలిలో రెండు మూడు వాక్యాలలో గ్రంథకర్త వివరించారు.

పరకీయ భేదాలు కన్య, పరోఢ అని అందులో పరోఢ - గుప్త, విదగ్ధ లక్షిత, కులట అనుశయాన మొదలైన తొమ్మిది భేదాలను వివరించారు.

ఇందులో విదగ్ధలో వాగ్విదగ్ధ, క్రియా విదగ్ధ అని రెండు విధాలు, అదేవిధంగా అనుశయాన ముప్విధాలని వివరించారు. ఈ అనుశయాన భేదాలకు లక్షణాలు మాత్రం చెప్పారు. ఇక సామాన్య నాయిక - జాతి సామాన్య, ఆగంతుక సామాన్య, గూఢ సామాన్య అని ముప్విధాలు. ఇవి గాక స్వీయాభేదంలో ముగ్ధా, మధ్య, ప్రౌఢ నాయికల్లో, పరకీయ, సామాన్యాలలో భేదాలు ప్రాచీనులు చెప్పినవి, అష్టవిధ నాయికలను గురించి వివరించారు. స్త్రీ పురుష జాతుల నిర్ణయాలు అవయవాల ప్రమాణాన్ని, బట్టి కూడా ఉంటాయని, పద్మిని, చిత్తిని, శంఖిని, హస్తిని అనేవి స్త్రీలకు సంబంధించినవని అలాగే పద్మినికి, పాంచాలుడు, చిత్తినికి కూచిమారుడు, శంఖినికి భద్రుడు, హస్తినికి దత్తుడు నాయకులుగా నిర్ణయించినట్లు వివరించారు. అదేవిధంగా స్త్రీ పురుషుల రతికి సంబంధించి కూడా భేదాలు వివరించారు గ్రంథకర్త.

ఇక నాయకుల వివరానికొస్తే అనుకూలురు, దక్షిణుడు, ధృష్టుడు, శఠుడు, పతి, ఉపపతి, వైశికుడు, మధ్యముడు, అధముడు అనే భేదాల్ని చెప్తూ మహానాయకులన్న పేరుతో ధీరోదాత్త, ధీరోద్ధత, ధీరశాంత, ధీరలలిత నాయకులనుఒక్కొక్కరిని ఒక్కొక్క వాక్యంలో వివరించారు. సభారంజనిలో రెండవ ప్రకరణం రసాన్ని గురించినది. ఇందులో రసవిభజన, నవరసాలకు నిర్వచనాలు, ఆయారసాల స్థాయీ భావాలు, ఈ స్థాయీ భావాలకు విభావ అనుభావ, సాత్త్విక సంచారీ భావాలు వాటి వివరణలున్నాయి.

సాత్త్విక భావాలు : స్తంభం, ప్రళయం, విజృంభణం మొదలైన ఎనిమిది.

సంచారీ భావాలు : నిర్వేదం, శ్రమ, దైన్యం, జాడ్యం, మొదలైన ముప్పైమూడు.

శృంగార చేష్టలు : భావం, హావం, హేల మొదలైన పదునెనిమిది భేదాలు ఇందులో వివరించారు.

పిమ్మట రసాభాస వివరణ కూడా ఉంది. రసాభాసానికి కారణాలు ఐదు చెప్పారు. స్త్రీ పురుషుల్లో ఒకరికి ఇష్టం. ఒకరికి ఇష్టం లేకపోడం, అధముల రతిని బాగా వర్ణించడం, ఒక స్త్రీ ఒకే కాలంలోచాలా మంది పురుషుల మీద అనురాగం చూపడం, ఇటువంటి కారణాల వల్ల రసాభాసం కలుగుతుందని వివరించారు రచయిత.

ఈ రెండు ప్రకరణాల్లో ఉన్న విషయం అంతా నరస భూపాలీయం, భరతుని నాట్య శాస్త్రంమొదలైన గ్రంథాలలో ఉన్నదే. వ్యావహారిక సులభశైలిలో సూక్ష్మంగా వివరణ సభారంజనిలో ఉన్నది.

సంగీత ప్రకరణంలో సంగీతం, శ్రుతి, అనురణనం, స్వరం మొదలైన పదాలను నిర్వచించారు. తర్వాత స్వరాలు (7) ఏడింటిని వాటి శ్రుతులను, త్రిస్థానాలను వాటిలక్షణాలను వివరించారు. గ్రామ భేదాలు, ఆ లక్షణాలను తెలుపు లక్ష్యాలుగా వీణలను వివరించారు.

దైవీవీణ - అంటే మనుష్య గాత్రం. మానుషీ వీణ - అంటే మనుష్యకృతమైన వీణ, స్వరాదులు పలికించుటకు మానుషీవీణ అయిన అచ్యుత రాయవీణను లక్ష్యంగా చెప్పారు.

వీణల గురించిన వివరణ - భూలోకంలో ఉండే రుద్రవీణకు 12 ఇళ్ళు ఉన్నాయని ఇందులో శుద్ధ స్వరంలేదు అని, తారక షడ్జం చేరి మిశ్రస్వరాలు 4 చేరి 12 అయ్యాయని వివరాలున్నాయి. "రుద్ర వీణకు అచ్యుతరాయ వీణకు మెట్లు ఏ విధంగా వుంటాయో "పట్టికరూపంలో"[2] వివరించారు.

ఆ తర్వాత మేళకర్త రాగాల ప్రస్తారాన్ని వివరించారు. కటపయాది సూత్రంలో మేళకర్త రాగాలను ఏ విధంగా గుర్తించాలనే విషయం స్పష్టపరిచారు. 36 రాగాలకు ఆయా రాగ స్వరాలు వాటి శ్రుతులు వివరించారు.[3]

ఈ ముప్ఫై ఆరు మేళకర్త రాగాలు శుద్ధ మధ్యమాన్ని మధ్య ప్రస్తరించిన శుద్ధ వికృత స్వరాలను బట్టి 36 భేదాలు కలిగాయి.

జన్య రాగాలలో ఔడవ, షాడవ రాగాలు సంపూర్ణ ఔడవ భేదాలు, షాడవ సంపూర్ణ భేదాలు మొదలైన భేదాలన్నింటిని సంగ్రహంగా నిర్వచించారు. రాగాల భేదాలుగా చెప్పబడుతున్న రాగాంగ, భాషాంగ, ఉపాంగ, దేశాంగ, భేదాలను వివరించారు. న్యాసం, అంశం, గ్రహ స్వరాలు వివరించారు.

ఇక ప్రస్తారాల గురించి పాండిత్య ప్రకర్షకు సంబంధించిన విషయాలు కాబట్టి సభల్లో వీటి ఉపయోగం లేదని "వాటిని విడిచిపెట్టేసినట్లు" ప్రకటించారు. వాది, సంవాది, వివాది, అనువాది స్వరాలు - ఎట్లా ఉపయోగిస్తారనే విషయాన్ని తెలియచేసారు.

దశ విగమకాలు మొదలైన విషయాలు ఈ ప్రకరణంలో పేర్కొన్నవన్నీ వీణను దృష్టిలో ఉంచుకొని రాసినవే. వీణలో ఎట్లా పలికించాలో తెలిసినందువల్ల ఈ విషయం స్పష్టపడింది.

ఇక సభారంజనిలోని నాల్గవ ప్రకరణం తాళ ప్రకరణం - భరతోపనిషత్తును బట్టి భరతముని భరత సూత్రాల్ని చేసేరు. చూడామణి భరతం, మాతృగుప్త భరతం రత్నాకర చూడామణి భరతం, నారదభరతం మొదలైన, భరతాలలో ఉండే తాళ దశ ప్రాణాల్ని గ్రంథకర్త వివరించారు. తాళం అంటే ఏమిటి? దశ ప్రాణాలు - కాలప్రాణ లక్షణం, మార్గ ప్రాణ లక్షణం; క్రియా ప్రాణ లక్షణం మొదలైనవి, సప్తతాళాలు, తాళ ప్రస్తారాల గురించి సులభరీతిలో వివరించారు. ఈ ప్రకరణంలో చర్చించిన చివరి తాళం సింహ నందన తాళం. దీనికి లక్షణం 128 అక్షర కాలాలు ఉండాలని రాసారు. ఇది కూడా సంగీత సంబంధి ప్రకరణమే.

ఇక ఐదవ ప్రకరణం హిందుస్తానీ రాగ తాళ ప్రకరణం. ఇందులో పురుష రాగాలు. వీటికి ఒక్కొక్క దానికి ఆరేసి మంది భార్యలు చొప్పున 36 స్త్రీరాగాలు ఉన్నాయి.

"ఛేరాగ్ చత్తీస్ రాగ్నే" అని అంటారు. తక్కినవి ఈ రాగాల బిడ్డలు. హిందూస్థానీ సంగీతంలో సప్తస్వరాల పేర్లు కరజ్, రిగవ్, గధార్, మద్దం, పంచం, ధైవత్, నిభార్ అని పిలుస్తారు. "ఇక రాగ కాలాలు ఏరాగం ఏ సమయంలో పాడాలి అనే నిర్ణయం ఆయా కాలాల్లో పాడాల్సిన రాగాలను ఇందులో పేర్కొన్నారు."[4] హిందుస్థానీలోని ధృపద్‌లో ఉన్న చేతాల్, బిరం, దస్తానా తాళాలను వివరించారు. తాన్, టప్పా, రోంకీ, రవానీ వీటి తాళాలు.

ఇక హిందుస్థానీలో పాడే బాణీలు తాన్‌సేన్‌బాణీ, గోబల్‌హార్ బాణీ, గోపాల నాయక్ బాణీ అనే భేదాలను రాసారు. హిందుస్థానీలో ప్రబంధ భేదాల పేర్లు మాత్రం పేర్కొన్నారు. అలాగే హిందుస్థానీ కృతుల్లో పల్లవిని - అసై అనీ, అంత్రా - అంటే అనుపల్లవి అనీ, అభోగ్ అంటే చరణం అంటారని గ్రంథకర్త రాసారు.

ఈ గ్రంథంలోని తర్వాతి ప్రకరణం నాట్యాభినయ ప్రకరణం. నాట్యాన్ని తాండవ, నటన, నాట్య, లాస్య, శృత్త, దర్శనమనే భేదాలతో 6 విధాలుగా విభజించారు.

వీటి గురించి అంతగా వివరించలేదు. గీతం, పదం మొదలైన వాటి అర్థాలను తన అభినయయుక్తంగా చేసి సభ్యుల హృదయానికి హత్తుకునేలా చేసే "అభినయాన్ని నాట్యభేదాల్ని వాటి వివరణ ఇస్తామని గ్రంథకర్త చెప్పుకున్నారు."[5]

ఈ అభినయం ఉత్తమ, మధ్యమ, అధమ మని ముప్విధాలు - వాటి గురించి వివరించారు.

అథమంలో రెండు భేదాలున్నాయని అవి సజీవకం, నిర్జీవకమని వీటిలోనే కాళిదాసాది మహాకవులు రాసిన నాటకాలుగా పేర్కొన్నారు.

ఈ నాటకలక్షణాలలో ప్రస్థాపనం అన్న పేరుతో ప్రస్థాపనాంగాలు, శుద్ధ విష్కంభం, మిశ్రవిష్కంభం, పంచ సంధులు మొదలైనవి. వాటిలో ఉండేభేదాల సంఖ్య సూచిస్తూ పేర్కొన్నారు.

ఆ తర్వాత అభినయం గురించి వివరించారు. గీతం, మొదలైన వాటి అర్థాలను కటాక్షాది హావభావాలతో తెలియ చేసే అభినయం, సభారంజకం కాబట్టి అభినయం గురించి వివరిస్తున్నట్లు ముందుగానే రచయిత పేర్కొన్నారు.

అభినయానికి ఉపయోగపడే కొన్ని లక్షణాలను స్పష్టపరిచారు. ఉద్వాహితం - అంటే తల మీద కెత్తుట, అవధూతం - అంటే క్రిందికి వంచుట. విధుతం - అంటే అడ్డంగా రెండు ప్రక్కల త్రిప్పుట.

ఇవి మొత్తం 6 లక్షణాలు శిరోభేదాలుగా చెప్పారు. దృష్టి భేదాల శీర్షికతో లలితం - అంటే మనోహరంగా చూడటం, కుంచితం - అంటే కొంచెం సంకోచించి చూడటం, వికాసం - అంటే స్ఫుటంగా నేత్రాలను విప్పి చూడటం మొదలైన భేదాలు పదమూడింటిని పేర్కొన్నారు. అలాగే భ్రూభేదాలను ఉక్షిప్త - అంటే కనుబొమ్మలను మీదికి నిక్కించుట, పతితం - అంటే రెండు కనుబొమ్మలు క్రిందికి వంచుట మొదలైన 5 లక్షణాలు వివరించారు.

నాసా చలన భేదాలు - రెండు, అధరోష్ట చాలన భేదాలు - మూడు, హాసభేదాలు - ఐదు, గ్రీవాభేదాలు - నాలుగు, హస్త చాలన భేదాలు - పదహారు, ఉరశ్చాలన భేదాలు - నాలుగు, ఊరు చాలన భేదాలు - మూడు,

పాదకర్మ భేదాలు - పందొమ్మిది, పార్థివచారి భేదాలు - నాలుగు, వ్యోమ చారి భేదాలు - మూడు, భాను మండల భేదాలు - మూడు, దైవ మండల భేదాలు - నాలుగు, కరణ భేదాలు - నూట ఎనిమిది, (ఇందులో ఏడు మాత్రమే వివరించారు. మిగిలినవి పేరు సైతం ఇవ్వలేదు) అంగహార భేదాలు, అసంయుత హస్త భేదాలు సంయుత హస్త భేదాలు, పేరణి నృత్య లక్షణ వివరణ మొదలైనవి ఈ నాట్యాభినయ ప్రకరణంలో వివరించారు.

ఇక సభారంజని గ్రంథంలోని ఏడవది శబ్ద వాద్యాల ప్రకరణం. శబ్దం అంటే సొల్లు అని, అది ఈశ్వర సద్యోజాత ముఖం వల్ల పుట్టినదని చెప్పి, వివిధ రకాలైన పేర్లుగల శబ్దాలను వాటి ధ్వనులను వివరించారు. నాగబంధం - దీనికి సొల్లు - నగి - ననగి - పవనం - దీనికి సొల్లు - నన - గిడ - గిడ డిగి"

ఇత్యాది శబ్దాలను కొన్ని వామదేవ ముఖం వల్ల కలిగినవి, అఘోర వక్త్రోద్భవాలు, తత్పురుష ముఖ జన్యాలు, ఈశాన ముఖోద్భవాలు అని విభజించారు. ఈ ధ్వనులలో కుడి ఎడమ హస్తాలతో వాద్యం మీద వాయించవలసినవి కొన్ని ఉన్నాయని పేర్కొన్నారు.

సంగీత సూర్యోదయాది గ్రంథాలలో అనేక తాళాలకు సొల్లు లేమి, ఒక్కొక్క తాళంలో త్రికాల విన్యాసాలు వాయించాల్సిన జతులు పేర్కొన్నారని రాసారు. వాటి శబ్దాల పేర్లు మృగేంద్ర హుంకృతి శబ్దాలని, గజేంద్ర బృంహిత శబ్దాలనీ, అశ్వపుతాదిశబ్దాలని, శబ్దాల రూపాలను బట్టి ఆయా నామ నిర్దేశం చేసారని రాసారు -

సభారంజని గ్రంథంలో చిట్ట చివరి ప్రకరణం ఎనిమిదవది పాండిత్యరహస్య ప్రకరణం.

వైణికుని పాండిత్యం, గాయక పాండిత్యం, వాద్యకుని పాండిత్యం, అభినయించి పాత్ర చాతుర్యం, నట్టువకాని చాతుర్యం ఈ అంశాలను వివరించారు.

వాద్యకారుడు ఏ విధంగా వాద్యాన్ని వాయిస్తే అతని పాండిత్యంతో బాటు వాద్యానికి విలువా సభారంజకత్వం కలుగుతాయో ఆ లక్షణాలను వివరించే ప్రకరణమే ఈ పాండిత్య రహస్య ప్రకరణం.

ఉదా : వీణ వాయించే వానికి

పాట అక్షరాక్షరానికీ మీటు వేసి సంగతి గమకానికి మీటు వేయకుండానే సంగతిని వాయించడం అదేవిధంగా ప్రక్క తంత్రుల మీద శ్రుతి మీటు వేయకుండా వాయించే తంత్రుల్లోనే ఆయా గమకాలను పట్టి వాయించడం ఇవి పాండిత్య లక్షణాలు. ఇలాంటి లక్షణాలు చెప్పే శాస్త్రాలు ఎన్నో ఉన్నాయని ఇందులో పైపై విషయాలనే పరికించమని గ్రంథకర్త చివర చెప్పుకున్నారు.

ఆయా గ్రంథాల్లో తప్పులున్నా ఆ గ్రంథాలను చూసి రాసిన నా యీ గ్రంథంలో కూడా తప్పులుంటాయి. అయినంత మాత్రాన దోషారోపణ చేయకూడదు. సులభంగా అర్థమయ్యే రీతిలో రాసినందుకు సంతోషించమని కోరుకున్నారు. గ్రంథంచివర గ్రంథకర్త తనకు తెలిసిన విషయాన్ని పదుగురికీ తెలియ చెప్పాలనే ఉద్దేశంతో ఈ సభారంజని రచన చేసినట్లూ మరే విధంగానూ బహుమానాలు, గౌరవసన్మానాలూ పొందాలనిగానీ రాయులేదని స్పష్ట పరిచారు. మొత్తం మీద ఈ రచన ప్రాచీనుల గ్రంథాలలోని సారాన్ని స్పష్టపరచిందిగా చెప్పుకోవచ్చు.

# మొదటి భాగం
# వెంకటగిరి సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం

## తిరుపతి విద్యలనారాయణస్వామి నాయుడు (1873 - 1912)

సంగీతత్రయం ఏకమైన ఆ మహా ప్రవంతుల్లో దేని పంథా దానిదే. ఆ మహా ప్రవంతుల నుండి ఎన్నో పిల్లకాలువలు వెలువడ్డాయి. వీణ కుప్పయ్యర్, పట్నం సుబ్రహ్మణ్యయ్యర్, సుబ్బరాయశాస్త్రి మొదలైన వాగ్గేయ కారులు దక్షిణాది పిల్ల కాలువలైతే ఆంధ్ర దేశపు పిల్లకాలువలు తిరుపతి విద్యల నారాయణస్వామి నాయుడు, దాసు శ్రీరాములు, గరికి పర్తి కోటయ్య దేవర మొదలైన వారు వీరు జావళులు, పదాలు, వర్ణాలు, కీర్తనలు, రాగమాలికలు మొదలైన రచనలు చేసారు. తిరుపతి విద్యల నారాయణస్వామి నాయుడుగారి గురించి, ఆయన చేసిన రచనల గురించి సంగీత గ్రంథాలలో అక్కడక్కడా సూచనాప్రాయంగా ఉంది.

తిరుపతి విద్యల నారాయణస్వామి నాయుడు వెంకటగిరి సంస్థాన ఆస్థాన విద్వాంసుడు. పసిప్రాయంలోనే వయోలిన్ వీణ, హరికథ నేర్చుకున్నాడు. విద్యల నారాయణస్వామి నాయుడికి ఉగ్గుపాలతోనే సంగీతం కూడా రంగరించి పోసింది తల్లి కోమలమ్మ. దానికి కారణం ఆమె కూడా సంగీత విద్వాంసురాలే. "కోమలమ్మ త్యాగరాజస్వామి శిష్య పరంపరలోని వాలాజీ పేట శిష్యపరంపరంలో ఒకరి ఆడపడుచు"[6] వారి శిష్యురాలు కూడా. నారాయణస్వామి నాయుడుగారికి తల్లి, తర్వాత కాళహస్తి వెంకటస్వామి నాయుడగారు సంగీత గురువులు. ఆయన దగ్గర వీణ, గాత్రం రెండూ నేర్చుకున్నారు. ఇతడు తిరుపతి పుర నివాసి. ఆ మహా ప్రవంతుల నుండి ఎన్నో పిల్లకాలువలు.

వెంకటగిరి సంస్థానాధిపతి అనుజ్ఞ మేరకు రాగమాలికలు రాసాడు. తిరుపతి నారాయణ స్వామి. అలాగే "కాళహస్తి సంస్థానాధిపతి చిన్నవెంకటప్పనాయునిబహద్దూర్ వారిపై కూడా రచన చేసాడు. అది నవరాగ మాలిక".[7]

"తిరుపతీశ", "తిరుపతిపుర", "తిరుపతి" అనే ముద్రతో ఇతని కృతులు అనేకం ఉన్నాయి. వర్ణం, కృతి, జావళీ, రాగమాలిక ఈ ప్రక్రియలలో కొన్ని రచనలు చేసారు. తిరుపతి నారాయణస్వామి నాయుడు రాసిన జావళులు, ఇతర రాగమాలికలు సంగీత గ్రంథాలలో కొన్ని లభ్యమయ్యాయి. లభ్యమైన రచనలను ఇందులో సవిమర్శపూర్వకంగా పొందుపరుస్తున్నాను.

"వినువినా ఏగతి" - శకుంతల రాగం; "నిర్గుణుడో గుణుడో" - మలయమారుతం; "పరాకేల సరస్వతి" - నాటకురంజిరాగం; "ఇకనైన" - పుష్పలతిక రాగాలలో రచనలు చేసారు. తిరుపతి నారాయణస్వామి రాసిన జావళులు. శ్రీ ఎస్.సి. పార్థసారథి గారి సంకలనమైన "జావళీలు అన్న పుస్తకంలో లభ్యమయ్యాయి.

బేహాగ్ రాగం - రూపక తాళంలో

"వగలాడి బోధనలకు - వలచితివోసామి"[8]

ఇందులో పల్లవి, అనుపల్లవితో బాటూ రెండు చరణాలు కూడా ఉన్నాయి. ఒక చరణం, ఒకే వాక్యం, రెండో చరణం రెండు వాక్యాలు. ఎదరు బోలైన స్త్రీ మాటల్లో పడి ఆమె వట్టి నాటకాలాడేదని తెలిసి, మోసకత్తె అని తెలిసి కూడా ఆమెని ప్రేమించావు అని నాయకుణ్ణి హెచ్చరిక చెయ్యడం ఇందులోని వస్తువు.

మరో జావళి - హిందూస్థానీ కాపీరాగం - రూపకతాళంలో

"పాయరాని బాళిచే భామనంపిన రావు"[9]

ఇందులో జావళిలాగే పల్లవి, అనుపల్లవి ఉండి చరణం మాత్రం మూడు వాక్యాలలో ఉంది. మన్మథుని బారి తట్టుకోలేక కరిగిపోయి ప్రేమించిన నీ చెలిని కౌగిలించుకుంటావని నిన్నూ తలచరాదా? నిన్ను కోరుకున్న చెలీ నీ మాటకు ఎదురు ఆడడం ఉన్నదా? "తిరుపతి నివాస" అని ఇందులోని వస్తువు - నాయకుని ఉద్దేశించి కోరిన చెలిని దగ్గర చేర్చుకోమని వ్యక్తం చేస్తున్నట్లుంది.

తిరుపతి నాయుడుగారు మద్రాసులో ఉండగా ఠాకూర్ వంశస్థులు ఇతన్ని, సంగీత వైదుష్యాన్ని గమనించి బాగా పోషించేవారు. ఠాకూర్ వారు నాయుడిగారిని జావళులు రచించమని కోరినందున "కేసరి నీకేసరి" అనే జావళి కూడా రాసారు అని "జావళీలు" గ్రంథం (పుట 12)లో పార్థసారథిగారు రాసారు. కానీ ఆ జావళి ఇప్పుడు అలభ్యం -

సంగీత గ్రంథాల్లో ఉన్న నవరత్న రాగమాలిక తిరుపతి విద్యల నారాయణ స్వామి నాయుడు శ్రీ రాజరాజమహారాజ దామర కుమారమ - రా - శ్రీ చిన్న వెంకటప్ప నాయని బహదూర్ వారిపై రాసిన ఈ రాగమాలిక తొమ్మిది రాగాలలో రాయబడింది. ఇవి ప్రముఖమైన ప్రసిద్ధమైన రాగాలు - రాగాల పేర్లు ప్రతి చరణంలోనూ సందర్భానుసారంగా అర్థవంతంగా సమకూర్చాడు నాయుడు.

నవరత్న రాగ మాలిక - దర్బారు, సావేరి, మలయమారుతం, చంద్రకళ, అఠాణ, సురటి, సరసాంగి, భూపాలం, వరాళి రాగాలలో కూర్చాడు.

దర్బారు - రూపకం

నీదరబారు గాచినది నీరజాక్షి నేలుకోర

మాబోటి నీ చతురత లేమరు వినివిని

ఇపుడో దామర కుమార చిన్నవేంకటేంద్ర

అని మొదలవుతుంది ఈ మాలిక. దీనిని దర్బారు రాగంలో కూర్చాడు నారాయణస్వామి నాయుడు. నీ దరబారు గాచినది అన్నచోట దర్బారు రాగాన్ని అర్థవంతం చేసి సభ అని అర్థం చెప్పించాడు.

అలాగే తర్వాత చరణం 'సావేరి' రాగం - రూపకతాళంలో రాసారు.

మనసావేరిక దలచక - మా మనోహారిణీపుడు ॥ నీదర ॥

దానిసాబగును మరి అల -

వీక యెపుడును నిజంబుగ ను ॥ నీదరబారు ॥

మనసావేరిక తలచక అన్నప్పుడు ఓ మనసా! మరోలా ఆలోచించకుండా అని అర్థవంతంచేసారు. ఆమె అందాన్ని, ఆమె వయ్యారాలు గల మరో స్త్రీని నువ్వెప్పుడూ చూడ లేవు - కాబట్టి నీ దర్బారులో ఉన్న ఆ నీరజాక్షిని ఏలుకోమని విన్నపం చేసుకున్నారు. ఈ రాగమాలికలో మూడవ రాగం మలయ మారుతం - ఈ చరణాన్ని కూడా రూపకతాళంలో నిర్దేశించారు.

"మలయమారుతము వీవ మరిమరీ ఓర్వక

సారెకు మరుడురు వడి విరిశరములు గురియా ॥ నీదర ॥

చిలుకలు కలకలమని పలుకగ మనుసు బెదరి సరసుడ ॥ నీదర ॥[10]

మలయ మారుత రాగాన్ని మలయ పవనంగా అర్థం వచ్చేటట్లు రాసారు.

ఆ మలయ మారుతానికి తట్టుకోలేక, మన్మథుడు తొందరపడి వేగంగా వేసే పూబాణాలను తట్టుకోలేక, చిలుకలు పరకరిస్తూంటే మనసు బెదరి పోయి, నీదరి చేరిన నీరజాక్షినేలుకోమంటాడు.

నాల్గవ రాగం చంద్రకళ

"చంద్ర కళలు దేలు మోముతో పగడములకు సరిరా సరోజముఖి యధరము

మదగజయానర మానవి యిక రతులన్ పెనగొనుర తడయక చంద్ర కళలు"

ఆమె ముఖంలోని ఆకర్షణీయత అందం, చంద్రకళలతో నిండి ఉందని ఆమె పెదవుల ఎరుపు పగడాల వన్నెకు కూడా సరిపోవని, ఆమె మదగజ గమన అని అటువంటి మానినిని కామకేళిలో తేలియాడించరా అని కోరుకుంటాడు.

రాగమాలికలోని ఐదవరాగం అఠాణ రాగం

"అలివేణీ బోదానవే హఠాణరావేమి యేరయిటు అబలలపై యనాదరణజేసితె

యెటులోర్తురు చలముయుడిగి ఆ లతాంగి మనసు దెలియక"

తనను చూడని నాయకునిపై కోపంతో పోబోతున్న ఆమెను ఎందుకు పోతున్నావు. త్వరగా (హఠాణ) రావేమిటి అని ఆమెను మందలిస్తున్నాడు రచయిత. అలా మందలిస్తూనే నిన్ను కోరిన స్త్రీలపై ఎందుకు ఆదరణ చూపవు. చలము మాని ఆ లతాంగి మనసు తెలుసుకోవయ్యా అని నాయకుణ్ణి అర్థిస్తున్నాడు. అఠాణ అనే రాగం "త్వరగా" అని అర్థవంతం చేసాడు.

ఇదే విధంగా తక్కిన ఆరు ఏడు ఎనిమిది తొమ్మిది చరణాల్లో సురటి, సరసాంగి, భూపాల, వరాళి రాగాలను ఆయా సందర్భాలకు తగిన అర్థం వచ్చేటట్లు కృతికారుడు ఉపయోగించాడు.

చివరి భూపాల, వరాళి రాగాలలో రాజును భూపాలా దేవేంద్రా అని సంబోధించాడు. భక్త దీన జనావారాళీ ప్రియునిగా తిరుపతి వేంకటేశ్వరుని ధ్యానిస్తూ వేంకటేశ్వరుని భక్తులుండే నీ దర్బారు అని ముగిస్తాడు.

బేహాగ్ రాగం - రూపకతాళం (జావళి)

పల్లవి : వగలాడి బోధనలకు - వలచితివో సామి •

అనుపల్లవి : పగటి మోసకత్తెయని పలుమారులు వినివిని - ॥

1వ చరణం : పడకటింటిలో పదుగురనే పదిల పరచి యుండే ॥

2వ చరణం : సరసుని కాచాన పొందు విరసమౌనని యెంచి

తిరుపతిపుర వెంకటేశ తెలియకనేడు

2."పాయరాని" హిందుస్థానీ కాఫీరాగం - రూపకతాళం - (జావళి)

పల్లవి : పాయరాని బాళిచే భామ నంపిన రావు ॥

అనుపల్లవి : కాయజుని బారికి కరి చింతనొంది

బిగికౌగిట జేర్తువని - ప్రీతియేల తలపవలదే

చరణం : నాడే నిను కోరిన (చిన) చెలియ నెట్లు సైతురా
ఎన్నడైన నీ మాట కెదురాడి యుంటే
సన్నుతాంగ తిరుపతి పురనివాస వెంకటేశ ॥

ఈ రెండు జావళులు శ్రీ ఎస్.సి. పార్థసారథి, శ్రీమతి ఎస్.సి. ద్వారక పార్థ సారథి సంకలనం చేసిన "జావళీలు" అన్న గ్రంథంలో స్వరపరిచి ఉన్నాయి.

3. కీర్తన "ఇకనైన నామొర వినరాదా ॥ పుష్పలతిక రాగం - ఆదితాళం

పల్లవి : ఇకనైనా నామొర వినరాద ఇనకుల చంద్ర ఇది సమయము ॥

అనుపల్లవి : సా అకళంక నీవే ఆదరమని నే ఆశించి యుండ ఆదరించెనె గాని

చరణం : పరమ దయాకరుడవ మామ ప్రహ్లాదాదులు వేడ కరుణించి వేగ కాపాడ
లేద తిరుపడిపుర వరవేంకటె ॥ ఇకనైన ॥

4. మరొక కీర్తన పరాకేల సరస్వతి - నాటకురంజి రాగం - రూపకతాళం

పల్లవి : పరాకేల సరస్వతి మురారిసుత సతీమణి ॥ పరా ॥

అనుపల్లవి : బిరానన వరాలొసగు పరాత్పరి దయాకరి ॥ పరా ॥

1 చరణం : సురాసురుల మనంబునను స్థిరంబుగను మరికవెలయు
పురాణియాదరించుటకు స్మరించెద సరోజముఖి । పరా ॥

2 చరణం : పరాశరాదులకైనను ప్రణుతింప తరముగాని
తిరుపతి వేంకటేశుడౌ దేవదేవుని దలచునాపై ॥ పరా ॥

6 వ కీర్తన - శ్రీరాగం - రూపకతాళం

పల్లవి : నొసటి వ్రాలి ఇక అన్నగలద నోములెన్ని నోచుకొన్న ॥ నొస ॥

అనుపల్లవి : పశుపతికైన మగని పాకశాసనకు నయిన " నొస ॥

1 చరణం : మనసా చింతించనేలనే పీమతనిత గుణ కళ్యాణుని ధ్యాన పరులనైన గాని ॥ నొ ॥

2 చరణం : పరమ యోగీంద్రులకు నైన భాసుర తిరుపతి పురవాస వేంకటేశయీశ ॥ నొస ॥

7వ కీర్తన దర్బారు రాగం - ఆదితాళం

పల్లవి : మోముజూపవేమి రమా మోహనాంగ నీదు ముద్దు ॥ మో ॥

అనుపల్లవి : కమరి వినుత నామ కావు మనుచు వేడుకొన్న ధనదారాపుత్రులెల్లా దరి జేర్చలేరనుచు ॥

1 చరణం : (ఇది అనుపల్లవి వలె పాడాలి)
అనవరతము నీవె ఆధారమనియున్న
దనిపద । మపమదపమరిమ । రిసరిపమరిగగరిసరిని।
సరిసమ । రి పమదపసదరి । సపాసపా మరీమపద ।

2 చరణం : (చరణం వలె పాడాలి)
కరిమొరలిడ । గాచినట్టి । కరుణ నేడెందుదాగె ॥
తిరుపతి పురవాస । దేవవేంకటేశ నీదు ॥ మో ॥

8వ కీర్తన - గౌళీపంతు రాగం - రూపకతాళం

పల్లవి : మరువకవే రామనామము మనసా యిది తరమగు ॥ మ ॥

అనుపల్లవి : దరిదాపున యుండగ దయగోరి పరువు వేడగ ॥ మ ॥

1 చరణం : నీవు నేనను భ్రమలను గొని నిజ రూపంబును దెలియక

అవినీతుడవై విషయాంధ కారంబున బడక ॥ మరు ॥

2 చరణం : (చరణం పలె పాడాలి)

శ్రీ తిరుపతి పురమున స్థిరముతో నెలకొన్న

పతితపావనుడౌ మన పాలి వెంకటేశునిగ ॥

ఈ కీర్తనలలో ఆధ్యాత్మిక పరమైన భావం ఉంది. నొసట విధి రాసిన రాత ఇంద్రునికైనా, పశుపతికైనా తప్పదు. యోగీంద్రులు కూడా అనుభవించి తీరవలసినదే -

ధనం, దార, పుత్రులూ వీరెవ్వరూ నీ దరి చేర్చ సమర్థులు కారు. నన్ను నీవె ఉద్ధరించవయ్య - హస్తి వేడుకొన్న వెంటనే దయ చూపి రక్షించిన ఆ కరుణ ఇప్పుడూ నా మీద చూపవయ్యా - రామనామం మరువక, బ్రోవుమని కరుణ చూడమని ప్రార్థిస్తున్నాను - నీవు, నేను అనే భ్రమలో పడి నిజమేమిటో తెలియక అవినీతి పరుడవై విషయవాంఛలకు లోబడకుండా ఉండాలంటే రామనామ జపధ్యానం ఒక్కటే మనకు శరణ్యం అని ఈ కీర్తనలలోని భావం.

ఈ కీర్తనలు వేదాంత విషయాన్ని వివరిస్తుంటే తిరుపతి నారాయణస్వామి రాసిన రాగమాలిక శృంగార పరమైన భావాన్ని ప్రకటిస్తోంది.

మునుస్వామి నాగరి సంపాదకునిగా ప్రకటించిన సంగీత గ్రంథమైన - సంగీత సుధా సంగ్రహంలో అనేక మంది అటు తమిళదేశంలో ఇటు ఆంధ్రదేశంలో ఉన్న వాగ్గేయ కారుల కృతులు ఉన్నాయి.

ఈ రచనలు మాత్రమే కాకుండా నారాయణ స్వామి నాయుడుగారు

నిను వినా ఏగతి - శకుంతల రాగం;

నిర్గుణుడో గుణుడో - మలయ మారుతం

ఇక ఎవరితో - బలహంస రాగం,

వినరాదా? - చక్రవాకం;

బలరోసామిని - ఫరజురాగం

దయరాని బారిచే - కాఫీరాగం మొదలైన కీర్తనలు రాసారని సంగీత పారిభాషిక పోషకలో (కన్నడ నిఘంటువు) డి.వి.స్. సంపత్కుమారాచార్య పేర్కొన్నారు.[11] ఈ రచనల పూర్వాపరాలేవి లభించలేదు.

## అధస్సూచికలు

1. సభారంజని వెంకటగిరి సంస్థానాధిపతుల వంశం వారు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో కళాకారులుగా పనిచేసిన శారదా శ్రీనివాసన్ గారి ద్వారా నాకు ఇచ్చారు.

2. యాచేంద్ర భూపాలుడు, వెలుగోటి."సభారంజని", శారదాంబా విలాస ముద్రాక్షరశాల, చెన్నపురి, 1890. పుట - 31.

3. " అదే " పుట - 43

4. " అదే " పుటలు - 61, 62, 63, 64.

5. " అదే " పుట - 66.

6. పార్థసారథి, ఎస్.సి. శ్రీమతి ద్వారకా పార్థసారథి "జావళీలు" ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, హైదరాబాదు 1980. పుట - 12

7. మునుస్వామి, నాగరి, సంగీత సుధా సంగ్రహము - చెన్నపురి. కాలం తెలీదు పుట - 137.

8. పార్థసారథి, ఎస్.సి. శ్రీమతి ద్వారకా పార్థసారథి. "జావళీలు", ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, హైదరాబాదు - 1980 పుట - 153

9. " అదే " పుట - 158

10. మునుస్వామి, నాగరి. సంగీత సుధా సంగ్రహము - చెన్నపురి కాలం తెలీదు. పుట - 138

11. సంత్కుమారాచార్య, డి.వి.యస్. సంగీత పారిభాషక పోషక (కన్నడ నిఘంటువు)యూనివర్శిటీ ఆఫ్ మైసూర్ - 1985. పుట - 573, 574

# 5. సాలూరు సంస్థానం

సాలూరు రాజులు సవరలు. ఇది మొదట నేటి ఒరిస్సా రాష్ట్రంలోని జయపుర ప్రాంతంలోది. కొంతకాలం తర్వాత సర్దారుల సామంత రాజ్యాలయ్యాయి. ఆ కాలంలో రాజకీయ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉండేది. తర్వాత ఇంగ్లీషు కంపెనీ వారి చేత ఇవి జమీందారీలుగా గుర్తింపబడ్డాయి. అయినా నిస్సంతులు కావడం వల్ల దత్తతలకు సంబంధించిన వ్యవహారాలు ఇతర వ్యాజాలతో చికాకుల్తో ఉండేవి. ఈ ప్రాంతాల్లో ఉన్న సంస్థానాల వారి భాష ఒరియా. కానీ తెలుగు భాష మీద అభిమానం, సంగీత కళాభిమానం, నాటక కళ పట్ల ఆదరణ వీరికి ఉన్నాయి.

ఆంధ్ర లాక్షణికులచే గుర్తింపబడిన సాలూరు పాలకుడు బలారి సింహ నరసింహరాజు. అలాగే నాటక కళలో విప్లవాత్మకమైన మార్పులు ఈ సంస్థానాధిపతులే చేసారు. స్త్రీల పాత్రలు స్త్రీలే ధరించాలని ఈ శతాబ్దం మొదట్లోనే తెలిపాడు కిమ్మూరి లక్ష్మీనరసింహ సన్యాసిరాజు. ఈయన కళలకు ప్రోత్సాహం ఇచ్చాడు. లక్ష్మీ నరసింహ సన్యాసిరాజు ఈ సాలూరు అధిపతుల్లోపదవ తరానికి చెందినవారు. ఈయనకు సంగీత సాహిత్యాలంటే మంచి అభిరుచి ఉంది. ఈయన పట్టపురాణి కృష్ణపట్ట మహాదేవి సంగీత కళానిధి.

ఆ సంస్థానంలోని చిరుద్యోగులు సైతం కళల పట్ల ఆసక్తి ఉన్నవారే. సాలూరులో శ్రావణి ఉత్సవాల్లో కళాగోష్ఠి జరుపుతుండేవారు. ఆ ఉత్సవాల్లో పాల్గొన్నకవి, గాయక, నటులను సన్మానించి వారికి సంభావనలిచ్చేవారు.

సాలూరురాజావారు గొప్ప మార్దంగికులు కూడా. తలచుకున్నప్పుడే అంతా అయిపోవాలనే మనస్తత్వమో ఏమో! రాజావారికి బుద్ధి పుట్టినప్పుడు విద్వాంసులను పాడడానికి తన దగ్గరకి రమ్మనేవారు. వీరు పాడుతూ వాద్యగోష్ఠి జరుపుతూ రాజావారిని ఆనంద పెట్టేవారు. అప్పుడు రాజావారికిచ్చ వచ్చినట్లు వెయ్యి రూపాయలో రెండు వేల రూపాయలో ఒక్కొక్క విద్వాంసునికి ఇమ్మని ఆజ్ఞాపించేవారు. సీతారామ శాస్త్రిగారు పాడుతుంటే సాలూరు రాజావారు మృదంగం వాయించేవారుట"[1]

సాలూరు సంస్థానంలో చాలామంది కళావంతులు తమ కుటుంబాలతో ఉండేవారు. అందువల్ల నాట్య సంగీత శిక్షణకు అవకాశాలుండేవి. అదీగాక మిగతా జమీందారీ గ్రామాల కన్నా వ్యక్తిగతమైన స్వేచ్ఛ, ప్రజలలో చైతన్యం, కళాభిమానం, అమాయకత్వం ఈ సంస్థాన ప్రజలలో ఉండేవి. సాలూరులో ఆకాలంలో భక్తులు, భక్తుల మఠాలూ, కూటాలు చాలా ఉండేవి.

అప్పటి రాజావారు నాటకాలను ప్రోత్సహించడమే కాదు నాటకాలలో వేషాలు వేసేవారు. పరిపాలనా బాధ్యతలున్నా వేళాపాళా లేకుండా రాజావారు రిహార్సల్స్‌కి రమ్మనేవారు. ఒక్కొక్కప్పుడు ఇవి తెల్లవార్లూ సాగుతుండేవి. ఆ సంస్థానం సమీపంలో మరడాం అనే గ్రామంలో కళాగోష్ఠి ప్రతీ సంవత్సరం జరిపేవారు.

మరో ఆచారం ఏమిటంటే ప్రసిద్ధ గాయకులు ఎవరైనా అకస్మాత్తుగా అటుగావచ్చినా వారి సంగీత సభ ఏర్పాటు చేసి వారిని సన్మానించి పంపే ఆనవాయితీ కూడా ప్రతి సంస్థానంలోనూ ఉంది.

సాలూరు చిన్న సంస్థానమైనా కళకు పెద్దపీటే వేసింది. గొప్ప సంగీత వేత్త సంగీత దర్శకునిగా పేరు పొందిన సాలూరు రాజేశ్వరరావుసాలూరు ప్రాంతం శివరామపురం వాస్తవ్యులు. ఈయన తండ్రి సన్యాసిరాజు గారు కూడా మార్దంగికులు. ద్వారం వెంకట స్వామి నాయుడు గారి దగ్గర సహకార మృదంగం వాయించేవారు.

# ఒకటవ భాగం

# సాలూరు సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం

## పట్రాయని సీతారామశాస్త్రి (1900 - 1957)

పండు తమలపాకు వంటి శరీరం, విశాలమైన నుదురు, కాస్తవంగి కొనదేరిన నాసిక, అమాయకంగా ఆకర్షణీయంగా ఉండే నేత్రాలు, అర్భకంగా ఉండే సీతారామశాస్త్రి గారిని చినగురువుగారనే వారు. సాలూరు రాజాస్థానంలో ఆస్థాన విద్వాంసునిగా కాకపోయినా రాజావారి సాహచర్యంలో నాటకాలకు రాజావారితో బాటు ఉంటూ హార్మోనియం వాయించేవారు.

శ్రీకాకుళం జిల్లాలో ఒకసారి ఒక సభ జరిగింది. ఆ సభలో ఒకరు సీతారామశాస్త్రిగారిని ఒక పల్లవి పాడమనగా ఆయన సద్యస్ఫూర్తితో ఒక పల్లవిని కల్పించి పాడారు.

"తిన్న చిలుకా! కాయలు తిన్న చిలుకా

కాకర కాయలు తిన్నచిలుకా

మాదొడ్లో కాకర కాయలు తిన్న చిలుకా"[2] అని ఆ పల్లవి

తాళాన్ని సర్దుతూ సరైన జాగాలతో, సూక్ష్మాతి సూక్ష్మమైన, అతి సున్నితమైన మూర్ఛనాది ధ్వనులను హార్మోనియంలో పలికించే వారు శాస్త్రిగారు.

ఇది హార్మోనియం ధ్వని అని తెలియ రానంతటి సున్నితంగా వాయించే నైపుణ్యం కలవారు సీతారామశాస్త్రిగారు. బొబ్బిలి రాజావారి దర్శనం చేసి, సాలూరు రాజావారి సమక్షంలో కచేరీ చెయ్యాలని సాలూరు వచ్చిన సీతారామశాస్త్రిగారూ వారి తండ్రి గారూ సాలూరులోనే స్థిరపడిపోయారు.

ఆ రోజుల్లో సాలూరులో కళావంతుల కుటుంబాలు చాలా వుండడం చేత సంగీతం నేర్చుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండేది. బొబ్బిలికి సమీపంలో "ఆనవరం" అగ్రహారంలో భూవసతి వుండడంతో చిన గురువుగారి కుటుంబం అక్కడే స్థిరపడింది.

పెద్ద గురువుగారైన నరసింహశాస్త్రి గారి పూర్వీకులు విజయనగరం సమీపంలోని చామల పల్లి అగ్రహారం ప్రతిగ్రహీతలు.

ఒక చిన్న సైనిక విభాగానికి అధిపతిగా పట్రాయడు అన్న పేరుతో సీతారామశాస్త్రి పూర్వీకులు ఒకాయన ఉండేవారు. ఆయన పూర్వీకుల్లో ఒకరు పట్రాయని పెదనరసన్నగారు (పెద నరసన్నగారి కొడుకు నరసింహశాస్త్రిగారు) నరసింహ శాస్త్రిగారి కంటే ముందు వారికి ఆస్తిపాస్తులు కొంత ఉండేవి. నరసింహ శాస్త్రి గారి కాలానికి అవన్నీ పోయినా వాళ్ళ పేరుతో చెరువులూ, తోటలూ వున్నాయి. నరసింహశాస్త్రి తండ్రి పాపయ్యగారు కాలం చేసింతర్వాత బొబ్బిలి సమీపాగ్రహారానికి ఆ కుటుంబం వచ్చేసింది.

నరసింహ శాస్త్రిగారికి మధురాపంతుల కూర్మన్న శాస్త్రిగారి కూతురు సూరమ్మ గారితో అనుకోకుండా

వివాహం జరిగింది. సూరమ్మగారు ఆధ్యాత్మిక కీర్తనలు చక్కగా పాడేవారు. మధురాపంతుల కూర్మన్న శాస్త్రిగారి సోదరుడు పేరయ్య శాస్త్రి గారు సంగీతశాస్త్రం బాగా తెలిసినవారు.

ఆ విధంగా నరసింహ శాస్త్రి గారికి సంగీత పరిచయం కలిగింది. పేరయ్యగారి దగ్గర శిష్యులుగా చేరారు. పేరయ్యగారు గుడివాడ అగ్రహారం వారు. ఆయన ఏ మహారాజునూ ఆశ్రయించలేదు. కానీ ఒక సందర్భంలో ఆనందగజపతి మహారాజుగారి సమక్షంలో గానం చేశారని ఘనంగా సన్మానితులయ్యారని విజ్ఞులు చెప్పారు. పేరయ్య శాస్త్రిగారి దగ్గర కొంతకాలం సంగీతాభ్యాసం చేసింతర్వాత నరసింహ శాస్త్రిగారు దాక్షిణాత్య సంగీత విద్వాంసుడైన "నంజుడయ్యరు" దగ్గర కొంత సంగీతం నేర్చుకున్నారు.

నరసింహ శాస్త్రి గారికి పత్నీ వియోగం కలిగింతర్వాత కొడుకు సీతారామ శాస్త్రి గారిని తాతగారి దగ్గర వదలి దేశాటనం మొదలు పెట్టారు. ఎన్నో జమీందారీలు తిరిగి సన్మానాలు పొంది, చివరికి బరంపురం చేరుకొని అక్కడ త్రిపాసూరి ముఖ్యప్రాణరావు గారింట్లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వారి అతిథిగా ఉంటూ గ్రామంలో సంగీత పాఠాలు చెప్పుకునేవారు.

పెద్ద గురువుగారు సంగీత పాఠాలు చెప్పేటప్పుడు సీతారామ శాస్త్రిగారు కూడా. ఆ విద్యార్థులతో కలిసి సంగీతం నేర్చుకుంటూండేవారు. అంతేగాని ప్రత్యేకించి నేర్పించిందేమీ లేదు. అలా సంవత్సర కాలం కీర్తనల వరకు గ్రంథం పూర్తి చేసుకున్నారు సీతారామ శాస్త్రిగారు. ఆయనకు బరంపురంలోనే పేరు ప్రఖ్యాతులు లభించాయి.

బరంపురం ఓ గొప్ప విద్యా కేంద్రంగా ఉండేదప్పుడు. సంగీతాది కళలను అందరూ నేర్చుకున్నవారే. ఆ వాతావరణంలో చినగురువుగారికి పదారు సంవత్సరాల ప్రాయంలోనే సంగీత రచనలు చేయడం పద్యాలు రాయడం అలవడ్డాయి. బరంపురంలో మంగళవారప్పేటలో ఉన్న విద్యార్థి సంఘం వారు ఓ దేవాలయంలో ఏర్పాటుచేసిన మొదటి కచేరీలో సీతారామశాస్త్రి గారికి స్వర్ణ పతకాన్ని బహుకరించారు. పీల్కానా శివరావు పంతులుగారన్న రసికులాహ్వానం మీద శ్రీకాకుళంలో సీతారామశాస్త్రి గారు కొన్నాళ్ళున్నారు.

పెద్ద గురువుగారి మరణానంతరం చినగురువుగారు సాలూరు తిరిగి వచ్చారు. తండ్రి మరణంతో సీతారామ శాస్త్రిగారిలో ఒక విధమైన సంప్రదాయాభిమానం కలిగింది. సాలూరులో 1932లో సంగీత పాఠశాల నిర్మాణ కార్యక్రమం ఆరంభమైంది. శ్రీ రంగారావు పంతులు గారు పాఠశాల నిర్మాణానికి ఆద్యులు. పాఠశాల 1936 నాటికి పూర్తయింది. అది పూర్తయిన కొన్ని రోజులకే 1936లో సీతారామశాస్త్రి గారు విజయనగరం మహారాజావారి సంగీత కళాశాలలో గాత్ర పండిత పదవిలో నియమితులయ్యారు. సీతారామశాస్త్రిగారు సంగీత పాఠశాల అభివృద్ధి విషయంలో ఎన్నో స్వప్నాలను దర్శించారు. సంగీత విద్యాభ్యాసకులకు భోజన వసతులను కల్పించాలని, సంగీత శిక్షణ ఇవ్వడానికి పలువురు పండితులను ఏర్పాటు చేయ్యాలనీ భక్తి, జ్ఞాన, వైరాగ్యాల ఆదర్శంలో సంగీత విద్యా ప్రచారంచెయ్యాలనీ ఇలా ఎన్నెన్నో ఆదర్శాలుండేవి. మహారాజా సంగీత పాఠశాలలో గాత్ర పండిత పదవి వీటిని తుడిచి పెట్టేసింది.

కొంతకాలం సాలూరు, మరి కొంత కాలం విజయ నగర సంస్థానాలలో రాజాదరణ పొందిన విద్వాంసులు సీతారామశాస్త్రిగారు. సాలూరు సంస్థానానికే మణి దీపంలా వెలిగి సంగీతానికే వన్నె తెచ్చిన వాగ్గేయ కారుడు, విద్వాంసుడూ పట్రాయుని సీతారామశాస్త్రిగారు. సాలూరులో చిన గురువుగారిగా పేరొందిన సీతారామశాస్త్రి తాను రాసిన ప్రతి రచనా స్వయంగా సభలలో ప్రదర్శించేవారు. "పద్యాలు కూడా రాశారు. సంగీత రచనలు చేశారు.[3] పద్యాలలో సంగీత సంబంధమైన అంశాలు ప్రస్తావించారు. అందువల్ల ఆయన రాసిన రచనలన్నీ ఇందులో చేర్చాను.

పుట్రాయని సీతారామ శాస్త్రిగారు "రాగమందు" "కోకిలాలాపంబు" "అనుకూలవతి" అనే శీర్షికలతో పద్యాలను రాశారు. "రాగమందు"లో సరస్వతీ దేవిని స్తుతించడం వస్తువు - రాగంలో అనురాగం ఒలికించడమే ఆమె మందహాసమనీ గడియారానికే గతులు చూపే లయతాళ గతుల్లా నీ మందగమనం అనీ పూలమాలికల్లా కూర్చు స్వర కల్పనలు ఆమె మధురమైన భాషలనీ ఈ విధంగా నవరస సముద్భవం చేయడమే నీ కటాక్షమని ప్రార్థిస్తూ, భావరాగ తాళాలతో శ్రుతిపక్వంగా పాడి నిన్ను ఆనందపరచని గాయకుడు గాయకుడే కాడు. అలాంటి నిన్ను శరణు వేడుకొంటున్నాను తల్లీ! అంటారు.

"సరస సంగీత ప్రసార మొల్కుచు వీణ
మృదుపాణి తలమున గదిసి మెరయు
పరభృతధ్వని కంఠమొనసి తంత్రీస్వనం
బున లీనమై ప్రతిధ్వనులు నింప
ముంజేతి కంకణంబులు తాళగతి తోడ
కలిసి ముక్తాయి తెలుప
సకల చరాచరాత్మక ప్రమోదాల వా -
లంబులై నాట్య క్రమంబు లొనర"

నాద రూపిణి, నాదాత్మ, నాదవంద్య, నాదభాసిని అయిన సరస్వతిని స్తుతిస్తున్నాను అని విన్నవించుకుంటాడు ఈ వాగ్గేయ కారుడు.

కోకిలాలాపంబులో

కాకీ! కోయిలా ఆకారం, రంగుల్లోఒకేలావున్నా వాటి కూతలను బట్టి ఏ విధంగా తేడా తెలుస్తుందో అదే విధంగా సద్విద్వాంసునికీ పామరునికీ మధ్య తేడా తెలుస్తుందంటారు. సరసతలేని కీర్తనలు సున్నాద ధ్వని లేక గొంతెత్తి ఎంత గట్టిగా పాడినా ఏమిటి ప్రయోజనం! హరహర! పాపనాశ! భవహరి శివామహదేవా అని మనసారా బ్రోవుమని ప్రార్థించి తరించమంటాడు -

దోమ ఏదో రొద చేస్తూ నాదే గొప్ప కోకిలధ్వని అనుకొన్నట్లుగా గీ.... మంటూ రొదచేస్తే అదే సంగీతమై పోతుందా?

ఎక్కడ కోకిల ఎక్కడ దోమ! అలాగే సంప్రదాయ బద్ధంగా సుస్వరంతో శ్రుతితో లయతో తనువెల్ల పులకింపజేసే సంగీతమే సంగీతం మిగిలిన ఎన్ని అరుపులైనా అవి అరుపులే అవుతాయని మశకం, కోయిలలను ఉపమానంగా పేర్కొన్నారు.

"హరి భజన ఎంత గొప్పదో ఒక పద్యంలో వివరించారు"4

భారతదేశాన్ని పరిపాలించడం కన్నా, గాంధీ మహాత్ముని ధీగరిమకన్నా, గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం కన్నా  కాళిదాస కావ్యాలకన్నా, తిరుపతి కవుల వాఙ్మాధురి కన్నా పల్లె పడుచు పాడే జావళులకన్నా, మధురమైన అందమైన గోహర్జన్ గొంతుకన్న త్యాగరాజస్వామి కీర్తనల కన్నా కామమోహంలో ప్రియురాలి పెదవికన్న, పడతి అందించే కర్పూర విడెంకన్నా, పువ్వు తేనె కన్న మనసుకు హాయిని కూర్చేది ఒక హరిభజనే నోయి అంటాడు.

ప్రియురాలిని తృప్తి పరిచే సుఖాలకన్నా షడ్రుచులు కలిగిన భోజనం కన్నా అందమైన సొగసును

అద్దంలో చూడటం కన్నా అభ్యంగన స్నానం చేయడం కన్నా, సకల శాస్త్రాలను చదవడం కన్నా అన్నిటికంటే చివరికి తండ్రి పాదసేవకంటే హరిభజన మనసుకు హాయి హాయి అంటారు.

ఇక "అనుకూలవతి" అనే శీర్షికతో ఇచ్చిన పద్యాలలో అనుభూతి లేనిదే పద్యంగాని, పదంగాని, కృతిగాని, కవితగాని రాదు. అలాంటి సందర్భాల్లో రాసిన పద్యాలు అనిపిస్తాయి. సీతారామశాస్త్రిగారు ఒకప్పుడు ఈతి బాధలకు గురై ఎంతో మనోవేదన పడినట్లు ఈ పద్యాలు భావాన్నిస్తాయి.

అనుకూలవతి కాని అతివతోటి కొన్నాళ్ళు కోరికతో పరసతులు కొన్నాళ్ళు, ధనం తీసుకురాలేని విద్యలవల్ల కొన్నాళ్ళు, ఉన్నది తినలేక కొన్నాళ్ళు, దేశబంధులను విడిచి కొన్నాళ్ళు, ఉన్న వారల వల్ల కొన్నాళ్ల బాధ, తన సాటివారి పంచనచేరి కొన్నాళ్లు, ఇలా ఎన్నాళ్ళు గడపావో యౌవనమంతా వృధా చేశావు. ఏమి అనుభవించావో చెప్పవయ్యా! అంటాడు.

అలాగే విద్వాంసులను అందునా ఆంధ్ర ప్రాంతపు విద్వాంసులను పొరుగు ఇంటి పుల్లకూర రుచన్న సామెత లాగా ఉండవద్దని హెచ్చరిక ఒక పద్యంలో చేస్తాడు.

"స్టేజి సంగీతమే శ్రేష్ఠమంచును నెంచి
పరవశత్వముఁ జెందు సరసులార!
అరవనొక్కులే శాస్త్రమంచు నెంచుచు దాని
భావమే యెరుగని ప్రాజ్ఞలార!
మహారాష్ట్ర గానంపు మహిమా చూపెదనంచు
గళము గిర్గిరత్రిప్పు ఘటికులార!
మూలనుండిన వీణ ముందరకున్ లాగి
తంత్రులంత్రెంపు విద్వాంసులార!
కాలగతి చేత ప్రస్తుత కాలమందు
ఆంధ్ర సంగీత మిన్ని విధంబులాయె (ఇంతయు ధ్వానమాయె)
గానశాస్త్రజ్ఞలార సుజ్ఞానులార!
గాన శాస్త్రజ్ఞలార! అజ్ఞానులార"[5]

అనేక రకాలైన బాణీలు చేరి ఆంధ్రదేశంలో ఆంధ్ర సంగీతం అధ్వాన్న స్థితికి వచ్చిందని దానికి కారణం గాన శాస్త్రజ్ఞులే అని స్పష్టపరిచాడు.

భాషతో నిమిత్తం లేదనే భ్రాంతితో అరవలు "శ్రీరఘుకుల 'మందుబుద్ధి నీవు', అనో, "ఎందరోమగాను బావులు" అనో తమ బాణీలో అర్థాన్ని మట్టి గరిపించేటట్లు పాడటం అప్పటి నుండే మొదలైందని అనిపిస్తోంది. భావాన్నెఱిగి పాడాలని గ్రంథాన్ని పూర్తిగా పాఠం చేసి పాడాలని శాస్త్రిగారి అభిప్రాయం.

ఇంతమందిని సంగీత విద్వాంసులను విమర్శించిన సీతారామ శాస్త్రిగారు తాను శారదాంబని ఏ విధంగా స్తుతించేది గానం చేసే పద్ధతిని వినయంగా చెప్పుకున్నారు ఒక పద్యంలో

"మంజుల గాత్ర మాధురిసమంజసమై శ్రుతియందులీనమై
రంజిల, తాళజాతులు - తిరంబగు మార్గమునన్ జెలంగ, ర
క్తిం జెలవార నెమ్మనము: కీర్తనలన్ స్వర రాగ భావయు
క్తిం జెలుకంగఁ బాడెద మతింపుచు నిన్ను మదంబ! శారదా!"[6]

మనోహరమైన గాత్రంతో శ్రుతి పేయంగా తాళం స్థిరమైన విధంగా స్వర రాగ భావయుక్తిగా కీర్తనలను నిన్ను నుతిస్తూ పాడుతాను తల్లీ శారదా! అని దీని భావం. ఎవరు పాటపాడినా స్వరం, శ్రుతి, లయ, భావం అన్నీ స్పష్టంగా ఉండాలి అని సీతారామశాస్త్రి ఒక హెచ్చరికగా రాశారు.

ఇక సంగీతరాగాలలో సుకుమారమైన మీగడ తరక లాంటి రాగం బేగడరాగమని ఒక పద్యంలో చెప్పారు.

"ఎన్ననగు రాగజాతము లెన్నోరాగ

మండలమ్మున నుండిన నుండవచ్చు

గాక, రుచిమీరి జిగిమించుకళల నించు

బేగడా రాగమన పాలమీగడ కద!"7

జిగేలు మనే కళలతో రుచిలో పాల మీగడా అనిపించేది అని బేగడ రాగాన్ని సంస్తుతించారు. అంతే కాదు శాస్త్రిగారు బేగడ రాగంలో వర్ణ రచన కూడా చేశారు.

ఈ పద్య కుసుమాలలో కొన్ని పద్యాలు సభలలో చదివినవి. సంగీతం ఒక వైపు సాహిత్యం మరోవైపు ఆపాతం ఆస్వాదించిన గొప్ప వాగ్గేయ కారుడు సీతారామ శాస్త్రిగారు. పద్య ప్రసూనాలేకాదు, గేయరచనలు కూడా చేశారు. సంగీతరచనలుగా స్వరజతి, తానవర్ణం, వర్ణం, కీర్తనలు, కృతులు కూడా రాసారు.

రచనలన్నీ స్వరపరిచి ఉన్నాయి. సీతారామశాస్త్రిగారు సాలూరు సంస్థానం నుండి విజయనగరంలో శ్రీ విజయరామ గాన పాఠశాలలో గాత్రాచార్యులుగా (వోకల్ ప్రొఫెసర్‌గా) వచ్చినపుడు ఇందులోని కొన్ని రచనలు "సంగీత సాహిత్య సమ్మేళనం" పేరుతో స్వరపరిచారు. పత్రాయని సీతారామశాస్త్రిగారు ప్రతీ రచనకూ ముందుగానే ఆ రచనకు సంబంధించి పూర్వీకులు రాసినవి లేదా రాసిన వాగ్గేయకారులను స్మరిస్తూ ఉపోద్ఘాతంలో ఆ రచనకుండే ప్రాధాన్యతను వివరించారు. రాగ లక్షణం, మూర్ఛన, రచనకు నిర్దేశించిన తాళం దాని అంగాలు కీర్తన లేదా ఏదైనా రచన నడిచే నడక, రాగం ఏ సమయంలో పాడతగినది ఇలాంటి శాస్త్రీయమైన లక్షణాలను ఉపోద్ఘాతంలో స్పష్టంగా రాశారు. శాస్త్రిగారు తాను రాసేరచనలు జంత్రగాత్రజ్ఞులకూ ప్రాజ్ఞులకు ఉపయోగపడతాయన్న ఆశని వ్యక్తం చేశారు.

స్వరజతి

స్వరజతులలో శ్యామశాస్త్రి రచనలు శ్రేష్ఠమని చెప్తారు - అవి రాగ సంచారంతో బాటూ క్లిష్టమైన యమకాలతో భక్తిరసంతో ఉన్న రచనలు, చాలా మంది స్వరజతులు రాశారు. వాటిలో కొన్ని స్వరజతులు శృంగార రస ప్రధానంగా ఉన్నాయి. సీతారామశాస్త్రిగారు రాసిన స్వరజతి అమ్మవారిని స్తుతిస్తూరాసినది. లలిత రాగంలో రాశారు. పల్లవి, అనుపల్లవి, చరణం అంగాలున్న ఈ స్వరజతిలోని భాష సంస్కృతం.

లలిత రాగ లక్షణ, రస భావాలను తెలిపే సాహిత్యం ఇది. ఈ లలిత రాగం ఏ సమయంలో పాడతగినదో పూర్వీకులు చెప్పి శ్లోకాన్ని ఉదహరించారు శాస్త్రిగారు.

"నారాయణీ చ హిందోళీ సౌరాష్ట్రతోడిరామళీ

గౌరీ వరాళికా పంతు ఉశేని మాళవస్తథాసాయం

కాలే ప్రవర్తంతే లలితాచ తధైవ చః"8

అనడం వల్ల మూడు ఘంటలు మొదలు 6 ఘంటల వరకూ లలిత రాగం పాడదగినది. ఇటీవల ఈ

రాగంలో శుద్ధ దైవతాన్ని కూడా చేరుస్తున్నారు. ఇందులో ఉండే స్వరాలు : షడ్జం, శుద్ధరిషభం, అంతరగాంధారం, శుద్ధ మధ్యమం, చతుశ్రుతి దైవతం, కాకలి నిషాదం.

ఆరోహణ : సరిగమదనిస        అవరోహణ : సనిదమగరిస

లలిత రాగం 17వ మేళ కర్త సూర్య కాంత రాగ జన్యం - షాడవ రాగం, ఉపాంగరాగం.

ఇవే లక్షణాలను స్వరజతిలో పేర్కొన్నారు శాస్త్రిగారు. లక్షణ గీతాలలో వలె రాగ లక్షణం ఇందులో స్పష్టపరిచారు. ఇలాంటి సాహిత్యమున్న స్వరజతులు అరుదుగా ఉంటాయి.

పల్లవి : లలితే! సరసగాన కళాశ్రితే! సలలిత స్వరాంచితే!
పంచమస్వర రహితే! సుచరితే! భక్తగాయకాళి కంఠసహితే!
సూర్య కాంత నామ రాగజనితే! సుందర షాడవ శ్రుతి ప్రకాశికే
అనుపల్లవి : మృదుల శృంగార రూప సహితే! సదనులానంద భావపూరితే
సకల కళ్యాణ భాసురాయితే! సరసభావరాగ ప్రసాదితే॥
చరణం : మంజుల పుష్ప విరాజిత కేశే! మంజీరారవ రంజిత పాదే।
మణిమయ సువర్ణ భూషిత దేహే! మామక మానసికాధివాసే॥"9

పల్లవిలోనే లలితరాగం పేరుకు తగినట్లుగానే లలిత స్వరాలతో ఉంటుంది. పంచమస్వరం ఈ రాగంలో ఉండదు. సూర్యకాంత రాగం నుండి జనించింది పట్రాయని వారు ఈస్వర జతి సాహిత్యాన్ని స్వరపరచి ముద్రించారు.

పట్రాయని సీతారామశాస్త్రి గారి మరొక రచన వర్ణం - కళ్యాణి రాగం - ఆదితాళంలోనిబద్ధం చేశారు.

ఈ వర్ణ సాంప్రదాయం - వీణ కుప్పయ్యర్మొదలైన విద్వాంసుల చేత ప్రసిద్ధం చేయబడిందని శాస్త్రిగారు రాసుకున్నారు. అలాంటిసంప్రదాయాన్ననుసరిస్తూనే మరికొన్ని నియమాలను ఏర్పరుస్తూ ఈ కళ్యాణి వర్ణాన్ని నిబద్ధించారు. ఆ లక్షణాలు - షడ్జపంచమాలు ఉపయోగించి చరణం రాశారు. "షడ్జపంచమాలనువిడిచి త్రిస్థాయుల్లో రాగ సంచారం చూపించారు. ఆవృత్తి అంతాల్లో ఖండ మొదలైన జాతి మోరా అమర్చారు" సంపూర్ణ రాగం కళ్యాణి. ఈ వర్ణం చరణంలో రాగం పేరు చెప్పారు. 65వ మేళ కర్త రాగం. కళ్యాణి రాగం ఇది 12 గంటల నుండి 3 గంటలదాకా పాడవచ్చు.

వర్ణం గతి (నడక) క్రియకు 4 అక్షరాల చొప్పున ఉంటుంది.

పల్లవి : నెఱజాణ వని సామి నెఱనమ్మినది నీకై
అనుపల్లవి : మరుని బారి కోర్వలేక సరసిజేక్షణ నిను రమ్మనె వేణుగోపాల!
చరణము : నిండు జవ్వని సుమా కళ్యాణి!

"చరణంలో షడ్జ పంచమాలు చేర్చి రాగాన్ని సంపూర్ణం చేసినట్లు శాస్త్రిగారు ముందుగా చెప్పుకున్నారు.[10]

బేగడ రాగంలో తాన వర్ణాన్నిరాశారు. ఇదిచతురశ్ర జాతి రూపక తాళంలో ఉంది. ధీర శంకరాభరణ జన్యమైన రాగం ఈ బేగడ. భాషాంగ రాగం, ఈ రాగం సాయంత్రం 6 మొదలు 9 గంటల వరకూ పాడవచ్చు. వక్ర సంపూర్ణ రాగం.

ఇంకొక విశేషం తాన వర్ణాలు చతురస్ర జాతి త్రిపుట, మిశ్రజాతి జంపెతాళం, ఖండజాతి అటతాళాల్లో పూర్వీకులు రాసిన తానవర్ణాలున్నాయి. చతురశ్రజాతి రూపకతాళంలోకూర్చిన వర్ణం అరుదు కాబట్టి చతురశ్రజాతి రూపక తాళాన్ని ఉపయోగించి ఈ వర్ణం రాశారు.

పల్లవి : నిన్నే కోరి యున్నదిరా చిన్నారి చిలుక

అనుపల్లవి : కన్నెడ సేయక గోపాల

చరణం : సరసకురా చలమేల తాళ జాలదుర''

క్రియకు 4 అక్షరాలచొప్పున దీని నడక ఉంటుంది.

ఈ రచనలు రెండింటిలోనూ వస్తువు - కోరి వేణుగోపాలుని సరసకు రమ్మని పిలవడం. శృంగార రసాత్మకాలు ఈ రచనలు.

పట్రాయుని సీతారామ శాస్త్రిగారు రాసిన కృతులలోని మరో రచన 'స్మృతి రంజని రాగం'లోని కృతి.

ఇది ఖరహరప్రియ రాగ జన్యం. ఔడవ సంపూర్ణరాగం సగమపనిస - సనిదపమగరిస

పల్లవి : ఇహపర సాధనమే ఓ మనసా!

అనుపల్లవి : విహిత కర్మబంధమున చరించుట వేదస్వరూపుని గని మదినెంచుటయు''

చరణం : రక్తిరాగ సాగరము చరించియు భక్తియోగ మానవు దరి చేరుట

శక్తి హీన మానవుదయ జూచి - స యుక్తి సాధనుని యొద్ద జేరుటయు

ఈ కీర్తనపట్రాయుని నారాయణ మూర్తిగారు (రచయిత కుమారుడు) పాడి వినిపించారు. ఈ రాగం నూతన సృష్టి. రక్తిరాగ, భక్తియోగ, శక్తిహీన, యుక్తి సాధన, చరణంలోని ఈ పదాలు కీర్తనకే అలంకార ప్రాయాలు - భావ గాంభీర్యం గల రచన ఇది. ఆధ్యాత్మిక భావాన్ని హృదయంగమంగా ప్రకటించిన రచన.

"పాట- మాటకాదు, మాటయు పాటగా

దవని నెవనియందు నరసి చూడ

పాట - మాటయగును మాటయె పాటయౌ

రసికుడయిన పాటరాయునందు''- పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రి.

మాట పాటగా, పాట మాటగా చేయగల సామర్థ్యం ఆనాటి కాలంలో సాలూరు చినగురువుగా ప్రసిద్ధి పొందిన పట్రాయుని సీతారామ శాస్త్రిగారికే ఉంది.

పరమ భాగవత భక్తులు, వాగ్గేయ కారులు, జయదేవ, నారాయణ తీర్థ, దీక్షిత, త్యాగరాజాదులు అనేక రచనలు చేసి అన్ని విధాలుగా గానకళ అభివృద్ధికి తోడ్పడ్డారు. భక్తి, భాష, రసం, భావం, సంగీతం మొదలైన వాటి మర్మం, విలువలు తెలిసిన విద్వజ్ఞులు కావడం చేత సమర్థవంతమైన రచనలు చేసి సంగీత లోకానికి అందించారు. అలాంటి వాగ్గేయకారుల రచనలు అభ్యసించి వాటిని పదుగురికీ చెప్పి, వాటి మర్మాలను సంగీత శాస్త్ర రీతులను గ్రహించిన వారు సంగీత సాహిత్య వేత్త పట్రాయుని సీతారామ శాస్త్రిగారు త్యాగరాజాది వాగ్గేయకారుల సంప్రదాయాన్ననుసరించి కాలక్రమంలో గాంధర్వ శాస్త్ర సమ్మతమైన పద్ధతిలో కొన్ని కీర్తనలు కృతులు రచించారు. త్యాగరాజాదుల బాణీలో రాసిన ఈ రచనలు భక్తిజ్ఞాన వైరాగ్యాలతో కూడి, ఆకర్షణీయమైన శైలిలో ఉంటాయి. ఇందులో దోషాలేమైనా ఉంటే విమర్శించి ప్రోత్సహించమని ముందే

మనవి చేసుకున్నారు. సీతారామశాస్త్రిగారు రాసిన స్వరజతి, వర్ణాలు, కృతులు, కీర్తనలు 1937సెప్టెంబరు నెలలో ఆరంభించిన "వేదిక రీసర్చ్" అనే ఆంగ్లాంధ్ర మాసపత్రికలో 1938 లో ఫిబ్రవరి నుండి మొత్తం సంచికలలో ప్రచురించారు. 'సంగీత సాహిత్య సమ్మేళనం' అనే శీర్షికలో సంగీత లక్ష్య లక్షణ విశేషాలతో ఈ రచనలు వెలువడ్డాయి. స్వరపరచి ప్రచురించిన ఈ రచనలు ప్రాచీన వాగ్గేయకారుల రచనలకు ఏ విషయంలోనూ తీసిపోని విధంగా ఉన్నాయి. సీతారామశాస్త్రిగారు ఈ రచనలను, స్వయంగా సభలలో పాడి జనావళికి తన్మయత్వాన్ని కలిగించేవారు. ఇంతటి మహోన్నత వ్యక్తి సంగీత వాఙ్మయ సృష్టి చేసి సాలూరు, విజయనగర సంస్థానాలకు ఉమ్మడిగా పేరు తెచ్చారు. సీతారామశాస్త్రి గారు విజయనగరంలోని సంగీత కళాశాలకు రాక మునుపు సాలూరులో నిర్వహించాలనుకున్న సంగీత పాఠశాల శ్రీ శారదా గాన పాఠశాలగా రూపొంది ఎంతో మంది విద్వాంసులను తయారు చేస్తోంది.

## అధస్సూచికలు

1. చూడు అనుబంధం -
2. పట్రాయనిసీతారామశాస్త్రి స్మారక సంచిక శ్రీ సీతారామ త్యాగరాజ నారాయణదాస మహోత్సవ కమిటీ, సాలూరు, 1972. పుట - 2
3. ఈ రచనలు ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రంలో అసిస్టెంట్‌డైరక్టర్‌గా పనిచేస్తున్న డా. పి. యస్. గోపాలకృష్ణగారు ఇచ్చారు. కొన్ని రచనలు పట్రాయని నారాయణమూర్తి (సీతారామశాస్త్రి కుమారుడు) ఇచ్చారు.
4. శ్రీ సీతారామ త్యాగరాజ నారాయణ దాసమహోత్సవ కమిటి - పట్రాయని సీతారామశాస్త్రి స్మారక సంచిక, సాలూరు - 1972, పుట - 3
5. " అదే " పుటలు - 4, 5
6. " అదే " పుట - 5
7. " అదే " పుట - 5
8. సత్యనారాయణరావు, ఆకెళ్ళ (సం) వేదిక్‌రీసర్చ్, ఆంగ్లాంధ్ర పత్రిక, శ్రీవేద విద్యాపరిషత్తు, విజయనగరం, 1938. పుట - 17.
9. " అదే " పుట - 17
10. " అదే " పుట - 7

# 6. శ్రీకాళహస్తి సంస్థానం

## చారిత్రక నేపథ్యం

శ్రీకాళహస్తి సంస్థాన పాలకులు ఇనగాల గోత్రికులు, వెలమదొరలు, దామెర్ల వంశస్థులు. వీరి వంశ మూలపురుషుడు మాదానాయుడు "విజయనగర పాలకులుప్రబలులైన తర్వాత దామెర్ల ప్రభువులు విజయనగర సామంతులలో ముఖ్యులయ్యారు. ఆ తర్వాత కాళహస్తి, వందవాసి పరగణాలను పొంది కాళహస్తి సంస్థాన స్థిర పాలకులై విఖ్యాతి పొందారు"[1] కృష్ణ దేవరాయల కాలంలో వీరి పూర్వీకులు విజయనగర చక్రవర్తికి మేని కావలివారుగా ఉండేవారనీ వారిసేవల ఫలితంగా పారితోషికంగా కాళహస్తి ప్రాంతం లభ్యమైందని చరిత్ర.[2]

ఇక కాళహస్తి సంస్థానం దామెర్ల వెంగ భూపాలుని వంశంలో పదవ తరం నుండి ఆరంభమైంది. పదవతరం పాలకుడు శ్రీపాద నాయుడు. 'నాయణి' వారనేది కాళహస్తి సంస్థానాధీశుల గౌరవనామం.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం కాళహస్తి సంస్థానాన్ని నాలుగు చెరగులా వ్యాపింపజేశారు దామెర వంశీయులు. దక్షిణాన కాంచీపురం తూర్పున చెన్నపట్నం దాకా వ్యాపించింది ఈ సంస్థానం. కాళహస్తి పాలకుల్లోదామెర్ల వెంకట నాయుడుఅనే ఆయన నుండి ఒక ఆంగ్లేయాధికారి 'చెన్నకుప్ప' అనే ప్రాంతాన్ని కౌలుకు తీసుకున్నాడు. కాళహస్తి పాలకులు దాన్ని దానంగా ఆమోదించారు.

దామెర్ల వంశంలో తిమ్మానాయనింగారు ప్రసిద్ధులు. వీరి కుమారులు వెంకటప్ప నాయుడు (1745-1795) వారికుమారులు తిమ్మానాయుడు, తిమ్మానాయని కుమారుడు పెదవెంకటప్ప, పెద వెంకటప్ప నాయని కుమారులు ముద్దువెంకటప్ప తిమ్మానాయుడు, చెన్నప్ప, రామానాయుడు, శేషాచలపతి, చిన్న వెంకటప్ప నాయనింగారలు కాళహస్తిసంస్థానాన్ని ఏలారు. వీరిలో కాళహస్తిని పరిపాలించిన చివరి పాలకులు వెంకట లింగమనాయుడు.

వీరు వెంకట గిరి సంస్థానం వారితో వియ్యమందారు. వెంగళభూపతి సవతి అన్న చెన్న భూపతి భార్య వెలుగోటి బంగారు యాచమ నాయని సోదరీ వెలుగోటి కస్తూరి రంగానాయకుని కుమార్తె తిమ్మాంబ.

ఒకప్పుడు రాజ్యాలను పాలనా ప్రాంతాలను విస్తరింప చేసే కోరికతో కార్వేటి, కాళహస్తి సంస్థానాధిపతులు తమచుట్టూ ఉన్న సీమల మీద దండయాత్ర చేసి వారినోడించి ఆ ప్రాంతాలను తమ పాలనా భాగంలో కలుపుకుంటూ ఉండేవారు. ఆ తర్వాత ఇరువురు పాలకులూ కలహించుకోడం మొదలు పెట్టారు. అదే సమయానికి గవర్నర్ లార్డ్‌క్లైవ్ బ్రిటీష్ కలెక్టర్లను నిరంకుశాధికారులుగా ప్రకటించాడు. దానివల్ల కాళహస్తి, కార్వేటి, వెంకటగిరి పాలకులు తమ తమ సర్వ స్వతంత్ర పత్తిపత్తిని కోల్పోయారు. 1801లో కాళహస్తి కుంఫిణీ వారి స్వాధీనమైంది. ఆ తర్వాత 1802లో మళ్ళీ చెన్నపట్టణం గవర్నర్ చేసిన ప్రకటన వల్ల స్వతంత్ర రాజులుగానున్న వీరు ఆయుధాలను, సేనలను అన్నీ గవర్నర్ స్వాధీనం చెయ్యాల్సి వచ్చింది. కానీ గౌరవ సూచకంగా జమీందారులు ఆయుధాలను ఉంచుకోడానికి వీలు ఉండేది.

ఆంగ్లేయులతో స్నేహంగా ఉంటూ కాళహస్తి జమీందారులు సైనికదళాలను రద్దు చేసినప్పటికీ ఆయుధాల్ని తమ వద్ద ఉంచుకోడానికి అనుమతి పొందారు. 1875లో కాళహస్తి జమీందారైన కుమార వెంకటప్ప నాయనికి ఆంగ్లేయుల నుండి 'రాజా' బిరుదం, 1876లో సి.ఎస్.ఐ. గౌరవం లభించాయి. ఇన్ని గొడవలున్నా కవి పండిత, విద్వాంసులను పోషించి శ్రీ కాళహస్తి సంస్థాన పాలకులు తమ కళాభిమానాన్ని నిరూపించుకున్నారు.

దామెర్ల వెంకటపతి నాయుడు విద్వజ్జన పోషకుడుగా పేరొందాడు. వెంకటప్ప నాయని కాలంలో ముని పల్లెసుబ్రహ్మణ్య కవి, దామెర్ల చిన వెంకటప్పనాయని కాలంలో తిరుపతి విద్యల నారాయణస్వామినాయుడు, కుమార వెంకటప్ప నాయనింగారి కాలంలో కాళహస్తి వీరన్న ఆస్థాన విద్వాంసులుగా ఉన్నారు.

ఈ ముగ్గురూ సంగీత విద్వాంసులే కాక వాగ్గేయ కారులుకూడా. తిరుపతి విద్యల నారాయణస్వామి నాయుడు వెంకటగిరి సంస్థానంలో కూడా ఆస్థాన విద్వాంసుడుగా ఉన్నాడు. కాబట్టి ఈతని గురించి వెంకట గిరి సంస్థానంలో చేర్చడమైంది.

# మొదటి భాగం
# శ్రీకాళహస్తి సంస్థానం
# వాగ్గేయకారులు - వాఙ్మయం

## 13.1 మునిపల్లె సుబ్రహ్మణ్యకవి (1730 - 1780)

కాళహస్తి సంస్థానంలో ఆస్థాన విద్వాంసుడై వెలుగొందిన అధ్యాత్మ రామాయణ కీర్తనల కర్త మునిపల్లె సుబ్రహ్మణ్య కవి స్వగ్రామం గుంటూరు జిల్లాలోని పెదముత్తేవి."[3]

"గ్రంథం చిట్ట చివర మంగళంలో చివరి చరణంలో
శ్రీకాళహస్తి నగరీ శంభుమిత్రునికి
సౌకర్యశీలికి జయమంగళం సు
శ్రీకకుల్ స్థాన్వయ సింహాసన స్థునికి వి
వేక కార్య శేషగిరి వెంకట సుబ్రహ్మణ్యునికి
మంగళం శుభ మంగళం..."[4]

దీన్ని బట్టి తిరుమల వేంకటేశ్వర స్వామి యందే కాక, కాళహస్తిలో వెలసిన ఈశ్వరుని యందుకూడా భక్తి కలవాడనీ, ఇతడు తిరుపతిలో కానీ కాళహస్తిలో గానీ ఆ చుట్టు పట్ల గానీ ఉండి ఉండవచ్చు అని తెలుస్తోంది.

వీరి ప్రధాన శిష్యులు గుంటూరు వారవడం వల్ల కవి స్వగ్రామం గుంటూరని నారుమంచి సుబ్బారావుగారు పేర్కొన్నారు. ఈ కవి ములకనాటి బ్రాహ్మణులు. ఇంటి పేరు శేషగిరివారు- తాత సుబ్బన్న తల్లి కమలమ్మ తండ్రి రామలింగయ్యవరపు వెంకన్న. సుబ్రహ్మణ్య కవికి వరదన్న, వెంకన్న అని ఇద్దరు సోదరులు. తండ్రి రామలింగన్న సంగీత విద్వాంసుడు. 17వ శతాబ్దంలో ఆంధ్ర ప్రాంతపు రాజకీయ, సామాజిక పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉండడం వల్ల, సంగీత కళాదరణ కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైనందు వల్ల, జీవనం దుర్భరమై రామలింగన్న స్వగ్రామం వదలి తంజావూరుకు కుటుంబ సమేతంగా వెళ్ళిపోయాడు.

అక్కడ కొంతకాలం ఆనందంగా గడచింది. ఆ తర్వాత కొంత కాలానికి తంజావూరు వదిలిమునిపల్లెకు చేరుకుని రామలింగన్న అక్కడ జీవనం సాగించారు. ఆయన గతించిన కొద్ది రోజులకు సుబ్రహ్మణ్య కవికి కష్టాల కడలిని ఈదడం దుర్భరమైంది. కుష్ఠవ్యాధిగ్రస్తుడై విషాద జీవితాన్ని అనుభవించలేక వ్యాధి నివారణార్థం తిరుపతి వేంకటేశ్వర స్వామిని ఆశ్రయించడానికి తిరుపతికి బయల్దేరాడు.

అక్కడ వేంకటేశ్వరుని గురించి గానం చేస్తున్న కవిని చూసిన కాళహస్తి ప్రభువు దామెర్ల కుమార వెంకటాద్రి సార్వభౌముడు (1745 - 1795) ఆదరించి తన సంస్థానంలో ఆస్థాన విద్వాంసునిగా గౌరవించారు. వేంకటేశ్వర స్వామి కవికి కలలో కనిపించి తన మీద గ్రంథం రాసి అంకితమిస్తే మేను క్షీణింపచేసే కుష్ఠ వ్యాధి తప్పక నయమౌతుందని చెప్పాడు.

శ్రీరామచంద్రుని చరిత్రను కీర్తనా రూపంలో రాసి అద్దేవుని కంకితమివ్వాలని సుబ్రహ్మణ్య కవి నిర్ణయించుకున్నాడు. కాళహస్తి రాజు సుబ్రహ్మణ్య కవికి ఒక గృహాన్ని స్వర్ణముఖీ నది ఒడ్డున కట్టించి ఇచ్చాడు.

అధ్యాత్మ రామాయణమనే పేరుతో కీర్తనలను కాళహస్తీశ్వరాలయాన కూర్చుని రాసి, అద్దానిని అంకితమివ్వడానికి ప్రభువును అనుమతి కోరాడు. ప్రభువు మొదట సమ్మతించలేదు. తర్వాత ప్రభువే క్షమార్పణ వేడుకొని సుబ్రహ్మణ్యకవిని మేనాపై కాళహస్తి తీసుకొని వెళ్ళాడు. సుబ్రహ్మణ్యకవి దేవుని యెదుట పాడగా, వ్యాధి తగ్గి, బంగారపు ఛాయ శరీరమంతా వ్యాపించింది.

"ఆ పిమ్మట వేంకటాద్రి భూపాలుని మీద, అతని కుమారుడు కృష్ణస్వామి మీద సుబ్రహ్మణ్య కవి వాళ్ళను నాయకులుగా చేసి, నాయికా నాయక భావంతో నర్తకులు పాడుతూ నృత్యం చెయ్యడానికి వీలుగా పదాలు, శబ్దాలనే సంగీత రచనలను చేశాడు."

సుబ్రహ్మణ్య కవి దామెర్ల భూపతులు దామెర్ల తిమ్మప్పనాయుడు, ఆయన కొడుకు వెంకటాద్రి, మనుమడు కృష్ణస్వామి గార్లకు విద్యా గురువుగా ఆస్థాన వాగ్గేయకారుడుగా ఉన్నట్లు చెప్తారు.

"రారా, దామెర తిమ్మేంద్ర కుమారా
శతకోటి మన్మథాకారా, భాసుర భుజబల రణశూరా!
నారీజన మానస చోరా మహామేరు సమానధీరా,
కవిజన పోషక మందారా! పరరాజ శత్రు సంహారా,
భరత శాస్త్ర నిధినీవేరా, పెదవేంకటేంద్ర హమ్మీరా,
సరసత గల దొరనీవేరా, నన్నుగనుట చూచుటకు
ఇది వేళరా, చలమేలరా, మది బూనరా
నీదానరా, నన్నేలరా" దాన రాధేయ
రాజబహద్దరు శబాసు సలాము సలాము!!

"1760 లో శ్రావణ బహుళ అష్టమినాడు కాళహస్తి ప్రభువు రాజా దామెర్ల కుమార వెంకటప్ప నాయుడు కాళహస్తికి మూడు క్రోసుల దూరంలో ఉన్న కృష్ణం పల్లె, రామానుజపల్లె అనే రెండు గ్రామాలు కవికి ధారపోసాడు"[5] రామానుజపల్లెను అన్యులు ఆక్రమించారు. కృష్ణం పల్లె మాత్రం కవిగారి వంశీయుల ఆధీనంలో ఉంది.

రామాయణాన్ని మొత్తం 58 భాగాలలో 104 కీర్తనలుగా ఆది, త్రిపుట, రూపక, ఝంపె తాళాల్లో రాశాడు. అన్నమయ్య పదకీర్తనలు సంకీర్తనాత్మకం, క్షేత్రయ్య పదాలు అభినయాత్మకం, సుబ్రహ్మణ్యకవి కీర్తనలు ఆఖ్యానాత్మకాలు అని సంగీతలోకం నానుడి.

పరబ్రహ్మ తత్వాన్ని సుబోధకంగా అందించేవిగా ఉండడం వల్లనేమో ఆంధ్రదేశంలో ఈ కీర్తనలు అందరి నోటా ప్రచారంలో ఉన్నాయి. ఇవి ప్రధానంగా భజనసంప్రదాయ కీర్తనలుగా ఉండటం వల్ల అందరికీ, నిరక్షర కుక్షులకు కూడా సులభగ్రాహకాలై ప్రచారాన్ని పొందాయి.

సుబ్రహ్మణ్య కవికి సంస్కృతాంధ్ర భాషల్లోను, సంగీత నాట్య అలంకార శాస్త్రాల్లోనూ వేదాంత శాస్త్రంలోనూ కూడా అపారమైన పాండిత్యం ఉంది. అందువల్లనే అధ్యాత్మ రామాయణ గాథ ద్వారా అద్వైత తత్వాన్ని బోధించాడు. ఆ తత్వాన్ని కీర్తనా రూపంగా అందించాడు.

"క్షరాక్షర రూపమై దేహంలో అధ్యాత్మం అక్షరమనీ దేహం అధి భూతమనీ గీత, ఉపనిషత్తుల్లోనూ వివరించారు. దేహధారులందరికీ చైతన్యకారణమైన జీవాత్మ, పరమాత్మ కంటే అన్యం కాదనే అద్వైత తత్త్వాన్ని బోధించే జ్ఞానం అధ్యాత్మ జ్ఞానం"[6]

రామాయణ నాయకుడైన రాముడు అట్టి పరమాత్మ స్వరూపుడైనప్పటికీ దేహధారియై అవతరించి, లోక వ్యవహారమనే మాయలో పడి కూడా ఆత్మజ్ఞానం కలిగి దుష్ట సంహారం చేశాడని నిరూపించింది అధ్యాత్మరామాయణం. ఈ కీర్తనలు భజన సంప్రదాయానికి సంబంధించినవి. ఇందులో చరణాలు పెద్ద పెద్ద పంక్తులుండి పల్లవి ఒకే వాక్యం ఉంటుంది.

ఆత్మానాత్మ పరాత్మల జాడలు త్రివిధాలని, అందులో మమతాహం కార కర్తృత్వం వల్ల ఆత్మ అని, అనృత జడ దుఃఖాల వల్ల నీరసమైనది అనాత్మ అని, నిత్యం స్వచ్ఛమై సత్యజ్ఞాన ఆనందాత్మకమైనది పరమాత్మ అని వేదాంత సారాన్ని విశదంగా చెప్పున్నట్లు ఒక కీర్తనలో రాశాడు. కౌసల్య రాముని కనడం, విశ్వామిత్రుడు రాముని అడవులకు తీసుకొని వెళ్ళడానికి అయోధ్యకు రావడం, దశరథుడు పసివారిని పంపుటకు ఇచ్చగించక పోవడం, వసిష్ఠుడు రాజుకి నచ్చజెప్పి రామలక్ష్మణులను పంపుట మొదలైన విషయాలు ఒకే ఒక కీర్తనలో చెప్తాడు.

ఇందువదనా వినవే యీ చరితము కుందరదనా! అని పల్లవితో మొదలైన ఈ కీర్తన (10) తొమ్మిది చరణాలు కలది. సామాన్య ప్రజకు అవగాహనకు వీలులేని కొన్ని కీర్తనలు ఉన్నాయి. 17వ కీర్తన (సారంగరాగం చాపుతాళం) లోని 3వ చరణంలో ఇలా వుంటుంది.

స్వామినీ ఛాయా యవ్యాకృతమనబడునది, యేమూల ప్రకృతి దాన మహత్తత్త్వమా మహతత్త్వాన లింగశరీరమై,

మరియది సకలమైన తనువులచేసె నహంకార బుద్ధి ప్రాణాజ్ఞాన కర్మేంద్రియ సాముదాయకము లింగ, శరీరమనబడునదే జన్మకర్మ మూలము ఇంద్రజాలము ఆ మహాత్మయే జీవ సంజ్ఞన నాద్య విద్యోపాధి నొందినదై మించె స్థూలా ది దేహత్రయమె జీవనోపాధియనియును.

మరో చరణంలో - స్థూల సూక్ష్మకారణాల జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు మూడు కల్గుతాయి. ఈ లీలలన్నీ ఏడు లోకాలకూ అది మూలమై, త్రికాలసాక్షి అయిన రాముని యందే ప్రవర్తిల్లుతాయి. అటువంటి రాముని చరితము వినమనికోరతారు. రాముని కథను శివుడు పార్వతీదేవికి చెప్పినట్లు అధ్యాత్మ రామాయణంలో ఉంటుంది.

వేదాంతపరంగా భక్తిపరంగా తత్త్వ ప్రధానంగా అధ్యాత్మపరంగాఅవసరమైన చోట్ల వివరిస్తూ రచన చేశాడు సుబ్రహ్మణ్యకవి. ఈ కీర్తనలు మొత్తం నూటనాలుగు.

ఆది; చాపు, ఝంపె మొదలైన తాళాలలో ధన్యాసి, మోహన, కేదారగౌళ, సావేరి, భైరవి, బిలహరి, కళ్యాణి, ఆనందభైరవి, అఠాణా మొదలైనరాగాల్లో కూర్చారు. అరవై ఒక్క కీర్తనలను త్రిపురారిభట్ల శ్రీరామామూర్తిగారుక స్వరపరిచారు. వాటిని ఆంధ్ర గాన కళా పరిషత్ రాజమండ్రి వారు ప్రచురించారు. ఆయా ప్రాంతాలలో అక్కడక్కడా సంగీత విద్వాంసుల నోళ్లలో మిగిలిన రచనలివి. వీటి యధాతథంగా స్వరపరచి ముద్రించారు. ఆధ్యాత్మికరమైన ఈ కీర్తనలు ఆచంద్రతారార్కం సంగీత లోకంలో విలసిల్లుతాయి.

## కాళహస్తి వీరయ్య (1900-1956)

కాళహస్తి వీరయ్య కాళహస్తి, ఉల్లిపాలెం, పానగల్లు సంస్థానాధీశుల ఆదరణలో సంగీతకళను వృద్ధి పొందించుకున్న సంగీత విద్వాంసులు బలిజ కులస్థుడు, వీరయ్యగారి ఇంటి పేరు మైనం పాటివారు. వీరయ్యగారి కుటుంబీకులు కాళహస్తి, ఉల్లిపాలెం జమీందారులకు దాదులై పాలిచ్చి పెంచేవారు. వారి సంతానానికి విద్యాబుద్ధులు చెప్పించి, వారికి వివాహాది కార్యాలను చేసి వారి బాగోగుల్ని చూసుకునేవారు జమీందారులు.

ఉల్లిపాలెంలో దాదిగా ఉన్న పాపమ్మ వీరయ్య గారి తల్లి. వీరయ్యకు పసితనం నుండీ సంగీతమంటే తగని అభిమానం. అది జమీందారు గమనించి ఉల్లిపాలెంలో సంగీత విద్వాంసుడునరసింహాచార్యులనే ఆయన దగ్గరకు సంగీతాభ్యాసానికి వీరయ్యను పంపించారు. కొంతకాలం అక్కడ వీరయ్య సంగీతం నేర్చుకున్నాడు. తబలా, వయోలిన్, వీణ, మృదంగం మొదలైన వాద్యాలను కూడా వాయించడం నేర్చుకున్నాడు. నరసింహాచార్యుల దగ్గర నుండి కొంత గ్రంథం అయింతర్వాత పిఠాపురాస్థాన వైణికుడైన తుమరాడ సంగమేశ్వర శాస్త్రి గారి దగ్గర వీణ నేర్చుకోడానికి వీరయ్యను ఉల్లిపాలెం జమీందారు సూరపనేనివేంకటరామ అప్పారావుగారు పంపించారు.

సంగీతాభ్యాసానికి ఉల్లిపాలెం జమీందారు వీరయ్యకు మూడు ఎకరాల పొలాన్ని ఇచ్చారు. వీరయ్య ఆ పొలాన్ని గురుదక్షిణగా నరసింహాచార్యులుగారికి ఇచ్చేరు. కొంతకాలం వీణాచార్య సంగమేశ్వరుని దగ్గర పిఠాపురంలో సంగీతం అభ్యసించి వీరయ్య తిరిగి స్వస్థలానికి వచ్చేశారు.

"పానుగంటి రాజా డి.కె.వి. రావు గారు సంగీతానికి ఎంతో గౌరవం ఇచ్చేవారు. ఆయన వీరన్నను మద్రాసు తీసుకుని వెళ్ళారు. వెంకటరత్నం నాయుడు గారు మైసూరు చీఫ్ జస్టిస్‌గా ఉన్నప్పుడు వీరయ్యను మైసూరు తీసుకువెళ్ళి అక్కడి మహారాజావారికి పరిచయం చేసారు. దసరాకి మైసూరు దర్బారులో వీరయ్యకు మైసూరు మహారాజు నమస్కారం చేసి "స్టేట్ విద్వాన్ ఆఫ్ మైసూర్" అని ప్రకటించారు. కాని వీరయ్య అక్కడ ఉండలేక తిరిగి కాళహస్తి వచ్చేశారు." వీరయ్య గొప్ప వైణికులు.

సంగమేశ్వర శాస్త్రిగారి శిష్యరికమేమో గురువుగారి లక్షణాలు కొన్నైనా సంపాదించుకున్నారు. ఎక్కడ సాహిత్యాక్షరాలుంటాయో అక్కడే మీటు్లు పడతాయి. ఇష్టమొచ్చినట్లు మీట్లు పెడితే స్వరాక్షరానికీ, సాహిత్యాక్షరానికీ భేదం ఉండదని వీరయ్యగారి అభిప్రాయం. వీణే సంపూర్ణమైన వాద్యం అనేవారు. "కాళహస్తి వీరయ్యగా పేరొందిన ఈయన ధన్యాసి, అఠాణ రాగాలలో వర్ణాలు, చక్రవాక రాగంలో ఒక కీర్తన రాశారు. ఇందులో ఒక వర్ణం సాహిత్యం పానుగంటి రాజావారు రాశారు. దానికి స్వరం కట్టి ధన్యాసిరాగాన్ని కూర్చారు వీరయ్య."7

1956 ఫిబ్రవరి 10వ తేదీన చనిపోయే ముందు అఠాణ రాగంలో "పంకజాక్షి నీకై వేచియున్నదిరా" అనే వర్ణం రాశారు.

సంప్రదాయ పద్ధతిలో సంగీతాన్ని నేర్చుకుని ముగ్గురు సంస్థానాధిపతుల ప్రోత్సాహంతో గొప్ప విద్వాంసుడైన కాళహస్తివీరయ్య గురించి ఏ కారణం వల్లనో మిగిలిన ప్రాంతాలవారికి అంతగా తెలియలేదు.

కాళహస్తి వీరన్న రాసిన తానవర్ణాలు చిన్నవర్ణాలు. ఆదితాళంలో కూర్చారు.

సంగీత శాస్త్రంలో తానవర్ణ రచనకు లక్షణం ఈ విధంగా ఉంటుంది.

పేరులోనే లక్షణం సుస్పష్టమౌతుంది. తానం అనగా స్వర ప్రస్తారం స్థాయి, ఆరోహి, అవరోహి, సంచారి భేదాలతో ఈ స్వర ప్రస్తారం ఉంటుంది. స్థాయి - ఒక్కొక్క స్వరాన్ని ఎంత సేపైనా నిలపవచ్చు. దాన్ని స్థాయి అంటారు.

ఆరోహణ క్రమంలో స్వరాలను ప్రస్తరించడం ఆరోహి అవుతుంది. ఆరోహి వర్ణ వ్యతిరేకమే అవరోహి అవుతుంది. స్థాయి, ఆరోహి అవరోహి క్రమం తెలిసే విధంగా స్వరాలను ప్రస్తరిస్తే అది సంచారి అవుతుంది. ఈ సంచారి రాగానికి ఆధారం. రాగప్రస్తారం తాన వర్ణ రచనలో ప్రధాన అంశం.

రాగాలాపనలో రాగ రూపాన్ని మధ్యమ కాల సంచారాలతో పాటు విస్తరిస్తే అది తానం అవుతుంది. మధ్యమ కాలనడక తానవర్ణం ప్రత్యేకత.

ఇందులో సాహిత్యాక్షరాలు తక్కువగా ఉంటాయి. ఇది ధాతు ప్రధాన రచన. సాహిత్యం రెండవ భాగంగా చెప్పుకోవచ్చు. పల్లవి, అనుపల్లవి ముక్తాయి స్వరం ఈ మూడు భాగాలు పూర్వాంగంలో ఉంటాయి. ఎత్తుగడ పల్లవి, ఎత్తుగడ స్వరాలు ఉత్తరాంగంలో ఉంటాయి. అభ్యాసకులు తానవర్ణం నేర్చుకోవడం వల్ల ఆయారాగాల సంపూర్ణ జ్ఞానం కలుగుతుంది. నిజానికి తానవర్ణం నిఘంటువుతో సమానమని పెద్దలు చెప్తారు. సభాగానంలో ప్రదర్శించెందుకు ఈ తానవర్ణం ఎంతో తగినది, సభారంజకంగా ఉంటుంది. తానవర్ణంలో ప్రత్యేకత సాహిత్యం మధ్యలో అ, ఇ, ఉ కారాలు ఎక్కువగా అంటారు. అలా ఇమిడ్చి నేర్పడం వల్ల రాగ లక్షణంతో బాటూ రాగాన్ని తాన రూపంగా ఏ విధంగా పాడాలో అది అభ్యాసం అవుతుంది. సాధారణంగా వర్ణం లాగ పల్లవి, అనుపల్లవి, ముక్తాయి స్వరం పూర్వాంగంలోనూ చరణం స్వరాలు ఉత్తరాంగంలో ఉంటాయి. భక్తి, శృంగార రసాలలో ఏదో ఒక రస సంబంధంగా వస్తువు ఉంటుంది. సంగీతాభ్యాస క్రమంలో తానవర్ణానికి అగ్రస్థానం ఉంది. "తాన వర్ణరచన మధ్యమ కాల రచన అయినప్పటికీ అభ్యాసం కోసం మూడు కాలాల్లోను పాడుకోవచ్చు"[8] గీతాల తర్వాత తానవర్ణాలు అభ్యసింపదగినవి.

ఈ తాన వర్ణాలు చిన్న వర్ణాలని, పెద్ద వర్ణాలని రెండు రకాలుంటాయి. చిన్న వర్ణాలు ఆది, రూపక తాళాలలో ఉంటాయి. పెద్దవర్ణాలు అట తాళం లాంటి ఎక్కువ మాత్రలున్న తాళాల్లో ఉంటాయి. వీరన్న రాసిన వర్ణాలలో ఈ లక్షణాలు ఉన్నాయి.

అఠాణ రాగంలో రాసిన వర్ణంలో "త్రిలోక నాయకుడవైన ఓ శ్రీకాళహస్తిపురవాసా! పంకజాక్షి అయిన అమ్మవారు నీకోసం ఎదురు చూస్తోంది. తామసమెందులకయ్యా! సామి! ఆమెను ఏలుకోరా! అని పల్లవి, అనుపల్లవులలోని భావమైతే చరణంలో మాత్రం బిరాన రారా గోపాల బాలా!" అన్నారు. శివునకు విష్ణువునకూ అభేదమని ఉద్దేశ్యమేమో!

రచన శ్రీకాళహస్తీశ్వరుని మీదే రాశారు.

చిట్ట స్వరం, చరణం, నాలుగు చరణ స్వరాలు రాగభావాన్ని స్పష్టంగా తెలియ చేస్తున్నాయి.

ఇక కాళహస్తి వీరన్నగారు మరో వర్ణాన్ని ధన్యాసిరాగంలో స్వరపరిచారు. ఆ వర్ణం రచయిత పానుగంటి రాజావారు. ఇందులో కూడా నాయికా నాయక సంబంధి వస్తువే. శ్రీకాళహస్తీశుని మీద రాసిన వర్ణం.

మదనునిగా శ్రీకాళహస్తీశుని పోల్చి మౌనంగా ఉన్నావెందుకు చలము మానమని వాదులాడుట మర్యాద గాదని ఆదరణ చూపమని ప్రార్థన ఇందులోని వస్తువు. మిగిలిన భాగంలో చరణం, చరణ స్వరాలు నాలుగు. ఇవి వర్ణంలోని భాగాలుగా ఉన్నాయి.

ఆంధ్ర ప్రాంతంలో వర్ణాలు, తానవర్ణాలు రాసిన కొంత మంది వాగ్గేయకారుల రచనలు మచ్చుకుక కూడా కనబడడంలేదు. వీరన్న గారు రచనలు వారి కుమారుడు శ్రీరామమూర్తిగారి వల్ల లభ్యమయ్యాయి. చక్రవాకరాగంలో వీరన్నగారు రాసిన కృతిలోని వస్తువు భక్తితో వేడుకోవడమే.

# అధస్సూచికలు

1. వెంకట నరసింహాసత్యనారాయణరావు, కోటగిరి. పద్మనాయక చరిత్ర అప్పారాయ గ్రంథమాల, నూజివీడు 1981. పుట - 127
2. దొణప్ప, తూమాటి. ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము - (ద్వితీయ ముద్రణ) ది ప్రింటర్స్, హైదరాబాదు 1987. పుట - 91
3. సుబ్బారావు, నారుమంచి.'సంగీతమహర్షులు' శివశ్రీ పబ్లిషరు, తెనాలి 1947.పుట - 74.
4. రజనీకాంతరావు, బాలాంత్రపు. ఆంధ్ర వాగ్గేయకార చరిక్షతము, విశాలాంధ్ర ప్రచురణ, విజయవాడ - 1958. పుట 258.
5. 1. అధ్యాత్మ రామాయణ కర్త సుబ్రహ్మణ్య కవి - ఆంధ్ర పత్రిక - క్రోధన నామ సంవత్సరాదిసంచిక - పుటలు 239, 240.

   2. సుబ్రహ్మణ్యకవి, మునిపల్లె.అధ్యాత్మరామాయణ కీర్తనలు - పరిచయం - పుట 5
6. రజనీకాంతరావు, బాలాంత్రపు. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము, విశాలాంధ్ర ప్రచురణ, విజయవాడ - 1958. పుట 260.
7. చూడు : అనుబంధం - X
8. జానకీరామన్, ఎస్.ఆర్. సంగీత శాస్త్రసారము - మొదటి భాగము. శ్రీరామా ప్రింటర్స్, తిరుపతి 1986, పుట 231.

# 7. కార్వేటినగర సంస్థానం

## చారిత్రక నేపథ్యం :

రెండవ రంగరాయుల కాలంలో అతన్ని ప్రభువుగా అంగీకరించని విజయనగర సామంత పాలకులు ఈ కార్వేటినగరాధీశులు. వీరు కొంతకాలం చంద్రగిరి పాలకులకు సామంతులుగా ఉండి కప్పం కట్టేవారు. ఉత్తర ఆర్కాటు మండలంలో కొంత చిత్తూరు ప్రాంతంలోని భాగం కలిసిన కార్వేటి నగర సంస్థానం చాలా ప్రాచీన పడమటి పాళీయాల్లో ఒకటి. కాళహస్తి, కార్వేటి సంస్థాన పాలకులు ఇద్దరూ తమ తమ ప్రాంతాల విస్తరణకోసం పోటీపడి చుట్టుపక్కల ప్రాంతాల మీద దండయాత్ర చేసేవారు. అవసరమైనప్పుడు సేనలతో సహాయపడటానికి కర్ణాటక నవాబుతో కార్వేటి పాలకులకు ఒక ఒప్పందం ఉండేది. ఆ తర్వాత కుంఫిణీ వారి కిందకు వచ్చిన పడమటి పాళీయాలలో కాళహస్తి, కార్వేటి పాలకులు పరస్పరం కలహం పెంచుకున్నారు. కారణాంతరాలవల్ల వీరు సైనిక దళాలను రద్దు చేసుకోవాల్సివచ్చింది.

1802 లో కార్వేటి నగరానికి సన్నదు వచ్చింది. కార్వేటి నగర సంస్థాన పాలకులలో మొదటి రాజా వేంకట పెరుమాళ్ళరాజు (1719-1932) తిరుమల రాజు బహద్దూర్‌గారి రాణీ మట్టవారి ఆడబడుచు. ఆమె కొడుకు వేంకట పెరుమాళ్ళ రాజు ఈ సంస్థానాధీశులలో చివరి రాజా.

కార్వేటి నగరాధిపతులు గానకళాకోవిదులుగా పేరు పొందారు. వీరి ఆస్థాన దిగ్గజాలుగా పేరొందిన వారిలో సారంగపాణి ఒకడు. కళలకు నెలవుగా చేసి ఎంతో మంది కళాకారులను తమ సంస్థానంలో సన్మానించి తమ కళా నిరతిని ప్రకటించుకున్నారు.

## మొదటి భాగం

## సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం

### సారంగపాణి (1680-1710)

ఇతడు కార్వేటి నగర సంస్థానంలో ఆస్థాన విద్వాంసుడు.

కళ్ళు నూనుకుని దిరుగక మునుపే<br>
కంఠధ్వని తగ్గి పోక మునుపే<br>
అట్టు ముందరికి వంగకమునుపే<br>
అంగము, తల, వణుకెత్తకమునుపే ॥హరినామ స్మరణ॥<br>
అప్పులకాపులు కదియక మునుపే<br>
అన్నమొకరు దినిపించక మునుపే<br>
దొప్పలోన చై కడగక మునుపే<br>
ధోవతి బరువై తోచక మునుపే<br>
హరినామస్మరణ సేయకుంటే<br>
అవతలగతియేమీ......... 167 వ పదం

ఇవి ఒకప్పుడు సాతానులు, బిచ్చగాళ్ళు, పాడే వేదాంతపు పాటలు. బొబ్బిలి వేణు గోపాలస్వామి దేవళంలో భిక్షులు పాడే పాటలు. ఇవి కార్వేటి నగర వేణుగోపాల స్వామి మీద సారంగపాణి రాసిన పదాలు.

సారంగపాణిపదాలకుపీఠిక రాసిన మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారు బొబ్బిలి నివాసస్థులు ఆయన పీఠికలో ఇలారాశారు.

"చెన్నపురిలో 1867లో అచ్చుపడిన పుస్తకం కార్వేటి నగరాధీశుల ఆనచేత సారంగపాణి గారి దౌహిత్రుడు గరిమెళ్ళ వెంకట సుబ్బయ్య గారిచే నేలటూరి సుబ్రహ్మణ్యంగారి విద్యా విలాస ముద్రాక్షర శాలలో ముద్రించబడింది"[1] ఆ పుస్తకంలోని పదాలు బొబ్బిలిలో ఉండే ముసలమ్మలు బిచ్చగాళ్ళూ పాడుతుండేవారు. ఎక్కడ బొబ్బిలి? ఎక్కడ కార్వేటనగరం? అంటే సంగీత కళ ప్రజానుకూలమై ప్రజామోదం పొంది పరిసరాలపై ప్రభావం చూపిస్తూ వ్యాప్తి చెందిందన్న మాట. అలాంటి పదాలు జనావళి పెదవుల మీద ప్రయాణం చెయ్యడం అంటే ఎక్కడో పుట్టినా ఎక్కడెక్కడో మలుపులు తిరుగుతూ ఉరకలేసే జీవనదీయానంలాంటిదే. భూమిలో ఉండేధాతువుల వల్ల ఆయానదులలోని నీటికి రంగు రుచి మారతాయోమోగాని రూపం మాత్రం మారదు. అలాగే ప్రజల భావాన్ని అర్థం చేసుకుని, వారి భావాన్ని కవిత్వంలో గానీ పద కీర్తనలో కానీ ప్రతి బింబింప చేయుడం కవుల, వాగ్గేయ కారుల కర్తవ్యం.

శ్రీకృష్ణ దేవరాయల కాలంలో విజయనగరంలో, విజయరాఘవుడు, రఘునాథ భూపాలుని కాలాల్లో తంజాపురి రాజ్యాలలో నాట్యానికి అధిష్ఠాన వర్గం నర్తకీ మణులు దేవదాసీలు. సామ్రాజ్యాలు పోయినా ఆవాసనా రూపంగా ఆ సంప్రదాయపు ఛాయలు మనుష్యుల నుండి వస్తూనే వున్నాయి. అలా వచ్చిన సంప్రదాయపు బిందువులో అణువు నాట్యానికి సంబంధించిన పదంగా చెప్పవచ్చు. సారంగపాణి చెన్నపురిలో పుట్టి పొన్నేరులో పెరిగి, చివరికి చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరాధీశుని ఆస్థాన వైణికునిగా స్థిరపడినట్లు తెలుస్తోంది. ఇతని గురించిన విషయాలు అతి తక్కువగా లభించాయి. సారంగ పాణి 1680-1710 ప్రాంతాలలో జీవించినట్లు తెలుస్తోంది.

సారంగపాణి వైణికుడు మాత్రమే కాదు. పదకర్తా, నాట్యాచార్యుడు, నటుడు, పరీక్షాధికారిగా కూడా ఉన్నాడు. గోవింద సామయ్య, కూవన సామయ్యలకు సమకాలికుడు. సారంగపాణిని ఆదరించి ఆస్థాన విద్వాంసునిగా నియమించిన కార్వేటి నగర ప్రభువు మాకరాజు పెరుమాళ్ళరాజు శివాజీ మహారాజుకి సమకాలికుడు.

సారంగపాణి కార్వేటి నగర ప్రభువులైన శ్రీ మన్మహామండలేశ్వర కఠారి సాళ్వరాజు పెరుమాళ్ళు రాజావారి ఆస్థానమున వైణిక పండితులుగా ఉన్నారు. శక సంవత్సరాలు 1731 వ సంవత్సరానికి సరియైన శుక్ల సంవత్సరంలో సంస్థానంలో దుర్గ రాజపురమనే శ్రోత్రియ గ్రామాన్ని వీరికి సారంగపాణికి దానంగా ఇచ్చారని దీవి నరసింహాచార్యులు గారు పేర్కొన్నారు.

మొదట సారంగ పాణి గ్రాసవాసాలకు లోటు లేకుండా గ్రామాన్ని దానంగా పొందాడు. కార్వేటి నగరాధీశుని కోరిక మన్నించి, సారంగపాణి మహారాజు మీద కొన్ని పదాలు, వేణుగోపాల స్వామి మీద కొన్ని పదాలు రాశాడు. అవి "సారంగపాణి పదములు" గా అచ్చయ్యాయి. సారంగపాణి ప్రజ్ఞా పాటవాలతో బాటూ మంచి రూపలావణ్యాలు కూడా ఉన్నవాడు. స్వయంగా నాట్యం చేర్చుకున్నాడు. ఇతరులకు నాట్య రీతుల్ని నేర్పేవాడు. ఒకసారి రాజదర్బారులో స్త్రీవేషం వేసుకుని సారంగపాణి నాట్యం చేశాడు. దర్బారులో నాట్యాన్ని చూస్తున్నవారు స్త్రీ కాదు పురుషుడంటే ఎవరూ నమ్మలేదు. సారంగపాణి స్త్రీవేషం వేసుకున్నాడన్నసంగతి తెలియక, ఆ అందం చూసి మహారాజు కూడా సమ్మోహితుడయ్యాడు. సారంగపాణి గురించి తెలిసిన

మహారాణి అతని మీద మోహం పెంచుకుంది. మాకరాజామహారాజావారు అంతఃపురానికి పిలుస్తున్నారని సారంగపాణిని మహారాణిగారే పిలిపించుకుని తనను పెండ్లాడమని కోరింది.

తల్లీ! రాజ్యాన్నేలే మహారాజు నాకు తండ్రితో సమానం. ఆయన అర్ధాంగివైన నువ్వు నాకు కన్నతల్లికంటే ఎక్కువ దానవు! ఇది తగదమ్మా! అని వెళ్ళిపోబోయాడు సారంగపాణి అనుకోని ఆ క్షణంలో వెంకట పెరుమాళ్ళ రాజు అక్కడికి వచ్చాడు. రాణిగారు - తనను సారంగపాణి తిరస్కరించాడనే కోపంతో, రాజుగారికి తనమీద అనుమానం వస్తుందనే భయంతో, తన తప్పు కప్పి పుచ్చుకోవాలనే తపనతో సారంగపాణే చెరచాలని వచ్చాడని, ఇలాంటి వాళ్ళకు ఆశ్రయం ఇవ్వకూడదనీ, ఇలాంటి పాతకులను చంపినా పాపం లేదని రాణిగారు అబద్ధం చెప్పి రోదించింది. నిశ్చలంగా నిర్మల వదనంతో నిలబడి ఉన్న సారంగపాణిని చూసిన రాజుకు ఆమె అబద్ధం చెప్పిందని అనిపించినా, సారంగపాణిని బైటకు పంపించేసి, అతని దగ్గరున్న ఆస్తినంతా తీసుకున్నాడు. సారంగపాణిని చంప మనసు రాక వదిలి పెట్టాడు. అప్పటి నుండి దరిద్ర దేవత సారంగపాణి వెంటనంటి తిరిగింది. ఆ తర్వాత అతడు ఉంఛ వృత్తితో కాలం గడిపేడు. ఇలాంటివి చరిత్రలో అనేకం కనిపిస్తాయి. రాజుకు ఆగ్రహం వస్తే తల తీస్తాడు. అనుగ్రహమైతే ఆసనమిచ్చేస్తాడన్నది నిజమేననిపిస్తుంది.

సారంగపాణి పదాలు జీవిత సత్యాలు తెలుపుతాయి. మొదటిభాగంలో యౌవన జీవితపు, శృంగారం రెండు మూడు భాగాల్లో సామాజిక స్పృహ, నాల్గో భాగంలో వృద్ధాప్యపు వైరాగ్యాన్ని సారంగపాణి తన పదాల్లో ఇనుమడింపచేశాడు.

గ్రంథంలోని మొదటి పదం రాగాలతో కూర్చినట్లు కనిపిస్తుంది.

రాగం : కళ్యాణి - ఆదితాళం

పల్లవి : ఈ సీమల హరిణాక్షులవలెగా - దీమోహనాంగి

అనుపల్లవి : కాశీపురి నుండి వచ్చినదీ - కళ్యాణి వేణుగోపాల
కన్నడ సేయక నీదరబారు గాచియున్నది నాట నుండి ...... పదం - 1

మోహనాంగి, కళ్యాణి, కన్నడ, దర్బారు, నాట, తోడి, సామ, సారంగ, ఈ విధంగా సందర్భాను సారంగా ఆయా చోట్ల రాగాల పేర్లు ఈ పదంలో కనిపిస్తాయి.

అదేవిధంగా మానుల పేర్లు, ఓషధుల పేర్లు, ఆభరణాలపేర్లు ప్రత్యేకంగా కొన్ని పదాలలో కనిపిస్తాయి. కార్వేటి వేణు గోపాల! అనే సంబోధనతో పదాలు, నాయిక నాయకునితో, చెలికత్తె నాయికతో, నాయకుడు నాయికతో చేసే సంభాషణాత్మకమైన పదాలు మొదట భాగంలో ఉన్నాయి. అనేక రకాలుగా శృంగార భావాలు ఇందులో ప్రకటితమయ్యాయి.

"నామనవి తెలిసి రమ్మని రారమ్మని" నాయిక చెలునికి కబురంపుతుంది. ఒకవేళ రానని అంటే గట్టిగా మందలించమంటుంది. వలచిందే తప్పయితే ఎలాభరించగలదానను అని అతనిని రప్పించి

"ఆడకే పోరా - యెదురాడక పోరా
వేడుకలీడ జెల్లవు - వేణు గోపాల నాసామి
... ... ... ... ...
ఏడు వరాలిప్పించుకున్న ఐదువరాలి యిల్లేడనో
కూడిన నాటనుండి చే - కూడిన నాపై దయ ఉంచి" 25 వ పదం
మరోచోట నాయకుడునాయికను వేడుకొనే విధం ఎట్టిదనిన
"నెరనమ్మితి గదె - నీమాట సతమని నెనరుదాన వనుచు
మరులు బుట్టించి యేమరి యూరకున్నావు గురిచేయకె నన్ను - మరుబారికిపుడు" - 40వ పదం

బూటకాలాడి ప్రొద్దువృధా చెయ్యకు. నీ అధరామృతాన్ని నాకివ్వు అరచేతిలో ఇదిగో వైకుంఠం అని చూపించావు చనువు ఇచ్చి మనసు మాత్రం ఇవ్వనట్లే ఉన్నావు. నమ్మినానబోస్తే ఏదో అయినట్లు నాపనయింది. రమ్మని సంకేతం ఇచ్చి మదన కేళి కలయవేమి అని నాయకుడు ఆమెను బతిమాలుకుంటాడు.

ప్రథమ భాగంలో కార్వేటి నగర సంస్థానాధిపతి మాకరాజు పెరుమాళ్ళ రాజును, కార్వేటి నగర దేవత వేణుగోపాలుణ్ణి ఉద్దేశించి రాసిన పదాలున్నాయి. రాజు కోరికమేరకు సారంగపాణి ఈ పదాలను రాజాంకితాలుగా రాసాడు.

శంకరాభరణ రాగం - ఆదితాళం

పల్లవి : తేనెలూర మాటలాడకు తెలిసె నీనెవరు

అనుపల్లవి : మానినీ మనోహర శ్రీ సాళువ మాకరాజ కార్వేటి రాజేంద్రా!

పండుగనుచు వెచ్చానికడిగితే పళ్ళి పట్టు రెండానాపై

కొండె కారి మెడకు మంచి జంగరు గొప్పగుండ్ల దండా ... పదం - 60

ఆనందభైరవి - ఆదితాళం

పల్లవి : దానికెవ్వరు సాటీ ఆవెలది నీకే తగురా రాజకిరీటి.

అనుపల్లవి : మానిత వరగుణ పేటీ నీసై మరలు కొన్నదిరా మాబోటీయిక

నిను మానదురా భాను సమతేజా మాకరాట్కార్వేటి రాజా

మగువను సభల నెన్నుదురు మామువదలించు నెన్నుదుర ఆ

వగలాడి పల్వరుస కుదురుమేటి వజ్రమణులనుచు బల్కుదురుయీ

జగతి దాని కెవ్వరు నదురు విరిజాజులంపె నీకు నదురు మంచి

నిగనిగలు గల మొగడు తమ్ముల దెగడుచనుగవ బొగడ తగునిక। .... పదం - 61

శంకరాభరణం - త్రిపుటతాళంలో

పల్లవి : వలదు యీ మాటేలలరా మది హితవైన వనిత యిల్లిది గాదురా

అనుపల్లవి : వెలయు శ్రీమాక రాజ వీర కార్వేట్రాజేంద్ర

చెలులు దెలుపగ దెలిసె నీ వగలు చాలు పదివేలు।

కరుణ చేతను కోరి మోహించియూ

కనకాంగినిను జేరి మఱి మఱి తమి మీఱి

విరహభరము జే తరముగాక తారీ మరులూరి

తరుణి గురుకుచ గిరుల నురమున

నొరసి మురిసిన సరసమెల్లను

మరచి వత్తుర యేర యాదారికిరోరి। .... పదం - 62

ప్రబంధ యుగం నాటి విలాసపు వాకిళ్ళు కార్వేటి నగరంలో కూడా ఉన్నాయి. అందుచేతనేమో వేశ్యమాతతో ఆమె కూతురి నడత గురించి నాయకుడు హెచ్చరిస్తాడు.

నీ కూతురి నడతలు నీకేసరి లోకు లెవరు మెచ్చరమ్మ

ఈ కాడికి తెల్లవారె గద నన్నికను వేణుగోపాలుడనదలు..... పదం - 77

"సమయానికి నిద్రలేవదు. ఏ జన్మానా ముఖాన బొట్టు పెట్టదు. తమలపాకు ముట్టుకోదు జడదువ్వుకోదు ఎప్పుడూ పీణవాయించడం లేదు. ఎక్కడో రాణి వాసంలో ఉన్నట్లుగా ఊహించుకుని అడుగు కిందే పెట్టదు. ఆమొండితనం పనికి రాదమ్మా నీకూతురికి - అది మానేటట్లు బుద్ధి చెప్పమంటాడు. వారస్త్రీలనునమ్మకూడదని ఆమె చేసే వ్యవహారమంతా ఒక కాంత మరో స్త్రీతో వెళ్ళ గక్కుతుంది" ఈ పదంలో -

"వారస్త్రీల నమ్మరాదు గా యెంత దోపిన వారమది సంతుష్టి లేదుగా నిన్న జారు కొప్పు బెట్టుకొని మైజారు చీరకట్టుకొని", ఈ విధంగా వేశ్యలను పదాలలో నిరసించి నట్లే కనిపిస్తుంది. స్వభావ సిద్ధమైన వ్యావహారిక పద సమ్మేళనం సారంగపాణి పదాలలో కనిపిస్తుంది.

ఇక తృతీయ భాగంలో పదాలు ప్రాంతీయ భాషలో అందునా పల్లెల్లోని సామాన్య జనావళి మాట్లాడే భాషలో ఉంటాయి. అలాంటిపదాలు ఆవిధంగా మాట్లాడే వారికే అవగతమౌతాయి. అందులో ఒకటి - తత్త్వం.

పల్లవి : మనుషా నమ్మబాకే - యిద్రేగాము
కళేభారం - మనుషా నమ్మ బాకే॥
అనుపల్లవి : మనుషా యిద్రేగాము - మట్టి సట్టెంటిది
పనిశేటిలో నుండె - పరమాత్ముడెల్నంటె॥
తొమ్మిది సారంఘాళ తోళే నరమాశిగ
బెమ్మగా యించిది - బెష్టకారి కట్టె॥
ఎన్నెంటా యెంకేలు - యెంక ముంగలెంటికేలు
కన్నయాదుల బుట్ట - గడగ కుంటె గబ్బు॥
పయి యెన్నెలడుగున - పరమ శాండలము
మయిదు యిాస్నుడు శేశి - మచ్చి గప్పిండాడు॥ .... పదం -149

ఈ దేహం పరమాత్ముడు సృష్టించిన నవరంధ్రాలున్న తోలుసంచి, కట్టెలాంటిది. వెనకాముందు జుట్టు దేహాన్ని కడగ కుంటే గబ్బు కంపే. దాన ధర్మాలు చేసి మోక్షాన్ని పొందాలి. ఆ వేణు గోపాలుని ఆశ్రయించి ఆయనను భక్తితో సేవించండి అంటూ వ్యక్తం చేసినది ఈ పదం.

త్యాగరాజాదులు రాసినట్లు లేక పోయినా సారంగపాణి ఒక ప్రత్యేకత సంతరింప చేసుకున్నట్లు ఈ రచనల్లో స్పష్టమవుతుంది.

ఇక చతుర్థ భాగానికి 'కీర్తనలు' అని పేరు పెట్టాడు సారంగపాణి.
ధర్మ కార్యములకడ్డము బలికే దబ్బిలి దొక బ్రతుకా - శుద్ధ
నిర్మలాత్మకుల మది నొప్పించే నీచులదొకబ్రతుకా - హరి హరి
మగనికి వంచన చేసి భుజించే మానిని దొక బ్రతుకా సభలో
తగవారిని లంచముగొని మొరిగే ధగిడీ దొక బ్రతుకా - హరి హరి - .... పదం - 175

ఒకప్పుడు గాయకులు, బ్రాహ్మణులు, కళాకారులు ఉంఛవృత్తి చేసుకొని జీవనం సాగించేవారు. ఆ కాలానికి అది తప్పుకాదు, అవమానమూ కాదు. దానికి కారణం. కళకు అంకితమై అదే జీవన మనుకొనే వారు సంపాదనాసక్తులు కాలేక పోయేవారు. వారాలొప్పుకొని ఏదో విధంగా జీవనం గడిపేవారు. వారంతా ఐహిక

భోగాసక్తులు కారు. బ్రతకడం కోసమే తిండిగానీ తినడం కోసమే బ్రతుకు అని, సంపదే సర్వస్వం అని వారు అనుకోలేదు. కానీ ఈ ఉంఛవృత్తి చేపట్టడం వల్ల తన పొట్ట నిండడం వరకే పరిమితం అయ్యేది. భార్యాబిడ్డల సంగతి అభగవంతునికెరుక. అందుకే ఆంధ్రదేశంలో చాలామంది మహామహా విద్వాంసులు రాజ దర్బారుల్లో ఘన సన్మానాలు పొందినా వారి సంతానంమాత్రం అటు విద్యను గానీ కళను గానీ అభ్యసించక, ఇటులోకజ్ఞానం లేక ధనార్జించే స్తోమత లేక గుర్తింపు పొంద లేక పోయింది. త్యాగ రాజస్వామి ఉంఛ వృత్తితో గడిపాడు. అంతటి నిష్ఠాగరిష్ఠుడు - అది కొంత కాలం వరకే సరిపోయింది. సారంగపాణి కాలానికి వచ్చేసరికి ఉంఛ వృత్తి చేసుకోవడం అవమానంగా భావించాడేమో!

సౌరాష్ట్ర రాగం - చాపుతాళంలో

పల్లవి - అక్షయ పాత్రకు పోతే కదలనివాక
బిక్షవేయరయ్యా! మూల

అనుపల్లవి : నిక్షేపముత్రవ్వి నెత్తిని బెట్టెదరా
కుక్షింభరులు వేణుగోపాల స్వామి
తెచ్చుకోవలెనని కొందరు రాలే
తేబోనా రంటు కొందరు ఒట్టి
గచ్చులకై నాను కడకు బోయినాననని
ముచ్చు వలెనె తలుపు మూలకు వొదిగేరు - ..... పదం - 193

అప్పుడే తెల్లారిందా? అని ఇదిమాయిల్లు కాదని మళ్ళీ రమ్మని, నిండుకుందని, నేడు వెయ్య కూడదని, ఇలా ప్రతి గుమ్మంలోనూ చెప్తే ఎలా ప్రొద్దు గడుస్తుంది? అని అడుగుతాడు. పైగా ఉంఛ వృత్తి చేసుకు బ్రతికేవారికి అస్సలు కోపం పనికిరాదు. కొన్ని కొన్ని నియమాలు కూడా ఉండేవేమో కూడాను. "అమ్మా! అక్కా! అయ్యా! అనాలి. వాళ్ళు పొమ్మంటే తల వంచుకొని వెళ్ళి పోవాలి." ఒక్కరే వెళ్ళాలి. పెందరాడే వెళ్ళ కూడదు. హద్దుదాటి లోపలికి రాకూడదు. మరి కొంచెం పెట్టండని అడగకూడదు. తలుపుకొట్టి మరీ పిలవకూడదు. ఇవి ఆ నియమాలు.

అద్దె కొంపలాంటి ఈ దేహాన్ని అనిత్యంగానే భావించు. మిద్దె మీదకి పోవాలన్న ఆశ రెండు రోజుల ముచ్చటే సుమా! బందె గొడ్లలాంటిది ఈ సంసారం ఎవరున్నా నడమంత్రపు సిరే ఎవరూ ఎవరికీ తోడు రారు. వస్తారని భ్రమపడకు, పువ్వులాంటిది యౌవనం. నవ్వుల పాలవ్వకు, సిరులుమెరుపు లాంటివి నమ్మకు, అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. అట్టి జలజాక్షుని చింతించని మనిషి జన్మ వ్యర్థం.

ఉపకారం చెయ్యని కఠిన హృదయుడు ఉండీ వ్యర్థం. జపాలు, తపాలు చెయ్యడం నిజంగా వ్యర్థమే. తల్లిదండ్రులను పోషించని కొడుకు, బలవంతుల నెదిరించలేని పటుసాధనం ఉన్న పిరికివాడు, దశవిధగమకాలతో వాయించని వీణా గానం, సరసులు విని శభాషని మెచ్చని చదువు ఇవన్నీ వ్యర్థమని అంటాడు సారంగపాణి. షండుడు వరునిగా, రతి సుఖమెరుగని సతి యౌవనం, దానధర్మాలు చెయ్యకుండా దాచేధనం, ఏళ్లుడుగిన వృద్ధునకు పెండ్లి చెయ్యడం ఇవన్నీ కొరగానివని తన పదాలలో వ్యక్తం చేశాడు.

ఇలాంటి పదాలు వైరాగ్య బోధకాలై హృదయానికి హత్తుకునేవిగా ఉంటాయి. పెరుమాళ్ళ రాజావారి ఆగ్రహానికి గురై ఆస్తినంతా పోగొట్టుకున్న సారంగపాణి జీవితం కఠినంగా నిర్దాక్షిణ్యానికి గురైంది. ఆ దశలో ఎవరి ఆదరణా లభించలేదు. చివరికి ఉంఛవృత్తి చేస్తున్నప్పుడు కూడ సారంగపాణికి సరైన ఆదరణ లభించలేదు. ఆయా సందర్భాల్లో ఆ సమాజంలో తానెదుర్కొన్న పరిస్థితినే పదాల్లో చిత్రించాడు. అదే జీవితానుభం.

యౌవనం, వృద్ధాప్య దశల్లో మనిషికి కూడని పేమైనా సంఘటనలు ఎదురైతే ఆ బ్రతుకు దుర్భర మౌతుందనే అక్షర సత్యాన్ని సారంగపాణి పదాల్లో గోచరింప చేస్తాడు. పశ్చాత్తాపంతో నీతులు వల్లిస్తాడు.

చతుర్థ భాగంలో ఉన్న పదాలలో సారంగపాణి రాజునుండి, రాజరికం నుండి బయల్వెడలిన తర్వాత కలిగిన మానసిక ప్రవృత్తి గోచరిస్తుంది.

"నరులసేవ సేయులేనయ్య పద్మ
నాభ దండాలుబెట్టే నయ్యా!
నన్ను వీడక నెడబానెర
నమ్మితిరా జగన్నాయకా -" అంటాడు - ... పదం 104
"పోరాని తావులకు పోరాదు - బుద్ధి మంతులైతే
పోరాని తావులుకు పోరాదు
పోరాని తావులకు పోతే నీలాపనిందలు వచ్చు
వేరే యవమానము పని లేదు - వేణు గోపాలుని సాక్షిగా " ... పదం - 177

180వ పదంలో - పగవానింట కుడువగ రాదు బలవంతుల కెదుమియ్యగరాదు
మగువల యాలోచన వినరాదు మానఘనులపోనాడగ రాదు
అప్పులు మెండుగ సేయుగరాదు ఆవల పండ్లి గిలించరాదు
మెప్పులు వకరికి దోపరాదు మెచ్చని నడతలు నడుపరాదు
చేసిన మేలు చెప్పరాదు ఘాతకాని కొడిగట్టరాదు
కాయము సతమని నమ్మరాదు కలిమి గలిగెనని త్రుళ్ళరాదు
గాసి వచ్చెనని వగవరాదు వలవని వాదుకు బిలువరాదు
వంచనగా వడ్డించరాదు పేదల కాస జెప్పరాదు ....పదం - 180

పెద్దలమది నొప్పించరాదు బీదల హాస్యము సలుపరాదు బిచ్చానికి అడ్డము పోరాదు - అంటూ హెచ్చరిస్తాడు.

ఈనీతులు అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఆచరించ దగినవి. పాపాలు చేసే వానికి ధర్మకర్తృత్వాన్ని ఇవ్వడం, అనునిత్యం కోపం ప్రకటించే రాజును కొలవడం, ఎంతో సంపద ఉన్నా అనుభవించక దాచుకునే వాని ఆసంపద, కులకాంతలున్నా వారిని కాదని వేశ్యలింటికి పోయే వాళ్ళు, అటువంటి వారివల్ల వేశ్యల గర్భం నుండి పుట్టిన బ్రతుకులు, బిచ్చగాని వృత్తి చేపట్టినవాడు, ఎప్పుడూ తన భార్యను పుట్టింట్లోనేవుంచే పద్ధతి, పట్టెడన్నం కోసం తనకున్నది దాచుకుని చుట్టాలింటికి పోవడం, హీనుణ్ణి మహాత్ములు రక్షించడం, తన స్త్రీ గురించి అన్యపురుషులను పంపించడం వంటి వాటిని రోతగా భావించాడు సారంగపాణి. అలాగే తాపసి అయికూడా అరిషడ్వర్గాలను జయించ లేక వాటికి లొంగి పోవడం వేణుగోపాలుణ్ణి నమ్మి ముక్కోపి అవడం తగని రోత. ఛీఛీ వాళ్ళ బ్రతుకులూ వాళ్ళ చేష్టలు, పద్ధతులూ, అన్నీ రోతే కదా! అని ఆనాటి సమాజంలో ఉన్న స్థితిని నిరసించాడు. చన్నీళ్లలో మునిగే కంటే చలిలో జపం చేసే కంటే ఆకాశం చూసి ధ్యానించే కంటే ఎన్నో యజ్ఞాలు చేసేకంటే వేదశాస్త్రాలు చదువుట కంటే భేదవాదాలలో దొర్లడం కంటే ఎన్నో వ్రతాలు చేసి దివ్య క్షేత్రాలు దర్శిస్తూ, తీర్థ యాత్రలు చేస్తూ ద్రవ్య దానం చేస్తూ ఉన్నా లాభం లేదు - అన్నిటికంటే సులభమార్గం హరినామ స్మరణం ఒక్కటే. వేణుగోపాల సన్నిధి చేరడానికి ఇహంనుండి విముక్తి పొందడానికి అని అందర్నీ హెచ్చరిస్తాడు సారంగపాణి.

జానెడు పొట్ట కోసం ప్రతి మనిషి ఎంత అవస్థలు పడతాడో కూటికోసం కోటి విద్దెలే అన్న సామెతని వ్యక్తం చేస్తాడు ఒక పదంలో.

191 పంతువరాళి - చాపు తాళం

పల్లవి : కడుపా నీవింత ఘనమైతివాయె

అనుపల్లవి : కడగురుతు లేదాయె కలకాలమందు॥

పాతకాలు జేసేది ప్రజల బాధించేది నీతియేలకలిపేది నిష్ఠ మానేది

జాతకాలు వ్రాసేది జలధిలో మునిగేది కోతి నాడించేది నీ కొరకే గదవే॥

పేటలు గట్టేది బేరములాడేది మూటలు మోసేది ప్రుచ్చిలించేది

పాటలు పాడేది పయిరుపచ్చ జేసేది కోటి విద్యలు నీకొరకే గదవే

ఎలికబొక్కలు ద్రవ్వి యెన్ను వ్రేళ్ళదీసేది శిలలు భేదించేది శివమాడేది

పులుల బట్టుకొని పురములు దిరిగేది కొలువు గొలిచేది నీ కొరకే గదవే॥

యేవేళ ధనికుల యిండ్ల చుట్టు దిరిగేది నావదాటించేది నవ్వించేది.

తావువిడిచి దేశాంతరమున నుండేది గోవుల గాచేది నీ కొఱకే గదవే॥

ధారుణి యేలేది దండు దాళ్ళు దిరిగేది వారి జాక్షుల విటుల వలపించేది

భారకుడౌ వేణు గోపాలుని దూరేది గోరి ముష్టెత్తేది నీ కొరకే గదవే॥ .... పదం - 191

సారంగపాణి రాసిన పదాలలో చతుర్థ భాగంలో రెండు హెచ్చరికలు ఒక దివ్య జాతి లఘువు ఉన్నాయి.

199వ కీర్తన భైరవి రాగం - ఝంపె తాళం

జయమంగళం నిత్య - శుభ మంగళం

ఇందిరా రమణునకు నిభరాజ వరదునకు

మందరోద్ధారునకు - మాధవునకూ

నందనందనుడైన । నవనీత చోరునకు

కందర్ప శతకోటి । సుందరునకూ । అంటూమంగళం పాడాడు.

ఈ పుస్తకంలో చిట్టచివరి 200వ కీర్తన రాగమాలిక ఆదితాళంలో నిర్దేశించాడు. ఈ రాగ మాలికను అమ్మవారి మీద కూర్చాడు. ఇందులో అక్కడక్కడా రాగాల పేర్లను గమనించవచ్చు.

"తుంబురు నారదులెల్ల నీ మహిమ

తొలి జామున వీణను బిలహరిని

గంభీరముగ శంకరాభరణమును

గానములను సేయుదురనుదినమును"

బిలహరి, శంకరాభరణము, మధ్యమావతి, ఆనందభైరవి. పంతువరాళి, తోడి, సారంగ అసావేరి మొదలైన రాగాలతో కూర్చిన రాగమాలికలాలపిస్తారని ఊహించ వీలవుతోంది.

మిగిలిన వాగ్గేయకార, పదకారుల రచనలలో కంటే సారంగపాణి రచనలలో సామాజిక వాస్తవికత ఎక్కువగా కనిపిస్తుందని చెప్పవచ్చు. సారంగపాణి పదాలు ఇంతవరకూ స్వరపరచలేదు.

సంగీతం, అభినయ వేదం, సామాజిక నీతి న్యాయాలు స్పష్టమైన అవగాహనతో పదాలను కూర్చిన సారంగపాణి అద్వితీయుడే.

## గోవిందసామయ్య (కాలం వివరాలు తెలియవు)

గోవింద సామయ్య త్రిలింగబ్రాహ్మణుడు. భరతనాట్యశాస్త్రం, సంగీతశాస్త్రం కూలంకషంగా అధ్యయనం చేసిన పండితుడు. మంచి రూపవంతుడు. సారంగపాణి వలె స్త్రీ వేషం వేసి సర్వజన సమ్మోహనంగా నాట్యం చేసే నేర్పుగలవాడు గోవిందసామయ్య.

కార్వేటి నగరాన్నేలిన రసికాగ్రేసరులైన వెంకట పెరుమాళ్ళ రాజావారి కాలంలో గోవింద సామయ్య ఆయన ఆస్థాన విద్వాంసుడు. ఒకమారు రాజావారి సమక్షంలో తానొక మత్తేభాన్ని తెచ్చాననీ "ఆయేనుగును కొనగలరా యని రాజావారిని గోవిందసామయ్య శ్లేష పూర్వకంగా అడిగాడు. అప్పుడా రాజావారు మందస్మితుడై ఆ ఏనుగును చూచెదమని తీసుకొని రమ్మన్నారు.

మోహన రాగంలో ఒక వర్ణాన్ని రాసి గోవింద సామయ్య స్త్రీవేషం వేసుకుని రాజ దర్బారులో ఆవర్ణాన్ని అభినయించి ఒక మోహనాస్త్రంగా చేశాడు. అంతట రాజు పరవశుడై "గోవిందసామయ్యకు 5000 రూపాయలను ఇచ్చి సన్మానం చేశాడు. అప్పటి నుండి ఆ దర్బారు విద్వాంసునిగా నియమితుడయ్యాడు గోవింద సామయ్య."[3]

ఆ వర్ణమే 'సరిగాదాని పై నెనరుంచి' అనే మోహనవర్ణం. గోవింద సామయ్య రాసిన ఈ వర్ణం వెనుక కల్పిత కథో లేక నమ్మదగిన కథో మరొకటి వ్యవహారంలో ఉంది. పెరుమాళ్ళ రాజుగారికి భార్యమీద ఒకప్పుడు కారణాంతరాల వల్ల కోపం వచ్చింది. ఆమెను బయటకు వెళ్ళగొట్టాడు. గోవింద సామయ్యకు ఆ విషయం ఎలాగో తెలిసింది. తానే రాణి గారికి నాట్యాన్ని నేర్పించాడు. ఒకనాడు ఆమె చేత మారు వేషం వేయించి సభలో రాజావారి ముందు నాట్యం చేయించాడు. సమ్మోహితుడైన పెరుమాళ్ళ మహారాజు ఆమెను తిరిగి ఏలుకున్నాడు. ఆమెకు నేర్పించి, నాట్యం చేయించి, తిరిగి ఏలుకునేట్లుచెయ్యడానికే ఈ వర్ణాన్ని రాసాడని భావించవచ్చు.

మోహన రాగం - ఆదితాళంలో రాసిన ఈవర్ణం 'సంగీత సుధాంబుధి' అనే గ్రంథంలోనూ ఇతరత్రా కొన్ని సంగీతగ్రంథాల్లోనూ కనిపిస్తోంది. ఇటువంటి అమూల్యమైన సంపద దొరకడమే దుర్లభం.

సంగీత సర్వార్థ సారసంగ్రహమనే తచ్చూరి సింగరాచార్య సోదర కృతమైన పుస్తకంలో రేగుప్తి రాగం - ఆదితాళంలో ఈ వర్ణం ఉంది. సరిగాదాని పై నెనరుంచి నిన్నే సరసకు రమ్మనెరా" అని.

ఈ మోహనవర్ణం పదవర్ణం అనీ పెద్దవర్ణం అని వ్యవహారంలో ఉంది. ఈ రెండు పేర్లూ కూడా ఈ వర్ణానికి వర్తిస్తాయి. రచనని బట్టి ఇందులో పల్లవి అనుపల్లవి చరణాలు ఉన్నాయి. ఈ చరణాలు మొత్తం ఆరు. ఈ ఆరుచరణాలు స్వర సాహిత్యాలతో కూడిన పెద్ద చరణాలు.

నాట్యానికి తగిన విధంగా మలచడం వల్ల ఈ రచన పదవర్ణం అయింది. పెద్ద పెద్ద చరణాలున్న వర్ణం నిడివి పెద్దదిగాఉండటం వల్ల పెద్ద వర్ణం అయింది. దీన్నే చౌకవర్ణంగా సంగీత సర్వార్థ సారసంగ్రహంలో (పుట - 97) పేర్కొన్నాడు. ఇప్పటికీ ఈ వర్ణాన్ని సభలలో ఉత్సవాలలోను అభినయిస్తుంటారు.

"విరిబోణివి చలముమానిచెలిమితో ఏలుకోరా! నిన్నే నమ్ముకున్న దానిపై నెనరుంచరా సరసుడా? మన్మథాకారా సద్గుణసాంద్రా! సామి వెంకట పెరుమాళ్ళ రాజేంద్రా!" అంటూ రాణిగారి మీద అలుక బూనిన ఆయనను ప్రార్థిస్తూ, రతికేళికి సమాయత్త పరచడానికి చేసే ప్రయత్నం ఇందులో వస్తువు.

ఇంత వేడినా పలుకనేమి? శరణన్న వారిని రక్షించడం, మన్నించటం అనేవి సహజ గుణాలు. అటువంటిది కొంచెం కూడా విచారించవు. (ఆలోచించవు) ఔరా? ఎంత పిలిచినా పలుకవు అదేమి న్యాయం? నెఱతనమా? దొరతనమా? అని ఇంక చాల్లేగాని

సరస కరా = (సరసకురా! రసకరా (రసికరుడు)

సకరా = స్మరద్రూపి; వలపు నిలపడానికిదే సరైన సమయం ఎప్పటిలాగే ఏలుకోవయ్యా॥ అని బతిమాలుతాడు. మరుని ధర్మమాని అతని శరాల చేత చెలియకు విరాళి ఎక్కువైంది. ఆమె మదిలోని ప్రేమను అణచేసామర్థ్యం నీ ఒక్కనికే ఉంది వెన్నెల వేదన వేడిమి. సహించలేదు. నామాట కొంచెం కూడా వినవేమి మంచి దొరవని నిన్ను నమ్మి కామించిన చెలిని విరసించుట తగదయ్య! ఆ చపలాక్షి చెప్పిన మాటలు నిజమని నమ్మి మనసులో పెట్టుకోవద్దయ్యా!బాలికామణి చక్కనిదిరా కనరా వినరా! అలనాటి వలె మానవతిని ఏలుకో! నీ చెలి నీలో సగమయిందికదా! నీ మీద ఆమెకున్న తమి ఇంతని నేను చెప్పలేనయ్యా అంటూ అర్థాంగి మీద ప్రేమ కలిగేటట్లు సుందరంగా సరస పదాళిని అమర్చినట్లుగా రాశాడు. అందుకే రాజా సమ్మోహితుడయ్యాడు. శబ్దాలంకార శోభితమై పాడటానికి వీలుగా పదాల అర్థాల విరుపులు గలిగిన ఈవర్ణంతో సమానమైన రచనలు కొన్నే ఉంటాయి. సంగీత సాహిత్య నాట్యాదులను కూలంకషంగా తెలుసుకున్న గోవిందసామయ్య సంగీత ప్రపంచానికి అపురూపమైన కానుకగా ఈ వర్ణాన్ని అందిచ్చాడు.

కేదారగౌళ రాగంలో, రాసిన మరో వర్ణం మోహన వర్ణంలాగే శృంగార సరసత కలిగినదే. ఇందులో కూడా ఏడు చరణాలున్నాయి. అదే భావాన్ని స్ఫురింప చేసే వర్ణం ఇది.

నీసరిమన్నెదొర ఎవరూ లేరు అందుకనే నిన్ను కోరుకుంటున్నదా లతామణి. ఓ దామర వేంకటేంద్రా! సరసతగలిగిన దొరవని, మంచి శుభకరమైన గుణాలు కలవానిగా నిన్ను ఎంచుకుని ప్రేమించినది. అటువంటి అయింతిని మరుకేళిలో తేలియాడించు. ఆమె విరహతాపాగ్నిని చల్లార్చు. నేను నిన్ను ప్రార్థిస్తున్నాను. ఆమె గానాన్ని విని ఆనాడు ఆమెకు అనేక బహుమానాలు నగలు అందించి ఆమెతో సుఖించావు. అలాగే ఆనాటి సుఖాల్ని ఈనాడూ ఆమెకు అందించు రాజా! నిన్నే శరణని ఆమె అర్థిస్తోంది. ఆమె చెలులు నీ చుట్టూ చేరి ఆమె మీద లేని పోనివి కల్పించి చెప్పారు. ఆ వనితల మాటలు విని నువ్వు ఆమెలో నేరమెంచి ఆమె దిశ చూడటం లేదు. తేనెలూరు చెలిమోవిరుచి చూసి, నిన్నే సర్వస్వంగా భావించే ఆమె విరహాన్ని పోగొట్టు. నీవు మాత్రమే ఆమెను విరహవేదనను పోగొట్టి ఉద్ధరించగల సమర్థుడవు. నీ కౌగిట ఆమెను బంధించి ఆమె వక్షోజాలను అదుముచూ మునుపటిలా ఆత్మీయుతతో పెనుగొనరావయ్యా అంటూ నాయిక మీద అభిమానం కలిగేలా మనోహరంగా వర్ణించాడు. ఈ రచనకూడా అపురూపమే. అలతి అలతి పదాలతో మనోహరమైన శబ్దాలంకారంతో అందమైన అర్థాన్నిచ్చే గోవింద సామయ్య రాసిన ఈ రెండు వర్ణాలు మాత్రమే లభ్యమయ్యాయి. మిగిలిన రచనలు లభ్యం కాలేదు.

## యూసం రామకృష్ణ (1912 - వివరం తెలియదు)

కార్వేటి నగర విద్వాంసులు యూసం రామకృష్ణ 1912లో జన్మించారు. ఈయన బలిజ కులస్తుడు. కవులను గాయకులను పోషించిన కార్వేటి నగర సంస్థానంలో పుట్టి పెరిగిన ఈ విద్వాంసునికి కార్వేటినగర ఆస్థానంలో ఆదరణ లభించలేదు. ఆ నగర ఛాయల్లో పెరిగి, ఆ నీటిని, ఆ సంగీత సుధను గ్రోలి 'కీర్తన సుధాలహరి' అనే పుస్తకాన్ని రాశారు.

రామకృష్ణ ముత్తుస్వామి దీక్షితుల వారి శిష్యప్రశిష్యులకు శిష్యుడు. గురువు కూత్తనూరు అయ్యాసామి అయ్యరు. అయ్యాస్వామి అయ్యరు పుత్రిక ఎం.ఎల్ వసంతకుమారి. ఈమె తల్లి లలితాంగి, రామకృష్ణ గారలు కలిసి సంగీతం నేర్చుకునేవారు. ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్, అరైకుడి రామానుజయ్యంగారు మొదలైన దక్షిణాది విద్వాంసులు రామకృష్ణగారి సంగీత సహపాఠులు.

రామకృష్ణ మద్రాసు, వెంకటగిరి, నెల్లూరు మొదలైన ప్రాంతాలలో తన సంగీతానికి మెరుగులు దిద్దుకున్నారు.

ఆదే విధంగా తానొక గురువై సంగీత బోధన చేస్తూ ఎంతో మంది విద్వాంసులను తయారు చేశారు.

సంస్థానం ప్రభుత్వ విలీనంకాకముందే రాజాస్థానంలో ఈయన లేకపోయినా, ఆ ప్రాంతం నుండి ఈ కీర్తనలువెలువరించి నందువల్ల ఈ పుస్తకాన్ని నా పరిశోధనలో భాగంగా చేర్చాను.

## కీర్తన సుధాలహరి

"కీర్తన సుధాలహరి" నెల్లూరులోని మందాకినీ ప్రెస్‌లో 1964వ సంవత్సరంలో ప్రచురితమైంది.

వెంకట పెరుమాళ్ళ రాజావారు విఖ్యాతులైన విద్యాపోషకులు. 'ఈతముక్కల గోవిందస్వామి' కార్వేటి నగర ఆస్థానంలో పేరొందిన విద్వాంసుడు. మొవ్వలో పుట్టిపెరిగిన క్షేత్రయ్య కూడా కార్వేటి నగర ఆస్థానంలో చాలాకాలం ఉండి ఎన్నో పదాలు రాశారు అని ఆప్రాంతీయులు చెప్తారు.

ఎన్నో మానసిక ఒత్తిడులకు గురైన రామకృష్ణ ఈ కీర్తనావళి రాసారని ప్రస్తావనలో మరుపూరుకోదండరామిరెడ్డిగారు రాశారు.

భగవంతుని మీద భక్తి, నమ్మకం విడువకుండా ఎదురుగా నిలుచుండి కీర్తించే విధం ఈ కీర్తనలలో కనిపిస్తుంది. 'వరదప్రియ' అనే రాగాన్ని సృష్టించిన రామకృష్ణ ఆరాగంలో వర్ణం రాశారు. అనేక తిల్లానాలు, కృతులూ పల్లవులూ కూడా రాశారు. అన్నమాచార్యుని పదాలకు కొన్నిటికి స్వరం రాశారు. అవి ప్రచురణ చేస్తామని ప్రస్తావనలో కోదండరామిరెడ్డిగారు రాశారు.

కీర్తన సుధాలహరి దైవ ప్రార్థనతో ఆరంభించారు రామకృష్ణగారు. కృతి సంగీత పరమైనది. కీర్తన సాహిత్యపరమైనది కదా! కృతులకంటే కీర్తనలను రాసిన సంగీత విద్వాంసులు ఎక్కువ మంది ఉన్నారు. సుధాలహరి కీర్తనల సంపుటిలో మొత్తం 103 కీర్తనలున్నాయి. అందులో కొన్ని స్తోత్ర రూపంలో, కొన్ని స్తవ రూపంలో జోలపాట, లాలిపాటలు, మేలు కొలుపు పాటలు ఆధ్యాత్మిక ప్రబోధాలు, జావళులు ఉన్నాయి.

త్యాగరాజ స్తవం మొదట చేశారు. ఇందులో ఉన్న అన్ని పాటలకు రాగ తాళ నిర్దేశం చేశారు. కాని స్వరపరచలేదు. శృంగారరసాదులను ఉపయోగించి ఎన్నో రచనలు చేసిన త్యాగరాజును రుద్రప్రియరాగం - ఆదితాళంలో స్తుతి చేశాడు రచయిత. మంత్రతంత్రాలను నేను ఎరుగను నిన్నే ఎప్పుడూ తలుస్తూ ఉండే దాసులకు నేను దాసుడనయ్యానని 'రామకృష్ణనుత' అనే ముద్రతోరాశారు.

ఆ తర్వాత సరస్వతీ స్తోత్రం కళ్యాణిరాగం రూపకతాళంలో "వాణీ"! నుతశర్వాణి వనజాతాసనరాణి" అంటూ స్తుతించారు. ఈ పుస్తకంలో ఇంకా వినాయకస్తుతి శ్రీరాగం, నాటకురంజి రాగం, హంసధ్వని కళ్యాణి, నాటరాగాల్లో సుబ్రహ్మణస్తుతి హంసనందినిలోనూ కామాక్షి స్తోత్రం, గౌళ, భైరవి, అభోగి, ఆనందభైరవి, జంఝూటి, కళ్యాణి, సావిత్రి రాగాల్లోను. సింహపురి లక్ష్మిని గురించి మధ్యమావతి రాగం, నాయకి రాగాలలోనూ రాశారు. శ్రీనరసింహస్తుతి మాల్‌కోస్ రాగం, తోడి, పున్నాగవరాళిలో ఈశ్వరస్తుతి, సరస్వతీ, శంకరాభరణ, మోహన రాగం, చక్రవాకం, ఖమాసు రాగాల్లోను రాశారు. హంసధ్వని, రామప్రియ, పున్నాగవరాళి, కర్నాటక గాంధారి, కానడ, ఖరహరప్రియ పూర్వీకళ్యాణి, బేగడ ఇంకా చాలారాగాలలో విష్ణువు మీద రచనలు ఉన్నాయి.

అన్ని కీర్తనలు దైవ స్తుతులే. ఇందులో పల్లవి, అనుపల్లవి చరణం కొన్ని కీర్తనలకు ఉంటే కొన్ని కీర్తనలకు పల్లవి, అనుపల్లవి, చరణం, అనుచరణం అని రాశారు. మరికొన్నికీర్తనల్లో ఉపచరణం అనేది ఉంది. అయితే ఈ పదాలు రెండవ చరణానికి మారుగావాడి ఉండవచ్చును.

కొన్ని కీర్తనలు పల్లవి ఎంత నిడివి ఉంటుందో చరణాలూ అనుపల్లవులు కూడా అంతే నిడివి ఉన్నాయి. మరికొన్ని కీర్తనల్లో పల్లవి రెండు పంక్తులైతే అనుపల్లవి ఒకటే వాక్యంగా ఉండి చరణం మూడు వాక్యాలుగా ఉన్నాయి.

ఒక కీర్తన కేదార గౌళ రాగంలో - ఆదితాళంలో

"కలడా లేక లేడా రాముడు - కలనైన గాన రాడే మనసా

కలదని చెప్పిన - పెద్దల మాటలు - కలదాయెనా లేక లేదాయెనా

అంతవాడని యందురే జగ - మంతా వాడనియందురే

అంతరాత్ముడే రాముడుండ యిల - వింతగాదే గానరాక యుంట - **4**

ఈ ప్రకారంగా సాగే ఈ కీర్తనకు పల్లవి అని మాత్రమే పైన రాశారు. తక్కిన అనుపల్లవి మొదలైన అంగాలు లేవు. అన్ని చోట్ల తానే ఉంటాడని, అంతావాడేనని పెద్దలు రాముని నుతించారు. కాని నాకు కలలో కూడా అంతరాత్ముడైన ఆ రాముడు అగుపడటం లేదు. కలవరంతో వానిని జూడాలని అనుకున్నా - కాని పలకడం లేదు - ఏనాడూ రాముని చులకనగా చూడలేదు, మనసులో తలచలేదు. ఒకరోజు రాముని కీర్తించడానికి మృదువుగా పాటలు కూర్చి పాడుకున్నాను. ఆనాటి రాత్రి నాముందర ప్రత్యక్షం అయినట్లే అయి మాయమయ్యాడు. రామకృష్ణ నుతుడు రాముడు రమ్మని ఎంతవేడినా మరి కనబడలేదు. అని ఈ పాటలో రామ దర్శనం కోసం ఆర్తిగా కేదార రాగంలో భజిస్తాడు.

"వానిభజనము - లలితముగా వాని గూర్చి పాడగ"[5] ఇది రామకృష్ణ గారు రాసిన పాటల లక్షణంగా చెప్పవచ్చు. నుతులన్నీ కూడా లలిత పదాలతో కూర్చారు.

యదుకుల కాంభోజిరాగం - ఆదితాళంలో

హనుమంతుని మీద కీర్తన

"హనుమంతా బలవంతా - ఘనవంతా బ్రోవుమా

ఇది పల్లవి

ఇక మిగిలిన భాగం చరణాలే -

నిన్ను సన్నుతించలేదా - నన్ను బ్రోవగారాదా!

కన్న తండ్రివి కాదా - కాపాడుటకు వాదా

కిన్నర నుతపాదా - సన్నుతి జేసెదా॥

ఇదే విధంగా మూడు వరుసలు ఒక చరణంగా రాశారు.

ఇందులోని ఒక చరణంలో

కలరాను బారదోలు - కరుణతో మమ్మునేలు

చలమేలా శ్రితలోలా - సమయము యిది వేళా

ఇలలోన భక్తపాలా - యిది యేమిదయాళు"

శారీరకమైన రోగగ్రస్తుడై తనను పట్టుకొన్న వ్యాధి కలరా అని స్పష్టపరచాడు. ఆ వ్యాధిని పోగొట్టుమని తన్ను ఆదుకోవడానికి ఇదేతగిన సమయమని వేడుకుంటాడు. మరో చరణంలో "శ్రీ తిరుపతిపురవాస - హరిప్రియ భక్త దాస వర రామకృష్ణ పోష - ఆదరించుము యీశ" అని తిరుపతి పట్టణంలో వెలసిన

హనుమంతుని స్మరిస్తాడు.[6] అలాగేసింహపురిలో వెలసిన రంగనాథుని హిందోళ రాగం - ఆదితాళంలో కోరి కోరి నిన్ను పిలిచి సేవించు కుంటున్న నాతోటి నీకెందుకు వాదు! మారు పల్కవేమని భవ భయబాధలను పోగొట్టి పాపాలను పరిహరించు, ఈ విధంగా హింస పెట్టడం నీకు సమ్మతమా!

"లవమైనను పుణ్యమునవే వనిని - జేయలేదె నామనవిని వినుమా!

అవనిలో రామకృష్ణ వినుతా! సింహపురనిజదాస వందితా![7] అని కీర్తిస్తాడు.

అదే విధంగా భైరవి రాగం - ఆదితాళంలో

"బిగువులు సేయతగదురా హరీ" అనే కీర్తన చరణంలో

పాలను ముంచిన - నీరగలంచిన

భారమునీదని - పల్కితిరాధరా - పాల - పాలకడలి శయన ప్రభో!

వరద రామకృష్ణ నుత పాదపంకజా!"[8]

ఒకప్పుడు రచయితది బాగా ఉన్న సంపన్నుల కుటుంబం' కానీ పరిస్థితుల వల్ల "బ్రతికి చెడిన వాడయినాడని" పరిచయంలో కోదండ రామి రెడ్డిగారు రాశారు.[9]

ఆవేదన, ఆనందం రెండూ రసావిష్కరణ చేయడానికి ఆధారాలు. అలాంటి జీవిత కష్టాల కడలి ఈదడానికి మానసికంగా కొంత స్థైర్యం కావాలి. అది లేనినాడు భగవంతుడే మనకు దిక్కు పాల సంద్రంలో తేలియాడు తున్నా పాలముంచడమా నీట ముంచడమా అనేది ఆ మహావిష్ణువుకే వదలి వేశారు.

దైవాన్ని ప్రార్థించడం అంటే తనకు మేలు చెయ్యమనే కోరుకుంటారు గాని కష్టాల నిమ్మని ఎవరూ కోరుకోరు. సుఖాన్ని కలిగించేలా చేస్తాడనే మనం నమ్ముతాం - ఆ నమ్మకమే భగవంతుడు.

మరొక కీర్తన - సింహపురి రంగనాథస్తుతి -

సింహేంద్ర మధ్యమం - త్రిపుట తాళంలో

పల్లవి: "పాదములే నమ్మితి - సాదరముగ బ్రోవమని వేడితి"

అనుపల్లవి : యాదవేంద్ర సర్వ - వేద స్మృతి పురాణ - శోధనకబ్బని - మాధవ వరదా!

చరణములు

1. పులిశాయుధుని కివ్వ - బలిచే త్యాగము తీసి
   యిలనాకసములను - గొలిచిన యట్టి -"
2. సరసీరుహానే త్రులరుదుగ - గోపసుం
   దరుల - వారి కుచ -గిరుల జేర్చిన నీ॥
3. గంధర్వులప్సరస - లందరు వీక్షింప
   బృందావనమున నిం - పొందనాడిన నీ॥
4. శ్రీరథాంగ శంఖ - సారస - రేఖాద్య
   పార లక్షణ - శుభాకారమైన నీ॥
5. వెన్నుడైన నిన్ను - కన్నడ సేయుగ
   గ్రన్నన శకటుని - దన్ని త్రోసిన నీ॥

6. కేళీలోల వ్రజ - నాళికాక్షులు జూడ

కాళీయ ఫణి పాళి - పోళి ద్రొక్కిన నీ ॥పాద॥

7. సుమహిత మహిమగౌ - తమ సతి కలుషము

కమనీయ కృపచే స - ర్వము నణచిన నీ ॥పాద॥

8. మంగళ గరుడ తు - రంగ - గమన పాండు

రంగ పావన దివ్య - గంగను గన్న నీ ॥పాద॥

9. భాసుర తిరుపతి వాస - రామకృష్ణ

దాసుహృదయ వి - లాసమైన నీ ॥పాద॥[10]

తొమ్మిది చరణాలున్న ఈ కీర్తనలో శ్రీకృష్ణుని లీలలు వివరించాడు. బలి త్యాగం, వామనావతారం గోప స్త్రీలతో కళా కేళి, బృందావనంలోని లీలలు ఈ విధంగా ఒక్కొక్క చరణంలో వర్ణించారు.

శకటాసుర సంహారం కాళీయ మర్దనం, గౌతమిసతి కలుషాన్ని అణచడం వంటివి ఈ కీర్తనలో స్పష్ట పరిచారు.

రామకృష్ణ రాసిన జోలపాట నిద్ర కొచ్చిన పసిపిల్లలను మన తల్లులు జోకొడుతూ పాడే జోలపాటను గుర్తు చేస్తుంది.

నీలాంబరి రాగం - ఝంపె తాళంలో

1. "బంగారు తొట్టిలో - పవ్వళించర సామి

రంగా నిదుర బోర - జోలపాడేరా"

అంటూ జోకొడుతూ రెండో చరణంలో చంక దిగని పసిబాలుడిలా ఎంతో ఎత్తు మరిగావు. ఏం చెయ్యాలి రంగా! అండపిండాల్లో వెలిగేటి వాడవు రంగా! అంటాడు. దొంగ చూపులు చూసే పసివానినిగా భావించి ఆవాడి చూపులలో ఆ పాడువగలేమొ అదేమి చిరునవ్వో రంగా! జోలపాట పాడుతుంటేహాయిగా వింటావు పాడడం మానేస్తే "నన్ను గుర్తు చేసుకో" అన్నట్లుగా ఏదోవిధంగా సూచనిస్తావు. పామరులను సైతం క్షేమంగా చూసే రంగా! ఈ రామకృష్ణ నీ దాసుడునన్ను బ్రోవవయ్యా! అంటాడు.

తర్వాత నిద్రబుచ్చిన రంగని మేలు కొలుపుతాడు బౌళిరాగం - ఆదితాళంలో.

తప్త కాంచన వీణ మీటుతూ నీ లీలలు భక్తులంతా ఒక దగ్గర చేరి పాడుతున్నారు. నిను విడిచి ఒక్కక్షణం కూడా నేను ఉండలేను. వెంటనే మేలుకోవయ్య శ్రీ రంగా అని పాడతాడు.

రామకృష్ణ రాసిన కీర్తనలన్ని'రామకృష్ణదాస' 'రామకృష్ణనుత' అనే ముద్రతో ఉన్నాయి. కీర్తనలో తిరుపతి వేంకటేశ్వరుని ఎక్కువ స్మరించాడు.

ఐహిక విషయాల్లో అనాసక్తుడై ఆత్మ బోధ చేసుకుంటూ రాసిన కొన్ని కీర్తనలున్నాయి. కుచ్ఛితమైన మాటలతో కుళ్ళ పొడిచే జనులు ఎదురుగా పచ్చగా ఉండే వాళ్ళని చూడడం ఇష్టం లేకుండా ఏవేవో ఇష్టం లేని మాటలను చెప్పే జనులు ఈ భూమ్మీద గోముఖ వ్యాఘ్రాల్లా అందరికీ ద్రోహం చేస్తూంటారు. ఎక్కడైనా సరే భగవంతుడు ఒక్కడే అనే విచక్షణ ఉండని అల్లాంటి మూర్ఖులను నీవే దయతో బ్రోవవలెనని అందులోని భావం. అందరు వాగ్గేయ కారులలాగే రామకృష్ణ కూడా గొప్ప సంగీత శాస్త్రజ్ఞానం ఉన్నవాడు. భగవంతుని స్వరూపమే సంగీతమని, సాంఖ్యం, ప్రక్వణం, ప్రణవం అన్నీ సాక్షాత్కరిస్తాయనీ, అటువంటి సంగీత విద్వాంసులకు మొక్కుతానని అంటాడు చక్రవాకరాగం - ఆదితాళంలో.

"సామజగానశా - ద్రీకులకు మొక్కెద - రామకృష్ణ నుతుని వేడ యిలలో[11]

"తత్వాలలో అవతార గాథలను స్మరిస్తాడు. తోడి రాగం - ఆది తాళంలో సోమకుడు వేదాలను ఎత్తుకు పోయి సముద్రంలో దాక్కుంటే మీనంలాగే వెళ్ళి వేదాలను రక్షించాడని ఆదికూర్మం అయి మంధర పర్వతాన్ని ధరించాడని, హిరణ్యకశిపుని పీచమణచడానికి స్తంభంలో ఉద్భవించి బాలుడైన ప్రహ్లాదుని రక్షించాడని, పరశురాముని గండ్రగొడ్డలి పట్టి రాజులను ఛేదించాడని, రాముని అవతారమెత్తి రావణుని దునిమాడాడనీ రేపల్లెలో అవతారమెత్తిన గోపాలుడనీ బౌద్ధాకృతిదాల్చాడనీ, తిరుపతి వేంకటేశ్వరుడయ్యాడని దశావతారాలను తత్వంలో కీర్తించాడు.

మరొక తత్వంలో

జంఝూటిరాగం. ఆదితాళం

శ్రీవెంకటేశు పదాలను విడవకుండాపట్టుకో

కోపతాపాల ముక్కునిచెయ్యి

దీనుల పాలిట దయామూర్తిగా మెలగు

నానారూపాల్లో ఉండే భ్రాంతిని పోగొట్టు

నారాయణ పద తులసీ వాసనలను సమసరగనుపట్టు

ఇతర వాసనలను దూరం చేసుకో

మంచి కథల వినడానికి కర్ణాలను ఎక్కువెట్టు

కామినులాడే అబద్ధపు మాటలు విని వివేకము

కోల్పోకు అని ఈ విధంగా బోధలు చేస్తాడు. తత్వం ఈ రీతిగా రాయడంలో కొంత మందికి మాత్రమే సాధ్యం.

ఇక కీర్తన సుధాలహరిలో చివరిగా నాలుగు జావళులు, మూడు ఆత్మబోధాత్మకంగా పదాలు చేర్చారు.

సురటి రాగం, మాయా మాళవగౌళ, కళ్యాణి, భైరవి రాగాల్లో జావళులు శృంగారాత్మకంగా ఉన్నాయి. ఇందులో నాయకులు తిరుపతి వేంకటేశ్వరుడు,,గోపాలుడూను. ఒక నాయిక గోపాలునితో ఏకాంతసేవకు ఏకాంత స్థలానికి రమ్మనడం మనోహరంగా ఉంటుంది. ఇందులో ఆరు చరణాలున్నాయి.

"కళ్యాణి - రాగం - ఝంపెతాళం

"చెలులు దెలుపగ - దెలిసెరా నీవగలు - చెలికాడ గోపాల।

యిచటనే గూడితే - యెవరైన నవ్వరా ఒక పూట

మాయింటికే రార గోపాల అలదాని వలను బడి అలసి వచ్చితివిరా -

కలసి మెలసేవేళ తల ఏల వంచేవు కలను గలసిన ప్రేమ - నిజమాయె గదరా వలపు

నిలుపలేర పలుక కున్నావేర మొలక నవ్వు లొలుక - మోము జూపరనాతో తొలుత

చెలిమిని కళలు గులక గలవర కృష్ణ ప్రేమ లేకన నిన్ను యిన్నాళ్ళు గోరితిరా - తామసింపకుర

శ్రీరామకృష్ణ నుతా[12]

ఒకటి కార్వేటి నగర వేణుగోపాలుని పేరుతో రాసిన జావళి, శహన రాగంలో పల్లవి, అనుపల్లవి, చరణాలు హేమలత, ముఖారి, కానడ, సావేరి రాగాలలో కూర్చిన పంచరాగమాలిక ఒకటి కార్వేటి నగర వేణు గోపాలుని మీద పదంలా రాశారు. ఇది కూడా శృంగార భరితమైంది.

పంచరాగమాలిక - చాపు తాళం

1. శహనరాగం

పల్లవి: "కలువ తావులు లేక - అలుక కొన్నది గాని వలపు నిలుపలేక - కలత చెందినదిరా॥

అనుపల్లవి: అలరు విల్తుని బారి - కలరి వెతల జెంది చెలియ ఎవ్వరితోను - చెలగి మాటాడదుర॥

1. చరణం: హేమలతరాగం

నాటి నీదగు కన్ను మీటులదలచి - నా

బోటి నేటికి గూడ - పాటు బడుచున్నది॥

2 చరణం : ముఖారి రాగం -

సాటిలేనిమ దను - ధాటి కోర్వగలేక

మాటి మాటికి నిన్ను - మది దూరుచున్నది

3 చరణం : కానడ రాగం -

కోపగించుటగాదురా - కోమలాంగానిన్నే

కోరి విరహతాప భారమొందినదిరా. యా॥

4 చరణం సావేరిరాగం -

పరితాపము - యలవికాదుర తెల్ప

కార్వేటి నగర - గోపాల మ్రొక్కెదనురా॥[13]

ఇటువంటి రచనలు ప్రాచీన గ్రంథాల్లో అతి తక్కువగా లభ్యమౌతాయి. తచ్చూరి సింగరాచార్య సోదరకృత సంగీత గ్రంథాల్లోను, ఆదిభట్ల నారాయణదాసుమొదలైన వారు చేసిన రచనలూ ప్రయోగ వైవిధ్యం కోసం చేసినవిగా కనిపిస్తాయి. యీసం రామకృష్ణగారి కృతమైన 'కీర్తన సుధాలహరి'7లోని కీర్తనలు, జావళులు, పంచరాగ మాలికాపదం సంగీత విశ్వంలో చిరస్థాయిగా నిలుస్తాయి.

# రెండవ భాగం

# సంస్థాన కళాకారులు

## చెలుకూరి కృష్ణయ్య (కాలం వివరాలు తెలియవు)

కార్వేటి నగర సంస్థానంలో వెంకటపెరుమాళ్ళురాజు కాలంలో ఆస్థాన పండితులు చెలుకూరి కృష్ణయ్య. సంస్కృతాంధ్ర భాషల్లో పండితునిగా ఉన్న కృష్ణయ్యగారు సంగీతాన్ని స్వయంగా అభ్యసించి సాధన చేసారు. నిరంతరం సాధన చెయ్యడానికి కార్వేటి నగర సంస్థానంలో కోట సమీపంలో ఉన్న పెద్ద వృక్షం కింద కూర్చునేవారు. వందలాది మంది కూర్చోడానికి వీలుగాఉన్న ప్రదేశం అది. అక్కడే కూర్చుని తాను సాధన చెయ్యడమే కాకుండా ఎంతో మంది విద్యార్థులకు సంస్కృతాంధ్రాలతో బాటూ సంగీతం కూడా చెప్పేవారు. నియమ నిష్ఠలతో ఆచార బద్ధుడైన కృష్ణయ్య గారు మరెక్కడికీ వెళ్ళినట్లు సంగీత సభ చేసినట్లుగా కనిపించదు. కృష్ణయ్య త్యాగరాజాదుల భక్తిగాన సంప్రదాయాన్ని ఎక్కువ అభిమానించేవారు. "ఆయన ఎప్పుడు పాడినా సంగీతత్రయం కీర్తనలు, కృతులే పాడేవారు. కర్ణాటక సంప్రదాయమంటే వారిదే అనేవారు. నెరవల్ చేసి స్వర కల్పన చేయడంలో దిట్ట. సంగీత వ్యాప్తికి గురుకులం ఏర్పాటు చేశారు. ద్వారం వెంకటస్వామి నాయుడు గారు వయొలిన్ సహకారంతో ఒకసారి కృష్ణయ్యగారు గానకచేరీ చేసారు."[14]

### అధస్సూచికలు

1. అప్పలస్వామి, పురిపండా.(సం) సారంగ పాణి పదములు సరస్వతీ పవర్‌ప్రెస్, రాజమహేంద్రవరము - 1963. పీఠిక 5 - పుట - 6
2. " అదే " పుట - 6
3. శ్రీనివాసయ్యంగార్,(సం),సంగీత సుధాంబుధి-ఎమ్. ఆదీ అండ్ కంపెనీ, చెన్నపురి 1929-పుట- 113
4. రామకృష్ణయ్యాసం.- కీర్తన సుధాలహరి, మందాకిని ప్రెస్, నెల్లూరు - 1964 - పుట - 44,
5. " అదే " పుట - 44
6. " అదే " పుట - 54
7. " అదే " పుట - 55
8. " అదే " పుట - 57
9. " అదే " పరిచయం పుట VI
10. " అదే " పుట - 61
11. " అదే " పుట - 96
12. " అదే " పుట - 104
13. " అదే " పుట - 107.
14. కృష్ణయ్యగారి కుమారుడు జయచంద్ర శాస్త్రి ఇచ్చిన సమాచారం.

# 8. బొబ్బిలి సంస్థానం

గజపతి నగరం, చికాకోలు, పార్వతీపురం పాలకొండ సాలూరు ఈ ప్రాంతమంతా బొబ్బిలి సంస్థానం కింద ఉండేది. బొబ్బిలి పాలకులు వెలమ దొరలు, పిఠాపురం, వెంకటగిరి, బొబ్బిలి - ఈ సంస్థానాల మూలపురుషుడు ఒకడే.

16వ శతాబ్దంలో మొఘల్ పాదుషా సేనాని షేర్‌ముహమ్మద్‌ఖాన్ కళింగ దేశాన్ని స్వాధీనం చేసుకోడానికి ఏతెంచాడు. యాచమనాయకుని కుమారుడు పెదరాయుడు షేర్ ఖాన్‌కి సహాయకునిగా ఉండి, అతని నుంచి కొంత జాగీరును ఇనాంగా పొందాడు. ఆ జ్ఞాపకార్థం షేర్‌ఖాన్ పేరు మీద యాచమనాయకుని కుమారుడు పెదరాయుడు బొబ్బిలి నగరాన్ని నిర్మించాడు.[1]

1757 లో బొబ్బిలి యుద్ధం జరిగే వరకు సంస్థానాన్ని నిలబెట్టుకోడం వంటి కారణాల వల్ల బొబ్బిలిలో కళాభ్యుదయం అంతగా జరగలేదు. 1802 నుండి బొబ్బిలి సంస్థానం ప్రశాంత వాతావరణాన్ని పెంపొందింప చేసుకుంది. అంతకు ముందు ఏడు తరాల వరకూ కూడా ఈ సంస్థానం అల్ల కల్లోలంగానే మనుగడ సాగించింది. ఈ సంస్థానంలో రాజా రాయుడప్పరంగారావు, రాజాశ్వేతా చలపతి రంగారావు వేణు గోపాల స్వామి ఆలయ నిర్మాణానికి కారకులు. వీణ, వైణిక విద్వాంసుల పరంపరాగమనానికి ఆద్యులు బొబ్బిలి సంస్థానాధిపతులు. ఇప్పటికీ సంగీత లోకమంతా ఇంచుమించుగా ఒకే సంప్రదాయాన్ని వీణలో అనుసరిస్తున్నది. ఆ సంప్రదాయమే వాసావారి వీణా సంప్రదాయం.

ఈ వాసావారి కుటుంబం బొబ్బిలి సంస్థానాధిపతుల ఆదరణలో విలసిల్లింది. బొబ్బిలి సంస్థానంలో వీణ తయారు చెయ్యడం ఎప్పటి నుంచి మొదలైంది అనే విషయం పరిశీలించ దగింది.

"రమారమి 300 సంవత్సరాల క్రితం ఒకప్పుడు సందర్భవశాత్తూ అప్పటి బొబ్బిలి రాజా వారు మైసూరు సంస్థానానికి వెళ్ళారు. మైసూరు రాజావారి దర్బారులో వైణికులు వీణ వాయించారు. అది విని ఆనందించి బొబ్బిలి రాజావారు మైసూర్ రాజావారిని వీణ తయారు చేసే పద్ధతి గురించి అడిగారు. వీణ తయారు చెయ్యడం ఆ విధంగా తెలుసుకున్న బొబ్బిలి రాజాగారు తన సంస్థానంలో పనిచేస్తున్న వడ్రంగుల నిద్దర్ని "వీణ తయారు చేయడం నేర్చుకోడం కోసం[2] మైసూరు పంపించారు. అప్పటి నుండి బొబ్బిలిలో వీణ తయారు చెయ్యడం ఆరంభం అయింది. పనస, సంపెంగ చెక్కలతో వీణ చేస్తారు. మరో విచిత్రం మైసూరు, తంజావూరు వీణలు అప్పట్లో మూడు ముక్కలు కలిపి చేసేవారు. మొదట్లో బొబ్బిలిలో కూడా అదే పద్ధతి ఉండేది. కాలక్రమేణా "ఏకాండి ముక్కతోనే వీణ తయారు చెయ్యాలనే కృషి ఫలితంగా ఒకే చెక్కతో వీణ తయారు చెయ్యడం మొదలు పెట్టారు."[3] అప్పటి నుండి మిగిలిన ప్రాంతపు వీణల కంటే బొబ్బిలి వీణ ఎక్కువ ప్రాధాన్యతా ప్రాచుర్యాలను పొందింది.

సంగీత సంబంధ వాద్యం వీణ తయారీలో ప్రోత్సహించిన ఘనత ఆంధ్ర దేశంలో బొబ్బిలి సంస్థానానికి దక్కింది. జాతీయ స్థాయిలో వీణల తయారీకి బొబ్బిలి ప్రఖ్యాతి గాంచింది. తొలి సంస్థాన పాలకులు ఇక్కడి వీణలను ఇతర సంస్థానాలకు బహుమతులుగా పంపేవారు.

"రాయలు వీరభద్రం అనే అతను వీణలను తయారు చెయ్యడం గురించి ఆధునికకాలంలో విజయనగరం నుంచి వచ్చాడని చెప్తారు.[4] బొబ్బిలిలో బహుమతి వీణల పరిశ్రమ ఇప్పుడూ కొనసాగుతోంది. సర్వసిద్ధి అచ్చన్న, వీరన, అలజంగి సీతారామస్వామి, అప్పలస్వామి మొదలైన వారు వీణలు తయారు చేస్తున్నారు.

బొబ్బిలి రాజావార్లు స్వతంత్రంగా సంగీతాభ్యాసం చేసినట్లు దాఖలాలు లేవు. కానీ రాణులు మాత్రం వీణలు నేర్చుకొని దైవధ్యాన సమయంలో వీణ వాయించుకొనే వారు. కోటలో ఒక పూజా మందిరం ప్రత్యేకించి వుండేది. ప్రతి రోజూ అక్కడికి వెళ్ళి సంగీత విద్వాంసులు పాటలు పాడేవారు. వీణ వాయించేవారు. ఆ పూజా మందిరంలో వీణా గానాన్ని అభ్యసించేవారు. బొబ్బిలి సంస్థానానికి చెందిన వి.ఎ.కె. రంగారావుగారు తన పెద్దమ్మగారు వీణవాయించే పద్ధతిని వివరించేరు.[5]

బొబ్బిలి రాణి సుభద్రమ్మగారు స్వయంగా "శ్రీకృష్ణదాసి కృతులు" అని కొన్ని పాటలు రాసారు. పుస్తకరూపంలో ప్రచురించారు. ఆమె దగ్గర లలితాంబ, సీతారం అనే ఇద్దరు దేవదాసీలుండేవారు. వాళ్ళనుండి బొబ్బిలి రాణిగారు.

"ఏకాదశి ఫలమేమని చెప్పుదు పార్వతి"; "రేపువత్తువుగాని"; "తూర్పు తెలవారె"; "మగడొచ్చి పిలిచాడు" అనే జావళీలు చెప్పించుకొని పాడేవారు.

ఆమె వీణ మీద హిందీ పాటల కట్టును (ట్యూన్) వాయించేవారు. భగవంతుని మీద తాను రాసుకున్న పాటలను వీణ మీద పలికించేవారు. ఆమె కళ్ళు మూసుకుని వీణమెట్లు చూడకుండా వీణ వాయించేవారు. అలాగే బొబ్బిలి రాణివాస స్త్రీలంతా ఇంచు మించు సంగీతాభ్యాసం చేసినవారే.

"1940 ప్రాంతాల్లో ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో బొబ్బిలి రాణిగారి సోదరి వీణ వాయించారు. ఇప్పటికీ వారు సజీవులు, వృద్ధులు"[6]

శ్రీ కృష్ణదాసి కృతులు

బొబ్బిలి మహారాణి సుభద్రాదేవిగారు రాసిన ఈ పాటలు 1965లో ముద్రితాలు. బొబ్బిలి సంస్థానంలో వెలసిన వేణుగోపాలస్వామికి అంకితాలుగా రాశారు ఈ కృతులు. మంగళ గీతాలతో మొత్తం 128 కృతులు ఈ పుస్తకంలో ఉన్నాయి.

పల్లవి, అనుపల్లవి చరణం అనే అంశాలు ఏ కృతికీ లేవు. కేవలం భజనకు మాత్రమే రాసినట్లుగా ఉన్నాయి. రాగ, తాళ నిర్దేశం ఉన్నది కానీ ఈ కృతులు స్వరపరచలేదు.

పూరీ కళ్యాణి, మోహన, జంఝూటి, కేదార, అభేరి, కళ్యాణి, ఆరభి, మాయామాళవగౌళ, ఆనంద భైరవి మొదలైన ప్రసిద్ధ రాగాలలో ఈ పాటలు కూర్చారు. ఏకతాళం, త్రిశ్రగతి, ఆదితాళాలలో కృతినిర్దేశం చేశారు. తన చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం, పసితనం నుండి సంగీతం వీణాభ్యాసాల వల్ల ఈ రచనలు చేయగలిగే నైపుణ్యంఅలవడింది.

# మొదటి భాగం

# సంస్థానంలో వాగ్గేయకారులు - వాఙ్మయం

## గుమ్మలూరి వేంకట శాస్త్రి (కాలం వివరాలు అలభ్యం)

ఈయన బొబ్బిలి ఆస్థాన విద్వాంసుడు. వైణిక ప్రవర పట్కాల స్వర పల్లవి ప్రవీణ వెంకటశాస్త్రి వాసా అప్పయగారి ప్రియతమ శిష్యుడు. పసితనం  నుంచే సంగీతం మీద అభిమానం. గురువాత్సల్యం, స్వయంకృషి ఇవన్నీ తోడయి శాస్త్రి గారిని మంచి సంగీత విద్వాంసుణ్ణి చేశాయి. మంచి తనం, చలాకీతనం. అందమైన రూపం ఉన్న వెంకట శాస్త్రి గారంటే గురువైన అప్పయ్యగారికి ఎంతో ప్రేమ. గురువు గారంటే శిష్యునికీ గౌరవమే. వీరిద్దరి పరిచయం చాలా విచిత్రంగా జరిగింది. ఒకప్పుడు వాసా అప్పయ్యగారు ఎవరో బంధువుల ఇంట్లో వివాహం జరిగితే ఆ సందర్భంగా వీణాగానం చేస్తున్నారు. పెళ్ళి పందిట్లో ఎవరికేది కావల్సినా అన్నీ అందరికీ అందిస్తూ ఒక అబ్బాయి చాలా హుషారుగా తిరుగుతూ అందర్నీ ఆకర్షించాడు. భోజన సమయంలో పెద్దలకు నెయ్యి, ఉప్పు వడ్డిస్తూ విసన కర్రతో విసురుతున్నాడు. భోజన మయ్యేంతర్వాత గోవిందా గోవిందా అని అందరూ విస్తళ్ళ దగ్గర నుంచి లేచారు. ఓ ముసలాయన ఆ పిల్లాణ్ణి "ఒరే వెంకన్నా! ఏదీ రాగయుక్తంగా ఒక పద్యం చదవరా!" అని అడిగాడు.

ఆ కుర్రాడు బిలహరి రాగంలో నీలమేఘ శ్యామ ! అని చదివి వినిపించేడు. అతడే గుమ్మలూరి వెంకట శాస్త్రి. ఆ గొంతు శ్రావ్యమైన పద్య పఠనమూ విన్న అప్పయ్యగారు ఆ తొమ్మిదేళ్ళ అబ్బాయిని తన శిష్యునిగా స్వీకరించి సంగీతాభ్యాసం చేయించారు. రెండు మూడు సంవత్సరాల్లోనే వెంకట శాస్త్రి గొప్ప విద్వాంసుడై తన తోటి వారిని మించి పోయాడు. అక్కడక్కడా సంగీత పోటీలు జరుగుతున్నప్పుడు శిష్యుణ్ణి వెంట తీసుకెళ్ళి పోటీల్లో పాల్గొనేటట్లు చేసేవారు గురువుగారు. పోటీల్లో వీణ వాయించడంలో ప్రథమ బహుమతి శాస్త్రికే దక్కేది. వీరిద్దరి గురు శిష్యానుబంధం ఎంతో మందికి ఈర్ష్య కలిగించేది. ఒకసారి వెంకట శాస్త్రి గాత్రంలో కూడా పోటీ చేశాడు. పూర్తి స్థాయిలో పాఠం చెయ్యని హరికాంభోజిరాగాన్ని ఆలపించి "రామనన్ను బ్రోవరా" అని కీర్తన పాడి, స్వర కల్పన ఏ చోట వెయ్యాలని సందేహించాడు. సభలో వారు "ఏం నాయనా! వెనక ముక్కరాకనా! ముందు ముక్కతోచకనా! ఆగిపోయావు" అని అవహేళన చేశారు. అప్పుడు గురువుగారు తన శిష్యుడి అంతర్యాన్ని గ్రహించి, అబ్బే ! అదేం కాదయ్యా! ముందు గరి నిలుపా వెనకదని వెసులా! అని సందేహిస్తున్నాడు అని వాళ్ళకు సమాధానం చెప్పాడు. గురువు గారిచ్చిన ఆకిటుకు వెంటనే అందుకొని "పమగరి - రామనన్ను బ్రోవరా" అని స్వరకల్పన చేసి ఆరోజు వీణతో పాటు పాటకు కూడా ప్రథమ బహుమానాన్ని వెంకన్నే పొందాడు. ఆగురు శిష్య సంబంధం ఎంత గొప్పదో మరోసారి ఋజువయింది.

"ఒక రోజు బొబ్బిలి రాజావారు భామవేషం వెయ్యమని స్ఫురద్రూపం, సుకుమార గాత్రం వున్న వెంకట శాస్త్రిని అడిగారు. సంగీత విద్వాంసుడనైన నన్ను రాజావారు ఇలా అడుగుతారా! అని వెంకన్న బాధ పడ్డాడు. ఆకారణం చేత సంగీత సాధనకు భంగం కలిగింది. విషయం తెలిసిన అప్పయ్యగారు అతని మీద ప్రేమతో వెంకన్న మేధాశక్తికి, అభిమానానికి సంతోషపడి మామిడి తోటల్లో రాత్రిపూట రహస్యంగా సంగీత పాఠాలు చెప్పి వీణ సాధన చేయించేవారు.

తన దగ్గర విద్వాంసుడవటం మూలానా రాజావారు చెప్పిన పనల్లా చెయ్యాలని లేదా చేస్తారని అనుకొని "ఒకసారి బొబ్బిలి ప్రభువు వెంకటశాస్త్రిని ఒక డ్యాన్సు పార్టీలో వీణ వాయించమని అడిగారు.[7]

మహా అభిమానవంతుడైన వెంకట శాస్త్రికి కోపం వచ్చింది. వెంటనే "వెంకట శాస్త్రి వీణ వాయించడం మర్చిపోయాడు" అని కబురంపాడు.

అంతేకాదు అప్పటి నుండి వీణ వాయించ లేదు కూడా. అంటే సంగీత కళాకారులు శాస్త్రీయతతో బాటు సంప్రదాయం, కట్టుబాటూ అనేది అలవర్చుకునేవారు. వీణ గొప్ప వాద్యం. దాని ప్రత్యేకత మరింక ఏ వాద్యానికీ రాదు. అలాంటి వీణను డ్యాన్సు పార్టీలో గొప్ప విద్వాంసుడైన శాస్త్రిని వాయించమని రాజావారడిగితే తన వాద్యానికి, ప్రతిభకు, సంప్రదాయానికి విలువ లేకుండా పోయిందని వెంకట శాస్త్రి భావించారు. ఆ విలువలను కాపాడుకోవాలనే ఆయన అప్పటి నుండి వీణను స్పృశించలేదు.

ఈ అభిమాన వంతుడు స్వర ప్రస్తారం చెయ్యడంలో, రాగభావాన్ని స్ఫురింప చేస్తూ పాడటంలో మేటి. అన్నిటికంటే మించిన మార్దవం వెంకట శాస్త్రి గారి గాన లక్షణం. వీణ కూడా అలాగే వాయిస్తారు. వెంకట శాస్త్రిగారు స్వర పల్లవులూ స్వర జతులూ కీర్తనలు రాసారని వినికిడి. ఇప్పుడవేమీ లభ్యం కావడం లేదు. నందిగానం వెంకన్న, తుమరాడ సంగమేశ్వర శాస్త్రి వీరి శిష్యులే. గురువు అప్పయ్య మీద భక్తితో తన పన్నెండవ ఏట రాసిన రెండు సంస్కృత శ్లోకాలు రాశారు.

1 'సంగీత శాస్త్ర తత్వజ్ఞం సత్యసంధం దయానిధిం
అప్పయాఖ్యగురుంవందే వాసాన్వయ సుధాకరం ॥
2 సంగీత శాస్త్రార్థ రసానుభిజ్ఞముత్ఫుల్ల నీలోత్పల పత్ర నేత్రం
దయాలసన్మానస పద్మ సంస్థం వాసాప్పయాఖ్యం గురుమాశ్రయామి॥

## పల్లవోల్లాసిని

గుమ్మలూరి వెంకటశాస్త్రిగారి "పల్లవోల్లాసిని" అనే ఉత్కృష్ట గ్రంథం ఒకటి లభ్యమైంది. దీనికి సంబంధించిన ప్రచురణాది వివరాలు లభ్యం కాలేదు. ఇరవై తొమ్మిది పుటలున్న చిన్న పుస్తకం ఇది. సంగీతం రాగం, ఘనం, పల్లవి, కృతి భేదాలతో ఉన్నప్పటికీ పల్లవికి కృతికి తాళం అవసరం. అన్నిటికంటే పల్లవిలో స్వరం, సంగతి మొదలైన వాటి ప్రదర్శనలో కొంత చాతుర్యం ఉంటేనే గాని విద్వాంసులు వాటిని నిర్వహించలేరు. ఈ పల్లవి స్వరకల్పనతో ఏ అక్షరాలను ఎన్ని అక్షరాల నుండి ఆరంభించి పాడతారు ఆ వివరాలు సూత్ర ప్రకారం ఈ గ్రంథంలో వివరించారు. సర్వ సాధారణంగా గాన సభలలో విద్వాంసుల ప్రతిభ స్వరకల్పన నెరవల్ మొదలైన విషయాలలోనే ద్యోతక మవుతుంది. ఈ గ్రంథ పీఠికలో రచయిత ఈ విషయాలన్నీ స్పష్టపరిచారు. సంగీత శాస్త్రాభ్యాసకులకు, బోధకులకు ముక్తాయి పంపకాలు ఏ విధంగా ఉంటాయో వివరించడమే ఈ పల్లవోల్లాసిని ఉద్దేశమని రచయిత పీఠికలో చెప్పుకున్నారు.

ఈ పల్లవోల్లాసిని గ్రంథంలో తనగురువుగారైన వాసా అప్పయ్యగారిని స్తుతించారు. తర్వాత "స్వవిషయం"లో వేదుల వరహాలుగారనే ఆయన ఈ గ్రంథాన్ని తన గురువుగారి గురువుగారి నుండి పొందినట్లూ ఉదారులు ఎవరైనా ఈ గ్రంథాన్ని ముద్రించి సంగీతలోకానికి ప్రసాదించమని స్వయంగా గుమ్మలూరి వెంకటశాస్త్రి గారు కోరారని పుస్తక సంపాదకులు ఏం.వ. నరసింహాచార్యులు గారు చెప్పుకున్నారు.

పల్లవోల్లాసిని గ్రంథంలో ఉన్న విషయాన్ని సూచనా ప్రాయంగా స్వవిషయంలో ప్రస్తావించారు. ముక్తాయి అనే శబ్దానికి అర్థం చెప్పారు. పాడేటప్పుడుగాని వాద్యాన్ని వాయించేటప్పుడుగాని చివర మనం ఏ అక్షరాలను పాడి పల్లవి ఆరంభిస్తామో ఆ అక్షరాలకు ముక్తాయి అని పేరు.

ఈ ముక్తాయులు గురు, లఘు విధానాల చేత పంపకం చేస్తారు. 3, 4, 5, 6 అంకెల సూత్రాలు ముక్తాయి పంపకానికి అనుకూలమైనవి. కాలం చేత గుణించడం లేదా భాగించడం అనగా ఏ కాలానికి క్రియ ఒకటికి ఎన్ని అక్షరాలవుతాయో ఆ అక్షరాల సంఖ్యచేత గుణించడం లేదా భాగించడం చేసుకోవచ్చు.

ఉదాహరణకు : ప్రథమ కాలానికి 1 చేత, రెండవ కాలానికి 2 చేత, మూడో కాలానికి 4 చేత, నాలుగుకు 8 చేత ఈ విధంగా చేసుకోవచ్చు. ముక్తాయి అక్షరాలను లెక్కించే విధానం ఈ విధంగా ఉంటుంది.

రూపాయిలు కొన్ని పావలాలు, బేడలు, అర్ధరూపాయలు ఏకరాశిగా నున్నప్పుడు వాటిని మిగలకుండా ఏవిధంగా పంపకం చేస్తామో ఆవిధంగా ఏకాలపుటక్షరాలైనా మనకు కావలసిన సమకాలపుటక్షరాలను చేసుకొని తర్వాత ముక్తాయి అక్షరాలను పంపకం చేసుకోవాలి.

ఛందస్సులో గురు లఘు అక్షరాలను ఏ విధంగా ఎంచుతామో ముక్తాయి పంపకంలో కూడా అదే లక్షణాలను, నియమాలనూ పాటిస్తారు.

ధీ, దీం, దిం, దిహిః, దిక్కా, తాం, తోం ఇవి గురువు అక్షరాలు. ఒక అక్షరం రెండక్షరాలకంటే ఎక్కువ దీర్ఘం ఉండాల్సినప్పుడు ఆ అక్షరానికి పైన అంకెలు వేస్తారు. అప్పుడు అంకంతో లెక్క చేర్చాలి. ఉదా: తాం అనేది 2 అదే విధంగా తాళ నిర్ణయంలో కూడా పద్ధతులుంటాయి. ఉదాహరణకు : ఆదితాళంలో ఒకటవ క్రియపైన మూడవ కాలం అక్షరాలు మూడు విడిచి ఆరంభించే పల్లవికి 'తకిటదధిగిణత' అని ముక్తాయి సరిపెట్టాలి.

ముక్తాయి అక్షరాలు 8×3 = 24, వీటిని మూడవకాలంతో భాగిస్తారు. 24/4 = 6 ఈ సంఖ్య పల్లవి ఆరంభించే క్రియకు వెనుకటివగు 8, 7, 6,5,4,3 క్రియుల సంఖ్య అయి ఉన్నది. కాబట్టి ఈ ముక్తాయి 3వ క్రియ పైన 3వ కాలపుటక్షరాలు మూడు విడిచి మూడవ కాలంలో మొదలు పెడితే మూడు ముక్తాయులు పాడే సరికి పల్లవి అవుతుంది.

ఇటువంటి లక్షణాలు, నియమాలు వాటికి ఉదాహరణలు మొత్తం ముప్పది ఒక్కటిగా ఇచ్చారు. లఘువిధానపు ముక్తాయి పంపకం, వాటినియమాలు విషమ జాగాలో ఆరంభించు పల్లవికి ముక్తాయి పంపకం చేసేక్రమం, శబ్ద ముక్తాయుల గురించి, ఏతాళాలకు ఆయా కాలాల్లో ఆక్రియుల పైన సమకాలపు ముక్తాయుల అక్షరాలు, మిశ్రమకాలపు ముక్తాయులు రాసే క్రమం ఉదాహరణలతో సహా, ఉపిని గురించి, ఉపి రాసే క్రమం, ఉపి ఉన్న అక్షరాలను ఏ విధంగా లెక్కపెట్టాలి మొదలైన విషయ వివరణ ప్రశ్న జవాబు పద్ధతిలో వివరించారు. పూర్తి సంగీత లక్షణ పరిజ్ఞానం ఉంటే గాని అవగాహన కాదు. గురుముఖతః అభ్యసిస్తే గాని కొరుకుడు పడని గ్రంథం ఇది. ఇటువంటి ఉద్గ్రంథాన్ని రాసి సంగీతలోకానికి అందించిన మేటి సంగీత శాస్త్ర ఘటికులు గుమ్మలూరి వెంకట శాస్త్రిగారు. ఇటువంటి గ్రంథ పరిజ్ఞానం సంగీతాభ్యాసకులకు అత్యవసరం.

## జోస్యుల సూర్యనారాయణ శాస్త్రి (కాలం వివరాలు అలభ్యం)

బొబ్బిలి సంస్థానం ప్రభుత్వాధీనం కాకముందు జోస్యుల సూర్యనారాయణ శాస్త్రి చిట్ట చివరి ఆస్థాన విద్వాంసులుగా ఉన్నారు. చిట్టచివరి సంస్థాన పరిపాలకుడు రావు వెంకట కృష్ణ రంగారావుకి సూర్యనారాయణ శాస్త్రి వర్ణాలు. కీర్తనలు నేర్పిన సంగీత గురువు. రాజారంగారావుకి యుక్త వయసు వచ్చే సరికి శాస్త్రికి 50 సంవత్సరాలు దాటాయి. శాస్త్రిగారికి నెలకు 200/- రూపాయలు జీతంగా ఇచ్చేవారని మాత్రం చెప్పారు.

ఆ తర్వాత సంస్థానం ప్రభుత్వ పరం కావడంతో నారాయణ శాస్త్రికి ఇల్లు గడవడం కష్టమయింది. ఇతని పరిస్థితి చాలా కాలం తర్వాత సంస్థాన ప్రభువుకు తెలియడంతో పదివేల రూపాయలు చందా పోగు చేసి శాస్త్రికి ఇప్పించాడు. సంగీత విద్వాంసుడవటం వల్ల సంగీత అకాడమీ మద్రాసు వారు మరో 10,000 రూ॥లు ఇచ్చారు. ఈయన 84 వ ఏట మరణించాడు. జోస్యుల సూర్యనారాయణశాస్త్రి ఆకొండి నారాయణ శాస్త్రి శిష్యుడే.[8]

జోస్యుల సూర్యనారాయణ శాస్త్రి "భగవన్నుతులు" పేరుతో రాసిన మూడు రచనలు లభించాయి.

1. శ్రీరంజని రాగం - చతురశ్రజాతి ధ్రువతాళం; 2. శుద్ధ తోడి రాగం - చతురశ్రజాతి మఠ్యతాళం ఈ రెండూ వర్ణాలు, మూడవది - పంచతాళ లక్షణ గీతం - చతురశ్ర జాతి ధ్రువ తాళంలో ఉంది.

శ్రీరంజని రాగంలోని వర్ణం

పల్లవి : సరసుడ నిన్నే కోరియున్నదిర
సరగున వచ్చి బ్రోవ సమయమురా

అనుపల్లవి : బిరాన వరములిచ్చి పరాకు చేయక
కరుణ జూడ శ్రీవేణు గోపాల దాస పరిపాల"

చరణం : సారాసాక్షా! నన్ను బ్రోవరా! (చూడు అనుబంధం -III)

సర్వ సాధారణంగా వర్ణం, జావళి, పదం, స్వరజతి వంటి సంగీత రచనలు ఇంచుమించుగా శృంగార రస భూయిష్టంగా ఉంటాయి. నాయిక వేణుగోపాలుణ్ణి నాయకునిగా తనను ఏలుకోడానికి పరాకు చేయక రమ్మని వేడుకోడం ఈ వర్ణంలోని వస్తువు శృంగార రసపూరితమైంది. ఈ వర్ణంలో చెప్పుకోదగిన ప్రత్యేక లక్షణాలు మూడింటిని ఈ వాగ్గేయకారుడు వర్ణం క్రిందనే పేర్కొన్నాడు.

అందులో మొదటిది - వర్ణంలో పల్లవి మొదలు చరణ స్వరాల వరకూ ఉన్న మొదటి అక్షరాలన్నీ ఒక వరుసలో రాస్తే రాగమేళం తయారవుతుంది. స్వరస్థానాలను నిర్ణయించడమే మేళమవుతుంది.

పల్లవి, అనుపల్లవి, చిట్ట చరణం, చరణం చరణ స్వరాలు వీటన్నింటిలోని మొదటి అక్షరాలను వరస క్రమంలో చూస్తే "సరిగమదనిస సనిదమగరిస" అని ఆరోహణ, అవరోహణలు వస్తాయి. ఇవి శ్రీరంజనిరాగ స్వరాలు. అదేవిధంగా ఎత్తుగడ స్వరాలు అంటే చరణం తర్వాతి స్వరాలలో మూడవ స్వరంలో గోపుచ్ఛ సర్వ లఘు స్వరం, నాల్గవ స్వరంలో స్రోతోవహాయతి ఉన్నాయి. సంగీత శాస్త్ర ప్రకారం గోపుచ్ఛయతి అంటే ఒక తాళం ఆవర్తంలోగల అంగాలు ఆవుతోక లాగ మొదట వెడల్పుగా ఉండి తర్వాత సన్నగా ఉండటం. గోపుచ్ఛంలో అంగాలు, వాటి సంజ్ఞలు : ꠲SIOU. వీటికి గుర్తులు ఈ విధంగా ఉంటాయి.

꠲ = ప్లుతం, S = గురువు, I = లఘువు; 0 = ద్రుతం, ......అనుద్రుతం

꠲ = 12 అక్షరాలు, మూడు మాత్రలు;

S = 8 అక్షరకాలం, రెండు మాత్రలు;

I = 4 అక్షర కాలం, ఒకటి;

0 = 2 అక్షర కాలం, అర్థమాత్ర;

U = 1 అక్షర కాలం, పావుమాత్ర.

స్రోతోవహాయతి అంటే నదిలాగ మొదట కుఱచగా సన్నగా ఉండి రాను రాను దాని ప్రవాహం వైశాల్యమై ఏ విధంగా పెరుగుతుందో స్వరగమనం కూడా అదేవిధంగా నడుస్తుంది.

USIO꠲ ... పావుమాత్ర, రెండు మాత్రలు, ఒక మాత్ర, అర్థమాత్ర, మూడు మాత్రలు వరుస క్రమంలో ఉంటాయి. 1, 8, 4, 2, 12 అక్షరాల కాలం వరుసలో ఉంటాయి.

ఈ రకమైన సౌందర్యాత్మకం, శాస్త్ర సమ్మతం అయిన లక్షణాలున్న వర్ణాలు చాలా అరుదుగా ఉన్నాయి. అదేవిధంగా తొలి యక్షరాల కూర్పు రాగమేళాన్ని సూచించే పద్ధతిలో గీతం గాని వర్ణం గాని రచించడం గొప్ప విషయం.

ఇక తర్వాతి వర్ణం శుద్ధ తోడిరాగం. చతురశ్రజాతి మఠ్యతాళం.

పల్లవి : నిన్నే కోరి వచ్చితి నెనరుంచి ఈ వేళ నన్ను పరివారలలో చౌక చేయతగదుర

అనుపల్లవి : సన్నుతి జేసితి రా శ్రీ వేణుగోపాల దాస పరిపాలా

చరణం : వేగమే రారా నన్ను బ్రోవ -

ఈ వర్ణం కూడా వేణుగోపాలుని నాయకునిగా చేసి రాసినదే. కోరివచ్చిన నన్ను నాపరివారల ఎదుట చులకన చెయ్యవద్దని ఒక నాయిక ప్రార్థన ఇందులోని వస్తువు.

ఇక మూడవది పంచ తాళ లక్షణ గీతం -

చతురశ్ర ధృవతాళం

జయకరుణారసభరితే శ్రీ లలితే శుభ చరితే

ధ్యాయే తవ పాదాంబుజయుగళం అభయప్రదే

శ్రీకాంచన వసనే మణిమయ సదనే ప్రసన్న వదనే

గాయామి మధుర లలిత రాగం సూర్య కాంత జనితం

షాడవ షాడవ పంచమ వర్జ్యం ఉపాంగరాగం

ఆరోహ అవరోహ ధైవత గాంధార జీవ న్యాసం

మధ్యమ ధైవత గాంధారమాలపితం

మధ్యమ భేదం రవిస్వరూపి రాగం శ్రుతిమధురం

సమతెతస్వరం సుస్వర మధురిమ నాదం

నాదోపాసక సంసేవిత రసభరితం

లలితరాగం సాయంకాలే గాయంతి

గాయే గీతం శ్రోత్రద్వయామృత రూపం సాయంతి

శ్రవణానందం శాస్త్ర సముదితం గాయక జనసేవ్యం

ప్రణవనాద సప్త స్వర శోభిత మంగళ దాయినీ

కామిత ఫల దాయని చిన్మయ రూపిణీ భజామి సతతం.

ఈ గీతం పేరుకు తగినట్లుగా పంచ తాళాలలో పాడుకునే వీలున్న లక్షణ గీతం

ఇది ఐదు తాళాలు -1. చతురశ్రజాతి ధ్రువ తాళం. 2. చతురశ్ర జాతి మఠము (మఠ్య) 3. త్రిశ్రజాతి త్రిపుటతాళం 4. త్రిశ్రజాతి రూపకతాళం 5. చతురశ్రజాతి ఏకతాళం. వీటిలో ఏ తాళానినైనా ఉపయోగించి పాడుకోవచ్చు. లేదా ఐదు తాళాలలో కూడా పాడుకోవచ్చు అని సూచన గీతంక్రింద ఇచ్చారు.

ఈ లక్షణ గీతం లలిత రాగంలో రాశారు. లలిత రాగం కరుణ రస పూరితమైంది. శుభం కలిగించే రాగం. మధురమైంది. సూర్యకాంత రాగజన్యం. సూర్యకాంత రాగం 17వ మేళ కర్త రాగం ఆరోహణ, అవరోహణల్లో ఆరేసి స్వరాలుంటాయి. షాడవ రాగం ఇది. పంచమం వుండదు. ఇది ఉపాంగ రాగం. ఆరోహ అవరోహణల్లో ధైవతం, గాంధారం జీవన్యాస స్వరాలు. వినడానికి ఇంపుగా ఉండే రాగం. మధురమైన నాదాన్ని కలిగించే ఈ లలిత రాగాన్ని నాదోపాసకులు సాయంకాలంలో పాడతారు. ఇది లలిత రాగ లక్షణం. ఈ గీతంలో లలితాదేవిని స్తోత్రం చేస్తూ ఈ రాగ లక్షణాలను చెప్పారు రచయిత. జోస్యుల సూర్య నారాయణ శాస్త్రి గారి రచనలు లభ్యమైనవి మూడే అయినా శాస్త్ర పాండిత్యాన్ని ప్రకటించే ఈ రచనలు అమూల్యాలు. సులభంగా అర్థమయ్యే రీతిలో రచించడం మరో ఉత్తమమైన లక్షణం.

# రెండవ భాగం

# సంస్థానంలోని కళాకారులు

ఇక సంస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా మన్నన లందిన విద్వాంసులలో వాసావారూ వందిగానం వెంకన్న, మొదలైన వారున్నారు. ఈ సంస్థానంలో వాసావారి కుటుంబంలో వారు చాలా వరకూ ఆస్థాన విద్వాంసులుగా వెలుగొందారు. ఈ వాసావారు 17 వ శతాబ్దం నుంచీ వైణిక విద్వాంసులుగా బొబ్బిలి సంస్థానంలో ఉంటూ ఆ ప్రభువుల ఆదరణలో భూముల్ని ఇనాములుగా పొందారు. ఒక భూముల్ని ఇవ్వడం మాత్రమే కాదు మొత్తం పోషణా భారాన్ని వహించారు ప్రభువులు. అయింట ఏ శుభకార్యం జరిగినా వారికి కావల్సిన సరంజామా అంతా సంస్థానం నుంచే వెళ్ళే ఏర్పాట్లు చేసేవారు. ఆయా సందర్భాలల్లో స్వర పల్లవులూ, గీతాలు వాసావారు రాసినట్లు చెప్తారు. పైగా ఆ స్వర పల్లవులు కేవలం, వీణను దృష్టిలో పెట్టుకునే రాసినవని విజ్ఞులంటారు. ఈప్రాంతంలో స్వర పల్లవుల కున్నంత ప్రాచుర్యం మిగిలిన ఏ ప్రాంతంలోనూ లేదు.

వాసావారి కుటుంబంలో అందరూ వైణికోత్తములే. వీరికి వీణకూ అవినాభావ సంబంధం ఉందనిపిస్తుంది. వాసా అప్పయ్య గారికి మూడు తరాలపై నుండి కూడా సంగీత విద్వజ్జులే,

పిళ్ళారీ గీతాలలో మనం ముందుగా ఇప్పటి సంప్రదాయం ప్రకారం చెప్పుకునే గీతం "శ్రీగణనాథ" కానీ వాసా అప్పయ్య గారి గురించి మరొక శిష్యుడు రాసిన మలహరి రాగంలో "శ్రీ వాసాప్పయ్యగురుతనుధారి వీణారవమృదు గానకళా దాయక విఘ్నేశ శ్రీకర మివమా మివ పరిపాలక"" అని సంగీతం నేర్చుకునే విద్యార్థులకు ఒకప్పుడు చెప్పేవారుట. వాసా పెద్ద జగ్గన్న గారి కుమారులు వాసా రామదాసు, దాసన్న. వాసా దాసన్న వాగ్గేయ కారుడు. ఈయన శబ్ద పల్లవులు, చౌక వర్ణాలు రాశారు. కానీ ఇప్పుడవి అలభ్యం.

వాసాదాసన్నకొడుకు పెద కామయ్య కూడా వాగ్గేయ కారుడే. గీతాలు, పదాలు, చిట్టి తానాలు పదవర్ణాలు కూడా రాశాడు.

పెదకామయ్య కొడుకు వాసా చిన కామయ్య సంగీత రచనలు చేశాడు. ఈయన గొప్ప గాయకుడు. స్వర పల్లవులు, జక్కిణ దరువులు రాశాడు. ఈయన "స్వర కేసరి" అనే బిరుదు పొందిన గొప్ప మేధావి. ఈయన జక్కిణ దరువులు రాశారు.

చిన కామయ్య కొడుకు వాసా జగ్గన్న. ఈయన వైణికుడే కాదు. అపూర్వ రాగాల్లో గీతాలు రాసిన వాగ్గేయ కారుడు కూడా. జగ్గన్న గారికి సంతానం ఐదు గురు వీరు పరవయ్య, కామయ్య, సాంబయ్య, అప్పయ్య, కృష్ణమూర్తి. వాసా అప్పయ్యగారు అపర శారదావతారమని చెప్తారు. వీరు అనేక లక్షణ గీతాలు, పల్లవులూ రాశారు. బొబ్బిలి ఆస్థాన విద్వాంసులుగా ప్రసిద్ధి పొంది అనేక శిష్య ప్రశిష్యుల్ని తయారు చేశారు. అందులో వందిగానం వెంకయ్య, దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులు ఇంకా కొంతమంది ప్రముఖులున్నారు.

పరమ వైష్ణవ భక్తుడూ, వేణుగోపాలస్వామి ఆరాధకుడూ అయిన రాయుడరంగారావు 1845 - 48 ప్రాంతంలో బొబ్బిలి సంస్థానాధిపతిగా ఉన్న కాలంలో వాసాపెదజగ్గన్న కుమారులు పెదకామయ్య, దాసన్నలు ఆస్థాన విద్వాంసులుగా ఉండేవారు.

వీరు పద వర్ణాలు,చిట్టి తానాలూ రాసి రంగారావు ప్రభువుకు అంకితమిచ్చి, నూరు ఎకరాల భూమిని బహుమానంగా తీసుకున్నారు. వాసావారు రాసిన సంగీత రచనలేవీ లభ్యం కాలేదు.దాసన్నకు "అభినవకేశవయ్య" అని బిరుదుంది. ఈయన త్యాగరాజుకి సమకాలికుడు.

వాసాదాసన్న పెద్ద కొడుకు చిన్న జగ్గన్న అపూర్వ రాగాలలో గీతాలు రాసి, వీణ మీద ఘనరాగ పంచకంలో రాగం, తానం, పల్లవులను వాయించి బొబ్బిలి రాజాను సంతోష పెట్టాడు. దానికి ప్రతిఫలంగా ప్రభువు జగ్గన్నకు మాన్యాల నిచ్చి గౌరవించాడు. అలాగే వాసా సర్వయ్య వెయ్యి గీతాలు అనర్గళంగా పాడేవాడు. అప్పయ్య తన ఎనిమిదవ ఏటనే గీతాలు రాసి బొబ్బిలి సంస్థానాధిపతి రాయుడప్ప రంగారాయుణింగారికి అంకితమిచ్చాడు. అటు పిమ్మట రాజారావు శ్వేతా చలపతి రంగారావు బహద్దర్ 1881లో బొబ్బిలి సంస్థాన ప్రభువుగా సింహాసనాన్నధిష్ఠించిన పిదప వాసా వెంకటరావు, వాసా కృష్ణ మూర్తులను ఆస్థాన విద్వాంసులుగా నియమించుకున్నాడు. వైణిక విద్యాభూషణ వాసా వెంకటరావు 1918 వరకూ బొబ్బిలి సంస్థానంలో ఉంటూ 1919లో విజయ రామగాన పాఠశాల - విజయనగరంలో వీణాధ్యాపకులుగా పని చెయ్యడానికి వెళ్ళాడు. బొబ్బిలిలో ప్రతి దసరా ఉత్సవాల్లోనూ వీరి కచేరి తప్పనిసరిగా ఉండేది.

ఇక ఆస్థానంలో విద్వాంసులుగా వారికి నెలకు జీతం ఐదు రూపాయలు మాత్రం ఇచ్చేవారు. ఇదిగాక పండుగులకు పబ్బాలకు ఆస్థానంలో వారి కచేరీ ఏర్పాటు చేసి, సన్మానం చెయ్యడం, నగదుగా తోచిన విధంగా ఏదో ఒకటి ఇవ్వడం జరిగేది. సంస్థానం తాలూకు ఉత్సవాలేమైనా జరిగినా వీరిని వీణ వాయించమనో లేదా పాడమనో ప్రభువులడిగేవారు. అలాగే ఎప్పుడైనా రాజ సంబంధీకులు ఎవరైనా పాడమనో, వాయిద్యాన్ని వినిపించమని కోరితే వినిపించేవారు. "మొన్న మొన్నటి వాసా కృష్ణమూర్తి తాతగారి కాలానికి ఆస్తులూ ఇళ్ళూ బొబ్బిలి సంస్థానాధిపతులిచ్చినవి అన్నీ హరించుకు పోయాయి. ఏమీ లేక విశాఖలో స్థిరపడినట్లు, అప్పటి వరకూ వాటినేఅనుభవిస్తూ వచ్చారని కీ.శే. వాసా కృష్ణమూర్తిగారి భార్య శ్రీమతి హైమవతి చెప్పారు. 1930 కంటే ముందుగానే వాసావారి కుటుంబం బొబ్బిలి విడిచి పెట్టి విజయనగరం, విశాఖపట్నం చేరుకున్నారు.

## గానకేసరి బొబ్బిలి కేశవయ్య (1763 - 1832)

రాజారాయుడప్ప రంగారావు బొబ్బిలిని పరిపాలించిన కాలం అది విజయనగరం వారు బొబ్బిలిని ముట్టడించిన తర్వాతి కాలం - రాజారాయుడప్ప కాలంలోనే బొబ్బిలి పట్టణంలో వేణు గోపాల స్వామి ఆలయ నిర్మాణం జరిగింది. అప్పుడు బొబ్బిలి సంస్థానంలో ఆస్థాన విద్వాంసుడు కేశవయ్య. కేశవయ్య సంగీత త్రయంలోని శ్యామశాస్త్రి సమకాలికుడు. సాతాని కులస్థుడు ఇతడు. తండ్రి గోపాలయ్య వద్ద సంగీతం నేర్చుకున్నాడు.

బొబ్బిలి ప్రభువుకు కేశవయ్య అంటే అమితమైన ప్రేమ అందువల్ల వల్లమాలిన అభిమానంతో కేశవయ్య బొబ్బిలి ప్రాంతం దాటి వెళ్ళ నివ్వకుండా తన దగ్గరే ఉంచుకున్నాడు.

ఈ లోపున కేశవయ్య తల్లి మరణించడంతో ఆ వ్యధను తట్టుకోలేక సంగీత సాధన చెయ్యడం మానేసాడు. కేశవయ్య సంగీత సాధన మానేసే సరికి సంగీత విద్య నశిస్తుందని బొబ్బిలి రాజావారు భయపడ్డారు. అందువల్ల సంగీతం నశించకుండా ఉండేందుకు బొబ్బిలి నుండి కేశవయ్యను ఇతర సంస్థానాలకు పంపించి అక్కడ అతని గాన ప్రతిభను ప్రదర్శించే ఏర్పాటు చేశాడు. కేశవయ్య సంగీతం మీద మాత్రమే మమకారం పెంచుకోకుండా కీర్తి కాంక్ష కూడా పెంచుకున్నాడు. ఇతర సంస్థానాలలో సంగీత విద్వాంసులతో పోటీ పడి ఓడిపోయిన వారి తంబురాలను తీసుకోడం ఆరంభించాడు.

దేశంలో ఉన్న విద్వాంసులనుండి తంబూరాలను మాత్రమే కాదు. వారి బిరుదు పతాకాలను కూడా తీసుకునే వాడు. జయపత్రాలను పొంది వచ్చేవాడు. భూలోక మంతా సంగీతంలో జయించి చాపగా చుట్టిన వాడు అని "భూలోక చాపచుట్టి"గా బిరుదు పొందాడు. కేశవయ్య "స్వర వీర బెబ్బులి". "ప్రళయ కాల ఝంఝూమారుతం" మొదలైన బిరుదులు పొందాడు.

తంజావూరు రాజ దర్బారులో శ్యామ శాస్త్రితో పోటీ పడి ఒక్క తాళ విషయంలో ఓడిపోయాడు. కానీ బొబ్బిలి కేశవయ్య అసాధారణ ప్రజ్ఞావంతుడిగా పేరు తెచ్చుకుని తామ్ర శాసనాన్ని బిరుదూ, నగలను పొందాడు. ఘన సంప్రదాయాన్ని వాడుకలోనికి తెచ్చిన ఘనత కేశవయ్యదే. ఆంధ్ర దేశం అంతటా బొబ్బిలి సంస్థాన ప్రతిష్ఠను గుర్తుంచుకొనేటట్లు చేసిన గొప్ప సంగీత విద్వాంసుడు బొబ్బిలి కేశవయ్య.

## వీణాచార్య నందిగానం వెంకన్న (1853 - 1917)

నందగానం వారి వంశంలో జన్మించిన వెంకన్న పుట్టిల్లు బొబ్బిలి అని కొందరు. విశాఖజిల్లా బిటువాడ అగ్రహారం అని మరి కొందరు అంటారు. వంశానుగతంగా వస్తున్న సంగీత విద్యలో వెంకన్నకు అంతగా అభిరుచి లేదు. బాగా పాడగలడు. ధనార్జన కోసం పర్లాకిమిడి ప్రాంతంలో తిరుగుతుంటే ఇతని పాట విన్న ఒక రసజ్ఞుడు బొబ్బిలి ఆస్థాన వైణికుడు వాసా అప్పయ్య గారి దగ్గరకు వెళ్ళమని చెప్పాడు.

తప్పని పరిస్థితుల్లో అప్పయ్య దగ్గరా ఆ తర్వాత గుమ్మలూరి వెంకట శాస్త్రి దగ్గర సంగీతం నేర్చుకున్నాడు. అప్పుడు వెంకన్నకు సంగీతం మీద అభిమానం ఏర్పడింది. దక్షిణాదికి వెళ్ళి సంగీతాభ్యాసం చేసి క్షుణ్ణంగా ఆకళింపు చేసుకొన్నాడు. 1893 సంవత్సరంలో బొబ్బిలి ఆస్థాన విద్వాంసునిగా నియమితుడయ్యాడు. బొబ్బిలిలో ఉన్నప్పుడు విజయనగరం సంస్థానాధీశుని మెప్పు పొందాలనే కోరిక నందిగానం వెంకయ్యకు ఉండేది. ఆనందగజపతితో చదరంగ మాడే వెలదిండి జోగారావు వల్ల విజయనగర సంస్థాన దర్బారులో ప్రవేశం లభించింది. అప్పుడు విజయనగర ఆస్థానంలో ఆనంద గజపతి ఎదుట ఆరు రోజులు వెంకన్న తన సంగీతజ్ఞతను ప్రదర్శించాడు. వెంకన్న ప్రదర్శించిన అసమాన ప్రతిభకు ముగ్ధుడై ఆనందగజపతి ఆరు నూట పదార్లు, కాశ్మీరు శాలువలు ఇచ్చి గౌరవించాడు.

ఆ తర్వాత నందిగానం వెంకన్నను రోజూ వచ్చి గానాన్ని వినిపించమని ఆనందగజపతి ఆజ్ఞాపించాడు. వెంకన్న బొబ్బిలి ఆస్థాన విద్వాంసుడు కావడంతో అది కుదరలేదు. కానీ అప్పుడప్పుడు మాత్రం ఆనందగజపతి కోరిక నెరవేర్చేవాడు. ఇతనికి వీణలోనూ గాత్రంలోనూ సమాన ప్రతిభ ఉండేది.

వీణను మించిన గాత్రం - గాత్రాన్ని మించిన వీణ. రెండూ కలిస్తే తేడా తెలియని స్థితి. ఒకే రాగాన్ని మూడు నాలుగు రాత్రులు పునరుక్తి దోషం లేకుండా ప్రస్తారం చెయ్యగల నేర్పరి. వీణ వాయిస్తే రుద్ర వీణ వాయించి నట్లుండేది. వెంకన్న నాభిస్థానం నుంచి నాదాన్ని పూరించి పాడేవాడు. అది నిజంగా సింహగర్జనే అనుకునే వారు. 1898లో వెంకయ్యకు కశింకోట జమీందారు ఆస్థాన విద్వాంసునిగా రమ్మని ఆహ్వానం పంపించారు. బొబ్బిలి నుంచి కశింకోటకు వెళ్ళి కొంతకాలం ఉన్నాడు వెంకన్న. ఆ పిమ్మట పిఠాపురం సంస్థానాధిపతి ఆహ్వానం మేరకు ఆస్థాన విద్వాంసునిగా ఉంటూ చివరి రోజులు పిఠాపురం లోనే గడిపాడు. బరంపురంలో జడ్జిగారింట (పేరు ప్రస్తావించలేదు) కచేరిలో సావేరి రాగాన్ని పాడినందుకు రూ. 500/- లు విలువగల వజ్రపుటుంగరాన్ని బహుకరించారు జడ్జిగారు.

## ఆకొండి నారాయణ శాస్త్రి (1898- తెలియదు)

ఆకొండి నారాయణశాస్త్రి కూడా బొబ్బిలి సంస్థానంతో సంబంధం ఉన్న మనిషే. ఈయన వాసావారి శిష్యులు. బొబ్బిలి సంస్థానంలో ఆడపిల్లల పాఠశాలలో సంగీతం మాస్టారుగా పనిచేశాడు. సంగీతం బాగా తెలిసిన మనిషి. దానికి తగినట్లు మహా గర్విష్టి. ఎవరైనా కనిపిస్తే చాలు "నీకు సంగీతం వచ్చునా" అని నిలదీసి ప్రశ్న వేస్తూ ద్వావింశతి శ్రుతులు ఏకబిగిన గాత్రంలో పట్టి చూపించేవాడు. నారాయణ శాస్త్రి బొబ్బిలి రాజా రామకృష్ణ రంగారావు పట్టాభిషేకం సందర్భంలో ఒక కీర్తన రాశాడు.[10] బొబ్బిలి సంస్థానంలో ప్రత్యేకించి ఒక పూజా మహలు ఉండేది. ఆ పూజా మహలులో నారాయణ శాస్త్రి ప్రతి రోజూ సాయంత్రం విధిగా వీణ వాయించడానికి నియమితులయ్యారు.

పూజ జరిగే సమయంలో రాణి గారూ ఇతర బంధువులూ పూజా మహలుకు వచ్చేవారు. నారాయణ శాస్త్రిని కీర్తనలు పాడమని, వీణ వాయించమని వాళ్ళు అడిగేవారు. అలా వచ్చిన వారిలో జనార్ధన రంగారావు గారి భార్య ఒకరు. ఆమె నూజివీడు సంస్థానపు ఆడపడుచు. ఆమె కూడా వీణ వాయించేది, భజన పాటలు పాడేది. బొబ్బిలి సంస్థానంలో ఆస్థాన విద్వాంసునిగా అకొండి నారాయణ శాస్త్రిగారు ఉన్నట్లుగా దాఖలాలు (ఏమాత్రం) లేవు. కాని కుటుంబ పోషణార్థం కావల్సిన వసతులు బొబ్బిలి సంస్థానం కల్పించింది. ఆకొండివారు స్వర పల్లవులు రాసినట్లు వినికిడి, కానీ అవేవీ వెలుగులోకి రాలేదు.

వీళ్ళే కాకుండా బొబ్బిలి సంస్థానంలో ముట్నూరి సంగన్న అనే మార్దంగికుడు ఆస్థాన విద్వాంసుడిగా ఉండేవాడు. ఈయన భుగత గోపన్నకు సమకాలికుడిగా ఉండేవాడు. తణికెళ్ళ సన్యాసయ్య అనే మహా విద్వాంసుని బొబ్బిలి ఆస్థాన గాయకునిగా ప్రభువు ఆదరించాడు. భాగవతగానాన్ని శ్రావ్యమైన గొంతుతో గానం చేసేవాడు సన్యాసయ్య. సన్యాసయ్య దరువులు కూడా పాడేవాడు. బొబ్బిలి రాజా సన్యాసయ్యకు బంగారు గనియం చేయించి ఇచ్చారు.

భాగవత ప్రదర్శన అయ్యేటప్పుడు ఆ గనియం ఇద్దరు బంట్రోతులతో తెప్పించి ప్రదర్శన అయిపోయింతర్వాత దాన్ని తిరిగి కోటలో భద్రపరచేవారు.[12] అలాగే చిత్తజల్లు నరసింహం భామా కలాపంలో దరువులు ఆలపించేవాడు. ద్వివేదుల విశ్వపతిశాస్త్రి, కన్నడశాస్త్రి, లక్ష్మణశాస్త్రి, మధురాపంతుల పేరయ్యశాస్త్రి, భాగవతుల లక్ష్మీనారాయణశాస్త్రి, పట్రాయని వెంకటనరసింహశాస్త్రి వీరంతా బొబ్బిలి ఆస్థాన విద్వాంసులుగా ఆదరింప బడినవారు.

శ్వేతాచలపతి రంగారావుగారి కాలంలో పందనపల్లి రాఘవాచారి, శిష్టు భగవానులు ఆస్థాన విద్వాంసులుగా వెలిగారు.

## అధస్సూచికలు

1. వెంకటనరసింహ సత్యనారాయణ, కోటగిరి, పద్మనాయక చరిత్ర, శ్రీఅప్పారాయగ్రంథమాల, నూజివీడు - 1981 పుట- 39.
2. బొబ్బిలి సంస్థానం ఆఫీసులో మేనేజరుగా పనిచేస్తున్న తాతా పార్వతీశ్వరశాస్త్రి గారు చెప్పిన సమాచారం. 25.1.96 3. '' అదే ''.
4. దత్తాత్రేయశర్మ, ఆణివిళ్ళ. "విజయనగరం జిల్లా చరిత్ర - సంస్కృతి, మాన్సాస్, విజయనగరం - సం.లే. పుట - 101
5. చూడు - అనుబంధం - IX 6. '' అదే ''.
7. 1. రామలింగ శాస్త్రి, మంగిపూడి. భారత సంగీత ఇతిహాసము (ప్రథమభాగము) న్యాయవాణిజ ప్రింటింగ్ ప్రెస్, రాజమహేంద్ర వరము - 1971, పుట - 115 2. చూడు అనుబంధం - VII
8. బొబ్బిలి రాజా గారు చెప్పిన సమాచారం. 26.1.96
9. 1. అంబుజవల్లి, కె. సంగీత కుటుంబాలు - వాసావారు. గానకళ, కాకినాడ, జనవరి, ఫిబ్రవరి 1977.
   2. చూడు. అనుబంధం - III 10. చూడు - అనుబంధం - VII
11. చూడు - అనుబంధం - రామలింగ శాస్త్రి, మంగిపూడి. భారత సంగీత ఇతిహాసము (ప్రథమభాగము) న్యాయవాణిజ ప్రింటింగ్ ప్రెస్, రాజమహేంద్ర వరము - 1971, పుట - 11జా॥
12. నటరాజరామకృష్ణ, నవజనార్ధనం యశోధర ఆర్ట్ ప్రింటర్స్ హైదరాబాదు (ప్రథమ ముద్రణ - 1984) పుట

# 9. ముక్త్యాల సంస్థానం

ముక్త్యాల సంస్థానాధీశులు వాసిరెడ్డి వంశస్థులు. ముక్త్యాల అధిపతుల్లో చంద్రమౌళి ప్రథముడు. ఈయన కుమారుడు రాఘవయ్య ఢిల్లీ పాదుషా ఔరంగజేబు దగ్గర కెళ్ళి తాను నేర్చుకున్న విద్యలన్నీ ప్రదర్శించి, పాదుషా నుండి 'బహద్దర్‌లకే బహద్దర్' అని బిరుదూ చింతలపాటు వంటునకు ప్రత్యేక సనదూ పొందాడు. ఇతని తరువాత ఈయన పెద్ద కుమారుడు రాజమౌళి ఎనిమిదేళ్ళు సంస్థానాధిపతిగా ముక్త్యాల సంస్థానాన్ని సుభిక్షంగా చేసిన అధిపతి, రాజమౌళి తర్వాత అతని కుమారుడు చంద్రమౌళి సంస్థానాధీశుడయ్యాడు.

రాజమౌళి సోదరుడు అచ్చన్న కొడుకు రామలింగంవీరపనీడు అధికారంలోకి వచ్చాడు. ఈ రామలింగన్నే ముక్త్యాల దుర్గాన్ని నిర్మించాడు. రామన్న కాలంలో అతని దాయాదులు నాగన్న కుమారులు రామన్న, జగ్గన్నలు నందిగామ, చింతపల్లి పరగణాలను ఏలుబడిలోకి తీసుకున్నారు. వీరు రామన్న సోదరులను లక్ష్య పెట్టేవారు కారనీ, అనుచితంగా ప్రవర్తించే వారనీ అంటారు. రామన్న సోదరులు బాంధవ్యాన్ని నిలబెట్టాలని మాత్రం ప్రయత్నించారు. కానీ శత్రువుల చేత హతులయ్యారు. ఆ తర్వాత చరిత్ర ప్రసిద్ధి కెక్కిన వాసి రెడ్డి చిన వేంకటాద్రి నాయుడు 1826 లో ముక్త్యాల కోటను పునరుద్ధరించేడు. ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాడు. 1828లో వెంకటాద్రినాయుడు మరణించే నాటికి ముగ్గురు కుమారులూ చిన్న పిల్లలు కావడం వల్ల ఆ సంస్థానంలో అధికార వర్గం వారు అప్పులు చేసి లేని పోని కేసులు మోపడంతో సంస్థానం సంక్షోభానికి గురైంది. ఆ సమయంలోనే దేశంలో కరువు కాటకాలు తాండవించాయి. ఈ కారణాలతో సంస్థానం జప్తు చేయబడి 1848లో కుంఫిణీవారి స్వాధీనమైంది.

చిన వేంకటాద్రి గారి కుమారుడు భవానీ ముక్తేశ్వర ప్రసాదుకు యుక్త వయసు వచ్చింతర్వాత 1820 నుండి మద్రాసు గవర్నరుతో మాట్లాడి, ఆనాటి కలెక్టర్‌ను కలిసి పిటిషన్ పెట్టుకున్నాడు. పోయిన జమీనును 1863లో తిరిగి సంపాదించుకుని, ముక్త్యాల సంస్థానం మీద హక్కుదారి అయ్యారు. పూర్వపుటభ్యుదయాన్ని ఆకాంక్షించి శక్తి వంచన లేకుండా శ్రమచేసి కోరిక సాధించుకున్నారు.

దేవాలయాలు నిర్మించి, వాటి నిర్వహణ నిమిత్తం ఇనాములు ఏర్పాటు చేశారు. ముక్త్యాలలోని ముక్తేశ్వరస్వామి ఆలయ పాలనకు తూబాడు గ్రామంలో కొన్ని భూములు ఇనాంగా ఇచ్చారు ముక్తేశ్వర ప్రసాద్. వేదాద్రి దేవాలయం నుంచి కృష్ణ దాకా 108 మెట్లు కట్టారు. కృష్ణలో స్నానం చేసి తిన్నగా మెట్లెక్కి స్వామి దర్శనం చేసుకునే వీలు కల్పించారు. ఇతని నిజాయితీ విశ్వాసాలకు మెచ్చి బ్రిటిష్ వారు చింతల పాటి వంటు, సర్‌దేశ్ ముఖ్ మన్నెదర్ అనే బిరుదు, ప్రశంసా పత్రం ఇచ్చారు. అంతే కాకుండా మన్నె సుల్తాన్ బిరుదు వంశ పారంపర్యంగా రావడానికి అనుమతించారు.

అదేవిధంగా నిజాం ప్రభుత్వం రాజావారి కుటుంబానికి రాజా బహద్దూర్, సబామల్, మర్తబత్ వలీమరి జీలర్ లాంటి జగాబిరుదులు ఇచ్చింది. ముక్తేశ్వర ప్రసాద్‌గారి కుమారుడు ఉమామహేశ్వర ప్రసాద్ కొంత కాలం సంస్థానాధిపత్యం వహించాడు. ఈయన తర్వాతి పాలకుడు చంద్రమౌళీశ్వరప్రసాదు ఆంధ్రభోజునిగా పేరొందారు. చంద్రమౌళీశ్వర ప్రసాద్ గారి విద్యాసక్తి, లలితకళాభిరుచి కొనియాడ తగినవి. ప్రాచీన కావ్యాలను సంస్థాగత పండితుల అక్షర మాలికలను ముద్రించడానికి ముక్త్యాల సంస్థానంలోనే మాహిష్మతీ అనే ముద్రణాలయాన్ని కట్టించారు. అముద్రితాలను పరిష్కరింప చేసి ముద్రించేవారు.

కుమార రాజాగా పేరుపొందిన రామగోపాల కృష్ణమహేశ్వర ప్రసాదు ముక్త్యాల సంస్థానాధీశుల్లో చివరి వారు. "మహేశ్వర ప్రసాదు కూడా తన తండ్రిలాగే సాహిత్య కళాభివృద్ధిని కాంక్షించారు. కళారాధకులైన కుమారరాజావారు తమ కుమార్తెలు రమ, ఉమలకు నాట్యం నేర్పించారు. ముక్త్యాల సంస్థానంలోనే ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు వేదాంతం లక్ష్మీనారాయణగారి దగ్గర, విశ్వ విఖ్యాత నర్తకీమణి బాలసరస్వతి దగ్గర ఉమ, రమలు నాట్యాన్ని నేర్చుకున్నారు."[1] అంత శ్రద్ధగా నేర్చుకోవడమే కాకుండా మద్రాసు, లండన్, పారిస్, జర్మనీలలో ప్రదర్శనలిచ్చారు. ఉమ, రమలంటే బాల సరస్వతికి అమితమైన శిష్యవాత్సల్యం.

# మొదటి భాగం

# సంస్థానంలోని వాగ్గేయ కారులు వాఙ్మయం

## పిరాట్ల శంకర శాస్త్రి (1884 - 1951)

పిరాట్లశంకరశాస్త్రి గారు ముక్త్యాల సంస్థానంలో ఉన్న ఏకైక ఆస్థాన సంగీత విద్వాంసులు. త్యాగరాజస్వామి ప్రధాన శిష్యులూ వీణ కుప్పయ్య కుమారుడూ అయిన ముత్యాల పేట త్యాగయ్య గారి దగ్గరా పాపట్ల కాంతయ్యగారి దగ్గరా సంగీతం నేర్చుకున్నారు. అనేక జమీందారీలలో పిరాట్ల వారు సత్కృతుడు. మంచి సంప్రదాయపు బాణీ గల విద్వాంసుడు. ఈయన గురించిన జీవిత ఘట్టాలను శంకర శాస్త్రిగారి పుత్రులు పిరాట్ల శ్రీగిరి శాస్త్రి ఒక వ్యాసంలో వివరించారు.[2] ఆకాశవాణి మద్రాసు కేంద్రం వారు ఆ వ్యాసాన్ని ప్రసారం చేశారు. శ్రీశైల శాస్త్రి, పిచ్చమ్మల నలుగురు కుమారులలో నాల్గవ తనయుడు శంకర శాస్త్రిగారు. మృత్యుంజయ శాస్త్రి, శివరామశాస్త్రి, సదాశివ శాస్త్రి మిగిలిన వారు. వీరిలో శివరామశాస్త్రిగారు గొప్ప సంగీత విద్వాంసులు. గాయకులే కాక వయోలిన్, మృదంగం అద్భుతంగా వాయిస్తారు. శంకర శాస్త్రిగారి తల్లి పిచ్చమ్మగారు అధ్యాత్మరామాయణకీర్తనలు, రామదాసు కీర్తనలు తదితర భక్తిభజనపాటలు పాడుతూండేవారు. ఆ పాటలు విన్న శాస్త్రిగారికి సంగీతం అంటే చిన్నప్పటి నుండీ అభిరుచి కలిగింది. వీరి బావగారు శంకర శాస్త్రి గారి జాతక చక్రం చూసి మంచి విద్వాంసుడవుతాడని, తద్వారా కీర్తి కలుగుతుందని తెలుసుకున్నారు.

సంస్కృతం నేర్చుకోడానికి శంకర శాస్త్రి గారు పడవ నెక్కి వెళ్ళి పోబోతున్న సమయంలో శాస్త్రిగారిని వారి బావగారు చల్లా సుబ్బారాయుడు గారు పడవ దింపి, సంస్కృత భాష నేర్చుకున్నందువల్ల ప్రయోజనమేమీ లేదని, సంగీతం నేర్చుకోమని అందుకోసం మద్రాసు వెళ్ళమని హితబోధ చేశారు. ఆయన మాట విని శంకర శాస్త్రిగారు మద్రాసు వెళ్ళడానికి తగిన సైకం సమకూర్చుకోడానికి వరంగలు బయల్దేరాడు. అక్కడ సంగీత సభలో గానం చేస్తున్నప్పుడు శంకర శాస్త్రిగారిని సంగీత రసికులైన ఒక తమిళుడు మెచ్చుకుని, అతని అందానికి ముగ్ధుడై నీవు గురువు దగ్గర క్రమపద్ధతిలో సంగీతం అభ్యసించమని చెప్పాడు. దానికి సమాధానంగా శాస్త్రిగారు అయ్యా! మద్రాసు వెళ్ళడానికి కావల్సిన ఖర్చు కోసమే ఈ సంగీత సభలో పాడితినని" సమాధాన మిచ్చారు. వెంటనే ఆ దాక్షిణాత్యుడు 75 రూపాయలిచ్చి ఆశీర్వదించాడు.

ఆ కాలంలో త్యాగరాజస్వామి శిష్యుడు తిరువత్తూరి త్యాగయ్య మద్రాసులో ఉండేవారు. శాస్త్రిగారు త్యాగయ్య దగ్గర సంగీతాభ్యాసానికి వెళ్ళారు. అప్పటికి శంకర శాస్త్రి వయసు 18 సంవత్సరాలు. త్యాగయ్య గారి వయసు 80 ఏళ్ళు. మొదట చేతకాదని తిరస్కరించారు. శాస్త్రిగారి పట్టుదల వినయ విధేయతలను చూసి ఆనందపడి శిష్యునిగా చేర్చుకున్నారు. సుమారు 50 గీతాల వరకూ ఒక సంవత్సర కాలం నేర్చుకున్నారు. మద్రాసులో కలరా వ్యాధి తీవ్ర రూపంలో సర్వత్రా వ్యాపించడం వల్ల ఇంటికి వచ్చేశారు శంకరశాస్త్రిగారు. తనకు సన్యసించాలని ఉందని మంథెన గ్రామంలో శ్రీవామదేవ తీర్థస్వామి వారిని దర్శించి అడగ్గా, సమయం వచ్చింతర్వాత రమ్మని ఆయన శాస్త్రిగారిని తిరిగి ఇంటికి పంపేశారు.

మరి కొన్నాళ్ళకు మద్రాసులో ఒక సంవత్సరం సంగీతం నేర్చుకుని వచ్చారు శంకర శాస్త్రిగారు. ఒకప్పుడు ఆధ్యాత్మిక గురువైన వామదేవతీర్థులు విజయనగర సంస్థానానికి వేంచేస్తున్నారన్న వార్త విని శంకర శాస్త్రి గారు విజయనగరానికి వెళ్ళారు. సంధ్యా వందనాదులు పూర్తి చేసుకుని ప్రాతఃకాలంలో తోడి రాగాన్ని పాడుతూ మిశ్రగతిలో తత్తధిమి తక్ధిమియని శివుడాడేను" అను పల్లవి మహానందంగా పాడుతుంటే

హరికథాపితామహుడైన ఆదిభట్ల నారాయణదాసుగారు విని దగ్గరకు వచ్చి అదేతాళంలో ఒకటి, మూడు విషమాక్షరాల జాగాతో పల్లవిని పాడి, కాలం పైకాలం స్వరమల్లమని అడిగినంతనే శాస్త్రిగారు పాడారు.

ఆదిభట్ల నారాయణదాసుగారు ఆనందపడి అక్కడ గాన సభ ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో అప్పటి విజయనగరసంస్థానదివానులైన భమిడిపాటిరామమూర్తి గారు శాస్త్రిగారిని  పరిచయం చేసుకుని ఆంతరంగిక మిత్రులయ్యారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న విస్సా అప్పారావుగారి ఇంట్లో ఒకసారి శాస్త్రిగారి గానం ఏర్పాటు చేశారు. ఆ సభకు మద్రాసులోని అనేక మంది సంగీత విద్వాంసులు, న్యాయవాదులు, రసికులు, పత్రికా సంపాదకులు ఎంతోమంది ఆహ్వానితులయ్యారు. ఇంత మందిని శంకరశాస్త్రి గారు రంజింప చేయగలరా! అనే సందేహం అప్పారావుగారికి కలిగింది.

ఆనాటి సభలో శంకరశాస్త్రిగారు సౌరాష్ట్ర రాగాన్ని శుద్ధ ధైవత ప్రయోగం చేసి పాడారు. శ్రీనివాస శాస్త్రి అనే ఒక రసికుడు ఆ సభలో లేచి నిలబడి సుమారు 40 ఏళ్ళ నుంచి ఈ రాగాన్ని వింటున్నానని ఈ శుద్ధ ధైవత ప్రయోగంచేసి పాడినవారు చాలా అరుదని చెప్తూ శాస్త్రిగారిని ఎంతో మెచ్చుకున్నారు. సశాస్త్రీయ, సంప్రదాయ సంగీతం నేర్చుకున్న శంకరశాస్త్రి గారి వంటి వారు మ్యూజిక్ అకాడమీ సభ్యులైనట్లయితే సంగీత విషయమై అనేక రహస్యాలు వెలుగు చూడగలవని చెప్పారు. ఆవెనువెంటనే అకాడమీ సభ్యులుగా శంకర శాస్త్రిగారిని తీసుకున్నారు.

మరో సందర్భంలో సంగీత అకాడమీలో సంగీత చర్చ జరిగింది. అందులో బేగడ రాగం గురించి టైగర్ వరదాచారిగారు చర్చిస్తూ బేగడరాగంలో కాకలినిషాదం, కైశికి నిషాదాలే కాక వేరొక ప్రయోగం కూడా ఉన్నదని అశాస్త్రీయమైన వితండవాదం చేశారు.

వాటిని ఖండించి పిరాట్లశంకర శాస్త్రిగారు బేగడ రాగంలో కైశికి, కాకలి నిషాదాలే ప్రయోగించాలని, అవి రాగచ్ఛాయా స్వరాలని త్యాగరాజు, దీక్షితర్ మొదలైన వాగ్గేయ కారుల కృతుల్లో, గీతాలలో వర్ణాలలో వాటిని చూపించి ధృవీకరించారు. ఇది సంగీత అకాడమీ వారు తీర్మాన రూపంలో స్వీకరించి రూపొందించారు. 1938లో బులుసు సాంబమూర్తిగారు చెన్నపురి ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో దసరాలో సంగీత సభ ఏర్పాటు చేశారు. అక్కడ శంకరశాస్త్రిగారు శంకరాభరణరాగాన్ని ఆరోహణావరోహణ క్రమంగా తార స్థాయిలో సంచారం చేస్తూంటే "శంకరుడే తాండవిస్తున్నట్లుంద"ని ప్రసిద్ధవైణికులు ఈమని అచ్యుతరామశాస్త్రి గారు సభలో వక్కాణించారు. శంకరశాస్త్రిగారు 1944లో తిరువయ్యూరులో త్యాగరాజస్వామి ఉత్సవాలకు వెళ్ళి సమాధి దగ్గర ఆహిరిరాగంలో "ఆదయ శ్రీరఘు" అనే కీర్తన పాడుతున్న సమయంలో అనిమిషకాలంలో బంగారు ఛాయతో త్యాగరాజస్వామి దర్శితుడయ్యాడు.[3] ఆ స్ఫూర్తితో తోడి రాగంలో త్యాగరాజ సద్గురు స్వామి అనేకీర్తన రాశారు. శంకరశాస్త్రిగారు వర్ణాలు, కృతులూ రాశారు. వీటిలో ఏ రచనా ప్రచురణ కాలేదు.

ఈయన రచనలన్నీ భక్తిరస పూరితమైన భగవన్నుతులు. ఇహం నుండి ఉద్ధరించి మోక్షాన్ని కలిగించమని, భవార్ణవం నుండి మానవులను రక్షించే వాడు ఒక్కరాముడేనని ఈ రచనలు వివరిస్తాయి. తనకు తానుగా భగవంతుని యెదుట ఆవేదన వ్యక్తం చేస్తారు కొన్ని కీర్తనలలో.

"నాలాంటి పాపులు ఈలోకంలో ఎవరూ ఉండరు. పరులను పొగుడుతూ అత్యంత ముఖ్యమైన కాలాన్నీ జీవితాన్నీ వృథాగా గడిపాను. అటువంటి ఈ పాపిని రక్షించు ఓరామా!" అంటూ చేసే ధ్యానమే కొన్ని కృతులలో కనిపిస్తుంది.

శంకరశాస్త్రి గారు రాముని భక్తులు. అన్ని కీర్తనలలోనూ రాముణ్ణే స్మరించారు. ఆధ్యాత్మికతా దృష్టితో రాసిన కృతులలో కూడా అంతారామమయం అనే సత్యాన్ని ప్రకటించారు.

సర్వజనాదులిచటనుండి వచ్చెను
సర్వజగము లెచట లీనము
సర్వవేదాంత సారమదేయని
సర్వజ్ఞుడు శ్రీరామ చంద్రుడను ॥సదానీనామకీర్తన॥

ఈ విధంగా ఆధ్యాత్మిక చింతనతో బాటూ శృంగార పరంగా కూడా శాస్త్రిగారు కొన్ని రచనలు చేశారు.

"ఈ విరహమెటులునోర్తునో చెలీ ఏమిసేయుదును
భావజుండు కుసుమ బాణముల గొని బాధించ దొడగెను"

అంటూ వివరించిన ఈ విరహ భరిత వర్ణం శ్రీకృష్ణుని ప్రియునిగా భావించి చెలియ ఆడిన పలుకులు. ఈ రచనలలో పల్లవి అనుపల్లవి ఒక చరణం ఉన్నాయి. కొన్ని కృతుల్లో పల్లవిలో ఒకే వాక్యం, అనుపల్లవిలో రెండు వాక్యాలు, చరణం నాలుగు వాక్యాలు గానూ ఉన్నాయి. శంకరనుత' అనే ముద్రతో శాస్త్రిగారు రచనలు చేశారు.

వాచస్పతి, శంకరాభరణం, తోడి, భైరవి, హుసేని, కీరవాణి మొదలైన రాగాలలో దాదాపు ఇరవై కృతులు రాశారు. ఆదితాళం, రూపక తాళాలలో ఇవి ఉన్నాయి. శంకరాభరణం, సావేరి, అఠాణ, కామవర్ధిని, శ్రీరంజని రాగాలలో ఐదు వర్ణాలు రాశారు. ఇవే కాకుండా అన్నమాచార్య కృతులను కొన్నింటిని స్వరపరిచారు. వర్ణాలలోని పల్లవి, అనుపల్లవుల పంక్తులు పెద్దవిగా ఉంటాయి. సుశిక్షితులు, అనుభవజ్ఞుడు, ప్రాచీన సంప్రదాయాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్నవారు శంకరశాస్త్రిగారు. అందువల్లనే అతికష్టమైనా వర్ణరచన చేయగలిగారు. ఈ విధమైన రచనలు చెయ్యడం అనితరసాధ్యం. కృతికారుని స్వదస్తూరితో లభ్యమైన రచనలను కొన్ని అనుబంధంలో చేర్చాను. (చూ. అనుబంధం - IV) గొప్ప సంగీత శాస్త్రజ్ఞుడైన శంకరశాస్త్రి గారు విజయనగరం, గద్వాల, వనపర్తి, ఆత్మకూరు మొదలైన సంస్థానాలలో సంగీత సభలు చేసి విలువైన పారితోషికాన్ని, ఘనమైన సన్మానాలను పొందారు.

## అధస్సూచికలు


1. గౌరీశంకర్, టి. ముక్యాల దీపం - రాణీభవానీ దేవి మెమోరియల్ ట్రస్టు, చల్లపల్లి, 1988 పుటలు 66, 67.
2. ఆకాశవాణి మద్రాసు కేంద్రం నుండి ప్రసారమైన వ్యాసం 1964. పుట - 8.
3. రామలింగ శాస్త్రి, మంగిపూడి. భారత సంగీత ఇతిహాసము, న్యాయవాణి ప్రింటింగ్ ప్రెస్, రాజమహేంద్రవరము - 1971. పుట - 130.

# 10. వల్లూరు సంస్థానం

## చారిత్రక నేపథ్యం

కృష్ణామండలం వుయ్యూరుకు పడమరగా కృష్ణానది తూర్పు గట్టున వల్లూరు సంస్థానం ఉంది. పూర్వం ఇది కొంతకాలం నూజివీడు, చల్లపల్లి సంస్థానాలలో ఉండేది. ఈ సంస్థానం మూల పురుషుడు ఎడ్ల నాగన్న. ఇంటిపేరు బొమ్మ దేవర వారు. వీరు ఎడ్ల వారు. 1798-1799లో టిప్పుసుల్తానుకు కుంఫిణీ వారికీ జరిగిన యుద్ధంలో కుంఫిణీ వారికి కావలసిన యుద్ధ సామగ్రిని పంపిణీ చేసే కాంట్రాక్టరు నాగన్న. కాంట్రాక్టరుగా సొమ్ము బాగా సంపాదించుకుని కుంఫిణీ వారి సహాయంతో 1803లో హవేలీ ఎస్టేటయిన వల్లూరును కొనుగోలు చేసి కోట కట్టుకున్నాడు.

హైదరాబాదు బందరుల మధ్య సైనిక సామగ్రిని రవాణా చెయ్యడానికి నాగన్న నియమితుడయ్యాడు. నాగన్న చేసిన సేవలకు మెచ్చుకుని కుంఫిణీవారు కులక్రమానుగతంగా రాజా బిరుదిచ్చి నాగన్నకు గౌరవించారు. ఈ సంస్థాన పాలకులలో నాగన్న మనుమడు ఇమ్మడి నాగన్న రాజ్య వ్యవహారాల్లో చాలా తెలివి గలవాడు. సంస్థానాన్ని విస్తరింపజేసాడు. 1857 సిపాయీల తిరుగుబాటు సమయంలో కుంఫిణీ వారికి వస్తువులను ఆహారాన్ని రవాణా చేసి వారి మెప్పుపొందారు.

వసంతవాడలో వేంకటేశ్వరస్వామి దేవళాన్ని నిర్మించాడు. వల్లూరులోని వేణుగోపాలస్వామి దేవాలయాన్ని పునరుద్ధరించాడు. అక్కడ గాలిగోపురాన్ని కట్టించి, ఆ దేవునికి అంగరంగ వైభవంగా వెలిగేందుకు భూవసతులు ఏర్పాటు చేసాడు. చివరి సంస్థాన పాలకులకు కుటుంబ వ్యవహారాలలో వివాదాలు వచ్చి ఉత్తర వల్లూరు, దక్షిణ వల్లూరు అనే రెండు భాగాలుగా సంస్థానం విడిపోయింది.

రాజా బొమ్మదేవర ఇమ్మడి నాయడు బహద్దర్ గారికి లలిత కళల పట్ల, జాతీయ కళల పట్లా ఎంతో అభిమానం ఉండేది. దసరా వేడుకలలో కళా విద్యా ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. భరత నాట్యం, సంగీత, సాహిత్య గోష్ఠులు, మల్లయుద్ధం మొదలైన కళలను ఎంతో గౌరవించేవారు.

వల్లూరులోని వేణుగోపాలస్వామి ఉత్సవాల సమయంలో కూడా కళా ప్రదర్శనలు ఉండేవి. సత్యనారాయణ వరప్రసాదు (1906-1917) గారి కాలంలో ఆంధ్ర గాయక పితామహుడు గరికపర్తి కోటయ్య దేవర గారు ఆస్థాన విద్వాంసునిగా ఉన్నారు. అశ్వధాటి రామమూర్తి, హరి నాగభూషణం మొదలైన విద్వాంసులను ఈ సంస్థానంలో సన్మానించి తన కళాభిమానాన్ని నిరూపించుకుంది.

# వల్లూరు సంస్థానంలోని వాగ్గేయ కారులు - వాఙ్మయం

## దాసుశ్రీరాములు (1864 - తెలియదు)

న్యాయవాదవృత్తిని చేపట్టి సాహిత్య సంగీత శాస్త్రాలను కూలంకషంగా చర్చించ గలిగిన దిట్ట దాసుశ్రీరాములుగారు. సంస్థానాధిపతుల సహాయంతో తాఁజదివి, తన ఇష్టంతో తన ధన సంపత్తితో సంగీత కళకు సేవలందించారు. ఈయన గొప్ప వాగ్గేయ కారుడు. 1846 ప్రాంతంలో పుట్టారు. నూజివీడు సంస్థానంలోని ఆకిరి పల్లి గ్రామంలో సంస్కృత విద్యను అభ్యసించారు. శోభనాద్రి అప్పారాయణింగారు (నూజివీటి ప్రభువు) శ్రీరాములు గారికి రోజుకు రు.0-8-0 లు వంతు విద్యార్థి వేతనాన్ని ఇచ్చేవారు[1]. సంస్కృత విద్యాభ్యాసానికి కేవలం పది నెలలు అక్కడ ఉన్నారు.

వల్లూరు సంస్థానంలో కూడా కొన్ని పరీక్షలు రాశారు. ఆయన వల్లూరు సంస్థానంలో పరీక్షలు రాయడానికి వెళ్ళినప్పుడు తోట్ల వల్లూరు జమీందారు బొమ్మదేవరనాగన్ననాయుడుబహద్దూర్ గారుండేవారు. ఆ తర్వాత ఏలూరులో లా ప్రాక్టీసు పెట్టారు. బొమ్మ దేవర ఆస్థాన గ్రామంలో తోట్ల వల్లూరు వేణుగోపాల స్వామికి అంకితంగా జావళులు, పదాలు, స్వరజతులు, కృతులూ రాశారు. ఆ ప్రాంతంలో ఆకాలంలో ఉన్న వారాంగనలు ఈ పాటలను పాడుతూ ప్రచారంలోకి తెచ్చారు.

ఈయన న్యాయవాద వృత్తి చేపట్టినా ఏలూరులో ఉన్నంత కాలం సంగీత సభలు జరుపుతుండేవారు. ఎంతోమంది శ్రీరాములుగారి ఇంట్లో జరిగే సంగీత సభల్లో పాల్గొనేవారు. సంగీతంలోనే కాక అభినయంలో కూడా శ్రీరాములు గారికి ప్రవేశం ఉంది. నాట్యాన్ని స్వయం కృషితో నేర్చుకున్నారు.

'అభినయ దర్పణం' అనే కావ్యం కూడా రాశారు. వారకాంతలకు శ్రీరాములుగారు దగ్గరుండి స్వయంగా నాట్యాన్ని వివిధ నాట్య రీతులను నేర్పేవారు. ఆయన ఎదురుగా నాట్యం చెయ్యడానికి వారకాంతలు భయపడేవారు. అయినా పూర్తి పరిజ్ఞానం రావాలంటే దాసుగారే వారికి శరణ్యం అని దాసుగారిని ఆశ్రయించేవారు. వారిలో భరత శాస్త్ర ప్రవీణులైన నాట్య కారిణులు చదలవాడ పిచ్చాయి, చక్రధరరావు తల్లి పినపాలభవాని ఇంకా చాలా మంది ఆయన దగ్గర అభినయం చేసి పేరొందిన వారే.

సహజంగా శ్రీరాములుగారు సంగీత రసజ్ఞుడు. అభినివేశం ఉండడం చేత, ఏలూరు ప్రాంత పరిధిలో ఎటువంటి సంగీత సంబంధ పాఠశాల లేకపోవడం చేత, గాన విద్య అక్కడ అంతగా ప్రచారం లేకపోవుట చేత ఒక సంగీత పాఠశాలను ఏలూరులో ఏర్పాటు చేశారు.

అదీగాక ఆకాలంలో స్త్రీలు చదువుకోడం మహాపాపంగా భావించేవారు. ఇక సంగీతాభ్యాసం చెయ్యడం అంటే ఆలోచించే ప్రసక్తే లేదు. ఎవరైనా సంగీతాభ్యాసం చేసే వాళ్ళుంటే సంగీతం, నాట్యం నేర్చుకునే వాళ్ళు వేశ్యలే కాబట్టి వారిని వేశ్యలతో సమానమని భావించేవారు. ఆనాటి సమాజంలో ఒక విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలని "శ్రీరాములుగారు స్త్రీకి చదువు చాలా అవసరమని అలాగే సంగీతం పాడటానికి పురుషుని కంటే స్త్రీయే తగినదని నిరూపించారు.2 ముందుగా తనకూతురు శారదాంబకు సంగీత సాహిత్యాలను నేర్పించి లోకాన్ని ఎదిరించి నిలిచిన మనీషి శ్రీరాములుగారు. అప్పుడు శారదాంబకు ఏడేళ్ళు. ఏలూరు పాఠశాలలో ఎందరో గాయకులకు కళావంతులకు శ్రీరాములుగారు సన్మానం చేశారు.

ఏ సంస్థానాధిపతైనా ఏ విద్వాంసుడైనా గౌరవించినా, స్నేహపూర్వక మర్యాద చేసినా, ఆదరించినా దానికి కృతజ్ఞతగా ఏపాటో, కృతో, జావళినో ఆ విద్వాంసుడు రాసి అంకితమిచ్చే ఆనవాయితీ ఆంధ్ర దేశంలో ఉండేది. శ్రీరాములుగారు కృతజ్ఞత, మైత్రీ చూపించారు గానీ రచనలు చేసి ఎవరికీ అంకిత మివ్వలేదు.

## దాసు శ్రీరాములుగారి రచనలు

'జావళీలు - పదములు' అన్న పేరుతో మహాకవి దాసుశ్రీరాములు స్మారక సమితి, హైదరాబాదు వారు శ్రీరాములుగారి రచనలను 1991లో ప్రచురించారు. అందులో 24 జావళులు, 23 పదాలు ఉన్నాయి. ఇవి కాకుండా శ్రీరాములుగారి మరికొన్ని రచనలు ఆయన మనుమడు దాసు అచ్యుత రావుగారి నుండి లభ్యమయ్యాయి. అది నకలు ప్రతి.

అచ్యుతరావు గారి ద్వారా లభ్యమైన నకలు ప్రతి మొదటి పుటలో ఈ వివరాలున్నాయి. "ఏలూరు గ్రామవాసి, ఫస్ట్ గ్రేడ్ ప్లీడరు అయిన దాసు శ్రీరాములుగారు రాసిన కృతులు రాజా బొమ్మదేవర వేంకట నరసింహనాయుడు బహద్దరు జమీందారు గారి ప్రేరణ వల్ల ఈ రచనలు చేసినట్లు, అది పుస్తకంగా 1887 వ సంవత్సరంలో ప్రచురించినట్లు రాశారు. (చూడు - అనుబంధం -V)

ఇందులోని కొన్ని కృతులు దేవతాస్తుతులు. వినాయకుని స్తుతి - హిందూస్థానీ కాఫీ రాగం- అటతాళంలోనూ సరస్వతీ ప్రార్థన - శ్రీరాగం ఆదితాళంలోనూ, శ్రీరామ కృతులు హిందూస్థానీ భైరవి, పూర్వీకళ్యాణి, సురట, కమాచి మొదలైన రాగాలలో రాశారు. కొన్ని కృతులు కృష్ణుని మీద, చివరికృతి జగదంబ మీద కళ్యాణి రాగంలోను కూర్చినవి. "తత్వ ప్రతిపాదకమైన కృతి" పేరుతో సురటరాగం - మధ్యాది తాళంలో ఉన్నది. అఠాణరాగం - అటతాళంలో లక్ష్మీకృతి రాశారు.

స్తుతి రూపంగా రాసిన దాసు శ్రీరాములుగారి కీర్తనలు సాహిత్య ప్రధానమైనవి, భక్తి ప్రధానమైనవి. ఈ కీర్తనలలో పల్లవి రెండు లేక మూడు లేక నాలుగు చరణాలున్నాయి. వీటిని ఏకధాతు కీర్తనలు, ద్విధాతు కీర్తనలుగా చెప్పవచ్చు. పల్లవి చరణాలు ఒకే విధంగా పాడేటట్లుగా గతి ఉంటుంది. అది ఏకధాతు కీర్తన మవుతుంది. ద్విధాతు కీర్తనంలో పల్లవి ఒక విధంగానూ చరణాలు మరొక విధంగానూ గతిలో మార్పు ఉంటుంది. అదేవిధంగా కీర్తనలు రక్తి రాగాలలో కూర్చారు. సరస్వతీ ప్రార్థనం శ్రీరాగంలో ఆదితాళంలో, మానవతీ జ్ఞానవతీ అనే కీర్తన పల్లవి చరణాలు ద్విధాతు కీర్తనగా ఉంది.

అఠాణరాగం - అటతాళంలో లక్ష్మీ కృతి ఇలా వుంది.

పల్లవి : రావే తల్లి మా యింటికి - లక్ష్మీదేవి నిన్నే నమ్మితి నెప్పటికి - సావ
ధానముగా వినవె నా మనవి - జనవినుత మగు నీ సేవ చేదీరుగాదనివి
భావజ జనని భక్త పోషిణి పరమకరుణారసావేశ -
మావ హిత నాదు కొనవే హృదయమున పాడు కొనవే రా!

పల్లవి ఎంత పెద్దదో చరణాలు అంతే పెద్దవి. తనయింటికి రమ్మని లక్ష్మీదేవిని ప్రార్థించడం ఇందులోని వస్తువు. చరణాలలో ఉపయోగించిన పదావళి కొత్త తరహాగా ఉంది. "మదనారి సోదరి" "కలుముల మిఠారి"

"జగధారి దేవుడైన గదాధర పేరురము నీకిలు గదా!" ఇటువంటి పదాలు అంతగా ఉపయోగించ లేదనే చెప్పాలి. దాసుశ్రీరాములుగారు ఉభయ భాషా ప్రవీణులు. ఆయన రాసిన కొన్ని కీర్తనలు పూర్తిగా సంస్కృత భాషలో ఉన్నాయి.

ఇవి కేవలం మూడు మాత్రమే లభ్యమయ్యాయి. తత్వ ప్రతిపాదకమైన కృతిలో

పల్లవి : మదారి కులభంజనం - భజేభజే

మదారి కులభంజనం - సదా నిరంజనం - సర్వలోక రంజనం

1.చరణం : నీవార శూక వదను కలితం నిత్యానందయుతం - తం

శాంతం - భావా భావ వర్జితం - భవాది నందితం - భక్త లోక వందితం ॥మదార॥

ఈ కృతిలోని మిగిలిన రెండు చరణాలు కూడా ఇదే వరవడిలో ఉన్నాయి. ఇది సురటరాగం - మధ్యాది తాళంలో కూర్చిన కృతి. దాసు శ్రీరాములు గారు రాసిన ఏకృతినీ ఎవరూ స్వరపరచి ప్రచురించ లేదు. రాగం, తాళాలను మాత్రం నిర్దేశించారు.

సంస్కృత భాషలో రాసిన మరో కృతి రాముని మీద రాసినది. ఇది కూడా సురట రాగంలో కూర్చినది. ఆదితాళంలో ఉంది.

పల్లవి : రామనామ మంత్రం - భవతి భవరక్ష శ్శీక్షా తంత్రం - కామాది

శత్రు దళనయంత్రం - కవి కలుష విశోషణ స్వీతింత్రం ॥రామ॥

1 చరణం : రామనామ కేవల మమృతం రామ నామ ముని భిః పరిపఠితం ॥రామ॥

ఈ కృతిలో ప్రత్యేక లక్షణం పల్లవి కంటే చరణాలు నిడివి చిన్నవి. పల్లవి రెండు పంక్తులుంటే చరణం ఒకటీ ఒక పంక్తి ఉండటం విశేషం.

మూడవ కృతి శ్రీకృష్ణుని మీద రాసినది. ధన్యాసిరాగం మధ్యాది తాళంలో కూర్చారు.

పల్లవి : కృతకృత్యాభవితాసిరసనే - కృష్ణనామ జపరే రసనే కృష్ణనామ జపరే.

శతమఖ ముఖ సురసేవితం - నతా ధృతం - సమ్మతీం - ॥కృత॥

అలతి అలతి పదాలతో భావాన్ని సులభంగా అర్థం చేసుకొనే విధంగా ఈకీర్తనలలోని భాష ఉన్నది. స్తుతి పూర్వకమైన రచనలు ఇవి. మిగిలిన రచనలు తెలుగు భాషలో రాసినవి. అన్ని కృతులలోని వస్తువు "రక్షించమని వేడుకొనుటే". "వరదాసు శ్రీరామ" శ్రీరామదాసుని బ్రోవ "దాసు శ్రీరామ కవికృతి" అనే ముద్రతో ఈయన కృతులు రాశారు.

తోట్ల వల్లూరు దేవుడైన వేణుగోపాలుని మీద కొన్ని పదాలు, కృతులు, జావళులు కూడా రాశారు. ఈ రచనలు అభినయానికి అనుకూలంగా ఉంటాయి. వేణుగోపాలుని ప్రియునిగా భావించి రాసిన కృతిలో అత్తవారింటికి వెళ్ళబోతూ విరహతప్త అయిన ఒక నాయిక తన ప్రియునికి వీడ్కోలు చెప్తోంది. ఈ విధంగా.

"పోయివచ్చెదసామి - అత్తింటికి పోయివచ్చెదసామి

హాయేమిసేతు నన్యాయముగా మన నీయెదలను దైవమెడ

బాపెనయ్యయొ॥

మన చెలిమిని ఎప్పటికీ మరువవద్దు సుమా! తిండి నిద్రా తెలియకుండా అంతటిస్నేహం చేశాం. పడుచుకత్తెల స్నేహాన్ని వీడలేక కన్నీరు ఎందుకు కారుస్తారు. మనసు రాయి చేసుకొని నాతనువు నీదయినా ఏదో విధంగా బ్రతుకుతాను అంటుంది ఆనాయిక.

మరొక కృతిలో "నిన్ను చూసినప్పటినుండి తిండి, నిద్రా ఎఱుగను. ఓ సామీ! నన్నందరిలో నవ్వుల పాలు చెయ్యడం నీకు న్యాయమేనా! అయినా అందరాని పండ్ల కోసం ఆశపడినట్లయింది నా బతుకు. నీ చిత్రాన్ని గీసుకుని, నిన్నే మనసులో ప్రతిష్ఠించుకుని ఊహించుకుంటూ కన్నీటితో కాలక్షేపం చేస్తున్నాను. నా మీద దయాదాక్షిణ్యాలు చూపవయ్యా అని ఓ కాంతామణి నాయకుణ్ణి ఆహ్వానిస్తుంది.

అదే విధంగా ఉత్తరం రాసి రమ్మని చేర బిలచిన నాయకునికి నాయిక సమాధానం మరొక కృతిలో వ్యక్తం అవుతుంది. దాసు శ్రీరాములుగారి ఈ రచనలలో భక్తి, విన్నపం, శృంగార రస భావాలతో ఉండి తెలుగు భాషలో గల పాండిత్య ప్రకర్ష, నుడికారం, జాతీయతల మీదుండే అభిమానం స్పష్టంగా ప్రకటితమయ్యాయి. తోట్ల వల్లూరు ప్రాంతంలో శ్రీరాములు గారి రచనలు ప్రచారంలోకి తెచ్చిన ఘనత ఆ ప్రాంతపు ఆటవెలదులకే దక్కింది. తన పర్యవేక్షణలో ఆ ప్రాంతవార కాంతలకు సంగీత, అభినయ విద్యలలో ఎన్నో మెళుకువలు గ్రహింపజేసిన ఘనత దాసు శ్రీరాములు గారికే దక్కింది.

## అధస్సూచికలు

1. మహాకవి దాసుశ్రీరామ స్మారక సమితి, మహాకవి దాసు శ్రీరాములు జయంతి సంచిక; హైదరాబాదు - 1975; పుట - 2.

2. ''అదే '' పుట - 8.

# II. చల్లపల్లి సంస్థానం

కృష్ణాజిల్లా లోనున్న సంస్థానాల్లో ఒకటి చల్లపల్లి సంస్థానం. ఈ సంస్థానానికి మూల పురుషులు గుర్వినీడు. వీరు యార్లగడ్డ వారు. కమ్మవారు. రేచర్ల గోత్రికులు. వీరికి ముక్త్యాల సంస్థానంతో వైవాహిక సంబంధాలు ఉన్నాయి. నిజాం నవాబు నుండి రాజా బహద్దరు జబ్బతుల్ అక్రాన్ బిరుదుల్ని పొందారు వీరు. యార్లగడ్డ మల్లికార్జున ప్రసాద నాయుడు బహద్దుర్ గారు ముక్త్యాల ప్రభువు వాసిరెడ్డి భవానీ ముక్తీశ్వర ప్రసాద్ బహద్దర్ గారి పుత్రిక విశాలాక్షమ్మను 1876 లో పరిణయమాడారు. వీరి కుమారుడు కుమార రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దరు (1877-1927) ముక్త్యాల ప్రభువు చంద్ర మౌళీశ్వర ప్రసాద్ నాయుడుగారి సోదరి భవాని దేవిని పెళ్ళి చేసుకుని 1921 లో జమీకి వచ్చారు. వీరి వంశంలో చివరి పాలకుడు అంకినీడు శివరామ ప్రసాదు.

ఈ సంస్థానంలో మల్లికార్జున ప్రసాదనాయుడు గారికి చిత్రకళ, సంగీత, సాహిత్యాలలో అభిరుచి మెండు. వీరి కాలంలోనే ఆంధ్ర గాయక పితామహులుగా పేరొందిన గరికపర్తి కోటయ్య దేవర ఆస్థాన విద్వాంసునిగా ఉన్నారు. చల్లపల్లి సంస్థానంలో పనిచేసే ఇతర ఉద్యోగులు కూడా సంగీత కళకు ఎంతో ప్రోత్సాహాన్ని, వ్యాప్తినీ కలిగించారు. అటువంటి వారిలో పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారు ఒకరు.

ఈ సంస్థానాధిపతులు సంగీత వాఙ్మయాన్ని సృష్టించినట్లు లేదు. కానీ సంస్థాన ప్రాంతంలో సంగీత వ్యాప్తికి కృషి చేసిన విద్వాంసులు, సృష్టి కర్తలూ ఉన్నారు.

# మొదటి భాగం
# చల్లపల్లి సంస్థానంలోని వాగ్గేయకారులు - వాఙ్మయం

## గరికి పర్తి కోటయ్య దేవర (1861-1924)

ఆంధ్ర గాయక పితామహునిగా పేరొందిన గరికిపర్తి కోటయ్య దేవర మచిలీ పట్నంలోని ఇంగ్లీషు పాలెంలో 1861 లో జన్మించారు. హైదరాబాదు సంస్థానంలోనూ తోట్ల వల్లూరు, చల్లపల్లి సంస్థానాల్లో ఆస్థాన విద్వాంసునిగా గౌరవాన్ని పొందారు.

ప్రతి మనిషికీ ఏ విద్య అబ్బాలన్నా పూర్వజన్మసుకృతంతో బాటు పరిసరాల ప్రభావం, ఆ విద్యకు సంబంధించిన వాతావరణం ఉండాలి. లేదా ఆ విద్య మీద అభిమానంతో దాన్ని పొందాలన్న ఆశతో ప్రయత్నించాలి. జంగమ కులంలో పుట్టిన కోటయ్యదేవరకు అవేమీ అవసరం లేకుండానే సంగీత వాతావరణంలోనే పుట్టారు. తండ్రి వయొలిన్ వాయిస్తే తప్ప నిద్రపోయేవారు కాదు. అన్న ప్రాశన చేసినప్పుడు వస్తువులనన్నిటినీ వదిలేసి వయొలిన్ తీగలు మీటడం సంగీతాభ్యాసానికి మరింత ప్రోత్సాహకాలయ్యాయి. గరికి పర్తి దేవర గారు పుట్టిన మూడవ ఏట అంటే 1864 బందరుకు పెద్ద ఉప్పెన వచ్చింది. అందరూ ప్రాణభీతితో పరిగెత్తి పారిపోతుంటే కోటయ్య దేవర తల్లిదండ్రులు కూడా పసివాడైన కోటయ్యను వదిలి వెళ్ళిపోయారు. భూమ్మీద ఆయువుంటే అడవుల్లో వున్నా ప్రాణానికి ఎటువంటి ముప్పురాదన్నట్లుగా ఆవరదల్లో కొట్టుకుపోతూ కోటయ్య

పడుకున్న ఉయ్యాల ఒక కుంకుడు చెట్టు కొమ్మకు తగుల్కొంది. ఆ విధంగా బతికి బయట పడ్డాడు కోటయ్య. చిన్నతనంలో ఒక కొబ్బరి చిప్పకు తీగలు కట్టి గుజ్జువు వెంట్రుకల కమానుతో వాయించేవాడు. కోటయ్య చదువు మీద అంతగా శ్రద్ధ చూపించేవాడు కాదు. తన కొడుకు సంగీతాభిరుచిని గమనించిన లక్ష్మయ్య కోటయ్యకు సరళీ స్వరాలు నేర్పాడు. ఆ స్వరాలను చిప్పకు కట్టిన తీగల మీద వాయిస్తుంటే అతని వేళ్ళు నాట్యం చేస్తున్నట్లే వుండేవట.

ఎంతోమంది ఆ దృశ్యాన్ని చూస్తూ ఎంతో ఆనందించేవారు. నెమ్మది నెమ్మదిగా స్వరాలు శ్రుతి బద్ధంగా లయబద్ధంగా స్వయంగా నేర్చుకున్నాడు కోటయ్య.

చదువు మీద శ్రద్ధ లేకపోయినా మొత్తానికి సెకండరీ స్థాయి వరకూ పూర్తి చేశాడు. జీవనోపాధి కోసం తల్లిదండ్రులు హైదరాబాదు వచ్చేసారు. అలవాటు ప్రకారం తీరుబాటు దొరికితే కోటయ్య తన వయోలిన్ వాయించుకుంటూ ఉండేవాడు. అలా వాయించుకుంటూ పాడుతున్న కోటయ్యను హైదరాబాదు సంస్థాన మంత్రి సర్ సలాగ్‌జంగ్ బహద్దూర్ చూసి వాద్యం విని ఆనందపడి చిన్నన్న అనే గాయకునికి అప్ప జెప్పి సంగీతం నేర్పించాడు. ఆయన వద్ద పదేళ్ళ పాటు సంగీతం నేర్చుకున్నాడు. 1885 వరకూ నిజాందేవిడిలో జరిగే సంగీతసభల్లో ప్రముఖ హిందూస్థానీ గాయకుల గానాన్ని వింటూ ప్రత్యేకించి తన వాద్యానికి ఒక ప్రత్యే బాణిని శోభాయమానంగా చేసుకున్నాడు. సంగీత ప్రవీణుడైన కోటయ్యదేవరను గాయకుడుగా తయారు చేసి రాజగోపాలాచారి అనే జాగీరుదారు నవాబ్ జఫర్ జంగ్ దేవిడీలో గవాయిగా (గాయకునిగా) నియమించేడు.

ఆ తర్వాత హైదరాబాదు సంస్థానంలో గవాయిగా నియమితుడయ్యాడు. గవాయిగా తనను నియమించినందుకు కృతజ్ఞతగా రాజగోపాలాచారి పేరు మీద ఒక వర్ణాన్ని రాశాడు కోటయ్య దేవర. ఈ రచన లభించలేదు. కోటయ్య అన్నగారు అతనికి అత్యంతం చేదోడు వాదోడుగా ఉంటూ అతని సంగీతజ్ఞతకు మరికొంత మెఱుగులు దిద్దుకోడానికి, అతనిని తంజావూరుకి పంపించేడు. 1894 సంవత్సరంలో దక్షిణాది పర్యటనలో కోటయ్య దేవర సియాళి నారాయణస్వామిఅయ్యర్, తిరుక్కోడికావై కృష్ణయ్యర్‌లతో కలిసి తంజావూర్ హెచ్.ఎస్. సకారా మహారాజా ఆస్థానానికి వెళ్ళాడు. గవాయి వేషంలో ఉన్న కోటయ్య దేవరను చూస్తూ మహారాజా మహమ్మదీయుడనుకున్నారు. అతను కర్ణాటక శాస్త్రీయ సంగీతం పాడుతాడంటే రాజు మరింత ఆశ్చర్య పోయాడు. అప్పటికే హైదరాబాదు విద్వాంసునిగా అతని కీర్తి రాజావారు వినే వున్నారు. రాజావారు దేవర పాటను విని ఆస్థాన విద్వాంసునిగా ఉండమని కోరాడు. రాజుకు మాట ఇవ్వలేక సున్నితంగా తిరస్కరించాడు. అతనిని ఘనంగా సన్మానించారు రాజా. 1869 వరకు దక్షిణాది పర్యటన ముగించుకుని కోటయ్య తిరిగి బందరు వచ్చేశాడు. అక్కడ సంగీత పాఠశాలను ఏర్పాటు చేసి తానార్జించిన ధనంతో అనేక మంది విద్యార్థులకు సంగీత బోధ చేశాడు. వారికి ఉచితంగా భోజన వసతుల్ని కలిగించాడు. వారికి విద్యాదానం ఇతర సౌకర్యాలకోసం అయ్యే ఖర్చు వల్లూరు, చల్లపల్లి సంస్థానాధి పతులు ఇచ్చేవారు. ఆ విధంగా జమీందారులు తమ కళాభిమానాన్ని నిలబెట్టుకున్నారు. కోటయ్యకుండే లోకానుభవం వల్ల ఏర్పరచుకున్న బాణీ దేవర బాణీగా ప్రసిద్ధి పొందింది.

ఒకనాడు వల్లూరు సంస్థానంలో రాజావారు గాన సభ ఏర్పాటు చేశారు. ఆసభలో కోటయ్య తన పెంపుడు కుక్కల చేత ఆర్గాను తొక్కించి వాయింపించేడు. అందరిలాగే గరికపర్తి కోటయ్య దేవర కూడా అనేక దక్షిణాది సంస్థానాల్లో సన్మానితులై సంగీత విద్యావ్యాప్తికి కృషి చేశారు.

గరికిపర్తికోటయ్యదేవర రాసిన కొన్ని రచనలు మాత్రమే లభ్యమయ్యాయి. ఇవి వ్యవహారంలో ఇప్పుడు కూడా విద్వాంసులు సభలలో పాడుతున్నారు. నాగస్వరావళి రాగం - ఆదితాళంలో "కైలాసగిరి నివాస" అనే గీతం, "ఉమాభరణరాగం - ఆదితాళంలో తానవర్ణం "మనసు నీపై యుంచి" అనే రచన వసంతరాగం - ఏకతాళంలో స్వరజతి "సామితనివి తీరముదంబొసగుము" ఈ రచనలు స్వరయుతంగా లభించాయి. ఏగ్రంథంలోనూ ముద్రితమవ్వలేదు.

ఉమాభరణ రాగం - ఆదితాళంలోని తాన వర్ణం

మనసునీపై యుంచి చాల మరులు కొన్నదిర

శ్రీరామలింగ ఏలుకోర కోటయనుత...

వసంత రాగం - ఏక తాళంలో స్వరజతి

సామి తనివితీర ముందబొసంగుము వసంత సమయము

నేనీ దానని యానందించితి । గాన దాని మనసార గూడినది

గానవైతి విధి నిదానంబు సుమ

పంచబాణుడతి - పొంచి తనకు విలువంచి

శరాళిని మించి విడిచెగద....

.. ఈవిధంగా సాగే ఈ స్వరజతిలో పంచబాణుని కాలం వసంతం. ఆవసంత సమయం వచ్చిన కారణంగా వసంతుని వెంటనిడుకొని, ఏ మాటునో ఉండి, మదనుడు యువతీయువకుల మనసుల మీద గురిచేసి మదన బాణాలు వేస్తాడు. ఓరాజా! సమయం రానేవచ్చింది. నేను నీదాననని ఎంతో ఆనందించాను. కాని మనసార నీతో కూడినది లేదు. విధి నిదానం సుమా! అంటూ ఈ స్వరజతిలో ఒక నాయిక తన మనోగతాన్ని ప్రకటిస్తుంది.

సంగీత విషయంలో అమరిక, నడిచే వేగాలలో వర్ణాన్ని పోలి ఉండే స్వరజతిలో పల్లవి, అనుపల్లవి, చరణాలు అనే విభజన సర్వ సాధారణంగా ఉండే లక్షణం. కోటయ్యదేవర రాసిన ఈ స్వరజతిలో పల్లవి నాలుగు చరణాలు ఉన్నాయి. సంగీతాభ్యాసంలో గీతం, స్వరజతి, తానవర్ణం ఈ మూడూ పద్ధతి ప్రకారం ఒకదాని తర్వాత మరొకటి నేర్చుకోదగినవి. ఈవిధంగా సంగీత రచన చేసి వాఙ్మయ వృద్ధికి తోడ్పడ్డారు కోటయ్య దేవర.

## శ్రీహరి నాగభూషణం (1884 - 1959)

దాసు శ్రీరాములుగారి లాగే న్యాయవాద వృత్తి చేపట్టి సంస్కృత భాష నేర్చుకొని నిష్ణాతులైన హరి నాగభూషణం గారు వయోలిన్ వాద్యకారులు. ద్వారం వెంకట స్వామి నాయుడు గారి కన్నా ముందే జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న వాగ్గేయ కారుడు 24-12-1884 లో కృష్ణాజిల్లా మచిలీపట్టణంలో జన్మించారు. తండ్రి నృసింహశాస్త్రి కొంతవరకూ సంగీతంలో హరి నాగభూషణానికి శిక్షణ నిచ్చారు. ఆ రోజుల్లో నరసింహశాస్త్రిగారు గొప్ప సంగీత విద్వాంసులు. 13వ ఏట ఆనందభైరవి, రీతిగౌళ, మలయమారుతరాగాలలో తాన వర్ణాలు రాశారు.

ఒకప్పుడు త్యాగరాజ స్వామి శిష్యులైన నయక్కారు పట్టి సుబ్బయ్య కుమారుడు శేషయ్య మచిలీ పట్టణంలో సంగీత గాన సభలో పాడగా ఆయనకు వయోలిన్ వాయించారు నాగభూషణంగారు.

వయోలిన్ వాయించడంలో మెలకువలు తెలుసుకొంటూ మద్రాసులో పెద్ద పెద్ద విద్వాంసుల అనుభవాల సారాన్ని తెలుసుకొంటూ తన ప్రతిభచేత దక్షిణాది విద్వాంసులను మెప్పించేరు. తిరువయ్యూరు త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు.

1910లో తొలిసారిగా తన యింట త్యాగ రాజ ఉత్సవాలను ప్రారంభించారు. కళా పిపాసకుడైన నాగభూషణంగారు 1911లో బందరులో త్యాగరాయ సమాజం అనే సంగీత సంస్థను ఏర్పాటు చేశారు. ప్రతీ సంవత్సరం ఆరాధనోత్సవాలు నిర్వహిస్తూ ఎందరెందరో కళా కారులను అక్కడికి రప్పించి సన్మానాలు చేసి, సంగీత కచేరీలు నిర్వహించేరు.

చల్లపల్లి సంస్థాన ప్రాంతంలో నివసించినా హరినాగభూషణంగారు ఆంధ్ర దేశంలో ఏసంస్థానంలోనూ ఉన్నట్లు దాఖలాలేదు. 1916లో బరోడా సంస్థానంలో జరిగిన సంగీత పరిషత్సమావేశంలో ఆ సంస్థానాధిపతి ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. 22 శ్రుతుల గురించి తన వాదనను ఆ సభలో ప్రదర్శించి అందరినీ ఒప్పింపచేసి, "గాయకరత్న" బిరుదాన్ని పొందారు. దక్షిణ దేశంలో మైసూరు, కుంభకోణం, తిరువయ్యూరు, తంజావూరు మొదలైన చోట్ల నాగభూషణం గారు సంగీత సభల్లో పాల్గొని అనేక సన్మానాలు పొందారు. టైగర్ వరదాచారి వంటి గాయకుల చేత స్తుతి పొందిన వారు.

ద్వారం వెంకటస్వామి నాయుడుగారు హరి నాగభూషణంగారు సమకాలికులే. ఒక సంగీత కళాభిమాని నాగభూషణం గారితో ఇలా అన్నారు. "మీరూ ద్వారం వారూ కలిసి కచేరీ చేయాల్సి వస్తే ఎలా వుంటుంది" అని. అందుకు హరినాగభూషణంగారు నవ్వి ఏ మవుతుంది మేమిద్దరం కలిసి సభ చేస్తే "హరిద్వారం" అవుతుంది అన్నారు.

1912లో 28వ ఏట మద్రాసులో తచ్చూరి సింగరాచార్యుల వారి చేత సువర్ణఘంటాకంకణాన్ని తొడిగించుకుని సన్మానితులైన నాగభూషణంగారు ఎన్నో రచనలు చేశారు. త్యాగరాజ చరిత్ర శంకరాచార్య చరిత్ర లాంటి కావ్యాలు రాశారు.

ఈయన మాధవ ప్రియ అనే రాగాన్ని సృష్టించి ఆరాగంలో సంస్కృత కీర్తన ఒకటి రాశారు.

పల్లవి : "మాధవ ప్రియే మహిమాతిశయే మంగళాలయే భావయే త్వాం

అనుపల్లవి : సాధుజనావనేక్షేవవసనే శశి నిభవదనే - సారస నయనే॥

చరణం : క్షీర సాగరకుమారి - వరే శ్రీరంగ ధామేశ్వరీ - పరే

మారజనని గంభీర భాషిణీ మానిత త్యాగయోగ పరిపాలిని"[1]

ఈ కీర్తనలో భగవన్నామ స్తుతే. ఈ మాధవ ప్రియరాగం స్వరస్థానాలు వివరించలేదు.

'త్యాగయోగ' అనేది నాగభూషణం గారి ముద్ర.

మరొక కీర్తన కాంభోజిరాగంలో సంస్కృత భాషలో రాశారు.

పల్లవి : "పారోక్ష్యం నస హేరామ తవ

అ.ప ॥ పారహీన సంసారార్ణవ వారి మగ్నోహం శరణం భవ॥

చరణం : త్యాగహీనో భోగహీనో రాగభోగ - రోగ ధానః

త్యాగయోగార్చిత, శృతిమాన॥"[2]

ఈ సంసారార్ణవంలో మునిగిన నాకు శరణం ఇయ్యి. త్యాగ భోగహీనుడను. రోగనిధానుడను. నీవియోగం సహించలేను. నాకు శరణం నువ్వే! అని భగవంతుని ప్రార్థించడం ఈ కీర్తనలోని వస్తువు. ఇవేకాక అనేక వర్ణాలను కృతులనూ కూడా రాశారు. సద్గురు శ్రీ త్యాగరాజుని భక్తి సంగీత ముల స్వరూపము అన్న వ్యాసం రాశారు. పుస్తకంగా ఆ వ్యాసాన్ని నూజివీడు జమీందారు ఎం. రామచంద్ర అప్పారావు బహద్దరు వారు ప్రచురించారు. ఈ వ్యాసం ఇంతకు పూర్వం కృష్ణా పత్రిక (పక్షపత్రిక)లో **4.3.47** న ప్రచురించారు.[3] త్యాగరాజస్వామి భక్తిని ఆమూలాగ్రం కీర్తనలలో గ్రహించి అందలి సారాన్ని సోదాహరణంగా రాశారు హరినాగభూషణం.

**30.1.1910** లో త్యాగరాజ ఆరాధనోత్సవాలను బుట్టయ్య పేట నాటక కళాశాలలో ప్రారంభించి జీవిత కాలం త్యాగరాజ సేవలను చేసిన మహానుభావులు హరినాగభూషణం. ఈయన స్వయంగా సంగీత సంస్థను ఏర్పాటు చేసి సంగీత కళాపోషణ చేసి ఆ విద్యా వ్యాప్తికి కృషి చేశారు.

# రెండవ భాగం

# చల్లపల్లి సంస్థానంలోని కళాకారులు

## పారుపల్లి రామకృష్ణయ్య పంతులు (1883-1951)

పారుపల్లి శేషాచలం, మంగయాంబ గార్లకు 1883 డిశంబరు 5వ తేదీ కృష్ణా జిల్లా శ్రీకాకుళం గ్రామంలో జన్మించారు పారుపల్లి రామకృష్ణయ్యపంతులుగారు. తండ్రి శేషా చలంగారు గొప్ప సంగీత విద్వాంసులు. త్యాగరాజస్వామి ప్రశిష్యులైన మానాంబు చావడి వెంకట సుబ్బయ్యగారి శిష్యులు సుసర్ల దక్షిణా మూర్తి శాస్త్రిగారి దగ్గర పంతులు గారు శిష్యరికం చేశారు. రాజనాల వెంకటప్పయ్యశాస్త్రి. ద్వివేదుల లక్ష్మణ శాస్త్రి, సుసర్ల గంగాధర శాస్త్రి, పట్నం సుబ్రహ్మణ్యయ్యర్, మహావైద్య నాథయ్యర్ మొదలైన మహామహులంతా పారుపల్లి రామకృష్ణయ్య గారికి సహాధ్యాయులు. చల్లపల్లిలో అడవి చిన పట్టాభిరామయ్య దగ్గర ఠాణేదారు ఉద్యోగానికి కొంత తర్ఫీదు పొంది, పెదకళ్ళే పల్లిలో ఠాణేదారుగా తన పన్నెండవ ఏటనే రామకృష్ణయ్య నియమితులయ్యారు.

వీరు చల్లపల్లి సంస్థానంలోని వారే. అనేక మంది విద్వాంసుల పాట కచేరీలు వినడం వల్ల రామకృష్ణయ్యగారికి వినికిడి జ్ఞానం బాగా అలవడింది. దానికి తగ్గట్టుగా తనకొక వైఖరిని ప్రత్యేకంగా ఏర్పరుచుకున్నారు.

వయోలిన్, మృదంగం, వేణువు, కంజరా వాద్యాలను వాయించ సమర్థులు కానీ గాయకులుగానే స్థిరపడ్డారు. వాద్యానికి స్వతంత్ర ప్రతిపత్తి అంతగాకానరాదు. గానానికి వాద్య సహకారం ఉన్నా లేకున్నా స్వతంత్ర ప్రతిపత్తి దానికి ఉండటం వల్ల ఆసంగతి గ్రహించిన పారుపల్లి రామకృష్ణయ్యగారు గాత్రాన్నే ఎన్నుకున్నారు.

అప్పట్లో 1915లో చెన్నపట్నం పాలకులైన పెంట్లండ్ ప్రభువుగారిచే తెనాలి పురపాలక వర్గం వారు సమర్పించిన స్వర్ణ పతాకాన్ని అందుకున్నారు పంతులుగారు. బరోడాలో అఖిల భారత సంగీత మహా సభలో పాల్గొని సన్మానితులయ్యారు.

ఎన్నో సభలలో ఎంతోమంది మహావిద్వజ్జుల ఎదుట గానం చేసి వారి మెప్పు పొందారు. స్వర్ణ పతకాలను పొందారు. కాకినాడ శ్రీరామ సమాజం వారు పంతులుగారికి 1928లో బంగారు గొలుసుతో పతకాన్నిచ్చి సన్మానించారు. పుష్పగిరి సంస్థానాధిపతులచే సన్మానితులయ్యారు. 1906లో పశ్చిమగోదావరి జిల్లా డిప్యూటీ కలెక్టరుగా ఉన్న భక్తవత్సలంగారు సంగీతాభిమానులు గొప్ప రసజ్ఞులు. రామకృష్ణయ్య పంతులు గారిని తెలుగు రాయుని పాలెం" అనే గ్రామానికి కరణంగా నియమించారు. అంతేకాదు భక్తవత్సలంగారు పంతులుగారి దగ్గర శిష్యునిగా చేరారు.

1921 వ సం॥లో రామకృష్ణయ్య పంతులు గారి గాన సభ కె.వి. శ్రీనివాసయ్యంగార్ మద్రాసులోనిగోఖలే హాల్లో ఏర్పాటు చేశారు. మైసూరు సంస్థానం విద్వాంసులు చౌడయ్యగారు వయోలిన్ కుంభకోణం అళహానంబిపిళ్ళై

మృదంగం, మద్రాసు వేలాయుధం పిళ్ళి కంజర ప్రక్క వాయిద్యాలను సమకుర్చారు. 1929లో విజయనగరంలో ప్రథమాంధ్ర సంగీత పరిషత్ వార్షిక సభకు అధ్యక్షులయ్యారు. ఆ సంవత్సరంలోనే ఆంధ్రా రీసెర్చ్ యూనివర్శిటీ చేత భారతీ తీర్థోపాధ్యాయ పట్టాన్ని పొందారు పంతులుగారు.

1931 లో అఖిలాంధ్ర పరిషద్వార్షిక మహాసభలో గాయక సార్వభౌమ అన్న బిరుదు పొందారు. ఇన్ని సన్మానాలు పొందిన గాయక సార్వభౌముడు సంగీత విద్యావ్యాప్తికి ఎంతో కృషి చేశారు. తన ఇంట వసతి కల్పించి భోజనాదులను ఇచ్చి ఉచితంగా విద్యార్థులను సంగీత బోధ చేశారు. "వీరి విద్యార్థులకు సంగీత రసికులైన డా. జంధ్యాల దక్షిణామూర్తి గారు వైద్య సేవ లందించేవారు"[1] రామకృష్ణయ్య పంతులుగారు తమ గానాన్ని దానికి ప్రతిఫలంగా అందించేవారు. మరో విశేషం ఆంధ్ర ప్రాంతంలోని విద్వాంసులు ఆకాశవాణిలో గానం చెయ్యాలంటే ఆకాశవాణి మద్రాసు గానీ తిరుచునాపల్లి గాని వెళ్ళ వలసి వచ్చేది. ఆ పరిస్థితిని ఆంధ్ర ప్రాంత విద్వాంసులకు జరిగే అన్యాయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొని వచ్చి విజయవాడలో ఆకాశవాణి కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు.[2] నిజంగా ఆకాశవాణి కేంద్రం పంతులుగారి చలవే. రామకృష్ణయ్య పంతులు గారు సంగీత సేవ చేసి 1951 లో భగవత్సాన్నిధ్యాన్ని పొందారు.

## అధస్సూచికలు

1. హరినాగభూషణం - శ్రీ త్యాగరాజుని భక్తి సంగీతముల స్వరూపము. ఎం.ఆర్. అప్పారావు బహద్దర్ (పచురణ), మద్రాస్, శ్రీ త్యాగరాజ మందిరం - ముందు మాట - పుట. 5.

2. గాయకసార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్యపంతులుగారు పి. అనంత రామన్ - గాన కళ - ఏప్రిల్ - మే - పుట . 18

# 12. పోలవరం సంస్థానం

## చారిత్రక నేపథ్యం

గోదావరి మండలంలో ఉన్న సంస్థానం పోలవరం. ఈ సంస్థాన పాలకులు కొచ్చెర్ల కోట వంశం వారు. ఆరువేల నియోగులు. కొచ్చెర్లకోట వేంకటజగన్నాథ రావుగారు పోలవరాన్ని పాలించిన మొదటి పాలకులు. తర్వాత సంస్థానపాలకులలో వేంకట జగన్నాథరావుగారు గొప్ప దేవీ భక్తులు. ఆ తర్వాత పాలకులు రాజా కొచ్చర్లకోట రామచంద్ర వేంకట కృష్ణారావుగారు. ఈయనకు కళాసాహిత్యాల మీద అభిమానం మెండు.

## కొచ్చర్లకోట రామరాజు (1878- తెలియదు)

తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడ గ్రామంలో 1878లో జన్మించారు కొచ్చర్లకోట రామరాజుగారు. ఆరువేలనియోగి బ్రాహ్మణులు. సంగీత సాహిత్య విద్యాధురీణులైన నాద యోగి బ్రహ్మశ్రీ చేబోలు వెంకట రత్నంగారి ప్రియశిష్యుడు కొచ్చర్లకోట రామరాజు. చిన్నప్పటినుండి ఆయన దగ్గరే సంగీత సాధన చెయ్యడం మొదలు పెట్టిన రామరాజు వయోలిన్ కుడిచేతి వేళ్ళతో వాయించే నేర్పుగలవారు. పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ శిష్యులైన సి.యస్.కృష్ణస్వామి దగ్గర కొంతకాలం జంత్రగాత్రాల్ని అభ్యసించారు. కొచ్చర్లకోట రామరాజుగారు జంగం కోటయ్య దేవర దగ్గర కొన్నాళ్ళు సంగీతం నేర్చుకున్నారు. 1914లో పశ్చిమగోదావరి జిల్లా పోలవరం జమీందారు కొచ్చర్ల కోట కృష్ణారావుగారి ఇంట గానం చేసి మెప్పు పొందారు.

సరళీ స్వరాలు, జంటస్వరాదిగా సంగీతాభ్యాసకులకు ఉపయోగ పడే విధంగా గాయకమనోరంజని అనే సంగీత గ్రంథాన్ని రాశారు రామరాజుగారు. స్వరపల్లవులు కూడా రాశారు. "శ్రీకృష్ణకర్ణామృతం" అన్న పేరుతో శ్రీ సీతారామస్వామి వారిపై, నూట యొనిమిది కీర్తనలు రాశారు. వీరు రాసిన స్వర జతులు ప్రచారంలో ఉన్నాయి. తాటిపాకలో స్థిరపడి అక్కడ తన ఇంటనే ఒక త్యాగరాజస్వామి పూజామందిరాన్ని ఏర్పాటు చేసుకుని, త్యాగరాజస్వామి విగ్రహప్రతిష్ఠ చేసి, ఆరాధనోత్సవాలు చేస్తూండేవారు.

అనేకమంది శిష్యులను తయారు చేసేనేపథ్యంలో అభ్యాసకులకు ఉచిత భోజన వసతులను ఏర్పాటు చేసి సంగీతం నేర్పించేవారు. చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఉన్న సంగీత విద్వాంసులు వీరి శిష్యులే.

"1930లో రాజవోలులో వకీలు సంఘం వారు రామరాజు గారికి సన్మానం చేశారు" షష్టిపూర్తి సందర్భంగా అంబారీ పై ఊరేగించి సన్నాయిమేళం ఏర్పాటు చేసి, రామరాజుగారికి "మహామహోపాధ్యాయ' ' అనే బిరుదు ప్రదానం చేశారు."[1]

దాదాపు 15, 16 సంవత్సరాల క్రితం రాయడం మొదలు పెట్టిన "శ్రీరామకీర్తన కర్ణామృతం" గ్రంథం లోని కీర్తనలు పండిత పామరులు పాడుకోడానికి ఎంతో సులభంగా ఉన్నవనీ అందువల్ల ఎంతో మంది మిత్ర బృందం అచ్చు వేయించమని కోరగా గురువుగారి ఆజ్ఞతో అచ్చొత్తించానని రచయిత పుస్తక పరిచయంలో విన్న వించుకున్నారు. ఈ కీర్తనలు అన్నిటినీ స్వర పరచి రాగ, తాళ భావాలను చెడకుండా పొందు పరిచారు. శ్రీ సీతారామస్వామికి అంకితంగా రాసిన కీర్తనలు ఇవి. శంకరాభరణం, ఖరహరప్రియ, కేదార, బిలహరి, హరికాంభోజి, పుష్పలతిక, జంఝూటి, కన్నడ, నాదనామక్రియ, దర్బారు, చక్రవాకం మొదలైన ప్రసిద్ధ రాగాలలో కీర్తనలు రాశారు. ఒక్కొక్క కీర్తనకు 4 నుండి 7 చరణాల వరకు ఉన్నాయి. కొన్ని కీర్తనలకు చిట్టస్వరం కూడా రాశారు. కొన్ని కీర్తనలలో అనుపల్లవి ప్రకారం చరణాలను పాడడం, పల్లవి వలె మిగిలిన చరణాలు పాడడం అనే నియమాల్ని ఆయా కీర్తనల చివర స్పష్టీకరించారు. రాముని బ్రోవమని వైదేహీ రమణుడైన ఆరాముని తనపై జాలి చూపుమని తుచ్ఛమైన ఈ సంసారం మీద తనకు ఇచ్ఛ లేదని నీ సచ్చరిత్ర మైన నీనామమే చాలునని వర్ణిస్తాడు.

ఖరహరప్రియరాగం - చాపు తాళంలోని కీర్తనలో రాముని చరితం వినుడీ అని అభివర్ణిస్తాడు.

ప॥ "శ్రీరఘురాముని। చరితము వినుడీ

అ॥ప॥ ధారుణిలో మన దైవము రాముడే। కోరిభజింపుడీ! కోర్కెలొసంగును!

1 చరణం: రాతిని ప్రేమతో నాతిగ జేసీ ఖ్యాతిగ విల్లు ద్రుంచి

సీతను గైకొని భూతలేశుడని పొరులు పొగడిన

2. చరణం: వానర వీరుని వాలిని ద్రుంచి, దినకరపుత్రుని ఘనమున బ్రోచి

అనిలసుతునకెంతో ఆదర మొసగిన ॥శ్రీ॥

3. చరణం: "దారకొరకు బలు। వారధి కట్టి క్రూరుని లంకేశుని

కూలగనేసి నీరజనేత్రిని నేర్పుతో దెచ్చిన ॥శ్రీ॥

ఈ కీర్తనలోని విశేషం - రాతిని నాతిగా చెయ్యడం, సీతను చేపట్టడం, వాలిని శిక్షించి సుగ్రీవుని రక్షించడం, తన భార్యకోసం వారధి నిర్మింపజేసి లంకేశ్వరుని వధించడం ఇందులో వున్నాయి. మూడవ చరణంలోని వాక్య నిర్మాణం భార్యకోసమే రాముడు రావణుని చంపాడనే అర్థం బోధించేదిగా వుంది. సంగీతపరంగా కంటే సాహిత్య పరంగా అర్థగాంభీర్యం ఉన్న రచనలుగా చెప్పుకోవచ్చు. కృతికీ కీర్తనకూ గల లక్షణాలలో కృతిలో కంటే కీర్తనలో సాహిత్యానికి ప్రాధాన్యత ఎక్కువ ఉంటుంది. కీర్తన పురాతనమైన రచన. అదే నియమాన్ని రామరాజు పాటించారు. భక్తి ప్రధానమైన రచనలు కీర్తన రూపంలో ఉంటేనే భావాన్ని కూడా ఆస్వాదించే వీలుంటుంది. దైవాన్ని నిలదీసి తనకు కావలసిన కోరికను తీర్చమని కోరడానికి, ఎత్తి పొడుపు దెప్పిపొడుపు మాటలు అనడానికి ఈ కీర్తన ప్రక్రియ సరైనది.

ఉదా : శంకరాభరణరాగం - ఆదితాళం - 10వ కీర్తనలో

"ఏరనాపై దయ రాదునే నెంత వేడుదునో రామా!

చిన్ననాటనుండి సేవ చేసెదనని చెప్పుకొంటి గాదయోరామా![2]

"11వ కీర్తన సారంగరాగం - చాపుతాళంలో

కావుమని కరిరాజు ప్రార్థించగా గ్రక్కున ఏలుట అబద్ధమా!

శత్రునైన రావణుని తమ్ముడు శరణనగానే మిత్రునిలా

బ్రోవ వచ్చేవు! కాబట్టి రామరాజ దాస పోషకా! ఎన్నో విధాల వేడుకొంటున్ననన్నట్లు బ్రోవక విడిచి పెట్టుట న్యాయమా! ఓరామా![3] అని వేడుకొంటాడు.

రాతిని నాతిని చెయ్యడం, రావణుని వధ, వాలిని అణచడం కారడవుల కేగిన రాముని గురించిన ఈ చరిత్రే శ్రీ రామకీర్తన కర్ణామృతంలో ఉన్న కీర్తనలలోనూ ఉన్నది. అనేక రాగాలలో ఒకే వస్తువును ఇమిడ్చి ఈ కీర్తనలలో స్పష్టం చేశారు రామరాజు. ఈ గ్రంథంలోని కీర్తనలన్నీ భగవన్నుతులే. కోనసీమ జమీందారుల ఆస్థానాలలో విద్వాంసునిగా లేకపోయినా పోలవరం జమీందారు చే మెప్పు పొంది ఆ ప్రాంతాలలో ఉన్న విద్వాంసుడు రామరాజు. ఆ ప్రాంతంలో ఉన్నందువలన ఈ కీర్తనలు పరిశోధనలోకి చేర్చాను. ప్రస్తుతం ఈ కీర్తనలు వ్యవహారంలో అంతగా లేవు.

## అధస్సూచికలు

1 శ్రీరామమూర్తి, మునుగంటి. (సం) గానకళ, సంగీత మాసపత్రిక, కాకినాడ, 1994 ఏప్రిల్ - పుట - 16.

2. రామరాజు, కొచ్చర్ల కోట. శ్రీరామకీర్తన కర్ణామృతం. అమలాపురం, కోనసీమ ముద్రాక్షరశాల , ప్రజోత్పత్తి సంవత్సరం పుట - 15; 3. " అదే " పుట - 16.

# 13. గద్వాల సంస్థానం

కర్ణాటక తెలంగాణా సరిహద్దు ప్రాంతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణా తుంగభద్ర నదుల మధ్య ప్రాంతంలో ఉన్న గద్వాల సంస్థానం, నిజాం రాష్ట్రంలోని అనేక సంస్థానాల్లో ప్రత్యేకత గలది. అతి ప్రాచీనమైన సంస్థానం ఇది. చాళుక్యులు, పల్లవులు, విజయనగరాధీశులు, బహమనీ సుల్తానులు, గోల్కొండ కుతుబ్‌షాహీలు ఈ ప్రాంతాన్ని ఆక్రమించడానికి అనేక మారులు యుద్ధాలు చేస్తూ ఉండేవారు. ఎన్నో రాజవంశాలకు సామంత రాజ్యంగా నిలచిన ఈ గద్వాల సుమారు ఆరువందల సంవత్సరాల తర్వాత నిజాం ప్రభువు ఆధీనంలోకి వచ్చింది.

ఈ గద్వాల సంస్థానం కాకతీయ సామ్రాజ్యం నుండి ఉద్భవించింది. కాకతి రుద్రాంబ, ప్రతాపరుద్రులు రాజ్యం చేసే కాలంలో రాయచూర్ దో ఆబ్ కర్నూలు ప్రాంతాలు అరణ్యాలుగా ఉండేవి. కాకతీయ సామంతులు, సేనానులు ఈ ప్రాంత భాగాన్ని కృషియోగ్యంగా చేసారు. వాళ్ళలో గోనవంశీయులు ఒకరు. అరణ్యాలను నిర్మూలించి భూమిని వాసయోగ్యంగా చేయడానికి సహకరించిన ఐజగ్రామ నివాసి "బుద్దారెడ్డికి కృతజ్ఞతగా మానవ బెళుదోణి, రాయచూరు, అలంపురం, మోసలకల్లు, ఆదోని, ఐజా అనే సీమలు ప్రతాపరుద్రుడు బహూకరించి ఆ ప్రాంతాలను పాలించడానికి నియమించేడు. అప్పటి నుండి బుద్దా రెడ్డి అతని సంతతి వారు ఐజనాడ గౌడులని ప్రసిద్ధి పొందారు."[1]

క్రీ.శ. 1323లో కాకతీయ సామ్రాజ్య మంతరించి పోయింతర్వాత ఆంధ్రదేశం ఛిన్నాభిన్నమైంది. ఎక్కడి సామంతులక్కడ స్వతంత్రులయ్యారు. అపుడు ఐజనాడ గౌడులు స్వస్థలం విడిచిపెట్టి కర్నూలు మండలంలోని గోసునూరనంతాపురానికి పోయి అక్కడి పాలకులకు సామంతులయ్యారు. నంద్యాల ప్రాంత పరగణాలన్నీ విజయనగరాధీశుల స్వాధీనమయ్యాయి. 1344లో హరిహరుడు, ప్రతాపరుద్రుని కొడుకు కృష్ణ నాయకుడు ఏక శిలానగరాన్ని ముట్టడించి స్వాధీన పరుచుకున్నారు. ఏక శిలానగరాన్ని ముట్టడించి స్వాధీనపరచుకోడానికి సహాయపడిన ఐజనాడ గౌడులకు ప్రతిఫలంగా కృష్ణనాయకుడు కర్నూలు ప్రాంతంలో పశ్చిమాన ఉన్న కొన్ని గ్రామాలను ఇచ్చాడు.

కాని క్రీ.శ. 1347లో బహమనీ సుల్తానులు రాయచూరు, కర్నూలు ప్రాంతాలను జయించడంతో బహమనీ సుల్తానులకు ఐజనాడ గౌడులు సామంతులయ్యారు. 1489లో బీజాపుర సుల్తానులు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడం వల్ల వారికి సామంతులయ్యారు.

క్రీ.శ. 1663-1713 ప్రాంతంలో పెదసోమభూపాలునికి గౌడరికం వచ్చింది. గద్వాల సంస్థానాన్ని నిర్మించిన పాలెపుగాళ్ళలో పెద సోమభూపాలుడు ప్రబలుడు. ఇతడు బీజాపుర సుల్తానుకు నామ మాత్రంగానే సామంతుడు. సర్వస్వతంత్రుడై పరిపాలించే వాడు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు బీజాపూరు, గోల్కొండ మొదలైన మహమ్మదీయ రాజ్యాలను జయించడం మొదలు పెట్టాడు.

1686-87 ప్రాంతంలో బీజాపూర్ జయించడంలో తోడ్పడిన పెదసోమ భూపాలునితో ఔరంగజేబు స్నేహం చేసుకున్నాడు. సోమ భూపాలుడు దాని ఆధారంగా 1687లో తాను పరిపాలిస్తున్న ప్రాంతాలకు స్వతంత్రునిగా ప్రకటించుకున్నాడు. బనగానపల్లె, సిరిగుప్ప, సిద్దాపురం మొదలైన సీమలను జయించి రాజ్యాన్ని విస్తరింపజేసాడు. ఆ కారణం చేత పెదసోమభూపాలునికి శత్రువు లెక్కువయ్యారు. పూడూరు దుర్గం శిథిలావస్థలో ఉండటం వల్ల అది క్షేమం కాదని 1698-1705 ప్రాంతాల్లో పూడూరికి ఐదు మైళ్ళ దూరంలో కోటను నిర్మించి దానికి 'గద్వాల' అని పేరు పెట్టాడు. తన నివాసం అక్కడికి మార్చుకున్నాడు.సోమ భూపాలుడు 1712 సంవత్సరంలో నైజాం నవాబు ఉల్‌ముల్క్ గద్వాల కోటను స్వాధీన పరచుకోడానికి పంపిన దిలీల్‌ఖాన్ అనే సర్దార్‌తో యుద్ధం చేసి వీరమరణాన్ని పొందాడు. సోమభూపాలుని తర్వాత రాజ్యాన్ని

పాలించినవారిలో చిన సోమ భూపాలుడు, మహారాజా సీతారామ భూపాల బహద్దూర్ (1901) మహారాణీ ఆది లక్ష్మీదేవమ్మ బహద్దర్ ముఖ్యులు.

వీరి కాలాల్లో గద్వాల సమస్త విషయాల్లోనూ ప్రసిద్ధి పొందింది. పెద సోమ భూపాలుడు గొప్ప మేధావి స్వయంగా పండితుడు జయదేవకవి సంస్కృతంలో రాసిన గీత గోవింద కావ్యాన్ని ఈతడు తెలుగు చేసి, ప్రతి శ్లోకానికీ ఒక పద్యాన్ని, ప్రతి అష్టపదికీ ఒక చూర్ణికను రాశాడు. లలిత కళాభివృద్ధికి చిన సోమ భూపాలుడు ఎంతో కృషి చేశాడు.

కాకతీయ రుద్రాంబ వలే రాణి మహాలక్ష్మీ దేవమ్మ సంస్థాన కార్యాలు స్వయంగా చూసుకుంటూండేది. ఈమె కాలంలోనే గద్వాల సంస్థానం విద్వద్గద్వాలగా పేరు పొందింది. విద్వాంసులను, కళాకారులను, పండితులను ఆదరించి ఉచిత రీతిని సన్మానించడంలో గద్వాల సంస్థానం ఇతర సంస్థానాలకంటే ఉన్నతంగా ప్రత్యేక రీతిగా ఉండేవి. మహాలక్ష్మీదేవమ్మగారి కాలం వరకూ ఆ సంప్రదాయం ఉండేది.

ప్రతి దసరాపండుగకూ, ఉత్సవాలకూ,పండితులను, విద్వాంసులను సన్మానించడం అక్కడి సంప్రదాయం. ఆ పర్వదినాల్లో "కోట నుండి లోపల సభ జరిగే దర్బారు వరకూ విద్వాంసులు నడవడానికి సరిపడే విధంగా తెల్లటి వస్త్రాన్ని పరిచేవారు. విద్వాంసులు, పండితులు దర్బారు వరకూ దానిమీదే నడుచుకుంటూ వెళ్ళాలి. ఆ సభలో సంస్థాన పాలకులు బంగారు, వెండి, నాణాలు బస్తాలు బస్తాలుగా పెట్టుకునేవారు. దర్బారుకు వచ్చిన ప్రతి విద్వాంసుడు తన విద్య ప్రదర్శించి ఘనంగా సన్మానితుడయ్యేవాడు.

సంస్థానంలో పరీక్షాధికారులుగా కొంత మందిని నియమించి దర్బారుకు వచ్చిన విద్వాంసులను పరీక్షించమనే వారు. పరీక్షాధికారులు నిర్ణయించిన రీతిలో విద్వాంసులకు బహుమతులు లభించేవి. ఆరోజు దర్బారు ముగిసిం తర్వాత విద్వాంసులు, పండితులు నడచిన ఆ తెల్లని వస్త్రాల మీదున్న దుమ్ము, ధూళిని పోగుచేసి, మెత్తగా చూర్ణం చేసి బంగారు భరిణెలో పెట్టి దానిని నీళ్ళలో వేసుకుని తీర్థంగా గద్వాల సంస్థానాధీశులు సేవించేవారు.[2] ఇది కార్తీకమాసం సభల్లో జరిగేది. గద్వాల సంస్థాన ప్రభువులకు విద్వాంసులంటే అంతభక్తి, వారి విద్యాపాటవాల్లో అంతటి ఆదరాభిమానాలు ఉండేవని చెప్తారు. గద్వాల సంస్థానంలో మాఘమాసంలోను కార్తిక మాసంలోను ఉత్సవాలు, సభలు నిర్వహించడం చినసోమభూపాలుని (1761-1794) కాలంనుండే ఆరంభమైంది. కార్తీక మాసంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుండి ఎంతోమంది విద్వాంసులు, కళాకారులూ వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించి తగిన సన్మానం పొందేవారు. సన్మాన గౌరవాల్ని పొందేందుకు వచ్చిన విద్వాంసులను ఉత్సవాలు ముగిసేవరకూ గద్వాల సంస్థానాధీశులు ఆహార విహారాదులు ఏర్పాటు చేసి ఎంతో గౌరవంగా చూసుకునేవారు.

క్రీ.శ. 1779లో రాజా చిన సోమభూపాలుని కాలంలో రామాలయ నిర్మాణం జరిగింది. 1788లో ఒక దేవాలయాన్ని కట్టించి అందులో భూదేవిని ప్రతిష్ఠించాడు. చిన సోమభూపాలుడు గద్వాలకోటలో కేశవాలయ శిఖరాన్ని తన భార్య పేరు మీద కట్టించేడు.

రాజుల దర్బారులు, సంస్థాన దర్బారులు వర్ణిస్తూ కవులు ఆ వైభవాన్ని కావ్య ముఖంగా చెప్పడం కనిపిస్తుంది. గద్వాల సభావైభవాన్ని (చిన సోమభూపాలునికాలం - 1773) గురించి "యథాశ్లోక తాత్పర్య రామాయణ" అవతారికలో కణాదం పెద్దన సోమయాజి వివరించాడు.

"ఒక దండ పండిత ప్రకరంబు శాస్త్రముల్ పటుతరోక్తులతోనుపన్యసించు
ఒక చెంత సంతసం బొదవ కవిశ్రేణి కృతులర్థరస చమత్కృతుల దెలుప
ఒక చాయ గాయనికరము రక్తి రాగముల వీణాది వాద్యముల బెన్ప
నొక వార బాలిక లభినయ నాట్య సంగీత రీతి నాశ్చర్య మునుప"[3]
కాబట్టి కవిపండితులున్నతటినే గాయకులు, నాట్యకారులు కూడా ఉండేవారని తెలుస్తోంది.

సీతారామ భూపాలునికి సంగీతం అంటే అభిమానం ఎక్కువ. సంగీతంలో భూపాలునికి మంచి ప్రవేశం ఉండేదని అంటారు. ఆయన సంగీత విద్వాంసులను వరుసగా కూర్చోబెట్టి పల్లవిని పాడించి వారితారతమ్యాలను గుర్తించి, సత్కరించేవారు.

కవులనేగాక ఎందరో గాయకులను కూడా గద్వాలసంస్థానాధీశులు సత్కరించారు. శ్రీమతి బెంగుళూరు నాగరత్నంగారు, పురాణం కనకయ్యగారు, వారణాసి బ్రహ్మయ్య, ఘంటయ్యగార్లు మొదలైన విద్వాంసులు సన్మానితులయ్యారు. మైసూరు నుండి విచ్చేసిన ప్రసిద్ధ సంగీత విద్వాంసులుశ్రీబిడారు కృష్ణప్పగారికి రత్నకంకణం వెయ్యి నూటపదహార్లుఇచ్చి గౌరవించారు.

ఇక ప్రసిద్ధి పొందిన దాక్షిణాత్య సంగీత విద్వాంసులందరూ ఎప్పుడో ఒకప్పుడు గద్వాలకు వచ్చి సత్కారాలు పొందిన వారే. 1850-1921 ప్రాంతాల్లో ఒక సంఘటన జరిగింది. దక్షిణ భారతదేశంలో గద్వాలతో సమతుల్యమైనసంగీత కేంద్రం లేదని చెప్తారు. అలాంటి గద్వాల సంస్థానానికి "ఒకప్పుడు దాక్షిణాత్యగాయక' ' శిఖామణి బిడారం కృష్ణప్పగారు వచ్చి గంభీరగాత్రంతో అద్భుతంగా పాడారు. గద్వాల ప్రభువు సీతారామ భూపాలుడు కృష్ణప్పగారిని ఘనంగా సత్కరించాడు. ఆ సమయంలో - తెలుగు వారెవరైనా కృష్ణప్పలా గానం చేస్తే వారికి కృష్ణప్ప గారికి చేసినట్లు సన్మానం చేస్తామని భూపతి ప్రకటించారు. ఆ ప్రకటన విని, చల్లపల్లి సుబ్బయ్య అనే గాయకుడు ఆ మరుసటి రోజు సభకు వచ్చి పాడటం మొదలు పెట్టాడు. సభంతా క్రిక్కిరిసిన జనం, ప్రభువు, రాణి, కృష్ణప్ప అందరూ సుబ్బయ్య గారి పాటకు పారవశ్యం చెందారు."4

సుబ్బయ్య గారి పాట కృష్ణప్పగారి పాటకు ఏ మాత్రం తీసిపోదు అని కృష్ణప్పను సత్కరించినట్లు సుబ్బయ్య గారిని కూడా సత్కరించారు ప్రభువు.

గద్వాల సంస్థానంలో జరిగే ఉత్సవాలకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. మాఘశుద్ధ ద్వాదశి నుండి బహుళ విదియ వరకు చెన్న కేశవ స్వామి ఉత్సవాలు జరిగేవి. పూర్ణిమ వరకు జరిగే కవితాగానాలు రాజావారువిని, పాడ్యమి విదియలలో వారిని ఉచిత రీతిని సత్కరించేవారు. గద్వాల సంస్థానంలో ఇలాంటి ఉత్సవాలు జరగడానికి ముఖ్య కారణం చారిత్రకంగా గద్వాల ప్రాంతం అదివరకు కర్ణాటక ప్రాంతంలో ఉండేది. ఆయా ప్రాంతాల్లో ఉండే సంప్రదాయాన్ని, కర్ణాటక ప్రభువుల ఆచారాల్నీ వీరు అనవాయితీగా చేసుకున్నారు. అవే అమలు జరుపుతూండటంతో ఈ వార్షికోత్సవాలు సంగీత కళకు గౌరవాన్ని పెంపొందింప చేశాయి.

అనంతపురం, బళ్ళారి, పెనుగొండ, కర్నూలు, చిత్తూరు ప్రాంతాల్లో ఈ ఉత్సవాలు జరుగుతూ ఉండేవి.

"పాత వారికి (విద్వాంసులకు) జాప్తా ప్రకారం ద్రవ్యం పంచడమే గానీమళ్ళీ వారి ప్రదర్శన ఉండేది కాదు. కొత్తగా వచ్చిన వారికే ప్రదర్శనావకాశం ఉండేది."5 ఆ విధంగా వచ్చిన కవి గాయకులను నవీనులు అనేవారు. మహా మహా విద్వాంసులే కాక అలాంటి సభల్లోమధ్యస్థులు కూడా పాల్గొనేవారు. ఎవరి అర్హతలను బట్టి వారికి పది నుండి వెయ్యినూటపదహార్లవరకూ సన్మానం జరిగేది. ప్రదర్శన నిమిత్తం వచ్చిన విద్వాంసులకు అందరికీ సంస్థానమే భోజన వసతులు కల్పించేది.

ఈ కార్యక్రమాలకు అయ్యే ఖర్చు సుమారు 40 లక్షల వరకూ ఉండేది. గద్వాల సంస్థానంలో జరిగే ఇటువంటి ఉత్సవ సభలు పిఠాపురం, వెంకటగిరి లాంటి ఇతర సంస్థానాల్లో కొద్ది చోట్ల మాత్రమే జరిగేవి.

అనేక రాజవంశాలకు సామంతంగా ఉంటూ కళలను ఆదరించి కళాకారులను సన్మానించిన గద్వాల సంస్థానం 1956 వ సంవత్సరంలో ప్రభుత్వ విలీనమైంది. నిజాం రాష్ట్రంలో ఉన్న గద్వాల, వనపర్తి, సురపురం, ఆత్మకూరు, జటప్రోలు మొదలైన సంస్థానాల్లోఅన్నిటికంటే మిన్నయై విద్వద్గద్వాలగా సార్థకతనందిన ఏకైక సంస్థానం గద్వాలసంస్థానం.

# మొదటి భాగం

# గద్వాల సంస్థానంలో వాగ్గేయకారులు - వాఙ్మయం

## కామ సముద్రం అప్పలాచార్యులు (కాలం వివరాలు అలభ్యం)

17వ శతాబ్దపు అంచులలో చినసోమభూపాలుని ఆస్థాన కవి, సంగీత విద్వాంసునిగా పేరు పొందిన విద్వత్కవి కుంజర బిరుదాంకితుడు కామ సముద్రం అప్పలాచార్యులు. కౌండిన్యస గోత్రికుడు, శ్రీనివాసాంబా కృష్ణమాచార్యుల పుత్రుడు. అహోబల శ్రీనివాసముని శిష్యరత్నం.

''ఒకనాడు చిన సోమ భూపాలుడు కొలువు తీర్చి యుండి అప్పలాచార్యుల వారిని పిలిచి, ''కృష్ణ దివ్య కధలష్ట పదులివి తెనుగొనర్చి సంతసము గూర్పు మప్పలా చార్య సుకవి.'' అని కోరాడట.

అప్పలాచార్యుల వారు అందులకంగీకరించి గీత గోవిందాన్ని అనువదించారు. జయదేవుని గీత గోవిందానికి అనువాదంగా శ్రీకృష్ణ లీలాతరంగిణి అనే ఆంధ్రాష్టపదిని రాసారు. ఇరవై నాలుగు అష్టపదులతో బాటు మూలంలో ఉన్న రాగాలను సైతం మార్చి రాసారు. బహుశః శ్రీకృష్ణుని లీలలు వర్ణించేవి కాబట్టి శ్రీకృష్ణ లీలా తరంగిణి అని తన ఆంధ్రాష్టపదికి పేరు పెట్టాడని చెప్తారు. ప్రతి అష్టపదికి చివర శ్రీకృష్ణ పరమాత్మ గద్వాల సోమ భూపాలునకు శుభము కలిగించుగాక - అను ఆశీస్సు ఇచ్చారు.

తెలుగులో రాసిన ఈ అష్టపదులు - కొన్ని రాగాన్ని మార్చి రాసినవి.

| అష్టపది | మూలరాగం | అనువాదరాగం |
|---|---|---|
| ప్రళయ పయోధిజలే | మాళవ | సౌరాష్ట్ర |
| లలితలవంగ | వసంత | అసావేరి |
| చందనచర్చిత | నామక్రియ | బేగడ |
| రాసేహరిమిహ | ఘూర్జరి | జుజావంతి |
| సఖిహే | మాళవగౌడ | మోహన |
| హరిహరి | ఘూర్జరి (భూపాల) | భూపాల |
| రాధికాకృష్ణ | దేశాక్షరి | పూరి |
| తవవిరహే | పంతువరాళి | ఆనందభైరవి |
| రతిసుఖసారే | ఘూర్జరి | కేదారగౌళ |
| కాపి మధురిపుణా | వసంత | కేదారగౌళ |
| రమయతేయమునా | ఘూర్జరి | ముఖారి |
| ముగ్ధేమధుమధనం | వసంత | భైరవి |
| ప్రవిశరాధే | వరాళి (బంగాళ) | మధ్యమావతి |
| క్షణమధునా | విభాస | సురటి''[6] |

తెలుగు సంస్కృత భాషా పండితుడైనప్పటికీ అనేక కావ్యాలు రాసి, సంగీత పరంగా కూడా అప్పలాచార్యుల వారు ప్రతిభావంతులనడానికి శ్రీకృష్ణ లీలాతరంగిణి ఆంధ్రాష్టపదే తార్కాణం.

## హనుమద్దాసు (కాలం వివరాలు అలభ్యం)

గద్వాల సంస్థానంలో సంగీత కళకు అనేకులు సేవలు చేసి దాని ఉనికిని నిలబెట్టారు. ఎటువంటి స్వార్థ చింతన లేక కేవలం అభిమానం ప్రదర్శించిన వాళ్ళు కొంతమందైతే కీర్తి కాంక్షతో మరికొందరు సేవలందించారు. మార్గమేదైనా గమ్యం మాత్రం ఒకటే, ఫలితమూ ఒకటే, కళావ్యాప్తి జరగడం.

18వ శతాబ్దంలో గద్వాల సంస్థానంలో ఉన్న ఉత్తనూరు గ్రామంలో గోపాలదాసు (బాగణ్ణదాసు) అనే భక్తుడు వెంకటేశ్వరుని మీద ప్రధాన భజన కీర్తనలు రాసి పాడుతూ తాండవం చేసేవాడు. ఈ కీర్తనలు అలభ్యం.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలుకాకు చెందిన హనుమద్భక్తులు గద్వాల ప్రాపున ఉన్న మల్దకల్ గ్రామానికి వచ్చారు. ఆయన పేరు హనుమద్దాసు. యోగవిద్యనభ్యసించారు. మల్దకల్‌లో ఒకసారి తీవ్రమైన జ్వరవ్యాధి వ్యాపించి ప్రజలంతా భయపడుతుంటే ఏతన్నివారణార్థం ఈయన పూజలు చేసి హనుమంతుని పేరున ఒక జెండా పాతారు. అది గ్రామానికి చివర ఉంది. ఆజ్వరం ఆ జెండా దాటి రాలేదు అని అప్పటి నుండి ఈ ప్రాంతంలో హనుమద్భక్తులు భజన చేయనారంభించారు.

హనుమద్దాసు భజనకీర్తనలు రాసారు. ఆ కీర్తనలు ఇప్పటికీ మల్దకల్లులో పాడుతూంటారు. మల్దకల్‌లో ప్రసిద్ధ ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి దేవళాలున్నాయి. హనుమద్దాసు భజన చేస్తూ యోగ నిద్రలోకి వెళ్ళిపోయేవాడు. వేసిన పద్మాసనంతో సహా ఆకాశ మార్గాన శరీరం విహరించేదని ప్రస్తుతం ఉన్న భజన సమాజంలోని హనుమద్దాసు ప్రశిష్యులు తెలిపారు. వారిని శాంతింప చేయడానికి హారతి పట్టేవారుట.

హనుమద్దాసు రచించిన పాటలు ముద్రణ కాలేదు. "ఆయన శిష్యులు రాసుకుని అవే కాపీలు తీసుకుంటూ ఉండేవారు. అలాంటి ఒక రాతప్రతి నాకు లభ్యమైంది."

మల్దకల్‌లో వెలసిన సువర్చలా సహిత పంచముఖ వీరాంజనేయస్వామిని గురించి రాసిన పాటలు ఇవి. హనుమద్దాస నామాంకితాలుగానే ఈ పాటలున్నాయి. మేలు కొలుపు దగ్గర నుండి నిత్యకృత్యాలు దంత ధావనం నుంచి సుగంధాలనిచ్చే నీటితో స్నానాది ఘట్టాలను భగవంతునికి చేసినట్లు, ఆరగింపు చేసినట్లు ప్రభాతసేవ ముందు భాగంలో ఉంది.

"ప్రభుత్వ సేవ" అని పేరిడి మద్భక్తపుర వాసుడు కపిబృందం సేవిస్తుండగా ఆయనకు భోగభాగ్యమివ్వమని కీర్తించడం వర్ణించారు.

సంసార మనెడి సాగరాన్ని దాటడానికి శక్తి లేదు. హనుమద్దాస పోషకా నిన్నే నమ్మినాను. భవభయనాశకా - అష్ట సిద్ధులిచ్చి మమ్మును రక్షించు అంటూ పాటల్లోని భావం సాగుతుంది. ఆద్యాంతాలు లేని నీరూపాన్ని కనుక్కుందామని బాధలెన్నో అనుభవించాను. భారమంతా నీదేనని అనుకున్నాను.

"మండలమునిను గొల్వా! దీక్షాబూనితి తండ్రీ!
చిక్కులూ పెట్టాక చక్కగా బ్రోవుమయ్యా॥
గాలీవానలో నన్ను! కావుమనీ నిన్నువేడా॥
కోరి చిరునవ్వుతో కుదురుగ్గా నిలచీనా॥

భవ బంధపాశవిమోచనాన్ని కోరుతూనే అది కడతీరే దాకా పరిరక్షింపమని వేడుకున్న భక్తి పాటలు. ఇందులో కీర్తనలే కాక మధ్యలో సీస పద్యాలు కూడా కనిపిస్తాయి.

భజన సంప్రదాయం తెలంగాణా ప్రాంతంలో రామదాసు కాలం నుండి మొదలైంది. ఆ పిమ్మట ప్రతి చోటా భజన కూటాలు వెలిసాయి. ఇటువంటి రచనలు సంగీత పరంగా ఎంత వరకూ సరిపోతాయి అనిఆలోచిస్తే, కీర్తనలు రాసిన వారికి సంగీత పరిచయం, సంగీతాభ్యాసం ఉండటం కద్దు. తూము నరసింహదాసు, భద్రాచల రామదాసు వంటి వారికి ప్రసిద్ధులైన కర్ణాటక సంగీతజ్ఞుల వలని సాంగత్యాల వల్ల వారు రాసిన కీర్తనలు సంగీత భజన కీర్తనలుగా పరిగణించవచ్చు.

## పాటల రామన్న (1900 - 1950)

19వ శతాబ్దం చివర నుండి 1950 ప్రాంతం వరకు జీవించిన పాటల రామన్న గారి అసలు పేరు వైద్యం రామన్నగారు. కిష్టమ్మ, రాఘవయ్య గార్లకు మొదటి సంతానం రామన్నగారు. గద్వాలలో వైద్యులుగా స్థిరపడిన వారవడం వలన వారి ఇంటి పేరు సార్థకతనందింది.

గద్వాల సంస్థానంలో రాచరికపు ఆప్తులుగా రామన్నగారు వెలిగారు. రేణుకా చారులు వీరి గురువు. పదవ ఏటనే తండ్రి మరణం, ఆపైన కొద్ది కాలానికే తల్లి మరణం సంభవించడంతో ఇంటి బాధ్యత రామన్న గారి మీద పడింది. రామన్నగారి మేనమామ పాగనర్సప్ప రామన్నను గద్వాల సంస్థానాధీశులైన సీతారామ భూపాలుని కొలువులో చేర్పించాడు. అప్పటి నుండి రాజావారికి ఆంతరంగిక ఉద్యోగిగా సంస్థానంలో ప్రవేశం కలిగింది. సీతారామభూపాలుని సభలో జరిగే గోష్ఠులను విని ఆశువుగా పద్యాలు చెప్పడం అలవరుచుకున్నాడు. రామన్నగారికి సీతారామ భూపాలుడే పెళ్ళి చేశారు.

రాజావారి సంస్థాన దర్బారులోని పండితులు అప్పుడప్పుడు సంస్కృత నాటకాలు ప్రదర్శించేవారు. ఆ నాటకాలలో కొన్ని ముఖ్య పాత్రలురామన్న వేసేవాడని అంటారు. కొంతకాలానికి సీతారామభూపాలుడు స్వర్గ వాసులయ్యారు. రామన్నగారు అప్పటి నుండి ఆస్థాన కొలువు మానేసి, స్వయంకృషితో సంగీత సాధన చేసి రాజబంధువుల అమ్మాయిలకు సంగీతం చెబుతూ జీవనం సాగించడం మొదలు పెట్టారు. ఈలోగా భార్యావియోగం ప్రాప్తించడంతో రామన్నగారు సంసార విరక్తుడై, ఆరాధ్యదైవం కృష్ణభగవానుణ్ణే తలుచుకుంటూ, పాటలు అల్లి భక్తితో పాడుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతుండేవారు. ఆ పాటలే శ్రీకృష్ణమందిర సంకీర్తనలు. రామన్నగారికి ఈ పాటల వల్లే పాటల రామన్న అనే పేరు వచ్చిందని అంటారు.

భక్తిని కలుగజేసే ఈ భజన కీర్తనల ద్వారానే సీతారామ "భూపాలుని ధర్మపత్నిమహారాణి ఆదిలక్ష్మీదేవమ్మగారు రామన్నను ఆంతరంగికునిగా భావించేవారు. ఆమె రామన్నకు లక్ష్మమ్మ అనే యువతితో పునర్వివాహం చేశారు. వారికి పుత్రోదయమైంది. అతని పేరు కుచేలుడు. భర్త సీతారామభూపాలుని మరణానంతరం మహారాణి ఆది లక్ష్మీదేవమ్మగారే రాచకార్యాలతో పాటు ప్రజా సంక్షేమాన్ని స్వయంగా పర్యవేక్షించేవారు. వ్యవహారాల్లోఉక్కిరిబిక్కిరౌతున్న ఆదిలక్ష్మీదేవమ్మగారు మనశ్శాంతి కోసం అప్పుడప్పుడు కృష్ణ మందిర భక్త సమాజాన్ని పిలిపించుకొని "పాటల రామన్నా! పాట పాడునాయనా!" అని అడిగి భజన కీర్తనలు పాడించుకుని ఆనందించేవారు. అంతేకాకుండా రాణీగారు ఏ పని తలపెట్టి చెయ్యాలన్నా రామన్న గారిని పిలిచి అతనితో సంప్రదించి అతని సలహా మేరకు కార్యాలను ఆదిలక్ష్మీదేవమ్మగారు అమలు జరిపించేవారు. రామన్నగారు రాణీగారికి అన్ని పనుల్లోనూ చేదోడు వాదోడుగా ఉండేవారు.

రాణీగారికి ఇద్దరు కుమార్తెలు. వారిలో పెద్దమ్మాయి వరలక్ష్మీదేవికి వివాహమైంది. కాని సంతతి కలుగలేదు. ఆ కారణంగా మహారాణీగారు మనోవ్యాకులత చెంది గద్వాల సంస్థానంలోని దేవాలయాలన్నింటిలో

పూజాది కార్యక్రమాలు చేయించడం మొదలు పెట్టారు. అప్పుడురామన్నగారు ఒక భజన భక్త సమాజాన్ని స్థాపించమని అందువల్ల మేలు జరుగుతుందని రాణీగారికి విన్నవించుకున్నారు.

"ఆమె అంగీకారంతో 1930లోఒక భజన మండలి స్థాపించారు. దానితో బాటు కృష్ణమందిర స్థాపన కూడా జరిగింది. గద్వాలలో స్థాపించిన ఈ శ్రీకృష్ణమందిరానికి ప్రత్యేకమైన చరిత్ర వుంది."

1930లో ఈ మందిరం భజన మండల సభ్యులైన సూగప్ప వైద్య గారి ఇంట ఉండేది. ప్రతి శుక్రవారం భజన చేసేవారు. కొంత కాలంతర్వాత ప్రతి ఆషాడమాసంలో శుక్ల సప్తమి నుండి పౌర్ణమి వరకూ నవరాత్రి ఉత్సవాలు, ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున రథోత్సవం జరిపేవారు. ఈ ప్రకారంగా మొన్న మొన్నటి వరకూ నిర్విఘ్నంగా ఈ ఉత్సవాలు అమలు జరుగుతుండేవి. కారణాంతరాల వల్ల సూగప్పగారింట ఒక సంవత్సరం మాత్రమే జరిగాయి. రాణీ లక్ష్మీదేవమ్మ అంగీకారంతో కోట ద్వారం దగ్గరున్న రాణీగారి భవంతిలోకి శ్రీ కృష్ణ మందిరాన్ని మార్చారు. భజన మండలిలో సభ్యులు యాభైమంది చేరారు. ఆ సంవత్సరం వరలక్ష్మీదేవి గారికి పుత్ర సంతానం కలిగింది. ఆ శిశువుకు శ్రీకృష్ణ రామ భూపాలుడని పేరు పెట్టారు.

సంతానం కలిగినందుకు సమాజ సభ్యులందరినీ రాణీగారు తన ఖర్చులతో పండరీ పురం పంపారు. శ్రీకృష్ణ మందిరంలో జరిగే నవరాత్రి ఉత్సవాలకు, ఇతరదైవ కార్యాలకు ఇతోధికంగా ధన సహాయం రాణీ మహాలక్ష్మీదేవమ్మ గారే చేసేవారు. ఆ విధంగా మూడు సంవత్సరాలు గడిచాయి.

రాణీగారి కుటుంబ పరిస్థితులు అనుకూలించని కారణాల వల్ల శ్రీ కృష్ణమందిరాన్ని రాణిగారి భవంతి నుండి రాఘవేంద్రస్వామి మఠానికి మార్చారు. రాఘవేంద్రస్వామి మఠానికి వచ్చిన భక్తులు శ్రీకృష్ణ మందిరానికి కూడా ఇతోధికంగా ధన సహాయాన్నందించారు. భజనలతో మాత్రమే కాకుండా ధర్మోపన్యాసాలు, హరికథలు కూడా సప్తాహ కార్యకలాపాల్లో చోటు చేసుకున్నాయి.

ఆ తర్వాత బ్రాహ్మణ, అబ్రాహ్మణ విభేదాల వల్ల శ్రీకృష్ణ మందిరానికి స్థానచలనం కలిగింది. అప్పటి మేదిరి వాళ్ళ స్థలాల్లో ఒక శిలామండపంలో మందిరం వెలసింది. రాణీగారు కొంత ధన సహాయంతో బాటు రాజలాంఛనాలైన ఏనుగులు, గుఱ్ఱాలు, సైన్యం, సైనిక వందనం శ్రీకృష్ణ మందిరానికి సమర్పించుకున్నారు. సంస్థానం ప్రభుత్వంలో విలీనం అయినప్పటికీ ఇప్పటికీ శ్రీ కృష్ణ మందిరానికి పూజా పురస్కారాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ గద్వాలలో ఆనోటా ఆనోటా పాటల రామన్నగారి పాటలు వినవస్తూనే వుంటాయి. పాటల రామన్న గారు తన 45 ఏళ్ళ ప్రాయంలో మరణించారు.

పాటల రామన్న మాణిక్యనగర్‌లో ఖండేరావు (మరాఠా) మహారాజావారి ఆస్థానంలో భజన చేసి వారి చేత ఘనంగా సన్మానితులయ్యారు.

ఆ సందర్భంలో

"దయాకరోహమ్‌పర్‌తుమారా గురుజీ మాణిక్య ప్రభూ కృపాకరో"
"దీనదయాకర్‌హో" అనే కీర్తనలను ఆశువుగా గానం చేశారు.

రామన్నగారు ఎక్కువగా చదువుకున్న వారు కాదు. అయినా పూర్వజన్మ పుణ్య సంస్కారం వల్ల ఆశువుగా పాటలల్లే జ్ఞానం అబ్బింది. శేషాద్రివైద్యగారి "మామగారు రామన్నగారికి మంచి ఆత్మీయులు. రామన్న గారిని "రామన్న! ఓ పాట రాసివ్వు" అని అడిగేవారుట. ఆయన చిత్తు కాగితం ముక్క మీదైనా అప్పటికప్పుడు పాట కట్టి రాసిచ్చేవాడు"[7]

పాటల రామన్న గారు రాసిన పాటలు 'శ్రీకృష్ణమందిర సంకీర్తనలు' అన్న పేరుతో సంపాదకులు ప్రకాశకులు, పాటల పండరీనాథ్ (రామన్నగారి మేనల్లుడు) 19-10-1887 గద్వాల సంస్థానంలో ప్రచురించారు. రామన్నగారి చరిత్ర, జీవిత విశేషాలు శేషాద్రి వైద్య చెప్పినవి, పండరినాథ్ గార్లు రాసిన పీఠికలో తప్ప మరింకెక్కడా లభ్యం కాలేదు.

అయితేరచయిత జీవించి ఉండగా ఇవి ప్రచురించ సాధ్యం కాలేదు. పైగా ఈ కీర్తనాకారుని స్వహస్త లిఖితమైన రచనలు లభ్యం కాకపోగా అక్కడక్కడా భజన చేసే వారి దగ్గర నుండి సేకరించి గ్రంథస్థం చేసినట్లుగా సంపాదకుడు గ్రంథంలో ముందుగా వివరించుకున్నాడు.

అయితే ఈ పాటల రామన్న గారు జీవించి ఉండగా ఆయన రాసి ఇచ్చిన పాటలను 1930 ప్రాంతంలో ఆస్థాన వైద్యులైన ఆర్. ఎస్. వైద్య గారు టైపు చేసుకొని జాగ్రత్త చేసుకున్నారు. ఆ ప్రతిని వారుదయతో నాకిచ్చారు. వారింకా సజీవ వృద్ధులు.

ఆ కీర్తనలు చూసి ఈ సమీక్ష రాయడానికి ప్రయత్నించాను.

పాటలరామన్న రాసిన పాటలు సుమారు డెబ్బది(70) వరకూ ఉన్నాయి. అందులో ఏభై తొమ్మిది వరకూ కీర్తనలుకాగా మిగిలినవి తత్వాలు, కోలాటపు పాటలు, బతుకమ్మ పాటలు ఉన్నాయి.

భజన పాటలుగా రాసిన ఈ సంకీర్తనలు పల్లవి, అనుపల్లవి, చరణ విభాగాలు లేనివి. ఒకే ఒరవడిలో నాలుగైదు వరుసలు ఒక్క చరణంగా భావిస్తే అటువంటివి ఆ కీర్తనల్లో ఒక్కోదానిలో ఒక్కో వరుస చరణంగా వస్తుంది. కొన్నిటిలో రెండు, మరికొన్నిటిలో మూడు వరుస (లైను)లు కలిపితే ఒక చరణంగా వుంది. మరొక విషయం ఇందులో ముఖ్యంగా హిందుస్థానీ కర్ణాటక సంగీత సంబంధి రాగాలను రెంటినీఉపయోగించారు. ఆయారాగ తాళాల్లో రచనలు చేశారు.

రామన్న ఉపయోగించిన రాగాలు హిందూస్థానీ భైరవి, యమునా కళ్యాణి, దర్బారు కానడ, శుద్ధ కళ్యాణ్, కాఫీ, మాల్‌కోస్, శ్యామ, తిలక్ కామోద్, ధన్యాసి, మోహన, తోడి, పీలు, బేహాగ్, భీంప్లాస్, మాండ్, శ్రీరాగాలు. ఇక తాళాల విషయానికొస్తే త్రితాల్, ఆదితాళం, త్రిపుట తాళం, రూపక, ఏక తాళాలు ఉపయోగించారు. ఈ పాటలకు రాగతాళ నిర్దేశం ఉందికానీ స్వరపరచినట్లు ఆగ్రంథంలో లేదు.

ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో ఎక్కువ తెలంగాణా ప్రాంతంలో భజన సంప్రదాయ కీర్తనలు వెలువడ్డాయి. హిందుస్థానీ కర్ణాటక సంగీత సంప్రదాయాలు రాగతాళాల్లో మామేమే గ్రహించినా తెలుగులోనే పాటల రామన్న కీర్తనలు రాశారు. ఈ ప్రాంతంలో ఈ మేళవింపుకు కారణం హైదరాబాద్ సంస్థానం, గద్వాలకు చేరువగా ఉండటం, ఇస్లామీయుల పాలన హిందూస్థానీ సంగీతాదరణ వీటిపై ప్రభావం చూపడమే అని చెప్పవచ్చు.

తెలంగాణా ప్రాంతంలో పాటల రామన్న రాసిన ఈ కీర్తనలు భజనకూటాలలో ఇప్పటికీ పాడుతూంటారు. శ్రీకృష్ణ మందిర సంకీర్తనలని పేరు పెట్టడంలో రామన్నగారు విష్ణు భక్తుడని అర్థమవుతూంది. అన్ని కీర్తనలు శ్రీకృష్ణుని గురించి రాసినవే. "కృష్ణ మందిరనిలయ" "కృష్ణమందిర నివాస" అని ప్రతి కీర్తనలోనూ ఉంది.

ఈ కీర్తనల్లో కృష్ణ భక్తులైన సక్కుబాయి, తుక్కరాము, నామదేవుడు, రుక్కుబాయి, గుండోబా మొదలైన వారిని స్మరించాడు. కృష్ణనామాలేకీర్తనం చేశాడు. భజనలోనే ముక్తి కూడా ఉందని ఆ భజన గోవింద స్వామిని అందునా గద్వాలలో వెలసిన స్వామిని కొలిచిన చాలు మరింకేం చేయనక్కరలేదు అంటూ ఒక దరువు మోహనరాగంలో రాశారు (34 వ పాట)

గోవిందరాంరాం గోపాల హరి హరి గుర్తు తెలియుడీ నరులారా ॥భజ

1. మూడు లోకంబులకు మూల మంత్రాముగా ఎడజూచినా తానేయై యున్నాదిగా
వాడవాడలో వెలుగొందు చున్నాదిగా జాడ తెలిసితే చెంతనేయున్నారిగా ॥భజ॥
2. వేదవేదాల వెలుగొందు చున్నాదిగా వాదభేదములే వీడమన్నాదిగా
పాదు తెలిసితే పాతించమన్నాదిగా సాధుజనులాను వద లాకయున్నాదిగా ॥భజ॥
3. ముక్తి కాంతకు మూలమై యున్నాదిగా యుక్తి దెలసుక భజియింపుమన్నాదిగా
భక్త జనులాను బాయక యున్నాదిగా ముక్తి మార్గము దెలిపెద నన్నాదిగా ॥భజ॥
4. అందమైన గద్వాలలో నున్నాదిగా గోవిందస్వామిని గోల్వమన్నాదిగా
సుందరాకృష్ణ మందిర మైనాదిగా పాందుగాను భజనలోనే యున్నాదిగా ॥భజ॥

అప్పటికి గద్వాల సంస్థానం అందంగా ఉండేది. కృష్ణమందిరం రాణివారి ఆజ్ఞతో కోట దగ్గరలోనే ఉండేది. ఆ తర్వాతకారణాంతరాల వల్ల కృష్ణ మందిరానికి స్థాన చలనం కలిగింది. అయినా మందిరం అందంగా ఉండేదని అందులోని నయనానంద కరుడు శ్రీకృష్ణ భజన చెయ్యమని ఉపదేశిస్తాడు పాటల రామన్న.

మరొక రచనలో దొంగలకే దొంగవని శ్రీకృష్ణుని అంటూనే అటువంటి దొంగను ఎక్కడా వెతికి పట్టుకోలేని వారమని ఎందుకంటే ఎందెందు వెదకి చూచిన అందందే కలదు చక్రి అని వ్యక్తం చేస్తాడు.

41. మోహనరాగంలో

నినుగనుగొన గలమా కృష్ణా
ఘనమగు దొంగలలో ఘన దొంగవు

1. అణువుకంటే నతి సూక్ష్మరూపుడవు ఘనము కంటే మహా ఘనరూపుడవు
ఎనుబది నాలుగు లక్షజీవులెడ అనయుంబుగ నెడబాయ కుందువట
అణువు విభువు తృణ కాష్టము మొదలుగ అఖండ రూపుడవై వెలుగుదువట ॥నిను॥
2. వేదవేద్య! వేదాంతము లెరుగము నీదుదాస దాసాన దాసులము
భేదరహిత ఈవుండగ మాకు వేదాంతంబులవాదమేల? నీ
పాదములేగతి పాండురంగ - ప్రహ్లాద వరద - కృష్ణ మందిర నిలయ

వేద వేద్యుడైన భగవంతుని అస్తిత్వం గురించి వాదులాడుతూ ఏవేవో వేదాంతాలు వల్లెవేస్తుంటారు జనం - అటువంటి వేదాంతాలతో మాకేమిటి పని? నీవా భేదభావాలు కలవాడవుకావు. నీకు ఆకులమనీ ఈ కులమనే భావాల్లేవు. అటువంటి నీ దాసులను సేవించుకునే దాసులం మేం. అణువు నుండి మేరువు వరకూ తృణం మొదలు కాష్టం వరకూ "అఖండజ్యోతిగా వెలిగే నువ్వు చాలా గొప్పవాడివి. అటువంటి నిన్నే స్మరించగలం గాని నిన్ను దర్శించడం మాకు అసాధ్యమే అంటూ శ్రీ కృష్ణుని లీల వివరిస్తాడు ఇందులో. రాగ నిర్దేశం చెయ్యని ఒక రచనలో బాధలన్నింటినీ పోగొట్టే నువ్వు ఎక్కడున్నావో రఘుకుల తిలకా! అజునియందా? హరునియందా! అర్క సోమముని గణాల్లోనా! విధుల్లో ఉన్నావా? నగరంలో ఉన్నావా? భాగవతుల్లో ఉన్నావా? ఎక్కడున్నా గాని మొక్కితే నీకే మొక్కాలి. నిన్ను నమ్ముకున్న మమ్మల్ని వదిలి పక్షినెక్కి పారిపోకు పరంధామా" అంటూ రాముని స్తుతిస్తాడు. మిగిలిన భజన కీర్తనాకారుల్లాగే పాటల రామన్న కూడా హారతులు, జోలపాటలు, మేలుకొలుపు పాటలు కూడా రాసారు.

పాటలరామన్న పాటలను స్వరపరచి ప్రోత్సాహాన్నిస్తే మిగిలిన భజనకీర్తనలతో దీటుగావెలుగు చూడగలవు.

## వేపూరు హనుమద్దాసు (కాలం వివరాలు అలభ్యం)

మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తి తాలూకు వేపూరు గ్రామంలో హనుమద్దాసు గారు జన్మించారు. ఈయన ముతరాస కులస్థులు. బాలమ్మ, అచ్చన్న హనుమద్దాసు తల్లిదండ్రులు ఈయన రాసిన కృతులు గద్వాల మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మగారు ప్రచురించారు. హనుమద్దాసు రామ కీర్తనలు మొత్తం 480 ఉన్నాయి.

(478 - తాళం)

"అచ్చు గ్రంథముగ జేసి రాహాహా కీర్తనల్!

లక్షణంబుగాను సీతరాము కరుణ మేల్ మేల్ ॥అంగ॥

అంగీరా సంవత్సర చైత్ర బహుళ చవితిన్ రంగుమీరదిన

రగురాముని కృపా క్షితిన్॥

యెలమి పద్దెనెనిమిది నూట యాభై నాల్గొ శకమున్

దలరు శాలివాహనం గద్వాలలో సమ్ముద మునన్॥

ధరవేపూరు హనుమద్దాసు దైవ క్రూపగోరగా

ఆరయ ఆది లక్ష్మి దేవమ్మయు మహారాణిగా"[8]

ఈ పాటను బట్టి ఆదిలక్ష్మీదేవమ్మగారు 1854 లో హనుమద్దాసుగారి కీర్తనలను పుస్తకరూపంలో ముద్రింపించారని స్పష్టపడుతుంది. హనుమద్దాసు తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకునేవారు. దాసుగారు ఒకరి సంపాదన ఆశించకుండా జీవనం సాగించేవారు.

హనుమద్దాసు పితామహుడు తెప్ప రామన్నగారు సంగీత విద్వాంసునిగా మంచి ప్రఖ్యాతి సంపాదించారు. అతడు రామకీర్తనం చేసుకుంటూ 95 సం॥ల వరకూ జీవించాడు. హనుమద్దాసుకు సంగీత గురువు తన తాతగారే. రామన్నగారి దగ్గర ఆంధ్ర భాష కూడా అభ్యసించి రామనామాన్ని కీర్తనారూపంగా ఎన్నో కృతులు రాశారు.

(8నామం - ఏకతాళం)

భళిభళి కలిపురుషానను పాలించు మదిస్థిరమొగునా......... పెండ్లాలు మగలను దూరీ

తల్లి దండ్రాజ్ఞ తనయులు మీర ఇండ్లెడ బాసి మూతి పండ్లు ర్లగట్టుకొని

తమ పండ్లాడగను గని గదానతరొకరైన॥ మెప్పైన పాటలు బట్టి జూచినప్పుడే యంకితాలు నెట్టి

చెప్పితి కవనమంచు గప్పాలు గొట్ట జనులు గొప్పాగ నెంచి బాని గోసెంట దగిలెదారు

వొమ్మాక జపతపమూలు భగ వన్నామ మును భజనలూ

సమ్మాతిగను మనసద్దారు డచలమయ్య బ్రహ్మాండమైన దంచు. బైరాగ్యులయ్యరంత

ఆశించి కూటికి యోస్పి నేనేహనుమద్దాసునానీ చెప్పి మోసముగాను సాధువేషములేయు వార్ని

దాసోఽహమంద్రుగాని దండింపరొక్కరైన...

ఈ కీర్తనలో గ్రంథరచనా కాలానికి హనుమద్దాసు నేనేనని చాలా మంది మోసంచేసే వ్యక్తులు అప్పటికే ఉన్నారని హనుమద్దాసు గట్టిగా హెచ్చరిక చేశాడు. అప్పటికే హనుమద్దాసు కీర్తనలు ఆయా చుట్టు పక్కల ప్రాంతాలకు విస్తరించి వుండాలి. ఇతడు గద్వాల సంస్థాన ప్రాంతంలో ఉన్న భక్తుడైన వాగ్గేయకారుడు. మన్నెం కొండ 'దేవర' వీరి ఆరాధ్యదైవం - వేపూరు గ్రామంలోనే హనుమంతుడి దేవాలయ మంటపాన్ని నిర్మించి ఆస్వామి సేవలో జీవనం గడిపారు. రామదాసు, నృసింహదాసు మొదలైన భక్త వాగ్గేయకారులవలే హనుమద్దాసు కూడా రామకీర్తనం చేసి తరించాడు.

అలాగే మల్దకల్ గ్రామంలో శేషదాసు అనే భక్తుడు కృతులూ, సుళాదిపదాలు, ఉగాభోగాలు రాశాడు. అవి "శ్రీగురు విజయ విఠల" ముద్రాంకితాలు. శేషదాసు కర్ణాటక సంగీతం అభ్యసించాడు. గొప్ప ప్రావీణ్యం గల శేషదాసు రచనలు ఇప్పటికీ కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో కూడా పాడుతూంటారు. ఈ కీర్తనలు లభించలేదు.

గద్వాల సంస్థానానివచ్చే కళాకారులకు వాద్య సహకారన్నందించి ఎంతో మందిని సంగీత విద్వాంసులుగా చేసిన విద్వాంసుడు మునిమడుగు రాఘవాచార్యులు. రాజాస్థానంలో వాద్య సహాయకులు. అయినా రాజాదరణ కోరని కళామూర్తి. మైలవరం కంపెనీలో హార్మోనియం వాయించేవారు. అంతే కాకుండా నాటకాలలో పద్యాలకు రాగాలను కూరుస్తూ కొత్త కొత్త బాణీని అందిస్తూండేవారు. నాటక కళకు కావలసిన సంగీతావసరాన్ని గుర్తించి సేవలందించిన గొప్ప సంగీత విద్వాంసులు రాఘవాచార్యులుగారు. గద్వాల సంస్థానానికి వచ్చే విద్వాంసులకు, హరిదాసులకు, కళాకారులకు కార్యక్రమాలుఏర్పాటు చేసి సంగీత వ్యాప్తికి దోహదం చేసిన గద్వాల నివాసులలో గోపాలరావు, వారి శిష్యులు జి.నాగప్ప, పూర్ణ బోధ వెంకోబాచార్యులు, శేషగిరి, నారాయణ, రామలక్ష్మాసాని మొదలైనవారు. గురప్పగారు ఫిడేలు వాద్యకారులు, అయ్యప్పగారు తబలా, మంత్రకర్త రాఘవాచార్యులు మృదంగం వాయించడంలో నిష్ణాతులు.

## కె.వి.యన్. శాస్త్రి (కాలం వివరాలు అలభ్యం)

దైవం దిన్నె రామిరెడ్డిగారి ఆస్థాన విద్వాంసులు సంగీత విద్వాన్ కె.వి.యన్. శాస్త్రి స్వరసింహాకురుగోడు వెంకటాచలయ్యగారు శాస్త్రిగారికి స్వయాన మేనమామ. శాస్త్రిగారి అన్నగారు వెంకటాచలయ్యకు కూడా సంగీత గురువు మేనమామ స్వరసింహ వెంకటాచలయ్యే. శాస్త్రిగారి గురువు అన్నగారే. కొంత కాలం అన్నగారి దగ్గర నేర్చుకున్నారు. ఆ తర్వాత మైసూరు ఆస్థాన విద్వాంసులైన వయోలిన్ విద్వాన్ తాయప్ప గారు ఆ తర్వాత మద్రాసులో టి.కె. జయరామయ్యగారి శిష్యరికం చేశారు. "యాదగిరి సంస్థానం, గద్వాల, వనపర్తి, సంస్థానాల్లో వార్షికాలు ఈయనకు ఉన్నాయి" వీరిది అనంతపురం జిల్లా హిందూపురం తాలూకా కోడిపల్లి గ్రామం.

శేషమ్మ తల్లి, చాంబ్రవల్లి వెంకటనారాయణప్ప తండ్రి చిన్నతనంలోనే 1927లో కర్నూలు వచ్చి స్థిరపడ్డారు. సంస్థానాలు ప్రభుత్వంలో విలీనం అయ్యేంతవరకువీరికి వార్షిక సన్మానాలు అందేవనేచెప్పవచ్చు.

ఈయన 1970 ప్రాంతాల్లో కీర్తనలు, వర్ణాలు రాశారు. 'రాగలాపన చంద్రిక' అన్న పేరుతో పుస్తకం ప్రచురించారు. వీరిప్పటికీ సజీవులైన సంగీత జ్ఞాన, వయోవృద్ధులు. సంస్థానాలు ప్రభుత్వంలో విలీనమైన తర్వాత రాసిన ఈ గ్రంథాన్ని ఈ పరిశోధనలోకి గ్రహించలేదు. ఈ పుస్తకం లభ్యమైంది.

# రెండవ భాగం
# సంస్థానంలోని కళాకారులు

## పురాణం కనకయ్యశాస్త్రి (1879 - 1954)

"స్ఫురద్రూపి, ఆజానుబాహుడు, చక్కని తేజస్సు కలిగిన ముఖవర్చస్సు. నొసట అగరుచుక్క, విశాల వక్షస్థలం, జుట్టు ముడి, నల్లరంగు కోటు, దానికి అతికించిన సువర్ణపతాకాలు చేతులకు సింహతలాటాలు, మెడలో బంగారు రుద్రాక్ష, జేబు గడియారం, జగ్గయ్యపేట పట్టు ఉత్తరీయం మొదలైన లాంఛనాలతో ఉట్టిపడే "పురాణం కనకయ్య శాస్త్రిగారు, తన ప్రతిభా విశేషాలను ప్రదర్శించి గద్వాల సంస్థానాధీశులను మెప్పించి, వారిచేత అఖండ సన్మానాన్ని పొందారు."[9] ఆయనను మహారాజావారు ప్రతి సంవత్సరం జరిపే సంగీత పండిత సభలకు పరీక్షాధికారులుగా నియమించారు. కనకయ్య శాస్త్రిగారిని మరో సందర్భంలో మహారాజా సీతారామ భూపాలుడు గద్వాల సంస్థానంలో గండపెండేరం తొడిగి గౌరవించారు. అంతటి గొప్ప విద్వాంసులు కనకయ్య శాస్త్రిగారు.

పరిటాల గ్రామ వాస్తవ్యులు మంగమ్మ, పురుషోత్తమ శాస్త్రి గార్ల కుమారులు. చిన్నతనంలో తండ్రేసంగీత గురువై కొంత వరకూ గ్రంథం నేర్పారు. తర్వాత కొంతకాలానికి తల్లిదండ్రులను పోగొట్టుకుని సంగీతాభివృద్ధి కోసం ఉన్న ఊరు వదలి బయటకు వచ్చారు. పాపట్ల కాంతయ్య గారి దగ్గర కొంత సంగీతాభ్యాసం చేశారు. అక్కడక్కడా సంగీత కచ్చేరీలు చేస్తూ అనుభవాల్నీ ధనాన్ని సంపాదించుకునేవారు.

ఒకనాడు హైదరాబాదులో గానసభ చేసినప్పుడు రసజ్ఞులు కొంత మంది కొంత సొమ్మును విరాళంగా పోగుచేసి కనకయ్య శాస్త్రిగారికి ఇచ్చి మద్రాసు వెళ్ళి తమ సంగీత పాటవానికి మరింత మెరుగులు దిద్దుకుని రమ్మని పంపించారు.

మద్రాసులో తచ్చూరి సింగరాచార్యుల వారి దగ్గర శిష్యరికం చేసి కనకయ్య శాస్త్రిగారు గాత్రమే కాకుండా వయోలిన్ కూడా అభ్యసించేరు. శాస్త్రిగారి సంగీతాసక్తిని గమనించి రెంటాల సుబ్బారావుగారు ఆయనను మద్రాసులో తమయింట అతిథిగా ఆదరించారు. మద్రాసులో జరిగే గానసభల ద్వారా పాండిత్యాన్ని సంపాదించుకొని కొన్నాళ్ళకు స్వగ్రామం చేరుకున్నారు. అక్కడ నుండిగుంటూరు వెళ్ళి 1903లో స్థిర నివాసమేర్పరచుకున్నారు.

దాదాపు పది సంవత్సరాలు తీవ్ర కృషి చేసి సంగీత విద్వాంసులలో మేటి అనిపించుకున్నారు. శాస్త్రిగారు గుంటూరులో గాన సభలు చేసి ఎన్నో స్వర్ణపతకాలను పొందారు. ఆ కాలంలో 116 సన్మానం అంటే ఎంతో గౌరవం. కనకయ్యగారు నూట పదహార్లుకు ఎక్కువగానే సన్మానాలు పొందారు. ఆ తర్వాత నవాబు పేట, యాదగిరి సంస్థానాలలో సంగీత పరీక్షాధికారిగా కొంతకాలం నియమితులయ్యారు. హైదరాబాదులో ఒకసారి ప్రఖ్యాతన్యాయవాది, సంగీతరసజ్ఞులు ఐన శ్రీమాన్ ఆరవముదయ్యంగారు శాస్త్రిగారి సంగీత సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు.

సింగరేణి కాలరీస్ అప్పటి ఇంజనీర్ రాజగోపాలయ్యరు శాస్త్రిగారి సంగీత కచేరీలు ఏర్పాటు చెయ్యడమే కాకుండా బంగారు పతకం గొలుసుతో ఇచ్చి గౌరవించారు.1921వ సంవత్సరంలో మైసూర్ మహారాజా దర్బారులో కనకయ్య శాస్త్రిగారు పాడగా మహారాజావారు ఆనందించి బంగారు జరీ పండిత శాలువ, వెయ్యిన్నూట పదహార్లు ఇచ్చి సన్మానించారు.

అలాగే బెల్లపు రవల రాఘవేంద్రరావు జమీందారు శాస్త్రి గారి గాన సభ ఏర్పాటు చేసి, తర్వాత గణపతి నవరాత్రులకు తాము నిర్వహించే పోటీలకు పరీక్షాధికారిగా శాస్త్రి గారిని నియమించారు. ఆ పిమ్మట మరి కొంతకాలం వేదగిరి దేవస్థానం వారు నిర్వహించే సంగీత సభలకు కనకయ్య శాస్త్రి గారు పరీక్షాధికారులుగా వున్నారు. బేతవోలు, వనపర్తి, ఆత్మకూరులాంటి సంస్థానాలలో సన్మానితులయ్యారు. ఆనందభైరవి, ధన్యాసి మొదలైన రాగాలలో అనేక వర్ణాలు రాశారు. కాని అవి అలభ్యం.

పురాణం కనకయ్య శాస్త్రి గారి సంగీతగాన పద్ధతి సంగీతం తెలియని వారికి ఒక వేడుకగాను, రసజ్ఞులకు మనోరంజకంగానూ అపూర్వపనితనం కలిగినట్లు ఉంటుందని శాస్త్రిగారి గానం విన్న శ్రీవింజమూరి శ్రీనివాసాచారిగారు పేర్కొన్నారు.[10] గుంటూరు జిల్లాలో శ్రీ శారదానికేతనంలో సంగీతాధ్యాపకులుగా 12 సంవత్సరాలు పనిచేసి ఎందరినో సంగీత విద్వాంసులుగా చేశారు.

స్వతంత్ర జీవిగా మహావిద్వాంసులలో ఒకరుగా, ఆత్మగౌరవంతో జీవించిన పురాణం కనకయ్య శాస్త్రి గారు 1954లో కీర్తిశేషులయ్యారు.

## రాయచూరు అనంతశాస్త్రి (1850 - 1935)

"పురాణం కనకయ్యగారిలాగే రాయచూరు అనంతశాస్త్రిగారు కొంతకాలం గద్వాల సంస్థానంలో సంగీత పరీక్షాధికారిగా ఉన్నారు" సీతారామ భూపాలుని కాలంలో అనంతశాస్త్రి గొప్ప గాయకుడుగా, హరికథకుడుగా గద్వాల ప్రాంతంలో వెలుగొందాడు. గాయకులకు మత్సరం కలిగించే గాత్రం, దానికి తోడు జ్ఞాన సంపద, సీతారామ భూపాలుని మెప్పించు భక్తి కలవాడు అనంతశాస్త్రి.

తెలంగాణా ప్రాంతంలో తప్ప మరెక్కడా అనంతశాస్త్రి పేరు వినబడదు. తనను గురువులా ప్రేమించి, గౌరవించి తనను పోషిస్తున్న గద్వాల ప్రభువు అంటే భక్తి, అమితమైన గౌరవం వల్ల ప్రభువును విడిచి ఉండలేక గద్వాలలోనే ఉండిపోయాడని అంటారు. ఆ కారణంగా అనంతశాస్త్రి పేరు ఎక్కడా వినబడదు.

## మిడతూరి సుబ్బారాయుడు (కాలం వివరాలు అలభ్యం)

గద్వాల సంస్థానంలో మిడతూరి సుబ్బారాయుడుఅనే నాదస్వర వాద్యకారుడుండేవాడు. ఆయన అలంపురంలోని ఒకదేవళంలో నాదస్వరం వాయించేవాడు. దేవాలయాల ఆలనాపాలనా చూడటంలో గద్వాల సంస్థానానికి పెద్ద పేరుంది. పాపాల్ని పరిహారం చేసుకోడానికి దేవాలయాల నిర్మాణం చేసినట్లు చెప్తారు.

క్రీ.శ. 1712 ప్రాంతాల్లో మరణించిన సోమ భూపాలుడికి ఒకప్పుడు ఒక నిక్షేపం దొరికింది. దాన్ని పొందవలెనంటే నరబలి ఇవ్వాలి. అందుకుగాను కేశవుడనే బ్రహ్మవారిని బలిచ్చి తద్దోషనివారణార్థం గద్వాలలో కేశవాలయాన్ని నిర్మించాడు. అదీగాక మత విషయమై గద్వాల సంస్థానాధిపతులకు ఎంతో శ్రద్ధ ఉండేది.

అలాంటి సోమ భూపాలుడు ఒకరోజు అలంపురంలోని దేవాలయానికి వెళ్ళి, సుబ్బారాయుడుగారి నాద స్వరాన్ని విని సుబ్బుడూ నీకేంకావాలో కోరుకో అన్నాడు. "అయ్యా! బంగారు సన్నాయిని యిప్పించండి. మరింకేమీ కోరను" అన్నాడు సుబ్బారాయుడు. "బంగారు సన్నాయిని తయారు చెయ్యడానికి ఎంతఖర్చు అవుతుందని అడిగాడు." వెయ్యి రూపాయలవుతుందని లెక్కగట్టి సుబ్బారాయుడు చెప్పాడు. మూర పొడవుగల బంగారు సన్నాయిని వెంటనే చేయించి సుబ్బారాయునికి బహుమతిగా ఇచ్చి సోమభూపాలుడు తన దాతృత్వగుణాన్నీ మాటనూ నిలబెట్టుకున్నాడు.

## వెంకటాచలమయ్య సోదరులు (కాలం వివరాలు అలభ్యం)

వెంకటాచలమయ్య, చినవెంకటాచలమయ్య సోదరులు గద్వాల సంస్థానంలో విద్వాంసులు. త్యాగరాజ స్వామి శిష్య పరంపరలో ఒకరు నామకల్లు నరసింహయ్యగారు. ఆయనకి మేనల్లుళ్ళే వెంకటాచలమయ్య సోదరులు.

పెద వెంకటాచలమయ్యగారికి మైసూరు మహారాజు "స్వరసింహ" అని బిరుదిచ్చి సత్కరించాడు. వెంకటాచలమయ్య సోదరులు కర్నూలు నుండి గద్వాలకు వచ్చి ప్రతి ఏటా గద్వాలలో జరిగే ఉత్సవాలలో పాడుతూండేవారు. పెద వెంకటాచలమయ్యగారు పదాలు, జావళులు, గద్యలు, ప్రబంధాలు పాడటంలో కడునైపుణ్యం కలవారు. ఎలా పాడాలో బాగా తెలిసిన విద్వాంసులు చుట్టు పక్కల ఉన్న చిన్నా పెద్దా సంస్థానాల్లో పాడుతూ కర్ణాటక ప్రాంతంలో కూడాపేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు ఈసోదరులు. గద్వాలలో వీరికి వెయ్యినూట పదహార్లు ప్రతివార్షిక ఉత్సవాల్లో బహుమతిగా లభించేవి.

ఆ కాలంలో వారి విద్వత్తు వల్లే కాకుండా ఆయా ప్రాంతాల్లో వారికున్న పేరు ప్రఖ్యాతుల్ని బట్టి కూడా ఈ బహుమతుల్ని నిర్ణయించేవారు. మరో విషయం రాజుని ఆశ్రయించుకొని కొంతమంది విద్వాంసులుండేవారు. పాండిత్యంలో వారు చిన్నైనా, పెద్దైనా వారే పరీక్షాధికారులుగా చెలామణి అయ్యేవారు.[11]

## అలంపురం శ్రీనివాసులు (కాలం వివరాలు అలభ్యం)

అలంపురం శ్రీనివాసులు గద్వాల సంస్థానంలో మార్దంగికుడు. ఈయన పుదుక్కోటై దక్షిణామూర్తిగారి శిష్యుడు. శ్రీనివాసులు కూడా గద్వాలలో జరిగే ప్రతి ఉత్సవంలో పాల్గొని, సన్మానితులయ్యేరు.

### అధస్సూచికలు

1. రామారావు, మారేమండ కాకతీయ సంచిక

   హరిశివ కుమార్, గద్వాల సంస్థానము - సాహిత్యసేవ - పుట - 261 శాస్త్రి, బి.ఎస్. ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి - 3వ సంపుటం.
2. ఈ విషయాన్ని గద్వాల సంస్థానంలో ఆస్థాన వైద్యునిగా పనిచేసిన శేషాద్రి వైద్య చెప్పారు.
3. హరిశివకుమార్, గద్వాల సంస్థానము - సాహిత్య సేవ (సిద్ధాంత గ్రంథం) వరంగల్, 1987 పుట- 24
4. సుబ్బారావు, నారుమంచి. 'తెలుగు సంగీత విద్వాంసులు' శివశ్రీ పబ్లిషర్స్, తెనాలి, 1947 పుట 12
5. హరిశివకుమార్, గద్వాల సంస్థానము - సాహిత్య సేవ (సిద్ధాంత గ్రంథం) వరంగల్ 1987 పుట - 66
6. " ఆదే " పుట - 40
7. ఆస్థాన వైద్యుడు శేషాద్రి వైద్య చెప్పారు.
8. హనుమద్దాసు, వేపూరు 'హనుమద్దాసు రామ కీర్తనలు' ద్వితీయ ప్రచురణ, శిద్దేశ్వర పబ్లికేషన్, హైదరాబాదు - 1992, పుట - 160
9. సుబ్బారావు, నారుమంచి. తెలుగు సంగీత విద్వాంసులు, శివశ్రీ పబ్లిషర్స్, తెనాలి, 1947. పుటలు - 22, 23
10. కృష్ణమాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల పురాణం కనకయ్యశాస్త్రి, విజ్ఞాన సర్వస్వము - 2 వ సంపుటము. తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ, హైదరాబాదు, 1988. పుట - 94.
11. కర్నూలు జిల్లా ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళిగారు చెప్పిన సమాచారం.

# 14. ఆత్మకూరు సంస్థానం

## చారిత్రక నేపథ్యం

ఆత్మకూరు సంస్థాన పాలకులు పాకనాటిరెడ్లు. ముక్కరవారు. సంస్థాన మూల పురుషుడు గోపాలరెడ్డి. ఆత్మకూరు సంస్థానం వారు మొదట బహమనీ సుల్తానులకు ఆ తర్వాత గోల్కొండ సుల్తానులకు యుద్ధాలలో సహకరించి వారి నుండి సర్కారు జాగీరులను అనేక బిరుదులను బహుమతులుగా పొందారు.

గోపాలరెడ్డి కుమారుడు చిన్న గోపిరెడ్డి, ఆయన కొడుకు చంద్రారెడ్డి, తర్వాత పాలకులలో రెండవ సర్వా రెడ్డి, రాజాసీతారామ భూపాలుడు అతని భార్య భాగ్యలక్ష్మమ్మ పాలకులలో ముఖ్యులు. చంద్రారెడ్డి దైవభక్తి కలవారు. కురుమూర్తి దేవాలయాన్ని ఇతడు నిర్మించాడు. రెండవ సర్వారెడ్డి కాలంలో ఔరంగజేబు చక్రవర్తికి యుద్ధంలో సహకరించి రాజచిహ్నాలు, 500 జాగీరులు పొందారు. ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి సంస్థానాన్ని ఎంతో అభివృద్ధి పరిచారీ ఆత్మకూరు సంస్థానాధిపతులు.

ఈ సంస్థానంలో పాల్గుణ శుక్లపక్షంలో ప్రతిఏటా కవి, గాయక, నాటక ప్రదర్శనలు నిర్వహింపజేసేవారు. అర్హతలను బట్టి ఆ ప్రదర్శకులకు పురస్కారాలను ఇచ్చేవారు.

ఆత్మకూరు సంస్థానంలో వచ్చిన సంగీత రచనలు భజన సంప్రదాయానికి చెందినవి. ఈ సంస్థానంలో ఆస్థానంలో సంగీత విద్వాంసులు ఉన్నట్లు ఆధారాలు లభ్యం కాలేదు. వార్షికంగా చాలామంది విద్వాంసులు కొంత ధనాన్ని బహుమతిగా పొందేవారు.

# మొదటి భాగం

# ఆత్మకూరు సంస్థానంలో వాగ్గేయకారులు - వాఙ్మయం

## మనుసాని వెంకట లక్ష్మమ్మ (కాలం వివరాలు అలభ్యం)

సాహిత్య, కళానిలయమైన భారతదేశంలో 12వ శతాబ్దం నుండే తత్వ పరమైన సిద్ధాంతాలనేకం వచ్చాయి. వంగదేశంలో గౌరాంగ చైతన్య, విద్యాపతులు, మధ్యదేశంలో తులసి, మీరా, కబీరాది ప్రముఖులు, మహారాష్ట్రలో భక్త తుకారాం, ద్రవిడంలో ఆళ్వారులు, కర్ణాటంలో వ్యాస, పురందరులు, ఆంధ్రంలో క్షేత్రయ్య తాళ్ళపాక అన్నమయ్య ఇలా ఎందరెందరో మహామహులు గానామృతంతోటి ప్రజానీకంలో ఉండే జడత్వాన్ని పోగొట్టారు. వారు నింపిన ఆ చైతన్యపు తునకలు ప్రతి పల్లెల్లోనూ భజన కీర్తనలుగా ప్రజల నోటి నుండి వెలువడుతున్నాయి. ఆ తునకలే ప్రేరణయి ఎంతో భక్తిని జనింప జేసే భజనకీర్తనా సంపదకు మూలాలయ్యాయనడంలో ఎటువంటి సందేహంలేదు.

మారు మూల ప్రాంతాలలో అక్షరాస్యత లేకున్నా సంస్కృతీ సంప్రదాయపు పోకడలు పోలేదు. ప్రజా హృదయాన్ని రంజింప చేసే భగవన్నుతులు కీర్తనా రూపంలో ప్రజలకు మౌఖికంగా వ్యాప్తి చెందాయి. ఆనోటా

ఆనోటా విని ప్రజలు వాటికి ప్రచారాన్ని కలుగ చేశారు. అటువంటి పాటలు పురుషులే కాదు భక్తులైన స్త్రీలు కూడా రాశారు. అంతేకాదు భజన కూటాలను ప్రోత్సహించిన ఘనత స్త్రీలకూ ఉంది.

అమరచింత ఆత్మకూరు సంస్థానానికి చెందిన భజన కర్త్రి శ్రీమతి మనుసాని నీలకంఠం వెంకట లక్ష్మమ్మగారు భక్తురాలిగా సేవలు చేసింది. ఈమె గద్వాల సంస్థానంలో రాణీ లక్ష్మీదేవమ్మ గారికి అంతరంగికురాలిగా పని చేసిన శ్రీమతి శివమ్మగారికి స్వయాన చెల్లెలు.

సరళమైన భాషలో ప్రజల హృదయ రంజకంగా భగవన్నుతులను కీర్తనలుగా వెలయించిన వాగ్గేయ కారిణి మనుసాని నీలకంఠం వెంకట లక్ష్మమ్మ. నీలకంఠమయ్య గారి ధర్మపత్ని. కృష్ణయ్య (క్రిష్టయ్య), కటకం నాగమ్మ ఈమె తల్లిదండ్రులు. సప్తాహాలు, యాగాలు, వ్రతాలు, హరి భజనలు చేస్తూ స్వామికి కైంకర్యాన్నిస్తూ ఆవాగ్గేయకారిణి కాలక్షేపం చేసేవారు. వెంకట లక్ష్మమ్మ కుమారుడు గద్వాల మహారాణి గారి దగ్గర స్టోర్స్ ఇన్చార్జ్‌గా వుండేవారు.

"భజన కీర్తనలు - తత్త్వములు' అన్న పేరుతో ఈమె రాసిన కీర్తనలు ముద్రితాలు. వెంకట లక్ష్మమ్మ రాసిన కీర్తనలకు 1961 లో తిరుమల శ్రీనివాస శర్మ ప్రస్తావన రాశారు. రచయిత్రి జీవిత విశేషాలు ఇంతకు మించి లభ్యం కాలేదు. ఆత్మకూరు సంస్థానానికి చెందిన వాగ్గేయ కారిణి వెంకట లక్ష్మమ్మ తను రచించిన కీర్తనలలో 'ఆత్మకూరు నిలయ శ్రీలక్ష్మాంబ వరదాప్రసన్న' అనే ముద్రతో ఆత్మకూరు సంస్థానంలో వెలసిన శ్రీహరిని కీర్తించినట్లు స్పష్టపడుతుంది.

ఈమె వెలయించిన భజన కీర్తనలు - తత్త్వాలు చాలా కాలం వరకూ భక్తుల ముఖస్థమై ఆ పిమ్మట పుస్తక రూపంలో వచ్చాయి. ప్రతి కీర్తనకు తత్త్వానికి రాగం - తాళం నిర్దేశించారు. అది భజన కీర్తనో, తత్త్వమో, మంగళ హారతులో స్పష్టంగా తెలియ పరిచారు. ఈ కీర్తనలను ఎక్కడా స్వర పరచలేదు.

కీర్తన - ఆనందభైరవి రాగం - అటతాళంలో

"రామానీదయ రాకపోయేనా నన్నేయుట అతి భారమాయెనా
వేమారు నిను చాల వేడినందులకైనా ప్రేమ జూడవు
యేదారి తెలియని దానరా ఓదేవ నీదయ రాది దేమిరా
వేద వినోద నీవే గతియని నమ్మాలేదా నా మనసున నీరజదళనేత్ర ॥రామా॥

శంకరాభరణం, ఝుంజాటి, నవరోజు, ఆనందభైరవి, రేగుప్తి, శ్రీ, కాఫీ మొదలైన రాగాలలో ఆమె కీర్తనలు రాశారు. సర్వదా ఆత్మకూరు పురవాసియైన లక్ష్మాంబను రక్ష సేయుమని భగవంతునికి వినతులే అవి. సులభశైలిలో అందరికి అర్థమయ్యే రీతిలో ఉన్నాయి.

"శంకరాభరణ రాగం అటతాళంలో

యదుకుల వంశంలో పుట్టిన వేణుగోపాలుని యెత్తి లాలించిన యశోదగా తనను రచయిత్రి భావించుకుంటుంది.

"యశోద భాగ్య మదెంతో నిన్నెత్తుకొనియు ముద్దాడ
యేభక్తులచే పట్టుబడితివా యదుకుల భూషణ వేగమెరార
ఎత్తుకొనెదనా కృష్ణా నాయదుకుల నందన రార! ఎత్తరాని
గోవర్ధన మెత్తిన వేణుగోపాల"[1] అని నుతించింది.

ఈ పాటలో శ్రీకృష్ణుని బాల్య క్రీడలు వివరించింది. ఈ పుస్తకంలో మొత్తం 23 తత్త్వాలు ఉన్నాయి. కీర్తనలు దాదాపు 125 వరకూ ఉన్నాయి. పాత ప్రతి అవడం వల్ల చివరి పుటలు సరిగా లేవు.

"సురటి రాగం- అటతాళంలో తత్త్వం పంచ భూతములను పంచి వేసి యాసంచితాగామల కర్మ సమయింప చేసి పంచ వింశతి తత్త్వం శోధించుము వేగ పావనమైనట్టి పరమగురునకు॥ జయమంగళం మంగళం సద్గురునకు॥ ఆది అంత్యము లేని ఆత్మజ్యోతి నెత్తి ఆనందము గమనము హంసోహమనుచు ఆటలాడుచు నున్న నాటకధరునకు పాటలు పాడరె పరమాత్మునకు ॥జయా॥[2]

"యదుకుల కాంభోజి రాగంలో - జంపెతాళం.

ఈ తత్త్వంలో మాయా సంసారములో మరిగి సద్గతి త్రోవ మరచియున్నావు.

రామ చిలుకా కాయ మస్థిర మనీ కారణాచార్యుల కడకు

జేరవే రామ చిలుకా! రాయబారము మాని రామధ్యానమె

పూని రమ్యముగ నుండవె చిలుకా..[3]

భగవధ్యానమె రాజయోగమని, నిష్కామంతో ఉండుమనీ, కాలయముడెప్పుడైనా తీసుకొని వెళ్ళే అవకాశం ఉంది. కాబట్టి క్షణ భంగుర మీ జీవితం, అయినా ఉత్తమోత్తమమైన ఈ మానవ దేహం ధరించడానికి ఎన్ని జన్మలెత్రి, ఎన్ని వ్రతాలెత్తామో! వాదు భేదాలు అన్నీ మరచిపోయి నీలో వైకుంఠధాముణ్ణి నిలుపుకో! ఎడతెగని సంసార బంధాన్ని ఎలాగో వదిలించుకుని ఇది ఎండమావి అని భావించు అంటుంది రచయిత్రి.

"పంచభూతములను పంచి చూచి మాయ ముంచి నేయవె రామచిలుక

పంచ రంగుల పంజరంబులో నివసించు పరమాత్మ నెరుగవె చిలుకా!"

ఓం నమశ్శివాయ అని నోరార అంటే ఎన్ని జన్మలనుండి చేసిన పాపమైనా పటాపంచలవుతుందని హితబోధ చేస్తుంది.

మన పెద్దలు "చిలకకి చెప్పినట్లు చెప్పిచూసాను కాని వినలేదు" అంటూంటారు. బహుశః ఆ చిలుకనే ఆధారంగా తీసుకుని మానవునికి హితాన్ని చెప్పిందేమో! ఈమె రాసిన కీర్తనలు, తత్త్వాలు, హారతి పాటలు సులభగ్రాహ్యామే. వెంకట లక్ష్మాంబగారు రాసిన భజన కీర్తనలు ఆత్మకూరి పురంలో వెలసిన భగవంతుని మాత్రమే కాకుండా మల్లాపురం, వనపర్తి, గద్వాల పురాల్లో వెలిసిన పురదేవతలను కూడా స్మరించింది. తెలంగాణా ప్రాంతాల్లో ఉన్న భక్త సమాజాలు ఇప్పటికీ "ఈ పాటలను" భజనల్లో పాడుటం కద్దు.[4]

## అధస్సూచికలు

1. వెంకట లక్ష్మమ్మ, మనుసాని నీలకంఠం భజన కీర్తనలు - తత్వములు - అమర చింత ఆత్మకూరు 1961 పుట - 58
2. " అదే " పుట 60; 3. " అదే " పుటలు 67, 68
4. ఈ పాటల పుస్తకం రచయిత్రి వెంకట లక్ష్మమ్మ గారి మనుమరాలు కుముద్వతి ద్వారా లభించాయి. రచయిత్రి కుమారుడు గద్వాల సంస్థానంలో రాణిగారి స్టోర్స్ ఇన్చార్జిగా ఉండేవారు. అతని కూతురే కుముద్వతి.

# 15. నూజివీడు సంస్థానం

నూజివీడు సంస్థానాన్ని పరిపాలించిన అప్పారాయవంశానికి మూలపురుషుడు మేకాబసవన్నగారు. విప్లర్ల వంశానికి చెందిన వారు. కాకతి గణపతి దేవుని దగ్గర ప్రముఖ దళాధిపతిగా పనిచేశాడు.

విజయనగరాధిపతి శ్రీకృష్ణదేవరాయులకు తన కూతుర్నిచ్చి పెళ్ళి చేసినందువల్ల గొల్లపల్లి, నూజివీడులు విజయనగరంలో చేరాయి. తళ్ళికోట యుద్ధం తర్వాత గోల్కొండ నవాబు కుతుబ్‌షా బసవన్న వంశానికి చెందిన అప్పన్న అనే అతనిని సర్దారుగా నియమించాడు. మొగలాయి సైన్యం అహమద్ నగరం మీద పడినప్పుడు నవాబు ఆదేశం మేరకు అహమద్ నగర రాణి చాంద్ బీబీని సహాయం చేశాడు బసవన్న. అలా సహాయపడినందువల్ల గోల్కొండ నవాబు "విజయ అప్పారావ"ని, రాణి గారు 'విజయ అప్పన్న' అని బసవన్నకి బిరుదిచ్చారు. ఇతని మనుమడు రెండవ విజయ అప్పారావుకు 1667లో గొల్కొండ నవాబు తానీషా నూజివీడు ప్రాంతంలో 18 పరగణాలనిచ్చాడు. "రాజా" అన్న బిరుదు వారి వంశం వారికి స్థిర పరిచాడు. 1766లో నైజాం ఉత్తర సర్కారులను బ్రిటీష్ వారికి ధారాదత్తం చెయ్యడంతో నూజివీడు బ్రిటిష్ వారి అధీనంలోకి వచ్చింది.

అప్పటి పరిపాలకుడు రాజా వెంకయ్యప్పారావుగారు, తర్వాత 12వ తరానికి చెందిన నారయ్యప్పారావుగారు బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేశారు. తర్వాత కాలంలో ధర్మ అప్పారావు గారు, వారి సోదరులు సంస్థానాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం విభజన చేశారు. ధర్మప్పారావుగారి సోదరుడు రాజారామ చంద్ర అప్పారావుగారు 1802లో తనకు సంక్రమించిన వాటాను నూజివీడు కేంద్రంగా పరిపాలించారు. తర్వాత అతని కుమారుడు శోభనాద్రి అప్పారావు నూజివీడును పరిపాలించారు. వీరికి ఏడుగురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. మూడవ కుమారుడు తండ్రికి ముందే చనిపోయారు. ఈ ఆరుగురు సోదరులకు జమీందారీని పంచారు. వెంట్రప్రగడ, ఉయ్యూరు, మీర్జాపురం, కపిలేశ్వరపురం, తేలప్రోలు, మేడూరు ఎస్టేట్లుగా విభజించి ఇచ్చారు. ఉయ్యూరు ఎస్టేటును రాజారంగయ్యప్పారావుగారు పరిపాలించారు.

ఉయ్యూరు అప్పారావు గారు గొప్పరసికులు, కళాపోషకులు. అనేక మంది సంగీత విద్వాంసులను ఆదరించి గౌరవించారు. ఆంధ్రంలోనికి అష్టపదులు తరంగాలు అనువదించారు. వీరి కుమారుడు ఎం.ఆర్. అప్పారావు గారు ఆంధ్ర దేశంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తూ విద్వాంసులకు పారితోషికం ఇచ్చి సన్మానాలు చేశారు.

1927లో జన్మించిన రామచంద్ర అప్పారావుగారు రాజా వెంకటాద్రి అప్పారావుగారి చతుర్థ పుత్రుడు. మద్రాసులో త్యాగరాజ స్వామి మందిరాన్ని నిర్మించి ప్రతిసంవత్సరం అక్కడ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

ద్వారం వెంకటస్వామి నాయుడు, దండమూడి రామమోహనరావు చెంబై వైద్యనాధభాగవతార్ అరియకుడిరామానుజయ్యంగార్, కుంభకోణం రాజమాణిక్యంపిళ్ళై, పాలఘాట్ టి.ఎస్. మణిఅయ్యర్ ఒకరేమిటి దక్షిణాది విద్వాంసులు, ఆంధ్ర రాష్ట్ర విద్వాంసులు ఎంతో మంది రామచంద్ర అప్పారావుగారిచే సన్మానితులు. "తన యావదాస్తీ సంగీత కళాసేవకే అర్పించిన త్యాగరాజ భక్తులు."[1]

అనేక కీర్తనలు రాశారు - సాహిత్యం పరిచయం ఉండటం వలన సంగీతానికి, సాహిత్యానికి సంబంధించిన ఎన్నో వ్యాసాలు రాశారు. మృదంగం, కంజీర, ఘటం వాద్యాలు పరిచయం ఉన్నాయి.

ఎక్కడెక్కడి విద్వాంసుల ఫొటోలను పోగు చేసి తనయింట్లో ఒక హాలు కట్టించి అవన్నీ అలంకరించారు. ఈ మందిరం దేవాలయంలా ఉంటుంది. అలాంటి సేవ మరొకరు చెయ్యలేరెమో! ఆయన అనేక సంగీత సభల్లో పాల్గొనే వారు. తిరువయ్యూర్‌లో త్యాగరాజస్వామి కృతి నొకదాన్ని శిలా ఫలకం మీద చెక్కించి తన కళాభిమానాన్ని భక్తినీ ప్రదర్శించుకున్నారు అప్పారావుగారు.

'శ్రీ త్యాగరాజస్వామి - రామభక్తి" అన్న పేరుతో అప్పారావుగారు ఒక పుస్తకాన్ని రాశారు. ఆయనకు త్యాగరాజ స్వామి, రామ చంద్రుడు ఇష్టమైన దైవాలు. అందువలననే త్యాగ బ్రహ్మ రాముని నుతించడం మొదలుగా త్యాగయ్య భక్తి యొక్క స్వరూపాన్ని సంపూర్ణంగా ఆస్వాదించి, ఆతన్మయత్వాన్ని పొంది ఆ అనుభూతిని అక్షర రూపంలో వెలువరించ గలిగారు. త్యాగరాజు రాముణ్ణే ఇష్టదైవంగా ఎందుకు ఎంచుకున్నారో కారణాలను వివరించారు.

"ఓం నమశ్శివాయ అనే శివమంత్రంలోని 'మ' అనే బీజాక్షరం ఓం నమో నారాయణాయ అనే నారాయణ మంత్రంలోని 'రా' అనే బీజాక్షరం కలిసి రామ అన్న రెండక్షరాల పేరును వశిష్ఠుల వారు రామునికి పెట్టారు. ఈ రామమంత్రంలో ప్రాణాగ్ని సంయోగాల వల్ల అంతరాత్మ ప్రకాశవంతం అవుతుంది. అందుకే తారక మంత్రం ప్రత్యేకత కలిగినది. ఈ రామ మంత్రానికి అరిషడ్వర్గాలను జయించే శక్తి ఉంది. రామ నామజపం తోటే త్యాగరాజస్వామి భగవత్సాక్షాత్కారాన్ని పొందారు. నామ సంకీర్తనాది భక్తి సాధనల చేత మాత్రమే ముక్తిని పొందడానికి వీలవుతుంది. త్యాగయ్య అది సాధించారు.

"తానుపాసించు సర్వం తన ఆత్మగా అనుసంధానించుటే భక్తి యొక్క పూర్ణ లక్షణం. దాన్నే జ్ఞానం అంటారు. అలాంటి జ్ఞానయోగమే త్యాగరాజభక్తి అని ఆయన కొన్ని కీర్తనలలో స్పష్టపడుతుందని అప్పారావుగారు రాశారు.[2]

పూర్వీ కళ్యాణి రాగం - రూపక తాళంలో "జ్ఞాన మొసగరాదా" కీర్తనను ఉదహరించారు.

త్యాగరాజుని భక్తికి సంబంధించి హరికాంభోజి రాగంలో "ఉండేది రాముడొకడు", పంతువరాళిరాగంలో "అప్పరామభక్తి యెంతో గొప్పరా" మొదలైన కీర్తనలను పేర్కొన్నారు. కొన్ని కీర్తనలలో రామ నామమహిమ గురించి వివరించారు. శాస్త్రీయ సంగీతానికి ఏ విధమైన లోటు రానీయకుండా అపూర్వ రాగాలలో అపురూప సంగతులతో శ్రీరామ నామాన్ని మధురంగా ఆడుతూ పాడుతూ విశ్వ కళ్యాణానికి కారకులు మార్గదర్శకులు అయిన త్యాగరాజస్వామి ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేమని వందన సహస్రాలర్పించుకున్నారు అప్పారాయబహద్దరువారు.

రాజామేకా వెంకటాద్రి అప్పారాయణింగారు జయదేవ మహాకవి కృతమైన గీతగోవిందాన్ని మూలాను సరణాలైన రాగ, తాళాలతో పాటలు, పద్యాల రూపంలో ఒక కృతిని వెలయించారు. మూలానికి తగిన విధంగానే అనువాదం చేశారు. ఇరవైనాలుగు  అష్టపదులను సంస్కృతం నుండి పల్లవి, చరణాలతో ఆంధ్రాష్టపదులుగా రాశారు. ఒక్కొక్క అష్టపదికీ పేర్లు పెట్టారు. ప్రతి అష్టపదిలోను పల్లవి కాక ఎనిమిది చరణాలు ఉన్నాయి.

"కామునిరాకకు భయపడి నీలో  తామదిలీనత నొందున్
ఆమె విరహమునకుందున్! కృష్ణా! ఆమె విరహమున కుందున్ తాపము చెందున్!"

అలతి అలతి పదాలతో తెలుగునుడికారాన్ని పదాలలో స్పష్టపరిచారు రచయిత. ప్రత్యేకించి తాళ నిర్దేశం రాగ నిర్దేశం చెయ్యలేదు. రాగ తాళాలను సంస్కృతంలో ఉన్నట్లుగానే తీసుకోవాలి. సంగీతం,

సంస్కృతం ఆంధ్రం ఈ మూడు తెలిసిన విద్వజ్ఞులు రామచంద్ర అప్పారాయుడు. ఒక్కొక్క అష్టపదికి తగినట్లు చిత్రాలను కూడా ముద్రించారు. అప్పారావుగారు 1936లో గీతగోవిందాన్ని పునర్ముద్రణ చేసినప్పుడల్లా కొన్ని పరిష్కారాలు చేసి ముద్రించారు.

నాలుగవముద్రణ 1968లో జరిగింది. సంగీత సంబంధి స్వాతితిరునాళ్ కీర్తనలను కూడా అప్పారావు రాయణింగారు ఆంధ్రీకరించి గానం చేస్తూండేవారు. ఇప్పుడారచనలు అలభ్యం. వీరి సంస్థానానికి ఎంతో మంది విద్వాంసులు వచ్చి గానసభలు చేసి సన్మానాన్ని పొందేవారు. ఆస్థాన విద్వాంసులుగా ఎవరినీ నియమించినట్లు ఆధారాలు లేవు. ఆంధ్ర ప్రాంతంలో, దక్షిణ ప్రాంతంలో సంగీత ప్రచారం చేసి కళకు స్థిరత్వాన్ని, వ్యాప్తినీ కలిగించిన సంస్థానాధిపతి రాజావెంకటాద్రి అప్పారాయణింగారు. తన యావదాస్తినీ కళకు ధారపోశారు.

## అధస్సూచికలు

1. రామచంద్ర అప్పారావు, మేకా, శ్రీత్యాగరాజస్వామి రామ భక్తి, శ్రీత్యాగరాజ స్వామి మందిరము, టి. నగర్, మద్రాసు - 1958, పుట - 5.

2. చూడు. అనుబంధం - 1

## వారణాసి రామ సుబ్బయ్య (1885 - 1910)

పువ్వు పుట్టగానేక పరిమళిస్తుంది. ఆ పరిమళం చుట్టు పట్ల వ్యాప్తమవుతుంది. సంగీత విద్వాంసులనే పరిమళ భరిత పుష్పాల్లో వారణాసి రామ సుబ్బయ్య గారొకరు. "1885 లో గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా పొన్నూరులో జన్మించారని" రామసుబ్బయ్యగారి శిష్యుడు నిరాఘాటం రామకోటయ్యగారు నాట్యకళలో రాశారు. రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఏలుబడిలో ఉన్న ప్రాంతం పొన్నూరు. వెంకటాద్రి నాయుడు ముక్త్యాల సంస్థానాధీశుల వంశస్థుడు. ఆ స్థానంలో విద్వాంసుడు కాకపోయినా ఆ ప్రాంతంలో ఉన్న వాగ్గేయకారుడు వారణాసి రామసుబ్బయ్య. అందువల్ల ఈ వాగ్గేయకారుని గురించి నా యీ పరిశోధనలో వివరించాను.

ఏడేళ్ళ వయసులోనే సుబ్బయ్యగారికి సంగీతం అంటే ఎంతో అభిమానం ఏర్పడింది. తండ్రి తాతలు పెద్ద విద్వాంసులు కాక పోయినప్పటికి సంగీతాభిమానులే. పదిహేను సంవత్సరాలు రాకమునుపే రామసుబ్బయ్య సంగీత సభలో గానం చెయ్యడం మొదలు పెట్టారు. సరళీ స్వరాలు. గీతాలు, వర్ణాలు తండ్రి గారి దగ్గర నేర్చుకుని ఆ పిమ్మట రాజనాల వెంకటప్పయ్యగారి దగ్గర సంగీతం పాఠం చేశారు. ఏక సంథాగ్రాహి అవడం వల్ల నాలుగైదు భాషలు సులభంగా నేర్చుకున్నారు. ఎక్కువ కాలం గురువుల నంటి పెట్టుకొని ఉండలేదు. స్వయంకృషితో నిరంతర సాధన చేసి పాటవాన్ని వృద్ధి చేసుకున్నారు. దక్షిణాది ప్రాంతం, ఉత్తర హిందూస్థానంలోను ఎన్నో కచేరీలు చేసి ప్రభువుల నుండి బహుమతులు, సన్మానాలు పొందారు. జంత్రగాత్రాల్లో మంచి పాండిత్యం ఉన్నవారు. గీతాలు, వర్ణాలు, నాగబంధాలు, ఖడ్గ బంధాలు. మొదలైన రచనలు చేశారు.

పొన్నూరులో రామ సుబ్బయ్యగారి పేరు మీద ఒక గ్రంథాలయం ఉండేది. రుద్రప్రియ, జగన్మోహిని, వీణాధరి మొదలైన రాగాల్లో ఆదితాళం, అటతాళాల్లో రచనలు చేశారు. సుబ్బయ్యగారు ఏరాగంలో, ఏ పల్లవినైనా ఎటువంటి విషమ జాగాలు పెట్టి ఇచ్చినా అవలీలగా పాడగల్గిన నేర్పరి రామ సుబ్బయ్యగారు. వయోలిన్, గాత్రం రెండూ ఒకేసారి ప్రదర్శించగలిగే విద్వాంసులు.

"ఒకప్పుడు ముత్తు స్వామి దీక్షితుల వంశంవారు రామ సుబ్బయ్యను పరీక్షించారు. గ్రహస్వరం పాడమని అడిగారు. నేనా పేరు ఇంతవరకు వినలేదు. మీరొకసారి పాడిన దాన్ని విని నేనుపాడెదనని సుబ్బయ్య సమాధాన మిచ్చారట. దాక్షిణాత్య గాయకుడు గ్రహస్వరం పాడి వినిపించాడు. వాటి మర్మమెరిగి వెంటనేక గ్రహస్వరం పాడి అక్కడి వారిని ఆశ్చర్యపరిచారు. అందుకు దీక్షితుల వారి కీర్తనల గ్రంథం బహుకరించారు. ఇంతటి ప్రజ్ఞాశాలిని గుంటూరు జిల్లా పేటేరులో ఉన్న రావు సూరయ్య అభిమానంతో ఆదరించాడు. రామసుబ్బయ్యగారికి ఆర్థికంగా ఎప్పుడు అవసరం వచ్చినా డబ్బు ఇచ్చేవారు. పుచ్చా సీతారామయ్యగారు రామసుబ్బయ్యగారిని విదేశాలకు పంపించడానికి ధనం ఇతర అనుమతి పత్రాలు ఇచ్చారు. అనారోగ్య కారణం వల్ల విదేశ యానం ఫలించలేదు.

పొన్నూరు దేవళంలో వెలసిన భావనారాయణ స్వామి మీద ఐదు వర్ణాలు, కృతులూ రాశారు.

వాఙ్మయ మనే మహాసంద్రం గిలక్కొడితే ఎంతో విలువైన రచనలనే రత్నాలు లభ్యం అవుతాయి. అవి మెరుగు పెట్టినప్పుడే మెరుస్తాయి వెలుగునిస్తాయి.

రామసుబ్బయ్యగారి చివరి కచేరీ జయపురం మహారాజావారి సంస్థానంలో జరిగింది. రామ సుబ్బయ్య కొందరు విద్యార్థుల్ని చేరదీసి వారికి ఉచితంగా అన్న వస్త్రాలిచ్చి సంగీతం నేర్పారు.

వారణాసి రామసుబ్బయ్యగారి సంగీత శాస్త్ర రహస్య ప్రబోధం స్వరప్రస్తారం ఈ విధంగా వుంది.

మొదటి 1, 2, 3, 4, 5, 6, 7 ఈ సంఖ్యలను రాసుకోవాలి. ఇచ్చిన సంఖ్యను దాని ముందున్న సంఖ్యచేత గుణించాలి. ఆ వచ్చిన అంకె స్వరాల కూర్పును తెలుపుతుంది.

ఉదాహరణకు స, రి, గ అనే అంకెలు మూడు - వీటికి ముందర ఉండే అంకెలతో గుణించాలి. 1, 2 అంకెలతో గుణిస్తే ఆరు మార్పులు ఏర్పడతాయి. ఇదే ప్రకారంగా నాలుగు స్వరాల మార్పులు అనగా

$1 \times 2 \times 3 \times 4 = 24$; ఐదు స్వరాల మార్పు,

$1 \times 2 \times 3 \times 4 \times 5 = 120$; 6 స్వరాల మార్పు, $1 \times 2 \times 3 \times 4 \times 5 \times 6 \times 7 = 720$ ఇచ్చిన స్వరాలలో మొదటి రెండు స్వరాలను ఆరోహణ క్రమంలో సాధ్యమైనంత వరకూ ఎన్ని ప్రస్తారాలు వస్తాయో ఆ విధంగా చేసుకుని దానికి మరొక స్వరం చేర్చాలి. అప్పుడు కొన్ని భేదాలు ఏర్పడతాయి. అది ఈ క్రింది విధంగా ఉంటుంది.

స, రిగ - దీనిలో మొదటి రెండు స్వరాలు - సరి, రిస అని ప్రస్తారం చెయ్యాలి. దీనితో గ చేర్చగా సరిగ, రిసగ అవుతాయి. ఒకటి మూడు ప్రస్తరిస్తే సగ, గస అని, దానికి చేరిస్తే సగరి, గసరి అని భేదాలు ఏర్పడతాయి. ఈస్వరాంతమైన మార్పులు ఎన్ని అని చెప్పడానికి ఇచ్చిన స్వర సముదాయంలో ఆ స్వరం తప్ప ఎన్ని స్వరాలున్నాయో ఆ సంఖ్యను దాని ముందున్న అంకెలతో గుణించాలి. అలా ఏర్పడిన విధమే స్వరాంతరాలు. ఈ విధమైన స్వర ప్రస్తారం చేయడంలో రామసుబ్బయ్య సాటి మరొకరు లేరు.

రామసుబ్బయ్యగారు రాసిన రచనలలో శ్రీభావనారాయణ స్వామికి అంకితాలైన మూడు వర్ణాలు మాత్రమే లభ్యమయ్యాయి. శ్రీరాగం - ఖండజాతి మఠ్యతాళంలో "శ్రీమహిళా సామప్రియ సోమకాసురాంతకా!" ఆభోగిరాగం - ఖండజాతి త్రిపుట తాళంలో "నీరజాక్ష! నిన్నే కోరితి నేరమెంచకురా"; రుద్ర ప్రియరాగం - అటతాళంలో "ఆరుద్రప్రియే సదయే రోహణాచల నిలయే" ఈ మూడు వర్ణాలలోని సాహిత్యం నారాయణసుత్తి. సాహిత్యాక్షరాలు చాలా తక్కువగా ఉన్న రచనలు ఇవి. రాగ భావాన్ని ప్రస్ఫుటికరింపజేయాలనే ఉద్దేశంతో సాహిత్యాక్షరాలను తక్కువగా ఉంచినట్లు భావించ వచ్చు.

## దుడ్డు సీతారామయ్య (1883 - 1949)

ఏ సంస్థానంలోనూ ఆస్థాన విద్వాంసునిగా లేకుండా పదకొండు సంస్థానాలలో వార్షికం తీసుకున్న వాగ్గేయకారులు దుడ్డు సీతారామయ్య. బాపట్లలో ఉండేవారు. అన్ని సంస్థానాలకూ సంబంధించిన వారు కాబట్టి నా పరిశోధనలో ఈయనను, ఈయన రచనల గురించీ వివరించాను. దుడ్డు కామశాస్త్రి సుబ్బమ్మల పుత్రుడు దుడ్డుసీతారామయ్య. కామశాస్త్రి అధ్యాత్మ రామాయణ కీర్తనలు, అష్టపదులు, తరంగాల గానంలో ప్రావీణ్యం కలవారు. అందువల్ల 1883లో పుట్టిన సీతారామయ్యకు పసితనం నుండే సంగీతాభిరుచి కలిగింది. మొదట తండ్రి దగ్గరే సంగీతాభ్యాసం చేశారు. స్వర, రాగ జ్ఞానం కలిగింతర్వాత దేశాటనం చేసి రెండు మూడేళ్ళలో అనేక మంది దగ్గర సంగీత గాన రహస్యాలను సేకరించుకున్నారు సీతారామయ్య. ఈయన ముసర్ల దక్షిణామూర్తి గారి దగ్గర, మద్రాసులో తిరువత్తూరు త్యాగయ్యగారి దగ్గర కొంతకాలం శిష్యరికం చేసి సంగీతాభ్యాసం చేశారు. సీతారామయ్య అవధాన ప్రక్రియలో ఉద్దండ పండితుడు. అష్టావధానం, గణితావధానం, సంగీతావధానం కూడా చేశారు. "రాగతాళ, కాల, జాగా, గతి, జాతి భేదాలతో పాడుతూ వయోలిన్ వాయించడం సంగీతావధానం. కోరిన జాగాలలో షట్కాలాలలో రెండు చేతులతోను తాళాలు వేసి కాలం మార్చి న్యస్తాక్షరీ ఘంటానాదాలతో కలిపి అవధానం చెయ్యడం గణితావధానం."[1] సంగీత పరంగా అవధానంలో ఇవి భాగాలు. ఇవి చాలా కష్టమైనవి. అటువంటి అవధానం సీతారామయ్య చాలా సులభంగా చేసేవారు.

ఎప్పుడు ఏ రాగం గురించి అడిగినా ఆ సంఖ్య రాగం, అది ఏ రాగ జన్యమో మూర్ఛన ఏమిటో అన్నీ వివరంగా చెప్పేవారు. మొత్తం 34848 రాగాలలో దేన్ని గురించి చెప్పమన్నా చెప్పడం కష్టమే అయినా చాలా సులువుగా చెప్పేవారు. అంతటి ప్రతిభావంతుడు సీతారామయ్య.

పారుపల్లి రామకృష్ణయ్యపంతులుగారి సహాధ్యాయి సీతారామయ్యగారు. ఆనాటి సమాజంలో ఆత్మతృప్తికి సంగీతం నేర్చుకొనేవారు కొందరైతే, నువ్వా నేనా! అని పోటీకి నిలబడి నేర్చుకొనేవారు మరి కొందరు. పోటీలో ఓడిపోయి ప్రాణత్యాగం చేసేవారు కొందరైతే ఎవరి గొప్ప వారిది అని నిలదొక్కుకున్నవారు మరికొందరు. అలాంటి సమాజంలో ఎదురులేని ప్రజ్ఞాశీలురుగా ఎన్నో సంస్థానాలలో ప్రతిభ ప్రదర్శించి వార్షికంగా ఎన్నో బహుమానాలను, సన్మానాలను పొందారు సీతారామయ్య.

"అలహాబాదులో ఒకకాశీ పండితుని జయించి వారి చేతి సింహతలాటాన్ని తీయించేశారు" మాడుగుల, పాడేరు, గోదేవారి ఎస్టేట్లలో సీతారామయ్య సంగీత గణితావధానం ప్రదర్శించారు.

ఈయన ఒకప్పుడు పిఠాపురం రాజావారి దర్బారులో సంగీతావధానం చేశారు. అవధాన పటిమను చూసి సీతారామయ్యగారిని రాజావారు ఆస్థాన విద్వాంసునిగా ఉండమని కోరారు. కానీ అంతకుముందే నూజివీడు, గద్వాల మొదలైన పది సంస్థానాలలో వార్షికం ఉండటం వల్ల ఆస్థాన విద్వాంసునిగ అంగీకరించలేదు.

సీతారామయ్య తన సంగీత ప్రతిభతో కాకినాడలో చల్లా సుబ్బారావు గారి నుండి సింహ తలాటపు మురుగులు, పత్రి రామచంద్రరావు నుండి స్వర్ణ కంఠహారాన్ని పొందారు. పామర్రు గ్రామంలో సంగీతపు పోటీలో, 1,116 రూపాయలు గెలుచుకున్నారు. మాడుగుల సుబ్బారావు వీరికి జంగారెడ్డిగూడెం దగ్గర పట్టెన్న పాలెంలోను, శ్రీరామపురంలోను 50 యెకరాలు మొఖాసా ఇచ్చారు. గోదేవారి ఎస్టేటులో ఆహిరి, రీతిగౌళరాగాలు పాడి ఓలేటి కామరాజు పంతులుగారి నుండి, 200 రూపాయల భూమిని, శాశ్వత దాన పట్టాను పొందారు.

అదేవిధంగా నూజివీడులో మీర్జాపురం రాజావారి వివాహ సందర్భంలో సంగీత అష్టావధానంలో ఉసేని రాగాలాపన చేసి వారిని మెప్పించి "మహామహోపాధ్యాయ బిరుదాన్ని పొందారు. సీతారామయ్య. ఎంతో మంది విద్వాంసులను శిష్యులుగా పొందారు. మహేంద్రవాడ బాపన్న శాస్త్రి (విజరం) వీరి శిష్యులలో ముఖ్యులు.

సీతారామయ్య అవధాన ప్రక్రియలో మాత్రమే ప్రసిద్ధులుగారు, సంగీత రచనలు కూడా చేసిన వాగ్గేయ కారుడు. ఈయన మొత్తం 72 మేళకర్తరాగాల్లోనూ రచనలు చేశారు. వీటిని వ్యవహారంలో కొద్ది మంది విద్వాంసులు మాత్రమే పాడుతున్నారు. శతజయంతి ఉత్సవ సంచికలో కొన్ని రచనలు ప్రచురించారు.

త్యాగరాజస్వామి ప్రశిష్యులుగా సంప్రదాయ బద్ధమైన శాస్త్రాభ్యాసం చేశారు సీతారామయ్యగారు. అదే సంప్రదాయం ఆయన రచనలలో స్పష్టం అవుతుంది.

"శంకరాభరణ రాగం - లో వర్ణం"

"సామిరాడేమి నేనెట్లోర్తునే"

పల్లవి, అనుపల్లవి, ముక్తాయి స్వరం, చరణం చరణ స్వరాలు ఇవి ఈ వర్ణంలో లక్షణాలు. గోపాలుడు ఏమాయలాడి పాలయ్యేడో అనే బాధ వ్యక్తం చేస్తుంది వర్ణంలో ఒకనాయిక.

తర్వాత 'శహనరాగంలో' నన్ను బ్రోవ రావేరానారాయణ' అనే కీర్తనలో పల్లవి, అనుపల్లవి ముద్రాచరణం చరణాలు రెండు ఉన్నాయి. మకరి నోట కాలుబడిన కరినాథుని రక్షించేవు అని వాడుకలో వుంది. సీతారామ

పాల! సూచన జ్ఞానం లేని నాకు ఆధారం నీవే. నేను ఏమాయలను పన్నలేను నియమాన్ని తప్పలేను వేలిచ్చినా (ధనం) కూయలేను. తిండిలేదని బోయల్లాగా అబద్ధాలాడలేదు. ఏ బాధ పడినా నిన్ను నేను విడువను! అటువంటి నను బ్రోవ రావే నారాయణ! అని ప్రార్థించడం ఈ కీర్తనలోని వస్తువు.

ఈ కీర్తనలోని చరణాలు అనుపల్లవి వలే పాడుకోవాలనే నియమాన్ని కీర్తనలో రాశారు. తర్వాతి రచన దేశాది తాళంలో కూర్చిన ధర్మవతిరాగ కీర్తన"

'దయ జూపరా దాశరథే'

పల్లవి, అనుపల్లవి ఒకే చరణంతో ఉన్న ఈ కీర్తనలోని చరణం కూడా అనుపల్లవి లాగే పాడాలి. అన్నవస్త్రాలకోసం, ఆలుబిడ్డల కోసం అధముల నాశ్రయించడంలో ఎన్ని మార్గాలో ఊహించలేము. చివరికి నిన్నే శరణని వేడుకునే నన్ను దయ చూడవయ్యా అనే భక్తుని ఆర్తి ఇందులోని వస్తువు.

ధేనుకరాగం - ఆదితాళంలో వేరే గతి లేదని యెంతో వేమరు నిన్నే వేడితి రామ!"

రాముణ్ణే మా అందరికీ దైవానివి నీవే అంటూ ప్రార్థిస్తారు. మాతకూ, తాతకు, సతులకు, పతులకు, జ్ఞాతకు అందరికి నువ్వేగతి అని నిన్ను వేడుకుంటున్నాను. పావనరామ! అంటూ ఆర్తిని ప్రకటిస్తారు. ఈ కీర్తన ఒకే ఒక చరణం కలది. ఒకే చరణం గల కీర్తనలు నాటక ప్రియ, కోకిలప్రియ, సువర్ణాంగి, రిషభప్రియ మొదలైన రాగాలలో ఉన్నాయి. జీవిత సంఘటనలు కొన్ని ప్రతిఫలించేవిగా ఈ కీర్తనలు భావన కలిగిస్తాయి.

ఇహం, పరం అనేవి లేకుండా దారి గానక, కాలానికి ఏ కర్మా చెయ్యకుండా కీటకంలాగా నేలమీద తిరుగుతూ భార్యా బిడ్డలకోసం ధనాన్ని సంపాదిస్తూ కాలాన్ని వృథాగా కలుషాత్ముడనై గడిపాను. నన్ను జూచి నాకు దారి తెలియజేయవయ్యారామ. గమన శ్రమ రాగం, ఫరజురాగం, శహన, సావేరి మొదలైన రాగాల్లో రాసిన కీర్తనలు రెండు నుండి నాలుగు చరణాలు కలవి. ప్రతి కీర్తనలోను పల్లవి, అనుపల్లవులు ఉన్నాయి. ప్రతికీర్తనలో సీతారామపాల "సీతారామ భక్తపోష" అనే ముద్ర కనిపిస్తుంది.

దుర్మార్గులకు తోడై ఉండి దుష్కార్యాలను తలపెట్టి మంచి కార్యాలను చెడగొడుతూ పంతం పట్టి భ్రష్ట మార్గాల్లో తిరుగుతూ పాప పుణ్య వివేకం లేకుండా, వ్యవహరించడం, తనకు సేవ చేసిన యిష్టునికి కావలసినవి చెయ్యడం, ఎరువుసొమ్ముల నెగ్గొట్టుట, పరుల కొంపలను పడగొట్టుట, పరులకు అపకారం చెయ్యడం ఇవన్నీ ఉన్న మాలాంటి వాళ్ళను ఉద్ధరించవయ్యారామా! అంటూ దీనంగా ప్రార్థిస్తారు రచయిత. ఈ కీర్తనలు మరింత వెలుగులోకి రావాలి. పూర్వీకుల రచనలకు దీటైన రచనలుగా సీతారామయ్య గారి కీర్తనలను చెప్పవచ్చు. కొన్ని కీర్తనలను స్వర పరచలేదు. మరికొన్ని ఏ పుస్తకంలోను ముద్రించలేదు - ముద్రించని రచనలు రచయిత కుమారుడు దక్షిణామూర్తి శాస్త్రిగారు (బాపట్ల) నాకు ఇచ్చారు. అనేక సంస్థానాలలో వార్షికం తీసుకుంటూ సన్మానాలు పొంది సంగీత వాఙ్మయాన్ని వృద్ధి పరచిన దుడ్డు సీతారామయ్య రచనలను పరిశోధనలో భాగంగా చేర్చడమైనది.

అనుబంధం - I

మహారాజా ఆనందగజపతి రాసిన పత్రం.

శ్రీ రస్తు.

# గాయకలోచనము

## ఉత్తర భాగము.

విజయనగరసంస్థానాధిపతులగు శ్రీమదానందగజపతి మహారాజప్రణీతంబగు తానవర్ణము.

ధన్యాసి రాగము - ఖండజాతి అటతాళము.

పల్లవి.

మప గా రి స - గగరిస - నిరిసనిధప - మనిధప - గపమగరిస -
దేవిత్వాంయన - ధిఇఇఇ - రఅఅఅఅఅ - నఉఉఉ - పఅఅఅఅఅ -
నీ సగామ - దధపమాప - రిరి స నీ స - ధపమగరిస ॥ సారిరిసస -
శ్యఅ అ అ - తిఇఇ ఈఇ - నఅఅన్యాఅ - త్పఅశ్యాఅతిఇ ॥ భావఅఅఅ -
రిరిసస - గగరిస - మమగగరి రి - నిసరిరిస - ని సనిధ - సనిధప -
నఅఅఅ - యఅఅఅ - శైఎజఅసిఇ - తిఇఇఇఇ - మిఇఇఇ - రెఎఎఎ -
గ గమ - ప ని ని - సగగ - నిరిరి - పసస - మనిపసనిరి॥
త్వాఅం - త్వాఅఅ - దఅఅ - స్యాఅఅ - త్పఅఅ - శ్యాఅతిఇఇఇ॥

అనుపల్లవి.

నీస నిధపమగరిస- ని సగమా- మపమా- గమగా - గరిసా - గమ -
పకదొఒఒభఅఅఅ-యొఒఒఓ -స్ఫుఉఊ - త్రిఇ ఈ - రఅఅ - సం -
గమపనిని- ప ని- పనిసగగ - గరిసనిస - నిధపమప - గరిసనిస ॥
భాఅఅవఅ-యిఅ- కఅఅమఅ - యఅఅఅఅ - వఅశ్యాఅఅ - కిఇఇఇఇ ॥
గమ ప నీధప - మపనిస - గారిస - మగరిస - సనిధప - మగరి- సప
తఅత్కా-ధఅఅ - మఅభిఇ - కామఅ - యుఇఇఇ - గుంంంం - శఅఅ- కృఅ
మప - పసనిస - పనిస - మపని - గమప - నిమా - పగా - మసా ॥
అఅ - మఅఅఅ - నంం - దఅఅ - వఅన - నిఈ - పుఊ - నౌప ॥





ఎత్తుగడ స్వరము.

మనిపపారి - నిధపమా - సమగపాధ - మగరిసా - పపమగ - నిని
ధప - గగరిస - నిసరిపా - గమపపా - మగపమ - నిధపమగరిస -
పామ - గమపగా - రీస - నిసనిపా - పసనిస - పధమప - గమగరి
స - నిసగగపమా - [illegible] ॥

చరణము.

పసా - నిగా - సమా - గమపసా - గరిస - నిరిసని - పనిధప - గమ
కైఈ- ఇఈ - ఇఈ - వఅఅఅ - ల్యాఅఅ- అఅఅఅ- అఅఅఅ- దఅ
పని - దధదధధపమా - మపనిసగరీస - నీధాపా ॥
అఅ - అఅఅఅఅఅఅ - యుఇఇఇఇఈఇ - నీఈఈ ॥

విడిస్వరములు.

౧. గమపమ్మప - స్నినిధప - మగరిస - పమప - గమప - సనిస-
మపపమగరిస - పాససస - పనిసగరీ - నిసగమప - మాప -
నీస ॥కై॥ ౨. గమగమపా-గమామ్మపా-పనిపనిపాపమ-గమగగాగ్గరి
స-గమపమ-గమనీ- పనిసని-గారీ-నీధప-పానిధమగరిస-పమమా-నిపపా-
రిసపా-రినిధప-మమనిని-పపసస-నినిరిరి-నినిధప-గగమప-నిసానిధపమ-గా
మపామగారిస॥కై॥ ౩. సమపనిమా-పనిసపా-నిసగారిస-గగరిసరిస-
నినిధప-పగారిస-మనీధప-నినిధపధప - గగరిస - ధపమగారిస- పాపపమ
మపా - పాససనినిపా , నిసనినిపధపపమా - ససరిసారి - పపధపా
ధ - రిసారి - ధపాధ - రిసా - ధపా - రీపా ॥ కై ॥ ౪. పధ
పప్పధపన్నినిధపమప - గమనినిధపమగరిస - నిసగమపమా - పమ
గపమా - గమపమా - సమా - గగమపనినిస - గగరిస - నినిధప
మ ॥ సమగ్గరిస - నిసగమప - సగమప - గమప - ధపనిధ - పనిపా-
నిసనీ - సరిసా - సగస్సరినిపా - పనిప్పధమపా - పసానిపధమా -
సపామగమసా - సనిప - మపనిపమ — గమపమగరిస - నీ - గా
గా - పా - రిసపా - ధపపా - రిసపా - పసపా - రిరిస - పనిప
రిరిస - పనిపగగరి - పగగ - నిగగ - పసన్నిధప . మపమ్మనిధా - పని
ధా - నిధా - నిసగరీ - సగరీ - గరీ ॥ కై ॥

## కృష్ణశాస్త్రులవారికృతులు.

### ౧-సావేరి—ఆది తాళము.

రామంభజేసతతం - శ్రీప్రతాప - రామంభజేసతతం ॥ రామంభజే శ్యామం - రవికులాంబుధిసోమం - వామకరాంచిత సశరధనుర్జిత వాలినందయాశాలినం॥ రా॥ నిగమాగమనుతగుణజాలం- నిఖిలజనానందకరలీలం - ఖగవచరానుకూలం - గౌతమమునితోషితశీలం-ధగధగితనవభూషణలసితం - దాశరథిం - దయాశరథిం ॥ రా ॥ పవనతనూజస్యందనం-అవనతజనహరిచందనం - సవనముదితగాధినందనం-సరసిజభవకృతవందనం - భవభయఘనతరతిమిర మరీచిమాలినం వనమాలినం ॥ రా॥ సనకాదివినుతిపాత్రం - సరసిజహితకులమిత్రం - ఘనకలుషలతాలవిత్రం -కమలదళాయతనేత్రం - జనకసుతాపృథువక్షోజాంతరశాయినం - సుఖదాయినం ॥ రామం ॥

### ౨-కేదారగౌళ—ఆది తాళము.

రామేణపరిపాలితంభువనత్రయం - రామేణపరిపాలితం॥ రామేణ శ్రీసీతారామేణజితపరశు- రామేణవినయాభిరామేణప్రతాప ॥ రా॥ చండనిశిచరమండలతిమిర చండకిరణేన - భండనశౌండాఖండలసుత వేదండమృగేంద్రేణ - శుండాలాధిపశుండాయతభుజ దండలసత్కోదండేన-ఖండపరశుకోదండ ఖండనోద్దండపరాక్రమేణ ॥ రా ॥ భానువంశజమానవేశవితానకుముదహిమభానునా - దానవరణసమానగామిన జ్ఞానవిపినకృశానునా - దానవసముదయదాననిపుణశరేణనత రవిసూనునా - జానకీహృదయజలజభానునా - జానుబాహునాజితసుబాహునా ॥ రా ॥ హారమణికేయూరకటకమంజీరభూషణధారిణా - నీరధిఘనమద నీరదచండసమీరణేన రిపువైరిణా - మారనికరాకారసుభగ శరీరమనోహారిణా-ధీరజనపరిపాలకేన శ్రీరామేణ శ్రీకృష్ణరూపేణ ॥ రామేణ ॥



### 3 - కన్నడ—ఆదితాళము.

వాయునందనఅప్రమేయపరిపాహిమాం॥ వైనతేయభుజగవైనతేయ ఆంజనేయ॥ వా॥ కనకమహీధరభాసమాన కమనీయతరగాత్ర దినకరముఖాత్తశాఖిలకళ దేవముదాకరదివ్యచరిత్ర॥ వా॥ అక్షయకుమారశిక్షణదక్ష అఖిలవనచరాధ్యక్ష-పక్షీంద్రవేగహేమసమాక్ష పాలకలితివారణ శిష్టజనమానసమందిర - వసిష్ఠతటినీతీరనివాస - అష్టవిధార్చ్య॥ వా ॥ అచ్ఛమానసలంకాఖ్యాతిదాయకరవిసుతేష్టామాత్యరాఘవదాస॥ వా ॥ అచ్ఛమానసలంకా పురీయథేచ్ఛ సంచారణనిపుణ - పుచ్ఛాగ్రబద్ధతుచ్ఛాశరగణ కచ్ఛపాది నిలయాబ్ధితరణచణ ॥ వా ॥ వితతశోకవనద్రుమభంజన - విధుతిదశాననమదడంభా-క్షితిజాక్షయమాశ్రవణానందిత శ్రీరఘునందనకృతపరిరంభ॥ వాన్వ్రాతచరితపురుషార్థవిమతవిఖ్యాతపరాక్రమకపిమోదకరా-సీతావిచార తిమిరదినకరా శ్రీకృష్ణమనసంతోషకర॥ వాయు ॥

—:0:—

## తలంగంబాడి - పంచనదయ్యగారి కృతులు.

### ౧-కలగడ—త్రిశ్రలఘువు.

నరసిజనేత్రా - సమయమిదేరా - భారమవనుబ్రోవవేర శ్రీశక్తిగణాధిప॥ నిరతమునిన్నుగొల్వ నీకేకదయరాదుగా - ధరణిలోనాకెవరుపరిరక్షకులున్నారు - శరణనినమ్మినాను సాధుజనసంపూజితా-పరాత్పర సుగుణాకరకరుణాకరనిధి - జాగులేలరా॥ స ॥తరుణశశాంకఫాల దానవకులమర్దనా - కరివదనా - పావనా - కాలవినాశనా - అరుణాంబుజనిభచరణాదురితవిఖండనా - అరయజగంబులోన అగమనుతనీకుసాటిగా-మఱియొక వేల్పునుమఱికోరనుగద - పంచనదవినుత॥ స ॥

### ౨ - కల్యాణి—త్రిశ్రలఘువు.

బిర్రానబ్రోవ యిదిమంచిసమయమురా ॥ పరాకుసేయక పరమదయాళో - వరాల్లొసగుమావరతనయ॥ బి ॥నీపాదపంకజము నెఱనమ్మినవాడ - నాపరితాపముదీర్చిరక్షించు - పాపరహితపంచనదవినుత॥ బి

౭.—ఘలమంజరి - ఆదితాళము.

శ్రీవేంకటేశానామనవిచిత్తగించినాడుచింతదీర్చవయ్యా॥నీవంటిదైవ మెందులేదనుచు - నీసన్నిధికోరివచ్చితిని ॥ శ్రీ ॥ నినుకోరివచ్చిన ఆలకుచే లుని బ్రోచినదెల్లనుచాలవినివినిసన్నాడితని బ్రోతువనిమనసున నెంచివచ్చితిని ॥

౮.—బృందావనసారంగ - ఆదితాళము.

సరసీరుహానన శ్రీరామ ॥ ధరజామనోహర శంఖచక్రధర శ్రీకరదానవహర ॥సరసీ॥ వాసవాదిపూజిత వరచరణా వారణార్తిభంజన నిపుణచరణ - వాసుదేవపద్మనాబసురేశ - వరదవేంకటేశసర్వేశ॥ సరసీ॥

౯.—సరసాంగి - రూపకతాళం.

మనవిచేకొనవయ్యా మాజానకీరమణ॥ఘనపాపహరణకమనీయచరణ॥మనవి॥పరితాపము లెల్లదీర్చివరములిచ్చువాడవనుచుసరగునన్నటుప్రోతువనుచుసన్నిధికోరివచ్చిననా॥మనవి॥కరిమొఱలిడగాచితివనికరుణతో గాచినదివిని - మురహరహరియనుచు నీతోముదముతో దెల్పవచ్చిననా ॥మనవి॥ వరదవేంకటేశుడనుచుబిరుదువహించినది దెలిసి-స్థిరముగనమ్మియున్ననాపైదురమ... ॥

౧౦.—ఉదయరవి - ఆదితాళము.

వరమీయవయ్యా ధరనాయకా॥శరదిందుశేఖ... శ్రీధరపాపహరాశరచాపకరా॥ పారమార్తికనూ పనులెల్లమాని - ... సపాపకృత్యముల్ సల్పుచువారాంగనాజారులై తిరిగి-సారహీనులనునన్ను ...య క॥ వ॥ వరనారదాదిసురయక్షకిన్నరులు నేర్చిన వరసంగీత -స్వరసౌఖ్యము ఎఱుంగలేనిధరనరజీవులనుస్మరియించక॥పురుషోత్తమ శ్రీవరదవేంకటేశకరుణాకటాక్షకరిరక్షక శ్రీ - హరిహరిహరియని సంతతము స్థిరచిత్తముతో భజియించేటి॥ వ ॥

శ్రీరస్తు.

గ్రంథకర్తచే రచియింపబడిన కృతులు.

శ్రీ వేంకటేశ పంచరత్నములు.

౧-తోడి—ఆదితాళము.

శేషశైలవాసం భజేహం శ్రీనివాసమఖిలభక్తపోషం॥ పోషితామరనికాయంసతతంభుజగశైరిబాహనుప్రమేయం॥ శే॥కామితఫలవిశ్రాణనదక్షం కంజనేత్రమమరారివిపక్షంభూమితనూజాకళత్రంపుణ్యచరిత్రం-కామజనకమినశశినేత్రం కమలాసనసన్నుతిపాత్రం సామజవరద ...సా ధుహృదయలోలంసుశీలం॥ కామకోటిసుందరసుశరీరంకలుషనికరభంజన సువిచారంచామీకరవసనమఘువిదూరం సతతశింగరహృదయవిహారం॥

౨-భైరవి—రూపకము.

శేషాచలనాయకంభజేహం చింతితఫలదాయకం ॥ భాషాధీశాది విబుధవందితపదనలినయుగం ॥ శే॥ కరుణారసోపేతహృదయారవిందంకమలాముఖాంబుజ మకరందమిళిందం ॥ నిరుపమగుణజాలమశేషభక్తపాలం నిత్యానందస్వరూపమ సురదళనఖేలం॥శరణాగతసంరక్షణ శీలంమునిలోలంవరదంశింగరపరిపాలంకృపాలవాలం॥ శే॥

౩-కాంభోజి—చాపు.

శ్రీనివాసప్రభో మామవ శ్రీనివాసప్రభో ॥ శ్రీ ॥ దీనమందారసుకుమారజగదేకవీర శేషాద్రివిహార॥ శ్రీ॥ వారిజాక్షభక్తామరభూరుహ వాసవాది వందిత పదజలరుహ మారకోటిసుందరసుశరీర మందరధర ...వాణిజభవ శివజన్మహేతుభూత వారిద... దినార్తిం॥ గోవర్ధనధర... చరిత్ర శుభకరపద్మావతీకళత్ర వేషం - శింగరహృదబ్జలోలం ॥ శ్రీ ॥

మాంతరంగ చాముభాష యదుకులకాంభోజి - జంపె.

...మునిశం-భక్తవాంఛితఫల దఘసురశైలకులిశం॥ అ శ్రీనివాసముపాస్మహేనుతంసతతం - అనంతగరుడవిష్వక్సేనాదిమహితం॥

సమందారం దితిజసం

# అనుబంధం - III

# భగవన్నుతులు

శ్రీ తోస్కుల సూర్యనారాయణశాస్త్రి, (బొబ్బిలి సంస్థాన సంగీత విద్వాంసులు).

## 1. శ్రీరంజని రాగవర్ణనము — చ. ధ్రువతాళం.

ఈ రాగము 22వ మేళకర్త జన్యం

ఆరో : సరిగమ దని స

అవ : సని దమ గరిస

### పల్లవి ॥

| I | O | I | I |
|---|---|---|---|
| సారిగగరి . సగరిస . నిధనిస . | రిగమగారిసరి . | గమ దమా దదని . దనిస సీదదమ . | గమ దనిదమగరి-గమగరి . సనిరిస |
| స , రసు . . . . . ద . . . | ని . . న్నే . . . | కో . . . రి . . యు . . న్న . . . | ది . . . . . . . ర . . . . . . . |
| రిగమ దమ గరిస . నిసరిగమగరిగ | మగమనిదమగమ | దని సనిసా ,, . నిదాని . దనిసరి | గరిసా - సీదదమ . నిదమ గారిసరి . |
| స . . . ర . . . గు . . . స . . . | వ . . . చ్చి . . . | శ్రీ . . . వా ,, . స . . మ . . . | యు . . మ . . . ర . . . . . |

### అనుపల్లవి ॥

| | | | |
|---|---|---|---|
| గమదని . దనిదమ . గమగరి . గమదని | దా ,, ,, నిద | మదనిధ . దనిసరిసా ,, ,, నిద | నిసరిసా నిదమ . దనిస . సీదమగ |
| బి . . . రా . . , స . . . స . . . | రా ,, ,, మ . | లి . . . చ్చి . . . పా ,, ,, ద . | . . , కూ . . . చే . . యు . క . |
| మదని . దానిసరిసగరి . సానిదమ | గమదనిసా ,, . | నిదనిస . నిసరిస . రిగమగరిసని | దనిసని , దనిదమ-గమగరి . సరిగమ |
| కరుణ . జూ . . . ద . . శ్రీ . . . | వే . . . డా ,, . | గో . . . పా . . . ల . . . . . . . | దా . . . స . స . రి . . . పా . . లు |

### చిట్టస్వరం ॥

| I | O | I | I |
|---|---|---|---|
| దానిదదమగమ . దామగారిసని | సారిగరి సనిధ | నిసరిగమా ,, రిగామ . గమదని | సనిసరిగరిస - నిరిస సీదమద |
| నిరిసరిసనిదమ . దసనిస . నిదమగ | మదాని . దనిసరి | గరి మగరిసరి . గరిసా , ని . దమ | సనిదా , మగరి - దమగా , రిసని సా |

### చరణం ॥

| | | | |
|---|---|---|---|
| సా ,, ,, దనిసనిదమగరిసరి . | సా ,, ,, రిగ | రిస . రిగమదమద . నిరిసా , నిదమ | దనిదామగారి - సరిగరి - గమదని |
| పా ,, ,, ర . . . స . . . . . | ఆ ,, ,, స . | న్ను . . . . . శ్రీ . . స . . | స . మూ . యూ . మ . . . . . . రు |
| 1. సీ ,, ,, దా ,, మా , గా , | రిసా ,, . రీ . | గా , మా , దా . నీ ,, దా నీ | సా . నీ , దా మా , దా , నీ సా |
| 2. దానిస . నిసనిద . సనిదమా గగరి . | గామగగరిసరి . | గమా . దదమ గదని . సరిసి . రిసరిసి | రిసాని దనిసరి-నిదామగమదని సా |
| 3. మగరిగ . సరిగమ . దమగమ , రిగమద | నిదమద . గమదని | సరిగ . నిసరి . దనిసమదనిగమదని | సనిదమగరి - నిదమగరి - దమగరి-మ |
| గరిగరిస . రిగరి . నిసగరి . గమదని | సరిగమ గరిసని | దనిసరిస నిదమ . గమగరి—గమదని | సగరిసనిద-రిసనిదమ-రిగమ దని సా |
| 4. రీ ,, ,, సగరిసనిద . మదని రి | సా ,, ,, సని | దమగరి . గమదని . సా , నిదమగరి | సీ . దమగరిస - రీ . గగమ దని- |
| సరిసనిసాని . దనిమదామ . గరిగమ | రిదమగరినిదమ | గరిసని దమగరిగమద . సీసా నిదమ | దా మా గరిస - రీ , గామ దని సా |

సూచన : 1. ఈ వర్ణము యొక్క పల్లవి మొదలు చివరవరకూ మొదటి యక్షరములు జూచిన శ్రీరంజని రాగము యొక్క పేరు కానవగును.

2. ఈ వర్ణమునందలి మూడవ మెట్టుగడ స్వరమునందు గోపుచ్ఛ వర్ణాలంకారస్వరము కలదు.

3. ఈ వర్ణములోని అంతు మెట్టుగడ స్వరము శ్రోతోవహా యతి సాంప్రదాయమును కల్పియున్నారు.

———(౦)———

అనుబంధం-IV పిరాట్ల శంకరశాస్త్రి రచనలు

[illegible]

ప॥ రీ సా రీ స రి స గ రి గ స రి ని . రి స రి ని స ని ద ని ద ని ప ద ని ప ద ప ద ప ద ని ద ప ద ని స రి స . ని స రి స : గ రి గ స ప ద ప - మ ప మ గ రి

[illegible]

ని ని ద సా ద ని ద ప మ ప - గ రి గ మ ప మ గ రి స ప మ ప మ గ రి గ ... గ రి గ మ ప ద ని స రి గ స రి ని స : గ రి స ని ద ప : స ని ద ప మ గ రి స

[illegible]

మ గ గ రి రి స రి రి స స ని . రి స స ని ని ద : రి ని ద స ప ని రి రి స గ రి స రి స గ మ గ గ రి ప ప మ ప మ గ - మ ప ప ద మ గ : ని ని ద మ ద ప మ ప మ గ రి గ మ

ని ని ద ద ద మ , స ని . ద ప ద ప : రి గ మ మ , స రి గ రి : మ గ గ రి స : గ రి రి స రి స ని ద . ని సా ని రి స ని ద ప మ గ

[illegible]

1 [illegible]

2 [illegible]

3 ని ద ప ద మ ప మ గ ప మ = ద ప మ గ గ రి స : మ గ రి , మ గ : ద ప మ గ - రి గ మ ప మ ... ప ద ని స రి - మ ప ద ని

స = రి గ మ ప ద రి . గ రి స ని ద ప = రి స రి ... గ రి ...

4 స , రి స ని రి స - ని గ రి ని రి స - ని ద స , ద ప మ గ రి ... స : ని స రి గ మ ప ద - మ ప మ ప ద ప ద ని

ని ని . ద ని స రి - ని స రి గ : స రి స ని ద ప ద ని ... ని ని గ గ రి . ని ని రి రి ని రి రి స ని ద ప : ని గ రి ని స

ని ద మ మ ప , గ రి గ ... [illegible]

అనుబంధం - IV

పిరాట్ల శంకర శాస్త్రి రచనలు.

రాగం : [illegible]

సపసగరి: నిసదాపస - దాపసప

పల్లవి [illegible]

పా దా పా ప మ గ మ పా ప మ ప ద ప ద స ద ప మ గ రి

[illegible]

పా మ గా రి రి స గ రి రి స ని ని స ని రి రి స గ గ రి పా మ గ రి గ మ

[illegible]

1. [illegible]

2. పా మ పా మ ధ ప ద పా మ గ గ రి స రి స రి [illegible] గ మ మ ద పా మ

3. మ ప ద ద ప మ ద ప మ ప మ గ గ రి రి స రి రి స గ గ [illegible] ప మ గ గ రి [illegible]

గ రి [illegible] ని ద ప మ [illegible]

4. [illegible]

[illegible]

పిరాట్ల శంకర శాస్త్రి - రాంబ్రోలు

అనుబంధం - V

దాసు శ్రీరాములు గారి కృతులు

శ్రీరస్తు

శ్రీ విలాసాగార లక్ష్మీ పరబ్రహ్మణే నమః
[illegible]
[illegible]
దాసు శ్రీరాములు గారిచే రచియింపబడిన
కృతులు

---

శ్రీరస్తు

ఇది కృష్ణా మండల మందలి ఏలూరు [illegible]
[illegible]
[illegible] శ్రీ [illegible], ఏలూరు
[illegible]
[illegible] శ్రీ రాజా బాహద్దరు [illegible]
[illegible]
సర్వజిత్ సంవత్సర చైత్ర శుద్ధ [illegible]
[illegible]
[illegible] భగవన్నామ సంకీర్తనలు [illegible]
శ్రీకృష్ణలీలా [illegible]
పాటలు మొదలగునవియు గల
చిన్ని పుస్తకము.

1887 సం॥ ది 20 [illegible]

దాసు శ్రీ [illegible]

శ్రీ [illegible] ② 

కృతులు – మొదటి భాగము –

1. విఘ్నేశ్వర స్తుతి

హంసధ్వని రాగము – ఆదితాళము

[illegible] – [illegible] – [illegible] – [illegible]

[illegible] | [illegible] || [illegible]

1. [illegible] | [illegible] | [illegible] [illegible] ||

2. [illegible] [illegible] ||

3. [illegible] | [illegible] | [illegible] [illegible] ||

## సరస్వతి ప్రార్థనము

శ్రీ రాగము – ఆదితాళము

మానసవతీ | జ్ఞానవతీ | మహీపతీ | భారతీ | సరస్వతీ || మా ||

1. [illegible] – [illegible] – [illegible] [illegible] || మా ||

2. [illegible] – [illegible] – [illegible] – [illegible] || మా ||

3. [illegible] – [illegible] [illegible] [illegible] – || మా ||

శ్రీ రామ స్తుతము

3. [illegible] – [illegible]

[illegible] | [illegible] | [illegible]

[illegible] [illegible]

1. [illegible] [illegible]

# అనుబంధం – VI

(నా పరిశోధన నిమిత్తం ఎందరో మహానుభావులు ఇంటర్వ్యూలు ఇచ్చా రు. వాటిని నా సిద్ధాంత వ్యాసానికి ఉపయోగపడినంత మేరకు సంక్షిప్త పరచాను. సంక్షిప్త పరచిన భాగాలను యధాతథంగా పొందుపరచాను. నాకు ఇంటర్వ్యూలు ఇచ్చిన వారు దాదాపు అందరూ అరవై యేళ్ళ వయసు దాటిన సంగీత విద్వాంసులు. వారి భాష సరిగ్గా ఉందని చెప్పలేం. అయినా యధాతథంగా ఉంచాను.)

## కోలంక వెంకటరాజుగారితో ఇంటర్వ్యూ

అలత్తూరు సోదరులు ఒక తల్లి బిడ్డలు కాకపోయినా ఒకేలా పెరిగారు. అన్నదమ్ములలా ఉండేవారు మంచి పాండిత్యం ఉన్నవారు. మంచి పేరు తెచ్చుకున్నారు. వీణా రమణయ్య ఆనందగజపతితో కలిసి వీణ వాయించేవారు. వీణా వారిని రెండు గుఱ్ఱాల బగ్గీ మీద తనతో బాటూ పక్కన కూర్చుండబెట్టి తీసుకు వెళ్ళేవారు. అలా వెళ్ళడానికి మహారాజుతో సమానంగా ముఖమల్ గుడ్డలతో ప్రత్యేక దుస్తులు వేయించే వారు. ఆ పరిస్థితుల్లో సంగీత విషయ చర్చ చేస్తూ ఉండేవారు. ఇంకా గాయకులుండేవారు. విద్వాంసులంటే అంతగౌరవం ఉండేది.

బెంగుళూరులో పి.వి.జి. రాజుగారి భార్య రాణిగారు పుత్రులు ఇద్దరి పుట్టిన రోజు ప్రతి సంవత్సరం జరిపేవారు. అప్పుడు నాయుడు గారి కచేరీ ఏర్పాటు చేశారు. అప్పుడు నేను కూడా వెళ్ళాను. ప్రతి సంవత్సరం దసరాకు వార్షికోత్సవానికి సమయాన్ని కేటాయించేవారు మేం వెళ్ళేవాళ్ళం. ఆమెకి స్వతంత్రతగల వ్యక్తిత్వం ఉండేది.

ఆమెకి జర్మన్ ఆయనతో పరిచయం ఉండేది. ఆయన వయోలిన్ వాయించేవారు. (ఉత్సవాల్లో) ఒకరోజు ఆయన వయోలిన్ కచేరీ కూడా వుండేది ఆమె కూడా వీణ వాయించేది. ఆమెకు వీణను బహుశః వీణా వెంకటరమణ దాసుగారే చెప్పేరేమో"

నేను స్వయంగా విన్నాను కూడా. నాయుడుగారూ! మిమ్మల్ని చూడ్డం కోసం, మీ వాద్యం విని ఆనందించడం కోసం మేం ఎప్పుడూ విజయనగరం వచ్చేవాళ్ళం. మీరంటే నాకంత అభిమానం అనే వారు ఆమె. కచేరీ ఏర్పాట్లు అద్భుతంగా ఉండేవి. సన్మానం చేసేవారు. డబ్బు ఇచ్చేవారు.

మైసూరు సంస్థానంలో దాదాపు 60 సంవత్సరాల క్రితం ద్వారం వెంకటస్వామి నాయుడుగారిని మైసూరు రాజా సన్మానం చేసి సంగీత రత్నాకర బిరుదిచ్చి జోడు శాలువాలు ఇచ్చి గౌరవించారు. కర్ణాటక సంగీత శాస్త్రమయిన ఆ పుస్తకం పేరు బిరుదుగా ఇచ్చారంటే ఆయన ఒక నిధి అన్నమాట. మైసూరు సంస్థానానికి చిహ్నాలైన గండభేరుండ పక్షులు ఉన్న బంగారు తొడుగుతో కెంపులు, వజ్రాలు ఉన్న పతకాన్ని ఒక గొలుసుతో సహా ఆ సన్మానం చేశారు.

అలాంటి సన్మానం మరింకెవరికి ఇచ్చారో లేదో నాకు తెలీదు. నేను కళ్ళారా చూశాను ఇది. ద్వారం వారికి ఈ పతకాన్ని గొలుసుతో సహామెడలో వేస్తూ మైసూరు రాజావారు ఓ కోరిక కోరారు. ఏమనంటే ఈ పతకం మీరు మెడలో ధరించినప్పుడు ఇతరుల కెవ్వరికీ నమస్కారం చెయ్యకూడదు. ఎందుకంటే మీరా పతకం మెళ్ళో వేసుకొని చేసినట్లయితే మమ్మల్ని అవమానపరిచినట్లవుతుందని మాకు తోస్తోంది. అది మంచి పనికాదని మాకు తోస్తోంది. కాబట్టి పతకం మెడలో ఉన్నంత వరకూ యెవరికి నమస్కారం చెయ్యకూడదు. మీకు ఇష్టం ఉంటే పతకం తీసి అప్పుడు దండం పెట్టండి అని చెప్పారు.

నాయుడుగారు ఎలా వచ్చారంటే సంగమేశ్వర శాస్త్రిగారు వీణలో చాలా ప్రసిద్ధ విద్వాంసులు. ఆయన బావమరిది నందిగానం వెంకన్న కూడా అక్కడే ఉండేవారు. ఆయన దగ్గర ద్వారం వెంకటస్వామి నాయుడుగారి అన్నగారు వెంకట కృష్ణయ్య నాయుడు గారు శిష్యరికం చేశారు. తమ్ముణ్ణి తీసుకెళ్ళి వినిపిద్దాం అనే ఉద్దేశంతో తుమరాడ సంగమేశ్వర శాస్త్రి గారింటికి తీసుకువచ్చాడు. ముత్తయ్య భాగవతార్ ఉన్నారక్కడ. ఆ సమయంలో నేను కూడా ఉన్నాను.

రామచంద్ర అప్పారావు గారు త్యాగరాజ మందిరాన్ని మద్రాసులో ఒకటి కట్టించారు. ఒక హాల్లాంటిది కట్టించి పూర్వం వాళ్ళ ఫొటోలు ఆయన పెట్టుకున్నారు. ఆ కలెక్షన్ ఎక్కడా లేదు. సంగీతానికి గొప్ప సేవ చేశారు. మహావిద్వాంసులు దక్షిణాది ఉత్తరాదివాళ్ళు అంతా వాళ్ళింట్లో ఉండేవారు. తన ఆస్తంతా సంగీతం గురించి ఖర్చు పెట్టారు.

మద్దెల మాస్టారు శ్రీపాద సన్యాసి రావు గారు 1919 నుండి కళాశాల మృదంగ విద్వాంసులుగా పని చేశారు. హిందీ మాట్లాడే ఒకాయన అప్పు తబలా వాయించేవారు. నాటైంలో వాసా వెంకట్రావు, సన్యాసిరావు మాస్టారు శిష్యులు అప్పలాచార్యులు (వీణ) మాణిక్యం మొదలైన వారు వారి శిష్యులు ఉండేవారు.

విక్రమదేవ మహారాజు జయపూర్ సంస్థానాధిపతి అక్కడ కూడా దసరా రోజుల్లో ఉత్సవాలు చేసేవారు. సంగీత విద్వాంసులు పారుపల్లి వారు కొంతమంది వెళ్ళేవారు. కారైక్కుడి, ద్వారం వెంకటస్వామి నాయుడు, హరినాగ భూషణం గారు మొదలైన వారు ఉత్సవాలకు వెళ్ళేవారు.

నేను విజయనగరం మహారాజావారి మ్యూజిక్ కాలేజిలో పని చేసే వాణ్ణి. అక్కడినుండి తునిరాజు వారి దగ్గరకు వెళ్ళేను. ఒకనాడు పక్కన ఒకాయన ఉండి, ఆస్థాన విద్వాంసునిగా మిమ్మల్ని పెట్టకూడదా! అని ఆయనకు సలహా ఇచ్చాడు. ముప్ఫై నలభై సంవత్సరాల పైనే ఉంటుంది ఇది జరిగి. ఆయన అలా అనగానే అదేమిటయ్యా! ఆయన గజపతుల దగ్గర జాబు చేస్తున్నాడయ్యా! మేమెంత? మామూలు జగపతులం అని తేలిగ్గా నవ్వుతూ అనేసాడు. తునివారు మామూలుగా సన్మానం చేశారు. 5000/- రూపాయలు, సన్మాన పత్రం అవీ ఇచ్చారు నాకు.

పట్టాభి రామయ్య గారి ద్వారా సన్మానం జరిగింది. పై ప్రాంతాల నుండి కూడా సన్మాన రూపంలో డబ్బు అందింది. ద్వారం వెంకట స్వామి నాయుడు గారు కూడా ఆ సమయంలో ఉన్నారు. తునిరాజావారు బుల్లి బాబుగారని ఆయన ఆధిపత్యం వహించి చేశారిదంతా. సన్మానం ఘనంగా చాలా గొప్పగా జరిగింది. మామూలుగా విజయనగరం కాలేజిలో కూడా సన్మానం జరిగింది.

కళాకారులు ఊరికే కళకి అంకితమై జీవితమంతా అర్పణ చేసుకున్నారు గాని పిల్లల బాగు గురించి ఈ రోజుల్లో లాగా పిల్లల గురించి పట్టించుకునేవారు కాదు. ఆర్జన అనేది కూడ బెట్టి దాచుకోవాలని కోరిక ఉండేది కాదు.

సంగమేశ్వరశాస్త్రి గారికి పిఠాపురంలో నెలకి 30/- ల జీతం ఇచ్చేవారు. విజయనగరం మహారాజు ఆనందగజపతి సంగీతం నేర్చుకున్నారు. పాడేవారు. రాశారు కూడా.

ఆనంద గజపతి మహారాజు దర్భాల రామమూర్తిగారు రాసిన 'మృదంగ తత్వం' అన్న పుస్తకం అచ్చు వేయడానికి కొంత డబ్బు ఇచ్చారు. ఆయన పుస్తకంలో ఆయన ఫొటో అదీ వేశారు.

కశింకోటలో జమీందారులుండేవారు. పేరు గుర్తు లేదు కళావంతులు అనుకుంటాను. మద్దెల పంతులు. ఆయన తునిలో ఇక్కడకు అంటే పాయకరావు పేటకు వచ్చాడు. ఇక్కడ కళావంతులు

కొంతమంది ఉండేవారు. మద్దెల పంతులు గారు సంగీత విద్వాంసుడు. వయోలిన్, వీణ, ఫ్లూటు వాయించేవాడు. ఈ మూడింట్లో కూడా మంచి ప్రావీణ్యం. కచేరీలు అవీ చేసేవాడు. అప్పుడాయన దగ్గర తునిలో నేనూ ఉండేవాణ్ణి. తాండవనది ఇక్కడుంది. దాన్ని దాటుకుంటూ వచ్చి నన్ను తీసుకువచ్చి ఇక్కడ పాయకరావు పేటలో ఒక స్కూలు పెట్టారు. అందులో ఆయన ఉంటూ పిల్లలకు పాఠాలు చెప్తూండేవారు. అది ఏరాజా పెట్టించినది కాదు. అది ఒక కళావంతుల ఇల్లు. రెండు గదులు అక్కడ నాట్యం కూడా నేర్పేవారు. కళావంతులు కదా పిఠాపురం నుంచి ఒకామె వచ్చి వారానికి రెండు మూడు రోజులు నేర్పేది. చాలామంది గాత్రం చెప్పేవారు. మిగిలిన వాళ్ళకంటే కళావంతులే ఎక్కువ నేర్చుకునే వారు. ఎందుకంటే కళావంతులకు అన్ని విద్యలు కావాలి కదా!

నేను అప్పటికి చాలా చిన్నవాణ్ణి అవడం చేత చిన్నవయస్సులోనే మృదంగం వాయించడం చేత ముచ్చటగా ఉండి పాయకరావు పేటలో ఉన్న నన్ను వెంటబెట్టుకుని వచ్చి  ఆస్కూలుకి తీసుకు వచ్చాడు. ఆయన పక్క వాయించడం మొట్ట మొదట 5వ సంవత్సరం నుండి మొదలైంది. 1915లో అన్నమాట.

రెండు మూడు సంవత్సరాలు అలా గడిచిపోయింది. కొంచెం వయస్సూ వాయిద్యంలో కొంత ప్రావీణ్యం వచ్చాయి. మాతాతగారు కోలంక వెంకటయ్యగారు మృదంగంలో (తుని) గొప్ప విద్వాంసులు. ఆయన మృదంగ విద్వాంసులవడం వల్ల మా తండ్రులు బాబయ్యలూ అంతా మృదంగం వాయించేవారు. చిన్నప్పటినుండి అలవాటయింది. అలా 5 సంవత్సరాల వయసులో ఉన్న నా చేత పంతులు గారు వీణ పక్కనా, వేణువు పక్కనా వయోలిన్ పక్కనా వాయింపిస్తూ అలా అలవాటు చేశారు.

అప్పుడు సంగీత కచేరీలని ప్రత్యేకించి ఏవీ లేవు. మా తాతగారు గొప్పమార్దంగికుడు. భాగవతుల మేళంలో వాయించేవారు. వారి గురించి నాకంతగా తెలియదు. నన్ను ఆ విధంగా గమనించి హకీం మోహమ్మద్ మొయినుద్దీన్ సాహెబ్ అనే ఈయన ముస్లిం అయినప్పటికి ఆ రోజుల్లో 1918వ సంవత్సరంలో తునిలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు పెట్టాడాయన. ఆ రోజుల్లో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు తునిలోనే మొట్టమొదట ప్రారంభమయ్యాయేమోననిపిస్తుంది. బందరులో హరినాగభూషణం గారు నిర్వహించేవారు. గుడివాడలో హనుమానులు అనే ఆయన చేసేవారు. కోటయ్య దేవర అనే ఆయన కొడుకులు ఇద్దరు. ఒకడు వయోలిన్ ఒకడు ఫ్లూటు వాయించేవారు. ఈ ఇద్దరి కచేరీలు, ఇలా చాలా మంది 10 రోజులు జరిగే ఉత్సవాలలో పాల్గొనేవారు.

అప్పటికి రాజావారు అంత సుముఖంగా లేరని అనిపించింది. చిన్నతనం వల్ల ఏమీ తెలిసేదికాదు. పెద్దవాళ్ళేం చేసేవాళ్ళో. తర్వాత తర్వాత మళ్ళీ నన్ను - ఈ చిన్న వయసులోనే ఈ కుర్రవాడికి మృదంగం పెద్ద వాళ్ళ దగ్గర చెప్పిస్తే అభివృద్ధిలోకి వస్తాడనే ఉద్దేశంతో హకీం మొహమ్మద్ మొయినుద్దీన్ సాహెబ్ నన్ను కాకినాడకు తీసుకొని వెళ్ళి అక్కడ ఉన్న మృదంగం విద్వాంసులైన మా గురుదేవులు మురమళ్ళ గోపాల స్వామిగారనే ఆయన దగ్గర నన్ను ప్రవేశ పెట్టి, మృదంగం చెప్పించారు. తర్వాత మద్రాసుకు తీసుకెళ్ళి పెద్ద పెద్ద విద్వాంసుల వాద్యం వినడం, విద్వాంసుల కచేరీలకు వాయించి అలా అలా మృదంగం వాయించడంలో పెద్దవాణ్ణయ్యాను. దీని కంతటికీ మొయినుద్దీన్ సాహెబ్‌గారి ఆదరణ ప్రేమ అభిమానాలే (కారణం).

వీణ దగ్గర ప్రక్క వాద్యంగా మృదంగం ఎలా వాయించాలో తెలుస్తుంది అని కాకినాడ వెళ్ళినప్పుడే పిఠాపురం తీసుకెళ్ళారు. అప్పటి నా వయసు 10-11 సంవత్సరాలు. అప్పుడు శాస్త్రిగారు మధ్యాహ్నం మూడు గంటలకు, రాత్రి 11 గం॥కు భోజనం చెయ్యడం ఇలా వుండటం చేత నేను బయట భోజనం చేసి శాస్త్రిగారింట్లో పడుకునే వాణ్ణి. ఆయన భోజనం చేసి వచ్చి లేరా రాజు లేవరా అని లేపితే నేను మృదంగం సరి చేసుకుని ఆయన వీణ వాయిస్తుంటే నేను మృదంగం వాయించేవాణ్ణి. అలా కొన్నాళ్ళు జరిగింది. ఆ తర్వాత 12 సంవత్సరాలు వచ్చే సరికి నన్ను విజయ నగరం ద్వారం వెంకటస్వామి నాయుడు గారి దగ్గర ప్రవేశ పెట్టారు.

ఆయన దగ్గర నేను ఉండటం నాభాగ్యమని అనుకుంటున్నాను. ఎందుకంటే సంగీతానికి సంబంధించిన విషయాలు మృదంగం వర్ణాలకు, పదాలకు, కీర్తనలకు జావళీలకు పల్లవికీ రకరకాలైన వాద్య విశేషాలు తెలిసాయి. ఆయనతో ప్రక్క వాద్యంగా నేను ఎన్నో కచేరీలలో పాల్గొన్నాను. ఆయన దగ్గరే చాలా కాలం ఉన్నాను.

సంగమేశ్వరశాస్త్రిగారికి కచేరీలు ఎలా వచ్చేవంటే ఏదో ఒక సందర్భంలో ఓ పెళ్ళికో లేకపోతే ఉత్సవానికో శిష్యులో వారిని దగ్గరుండి తీసుకెళ్ళేవారు. స్వాములారు బయల్దేరివెళ్ళినట్లే ఉండేది - ఆయన కచేరీకి వెళ్ళడం అంటే - కుటుంబంతోటే వెళ్ళడమే. ఆయన దగ్గర పెద్ద వీణ పెట్టె ఉండేది - పూర్వం కర్ర పెట్టె ఉండేది. అందులో సామానంతా పెట్టేవారు.

పెద్ద గోనెసంచీలో గిన్నెలు, ఇంకా మొత్తం వంట సామానంతా ఉండేది - కుటుంబం - భార్య కుమార్తె కుమారుడు నేను అంతా కలిసి వెళ్ళే వాళ్ళం. విశాఖపట్నంలో సంగమేశ్వర శాస్త్రి గారి శిష్యుడొకాయన ఉండేవారు. ఆయన ఉద్యోగ రీత్యా పెద్ద పదవిలో ఉండేవారు. వారింట్లో ఉండేవాళ్ళం. వారం పదిరోజులు ఉండి అక్కడ కూడా వీణ వాయిస్తూ బయట కచేరీలు చేస్తూండటం జరుగుతూండేది. ఈలోగా మరెవరో శిష్యులు రావడం బరంపురం ఇంకా ఛత్రపురం అనీ వుండేది. అక్కడికి వెళ్ళేం. ఇలా రెండేసి మాసాలు కచేరీలు చేసుకుంటూ స్వాముల వారు తిరిగినట్లు తిరిగేవాళ్ళం.

అక్కడ నుండి గుంటూరు ఇలావెడుతూ 'ఉండి' అని 'వూండే' జమీందారు ఒకరుండేవారు. ఆయన పేరు కామేశ్వరరావు. ఆ కాలంలో ఆయన ఎం.పి గా ఉండేవారు. ఆయన ఇంట్లో ఉండేవారు. ఆయనకు సంగీతం అంటే అభిమానం - ఎంతో మంది ధనికులూ, జమీందారులు వీరికి పరిచయస్తులున్నారు. సంగీతాన్నభిమానించే జమీందారులకి వుత్తరం రాసేవారు. అలా పర్లాకిమిడి, టెక్కిలి మొదలైన ఇంకా చాలా జమీందారీలలో సంగీత కచేరీలలో పాల్గొన్నారు. ఇదంతా కామేశ్వరరావుగారి చలవ వల్లే జరిగింది. అప్పుడు వారింట్లో రెండు నెలలున్నాం మేమంతా.

ఇన్ని వాద్యాలు ఆర్కెస్ట్రాలో వుంచి ఎలా వాయిస్తారో అన్ని రకాలుగానూ సంగమేశ్వరశాస్త్రిగారు వీణలో వాయించగలరని రవీంద్రనాథ్ ఠాగూర్ అనేవారుట. 18 సం॥ల వయసు 1928. అప్పటి నుండి పిఠాపురం సంస్థానంలో ఉన్నాను. సూర్యనారాయణ మూర్తి నాయుడు సరస్వతీగాన సభలో దసరా ఉత్సవాలు కాకినాడలో జరిపేవారు. దక్షిణాది విద్వాంసులు కూడా ఇక్కడికి వచ్చేవారు.

కొమ్మిరెడ్డి సూర్యనారాయణ మూర్తిగారంటే అందరికీ, చాలా అభిమానగౌరవాలు. నారాయణ మూర్తి గారింటికి వస్తే విద్వాంసులూ, పిఠాపురం రాజావారు కూడా పెద్దహాల్లో కూర్చునేవారు. నారాయణమూర్తిగారు లోపలి నుండి వచ్చినప్పుడు అందరూ రాజావారితో సహా లేచి నుంచునేవారు. అంతటి గొప్పవారు మూర్తిగారు. ఇంకా వర్తక ప్రముఖుల నుండి కూడా గాన సభకు విరాళాలిచ్చేవారు. పిఠాపురం సంస్థానంలో దసరారోజుల్లో దర్బారు జరిగేది.

పెద్ద హాలుండేది. రాజావారికి వెండి సింహాసనం ఉండేది. దాని మీద కూర్చునేవారు. ఆ పక్కన రాజ బంధువులు, సంగీత విద్వాంసులు కవులూ ఒక్కోచోట ఒక్కోవైపు కూర్చునేవారు. సంగీత కచేరీ జరిగేది. ప్రతి సంవత్సరం రెండు రోజులు గోవిందస్వామి పిళ్ళై కచేరీ జరిగేది. అప్పుడు రాజావారు వింటుండేవారు.

త్యాగరాజస్వామి విగ్రహాన్ని తయారు చెయ్యాలని ఎప్పటినుండో కోరిక. రిటైర్ అయిపోయాను. సరే ఏం చెయ్యాలి. ఆర్థికంగా ఏదో మాదిరిగా ఉండేది. ఇంకా బాగుంటుంది కదా అని నాకు మనసు పుట్టి ధనం సంపాదించాలనుకున్నాను. ఆదుర్బుద్ధి స్వామివారికి ఇష్టం లేదు. ఆయన త్యాగమూర్తి తనకున్నదంతా

దేమునికే కైంకర్యం చేశాడు. ఉంఛవృత్తి చేసి బతికారు. అంచేత ఆశ. మహారాజు లిచ్చినా తిరస్కరించేరు. అటువంటి త్యాగరాజస్వామి విగ్రహాన్ని ధనాశతో చేసే నా భావన ఆయనకు నచ్చలేదో ఏమో వెంటనే జబ్బు చేసింది. హార్టు జబ్బు చేసింది. ఆ తర్వాత కొన్ని రోజులకు రక్తపు పోటు (బ్లడ్ ప్రెజర్) వచ్చింది. ఆ జబ్బుతో చాలా రోజులు విశాఖపట్టణంలో ఆసుపత్రిలో ఉన్నాను. నాకు కలిగిన ధనాశే ఈ జబ్బుకు కారణమని నా అంతరాత్మ ఘోషించింది. అప్పుడు నేను ఇంక ఎట్టి పరిస్థితుల్లోను డబ్బు సంపాదించే ఉద్దేశంతో విగ్రహాలు చెయ్యనని గట్టి నిర్ణయం తీసుకున్నాను. ఒక్క విగ్రహం చేసి త్యాగరాయ సభలో వారికి ఇస్తానని మాట ఇచ్చాను.

ఎందుకో హైదరాబాదు త్యాగరాయ గాన సభలో ఇవ్వాలనిపించింది. అప్పుడు నా ఆరోగ్యం కూడా చాలా బాగుంది. స్నేహితుడు, శిష్యుడూ అయిన నరసింహంగారికి కబురంపాను. వారు హైదరాబాదు వారికి చెప్పారు. పెద్దపెట్టి ఇచ్చారు. విగ్రహాన్ని హైదరాబాదు తీసుకురావడానికి రైల్వే వారు కూడా చాలా సహాయం చేశారు.

పింగాణీ కప్పులు తయారు చేసే మట్టి ఉంటుంది. ఆ మట్టి తెప్పించాను ఒక టన్ను. అది మెత్తగా ఉంటుంది. నిలవ ఉంటుంది. ఆరితే గట్టి పడుతుంది. ఆ తర్వాత దాన్ని చెక్కు కోవచ్చు. అచ్చులా చేసి దాంట్లో మళ్ళీ వేరే సిమెంట్, ఐరన్ మామూలుదికాదు. అల్యూమినియం రాడ్స్ తెప్పించి, నడుందగ్గర, చేతులు దగ్గర పెట్టాం. అదంతా సరిచేసి సాఫ్ చెయ్యడానికి చాలాకాలం పట్టింది. రెండు మూడు నెలలు పట్టింది. ఒకే రంగులో ఉండేట్లు తయారు చేశాను.

భుగత గోపన్న : తోథిమి, తోథిమి తత్తోధిమిథీధిక తథీంధీం ధిక్కిటతక దిధుకుదు తకతక తక తత్తకణం కిటత..... ఇలాంటి శబ్దాలు రాసారు ఇవి భుగత గోపన్న శబ్దాలు. గాత్రం వీణ, వయొలిన్ వాటికి నాట్యం, మృదంగానికి గుర్తింపు రావడానికి నాయుడుగారు కృషి చేశారు. మృదంగానికి సిలబస్ తయారు చేశారు. సంగీత కళాశాలలో ఆడపిల్లలు ప్రవేశించే అర్హత కలిగించింది. నాయుడుగారే, ఆయన కాలం నుండే ఆడపిల్లలు విజయనగరం కాలేజీలో సంగీతం నేర్చుకోడం మొదలెట్టారు.

జనార్దనాచారి గారని ఒకాయన ఉండేవారు. వీణ చాలాబాగా వాయించేవాడు - చాలా అంటే చాలా బాగా వాయించేవాడు. అప్పుడు వుద్యోగం ఇచ్చారు. రేడియోలో నాయుడుగారి శిష్యుడు కావడం వల్ల, నాయుడుగారు ఒకసారి వయొలిన్ వాయించినప్పుడు జనార్దనా చారి వీణ వాయించారు. అందులో నేనూ మృదంగం వాయించాను. అది గ్రాంఫోన్ రికార్డులో వచ్చింది కూడా - నాయుడుగారి దగ్గర నేర్చుకున్నాడు కాబట్టి తనకు అనుకూలంగా ఉంటుందని వాద్యం తాలూకు సుస్వరం, రాగ స్వర ప్రస్తారాలు. ఎలా వేస్తారో అన్నీ బాగా తెలిసుంటుందని వీణ వయొలిన్ కలిపితే రంజకంగా ఉంటుందని వాయించేడు.

పిఠాపురంలో ఆస్తిపరులు ఆమర్తి దొరగారు. కోటిపల్లి ప్రకాశరావు తండ్రి రామారావు గారు ఆమర్తి వేమన దొరగారి శిష్యులు. పండ్రవాడ ఉప్మాకయ్యగారు. ఆయన విద్వాంసుడు. పెద్ద భూస్వాములు. నియోగులు చాలామందిని ఆదరించేడు. నాకు బాగా తెలుసు. కీర్తనలవీ సేకరించాడు. అల్లం రాజు పేర్రాజుగారని ఉప్పాడ కొత్తపల్లిలో మృదంగం వాయించేవాడు. కచేరీలలో వాయించేవాడు. ఆయుర్వేద వైద్యుడు కూడా. గణపతి ఉత్సవాలు జరిపేవారు. కచేరీలు చేయించేవాడు. మృదంగం అంటే చాలా భక్తి ప్రాతఃకాల దర్శనీయ వస్తువుల్లో మృదంగం చాలా గొప్పది అనీ 'కాసు మృదంగం' అనీ తన మృదంగానికి పేరు పెట్టుకున్నాడు. తన పడక గదిలో పెట్టుకునేవాడు. తెల్లవారి లేవగానే దాన్ని దర్శించుకునేవాడు.

నాకు అప్పటికి 8-10 ఏళ్ళ మధ్య వయసు. మంచివాడు. చిన్నవాణ్ణే అయినా మాయింటి కొచ్చేవాడు. వచ్చి "వెంకట్రాజా నువ్వు మృదంగంలో చాలా గొప్పవాడివవుతావు. నాకు రాత్రి కలొచ్చింది. పెద్ద గణపతి పెద్ద మృదంగాన్ని తీసుకొచ్చి నీకిస్తున్నాడట. అందుకున్నావు. నాకు చాలా ఆనందం కలిగింది. అది చెప్పడానికే వచ్చానయ్యా" అని అన్నారు. అప్పటికి అల్లం రాజు పేర్రాజుగారి వయస్సు 60 సం॥లు.

కార్వేటి నగర రాజా రామకృష్ణం రాజుకు సంగీతం ఇష్టం. ద్వారం వారికి సన్మానం చేయాలనిపించి 45,000/- రూపాయలు చందా పోగు చేసి, సన్మానం చేశారు. మాకు వెయ్యి నూట పదహార్లు ఇచ్చారు. అప్పటికి సంస్థానం ప్రభుత్వాధీనం అయిపోయింది.

తుని రాజావారు - బుల్లి బాబుగారు యమ్. యల్.ఎ., ఆయన కూడా సంగీత విద్వాంసులను పిలిచి కచేరీ ఏర్పాటు చేశారు. 1938లో హకీం మొహమ్మద్ గారు ప్రారంభించారు.

తేవాది జమీందారులకు కూడా సంగీతం అభిలాష ఉంది. ఆరు వాల్యూములు దేశంలో అన్ని చోట్ల జరిగే కార్యకలాపాలను పుస్తక రూపంలో వేశారు. అది నాయుడుగారికి బహుకరించారు. పొడుగు రామ్మూర్తి వీణ ఆయన శిష్యులు ఆకొండి రాజారావు వీణ, అరసవిల్లి దగ్గర రామన్న వయొలిన్ వాయించేవారు.

రెండు సార్లు మ్యూజిక్ కాలేజీలో విజయనగరంలో పని చేశాను. ద్వారం వెంకటస్వామి నాయుడు గారి టైంలో ద్వారం నరసింగరావు టైం వరకూ పని చేశాను.

చల్లపల్లి పంచనదేశ్వర శాస్త్రి - వయొలిన్ వాయించేవాడు చల్లపల్లి ఆయనది. బందరు హరినాగభూషణం గారివయొలిన్ పద్ధతిలో ఉండేది.

వారణాసి బలరామశాస్త్రి, వారణాసి బ్రహ్మయ్యగారు భజన సంప్రదాయాన్ని 'డెవలప్' చేశారు. ఘంటయ్యగారిని హరి నాగభూషణంగారు తనతో బాటు తీసుకెళ్ళారు. భజన సంప్రదాయ రీతిలో మృదంగం వాయించేవారు. అలాంటి అష్టపదులు గానం చేస్తూ భజన చేసేవారు. అందులో వాయించడం వల్ల చేతికి కొంత అలవాటు పడి అది కర్ణాటక సంప్రదాయానికి మార్చుకుని సంగీత సంప్రదాయంలో కచేరీలు చేసేవారు. సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి గురుకుల పద్ధతిలో సంగీతం చెప్పే ఏర్పాటు చేశాడు. దానికోసం సంస్థానాధిపతులు జమీందారుల దగ్గరకు వెళ్ళి గురుకుల పద్ధతిలో విద్యార్థులకు సంగీతం నేర్పుతున్నానని ఆ విద్యార్థులకు వసతి భోజనం ఏర్పాటు చెయ్యాలని అందుకోసం మీరు సహాయం చెయ్యాలి అని చందా పోగు చేసి ఆగురు కులాన్ని నడుపుతూ ఎంతో మంది విద్యార్థులను తయారు చేశారు. రాజనాల వెంకటప్పయ్య, పురాణం కనకయ్య శాస్త్రి గారు కూడా ఇలా సంగీత వ్యాప్తికి కృషి చేశారు.

5 సం॥ల కాలంలో కాకినాడలో సంగీత పాఠశాల శ్రీరామసభ అన్న పేరుతో ఉండేది. సంగీతోత్సవాలు ఏడాదికోసారి 10 రోజులు జరిపేవారు. విద్వాంసుల్ని సన్మానించేవారు. ఉర్లాం సంస్థానంలో కూడా సంగీత విద్వాంసులకు వార్షికం ఇచ్చేవారు. బొంపాడ రామన్న హర్పవిల్లిలో ఉండేవారు. ఆయన సంగీత గురుకులాన్ని నడిపాడు. పర్వతనేని వీరయ్య చౌదరి మంచి సంగీతజ్ఞుడు విమర్శకులు, మహారాజుగారు ఏది కావాలంటే అది ఎప్పుడు ఇవ్వాలనుకుంటే అప్పుడు ఇచ్చేవారు. వాసావారి వంశంలో ఒకరు, ఆస్థాన విద్వాంసులు ఉండేవారు.

ఆచార్యులనేవాడు చిడతలు అద్భుతంగా వాయించేవాడు. ఆయన సంగమేశ్వర శాస్త్రిగారబ్బాయి, పిచ్చివాడులా వికృతాకారం అతిగా మాట్లాడేవాడు. తినేసేవాడు. కానీ బ్రహ్మాండంగా వాయించేవాడు.

# అనుబంధం – VII

## ద్వారం భావనారాయణరావుగారి ఇంటర్వ్యూ

వీణ వెంకటరమణదాసు గురించి ఆయనేంటంటే నాతోనే ఈ సంప్రదాయం పోవాలి అనే ఉద్దేశంతో ఎవరికీ చెప్పలేదు. అలాగే మన శాస్త్రాలూ చాలా వరకూ పోయాయి.

ఆయన మనవల్ని ఒప్పించి ఎలాగో ఆ వీణల్ని కళాభవన్‌లో పెట్టించాను. అవి వాయించడానికి వీలులేని శిథిలావస్థలో అప్పటికే ఉన్నాయి. ఫలానావారి జ్ఞాపకం అని ఉంచాను.

వెంకటరమణయ్యగారు గొప్ప వైణికుడు - అయినా ఆయన ఎవరికీ నేర్పలేదు. అలా వాయించేటటువంటిది ఎవరికీ రాదు. సత్తువ జబ్బల్లో ఉండాలి. షట్కాలం వాయించేవాడాయన.

కవిరాయని జోగారావుగారు Great Grand Father ఆయన సంస్థానంలో తిరుగుతూండేవారు. వాళ్ళ పూజాగృహాల్లో కూడా వాళ్ళకు పరిచయాలుండేవి. రుద్రవీణ వాయించేవారు. కులపరంగా కూడా పెద్దవాళ్ళవడం చేత వారికి గౌరవం ఉండేది.

బెంగుళూరులో పుట్టారు నాన్నగారు. చిన్నప్పుడే మా పూర్వీకులు Regimentry కశింకోట మార్చేరు. అందువల్ల వచ్చేశారు. కశింకోట, మా పూర్వీకులు బ్రిటిష్ బాండ్‌లో వయొలిన్ ఉండేది. అది ఊరికే సరదాగా వాయిస్తూ ఉండేవాడు. అదీ అసలు ప్రారంభం. కశింకోట నుండి విశాఖలోకి మార్చేశారు. అలా వచ్చారు. విజయనగరంలో సంగీతం కాలేజీ పెడతారని తెలిసి నాన్నగారు అక్కడికి వెడదాము విద్యార్థిగా నేర్చుకుందామని అనుకున్నారు. ఆ తర్వాత బ్రతుకు తెరువు దొరుకుతుంది అని అనుకున్నారు. భానోజీ రావుగారు అని ఒకాయన ఉండేవాడు. మారేపల్లి రామచంద్రకవి అని ఒక గొప్ప కవి ఉండేవారు. శ్రీరంగం నారాయణ బాబు తండ్రికి (సుందరనారాయణ) రామచంద్రరావు ఒక ఉత్తరం రాసి పంపించాడు. నారాయణ బాబు తండ్రి సంగీతజ్ఞుడు. ప్రతిశుక్రవారం కోరుకొండలో (విజయనగరం పాలెస్ ఉండేది) ఏదో ఒక ఎంటర్‌టైన్‌మెంట్ చేయించేవాడు. సాధారణంగా బ్యాండ్ ఇలాంటివేవో ఉండేవి. అక్కడెలాగో మేనేజ్ చేసి నాయుడుగారి కచేరీ ఏర్పాటు చేశారు.

కచేరీ అనేటప్పటికి నారాయణదాసుగారు, వీణా రమణయ్యగారు, వీళ్ళంతా వచ్చారు. కచేరీ అవుతుంటే పెద్ద పెద్ద కేకలు ఆపీ చేశారు. మెచ్చుకుంటూ రాజావారు కూడా - ఇలా స్కూలు పెడతాం అందులో ప్రొఫెసర్‌గా రావాలి. ఆయన కిష్టమేనా కనుక్కో - అంటే నాన్నగారు అలాగే అన్నారు. ఆ వేళకి ఆడెక్కడున్నా ఇక్కడే వుండాలన్నాడట. చిత్తం మహాప్రభో అన్నాడట - అప్పుడు 116 Coins గుండాడు రామన్న అప్పటికే ఆయన దగ్గర ఉండేవాడని చెప్పాను కదా! అతని ద్వారా ఓ కండువాలో కట్టి ఇచ్చారు.

వంకాయల వారింట్లో భజనఅంటే విజయనగరంలో చాలా ప్రసిద్ధి. విజయనగరంలో మేం నలభై ఏళ్ళున్నాము. పట్రాయని సీతారామశాస్త్రిగారు బాగా తెలుసు. అప్పుడు మా ఇంట్లో జరిగే కృష్ణాష్టమి ఏకాహాలకీ వాటికీ కూడా పెద్ద పెద్ద విద్వాంసులంతా వచ్చేవారు. ద్వారం వెంకట స్వామి నాయుడు, పేరి రామ్మూర్తి, నారాయణదాసుగారు, పట్రాయని సీతారామశాస్త్రి, సాలూరు గురువుగారని, రాజేశ్వరరావుగారి నాన్నగారు సాలూరు సన్యాసయ్యగారు వీరంతా వచ్చేవారు.

సాలూరు పెద్ద గురువుగారని సన్యాసయ్య గారిని అనేవారు. సాలూరు చిన్న గురువుగారని సీతారామ

శాస్త్రిగారిని అనేవారు. పెద్ద గురువుగారి కుర్రాళ్లే హనుమంతరావు, రాజేశ్వరరావూనూ, వాళ్ళు కూడా వచ్చేవారు. వీళ్ళను, ఆరంగేట్రం మొత్తం పాడించేవారు. ఘంటసాల సీతారామ శాస్త్రిగారు వీళ్ళందరినీ పాడించేందుకు మా యింటికి తీసుకొచ్చేవారు. ఘంటసాల మొట్టమొదట పాడింది మా యింట్లోనే, భజనకు వచ్చారు. Student గా కొత్తగా అప్పుడే వచ్చారు. ఆ రోజు శనివారం అయింది. మా యింట్లో భోజనం పెట్టారు. మా మేనత్త కూతురికి పాఠం చెప్పేరు. ముళ్ళపూడి లక్ష్మణరావుగారూ మొదలైన వారు వచ్చేవారు. ఆకాలంలో మా యింటికి రాని విద్వాంసులు లేరు.

పేరి రామమూర్తిగారిని పేరిబాబు అనేవారు ఆయన పాడేవారు. Music College లోనే ఉండేవారాయన? ఆనంద గజపతి దగ్గర కాదు. Lecturer గా విజయనగరంలో ఉండేవాడు. ద్వారం వారి కాలంలో యువకుడు. ఆయన పాటలో ఉండే విశేషం ఏమిటంటే లయలో చాలా గొప్పవాడు. దక్షిణాది విద్వాంసులు వీళ్ళూ వాళ్ళూ ఎవరొచ్చినా సరే వాళ్ళను నిలబెట్టగలిగే సామర్థ్యం ఉన్నాయని.

కానీ వీళ్ళెవరూ కూడా రాజాస్థానానికి సంబంధించినవారు కారు. జీతాలవీ రాజావారే ఇచ్చేవారు. చాలాకాలం వరకూ ఇచ్చారు. ఆ తర్వాత కాలేజీకొక కమిటీ వేశారు. జూనియర్ కలెక్టర్ ఒకడుండేవాడు. ఆయన ఒక కమిటీ వేసి వాళ్ళందరికీ జీతాలిచ్చేవారు. కానీ దానికంతా రాజావారి సూపర్ విజన్ అదీ ఉండేది. విజయరామగాన పాఠశాల అని వాళ్ళు పేరు పెట్టారు కూడా. ఆ టైంలో వచ్చింది. దాంతర్వాత కమిటీవాళ్ళు జీతాలిచ్చేవారు. ఆనందగజపతిని ఆంధ్రభోజుడనేవారు.

కవిత్వం అదీ రాసేవాడు. బాగా పాడేవాడు కూడా. కృష్ణ దేవరాయల సభలా వుండాలని తపన పడేవాడు. అనేకమందిని విద్వాంసుల్నీ కవుల్నీ తీసుకొచ్చి తన ఆస్థానంలో ఉంటే గౌరవం అని తెచ్చి పెట్టుకున్నాడు. ఆయన కాలంలోనే నారాయణ దాసుగారు వచ్చారు. ఆయనతో రాజావారు చాలా Close గా ఉండేవారు. తర్వాత వీణా రమణయ్య దాసుగారు కట్టు సూర్నగారు ఉండేవారు.

ఆదిభట్ల నారాయణ దాసుగారు పెద్ద కంఠం ఉన్నవాడు. ఆయన మా యింటికి కూడా ఓసారి వచ్చాడు. ఎన్నో మైళ్ళు ఆయన పాడితే వినిపించే అంత పెద్ద కంఠం. గాయకుడు హిందుస్థానీ రాగాలు కూడా బాగా పాడగలడు. పల్లవులు పాడేవాడు. తాళంలో గట్టివాడు. హరికథ అని ఆయన్ని అనేస్తుంటాం. కానీ సంగీతంలో కూడా దాసుగారికి అంతటి స్థానం ఉంది. ఆయనతో సరిపోయే వాళ్ళు ఏ విషయంలోనూ లేరని ఒప్పుకున్నారందరూ దక్షిణాదిలో.

గోపన్న సంగీతం గురించి; గోపన్న ఆస్థాన విద్వాంసుడు కాదు. ఆయన శబ్దాలు నాట్యంలో ఎక్కువగా ఉపయోగించేవారు. ఆ శబ్దాల్ని నట్టువాంగం నోటితో అంటుంటేవాటికి అభినయం చేసేవారు. తర్వాత లయకి సంబంధించినవి ఈ శబ్దాలు. ఎందుకంటే ఈ శబ్దాలు చాలా జటిలంగా ఉండి దానికి తగ్గ తాళం వెయ్యడం కూడా కష్టంగా ఉండేది. గోపన్న భుక్త అని పేరు. ఆయన శబ్దాలను తోథమి శబ్దాలని పిలుస్తారు. ఇప్పటికి ఆ శబ్దాలు తాళాన్ని వేసి అంటున్నప్పుడు (దిట్టం) వస్తుంది. తాళజ్ఞానం వస్తుంది. అందుకే ఆయన రాశారు. ఆయన కూడా శ్రీకాకుళం అటు ప్రాంతం వాడే.

ఓసారి టెక్కలి వెళ్ళాం. అది ఓ చిన్న జమిందారీ. రాజా జగన్నాథ దేవవర్మ అని ఉండేవాడు. ఆయన వైలన్ వాయించేవాడు. ఓసారి ఆయన పిలిస్తే ఆయనాస్థానానికి వెళ్లేం. వెంకటస్వామి నాయుడుగారి అన్నగారబ్బాయి ద్వారం నరసింహారావుగారు రాజా జగన్నాథ దేవవర్మకి గురువు. వయోలిన్ చెప్పేవారు. ఆ సరదామీద ఆయనొచ్చి రేడియోలో కూడా వాయించేవాడు.

# అనుబంధం – VIII

## పట్రాయని సంగీతరావు గారితో ఇంటర్వ్యూ

వాసావారిలో వాసా సాంబయ్యగారికి సంతానం లేకపోయేసరికి వాసా కృష్ణమూర్తిగారి కొడుకు వాసా వెంకటరావుగారిని పెంపకం తీసుకున్నారు. వాళ్ళు కొన్ని స్వర పల్లవులు రాశారు. ఇవి సాహిత్యపరంగా వస్తాయో రావంటారో గానీ వీణను దృష్టిలో పెట్టుకొని వీరు స్వర పల్లవుల గ్రంథం రాశారు. మిగిలిన ఏ ప్రాంతంలోనూ స్వర పల్లవులంత ప్రచారంలో లేవు. అందులో ముఖ్యంగా హిందోళ నవరోజు రాగాల్లో రాశారు.

నవరోజు రాగం అనేది పూర్వం ఏ లాలిపాటకో జోలపాటకో ఉపయోగించిన రాగం తప్పించి లక్ష్య రచనలు దాంట్లో చాలా తక్కువ. వాటిని చాలా ప్రామాణికమైన పద్ధతిలో మంచి ప్రయోగాలతో ఆ స్వర పల్లవులు రాశారు వాళ్ళు. ఈ పల్లవులు నా చిన్న తనంలో నారాయణ శాస్త్రి గారి దగ్గర నేర్చుకున్నాను. అలాగే నారాయణ శాస్త్రిగారు ఈయన విషయానికొస్తే - ఆయన కాలంలో బొబ్బిలి రాజాగారి ఫార్మేషన్ డేనాడు ఒక రాగ మాలిక రాశాడు. అది స్కూల్లో చదువుతూండగా నా చేత పాడిస్తూండేవాళ్ళు అది నాకు బాగా జ్ఞాపకం. ఆ తర్వాత సంగీత అకాడమీలో కూడా పాడి వినిపించాను.

అలాగే నందిగానం వెంకన్నగారి గురించి పిఠాపురం సంస్థానంలో అంటే తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారికి మామగారయన - ఆయన బొబ్బిలి ప్రాంతంలోనే ఉండేవాడు. ఆయన ముసలి కాలంలో సంగమేశ్వరశాస్త్రిగారి దగ్గరకు వచ్చేశాడు. ఆయన రాసిన స్వర పల్లవికి సాహిత్యం మరొక ఆయన ఆత్మారామ కవి అని ఆయన చేశాడు అదొకటి జ్ఞాపకం ఉంది. పాడతాను.

వింజమూరి లక్ష్మిగారి అమ్మగారు వాళ్ళ అమ్మగారు వరదమ్మగారు వాళ్ళ తాత వెంకటేశ్వర్లు గార్లు పెద్ద తెలుగు పండితుడు వాసావారి శిష్యుడే. ఆయన గురించి మనం ఎలాగైతే "శ్రీగణనాథా" మొదట చెప్పుకుంటున్నామో మలహరిలో గీతం వాళ్ళ సాంప్రదాయంలో చెప్తూండేవారు ఆ గీతం పూర్తిగారాదు. ఏమిటంటే "శ్రీవాసాప్పయ్య గురుతను ధారిం!" అని ఏదో వుంది. ఆయన రాగమాలిక పాడినట్లు జ్ఞాపకం వుంది. సంగమేశ్వర శాస్త్రిగారంటే ఆయన పిఠాపురంలో ఏదో మూల కూర్చుని వీణ వాయించుకుంటూండేవారు. ఏదైనా శుభకార్యం వస్తే మా ఆస్థాన విద్వాంసుడు ఫలానా ఆయన వాయించేడు అనడమే తప్ప అంతకు మించి ఎక్కువ సంబంధం ఉన్నట్లు కనిపించదు. సంగమేశ్వర శాస్త్రిగారు గొప్ప వారని ఎప్పుడు తెలిసింది? రవీంద్ర నాథఠాగూర్ బ్రహ్మసమాజీకుడు. పిఠాపురం అంతా బ్రహ్మ సమాజీకులు ఆ సందర్భంలో ఆయన పిఠాపురం వచ్చినప్పుడు "నేనొక మహత్తరమైన రత్నాన్ని కనుక్కున్నాను'' అని మహానందపడి సంగమేశ్వర శాస్త్రి వాద్యం విని శాంతి నికేతనానికి పిలిపించాడు. సంగమేశ్వర శాస్త్రి లోకజ్ఞానం వున్నవాడు కాదు. వీణ వాయించడం సంగీత జ్ఞానం బాగా వున్నవాడే మిగిలిన లోకజ్ఞానం వ్యవహార జ్ఞానం ఆ రోజుల్లో చాలా మందికి లేవు. అలాగే ఆయనకు కూడా లేవు. ఆ విధంగానే త్యాగరాజకృతికి కూడా ప్రత్యేకత వుంది.

బొబ్బిలి సంస్థానంలో ఆ రోజుల్లో ఉండే విద్వాంసుల్లో వాసావారి కుటుంబం అక్కడికెళ్ళింది. అలాగే నందిగానం వెంకన్న గారు కూడా బొబ్బిలి సంస్థానపు అగ్రహారంలోనే ఉండేవాడు. ఆయనకీ బొబ్బిలి సంస్థానంతో సంబంధం ఉంది. వీళ్ళు కాకుండా 'వంతరాం' అనే గ్రామంలో ముట్నూరి సంగన్నగారున్నారు. ఆయన మార్దంగికుడు. భగత గోపన్నగారున్నారు. ఆయన మార్దంగికుడు. భగత గోపన్నగారు వీరి సమకాలికులు కావచ్చు. ఆదిభట్ల నారాయణదాసు కూడా సమకాలికుడే.

ఆయన పాలకొండ తాలూకా 'పంతరాం' గ్రామంలో ఉండేవాడు. నేనా చుట్టు ప్రక్కల గ్రామాలన్నిటి గురించి చెప్తున్నానందుకోసమే. అలాగే మా తాత పట్రాయని వెంకట నరసింహశాస్త్రిగారు. ఆయన సాలూరులో ఉండటం ఉన్నా బొబ్బిలి శాస్త్రులు గారని పిలుస్తూండేవారు. ఆయన జీవితం చాలా వరకూ ఒరిస్సాలో గడిచింది. చివరి రోజుల్లో మాత్రం సాలూరు బొబ్బిలి ఈ ప్రాంతాలకు వచ్చాడు. అలాగే ఈ వాసావారి తర్వాత వారి శిష్యులే. ఆకొండి నారాయణ శాస్త్రిగారు. ఆయన బొబ్బిలిలో ఉండి అక్కడ స్కూల్లో సంగీతం మాస్టారుగా ఉండేవారు. ఆయన వీణ, వయోలిన్ వాయించేవాడు. మంచి పరిజ్ఞాత. సాహిత్యంలో కూడా మంచి పరిజ్ఞానం ఉన్నవాడు. ఆయన కొన్ని కీర్తనలు రాశాడు.

అలాగే సాలూరు సంస్థానానికి చెందిన మా ఫాదరు పట్రాయని సీతారామశాస్త్రిగారు ఆయన రాసిన కీర్తనలున్నాయి. ఆ రోజుల్లోనే 'భీమవరం' అని అగ్రహారం వుండేది బొబ్బిలిలో. ఆ భీమవరం అగ్రహారంలో విశ్వపతి శాస్త్రి అని ఒకాయన ఉండేవాడు.

ఆయనకు బాల్యంలోనే వివాహం అయింది. అయిన వెంటనే బయలుదేరి సంగీతం నేర్చుకుంటానని చెప్పి దక్షిణ దేశం వచ్చి మద్రాసు వచ్చేశాడు. ఆయన పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ శిష్యుడని చెప్పగా విన్నాను. ఆయన యౌవనం అంతా మద్రాసులో గడిపిం తర్వాత నేను పెళ్ళి చేసుకున్నాను. నా భార్య అక్కడెక్కడో వుంది అన్న విషయం 45 సంవత్సరాల తర్వాత ఆయనకు జ్ఞాపకం వచ్చింది. ఆ తర్వాత తన స్నేహితుణ్ణెవర్నో పంపించి మా బంధువులు ఫలానా దగ్గర ఉన్నారు వాళ్ళెలా ఉన్నారో చూసి రమ్మని పంపించాడు. ఆదాక్షిణాత్య సంగీత విద్వాంసుడు 'గజరావణ' అగ్రహారమని బొబ్బిలి దగ్గర్లో వుంది - అక్కడకు వచ్చాడు. అప్పటికే ఆయన భార్యకు వితంతువేషం వేసేశారు. ఆయన బ్రతికే ఉన్నాడని ఆ రోజుల్లో ఎవరికి తెలియదు. ఆ విశ్వపతి శాస్త్రిగారు 45 వ ఏట ఆ తర్వాత వచ్చాడు. ఆయన అప్పుడు 5 గురు సంతానం పొందాడు. ఆయన పార్వతీపురం గరల్స్ స్కూల్లో టీచరుగా పని చేశాడు. సంగీతం మాస్టారు ఆయన సంగీతం ఆ రోజుల్లో ఎవరికి తెలిసేది కాదు. కారణం శాస్త్రీయ సంగీతం అనుభవించే యోగ్యత ఉన్నవాళ్ళు ఆ ప్రాంతంలో చాలా తక్కువ. అక్కడ వీధి భాగవతాలూ ఆరకమైన సంగీతాని కుండే ఆదరణ శాస్త్రీయ సంగీతానికి కుండేది కాదు. ఆయన ఆ కొండి నారాయణ శాస్త్రిగారికి మావగారు. ఆకొండి నారాయణ శాస్త్రిగారి మొదటి భార్య పోగా రెండో సంబంధం చేసినప్పుడు ఈ విశ్వపతి శాస్త్రిగారి కుమార్తెనిచ్చారు. మా ఫాదరు దేశ సంచారంలో ఉన్నప్పుడు మా వాళ్ళంతా బొబ్బిలికి వచ్చారట. నేనప్పుడు 4వ క్లాసు చదువుతున్న రోజులవి. నేను తరుచు నారాయణ శాస్త్రిగారి దగ్గరకు వెడుతూండేవాడిని. అప్పుడే విశ్వపతి శాస్త్రిగారిని కూడా చూశాను.

ఆయన చాలా గర్వి. నేను చూసే సరికి 60 ఏళ్ళు దాటుంటాయి. లేదా ఇంకా పెద్ద వాడో అయి వుంటాడు. గర్వి అంటే ఏమీలేదు ఎవణ్ణి చూసినా నీకు సరిగమ పదనిస వచ్చునా అని అడిగేవాడు. అంటే ఆయన ఉద్దేశం ఏమిటంటే ద్వావింశతి శ్రుతులు ఆయన గాత్రంలో చూపించేవాడు. ఈనాడు 12 స్వరాలు ఒక స్థాయిలో చూపించడమన్న పద్ధతే కదా! మనకు అలవాటులో వున్నది! ఆయన 22 శ్రుతులూ నేను గాత్రాన పడతాను అనేటువంటి ధృఢత్వం ఆయనకుండేది. ఆయన పట్టాడోలేదో చూసే జ్ఞానం నాకేంలేదప్పటికి. నేను చిన్నవాణ్ణిగా ఆయన నీకు సరిగమపదనిస వచ్చునా! అని అడిగాడునన్ను నాకు చిన్నతనం - ఏమీ తెలీదు - ఆఁ! అలాకాదు వచ్చునూ అన్నాను. నేను పాడితే ఆఁ! అలాకాదు నేను అన్నట్లుగా అను అని ఆయన అనిపించేవాడు. ఆఖరికి ఎలా అనాలో నాకు బోధ పడలేదు. ఆయన అన్నట్లుగా నేను వెక్కిరించినట్లుగా అన్నాను. వీడేదో పెంకి వెధవలా వున్నాడు అని నాకో బిరుదిచ్చాడు అప్పుడు ఆయనా విశ్వపతి శాస్త్రిగారూ 'పరియాచకమా' అన్న కీర్తన పాడగా విన్నాను. లయలో మంచి ప్రభవుంది.

అకార ఇకారాలు గాత్రంతో చూపించే పద్ధతి ఆరోజుల్లో లేదు. 'రమ్మనీ ఈ సమాన మెవ్వరు' అని

పాడేవారు. అంటే ఏమిటి? అకారం దిగజార్చకుండా ప్రతీదీ లయబద్ధంగా వినిపించడంలో ఆయన నోటితో అనేవారు. తర్వాత రాగంతానం పల్లవి అని అలనాడు దేశానికి తెలియని రోజుల్లో అప్పుడు రేడియోలు ఇంకా రాలేదు. ఎవరూ పాడని రోజుల్లో ఈయన రాగం తానం పల్లవి పాడారు. తానం పాడటం అనేది విశ్వపతి శాస్త్రిగారి గొంతుతో విన్నాను. అప్పుడు నాకు 17 సం॥లు మిగిలిన దేశం గురించి గానీ తెలిసే వయస్సు కాదు - అప్పుడు జ్ఞానం లేదు. మా తాతగారూ మా తండ్రిగారూ ఆయన తానం గాత్రంలో పాడటం నేను వినలేదు. ఆ పద్ధతి విశ్వపతి శాస్త్రిగారు పాడటం విన్నాను.

1930 -31 ప్రాంతం ఆయన తమ్ముడు ద్వివేదుల లక్ష్మణశాస్త్రి. లక్ష్మణశాస్త్రి ఆ రోజుల్లో చాలా పాపులర్ విద్వాంసుడు ఆయన, మా తాత గారు భాగవతుల లక్ష్మీ నృసింహశాస్త్రి అని ఇంకా కొన్ని పేర్లున్నాయి. అవి జ్ఞాపకం లేవు నాకు. లక్ష్మణ శాస్త్రి బ్రదర్ కన్నడ శాస్త్రి, లక్ష్మణ శాస్త్రి మధురా పంతుల పేరయ్య శాస్త్రిగారి శిష్యులు. మా గ్రాండ్ ఫాదర్‌లా కూడా.

విశ్వపతి శాస్త్రిగారు మాత్రం ఇక్కడ పట్నం సుబ్రహ్మణయ్యర్ గారి శిష్యుణ్ణి అని చెప్పుకొని ఇల్లు విడిచిపెట్టి యువకునిగా వెళ్ళి వృద్ధులుగా తిరిగి వచ్చారు. మన ప్రాంతంలో ఆ రోజుల్లో త్యాగరాజ కృతులు ప్రచారంలో లేవు. ఎంతసేపు రాగాలాపన, స్వరకల్పన చేయడం రాగం, తానం పల్లవి పాడేవారు కాబోలు. తర్వాత భజనల్లో సంకీర్తనలు పాడేవారు ఆ రోజుల్లో. త్యాగరాజు కీర్తనలు అంత ప్రచారం కాలేదు. ఈ సంగతులన్నీ నా చిన్నప్పటివి.

త్యాగరాజ కీర్తనలు ఎక్కడ ప్రచారంలో ఉంటే అక్కడికి వెళ్ళి నేర్చుకోడం మన సంప్రదాయంగా ఉండేది. అలాగే సుసర్ల దక్షిణా మూర్తి శాస్త్రిగారు మానాంబు చావడి సుబ్బయ్యగారి శిష్యుడవడం చేత ఆయన తెలుగు దేశంలో త్యాగరాజ కృతులు ప్రచారానికి కారకుడయ్యాడు, ఆయన దగ్గర చెప్పుకునే వారు ఈ కన్నడ శాస్త్రి, లక్ష్మణ శాస్త్రులు.

రాజుగారి తాలూకు ఆదరణ వీళ్ళకెవళ్ళకీ లేదు. వాసావారు మాత్రమే ఉండేవారు. వాళ్ళ ఆదరణ అంటే నెలకు జీతాలు కాదు. ఆరోజుల్లో భూములు, పుట్లు, ఇల్లూ వాకిళ్ళూ అవీ ఇచ్చేవారు. నామకార్థం నెలకు ఏ ఐదో ఎంతో ఇచ్చేవారు.

సంస్థానం తాలూకు ఉత్సవాలు  ఏమైనా జరిగితే వీళ్ళ చేత పాడించేవారు. వినిపించేవారు. మనం ఈనాటి తాలూకూ అలవాట్లను బట్టి ఈ కచ్చేరీ సిస్టమ్స్‌తో పాత రోజుల్లో ఊహించకండి. ఆ విద్వాంసుల మట్టుకు అయితే వాళ్ళ మానాన వాళ్ళు పాడుతుండడం, శిష్యులకి వాళ్ళ సంగీతం చెబుతుండడం ప్రభువులవారు ఎప్పుడైనా సంగీతం మీద అభిరుచి కలిగితే వారిని పిలిపించడం, ఇలాంటివి తప్పించి కచేరీ పద్ధతి లేదు.

(ఈ విషయాలు) బొబ్బిలి రాజారావు రామకృష్ణ రంగారావు గారి తండ్రి జనార్ధనరావుగారు ఆయన తండ్రి ఈ రామకృష్ణ రంగారావు గారు అంటే ప్రస్తుతం ఉన్న రామకృష్ణ రంగారావుగారి తాతగారి కాలంనాటివి. ఆయన తాలూకు పట్టాభిషేకం అయిన రోజులు. నాకా పట్టాభిషేకం తెలీదు. ఆ సందర్భంలో ఆకొండి నారాయణ శాస్త్రిగారు రాసిన కీర్తన ఉంటి బొబ్బిలిలో గర్ల్స్ స్కూలూ అదీ ఉండేది. అక్కడ సంగీతం మాష్టర్లు వాళ్ళూ ఉండేవారు. పూజామహలు అని ఒక దేవాలయంలో ఉండేది పూర్వం. కోటలో ఆ పూజామహలుకి నారాయణ శాస్త్రిగారు వెళ్ళి సాయంత్రం కొంచెం సేపు వీణ వాయించడం ఇలాంటివి ఉండేవి. ఆ దేవాలయం కోటలో ఉంది.

(రాజులు) వాళ్ళు విన్నా వినకపోయినా వాళ్ళ డ్యూటీ అది.

అక్కడ పూజ జరుగుతూ ఉంటుంది. అయితే అంతఃపురంలో ఉండే రాణీగారు లేక వాళ్ళ తాలూకు వాళ్ళే దేవాలయానికి తీర్థ ప్రసాదాలు పుచ్చుకునేందుకు రావడం. దైవదర్శనార్థం రావడానికి తెరలూ అవీ అడ్డంగా ఉండేవి. అలా వచ్చినప్పుడు వాళ్ళకు కావలసిన కీర్తన పాడమనో లేదా వాయించమనో అడిగేవారు.

వి.ఎ.కె.రంగారావుగారి తల్లి జనార్ధన రంగారావుగారి భార్య రాణీగారు వీణ వాయించేది. అలాగే బొబ్బిలి రాజా వారు వారి భార్య వీళ్ళందరూ పెద్ద వాళ్ళయింతర్వాత భజన కాలక్షేపాలు జరిపేవారు.

భజనలు చెయ్యడానికి వచ్చేవారు బొబ్బిలి జమీందారు భార్యా వాళ్ళు. ఓంకార స్వాములవారని ఒకాయన శాంతి ఆశ్రమంలో ఉండేవారు. ఆయన కోసం ఆశ్రమానికి వస్తూ వెళుతూ ఉండేవారు. మావదిన గారు కూడా శాంతి ఆశ్రమంలో టీచరుగా ఉండేది. అంచేత ఆ సంబంధంతో అక్కడ ఏం జరిగేదో వెళ్ళి చూసేవాణ్ణి. భజనలో వి.ఎ.కె. రంగారావు తల్లి వీణ వాయించేవారు. రాజులు సంస్థానాధిపతులు ఉన్న రోజుల్లోనే ఆస్థాన విద్వాంసులుండేవారు. వాళ్ళ పాటలు వాళ్ళు పాడుకునే వారు. వాళ్ళని అధిపతులు పోషించేవారు. ఆరోజులు చాలా విలువైన రోజులు. రూపాయకు విలువ ఎక్కువ రూపాయకు 20 కుంచాలు బియ్యం వచ్చేవి. ఆ రోజుల్లో రెండు మూడు రూపాయలు జీతాలున్న వాళ్ళూ బొబ్బిలి సంస్థానంలో ఉండేవారు. ఆ అమాయకపు రోజులు ఎలా ఉండేవంటే - సామవేదులవారు మా బంధువులు - అరామ ద్రావిడులం. వాళ్ళందరిలో వాసావారికి పెద్ద మేడా అదీ ఉండేది. అది బొబ్బిలి రాజాగార్లు ఇచ్చినదే. మేం అడిగితే మేం ఎంత మాత్రం చిన్న ఇళ్ళలోనే ఉంటాం. మాకు మేడలూ అవీ పనికిరావు. పెంకుటిళ్ళు వద్దు. పూరిళ్ళే కావాలని వీళ్ళు కట్టుకున్నారు. అటువంటి అమాయకపు రోజులు. అంటే ఆ రోజుల్లో వాయవారం చేసుకోడం తప్పుకాదు. త్యాగరాజు ఉంఛవృత్తి చేసుకోడం అంటే ఆధ్యాత్మిక చింతన చేసుకోడానికి ఎంత బీదవాళ్ళంటే అంతమంచిది అని అనుకునేవారు. నిజమా అబద్దమా అనే వితర్కంతో సంబంధంలేదు. ఆ రోజులు అలా ఉండేవి.

సంస్థానంలో వున్న విద్వాంసులు శిష్యుల్ని తయారు చేసేవారు. కేవలం సంగీతం ప్రచారార్థం ఉండేవారే.

రాగాలన్నీ కూడా ఈనాడున్నట్లుగా ఆ రోజులేవు. అనేక సంప్రదాయాలలో కలిసి ఉండేవి. ఆరోజుల్లో హిందోళాన్ని చతురశ్ర దైవతం చేసి పాడేవారు. ఆనాటి నుండి ఈనాటి దాకా వచ్చిన సంప్రదాయాలు ఇది ఈ రాగం అని ఇలాపాడేవారని మనం అనుకునే ఆరాగం స్వరూపాన్ని మనం నిర్ణయించుకున్నాం. అదే ఆచరిస్తున్నాం.

వాసా దాసప్ప : కలిగొట్ల కామరాజుగారు వీళ్ళంతా వాసావారి పల్లవులే నేర్చుకున్నారు. సాంబయ్య గారు ఆయన కొడుకు మ్యూజిక్ కాలేజి లో ఏడీ ఈ కాలంలో పదుమనాభా గీతం మూడు కాలాలు పాడేవాడేడి అని అడిగారు - పేరి రామమూర్తిగారు ఒక కుర్రాణ్ణి పిలిచి పాడి - ఇదుగో! వీడు ఒకడు - మరొకణ్ణి పిలిచి వీడు రెండో వాడు అని అనేవాడుట.

పూర్వం రోజులెలా ఉండేవంటే కొన్ని కొన్ని పనులు చేస్తే వాళ్ళు చాలా గొప్ప వాళ్ళు అనే వారు. సంగీతం నేర్చుకోడం కూడా అలాగే ఉండేది. పిళ్ళారీ గీతాలు దాకా నేర్చుకోడానికి ఏ రెండు మూడేళ్ళో సమయం తీసుకునేవాడు. సరళీ స్వరాలు పూర్తయ్యేసరికే సంవత్సరంన్నర పట్టేది. ఏ మాత్రం స్వరం పట్టాలన్నా అంతకృషి చేసేవారు.

అలాంటి అభ్యాసం సంతృప్తికరంగా ఉండేది.

అక్షరాన్ని మనం ఏ విధంగా నేర్చుకుంటామో ఆ విధంగానే సప్తస్వరాల్ని కూడా నేర్చుకోడం, తిరిగి ప్రస్తారం చెయ్యగలగడం ఇది ప్రయోజనం. అది ఫలానా స్వరం అని గుర్తు పట్టాలి. ఇది రోజులు పట్టేది.

ఇప్పటి సాధనాభ్యాసాలకీ అప్పటి సాధనాభ్యాసాలనీ చాలా తేడా వుంది. సససససరిరిగ॥ సససససరిరిగ॥ సససససరిరిగ॥ సరిరిగ॥ససరిరిగగమమా॥ ఇలా జంటస్వరం అప్పుడుండేది. అంటే వీణ మీద వాయించే సాధనకవసరమైన విధంగా నేర్పేవారు. సాంబయ్య గారు అలా అడగడంలో ఆ అర్థం ఉంది. వాసా అప్పయ్యగారు సంప్రదాయానికి ప్రసిద్ధి. వంశమూలపురుషుడు వాసా దాసప్పగారు. వారి తర్వాత వచ్చిన వారు వాసా కృష్ణమూర్తిగారు. వాసా సాంబయ్యగారు. వాసా వెంకటరావు విజయనగరం కాలేజీలో లెక్చరర్. కృష్ణమూర్తి కొడుకే వెంకట్రావు. స్వరపల్లవులు రాశారు. వీణ కోసం వారు ఈ గ్రంథం రాశారు. భరత నాట్యంలో ఉపయోగించి ఏ జతి స్వరానికి స్వరపల్లవికీ తేడాలేదు. కొన్ని స్వర పల్లవులకు సాహిత్యం కూడా ఉంది. కొన్నిటికి లేదు. లలితరాగం వసంతరాగంలా పాడేవారు ఆ రోజుల్లో. సూర్యకాంతి జన్యం అని రాశారు మా నాన్నగారు.

ఎందుకు చెప్తున్నానంటే 40 ప్రాంతాల్లో పి. సాంబమూర్తిగారు రాగ లక్షణం గురించి డెమాన్‌స్ట్రేట్ చేస్తున్నప్పుడు లక్ష్య ప్రాయంగా ద్వారం వెంకటస్వామి నాయుడు గారు వైలన్ మీద రాయించారు.

నవ రోజుకి లాలి పాటే లక్ష్యం. వాడుకలో ఉన్న రాగమే ఆదిభట్ల నారాయణదాసుగారు కూడా నవరోజుని ఉపయోగించారు. ఆకొండి నారాయణ శాస్త్రిగారు రాజావారి (బొబ్బిలి) పట్టాభిషేకం సమయంలో రాసిన రాగమాలిక కళ్యాణితో ప్రారంభించేవారు. కదనకుతూహలం, దేవామృతవర్షిణి, మోహనరాగం కాంభోజి రాగాల్లో నేను 20 సంవత్సరాల వయసులో చాలా సంవత్సరాల క్రితం నేర్చుకున్నాం.

"సత్య సంధ వేదా దినుత రామకృష్ణ రంగరాయ
నిత్య కళ్యాణ ప్రదమై నెగడె నీ పట్టాభిషేకము"

సాహిత్యం చేసినాయన ఆత్మారామకవి స్వరపల్లవికి స్వరజతికీ ఏమిటి తేడా! ఒక పల్లవి చరణాలుండడం ఒకటి. అయితే చాలా స్వరజతులకు మధ్యమకాలంలో కనిపిస్తాయి. కొన్ని విలంబకాలంలో నడుస్తాయి. స్వరపల్లవులు పై కాలంలో నడుస్తాయి. నందిగానం వెంకన్న గారిది ఒక రచన ఉంది.

బుర్రా గోపాల కృష్ణ మూర్తి అని తెలుగు పండితుడొకాయన దానికి సాహిత్యం చేశాడు.

హరికాంభోజి రాగంలో రాశాడు. ఆకొండివారేనాకు నేర్పారు - "లోకావనా నీ కటాక్షమ్మున నన్నుంచుమా!"

వరదాభయదాఖిల సాకారిముఖారనుత॥

ఈ పాటలు ఎవరికీ తెలియదు. నాకు 10 సం॥ల వయస్సులో నేను ఆకొండి నారాయణ శాస్త్రి గారి దగ్గర నేర్చుకున్నాను.

జక్కిణక దరువు ఒక రచన ఉండేది - తచ్చూరి వారి పుస్తకంలో ఉంది.

వీణా రమణయ్యగారు బఫూన్‌లా కనిపించేవాడు. పొట్టిగా ఉండేవాడు. ఆదిభట్ల నారాయణ దాసుకంటే పెద్దవాడు. కాషాయ బట్టలూ అవీ కట్టుకునేవాడు పిలకా అదీ ఉండేది. ఏదైనా మాట్లాడితే ఆయన మాటలకి దానికి పొంతన ఉండేది కాదు. తాతగారూ మీరు మైసూరులో మొట్టమొదట సన్మానం పొందారట. ఫస్ట్ గ్రేడు సన్మానం పొందారు. ఏమిటి మీరు అక్కడ వాయించేరు. అంటే మీనాక్షి గీతం వాయించేను అంటాడు అంతే. దాంతో మాకు గొల్లున నవ్వు వచ్చింది. ఇంత మహా విద్వాంసుడే గీతం వాయించా నంటాడేమిటి? అంటే గీతం ఒకప్పుడు అభ్యాసగీతమే కాకుండా ప్రదర్శన గీతం కూడా ఉండేదన్న మాట.

ముఖ్యంగా వైణికులు వాయించేవారు. సంప్రదాయ ప్రదర్శని నిండా గీతాలే అది గీతమో కీర్తనో ఆసంగతి తెలీదు మనకి. దీని కంతటికి చారిత్రక అవగాహన ఉంటే తప్పించి, కొన్ని విషయాలు మనకు నవ్వులాటగా అనిపిస్తాయి. అలాగే ఉన్న రాగాలకీ ఈనాటి వాటికి వెంకటరమణ దాసు గారు చెప్పిన రాగాల పేర్లకి సంబంధం ఉండేది కాదు. మా కందరికీ వేళాకోళంగా ఉండేది. అలాగే ఆయన మంత్రులు మంత్ర పీఠం అని ఒకటుండేది. దానిలో వేద పాఠశాల ఉండేది. మంత్రస్వాముల వారు ఎవరొచ్చినా సరే చాతుర్మాసం చేసేవారు.

వీణారమణయ్యగారు మంత్రులవడం చేత ఆయన కచేరీ పెట్టారు. అప్పటికే బ్రహ్మ చెముడాయనకు. వీణారమణయ్యగారిలో ఉండే గొప్ప విశేషం ఏమిటంటే ఆయన వాయించినంత స్పీడు ఎవరూ వాయించలేరు. రాగభావం తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారి నాటికి ముఖ్యంగా ఈనాటి పద్ధతి ఆయన చేతిలో ఉండేది. వాళ్ళ టెక్నిక్ వీళ్ళ టెక్నిక్‌లు వేరు. అలా వాళ్ళు వాయించేటప్పుడు చక్రబంధం లాంటి పరిభాషలుండేవాయనకు. అనాటికి నాలుగు తీగలు మీద (ఇప్పుడు వైలన్ మీద వాయించే పద్ధతి) నాలుగు తీగలు మీద సర్దుబాటు చేసుకుని వాయించే వాద్యం ఆయనది.

తర్వాత మనం సితార వాయిద్యంలో ఆలాప్, ఝూలా అలాగా ఆయన వీణలో తానం ఘనం అని వాయించేవాడు. ఆ ఘనం అన్నది చాలా స్పీడు ఆ ముసలితనంలో వాయించేడు.

అది మనకో అర్థం అవుతుంది. విజయనగరంలో భారతీ తీర్థ అని సంస్థ ఉండేది. బుర్రా శేషగిరి రావు ఆ సంస్థ అధ్యక్షుడు, పెట్టినవాడు. చాలా మందికి బిరుదు ప్రదానం చేశారు. విజయనగరంలో పెద్ద విద్వాంసులున్నారని వాళ్ళ గురించే పెట్టినట్లు పెట్టారు. ఫారన్ నుంచి జర్నలిస్ట్ వస్తే ఆయనకు డాక్టరేట్ ఇచ్చారు.

ఆ సంస్థకు ద్వారం వెంకటస్వామినాయుడుగారు కూడా మెంబరు. విక్రమ దేవ మహారాజు ఛాన్సలర్‌గా ఉండేవాడు. ఆ సంస్థకు రెండుగదులు ఉండేవి. దానికి అద్దె మాత్రం విక్రమదేవ వర్మ ఇచ్చేవారు.

ఆ రోజు వెంకటరమణయ్యగారి వీణ మొదట, ద్వారం వెంకట నాయుడుగారి వైలన్ చివరి పెట్టించాడు. ఎవరో శ్రుతివేస్తే వీణవాయిస్తూండేవాడు.

చిత్రమేమిటంటే ఆనందగజపతికి సహాధ్యాయి అవడం వల్ల స్వదేశీ విదేశీ సంస్థానాలన్నీ చోట్లకీ పంపించేవాడు. ఆయన పెద్ద పెద్ద సంస్థానాలలో సన్మానాలు అవీ రాజరికపు రీవి వల్ల వచ్చేయంటారు. ఆయన ప్రజ్ఞని కొలమానం పెట్టి కొలిచే స్తోమత మాక్కెడిది. వాళ్ళ లోపాలు వీక్‌నెస్‌లు గమనించి నవ్వుకునేవాళ్ళం. అంతకుమించి ఏమీ లేదు.

పశుమర్తి కృష్ణమూర్తి బర్హం పురంలో ఉండేవాడు. బాలకృష్ణంనాయుడు అని ద్వారం నాయుడిగారి పూర్వమే ఒక వయోలినిస్టు బర్హంపురంలో వుండేవాడు.

'సంగీత విద్యాదర్పణం' పుస్తకాన్ని మొట్టమొదట రాసింది ఎవరు? ఉమ్మడి శెట్టి వెంకటస్వామినాయుడు. ఆయన గుంటూరువారు.

శ్రీలోలాశ్రిత పాలా - మలయ మారుతరాగంలో గీతం కృతి ఆయనవే. కొత్త విద్యాదర్పణం మీద ఆయన పేరు తీసేశారు - ఏకా సుబ్బారావు అని రాసేరు.

వెంకటగిరి సన్నాయంటే ఒకప్పుడు చాలా ప్రసిద్ధి.

ఆకొండి జగన్నాథం సంగీతం తెలిసినవాడు - ఆరోజుల్లో ఇలాంటి స్వర పల్లవులకు విలువా ప్రచారం ఉండేవి. వైలన్ ప్రొఫెసర్‌గా ఎవర్ని నియమించాలి? అప్పుడు హరినాగ భూషణంగారు వైలనిస్ట్ - ఆయన్ను

పిలిస్తే ఆయన త్యాగరాజు ఆవేశం ఆదర్శం కలిగినవాడు. సకాలంలో రాలేదని కొంతమంది అంటారు. నేను తిరస్కరించాను అని ఆయన పుస్తకంలో రాశారు. బహుశా నిజం కావచ్చు. ఆస్థానంలో నాయుడుగారు వైలన్ నేర్చుకుందుకు వచ్చారు విశాఖ పట్టణం నుంచి. మొదటి నుంచి కళ్ళు కనిపించవు. చూపు తక్కువగా వుండేది. మొత్తానికి స్టూడెంట్‌గా వచ్చారు. వస్తే ఆయన వాద్యం విని "నువ్వు స్టూడెంట్ ఏమిటి? నువ్వే ప్రొఫెసర్‌గా ఉండు అని ఈయనకు అప్పగించారు.

పాడుగు రామమూర్తి - చాలా మృదువుగా వాయించేవాడు కళావంతులు వాళ్ళు. తుమరాడ సంగమేశ్వర శాస్త్రి బాణీలో రాగాలాపం అంత బాగా వుండేది కాదు. వీణ మీద అంటే ఈనాటి  స్టాండర్డ్ ఉండేదికాదు.

వాసా వెంకటరావు గారు నాకు చిన్నప్పటినుండి తెలుసును. ఆయన రాగాలాపన పొడిపొడిగా ఉండేది. తనన తననానవాననన్ననన్నర్న్ననన అని అంటే ఇప్పటి లాగా రాగయుక్తంగా ఉండేది కాదు.

ఆరకమైన గమక యుక్తంగా రాగం వాయించడం పాడుగు రామమూర్తిగారి దగ్గరుండేది. అలాగే సంపూర్ణస్థితి అప్పుడు రాలేదు. పూర్వపు వాళ్ళు గొప్ప వాళ్ళు ఈనాడు వాళ్ళు చవటలు అని అనవసర ప్రచారం చేస్తుంటారు. ఈనాటి కాలంలో ఉండే (స్థితి) విద్య సిద్ధి చాలామంది విద్వాంసులు అలాగే పాడేవారు. సంప్రదాయం అంటే అదేకదా! వాళ్ళు సంపాదించి పెట్టారు. తర్వాత వీళ్ళు అభివృద్ధి చేసుకున్నారు. దాన్నేదో కించపరిచి నేనీ మాటలనడం లేదు.

పాడుగు రామమూర్తి ఆ సంప్రదాయం అక్కడ వెలిసినట్లే శ్రీకాకుళంలో బొంపాడ రామన్న బొంపాడ రామ చంద్రరావు ఇద్దరు విద్వాంసులుండేవారు. శ్రీకాకుళంలో అరసవిల్లిలో సంగీతం నేర్చుకునే కుటుంబాలు కొన్ని వుండేవి. వారు వైలనిస్ట్‌లు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు చేస్తుంటే వాళ్ళు వచ్చి వాయించడం నేను విన్నాను. మంచి జ్ఞానస్థులు. అంటే పాడుగు రామమూర్తిగారు ఆనాటి పేరుపొందిన విద్వాంసులలో పేరుగుడి ఇతరుల తాలూకా ఇష్టా ఇష్టాల మీద కొంత దెబ్బతిన్నాడేమో నాకు తెలీదు. కానీ ఆయనది మంచి వాద్యం అని చెప్పగా విన్నాను. వాగ్గేయ కారుడు కాదు.

రచనలు గురించి మీరు ప్రయత్నం చేసిన వచ్చే చిక్కేమిటంటే మహా విద్వాంసులు ఎంతో మంది ఉన్నారు. అయినప్పటికీ కూడా సాహిత్యం తెలియకపోతే వాడేం చేస్తాడు. 72 మేళ కర్తలూ నువ్వు పాడతావు నేను పాడతాను. రాకపోయినంత మాత్రాన వచ్చే నష్టమేమిటి నేను ఆయన్ని కించపరచడం కోసం కాదు ఉద్దేశం కాదు నాది. చాలా మంది ఘనతను కించ పరుస్తున్నట్లవుతుంది. అలాంటి విలువలను నిర్ణయిస్తే ద్వారం వెంకటస్వామినాయుడు గారు ఏం రాశారు? ఏం రాయలేదు.

అయితే ఏం తక్కువొచ్చింది. ఆయన మనుష్యుల్ని లెక్క చూసినట్లయితే ఆయన కిరీటంలాగా జీవితం గడిపాడు. దాన్ని మనం ఏమనుకుంటాము. అందుచేత రచనల గురించీ రచనల చేత కాదు.

కొంతమంది రచనలు అదే మా పేరిబాబు గారు స్వరరచనలు చేశాడు. కొన్ని కృతులు రాశారు. పేరి రామం - విచిత్రం ఏమిటంటే ఈ మహా విద్వాంసులందరు కచేరీ చేస్తుంటే ఆయన ఏమూలో కూర్చుని ధకి, ధకి, ధకి అనేవాడు. అంటే ఏమిటి ముక్తాయింపు ఆయన పచి పపచిఅని ఎంతక్లిష్టమైన రాగానికైనా సరిపడేటట్లుగా అనేవాడు. చాలా లావుగా ఎత్తుగా ఉండేవాడు. అందుకే ఏదో మూల కూర్చునేవాడు. ఆయన వీణ వాయించేవాడు. నారాయణదాసుగారి వెనక వీణ వాయించేవాడు. భజన చెయ్యడం ఆ రోజుల్లో గొప్ప. ఆయన భజనలకు వెళ్ళేవాడు తెల్లవార్లూ పాడుతుండేవారు. రెండు వర్ణాలు, కృతులూ రాశాడు. అట్లాంటి వాళ్ళకి దక్షిణ దేశంలో గుర్తింపు ఉండేది. మనదేశంలో మాత్రం వుండేది కాదు. కలిగొట్ల కామరాజుగారని ఒకాయన ఉండేవారు.

నైలన్ గాత్రం రెండిట్లోను ఆయన పాండిత్యం ఉన్నవారు ఏది గాత్రమో ఏది నైలనో తెలిసేది కాదుట.

మధురాపంతుల పేరయ్య శాస్త్రి - వీరు ఎంతో మందికి సంగీతం చెప్పేవారు. చుట్టు పక్కల గ్రామాలలో వారాలు చేసుకుంటూ, భజనలు చేసుకుంటూ విద్యార్థులకు భోజనం పెట్టి సంగీతం నేర్పేవారు. అలా నేర్చుకున్న వాళ్ళలో మా గ్రాండ్ ఫాదర్ ఒకాయన ఆయన గాత్రం చాలా గంభీరంగా ఉండేదిట. మండ సూర్యనారాయణ శాస్త్రి అలానే ఇంకా చాలామంది విద్వాంసులు ఉండేవారు. మంచి గాత్రజ్ఞులు. ఆయన్ని చివరి రోజుల్లోను మాత్రమే చూశారు. హిందుస్థానీ, కర్ణాటకలో కృషి చేశాడు. ఫ్లూటు, వీణా, అన్నీ వాయించేవాడు. బొబ్బిలిలో కొన్నాళ్ళు. బొబ్బిలి పూజామహలులో కొన్నాళ్ళు సూర్యనారాయణగారు కూడా వీణ వాయించేవాడు.

ఆకొండి నారాయణశాస్త్రి మంచి మేధావి అయితే మండ సూర్యనారాయణ శాస్త్రి మంచి పాపులర్ విద్వాంసుడు. ఆకర్షణీయ మైన వ్యక్తిత్వం కలవాడు. అయితే వీళ్ళందరికీ మా ఫాదర్‌తో మంచి ఆత్మీయత ఉండేది. అలాగే బంకుమల్లి సింహాచలం భాగవతార్ అని ఒకాయనుండే వాడు. కాబట్టి రచనల గురించి మాత్రమే పేరు రాలేదు. బాగా పాడే వాళ్ళు కూడా గొప్ప పేరు తెచ్చుకున్నారు.

# అనుబంధం – IX

## వాసా హైమవతిగారి ఇంటర్వ్యూ

200 సం॥ పూర్వం నుండీ వాసా కుటుంబం వారు సంగీత విద్వాంసులు. వాసా అప్పయ్యగారు ఆయన అన్నదమ్ములు కూడా సంగీత కుటుంబమే. వాళ్ళు ఐదుగురు అన్నదమ్ములు. ఇప్పుడున్న విద్వాంసులందరు వాసావారి సంప్రదాయాన్ననుసరించినవారే. శిష్యులు వారి శిష్యులుకూడా. వాసా సాంబయ్యగారు అధ్యాత్మ రామాయణ కీర్తనలు స్వరపరిచి కీర్తనలూ పాడేవారు.

(జగన్న) జగన్నాథంగారున్నారంటే స్వరపల్లవులు. వాసా కృష్ణమూర్తిగారు గీతాలురాసారు. మా మామగారు వెంకటరావు. బొబ్బిలిలో ఉండగా కళాశాల పెట్టేరు. దాంట్లో ఆచార్యులుగా పని చెయ్యడానికి పిలిచారు. బొబ్బిలిలో వాసావారు ఆస్థాన విద్వాంసులు. రాణిగారికి సంగీతం నేర్పేవారు. కాలేజీలో మామగారికి 60 రూ॥ల జీతం ఇచ్చేవారు. పి.వి. రాజాగారి అక్కకు సంగీతం చెప్పేవారు. బొబ్బిలిలో ఇళ్ళూ పొలాలూ అన్నీ ఇచ్చారు రాజావారు.

నా పెళ్ళియేవరకూ అవన్నీ ఉండేవని చెప్తారు. వాసా అప్పయ్యగారి శిష్యులు ఎక్కువమంది ఉన్నారు. నందిగానం వెంకన్న, తుమరాడవారు, కట్టు సూరన్న గారు వీళ్ళంతా బొబ్బిలిలో నేర్చుకున్నారు.

వాసా అప్పయ్యగారు వీణ వాయించేవారు. కొంతమంది మావాళ్ళు గాత్రం కూడా పాడేవారు.

ఇక్కడ మామామగారి దగ్గర అయ్యగారి సోమేశ్వరరావు, రామవరపు సుబ్బారావు, చేబోలు వెంకటశాస్త్రి, అప్పలాచార్యులు వీళ్ళంతా నేర్చుకున్నారు.

రాజావారు పిలిచి వాయించమని ఎప్పుడు అడిగినా వెళ్ళి వాయించేవారు. వాసా అప్పయ్యగారు డ్యాన్సు కూడా చేప్పేవారు. సంగీతం అంటే పి.వి.జి. రాజు తల్లికి చాలా ఇష్టం. ఆమె పేరు అమ్మాజీ సర్కారు. వాసాకామయ్యగారు నిమ్మపండు తలమీద పెట్టుకొని వీణ వాయించేవారు. అది కూడా ఘనరాగ పంచకం తానం. ఒకరాగం తెల్లవార్లూ వాయించేవాడు. ఇలా ఇష్టంగా రాజాగారు వినేవారు. తర్వాత జగన్నాథరాజాగారి మీద 12 ఏళ్ళ ప్రాయంలో వాసా అప్పయ్యగారు కీర్తన చేసారు. నిమ్మపండు నెత్తిమీద కింద పడకుండా ఘనరాగం పంచకాన్ని నాలుగు గంటలు వాయిస్తే బండెడు నిమ్మపండ్లు ఇంటికంపించేరని మా అత్తగారు చెప్పేవారు. వాణీగాన పాఠశాల అనేది స్కూలు పెట్టి వాసా కృష్ణమూర్తిగారు విశాఖలో చాలామందికి వీణ చెప్పేరు.

అక్కడక్కడా సంగీత కచేరీలు చేసి గవర్నమెంటులో అవకాశాలొచ్చినా వెళ్ళకుండా విజయనగరంలోనే కాలక్షేపం చేసారు వాసా కృష్ణమూర్తిగారు.

# అనుబంధం – X

## చిలకమర్రి లక్ష్మీ నరసమ్మగారితో ఇంటర్వ్యూ

లక్ష్మీ నరసమ్మ - వయసు 91 సం॥లు కపిలేశ్వరపురం జమీందారిణిగారి పిల్లలకు విజయలక్ష్మమ్మగారు ఒకరాణి. ఉయ్యూరు రాణిగారికి జగదీశ్వరమ్మగారు భూదేవమ్మగారు. వారికి బొబ్బిలి వీణ మీద చెప్పేదాన్ని.

130/- నెలకు ఇచ్చేవారు. పండగలకు బట్టలిచ్చేవారు. పిండివంటలు సామాను పంపేవారు. ఒకటేమిటి సమస్తం ఇచ్చేవారు.

గుఱ్ఱపు బగ్గీ మీద తీసుకెళ్ళేవారు. ఒక్కొక్కప్పుడు కార్లో కూడా తీసుకెళ్ళేవారు.

దివాన్జీగారింట్లో ముందుభాగంలో దీవాన్‌జీగారుంటే వెనుక భాగంలో మేం ఉండేవారం. రాజావారే ఇచ్చారు. కొల్లాపురం రాణిగారికి కూడా చెప్పాను పేరు గుర్తు లేదు.

అక్కడి దివాణంలో మా తాతగారు దొడ్డాచార్యులు గారుండేవారు. ఆయన దేముడికి పూజాదికాలు చేస్తూ రాజావారికి తీర్థ ప్రసాదాలు ఇస్తూండేవారు. నా మనమరాలికి వీణ వచ్చును. అమ్మలకి చెప్పించండి అని ఈయన సిఫార్సు చేసారు. అప్పుడు నన్ను పిలిపించారు డబ్బిచ్చి.

అప్పుడు నా వయసు 30 ఏళ్ళు. నూజివీడులో రాణిగారి దివాణంలో సంగీతం చెప్పేదాన్ని. విజయలక్ష్మమ్మ జగదీశ్వరమ్మగారు ఇద్దరూ అప్ప చెల్లెళ్ళు. 10 గంటల కట్లా భోజనం చేసి ఉయ్యూరు ఎస్టేట్‌కి వెళ్ళేదాన్ని అక్కడి ఉండి ఇంటికొచ్చి కాఫీ తాగి మళ్ళీ కపిలేశ్వరపురం ఎస్టేట్‌కి వెళ్ళేదాన్ని ఎవళ్ళ వీణలు వాళ్ళకుండేవి.

# అనుబంధం – XI

## నాళం కామేశ్వరరావుగారితో ఇంటర్వ్యూ

నాళం వారి సంగీత సేవ

మా పూర్వీకులు వూరు మండపేట. నాళం వారి మకాములు అని ఉంటాయి. కలకత్తా, బరంపురం, రాజమండ్రి మండపేట మొదలైన ప్రాంతాల్లో ఉమ్మడి వ్యాపారం చేస్తుండేవారు. రాజమండ్రి మకాంలో మా తాతగారు నాళం కామరాజుగారుండేవారు. ఆయనకు 5 గురు సంతానం. మానాన్నగారు కనిష్ట - ఆయనకు సంగీతం అంటే అంతా ఇంతాకాదు. చాలా అభిమానం. అంచేత ఇంట్లో అందరికి సంగీతం రావాలనే ఉద్దేశంతో పిఠాపురం నుండి, విజయనగరం నుండి విద్వాంసుల్ని రప్పించి వాళ్ళను ఇంట్లో పెట్టుకుని పోషిస్తూ ఇంట్లో అందరికి కూడా సంగీతం చెప్పించారు. పోషించడం అంటే ఉచితంగా వసతి అదీ ఇవ్వడం భోజన సదుపాయం, నెలకు జీతం ఆరోజుల్లో 100/- ఉండేది ఇచ్చారు. పొడుగు రామ్మూర్తి గారని విజయనగరంలో ఆస్థాన విద్వాంసులు ఉండేవారు. ఆయన మా అందరికి సంగీతం నేర్పడానికి సంవత్సరం పాటు మా ఇంట్లో ఉంచి మా అమ్మగారికి మా అన్నయ్యకు, అక్కయ్యకు నాకు అందరికీ వీణ సంగీతం నేర్పించారు. మా అమ్మగారు నాళం సుశీలమ్మగారు.

ఆంధ్ర మహిళాసభ అని 60 సం॥ల క్రితం స్థాపించారు. దాన్ని ఇప్పటికీ మేం నిర్వహిస్తున్నాం. దీని ముఖ్యోద్దేశం ఏంటంటే ఆడ పిల్లలకు ఉచితంగా వీణ, గాత్రం చెప్పాలని ఏర్పాటు చేసారు మా అమ్మగారు.

పిఠాపురం నుంచి ఈమని అచ్యుత రామ శాస్త్రిగారు వచ్చారు. సుమారు 3, 4 సం॥లు మా యింట్లో ఉన్నారు. నాళం వారంటే ఇనాందార్లు అని ఆ ఇనాం ఎక్కడి నుండి వచ్చిందంటే ఛత్రపురంలో మాకు ఇనాం భూములు ఉండేవి. అవి బ్రిటిషువాళ్ళు ఒక బ్రాహ్మణుడికి ఇచ్చారు. ఆ బ్రాహ్మణుడి పేరు రాంభట్లు - అయితే ఆ బ్రాహ్మణుడు వ్యవసాయం చెయ్యలేక వాటిని మహమ్మదీయులకు అమ్మేశాడు. మాకు వ్యాపారాలు చాలా చోట్ల ఉండేవి అని చెప్పాను కదా! ఆ సందర్భంలో ఈ మహమ్మదీయులు మాకు బాకీ ఉండి, ఆ బాకీకి డబ్బివ్వలేక ఈ భూమిని ఇచ్చేశారు.

ఇప్పటికీ మేం ఉచితంగానే ఆంధ్రమహిళాగానసభలో స్త్రీలకు సంగీతం నేర్పుతూ ప్రభుత్వ పరీక్షలకు పంపుతున్నాం.

# అనుబంధం – XII

## పట్రాయని నారాయణ మూర్తిగారితో ఇంటర్వ్యూ

వాసా కృష్ణమూర్తి, వాసా సాంబయ్యగారు అన్నదమ్ములు. కృష్ణమూర్తి కొడుకు వెంకట్రావు. ఈ వెంకట్రావు విజయనగరం ఆస్థాన విద్వాంసులు. అంటే కాలేజీలో వీణ పండితులు. ఈ వీణ పండితుడే కాకుండా మహారాజా అలక నారాయణగారి తాలూకు కూతుళ్ళకు వాసా వెంకట్రావుగారు సంగీతం చెప్పారు. వాళ్ళ పేర్లు జ్ఞాపకం లేదు.

ఆస్థాన విద్వాంసులు కలిగొట్ల కామరాజుగారు, పెదగురాచార్యుల రమణయ్యగారు వీణా రమణయ్యగారు వీరందరూ కూడా ఆస్థాన విద్వాంసులు. వాసా కృష్ణమూర్తిగారు, వాసా అప్పయ్యగారు పల్లవులు రాసారు. అప్పయ్యగారు పల్లవి హిందోళ రాగంలో పాడారు. వీళ్ళకు - మహా అయితే 5, 6, 10 రూపాయల జీతాలుండేవి. నెలకు జీతాల 2-50 జీతం ఉన్న వాళ్ళు కూడా ఉన్నారు. అనాడు వీళ్ళకు భూములిచ్చారు. ఏ శుభకార్యాలొచ్చినా విద్వాంసులకి ఏదో ఒకటి ఇస్తూనే ఉండేవారు. జీతాలు మట్టుకు ఇంతే కానీ భూములూ వాటి వల్లా ఆస్థానంలో వుంటూండేవారు. ఆ తర్వాత విజయనగరం సంస్థానంలో కాలేజీ పెట్టినపుడు బొబ్బిలి సంస్థానంలో ఉన్న వాసా వెంకటరావుగారు విజయనగరం కాలేజీకి వచ్చారు. మొట్ట మొదట్లో వీణ ప్రొఫెసర్‌గా, ఆదిభట్ల నారాయణదాసు ప్రిన్సిపల్‌గా ద్వారం వెంకటస్వామి నాయుడు వైలన్‌గా, కలిగొట్ల కామరాజుగారు ఓకల్‌గా శంబరదాసు అనే ఆయన ఓకల్ క్రింద ఉండేవారు.

ముని స్వామి అనే ఆయన పెద్ద సన్నాయి వాయించడానికి వీరన్నడోలు, నటేశం డోలు. ఆంధ్రమణి అయ్యర్ కోలంకి వెంకట్రాజు, ఆయన మృదంగానికి సన్యాసిరాజు వీళ్ళందరికీ పూర్వం మృదంగానికి అలాగే మద్దెల అప్ప మృదంగంలో చాలా ప్రసిద్ధుడని అనుకునేవారు ఆ రోజుల్లో. ఇతడు సప్త స్వరాలూ కూడా స్వరాలు వేస్తుంటే అనుసరించి వాయించేవాడు అని అనుకునేవారు.

పెద్ద గురు రాయాచార్యుల రమణయ్యగారి దగ్గర ఆనంద గజపతి సంగీతం నేర్చుకున్నారు. వీణా రమణయ్య దాసుగారు ఆనందగజపతి మహారాజు కలిసి సాధకం చేసేవారు. అంతేతప్ప గురువుకాదు.

ఆనందగజపతి పంచమం విసర్జించి కళ్యాణి రాగంలో ఒక అటతాళ వర్ణమో ఆది తాళ వర్ణమో రాసినట్లు జ్ఞాపకం.

మానాన్నగారు రాసిన విధంగా ఆమోడల్‌లోనే ఆనందగజపతి వర్ణం ఉండేది. నారాయణదాసు గారు నృత్యం, గానంలో కూడా మహా పండితులు అలాగే చాలా గ్రంథాలు రచించాడు. నారాయణ దాసుగారు 60, 70 ఏళ్ళ ప్రాయంలో కూడా సంగీతం నాట్యం చెప్పడం నేను చూసాను.

వీణా రమణయ్యగారి గురించి : అతను వైణికుడు. బాగా విపరీతమైన తానంలో అభేద్యమైనటువంటి తానం వాయించేవాడు. తానం వాయించడమంటే అంతప్పుడు తానాన్ని వాయించినవాడు ఆ కాలానికి లేడు. కీర్తన సంప్రదాయ పద్ధతీ అదంతా కూడా చేసినది సంగమేశ్వర శాస్త్రిగారు. ఇది కూడా వాసావారి సంప్రదాయాలే. కాని ఒక ప్రత్యేకతగా సంగమేశ్వర శాస్త్రి ఉండేవాడు. ఇప్పుడు మనం చేస్తున్న నెరవల్ అసలు రాగం తానం ఒక కచేరీ పద్ధతి ఇదంతాకూడా సంగమేశ్వర శాస్త్రి దగ్గరదే.

'కాజ' అగ్రహారంలో మధురా పంతుల పేరయ్య శాస్త్రిగారని ఉండేవారు. అక్కడి నుండి సంగీతం నేర్చుకుందామనే ఆసక్తి చేత తంజావూరు వెళ్ళి పోయారు ఇద్దరన్నదమ్ములూ. ఇద్దరిలో పేరయ్య శాస్త్రిగారికి సంగీతం వచ్చింది. వారి అన్నగారికి వంట వచ్చింది. అన్నగారికంటే సంగీతం అద్భుతంగా పాడేవాడు. కానీ లౌకిక జ్ఞానం అన్నగారికి ఉండడం చేత ప్రతీ విషయం కూడా ఏది చెయ్యాల్సి వచ్చినా అన్నగారే చేసేవారు. దీంట్లో కలిగొట్ల కామరాజు గారుండేవారు. ఫిడేలు చాలా అద్భుతమైన శిక్షణ. అలాగే పాడుగు రామ్మూర్తి అనే ఆయన ఉండేవారు. అతను కూడా విపరీతమైనటువంటి వైణికుడు. చాలా బాగా వాయించేవాడు.

ఈ పాడుగు రామ్మూర్తి కాక కలిగొట్ల కామరాజు దగ్గరో లేకపోతే ఎవరి దగ్గరో నేర్చుకున్నాడు. కానీ చాలా మంచి విద్వాంసుడు.

సుమారు 70 సం॥లు. అలక నారాయణ గజపతి తర్వాత సంస్థానం ప్రభుత్వాధీనం అయింది. అతను చనిపోయిన రోజునే అయిందేమో!

అలక నారాయణ గజపతి సంస్థానాన్ని గెలుచుకుని ఆవేళ నగారా వాయించడం నేను విన్నాను.

ఆకొండి నారాయణ శాస్త్రిగారు గర్ల్స్ స్కూల్లో టీచరు. తర్వాత పూజామందిరంలో గాయకులు. వాళ్ళు పూజలు చేస్తుండేవారు. ఆనాడు శాస్త్రిగారు వెళ్ళి వీణ వాయించడం గాని గాత్రం పాడటం గాని చేసేవారు. జోస్యుల సూర్యనారాయణగారు ఆకొండి వారి శిష్యుడు. కానీ వారు ఏ సంస్థానంలో కూడా లేరు. గాత్రం పాడేవారు. వైలన్ కొంత వాయించేవారు.

తర్వాత పేరి రామ్మూర్తిగారు అతన్నే పేరి బాబు అంటారు. అతను చాలా రచనలు చేశాడు. కాని పబ్లిక్‌కి తెలియదు.

అయ్యగారి సోమేశ్వరానికి అతని రచనలు బాగా వచ్చేవి. ఆ సోమేశ్వరం బెజవాడ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా కూడా పని చేసాడు. ఆయన రాసినవి జక్కిన దరువులు (చిక్కన్ దరువులు) అనేవారు వాసావారు. పేరి రామ్మూర్తిగారూ కూడా రాసారు.

ఈ జక్కిణ దరువులు వీణకి ప్రత్యేకంగా ఒక కోర్సుగా పెట్టేవారు అందరూ ఆ కోర్సు చదివేవారు. తప్పనిసరిగా గీతాల్లో మలహరి గీతాలు, రక్తిరాగ గీతాలు, ఘనరాగ గీతాలు, ప్రబంధ గీతాలు, కైవార ప్రబంధాలు అని వుండేవి. రకానికి 2, 3 అయినా చెప్పేవారు. గుమ్మలూరి లక్ష్మీ నారాయణ అనుకుంటాను. అతను వాసా అప్పయ్యగారి దగ్గర సంగీతం నేర్చుకుని శ్రీనివాసాప్పయ్య గురు చరణం అని గీతం రాసారు. మలహరి గీతం కంటే ముందు ఈ గురుధ్యానం చెప్పేవారు.

ఆ తర్వాత బొబ్బిలి రాజావారు భోగం మేళం అవుతుంటే గురువుగారూ వాయించండి అని చెప్తే వీణ వదిలేసి, ఆనాటి నుండి వీణకూడా మానేసాడు. ఈయనే భోగం మేళం వెనుక వాయించమన్నందుకు మళ్ళీ రాజావారు కబురు పెడితే ఆ గుమ్మలూరి లక్ష్మీనరసింహం చచ్చి పోయాడు లేడు అని చెప్పి ఆరోజునుండి వీణ మానేసాడు. నాలాంటి వాళ్ళ చేతిలో వీణ ఉండడం చేత కదా! వీణ వాయించమన్నాడు. వీణ మర్చే పోయాడు అని చెప్పి వీణ వాయించలేదు.

ఆనాడు బ్రతకడానికి పెద్ద ఉద్యోగం కావాలి సద్యోగం కావాలనే లేదు. ఆనాడు పంటలు బాగా పండేవి. ఎవరో ఒకరు ఏదోటి ఇచ్చేవారు. మాధవకబళం మాత్రంకాదు.

గున్నయ్య సత్యమూర్తి విజయనగరం కాలేజీలో వైలన్ ప్రొఫెసర్ పట్రాయని సీతారామశాస్త్రి గారి తర్వాత పని చేసారు.

# అనుబంధం – XIII

## పీసపాటి నరసింహంగారితో ఇంటర్వ్యూ.

అప్పటి వాళ్ళు సంస్థానాధీశులు ఆదరించినా వాళ్ళ దగ్గర పని చేస్తున్నా, కేవలం జీవనోపాధి కోసం సంస్థానంలో పని చేసినవాళ్ళే తప్ప ఇతరత్రా ఆర్థికంగా సంపాదిద్దామనే దృక్పథంలో ఉండేవాళ్ళు కారప్పుడు. వాళ్ళకెక్కువ ఏం ఉండేదంటే సంగీత సాహిత్య శాస్త్రాలు ఇత్యాది ఎందుకోసం నేర్చుకుంటారు? ఆ ముష్మికాన్ని సాధించడంకోసం నేర్చుకుంటారు. ఆ దృక్పథంతోటే వెళ్ళారు తప్ప ఇప్పటి వాళ్ళల్లా ఏదో శాస్త్రం ఏదో విద్య అభ్యసించినంత మాత్రం చేత ఒకింత సంపాదిద్దాం, కోటీశ్వరులౌదామనే దృష్టితో చెయ్యలేదు. అలా చేసిన వాళ్ళు మనకు కనబడలేదు. ఆనాడు మహా సంగీత విద్వాంసుడు త్యాగరాజు ఏ సంస్థానాలలోనూ పని చెయ్యలేదు.

తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారు నాకు తెలుసును. నేను కాకినాడలో ఉన్న రోజుల్లో బత్తుల రామేశం గారి సత్రంలో (పిఠాపురంలో ఉండేవాడు) వైద్యం నిమిత్తం వచ్చేడు ఆయన. నేను 14, 15 సం॥ల వయసువాణ్ణి. బ్రహ్మాండంగా వీణ వాయించేవాడు. బహుశా అలా వీణ వాయించే వాళ్ళు పుట్టరేమో అనుకుంటాను.

నిలబెట్టి వీణను వాయించేవాడు. వీణ పడుకోపెట్టి వాయించే సంప్రదాయం ఆడవాళ్ళు నేర్చుకోడం మొదలైనప్పటి నుండి వచ్చిందే.

రాజా స్థానంలో ఉన్నా రాజుగారిని కూడా లక్ష్య పెట్టేవాడు కాదు సంగమేశ్వర శాస్త్రిగారు. నెలకు ఆయనకు జీతం 20 రూ॥లు. దాంతోటే కాలక్షేపం చేసేవారు.

సంగీతం ఎందుకు పుట్టింది అంటే పరమేశ్వరారాధనకి పుట్టింది. అలాగే దాన్ని వాళ్ళు వినియోగించుకున్నారు. కాలధర్మం చెందారు.

తన యిష్టానికి నియమాలకు వ్యతిరేకంగా ఏదీ చేసే వారు కాదు. మీకో చిన్న ఉదాహరణ చెప్తాను. బొబ్బిలిలో తుమరాడ వెంకయ్య, చిత్తజల్లు నరసింహం అని భామవేషగాళ్ళు ఉండేవాళ్ళు. భాగవతంలో భామవేషం కట్టే వాళ్ళు. ఓ మాటు ఎందుకో వీళ్ళలో ఎవరిమీదో రాజుగారికి కోపం వచ్చి దేవిడీ ఇవ్వమని చెప్పేసారు. వెళ్ళిపోతూ వాళ్ళు ఒకమాట చెప్పి పోయారు. మీరు దేవిడీ ఇవ్వమని చెప్పారు. మాకు బాధలేదు. కానీ ఒక్కటి జ్ఞాపకం ఉంచుకోండి మీరు - మేం గంటకి మీలాంటి రాజుల్ని ఆరుగురిని సంపాదిస్తాం కానీ మాలాంటి విద్వాంసుల్ని మాత్రం మీరు జన్మలో సంపాదించలేరని చెప్పి బయటకు వచ్చేసారు. వాళ్ళను తీసేసేరని తెలిసింది. విజయనగరం ఆనందగజపతిగారు వెంటనే వేసేను కున్నారు వాళ్ళను. రాజాగారు పిల్చేరు. అయితే విజయనగరం వాళ్ళకు ఓ షరతు పెట్టారు. పానుగంటి వారు అధ్యక్షోపన్యాసం ఇచ్చారు. ఒకటే చెప్పారు. ఆ సభలో ఎలాంటిదట.

ఆస్థాన వైణాకాగ్రణి వీణారమ్యతాస్వాదనా శమునైనీ

చిలుకలు గూడ స్తంభోపరిటంకములనుండి సహజ వైఖరిని

రామాయనబోయి రీమాయను చున్నదీ సభయుంటన్నాడట.

అంత సుప్రసిద్ధత్వం ఆ సంస్థానానికి సంగీతంలో కలుగచేసాడాయన. అటువంటి వాడు ఎడం చేత్తో వీణ తీగలు ఠంగ్ అని కొట్టేవాడు. ఆ తర్వాత స్వరం వేసేవాడు కుడి చెయ్యి ఎంతసేపూ, అమ్మా! శారదా! అనే ధ్యాస సరస్వతీ దేవిమీద ఉండేది తప్పిస్తే మరేదీ లేదు - కళ్ళంట నీరు కార్చేవాడు. ఏదో చేసేవాడయన. ఆయనెప్పుడు పగటి పూట వాయించేవాడు కాదు. అందరూ పడుకున్నాక వాయించేవాడు. అది వినడం కోసం రాత్రి అవతల కూర్చునేవారు జనం వచ్చి.

ఆ రోజుని ఆనంద భైరవి రాగం ఎందుకు ప్రారంభించాడో కాని ఆరంభించాడు.

అంతబాగా వాయించేవాడు. అలా వున్నప్పుడేం జరిగిందంటే బరోడా మహారాజుగారి కూతురికి సంగీతం చెప్పాల్సిందని మద్రాసులో ఉన్న పిఠాపురం రాజావారికి రావు వెంకట మహీపతి సూర్యారావు బహద్దూర్ వారు కబురు పంపారు. మా స్థానంలో విద్వాంసులున్నారు అని పిఠాపురం రాజావారు సంగమేశ్వర శాస్త్రిగారిని మద్రాసు పిలిపించారు. పిలిపిస్తే శాస్త్రిగారు వెళ్ళారు. చెప్పమన్నాడు. 4 రోజులు చెప్పి నేనిక్కడ ఉండనన్నారు. మేం బొబ్బిలి మహారాజు సంస్థానం వారి వారి ఉప్పు పసులో బతికాం. భాగవతం మీకు ఆడతాం. కానీ అంకితం మాత్రం బొబ్బిలి వారికే చెప్తాం. ఇష్టమైతే ఉంటాం లేకపోతే ఉండమన్నారు. అందుకంగీకరించి పెట్టుకున్నారు.

విజయనగరంలో భామా కలాపం అంతా ఆడే వరకు వుండి అంకితమప్పుడు మాత్రం ఆనంద గజపతి వెళ్ళి పోయేవాడు. ఇలాంటి నియమనిబంధనలతో కాలక్షేపం చేసేవారు. ప్రతి విద్యకూ కూడా కావలసిందేమిటంటే నియమం నిష్ఠ, ప్రవర్తన ఇవన్నీ కూడా కావాల్సిందే.

# అనుబంధం – XIV

## వి.ఎ.కె. రంగారావుగారి ఇంటర్వ్యూ

బొబ్బిలిలో నాకు తెలిసీ, నేను 30లో పుట్టాను. 45 కి కొంత సంగీతం నేర్చుకోక పోయినా సంగీతం గురించి తెలుసు. మా పెద్దనాన్న గారు శ్వేతా చలపతి రామకృష్ణ రంగారావు. రాజా ఆఫ్ బొబ్బిలి అనే అందరూ అంటారు. అలాగే మా జమీందార్ ఆఫ్ చిక్కవరం  అంటారు. రావు జనార్ధన కృష్ణ రంగారావు - ఈ పేర్లు పెద్దగా తక్కిన వాళ్ళకు పరిచయం ఉండదు.

వీళ్ళందరూ సంగీతం అంటే చాలా ఇష్టపడ్డవాళ్ళే. చిన్న తనంలో మా బొబ్బిలి రాజాగారు పెద్దయ్యాక రాజకీయాల్లో ప్రవేశించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ చీఫ్ మినిష్టరుగా ఉన్నారు.

మా నాన్నగారికి అటువంటి రాజాకీయాలతో ప్రమేయం లేదు - సంగీతం పాటలూ పద్యాలూ అంటే చాలా ఇష్టం. రాగ యుక్తంగా ప్రబంధాల్లో ఉండే పద్యాలు చదివేవారు. మా నాన్నగారు ఒకటి రెండు పాటలు రాసారు. 1943లో నూజివీడులో ఉండగా అంటే మా అమ్మగారి ఊరు అక్కడనుండి బందరుకి వెళ్ళి పంజాబునుంచి వచ్చిన ముల్ఖరాజ్ మహారాజు దగ్గర మంత్రోపదేశం తీసుకున్నాం అమ్మా నాన్నా, నేను. అప్పుడు మా నాన్నగారు ఓ పాట రాసారు.

"దారిని తెలిసికొంటి" అని ఆ పాట మానాన్న గారు రాసారని ఆయనకే గుర్తుండక పోవచ్చు. నేను బాగా చిన్న వాణ్ణి 12, 13 ఏళ్ళ వాణ్ణి. అమ్మ కూడా చెప్పింది. నాకేం తెలిసేది కాదు. నా మనసులో అలా ఉండిపోయింది. అది తాళానికొచ్చిందో లేదో యతి ప్రాసలున్నాయో లేదో ఏదో అనుకోవడం.

ఆ గురువుగారు చేసిన మంత్రోపదేశపు స్ఫురణతో రాసిన పాట అది. తక్కిన పంక్తుల్లో చరణాల్లో ఏముందో ససేమిరా నాకు జ్ఞాపకం లేదు.

మా నాన్నగారికి సుమారు 80, 90 ఏళ్ళు - ఆయనకు వినబడదు. ఒకవేళ పేపరు మీద రాసిచ్చినా గుర్తు లేదనే చెప్తారు. మా అమ్మగారికి జ్ఞాపకం ఉందేమో తెలియదు.

కానీ ఎవరూ కూడా దాన్ని భద్ర పరచలేదు. తర్వాత మా అమ్మగారు చిన్నప్పుడు పెళ్ళి సంగీతం నేర్చుకున్నారు. వీణ నేర్చుకున్నారు. మా అమ్మగారి పెద్దక్క అందరికంటే పెద్దక్క ఇప్పుడు బొబ్బిలి రాణీగారు బ్రతికే వున్నారు. తొంభై ఏళ్లు. మద్రాసులో ఉన్నారు. వారు చిన్నప్పుడు హార్మోనియం వాయించేవారు. వీళ్ళందరూ పెళ్ళియిందాకా నేర్చుకున్నారు. మా కులంలో ఆ రోజుల్లో బంధువుల్ని పెళ్ళి చేసుకోవడమే తప్ప మరేదీ లేదు. పెళ్ళియింతర్వాత హార్మోనియం ముట్టినట్లు నాకు జ్ఞాపకం లేదు. అప్పుడే వదిలేసారు. కాని పాటలు పాడేవారు. కానీ నా చిన్నతనంలో హిందీ సినిమా పాటలు వీణ మీద వాయించేవారు. ఆమెకి జ్ఞానం ఎటువంటిదీ అంటే రాగంతానం పల్లవి పాడటం రాగాలాపన చెయ్యడం  అవేవీ తెలియవు. నేర్చుకున్న కృతులు పదో, పదిహేనో ఇరవయ్యో ఉంటాయి - ఆ కృతులు పాడుకునేవారు. హిందీ సినిమా పాటలు పాడేవారు మా అమ్మకు ఎటువంటి జ్ఞానం అంటే వీణ చూస్తూ ఒక పాట వాయించలేదు. మనసుకొస్తే కళ్ళు మూసుకు వాయించేది. 'కళ్ళు తెరిస్తే ఆ మీట పలికేది కాదు. అంటే ఆ మీట నొక్కితే ఈ శబ్దం వస్తుంది అని కంటితో చూస్తే తెలిసేది కాదు. ఏ పాటయినా నోటికొచ్చిన పాట కళ్ళు మూసుకుని వీణ మీద వాయించెయ్యగలదు. అద్భుతంగా వుండదు - ఏ చిట్టిబాబో శంకర శాస్త్రిగారో వాయించిన నట్లుండదు.

మామూలుగా ఉంటుంది. ఆ తర్వాత ఈ మంత్రోపదేశం జరిగిం తర్వాత రోజా పూజ గదిలో కూర్చొని స్తోత్రాలు, అర్చనలు ఇవి చెయ్యడం కాకుండా భగవంతుని మీద పాటలు చిన్నప్పుడు వాళ్ళు నేర్చుకున్న పాటలు తమ సొంతంగా చేసుకున్న పాటలు ఏవో పాడేవారు.

ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాడేపాట మీరాలోనో శకుంతలలోనే ఆ వరుసలలోనే చేసేవారు. సొంతంగా చేసినవి కూడా ఉండేవి. కానీ అవి గొప్ప సంగీతం కలవి కావు.

ఒక రాగం జంఝూటి, ఆనందభైరవి తెలుసుకున్న రాగాలు ఏదో మోహానా, కళ్యాణి రాగాల్లో ఉండేవి. గొప్ప సంగీత రచనలు ఏమీ కావు అవి; చాలా మట్టుకు ఇంతకుముందుండే ట్యూన్స్ అవి. అలాగే బొబ్బిలి రాణిగారు ఎన్నో పాటలు రాసారు. మా మదర్ ఒక వంద పాటలదాకా రాసుంటారు. అందులో ఇంతకు ముందున్న ట్యూన్‌లో రాసినవి ఒక ఇరవై ముప్పై ఉంటే ఆమెకి తోచిన రాగాల్లో చేసినవి ఒక అరవై డెబ్బై ఉంటాయి. బొబ్బిలి రాణిగారు ఎవరంటే మా అమ్మ పెద్దక్క. శ్రీ కృష్ణదాసి కృతులు అన్న పేరుతో ఒక పుస్తకం రాసారు. దాంట్లో రాగం తాళం కూడా వుంటుంది. వాళ్ళకి తెలిసిన రాగాల్లో వాళ్ళు పాడుకున్నారు. అవి కూడా ఏదో ఏదో అపూర్వ రాగాల్లో మాత్రం వుండవు. మామూలు చాలా సంసారపక్షంగా ఆడవాళ్ళు ఇంట్లో కూర్చుని పాడుకునే పాటలా ఉంటాయి. కొన్ని రచనలు చాలా స్నిగ్ధంగా ఉంటాయి.

నేను వేరే ట్యూన్లు చేయించుకొని బి. గోపాలం అని ఒకాయన ఉండేవారు. ఆయన చేత చేయించుకుని నేను నాట్య కార్యక్రమాల్లో ఉపయోగించుకునేవాణ్ణి ఎక్కడైనా పాడి వినిపించేవాణ్ణి వీళ్ళిద్దరు తప్ప మా ఫ్యామిలీలో ఇంకెవరూ పాటలు రాసేవాళ్ళు లేరు. వీళ్ళను వాగ్గేయ కారులు అనడం తగదు. వాగ్గేయ కారుడు అంటే - నేనూ రాసాను నాలుగు పాటలు నాకు తోచినవి. వాగ్గేయకారుడు అంటే అదొక అంతస్థును సూచిస్తుంది. "పిల్లా పిల్లారా పెళ్ళి పెళ్ళి చేసుకో" అని అలా ఏదో రాస్తే వాగ్గేయ కారులవ్వరు. అలాగని వీళ్ళు రాసినవి (చీప్‌లిరిక) అని కాదు. దేవుని మీదో లేదా వాళ్ళకు కలిగిన అనుభూతిగురించి ఏదో ఒకటి రాసేవారు. వాళ్ళు చిన్నప్పుడేవో భాగవతంలో పద్యాలో ఏదో ఒకటి నేర్చుకున్నవారు.

ఆరోజుల్లో ఇంకోటేంటి జరిగేదంటే బొబ్బిలిలో బొబ్బిలి దర్బారులో, బొబ్బిలి వేణుగోపాల స్వామి దేవాలయంలో నాట్యం చేసే ఒకదేవదాసి పేరు సీతారాం.

ఎనిమిది మందో పది మందో దేవదాసీ లుండేవారు. ఆ దేవాలయంలో దర్బారుకి ఎంత మంది ఉండేవారో నాకు తెలియదు. ఈ సీతారాం మాత్రం ఆడవారుండే జనానా అంతఃపురంలోకి రాణులుండే చోటుకి వచ్చేది. వచ్చి విరాట రాజకొలువులో సైరంధ్రి ఏం పని చేసేదో ఆపని చేసేది. అంటే పూలు కట్టడం గంధం తియ్యడం. నేను బాగా చిన్నవాణ్ణి అందుకోసం రాణి వాసంలోనే మూడేళ్ళు ఉన్నాను. అప్పటి సంగతి చెప్తున్నా ఉదయం 8.30 కి. అప్పుడు అందరూ పూవుల దండలు కడుతూండేవారు. అప్పుడు అమ్మ, పెద్దమ్మ కూడా, సీతారాం పూలు కట్టేది - తాంబూలం చుట్టడం అంటే మూడాకులు దాంట్లో ముంగ వక్కలు వేసి అరటి నారతో చుట్టేవారు.

ఎవరైనా రాజబంధువులు రాణి వాళ్ళను చూడ్డానికి వస్తే వాళ్ళకిచ్చేవారు. ఇలా చుట్టుతున్నప్పుడు పాటలు పాడేదామె. అలాగే బ్రాహ్మణులు కొంతమంది వచ్చేవారు. నాకు బాగా చిన్నతనం. వాళ్ళొచ్చి ఏవో ఊర్మిళాదేవి నిద్ర ఇలాంటివి పాడేవారు. ఇవే కాక లలితాంబ అనే పిల్ల వచ్చేది. ఆమె వైశ్య కుటుంబీకురాలు. చిన్నప్పుడే పెళ్ళిచేసారు. చిన్నప్పుడే పోయేడో వదిలేశాడో తెలియదు. కొంచెం పిచ్చి పిచ్చిగా ఉండేది ఆవిడ. ఆమె కృష్ణుడు గురించి వీళ్ళ గురించి పాటలు పాడేది.

"ఏకాదశి ఫలమేమని చెప్పుదు పార్వతి" ఈ పాట మేం చిన్న పిల్లలం ఆమెని ఏకాదశి అని పిలిచే

వాళ్ళం. సీతారాం జావళీలు, పదాలూ పాడేది. ఆ జావళీలు పదాలు తిరువీధి అంటే స్వామిని ఊరేగింపుని తిరువీధి అంటారు. అది వైష్ణవ సంప్రదాయం. కోటకు నాలుగు పక్కల గోడలకు కంతలుండేవి. కళ్ళు పెట్టి చూస్తే రోడ్డు మీద ఏం జరిగేదో స్పష్టంగా కనబడేది. రోడ్డు మీంచి పైకి చూస్తే ఆకంతలు తప్ప బయటి వారికి మరేం కనిపించదు. అక్కడి నుంచి మా పెద్దమ్మ అప్పుడప్పుడు చూసేవాళ్ళు. మేం బల్లవేసుకుని చూసే వాళ్ళం. మేం వీధిలోకి వెళ్ళడానికి వీలుండేది కాదు - ఈ నాలుగు దిక్కుల ఎనిమిది చోట్ల ఆపి దాని ముందు వాళ్ళు ఆడే వాళ్ళు. వాళ్ళు ఆడి పాడేవి కొన్ని గ్రాం ఫోన్ రికార్డుల్లో ఉండేవి.

'రేపు వత్తువుగాని'; 'తూరుపు తెలవారే!; ప్రఖ్యాత పదకర్తలు రాసిన జావళీలు వాళ్ళు పాడేవారు.

మగడొచ్చి పిలిచేడు ఇలాంటివి ఆవిడొచ్చి పాడేది. మేం ఐదారుగురు పిల్లలు ఉండేవాళ్ళం. మా పిల్లలు అందరూ వెళ్ళి పోయినా నేనొక్కళ్ణే ఉండేవాణ్ణి. నన్నందరూ వెక్కిరించే వాళ్ళు. చూశారా తాతగారిలాగా సరసుడు తయారయ్యాడు. ఐదేళ్ళప్పుడే సానిదాని చేత పదాలు పట్టించుకుంటున్నాడు. నాకా జోకు అర్థమయ్యేది కాదు. ఈ ప్రభావం నామీదే కాదు వాళ్ళ మీద కూడా వుండేది. మా అమ్మ తమ్ముడు చెవులు కుట్టినప్పుడు బాలమురళీకృష్ణ ఐదు, ఆరేళ్ళ వయసున్నప్పుడు అతని పాటకచేరీ ఏర్పాటు చేసారు. నా బాలసారప్పుడు బెంగుళూరు నాగరత్నమ్మ కచేరీ చేసారు. ఇవన్నీ మా అమ్మగారు చెప్పారు.

బెంగుళూరు నాగరత్నమ్మతో మా ఇంట్లో అందరికీ పరిచయం. ఎలాంటి పరిచయమంటే ఆమె ఇంటికొచ్చి ఏవో కబుర్లు చెప్పి ఆమె పాటలు పాడేది. సొంతంగా కన్నడంలో రాసిన జావళీ పాడేది - ఇంకా త్యాగరాజ కీర్తనలు పాడేది. ఆమె రావడం మేం మద్రాసులో ఇల్లు కొనుక్కున్న తర్వాత తెలుసు. అప్పటికి ఆమె వృద్ధురాలు అయినా ఆమె పాడేది. ఆవిడంటే నాకు చిన్నప్పటి నుండి గురి. దానికొక కారణం వుంది. మా అమ్మ మొదటి రెండు సంతానం ఆడవాళ్ళు. మూడోసారి గర్భంతో ఉన్నప్పుడు అమ్మను చూడ్డానికి నాగరత్నమ్మ వచ్చింది. ఎలా వున్నారు - ఏదో ఇలా వున్నాను. అంటే అంతర్గతంగా ఇద్దరూ ఆడపిల్లలే అని.

రాజవంశంలో ఆరోజుల్లో ఒక అలవాటు ఉంది. కొడుకు నివ్వక పోతే పుట్టకపోతే ఇంకొక భార్యని చేసుకోడం. మా నాన్న గారు మా అమ్మని భయపెట్టారని కాదు. (లేట్ 30)లో ఆమె వచ్చి చెప్పింది. ఒకనిమ్మ కాయ ఇచ్చి అమ్మా! ఈసారి నీకు కొడుకు పుడతాడు. ఎవరో మంచి కోరుకోడం అంతే - అలా అనుకున్నాం.

రాజవంశంలో పుట్టి సంగీతం పాట్టం ఆరోజుల్లో సంగీతం పాడటమే. సాని వాళ్ళు చేసేపని - ఆ రోజుల్లో చాలా మంది సానివాళ్ళు అంటే చిన్న చూపు ఎవరికీ లేదు. అది కులం డాక్టరేనా యాక్టరేనా ఏదైనా అది కావచ్చు. మంచి చెడూ రెండు వుండవచ్చు. ఈవిడ సానిది చెడ్డది అనే భేదం వచ్చేట్టు మా పెద్దలు ప్రవర్తించలేదు. సంగీతంతోనే ఈయన పేరు తెచ్చుకుంటాడు అని ఆమె ఆశీర్వదించింది. ఆ నిమ్మ కాయింకా మేడ మీద పూజగదిలో వుంది. 66 ఏళ్ళ తర్వాత కూడా మేం దాన్ని ముట్టుకోం. ఎఱ్ఱగా నల్లగా మాడిపోయి వాడిపోయి లేదు. ఆమె మాట ప్రకారం నాకు సంగీతంలో సపసలు తెలియవు. కానీ సంగీతం ద్వారా నాకు పేరొచ్చింది. సంగీతం గురించి సరాగమాలో మరోటో రాయడం వల్ల అది ఆమె ఆశీర్వచనం ప్రభావం వల్లే అని నా నమ్మకం. ఆమె పాటలూ విన్నారు. ఈ రికార్డులూ వినేవారు. రాజయ్యంగారి పాటలన్నా ముసిరి సుబ్రహ్మణ్యంగారి పాటలన్నా మా అమ్మమ్మ కూడా వినేవారు. మా అమ్మమ్మ కూడా పాటలు రాసేది. మా బొబ్బిలి కులదైవం వేణుగోపాలస్వామి చిన్నప్పుడు ఏదో జబ్బు చేస్తే తెల్లవారిలోగా తగ్గక పోతే ఆపరేషన్ చెయ్యాల్సి వస్తుందని అందరూ కంగారు పడ్డారు. దాంతో వెంకటేశ్వర స్వామికి మొక్కుకున్నారు తగ్గింది. అందువల్ల నా పేర్లో వెంకట అని చేర్చారు. వి. అంటే వెంకట ఆనందకుమార్ రంగారావు అని. మా వాళ్లందరిమీద ఈ ప్రభావం ఉంది.

చిన్నప్పటి నుండి త్యాగరాజకృతులు వింటున్నాను. నేర్చుకున్నది. మహా అయితే పదిహేనుంటాయి. పెద్ద వారి అందరి పాటా విన్నాను. బెంగుళూరు నాగరత్నం, చెంబై వైద్య నాథ భాగవతార్, మైసూర్ రాజా అయ్యంగార్, చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్ళై అక్కడికి పిలిపించుకుని పాడించుకునేవారు. ఎందుకు పిలిపించుకుని పాడించుకునేవారంటే. మద్రాసులో ఉండే సంస్థానాల్లాగా నెలకోసారి వారానికోసారి కాదు. నామకరణానికో, కొడుకు బాలసారెకో, చెవులు కుట్టడానికో ఏదో ఒక దానికి పిల్చి పాడించుకునేవారు. నూజివీడులో ఉండేవారు. చిన్నప్పటి నుండి వింటూండడం వల్ల దాని ప్రభావం - ఈ పాటల్లో ఉండే మాటలు ఏ త్యాగరాజువో అన్నీ వెతికితే క్షేత్రయ్య మాటలో కనిపిస్తాయి వాళ్ళ పాటల్లో. కాని సాహిత్యంగా చూసుకుంటే అది సాహిత్యం కాదు. సంగీత పరంగా చూసుకుంటే అది పెద్ద సంగీతమూ కాదు.

రాజా మేకా వెంకటాద్రి అప్పారావు. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఉండేవారు. ఆయన ఎం.వి. అప్పారావు, ఆయన తండ్రిగారు ఈయన, మా అమ్మ పుట్టిల్లు. మేక అప్పారావు లందరూ తాతలు పెద నాన్నలు చిన్నాన్నలు, అన్నలో అల్లుళ్ళో అవుతారు.

ఆయన నాకు ఏడేళ్ళప్పుడో ఎనిమిదేళ్ళపుడో ఉన్నాడు.

సీత అనసూయల్ని ఇంటికి పిలిపించి అష్టపదుల్ని తెలుగులో పాడించేవాడు. కృష్ణలీలా తరంగిణి, మొదటి నుండి చివరిదాకా, జయదేవుని అష్టపదులు ఆయన తెనిగించాడు. అదే వరుసల్లో సరిపడేట్లుగా తెలుగులో రాసారాయన, అవి వింజమూరి సిస్టర్స్ అనసూయ, సీతల చేత పాడించేవాడు. ఆయన కూడా కలిసి పాడేవాడు. ఆ ఆనందంతో కూర్చునే డ్యాన్సు కూడా చేసేవాడు. సంస్కృతం బాగా నేర్చుకున్నాడు. గాన భారతం అని పుస్తక మేదో రాసారు. ఇవన్నీ వాగ్గేయ కారుల రచనలు అని చెప్పడానికి ఎందుకు వీల్లేదంటే ఇంతకు ముందున్న మాత్రా ఛందస్సులోనే రాసారు. తనానా తనానా తానన అని ఉంటే తెలుగులో కూడా రాసారు.

మా పెద్దమ్మ కూతురు ఇందిరాదేవి. సుబ్బలక్ష్మి అనే ఆమె దగ్గర వీణ నేర్చుకుంది. వాళ్ళిద్దరూ కలిసి రేడియోలో వీణ వాయించేవారు. సుబ్బలక్ష్మి మాత్రం బాగా వాయించేవారు. ఇందిరాదేవి మామూలుగా వాయించేది. ఇద్దరూ కలిసి కూడబలుక్కుని రాగాలాపన కూడా కలిసే వాయించేవారు. వాళ్ళు వాయిస్తూంటే దూరాన ఎవరో స్త్రీ పాడుతున్నట్లు అనిపించేది.

సాధారణంగా ఆలాపన అంటే ఎవరో ఒకరే చేస్తారు. వీళ్ళు అలా చేసేవారు కాదు. ముందుగానే స్వరరచన చేసుకుని ఇద్దరూ ఒకే లాగా వాయించేవారు. 48లో 50లోనో వాళ్ళ ఆఖరి ప్రోగ్రాం విన్నాను.

ఆమె ఏ పాటలూ చేసినట్లు దాఖలాలు లేవు. మా కుటుంబంలో అందరూ ఇంతో కొంతో పాడగలరు. ఒక పాట రాసినట్లు ఒక ట్యూన్ చేసినట్లు నాకు తెలీదు. నేను 100 పాటలో 50 పాటలో రాసాను చేసిన ట్యూన్స్ పదో పాతికో ఉంటాయి.

చిన్నప్పటి ట్యూన్స్ హిందీవో ఏవో అనుసరించి రాసాను - రచన అని చెప్పుకునేవి కొన్నే. వాటికి మాత్రం పెద్ద వాళ్ళచేత ట్యూన్స్ కట్టించుకుని నాయిష్టమైన రాగాల్లో పాడుకుంటాను. 'ప్రణయ బృందావనం' అని రేడియో నాటకం రాసాను.

# అనుబంధం – XV

## కాళహస్తి రామమూర్తి గారితో ఇంటర్వ్యూ

కాళహస్తి సంస్థానంలో ఉన్న మైనం పాటి వీరయ్య తన నానమ్మ గారితో ఉల్లిపాలెం వెళ్ళిపోయారు. నానమ్మగారి పేరు పాపమ్మ. సీతాదేవి గారు అనే ఆమె మావాళ్ళని సాకింది. ఉల్లిపాలెంలో నరసింహాచార్యులు అని ఒక సంగీత విద్వాంసుడు ఉండేవాడు. అక్కడ కొంతకాలం సంగీతం నేర్చుకున్నాక మొదట ఆయన తబలా మొదలు పెట్టారు. తబలా అయిపోయింది అని మళ్ళీ వైలన్ నేర్చుకున్నారు. కొన్నాళ్ళ తర్వాత ఈ వైలన్ కూడా నాకు నచ్చలేదని చెప్పేసి మా నాన్నగారు వీణ తీసుకున్నారు.

ఈ వాద్యాలన్నీ నరసింహాచార్యుల వారి దగ్గరే నేర్చుకున్నారు. నరసింహాచార్యులు గారు ఉల్లిపాలెం సంస్థానంలో ఆ ప్రాంతీయ విద్వాంసులేగానీ ఆస్థానంలో ఉన్న వారు కారు. బొబ్బిలిలో ఈ నరసింహాచార్యులుగారు కొన్నాళ్ళున్నారు. ఆ తర్వాత మద్రాసుకి వచ్చేసారు. మద్రాసుకి వచ్చింతర్వాత పానుగంటి రాజాగారు ఆయన మైసూర్ చీఫ్ జస్టిస్ అయినప్పుడు వీరన్నగారిని మైసూరు మహారాజుకి పరిచయం చేసారు.

ప్రోగ్రాం అయింతర్వాత రాజావారికి పరిచయం చేసారు. మహారాజావారు లేచి నమస్కారం చేసారు. స్టేట్ విద్వాన్ ఆఫ్ మైసూర్ చేసారు. కానీ మైసూరులో ఉండకుండా మానాన్న గారు మద్రాసుకి వచ్చేసారు. రాజా సూరనేని వెంకటరామ అప్పారావు మానాన్న గారిని పంపించారు. అప్పారావుగారికి సంగీతమంటే చాలా ఇష్టం. పైగా వీరన్న గారికి కూడా ఇష్టం. అందుమూలాన ప్రోత్సహించి సంగమేశ్వర శాస్త్రి గారి దగ్గరకు పంపారు.

వీరన్న గారు అంత గొప్ప వాడవ్వడానికి కారణం వీరేనండి. అంత బాగానూ వీరన్నగారు పేరు తెచ్చుకున్నారు. పానగల్లు సంస్థానం నుంచి అరణంగా వెళ్ళారని చెప్పాను కదా! సీతాదేవి గారు కోడలుగా వెళ్ళారు. వారితో కూడా మా నాన్నమ్మ దాది సీతమ్మగారి దాది అవడం వల్ల మా నాన్నగారిప్పుడు చిన్న పిల్లవాడు. నాన్నా అమ్మ అందరూ దాసీజనంతో బాటూ ఒకే చోట అంటే పెళ్ళి కూతురు ఏయింటికి కోడలుగా వెడుతుందో అక్కడికే వెళ్ళి రాణిగారి పిల్లలకు పాలిస్తూ వాళ్ళని సాకడం అనేది రాజరిక సంప్రదాయం. అలా వచ్చిన దాదుల పిల్లల ఆలనా పాలనా వాళ్ళ పెళ్ళిళ్ళ సైతం వాళ్ళే చూసేవారు. అందువల్ల నాన్న కూడా నాన్నమ్మతో వెళ్ళి సీతమ్మగారి దగ్గర ఉన్నాడు. మా నాన్న పట్టెమీద చేత్తో ఏదో ఒకటి తాళంలా వాయించుకుంటూ ఉంటే దొరగారు చూసి ఏం నేర్చుకుంటావు అని అడిగారు. తబలా నేర్చుకుంటానని అన్నారు. సరే నేర్చుకోమన్నారుట. ఉల్లి పాలెంలో ఉన్న నరసింహాచార్యుల దగ్గర నేర్చుకోడం అలా మొదలయింది. మా నాన్న గారికి.

జమిందారు గారు మూడెకరాల పొలం ఇచ్చేసారు. ఆ పొలాన్ని మా నాన్నగారు నరసింహాచార్యులు గారికి గురుదక్షిణగా ఇచ్చేసారు. తర్వాత సంగమేశ్వర శాస్త్రి గారి దగ్గరకు వెళ్ళి పోయారు. కొంతకాలం అక్కడ నేర్చుకుని మళ్ళీ తిరిగి ఉల్లిపాలెం వచ్చేసారు. మా నాన్నగారు 56 ఆ ప్రాంతాల్లో పోయారు.

ఒక మీటుకి సప్తస్వరాలు పలుకుతాయి. అది ఆయన టెక్నిక్ అది కూడా గమకాల మీద వెళ్ళిపోతుంది. ఎక్కడెక్కడ సాహిత్యాక్షరాలుంటాయో అక్కడే మీటు పడుతుంది. ఇష్టమొచ్చినట్లు మీట్లు పడితే స్వరాక్షరానికీ సాహిత్యాక్షరానికీ భేదం ఉండదని మానాన్న గారి అభిప్రాయం. వీణా వాయిద్యంలో అదే గంభీరత అంటారు. ఆయన ధన్యాసి, అఠాణ రాగాల్లో ఆయన డెత్ బెడ్ మీద ఉన్నప్పుడు అఠాణ రాగంలో 'పంకజాక్షి' అనే వర్ణం రాసారు. చక్రవాక రాగంలో కీర్తన రాసారు.

పానుగంటి రాజావారు ఒక వర్ణం రాస్తే ధన్యాసి రాగంలో దాన్ని స్వరపరిచారు మానాన్నగారు. తబలా, మృదంగం, ఫిడేలు వీణ వాయిద్యాలు నేర్చుకున్న మొదటి విద్వాంసుడు. కోకా సుబ్బారావుగారి అమ్మాయి నళిని. పి.వి. రాజమన్నార్ గారి కూతుళ్ళు. పోలీస్ కమీషనర్ గారి కుమార్తె వీళ్ళు సంగీతం వీణ నేర్చుకున్నారు మా నాన్న గారి దగ్గర. నా గురువు మా నాన్నగారే. (తిరుపతిలో సంగీత కళాశాలలో వైణికుడు అధ్యాపకునిగా చేసి రిటైర్ అయ్యారు వీరన్నగారి కుమారుడు రామమూర్తిగారు.)

# ఆధార గ్రంథాలు


1. ఆంజనేయశాస్త్రి, సాగి. రాకమచర్ల వేంకటదాసుకీర్తనలు జీవిత విశేషాలు : హైదరాబాదు. గోపాలకృష్ణా ప్రింటింగ్ ప్రెస్ - 1990
2. అప్పల స్వామి పురిపండా. (సం) సారంగ పాణి పదములు. రాజమహేంద్ర వరము. సరస్వతీ పవర్ ప్రెస్ - 1963
3. కమలా అనార్కలి, సి. పిఠాపురసంస్థానము కవిపండిత పోషణ. ఉస్మానియా విశ్వవిద్యాలయం పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసము - 1973
4. కోటయ్య దేవర, గరిక పర్తి, రచనలు - అముద్రితం
5. కృష్ణశర్మ, యం.ఎ.ఆర్. ఆదిభట్ల నారాయణ దాసుచరిత్రము. గుంటూరు, వెల్‌కంప్రెస్ - 1975
6. గౌరీశంకర్, టి. ముక్త్యాలదీపం. చల్లపల్లి, రాణిభవానీదేవి మెమోరియల్ ట్రస్టు - 1988
7. జగన్నాథశర్మ, దువ్వూరి - స్వరరాగసుధాకరము - విజయనగరం, పూ.వి. లేవు.
8. జగన్నాధరావు, మంచాళ, (సం) అధ్యాత్మరామాయణ కీర్తనలు, (మునిపల్లె సుబ్రహ్మణ్య కవి విరచితము) రాజమహేంద్రవరము, ఆంధ్ర గానకళా పరిషత్తు - 1962
9. జానకీరామన్, ఎస్.ఆర్. సంగీత శాస్త్రసారము - మొదటి భాగం - తిరుపతి, శ్రీరామాప్రింటర్స్ - 1986
10. "          "          సంగీత శాస్త్ర సారము రెండవ భాగం "          " - 1989
11. దత్తాత్రేయశర్మ, ఆణివిళ్ళ. విజయనగరం జిల్లా చరిత్ర సంస్కృతి, విజయనగరం - మాన్సాస్ సం॥ తెలీదు.
12. దొణప్ప,తూమాటి. ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణము, వాల్తేరు, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు - 1969.
13. నటరాజరామకృష్ణ, నవజనార్దనము, హైదరాబాదు, యశోధర ఆర్ట్‌ప్రింటర్స్ - 1984
14. నాగభూషణం, శ్రీహరి • సద్గురు త్యాగరాజుని భక్తిసంగీతముల స్వరూపము - మద్రాసు, శ్రీత్యాగరాజ మందిరము - 1967
15. నారాయణ దాసు, ఆదిభట్ల. దశవిధరాగ నవతి కుసుమ మంజరి గుంటూరు, (ప్రకాశకులు) కర్రా ఈశ్వరరావు , ప్ర.వి. లేవు.
16. నారాయణ దాసు, ఆదిభట్ల, నాయెఱుక. స్వీయ చరిత్ర (సం) యస్వీజోగారావు, గుంటూరు - 1976.
17. పాపయ్య శాస్త్రి. బుగ్గా. పండిత సన్మానములు నా అనుభవములు, రాజమండ్రి, చింతామణి ప్రెస్ - 1963.
18. పార్థసాగధి - యన్.సి. ద్వారకాపార్థసారధి - జావళీలు. హైదరాబాదు, ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమి - 1980.
19. పార్థసారధి యన్. సి. ద్వారకా పార్థసారధి - గాన కళాబోధిని కర్నూలు, బాల సరస్వతీ బుక్ డిపో - 1965.
20. పాటల పండరీనాథ్ (సం) శ్రీ కృష్ణమందిర కీర్తనలు - గద్వాల

21. పిచ్చయ్య శాస్త్రి, చల్లా, వారణాసి రామసుబ్బయ్య శాస్త్రి జీవితచరిత్రము - పేటేరు వాస్తవ్యులు శ్రీరావు సూరయ్య సుధీ ప్రముఖులు - 1953.

22. బాపన్న శాస్త్రి, మహేంద్రవాడ. హరిహరకృతి మంజరి (ప్రథమభాగం) కాకినాడ, రిపబ్లిక్ ప్రెస్. 1964

23. మునుస్వామి, నాగరి. సంగీత సుధా సంగ్రహము. చెన్నపురి - కాలం వివరాలు తెలీదు.

24. యాచేంద్ర భూపాలుడు, వెలుగోటి. సభారంజని, చెన్నపురి, శారదాంబావిలాస ముద్రణాలయం - 1890.

25. రజనీకాంతరావు, బాలాంత్రపు, ఆంధ్ర వాగ్గేయకారచరిత్రము, విజయవాడ - విశాలాంధ్ర ప్రచురణ - 1958.

26. రమణారెడ్డి, కె.వి. మహోదయం విజయవాడ, విశాలాంధ్ర ప్రచురణ - 1969.

27. రమామోహిని - గాంధర్వవాణి, తిరుపతి, సాహితీసదనము - 1966.

28. రామకృష్ణ యూపం. కీర్తన సుధాలహరి, నెల్లూరు - మందాకినీ ప్రెస్ - 1964.

29. రామరాజు, కొచ్చెర్ల కోట. శ్రీరామకీర్తన కర్ణామృతం. తాటి పాక, ప్రజోత్పత్తి సంవత్సరం.

30. రామచంద్రఅప్పారావు.మేకా. శ్రీత్యాగరాజస్వామి రామభక్తి. మద్రాసు. శ్రీత్యాగరాజస్వామి మందిరం - 1958.

31. రామలింగ శాస్త్రి, మంగిపూడి. భారత సంగీత ఇతిహాసము, రాజమహేంద్రవరము - న్యాయవాణి ప్రింటింగ్ ప్రెస్ - 1971

32. రామారావు, మారేమండ. కాకతీయ సంచిక. రాజమహేంద్రవరము - 1935.

33. రామసుబ్బారాయుడు, వాజపేయాజుల. విద్యావికాసము, జటప్రోలు (కొల్లాపురం) - 1937.

34. లక్ష్మీ నారాయణ, గుండవరపు. నారాయణ దర్శనము (ఆదిభట్ల నారాయణదాసు) పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసము - గుంటూరు. పద్మినీ ప్రింటర్స్ - 1983.

36. లక్ష్మీకాంతమ్మ, ఊటుకూరి. ఆంధ్రుల కీర్తన వాఙ్మయ కళా సేవ, హైదరాబాద్, మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్ - 1982.

37. లక్ష్మీ సుభద్రాదేవి. శ్రీకృష్ణ దాసి కృతులు, గుంటూరు, లక్ష్మీ ప్రెస్ - 1965.

38. వీరన్న, కాళహస్తి. రచనలు అముద్రితం.

39. వెంకటరావు, కురుమెళ్ళ. మా పిఠాపురం, పిఠాపురం - శ్రీ జగపతి ప్రింటర్స్ - 1978.

40. వెంకటనారాయణాచార్యులు, తిరుమల నల్లాన్ చక్రవర్తి, గాంధర్వ వేదామృతము - గుంటూరు, దేవనాగరి పవర్ ప్రెస్ - 1957.

41. వెంకటనరసింహ సత్యనారాయణ, కోటగిరి. పద్మనాయక చరిత్ర 1, 2, 3 భాగాలు. కృష్ణాజిల్లా శ్రీ అప్పారాయ గ్రంథమాల - 1981.

42. వెంకట రమణ, పలుకూరి. శ్రీ వెంకటరమణకృతులు, విజయనగరం - 1933.

43. వెంకట రాయకవి, మద్దిరాల. ఏకాంత సేవా విలాసము, రాజమహేంద్రవరము, శ్రీనివాస ముద్రణాలయము - 1962.

44. వెంకట సుబ్బయ్య గొట్టిపాటి. మనజమీందారీలు, ఘంటశాల, దేశికవితా మండలి - 1944.

45. వెంకటాద్రి అప్పారాయుడు, రాజామేకా. శ్రీగీతగోవిందం - నూజివీడు - పూ. వి. లేవు.

46. వెంకటశాస్త్రి గుమ్మలూరి. పల్లవోల్లాసిని - పూర్తి వివరాలు తెలీదు.

47. వేంకట శాస్త్రి, చెళ్ళపిళ్ళ. కథలూ గాథలూ - 1, 2, భాగాలు, ఆలమూరు - వెంకటేశ్వర ప్రింటింగ్ ప్రెస్ - 1958.

48. వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పుచ్చా, సంగీత మార్తాండము (తాళాధ్యాయము), కొవ్వూరు, లతాప్రింటింగ్ వర్క్స్ కాలం లేదు.

49. వెంకటలక్ష్మమ్మ, మనుసాని నీలకంఠం. భజన కీర్తనలు - తత్వములు, ఆత్మకూరు (అమరచింత) - 1961.

50. వైదేహి, దాసు శ్రీరాములుగారి కృతులు - ఒక సమీక్ష, పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసము, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు. 1986.

51. శంకరశాస్త్రి పిరాట్ల. రచనలు - అముద్రితం.

52. శాస్త్రి, కె.వి.యస్. రాగాలాపన చంద్రిక - 1983.

53. శాస్త్రి, బి.యస్. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి 1, 2, 3, భాగాలు. హైదరాబాదు మూసీ పబ్లికేషన్స్.

54. శార్ఙ్గ దేవుడు. సంగీత రత్నాకరః కల్లినాథ వ్యాఖ్య, మద్రాసు అడయార్ ప్రచురణ - 1955.

55. శ్రీరాములు, దాసు. జావళీలు - పదములు. హైదరాబాదు - మహాకవిదాసు శ్రీరాములుస్మారక సమితి - 1991.

56. శ్రీనివాసయ్యంగార్, కె.వి. (సం). ఎమ్. ఆదీ అండ్ కంపెనీ. సంగీత సుధాంబుధి - చెన్నపురి 1929.

57. సంపత్కుమారాచార్య, డి.వి.యస్. సంగీత పారిభాషిక పోషక (కన్నడ నిఘంటువు) యూనివర్శిటీ ఆఫ్ మైసూర్, 1985.

58. సత్యనారాయణ మూర్తి, అరిపిరాల. సంగీత కళాప్రదర్శని, మొదటి భాగం. విజయవాడ. శ్రీపాండురంగ ప్రింటింగ్ వర్క్స్ - 1960.

59. సత్యనారాయణ మూర్తి, అరిపిరాల. సంగీత శబ్దార్థ చంద్రిక, విజయవాడ, ములుకోలప్రెస్ - 1954.

60. సింగరాచార్యులు, చినసింగరాచార్యులు, తచ్చూరి, గాయకలోచనము రెండవ కూర్పు చెన్నపురి కళారత్నాకరముద్రాక్షరశాల - 1902.

61. సింగరాచార్యులు, చినసింగరాచార్యులు, తచ్చూరి. సంగీత సర్వార్థ సారసంగ్రహము. పూర్తి వివరాలు తెలీదు.

62. సింగరాచార్యులు, చినసింగరాచార్యులు, తచ్చూరి. స్వరమంజరి. చెన్నపురి - మానిక విలాసము ప్రెస్ - 1938.

63. సింగరాచార్యులు, చినసింగరాచార్యులు, తచ్చూరి. గాయక పారిజాతము - మద్రాసు - గానోల్లాసిని శాల - కాలం తెలీదు.

64. సీతారామయ్య, దుడ్డు. కీర్తనలు. అముద్రితం.

65. సుబ్బారావు, నారుమంచి. సంగీత మహర్షులు, తెనాలి, శివశ్రీ పబ్లిషర్స్ - 1947.

66. సుబ్బారావు, నారుమంచి. తెలుగు సంగీత విద్వాంసులు. తెనాలి. శివశ్రీ పబ్లిషర్స్ - 1947.

67. సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీపాద. అనుభవాలూ జ్ఞాపకాలూను. రాజమహేంద్రవరము - కళాభివర్ధిని పరిషత్తు - 1958

68. సుబ్బరామ దీక్షితులు. సంగీత సంప్రదాయ ప్రదర్శిని - 1వ భాగము, హైదరాబాదు, ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ - 1973.

69. సూర్యనారాయణ శాస్త్రి, సన్నిధానము. కావ్యాలంకార సంగ్రహము (5వ ముద్రణ) మద్రాసు. యం. శేషాచలం అండ్ కో. 1976.

70. హనుమద్దాసు (తణుకు) హనుమద్దాసు కీర్తనలు - అముద్రితం.

71. హనుమద్దాసు, మన్నెం కొండ. హనుమద్దాసు చరిత్ర. మహబూబ్‌నగర్, ఎస్. ముత్యాలు అండ్ సన్స్, 1986.

72. హనుమద్దాసు, వేపూరు. వేపూరు హనుమద్దాసురామకీర్తనలు, హైదరాబాదు - సిద్ధేశ్వర పబ్లికేషన్స్

73. హరిశివకుమార్. గద్వాల సంస్థాన చరిత్ర సాహిత్య పోషణ హైదరాబాద్ - శ్రీ కృష్ణ ప్రచురణ - 1987.

## ప్రత్యేక ఉత్సవ సంచికలు

74. ఆంధ్ర గానకళా పరిషత్తు, శ్రీత్యాగరాజస్వామి శతవార్షికోత్సవ సంచిక, రాజమహేంద్ర వరము - 1947.

75. దుడ్డు సీతారామయ్య శతజయంతి ఉత్సవకమిటీ, దుడ్డు సీతారామయ్య శతజయంతి ఉత్సవ సంచిక, బాపట్ల - 1983.

76. ద్వారం వెంకటస్వామి నాయుడు గారి శతజయంత్యుత్సవ సంఘం - ద్వారం వెంకటస్వామి నాయుడు గారి శతజయంతి మహోత్సవం ప్రత్యేక సంచిక. విజయనగరం - 1993.

77. మహాకవి దాసు శ్రీరామ స్మారక సమితి, మహాకవి దాసు శ్రీరాములు జయంతి సంచిక; హైదరాబాదు - 1975.

78. సంస్కృతి సమితి, శ్రీమదజ్జాదాదిభట్లనారాయణ దాస జయంతి ఉత్సవసంచిక - చీరాల - 1967.

79. శ్రీ సీతారామ త్యాగరాజ నారాయణ దాసమహోత్సవ కమిటి, శ్రీ పట్రాయని సీతారామ శాస్త్రి గారి స్మారక సంచిక, సాలూరు - 1972.

80. గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు సంగీత సమాఖ్య. గాయక సార్వభౌముల శతజయంత్యుత్సవ ప్రత్యేక సంచిక - విజయవాడ - 1982.

81. మహబూబ్ నగర మండల సంగీతోత్సవ సంచిక - మధుర రాగమాలిక- మహబూబ్‌నగర్ - 1982.

82. శ్రీరవీంద్రశతవార్షికోత్సవ విశేష సంచిక, ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా ప్రచురితం - 1961.

83. శ్రీవాసా కృష్ణమూర్తి సన్మాన సంఘం. శ్రీ వాసా కృష్ణమూర్తి సన్మాన సంచిక - విశాఖ పట్టణం - 1972.

## పత్రికలు

84. నాట్య కళలు

జనవరి నుంచి డిశంబరు వరకు 1935

81. గాన కళలు

జూన్ - 1968; అక్టోబర్ - 1962; డిశంబర్ - 1962; ఏప్రిల్ - 1964; జూన్ - 1964; డిశంబరు - 1964; జనవరి, ఫిబ్రవరి - 1965; జూన్ - 1968; ఫిబ్రవరి - 1966; అక్టోబర్ - 1966; జనవరి, ఫిబ్రవరి - 1975; ఏప్రిల్, మే - 1976, అక్టోబరు - 1976; జనవరి, ఫిబ్రవరి - 1977; ఏప్రిల్ - 1978; ఆగష్టు - 1979; సెప్టెంబరు - 1980; నవంబరు - 1980; మార్చి - 1981; జూన్ - 1981; జూలై - 1981; ఆగష్టు - 1981; జనవరి - 1982; మార్చి - 1982.